తపోమహిమ

(ద్వితీయ ముద్రణ)

తపోమహిమ

అను

శ్రీ వేంకటదాసస్వామి వారి జీవిత చరిత్రము

గ్రంథకర్త :

కవిభట్టారక, తర్కవేదాంత విశారద

శ్రీమాన్ మొవ్వ దాశరథిసూరి (విష్ణుదాసు) గారు

తపోమహిమ

శ్రీ వేంకటదాసస్వామి వారి జీవిత చరిత్రము

గ్రంథకర్త :

కవిభట్టారక, తర్కవేదాంత విశారద

శ్రీమాన్ మొవ్వ దాశరథి సూరి (విష్ణుదాసు)

మొదటి ముద్రణ : 1957

రెండవ ముద్రణ : 2015

కాపీలు : 500

కవరు డిజైన్ : ఎ. గిరిధర్

ప్రాప్తిస్థానము :

శ్రీమాన్ మొవ్వ వేంకటాచలపతిగారు

శ్రీ వేణుగోపాలసేవాశ్రమాధిపతులు

పూడివాడ, నగరం (మం), గుంటూరు జిల్లా

చరవాణి : 9866807402

ప్రింటింగ్ :

శ్రీశ్రీ ప్రింటర్స్

కారల్‌మార్క్స్ రోడ్డు, అరండల్‌పేట

విజయవాడ - 520 002

సెల్ : 9490634849

వెల : రూ. 300

(ప్రథమముద్రణ పీఠిక)

శ్రీ రామ

శ్రీ వేంకట పరబ్రహ్మణే నమః శ్రీమతే రామానుజాయ నమః

ముఖ రచన

యత్పదాంభోరుహ ధ్యాన విధ్వస్తా శేషకల్మషః
వస్తుతా ముపయాతోఽహం వేంకటాఖ్యం నమామి తమ్.

మహాత్ములును, వారి చరిత్రములును. లోకమునకు నఖండ జ్యోతులు. వాని కాంతి చేతనే మనుష్యులు వస్తుతత్త్వము నెఱిఁగి జీవిత యానములను సాగింపఁగలుగుదురు. ఆ వెలుఁగులు లేనినాఁ దంధకారమే మిగులును. ఆ జ్యోతులకును నడఁగక యా చీఁకటి విజృంభించినపుడు "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" యన్నట్లు భగవానుఁడే వచ్చి యవతరించి దాని నడంచును. ఆ భగవానుని చరిత యెట్లు పాపహరమై ముక్తికి హేతువగునో యట్లే తద్భక్తులై యసామాన్యచర్యలు నిర్వహించిన మహానుభావుల జీవితచరిత్రములును మనుజులకు నుత్తమగతి దాయకములే యగును. స్వామిజీవిత చరిత్రమున నెన్నియో విలాసములు, మహిమలు, నద్భుత చర్యలు నిమిడి యున్నవి. అదియొక జ్యోతిర్వాహిని. ఆ జీవిత శోభను బ్రత్యక్షముగా ననుభవించినట్లైన దాని నెల్లయెడల వర్తమాన భవిష్యత్కాలముల యందును నెల్లరు ననుభవింపవీలగునను తలంపున దీనిని గ్రంథరూపము నొనర్చితిని. ప్రతివాని జీవితము నొక చరిత్రయే యగును గాని పేలపిండివంటి నిస్సారములైన యాజీవితముల వినుట వలనఁగానీ, చదువుటవలనగానీ ప్రయోజనమేమి? మహాత్ముల జీవితము లట్టివికావు గదా! స్వామి జీవిత చరిత్రమును వారుండఁగనే వ్రాయవలయునని యెపుడో సంకల్పించితిని, కాని యనారోగ్యమువలనను, నశ్రద్ధ వలనను వారికి వినిపించు భాగ్య మీ నిర్భాగ్యునకు దక్కలేదు. చేయి జాఱిపోనేపోయినది. ఇఁక నిప్పు దనివార్యమైనది. వారికి బదులుగా వారిజీవితచరిత్రము నైన వారి శిష్యులకును దదభిమానులకును జూపవలసిన భారము పైనెక్కుట చేతను, స్వామి పరమపదించుట వలన హృదయమున గలిగిన వేడిచేతను జరిత్ర యుద్భవించినది. స్వామి తమ తపః ప్రభావము వలన నన్ను నిలువఁబెట్టి వెడలిపోయిరి. ఇంకను సరిగా నారోగ్యము రాలేదు. ఒక గంట యదేపనిగా మధ్యలో విశ్రాంతిఁ గొనక వ్రాయలేని స్థితిలోనే యున్నాను. అసలు పూర్తి చేయఁగలనో

లేదో యని భయపడితిని. కానిమ్ము భగవదనుగ్రహ మెట్లున్ననట్లగును. వ్రాయఁబూనుట నా కర్తవ్యమని ధైర్యమునొంది ప్రారంభించి యట్లే బాధపడుచు వ్రాసి ముగింప గలిగితిని. నా కర్తవ్యము నేను ముగించితిని. ముద్రణమునకై స్వామి శిష్యులు కొంతమంది ముందంజ వేసి నేను చెప్పిన మాత్రనే, గురుచరిత్ర ప్రకటనములోని యౌన్నత్య పావనత్వములు గ్రహించి, ధనసహాయ మొనర్చిరి. వారి ఛాయాచిత్రములన్నియు నీ గ్రంథమునఁ గలవు. అట్టి వీరికెల్లఁ జిరాయురారోగ్యైశ్వర్యముల నొసంగి, ప్రారబ్ధానంతరమున గురుల సాన్నిధ్యము ప్రాప్తించునట్లు శ్రీ రమణుఁ డనుగ్రహించుఁగాక! ఈ గ్రంథలేఖన సమయమున, సాపు వ్రాయుటకును, ఫొటోలు తీయించుటకును, ప్రూఫులు తెనాలి నుండి పూడివాడకుఁ దెచ్చుటకును, జేతిలోని యాయుధమువలెఁ బనిచేసిన మా విద్యార్థి, చిరంజీవి, చామర్తి లక్ష్మీ వేంకట మారుతి వరప్రసాద శర్మకుఁ బూర్ణాయురారోగ్యైశ్వర్య విద్యాది సమృద్ధుల నొసంగి, వేంకటరమణుఁడు రక్షించుఁగాక!

ఇట్లు

గ్రంథకర్త



తన పాదరజముచే జనపాపసంహతుల్
పారఁద్రోలినయట్టి బ్రహ్మమౌని.

పరమహంస, శ్రీ శ్రీ వేంకటదాసస్వామి వారు.

విషయసూచిక



కవిభట్టారక, మొవ్వ విష్ణుదాసు (దాశరథిసూరి)
గ్రంథకర్త (స్వామి మూడవ కుమారులు)

విద్యార్థి, చామర్తి లక్ష్మీ వేంకటమారుతి వరప్రసాదశర్మ
కోడూరు

ఓమ్ శ్రీః

శ్రీ వేంకటపరబ్రహ్మణే నమః

శ్రీమతే రామానుజాయ నమః

తపోమహిమ

అను

శ్రీ వేంకటదాసస్వామివారి జీవిత చరిత్రము

త్రిభువన కమనీయ దివ్యరూప
శ్చరణరజోవినివృత్త ఘోరపాపః
అధరమణి నివిష్ట వంశనాళో
వసతు మమాత్మని నందగోపబాలః.

* * *

యస్యాః కృపాలోకకళైకభాగే
నందత్యనంతా భువనావళీ సా
నిరతరం మంగళదేవతా న
స్తరగయ త్వీప్సితమంగళాని.

* * *

అపరిణతమనోభి ర్యచ్చ సంపాదితం ప్రా
క్నిగమశిఖరవాదేష్వాకులీభూతరూపమ్
తదఖిలమపసార్యాసాదితం యేనతత్త్వం
యతిపతిరిహనిత్యం సన్నిధత్తాంస చిత్తే.

* * *

గోవిందసుందరపదాంబుజ మగ్నచిత్తో
మందాకినీతులిత మంజుళవాక్ప్రవృత్త్యా
లోకం సమస్తమకరోదవధూతపాపం
తం వేంకటాఖ్యగురుమాత్మనిభావయామః.

* * *

సంసార తాపానలదగ్ధభావా
స్సమాగతా యా వవలోక్యసద్యః
భవంతిబోధామృతసేకహృష్టా
స్తామేగతి ర్వేంకటదేశికాంఘ్రీ.

* * *

భరతఖండము

అఖండమైన యీ భూమండలమున భరతఖండము మహా పవిత్రమైనది. దాని మహిమ వర్ణింప సహస్ర వదనములు గల యాదిశేషునకును, శక్యంబుగాదు. "అత్రజన్మ సహస్రాణాం సహస్రైరపిసత్తమ, కదా చిల్లభతే జంతుర్మానుష్యం పుణ్యసంచయాత్" అనఁగా వేల జన్మలయందుఁ జేసిన పుణ్య సంచయమువలన, నొకానొకప్పు డీ భరతఖండమున మనుష్యుఁడై జన్మింపఁ గలుగును. మఱియు "గాయంతి దేవాః కిల గీతకాని ధన్యాస్తు యే భారత భూమిభాగే, స్వర్గాపవర్గాస్పద మార్గభూతే భవంతి భూయః పురుషాస్సురత్వాత్, కర్మాణ్య సంకల్పిత తత్ఫలాని సంన్యస్యవిష్ణౌ పరమాత్మ రూపే అవాప్యతాం కర్మమహీమనంతే తస్మిల్లయం యేత్వమలాః ప్రయాంతి, జానీమనైతత్క్వవయంవిలీనే స్వర్గప్రదేకర్మణి దేహబంధమ్ ప్రాప్స్యామదన్యాః ఖలు తే మనుష్యా యే భారతే నేంద్రియవిప్రహీనాః, "= స్వర్గ మోక్షములకు మార్గమైన భరత ఖండమున మనుష్యులై జన్మించిన వారే దేవతలకంటె ధన్యులు; ఏలయనఁ జేయు కర్మములన్నియు బ్రహ్మార్పణముగా నొనరించి యట్టివారు పునరావృత్తి రహితమైన ముక్తినొందుచున్నారు. ఇఁక మేమన్ననో యీ స్వర్గయోగ్యమైన కర్మయంత మొందఁగనే మరల మనుజులమై జన్మింపవలయును. కనుక భారతదేశమున నింద్రియ జయముగాంచిన మనుష్యులే ధన్యులు. అని దేవతలు సైతము, నీ దేశమున జన్మింప నభిలషించుచు దీని మహిమ పాడుచుందురఁట. (విష్ణుపురాణము). మరియు గంగా, యమునా, సింధు, కావేరీ, కృష్ణాది పుణ్య నదీనదంబులు గలిగి యా నదుల జలవాహినులు ప్రవహింప సారవంతమై నిఖిలసస్యసంభరితమై యొప్పుచున్నది. పౌండరీక రాజసూయాశ్వమేధాదిక్రతు కర్మల కిది నెలవు. పంచమహాయజ్ఞ వరులైన బ్రహ్మనిష్ఠుల వేదాధ్యయన ఘోషతోఁ గూడినయగ్రహారములఁజూడదలఁచిన, నీఖండమునఁ దప్ప మఱియొకచోఁ గానరావు వనితకుఁ గురూపియైనను గుష్ఠరోగియైనను దుర్జనుఁడైనను నంగవికలుఁడైనను బతియే దైవ మను శాస్త్ర వాక్యంబు లిచటఁగాక మఱి యెచ్చోవిననగు? కనఁబడుచున్న యైహికమును నశ్వరమని వదలి యింద్రియజయమును గాంచి, సర్వ సంగ పరిత్యాగులై బికారులవలెఁ

దిరుగుచుఁ దమ యంతర్నిగూఢ తపస్తేజో బలంబున లోకముల వడకింప సమర్థులైయున్న బ్రహ్మవేత్త లన్య దేశంబులఁ గంచు కాగడాలతో వెదకినను గానవత్తురే ? సత్యము, భూతదయ, అహింస మున్నగు పవిత్ర ధర్మసూత్రలతల కీ దేశమేగదా! పాదు. బాలుఁడయ్యును ససహాయుండై పద్మవ్యూహంబునఁ జొరఁబాఱి కర్ణ ద్రోణాది మహారథికులతో నిండిన కౌరవసేనా సముదయంబు నల్లాడించి విక్రమవిహారంబు సలిపి యదైన్యంబున రణభూమికిఁ బ్రాణము లర్పించిన యభిమన్యునివంటి వీరకుమారులఁ గడుపు చల్లగాఁ గాంచు భాగ్యంబు భరత ఖండమునకుఁ గాక యితర దేశంబులకు నెన్నడును లేదుగదా. తండ్రి యిష్టము నెరవేర్చుటకై రాజ్యంబును వదలి వివాహమేమాని శాశ్వత బ్రహ్మచర్యంబు నవలంబించిన దేవవ్రతుల వ్రేలువెట్టి మఱియొకచోఁ జూపుఁడు. శంకర రామానుజాది దివ్య యోగులకును నిదియ జన్మభూమి. దధీచి, బలి, సక్తుప్రస్థుఁడు, రంతిదేవుఁడు, రఘువు, రాయన భాస్కరుఁడు మొదలగు నెఱదాత లింద జన్మించి తమ యనుపమానౌదార్యంబున మాతృ భూమికి వన్నెయిడిరి. పద్యంబునకు గిద్దెడు వరహాలు గొలిచిన కవితా రసజ్ఞుఁడైన రాజు నెందేనివింటిమే? కృష్ణరాయలు, భోజుఁడు మున్నగు రసికులైన రాజపుంగవులఁ గని తన భాషా సౌభాగ్యంబును సహస్ర ముఖంబులుగా దీపింపఁ జేసికొన్న దీ భారతదేశము. వే యేల రామకృష్ణాది భగవదవతారంబులకు నర్హంబై యార్యావర్త పుణ్యభూమి యను కీర్తి వడసినది భరతఖండము.

* * *

ముగురుమూర్తుఁల జిన్ని ముదుబిడ్డల ఁ జేసి
జోలవాడిన దొక్క జోటిమిన్న
కానలోనఁ గిరాతుఁ గంటి మంటలచేత
నీఱొనర్చిన దొక్క నీరజాక్షి
దండహస్తునితోడ దద్ద వాదములాడి
మగని నిల్పిన దొక్క చిగురుఁబోడి
వెలయు పతిభక్తిచేత నీ విశ్వమందు
నింత లింతలు కార్యంబులెల్లఁ జేసి
నట్టి మహిళామతల్లుల నరయఁగలరె
విమలమై యొప్పు భరతఖండమున దక్క
సత్యంబునకు రాజ్యసతుల వీడ్కొనిపోయి
కాడు గాచెను నేల తేఁ డొకండు
జనకు నానతి భోగ సర్వస్వములు వాసి

వనిc జరించెను జక్రవర్తి యొకcడు
గువ్వకై తన మేని క్రొవ్వుకండలు చెండి
యాహారమిచ్చె ధర్మాత్ముc డొకcడు
జిష్ణుc డంతటివాcడు చేచాచి యాచింపc
దను చర్మమొసcగె నుదారుcడొక్కc
డిట్టి మహనీయులైన నరేశ్వరులకు
నాస్పదంబయి వెలసిన యట్టి భరత
ఖండమున కన్యభూమి భాగంబులకును
హస్తిమశకాంతరము గల దరసిచూడ.

అన్య ఖండవాసులైన పండితులెందఱో యీ దేశశోభకు నచ్చెరువంది యిందు జనింపమైతిమిగదా యని విలపించిరి. ఇతర దేశములందలి నాగరికత్వమునకు నిదియే మార్గదర్శకము. అట్టి భరతదేశ సౌభాగ్యమును గుఱుతింపలేని ప్రబుద్ధులు కొందఱిప్పుడు పరదేశంబుల యాభాసశోభకు లొట్టలు వేయుచుc జెప్పవత్తురు. వారి యభాగ్యమునకేమని వచియింపవచ్చును. పొరుగింటి పుల్లకూర రుచియన్నదిదియే.

ఆంధ్రదేశము

అట్టి పావన భరతఖండమున అంగ వంగ కళింగ మత్స్యమాగధ సింధు సౌరాష్ట్రాంధ్రాది పెక్కు దేశంబులు గలవు. ప్రసిద్ధి వడసిన దేశములలో నాంధ్రదేశమును నొక్కటి. దీనికిc ద్రిలింగదేశమను పేరును గలదు. తూర్పున దక్షారామము, దక్షిణమునc గాళహస్తి, వాయవ్యమున శ్రీశైలము, నను ప్రసిద్ధ శివలింగక్షేత్రముల మధ్య నుండుటచే దీనికీ పేరు వచ్చినది. పూర్వము మహావిష్ణువు నిశుంభుcడను రాక్షసుని సంహరించి, యాంధ్ర సామ్రాజ్యమును స్థాపించెనని బ్రహ్మాండ పురాణమునc గలదు. శ్రీకాకుళమున నాంధ్రనాయకస్వామి యను పేరుతో వెలయుటకు నిదియే కారణమని చెప్పుచున్నారు.

నన్నయభట్టు, తిక్కన సోమయాజి, యెఱ్ఱాప్రగ్గడ, యల్లసాని పెద్దన, బమ్మెర పోతరాజు, రామరాజభూషణుcడు, కంకంటి పాపరాజు మొదలగు మహాకవులెందఱో యిందు జన్మించి భాషను సంస్కరించి, 'దేశభాషలందుc దెలుగుcలెస్స' యను నానుడి గలుగుటకుc గారణమైరి. మఱియు, భద్రాచలము, తిరుమల, యంతర్వేది, వేదాద్రి, మట్టపల్లి, మంగళగిరి, హంసలదీవి, మున్నగు ప్రఖ్యాత పుణ్యక్షేత్రము లెన్నియో, యీ దేశంబు పవిత్రత్వమును ఘోషించుచున్నవి. పల్నాటి వీరచరిత్రము, బొబ్బిలిగాథ వినువారి కిప్పుడును వీరావేశము గలుగుచున్నది. ఆంధ్రులప్రతిమశౌర్య రేఖావిరాజితులను విషయము తేట పడుచున్నది.



మకరందములుచిందు మధురవాక్కుల రాలఁ, గరగించివైచిన కర్మయోగి భాష్యకార సమాజస్థాపకులు, మహర్షి శ్రీ వేంకటదాసస్వామి వారు. 1932వ వత్సరములోని ఛాయ.

బ్రహ్మనాయఁడు, బాలుఁడు మొదలైన వీర పూరుషుల కాకరమైన దీ తెలుఁగు సీమ. డొక్కా సీతమ్మ, యాదాళ్ళ నాగమ్మ, యులవపాళ్ళ కోటమ్మ, వాసిరెడ్డి వేంకటాద్రి నాయఁడు, బందా పరదేశి మొదలగు నిరతాన్నదాత లిచట జన్మించి యాంధ్రకీర్తివల్లికను దిగంతముల కెక్కించిరి. రామదాసు, తూము నరసింహదాసు, అల్లూరి వేంకటాద్రిస్వామి, మల్లాది సుబ్బదాసు, దామోదరం కృష్ణదాసు, గుంటూరు వేంకటరాయఁడు, సూర్యనారాయణ, పాలపర్తి నృసింహదాసు, అద్దంకి వేంకటరాయఁడు, ఆంధ్రవాల్మీకి, మొదలైన మహాభక్తు లిందు జన్మించిరి. వీరందఱు తమ భక్తి ప్రభావంబున భగవంతు నోలలాడించినవారు. కృష్ణా గోదావరు లీ దేశమునఁ బ్రవహించు నదులయందు ముఖ్యములు. వాని మీఁద నుండి వరతెంచు పవిత్ర వాయువులు దేశారిష్టములఁ దొలఁగించి శాంతి భద్రముల నెలకొల్పుచుండును.

పూడివాడ

పడమటి కనుములయందు జనించిన కృష్ణానది తన పావన తోయములచేఁ బట్టణముల, జనపదముల సారవంతములుగాఁ జేయుచు వచ్చి వచ్చి, యాంధ్రదేశమున హంసలదీవి యొద్ద సముద్రమునఁ గలియుచున్నది. హంసలదీవి చాలఁ బురాతన పుణ్యక్షేత్రము. ఇచట శ్రీ వేణుగోపాలస్వామి యాలయము గలదు. ఎప్పుడెవరు దీనిఁ గట్టించిరో తెలియదు. ఆలయము మీఁదనున్న కొన్ని శాసనము లిప్పటికిని నర్థము గాలేదు.

కృష్ణ, సముద్రమున సంగమించుటకు ముందుఁ బెనుమూడి దగ్గఱ రెండుగాఁ జీలి యొక దీవిని సృష్టించుకొనుచుఁ దూర్పునకుఁ బోయినది. నదీముఖద్వారమున నున్న యా దీవియే దివిసీమ యని పిలువఁబడుచున్నది. రెండుగాఁ జీలినచోటఁ గృష్ణ నానుకొని పడమటివైపునఁ బెనుమూడి యను నొక పల్లె గలదు. దానికి సమీపముననే పశ్చిమమున రేపల్లె యను నొక మాదిరి పట్టణమున్నది. దానికిఁ బడమటగాఁ బదిమైళ్ళ దూరమున నున్నది పూడివాడ. ఇదియొక మాదిరి పల్లెటూరు. పూర్వ మీ పూడివాడ యున్న స్థలమంతయు సముద్రమఁట. కాలక్రమమున మెట్టయై యగాథమైన సముద్రమువోయి, తత్ప్రదేశమున నూళులు నిర్మింపఁబడినవి. లీలారసికుఁడైన భగవంతుని సృష్టి విచిత్రముగదా! "అంభోధి స్థలతాం స్థలం జలధితా" మ్మన్నట్లు దైవ మగాధమైన సముద్రము ననాయాసముగా సంకల్పమాత్రముననే పూడిచి యచ్చోఁ బట్టణముల నిర్మింపఁజేయును, నట్లే పట్టణములున్న తావును నపారమైన సముద్రముగా మారిచివైచును. వానిశక్తికి మేరయేమున్నది. అట్లే యా ప్రాంతమునందును సముద్రము వోయి చిన్న చిన్న పల్లెలు పెక్కు నిర్మింపఁబడియున్నవి. ఇప్పుడు మాత్రము సముద్రము, పూడివాడకు దక్షిణమునఁ బదిమైళ్ళ దూరములో నున్నది.

సముద్రము పదలిన చోటసుటకుఁ దార్కాణముగా నీ పరిసరమంతయు మిక్కుటమైన యిసుకభూమి. మఱియు, సముద్ర శేషమున్నపుడు వెనుక నిచ్చట నొక యోడ పూడిపోయినదఁట. అందువలననే యీ యూరికిఁ బూడివాడ యను పేరు కలిగినది. పూడినయోఁడ యను సర్థవంతమైనపేరు జనుల ద్రుతోచ్చారణము వలనఁ గాలబాహుళ్యముమీఁద నకార, యోకారములు లోపించి పూడివాడగా నిలిచిపోయినది. పూడిన యోడస్తంభము మొన్న మొన్నటి వఱకు ననఁగా షుమారొక యిరువదియేండ్ల క్రిందటివఱకుఁ గనిపించుచుండెడిదని యెఱిఁగినవారు చెప్పుచున్నారు.

నిరతాన్నదాతలు నెలకొని నివసించు
పొలుపు బంగరుమేడ పూడివాడ
సాధ్వసంబున వచ్చి శరణన్నవారికిఁ
బుడుకు ప్రాకుఁలనీడ పూడివాడ
దురిత పయోరాశిఁ దరియించుటకునైన
పూలకూర్పుల యోడ పూడివాడ
పరులకుఁ దలయెత్తి పరికింప వీల్గాని
పుట్టు వజ్రపుగోడ పూడివాడ
యొక మహాపూరుషుని తన యుదర మందు
గాంచి నిజకీర్తి వాహినీ కలితజలము
విశ్వ మంతటఁ బడునట్లు విసరినట్టి
మొలక ముత్యాల గూడ మా పూడివాడ

కాఁపులు

పూడివాడ మొత్త మొక చోట లేదు. గూడెములు గూడెములుగాఁ దాళ్ళ తోఁటలతో నిండి దగ్గఱదగ్గఱ రెండు మైళ్ళ పొడవున్నది. ఇచట నన్నిజాతులవారు గలరు గాని కాఁపులు ముఖ్యులు. వీరికే మండలభేదమును బట్టి తెలగాలు, బలిజలు, సెట్టులు, ఒంటరులునని పేరులు గలవు. పరాక్రమోపేతులై తెలుఁగు దేశమునఁ బెత్తనము నిర్వర్తించువారిలో నగ్రగణ్యులగుటచేఁ దెలగాలనియు నితరులను దమబలమున ధర్మార్థులై పలువిధములఁ గాఁపాడుటచేఁ గాఁపులనియు, బలిచక్రవర్తినిఁ బాతాళమునకుద్రొక్కిన మహావిష్ణువు పాదమున జనించుటచే బలిజలనియు, న్యాయ్యమును బరిపాలించుట యందు శ్రేష్ఠులగుటచే సెట్టులనియు, నసహాయశూరులగుటచే నొంటరులనియు వీరి కీ సార్థకనామములు వచ్చినవి. కాఁపులను నీ తెగ బ్రాహ్మణాది చతుర్వర్ణములలో క్షత్రియజాతికిఁ జెందినట్లుగా

"తెలగోవెలమశ్చైవ, రేఢ్రకోకూర్మఏవచ" = ఒకానొక రాజునకుఁ దెలగుఁడు, వెలముఁడు, రేఢ్రకుఁడు కూర్ముఁడు నను నలువురు కుమారులు గలరఁట. వారి సంతతులే తెలగ, వెలమ. రెడ్డి, కమ్మ యను తెగలుగా నేర్పడినవి. అను నొకపురాణవాక్యము వలనఁ దేలుచున్నది. మొత్తము మీఁద నీ నాలుగు తెగలు పరస్పర వివాహాదులు లేకపోయినను, నిప్పటికిని సమాన స్థాయిలోనుండి పై విషయమును ధ్రువపరచుచున్నవి.

కాని యిప్పు డీ తెగ లుత్తమ శూద్రజాతులుగాఁ బరిగణింపబడుచున్నవి. అసలు వర్ణవిభాగక్రమ మిటీవల వచ్చినట్లు కనుపట్టుచున్నది. వృత్తులచేత గుణములచేత నేర్పడిన వ్యవస్థయే గాని యిది సహజమైనదికాదు. "జాతిర్వ్యవహారకల్పితా" జాతి యనునది లోక వ్యవహారము నడచుటకై యేర్పడినది. యని తేజోబిందూపనిషత్తు చెప్పుచున్నది. "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశో" గుణములు కర్మలు వేఱువేఱుగా నుండుటచే నాలుగు వర్ణములుగా నేను విభజించి సృష్టించితిని." అని గీతాచార్యులు నుడివిరి. 'బ్రాహ్మణోస్య ముఖమాసీత్, బాహూరాజన్యకృతః, ఊరుతదస్యయద్వైశ్యః, పద్భ్యాగ్ం శూద్రో, అజాయత." అదివిరాట్ స్వరూపమునకు, బ్రాహ్మణుఁడు ముఖము, క్షత్రియులు బాహువులు, కోమటులు తొడలు, పాదముల వలన శూద్రుఁడు పుట్టెను. = ప్రకృతి రూపముగాఁ బరిణమించిన బ్రహ్మస్వరూపమున కంగ నిరూపణము చేయుచున్నది శ్రుతి. శాస్త్రాదు లధ్యయనముచేసి ధర్మాధర్మముల నెఱింగఁ జేయువారే బ్రాహ్మణులు. వారే విరాట్స్వరూపమునకు ముఖము, బాహుబలమున దుష్టుల నిగ్రహించి లోకమును సక్రమముగాఁ బరిపాలించువారు క్షత్రియులు. వారు లోకస్వరూపుఁడైన పరబ్రహ్మమునకు బాహువులు. పైనిఁ జెప్పఁబడిన రెండువిధములగు ముఖబాహువులు నిలుచుట కాధారమైన వాణిజ్య వ్యాపారాది వృత్తులు చేయుచు మూలభూతు లైనవారు వైశ్యులు, శూద్రులు; వారు పరబ్రహ్మమునకు దొడలు, పాదములు. అను ఋగ్వేద పురుష సూక్తము నందలి వాక్యములును నీ యర్థమునే స్పష్టము చేయుచున్నవి. కాని యిటీవలి వారు, బ్రాహ్మణాది వర్ణములు సహజముగా నెక్కువనియు, శూద్రులకు నుత్తమ విద్యాద్యధికారములు లేవనియు, నేకవిరాట్ సంభూతులైన వీరికి ననధికారత నిరూపించుచు, దానిఁ గారణముగా గొని యర్హులైన మహాపవిత్రులను నిందించుచు నన్యాయ మాచరించిరి. ఈ విషయము, ఆచార్య పీఠాధిష్ఠానము మొదలగు శీర్షికలయందు విపులముగాఁ జర్చింపఁ బడును గాన నిచ్చట విరమించుచున్నాఁడను. కాఁపులకు ముఖ్య వృత్తి వ్యవసాయము. ధాన్యములు పండించి సమస్తజనుల కాహారమును గల్పించునట్టి పవిత్రమైనవృత్తి యిది. ఇట్టి పవిత్రవృత్తి నవలంబించుటచేతనే "కాఁపులు గలిగిన వెనుకనె లోపంబులు దీఱె నెల్ల లోకుల కెందున్ భూపులకు వేల్పుపతులకుఁ గాఁపేరా కల్పతరువు కాటయవేమా!" యను చాటూక్తి కర్హులైరి.

మొవ్వవారు

ఊరనున్న కాఁపులలో మొవ్వవారొకరు. పూర్వ మీయూర సింహాద్రివారు పెత్తనదారులుగా నుండెడివారఁట. కాని యాయింటిపేరువా రిప్పుడెవరును లేరు. పద్యాలవారును, బోలిశెట్టివారును మఱి కొందఱును గలరు. మొవ్వవారిది పయిడిపాల గోత్రము. వీరు మొదటి నుండియు ధర్మదయాపరులు. పరుల ధనముఁ గలనేని యాసింపని పవిత్రులు. సత్యనిష్ఠులు. పైవంశవృక్షమెఱుఁగ రాదుగాని యెఱిఁగినంతలో సూరయ్య యా వంశమునకు మూలపురుషుఁడు. ఆయన సదాచారుఁడై జీవితయాత్రఁ గడుపుకొని యేగెను. ఆతని పుత్రులు బాలచంద్రుఁడు, భగవానుఁడు, ననువారు. వారిద్దఱును బండితులై భారత భాగవత రామాయణములు చదివి జనులకెఱిఁగించుచుఁ బౌరాణికులను కీర్తివడసి పలుసత్కారములను బొందిరి. ఏకారణముచేతనో, వారిలో నొకఁడగు భగవానుఁడు పూడివాడ వదలి బాపట్ల తాలూకాలో నున్న మామిళ్ళపల్లెయను గ్రామమునకుఁ జేరెను. అచటనుండియు నతఁడు దానికి సమీపములోనున్న మంచాళ యను నగ్రహారమునకు బోయి నిత్యమును నచటి బ్రాహ్మణులకుఁ బురాణము చెప్పి యా కాలమునఁ బౌరాణిక సత్కృతిగా నొసఁగిన జొన్నలు చాకలివానితోఁ బట్టించుకొని, మామిళ్ళపల్లెఁ జేరుచుండువాఁడఁట. అతని వంశమందును నద్భుతచర్యలుగల మహాజాతకు లిరువురు, ముప్పురు జనించిరి. కాని కేవల లౌకికులు. ఏకచ్ఛత్రాధి పత్యముగా నా ప్రాంతమంతయుఁ బెత్తనదారులై యేలినవారే గాని పారమార్థికమగ నంతపని చేసిన వారు కారు. వారి లౌకికచర్యలు వినసొంపైనవే గాని యవి తడవుట కిది తావుగాదు. ఇప్పటికిని నా యూరఁ బది పదునైదిండ్ల వఱకు మొవ్వవారి వంశము విస్తరించియే యున్నది.

అది యట్లున్నది. పూడివాడ యందున్న బాలచంద్రునకు, రామయ్య యను నాతఁడు జనించెను. అతనికి జానకిరామయ్య యను కుమారుఁడు గలిగెను. జానకిరామయ్య సత్ప్రవర్తనము గలవాఁడై జీవితయాత్ర గడపెను. ఆయన భార్య బాపమ్మ. పవిత్రులైన యా దంపతులకు, ముత్తయ్య, లక్ష్మయ్య, రామయ్య, కృష్ణయ్య యను నలువురు పుత్రులుద్భ వించిరి. నలువురును సచ్చరిత్రులు, శౌర్యవంతులు. మూడవవాఁడైన రామయ్య మిక్కిలి తెలివితేటలు కలవాఁడై జన వశీకరణముగలిగి యూరియందు హెచ్చు గౌరవమును సంపాదించెను. కాని యింతలో నొక దుర్మార్గము జరిగినది. పూడివాడ యందున్న బ్రాహ్మణులలోఁ గొందఱు క్షుద్రమైన మంత్రశాస్త్రమునందుఁ బ్రవీణత గలవారు పూర్వముండెడివారఁట. వారిలో నొకనికిని జానకిరామయ్య కుమారులకును గలహమొకటి యేకారణముననో గలిగినది. దానిచే నా విప్రుఁడు తురకయెముక నొకదానిఁదెప్పించి



తర్కవేదాంత, పండిత, కవిభట్టారక, మొవ్వ విష్ణుదాసు (దాశరథిసూరి)
స్వామి మూడవకుమారులు, గ్రంథకర్త. 1951లోఁ గావ్యకళాకృతి రచననాఁటి ఛాయ.

ప్రయోగముచేసి ముత్తయ్యను, లక్ష్మయ్యను, రామయ్యను నేకకాలమునఁ జంపెను. నాల్గవ వాఁడైన కృష్ణయ్యను మాత్ర మేకతమునసో పదలెను. ఆపేరెంత తడవు కొన్నను స్మృతికి రాలేదు, బ్రాహ్మణునకని, యెముక తెచ్చి యిచ్చినవాఁడు తరువాత చెప్పెనఁట. ఇట్టి విషయము లధునాతననాగరికులు సమ్మరుగాబోలు. అఖండమైన యీ ప్రపంచమున నెక్కడెక్కడ నెట్టి విచిత్ర సంఘటనలు దైవ సంకల్పమున జరుగుచుండునో యొకమూలఁ గూర్చుండి నేను బట్టిన కుందేటికి మూడుకాళ్ళే యని వాదముచేయు వారికిఁ జెప్పుట కేముండును ? ఇప్పటికిని నట్టి మాంత్రికులఁ జూచుచున్నాము. వినుచున్నాము. అద్భుతములైన భూతచర్యలు ప్రత్యక్షముగా నెన్నిటినో జూచుచున్నారము. సత్యవాదులైన మిత్రులు చూచినవారు చెప్పఁగా వినుచున్నారము. అయినను వీరు నమ్మరు. పోనిం డీ మహనీయులు నమ్మనంత మాత్రమునఁ గొఱంత యేమియు లేదు.

కృష్ణార్యుఁడు

ఎట్లయిననేమి జానకిరామయ్య సంతతిలోఁ గడపటి వాఁడగు కృష్ణయ్య మాత్రము భూమిమీఁద నిలిచెను. ఇతఁడు మహా పవిత్రుఁడు. మితభాషి, పరధనాశ. పరవనితారక్తియు నేమాత్రము నెఱుంగనివాఁడు. నిత్య సత్యవ్రతుఁడు పరులజోలికిఁబోక తన పనులు మాత్రము తగు శ్రద్ధతో నెఱవేర్చుకొనుచుండెడివాఁడు.

వ్యవసాయమునందు మిక్కిలి నేర్పుగలవాఁడు. ముప్పది నాలుగెకరములు మాగాణి భూమిని సాగుచేయుచు, ధనార్జనముఁ గావించెను. రేఁబవ లనక కూలీలతో మరమ్మతులు చేయించి తన భూమినంతయును సారవంత మొనర్చుకొనెను. కృష్ణయ్య యదృష్టజాతకుఁడు. ఆ కారణమున నేపనిచేసినను లాభకరమే యయ్యెను గాని నష్టము రాలేదు. ఎద్దులు పాడిగేదెలు, అరకదున్నలు మొదలైనవి కొనకుండగనే యెప్పటి కప్పుడు దొడ్డియందుఁ బుట్టి కలిసివచ్చుచుండెడివి. ఏ కొఱంతయు లేక యతని కాఁపురము సమృద్ధముగా నుండెను.

కృష్ణమాంబ

కృష్ణయ్యగారి భార్య కృష్ణమాంబ. ఈమె వక్కపట్లవారి యాడుఁబడుచు. ఈమె పుట్టినిల్లు దీవిసీమలోని వక్కపట్లవారిపాలెము. కృష్ణమాంబ మంచి స్ఫురద్రూపిణి. బంగారు వంటి మైచాయ, సిరిగలిగిన ముఖము గలిగి యుండెడిది. రూపమునకుఁ దోడు సుగుణ సంపత్తియు, నద్భుతములైన తెలివితేటలును గలవు తన నేర్పునఁ గాఁపురముఁ జక్క దిద్దుచు పతిభక్తి గలదియై పుట్టినింటికిని, మెట్టినింటికి, నఖండమైన యశముఁ గూర్చెను.

ఈమెకు మంచి వాగ్ధోరణియు నుండెడిది. వేళకు వచ్చిన యతిధులకు భక్తిశ్రద్ధలతో నన్నమిడి పోషించెడిది. కృష్ణార్య నెఱుఁగను గాని యీమెను నేనును నెఱుఁగుదును. పౌత్రీ పౌత్రరూపమైన మాసహోదర సంతతి నంతయు నెత్తుకొని లాలించియే యీమె ముక్తి కరిగినది. కృష్ణమాంబ చిన్నతనము నుండియు దైవమునందు విశ్వాసము గలిగి ప్రవర్తించు చుండెడిది. పరమ పవిత్రులైన యీ దంపతుల ప్రథమ సంతానమే శ్రీ వేంకట దాసస్వామి.


స్వామి జననము

స్వామి గర్భముననున్న తఱిఁ గృష్ణమాంబ ప్రసవమునకై దీవిసీమయందలి పుట్టినింటికేగెను. బంధుగుల కానందమొసఁగుచు నామె యటనుండఁగా,

కలశాంబునిధి వీచికాపరంపరనుండి
బొడమెడు హరిణాంకమూర్తి యట్లు
బ్రహ్మాది దేవతల్ బ్రస్తుతలింపఁగ వేల్పు
టవ్వకు జనియించు హరివిధాన
ఘోరాంధ తమసంబుఁ బాఱఁద్రోలఁగఁ బ్రాచి
వెడలి వచ్చెడి వేయి వెలుఁగు రీతి
కాంతిమతీ దేవి గర్భవాటిక దాఁటి
ప్రభవించు నా యతిప్రభువు భంగి
గ్రహము లుచ్చస్థితంబులై గ్రాలునొక్క
శుభముహూర్తంబునందున సుదతులెల్లఁ
గెరలి వినుతులుసేయ నా కృష్ణమాంబ
కొక కుమారుఁడు గల్గె నేత్రోత్సవముగ.

ఆ సమయమునఁ బరిమళభరితములై మందవాయువులు వీచె. దిశలు ప్రసన్నంబులై వెలిఁగె. అనంతుని యంశమున నవతరించిన యబ్బాలకుని తనుప్రభలచే నా సూతికాగృహము మిగులఁ బ్రకాశించె. చలువగలిగిన ముత్తైదువులు ప్రసవకార్యంబులు నిర్వర్తించుచు నక్కుమారుని తేజోవిశేషంబులుగాంచి వెఱఁగందిరి. ఇట్లు క్రీస్తు శకము 1891-10-14వ తేది ఖరనామసంవత్స రాశ్వయుజ శుద్ధ దశమీ మంగళవారమునాఁటి రాత్రి ధనిష్ఠానక్షత్రమున శ్రీ వేంకటదాసస్వామి జన్మించెను. తేజస్వియైన యక్కుమారుని యుదయమున బంధుగులెల్లరు సంతసించిరి కాని యబ్బాలుఁడు తల్లి చనుఁబ్రాలు గ్రోల కుండెను. ఎన్నియోవిధములఁ బ్రయత్నించిరి కాని లాభము లేకపోయెను. సోదెలు శకునము లడిగిరి. విచారపడిరి. ఇట్టితఱి కృష్ణమాంబ యన్నగారు సమీపమునందలి యగ్రహారములోని

వంశవృక్షము


సూరయ్య
భగవానుడు
బాలచంద్రుడు
రామయ్య
జానకిరామయ్య
(బాపమ్మ)
ముత్తయ్య
లక్ష్మయ్య
రామయ్య
కృష్ణయ్య
కృష్ణమాంబ
వేంకటదాసస్వామి
(రాధాంబ)
రాఘవమ్మ
బాపమ్మ
రత్తమ్మ
1. శ్రీనివాస పెరుమాళ్ళు,
2. వేంకటాచలపతి,
3. దాశరధి సూరి,
4. రామప్రసాదు,
5. రామబాణమ్మ,
6. కమలాదేవి

యొక బ్రహ్మవేత్త యొద్దకేగి యీ విషయమును వచించెను. అందుల కా నైష్ఠికుఁడు కొంత యాలోచించి "బహుశః అది శుద్ధిపిండమై యుండవచ్చును. ఇరువదియొకటవ రోజువఱకును నట్టివారు తల్లి పురిటిపాలు త్రావరు. మైలలేకుండు నితరస్త్రీల పాలుతెచ్చి పోసిచూడు"దని చెప్పెను. నట్లే చేసిరి. బాలుఁడును హాయిగాఁ బాలుత్రావెను. ఆహా! మహాత్ముల దివ్యచర్యలు పుట్టుక నుండియు విశిష్టములేగదా!

తొమ్మిది దినములు గడచెను. పదియవ నాఁటి రాత్రి సందెవేళ బాలుఁడున్న మంచము దగ్గఱ దీపమును బాగుగాఁ బ్రజ్వలింపఁజేసి యేలకో కృష్ణవేణమ్మ యింటిలోనుండి వెలికి వచ్చెను. కొంత తడవుండి మరల లోనికేగుసరికి మహత్తరమైన యొక సర్పము విపులమైన తన పడగవిప్పి స్వామిముఖమునకు నీడఁ బట్టి యాడుచుండెను. దీప కాంతియందు సర్పమును స్పష్టముగాఁ గృష్ణమాంబ చూచెను. సామాన్య సర్పముగాదు. చాలగొప్పది. మిక్కుట మైన లావును దానికిఁదగిన నిడుపును గలిగియుండెను. నివ్వెఱపోయి కొంతవడికిఁ దెమల్చుకొని యామె వెఱ్ఱికేకలు వైచెను. చుట్టుపట్టుల వారు మూగిరి. విషయమారసి యింటిలో నలుగడల వెదకిరి. సర్ప మెచ్చటను గానిపింపలేదు. కృష్ణమాంబకుఁ గన్నుచెదరి యట్లు గనిపించె లేకున్న వచ్చినసర్ప మింతలో నెచ్చటికేగునని, యామె కాదని యెంత గోలచేసినను, విన్నరైరి. చివరకుఁ బిల్లవానిఁ దీసికొని యామె నీవలికి రమ్మనిరి. కృష్ణవేణమ్మ కుమారు నెత్తుకొని నాలుగడుగులు వైచెను. ఆ మహాసర్పము బరబరమని ప్రాఁకుచు నామె యడుగుల మధ్యనుండి ముందలికి వచ్చి, జనులెల్లరు స్పష్టముగాఁ జూచుచుండ నదృశ్యమాయెను. ఎల్లరు విభ్రాంతిపడిరి. సర్పమెచ్చటఁ జూచినను మరలఁ గానరాలేదు. ఇది మామూలు సర్పముగాదనియు, దేవతాసర్పమనియు నుడివి, యెవరియిండ్లకు వారు వోయిరి. ఇరువది యొకటవరోజు దాఁటిన పిమ్మటనే బ్రాహ్మణుఁడు సెప్పినట్లు స్వామి తల్లి చనుఁబ్రాలు ద్రావెను. జాతకర్మాది సంస్కారములు జరిగెను. స్వామికి వేంకటస్వామి యని నామకరణ మొనరించిరి.

బాల్యము

కొన్ని దినములకుఁ గృష్ణమాంబ కుమారు నెత్తుకొని స్వగృహమునకుఁ జేరెను. బందుగులెల్ల రక్కుమారునిఁ జూచి మిగులఁ బ్రమోద మొందిరి. కృష్ణయ్యగారును, బుత్రవదనావలోకనసుఖ మనుభవించి పితౄణవిముక్తి గలిగినందుల కాత్మ నెంతయు సంతసించెను. చూపరకు నేత్రోత్సవము గావించుచు, శుక్లపక్షమునందలి చంద్రుఁడువలె స్వామి దినదినాభివృద్ధి నొందెను. కృష్ణయ్యగారి బందుగులెల్లరు నా బాలునిఁ గ్రిందదింపక యెప్పుడును మిక్కిలి గారాబముతోఁ బెంపసాగిరి. కాలవాహిని ప్రవహించినకొలఁది, స్వామికి

స్త నంధయత్వము వదలెను. తోటిబాలురతోగూడి వీధుల నాటలాడుకొనుచుఁ దల్లిదండ్రులకు నయనసాఫల్యము నొడఁగూర్చెను. ఆటలాడుకొనుచు నెంతమంది యితర బాలురలోనున్నను స్వామి విలక్షణుఁడై చుక్కలలోని చంద్రునివలె, గ్రహములయందు భాస్కరునివలె, దేవతలలో విష్ణునివలె వేఱుగా భాసించుచుండెను. తేజోద్రవ్యము దాఁచినను దాఁగక ప్రకాశించుచునే యుండునుగదా!

పాఠశాల

స్వామికిఁ దొమ్మిదవ సంవత్సరమున నక్షరాభ్యాసము జరిగెను. ఊరనున్న వీధిబడికిఁ బ్రతిదినమును బోసాగెను. అప్పటికాలము వేఱు. ఇప్పటివలె నున్నతపాఠశాలలు, కళాశాల లాకాలమున నసలు లేవు. ఏ వేనినున్న రాజసంస్థానముల యందుఁ జాలనరుదుగా నుండెడివి. సామాన్యముగా వ్రాయుట చదువుట నేర్చుకొని యంతటితో విద్యనుముగించి వృత్తి నవలంబించుకొనెడివారు. అంతకు మించినవారు పండితుల యొద్దఁజేరి వారికిఁబరిచర్య చేయుచుఁ దదనుగ్రహమును బడసి శాస్త్రాభ్యసన మొనర్చెడివారు. అప్పటి విద్యాశిక్షణ క్రమమును వేఱుగా నుండెడిది. ముందక్షరములు నేర్పెడివారు. పిదపఁబెద్దబాలశిక్ష తప్పనిసరి. అటుతరువాత బాలరామాయణము, దాశరథి శతకము, నరసింహశతకము, సుమతిశతకము గజేంద్రమోక్షము, కుచేలోపాఖ్యానము, రుక్మిణీ కల్యాణము మున్నగువానిని రోకంటిపాటగాఁ జదివించెడివారు. మొత్తమునకు వచ్చిన విద్యయంతయుఁ బుస్తకాపేక్ష లేకుండ నెప్పుడడిగిననప్పుడు చెప్పునట్లు బండవల్లెనవేసి కంఠస్థము చేయవలసినదే. ఆ కారణమున విద్యార్థులకు నోరునలిగి మంచి వాచకశక్తి కలిగెడిది. ఎట్టి గ్రంథమునైన క్షుణ్ణముగాఁ జదువఁగలిగెడివారు. అట్టి కంఠస్థము సేయుపద్ధతి యిప్పుడు పాఠశాలలలోఁ బూర్తిగా నశించిపోయినది. అందువలననే యిప్పుడు బి.యే వఱకుఁ జదువుకొన్నవాని నైనను నొక్క పద్యముఁ జదువుమని భారతమువంటి గ్రంథము చేతికిచ్చితిమేనిఁ గూర్చున్నవాఁడెల్లలేచి "త్వరగాఁ బనియున్నది మరల వచ్చెద"నని చెప్పిపోవలసినదేగాని చదువలేఁడు. మఱియు నక్షరములు చక్కఁగాఁ గుదురుటకై విద్యార్థులను దగుశిక్ష యొనర్చెడివారు. ఒరవడి, చూచి వ్రాఁత మిక్కుటముగా వ్రాయించుచుండెడివారు. అక్షరములు సరిగా గుదురని యెడల రేఖాకాష్ఠములతో (రూళ్ళకఱ్ఱలు) నుపాధ్యాయుఁడు పిల్లలవ్రేళ్లు విఱుగఁగొట్టెడి వాఁడు. అప్పుడు పిల్లలకు శిక్షలు, గోడకుర్చీలు, గ్రుద్దులు, ప్రేఁపబెత్తపు దెబ్బలు, కోదండము పట్టించుట, యంతకు మిగిలిన ముంతపొగపెట్టుట, యివి. ఇట్టిశిక్షలో నూఱవవంతైనను నిప్పటి విద్యార్థులకుఁజేసిన, నుపాధ్యాయు లింక బ్రతుకుదురా ? కొట్ట నవసరము లేదు. పాఠము రాలేదేమిరా యని గట్టిగా నుపాధ్యాయుఁ డడుగఁ గలఁడా ?

యొకవేళ నట్లివ్వఁడేని నడిగిన నాతని బ్రతుకుబండాలమంతయుఁ దెల్లవాఱువఱకుఁ బాఠశాల గోడలమీఁదను బజారుల యందలి గోడలమీఁదను నుండును. చదువుగట్టిగా రావలయునను నభిప్రాయము విద్యార్థికి లేదు. బాగుగాఁ జెప్పవలయునను శ్రద్ధ యుపాధ్యాయునకు లేదు. విద్యార్థికిఁ గావలసినది విలాసముగాఁ దిరుగుట; యుపాధ్యాయునకుఁ గావలసినది జీతపుడబ్బులు. ఇంతే; జ్ఞానము నభివృద్ధిచేసి సుగుణములను బెంపుచేయవలసిన విద్య యీ కాలమున బాలురకు నవినీతినిఁ బెంచుచున్నది. పోకిరీలనుగాఁ జేయుచున్నది. దీనికిఁ గారణము విద్యావిధానములోను నుపాధ్యాయులలోనుగూడ నున్నది. "ఈవేళ నేను బీడీలు తెచ్చుకొనలే దొకబీడీముక్క నిప్పించండిరా"యని విద్యార్థులదగ్గఱ భిక్షించుకొను నుపాధ్యాయుఁడు బీడీలు త్రాగఁగూడదని బోధించిన నే విద్యార్థి వినును.

పూర్వపుఁ బాఠశాలలో విద్య కొంచెమైనను శిక్షణ చాల గట్టుదిట్టముగా నుండెడిది. అప్పుడు పున్నమకు నమావస్యకుఁ బాడ్యమితోఁగూడ రెండేసి దినములు సెలవు. ఈ రెండురోజులలోను దున్నపోతులవలె విడిగాఁ దిరుగకుండునట్లు కంఠస్థము చేయవలయునని యాటవిడుపు పద్యములు వ్రాసియిచ్చెడివారు. వినాయక చతుర్థికి, సంక్రాంతికి, మహానవమికి నయ్యవారికిఁ బప్పుబియ్యములని విద్యార్థులు తమతమ శక్తికిఁదగినట్లు గొనిపోయి యిచ్చెడివారు. అప్పటి కాలస్థితివేఱు, మనుష్యులే వేఱు.

స్వామి ప్రవేశించిన పాఠశాలలోని యుపాధ్యాయుఁడు బ్రాహ్మణుఁడు. ఈయన విద్య యెట్లున్నను గొట్టుటలో మాత్రము చాలఘటికుఁడు. విఱుగమోది వదలిపెట్టెడివాఁడు. ఆకారణమున నీ పంతులు వచ్చుచున్నాఁ డనఁగనే పిల్లలెల్లరు గజగజ వడఁకి పోయెడివారు. ఈయనగారి కొకతమ్ము డుండెడివాఁడు. ఆయనకు లౌకికజ్ఞానము గూడఁ దక్కువ. పైగా నెడమచేతివాటెక్కువ. ఒకొకరోజున నన్నగారేదేని పనిమీఁదఁబోవుచుఁ దమ్ముని బాఠశాలకుఁ బంపెడివాఁడు. ఆయనను జూడఁగనే పిల్లలెల్లరు, చిన్నపంతులు గారు వచ్చుచున్నాఁడు వచ్చుచున్నాఁడని, యాయన యెడమచేయి జళిపించుచు డొక్కపగుల గోసెదనని యెంత వాగినను, లక్ష్యముసేయక నవ్వుచుండెడి వారఁట.

స్వామి తన యపారమైన చుఱుకుఁదనమును వెల్లడిపఱచుచుఁ ద్వరలోనే బాలరామాయణము, గజేంద్రమోక్షము మొదలైన వెల్లఁజక్కగా గురుని మన్ననవడయుచు నధ్యయనము చేసెను. బడిలో విద్యయంతయు ముగిసిన పిమ్మట దగ్గఱలోనున్న యొక యగ్రహారమునకు రోజును బోయి మఱియొక యుపాధ్యాయునికడ నేవేవియో యొక సంవత్సరము చదివెను. అప్పటికి స్వామి క్షుణ్ణముగాఁ జదువుట యందును వ్రాయుట యందును సమర్థుఁడాయెను.

భగవద్దర్శనము

స్వామికిం బండ్రెండవ సంవత్సరము వచ్చెను. ఒకనాంటిరేయి నిద్రవోవుచుండగా స్వప్నమున

కనులకు మిఱుమిట్లు కలుగంజేయుచునున్న
కమనీయ నీలవిగ్రహముతోడ
దిఙ్ముఖంబుల నూత్నదివ్యదీధితిరాజి
రవణించు మణికిరీటంబుతోడ
కడకంటి చూపునం గలుములు వెదజల్లు
జగదంబ యొసంగు వక్షంబుతోడ
గుమగుమవాసించు కుసుమకింజల్కంబు
లలరారు నల వైజయంతితోడ
కరముల వెలుంగు శంఖచక్రములతోడ
రమ్యమైనట్టి పీతాంబరంబుతోడం
గమలగర్భాది సురలకుం గానంబడని
జలజదళనేత్రుం డెదుట సాక్షాత్కరించె.

ఇట్లు గానవచ్చిన యద్దేవాదిదేవుని బాల్యంబగుటచేతను, నప్పటికి జ్ఞానజ్యోతి వెలుంగొందని కతంబునను స్వామి యెఱుంగనేరక లేచి నమస్కరించి యూరకుండె. పరమకృపాళుండైన యజ్ఞగన్నాథుండు "వత్సా! నోరుదెరువు"మని నాలుకమీంద నేదియో వ్రాసి యంతర్హితుండయ్యె. స్వామి మేల్కొనియెను, గాని తనకట్లు గానవచ్చి నాలుకపై బీజాక్షరంబులు వైచిన యద్దేవుండు విధిశివేంద్రాదుల కతీతుండును సృష్టిస్థితిలయములకుం గారణభూతుండును, వేదశిరంబుల నువలాలింవంబడు పాదములుగలవాండును, లక్ష్మీపతియుం బరమయోగులకు ధ్యేయుండును, బరబ్రహ్మంబును నైన మహావిష్ణుండనియు నట్లు నాలుకమీంద బీజాక్షరములు వైచుట యఖండ శుభోదర్కమునకు హేతువనియుం దెలిసికొనలేకపోయెను. స్వప్నమునం గానవచ్చిన యద్దేవాదిదేవుని దివ్యరూపంబు మాత్రము మఱచినను మఱపునకు రానిదై హృదయపద్మమున నతుకుకొని పోయెను.

భక్త్యంకురము

కొలంది దినములు గడచెను. స్వామికి హృదయమున నూత్నవికాసము బొడమెను. జాత్యుచితమైయున్న మాంసము మొదలగు హింసాత్మకములైన యాహారములయందు

రోఁతయు విరక్తియు గలిగి మానుకొనెను. వానినిఁ జూచుటయే యసహ్యమాయెను. స్వప్నమునఁ గానవచ్చిన జగన్నాథుని రూపమునందే మానసము మరులుకొనఁ జొచ్చెను. ఏకాంతమునఁ గూర్చుండి యా రూపమునే ధ్యానింపసాగెను. భగవత్సంబంధమైన పాటలకుఁ బద్యములకు మహార్తితో మానసము వెంపరలాడుచుండెను. ఎవరెచ్చట నేది పాడుచున్నను, నిద్రాహారములు మాని స్వామి మహాప్రేమముతో వినును. మహాత్మ్ము లెవరేని దర్శింప లభింతురేమో యని యువ్విళులూరును. మహాత్మ్ము లెవరు గానవత్తురు ? ఎవరు చూచినను బొలమువోయెఁ బుట్టవోయె నను వెంపరలాటతో సంసారలంపటులై యుండువారే. "వాసుదేవస్సర్వమితి స మహాత్మా సుదుర్లభః" అన్న యట్లసలే మహాత్ములు దుర్లభులు. కావుననే "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతిసిద్ధయే" వేలకొలఁది మనుజులలో నొకానొకఁడు మాత్రము ముక్తికై ప్రయత్నించును. అని గీతాచార్యులు నుడివిరి. ఎచటఁ జూచినను జీట్లపేకలాడువారు, కల్లుద్రావి కైపెక్కి పడిపోయెడివారు, పందులు, గొఱ్ఱెలు మున్నగువానిని నఱకి తన్మాంసమును బంచుకొనెడి వారు, నెన్నేని పోర్జరీలు పుట్టించి యసంఖ్యాకములైన యబద్ధము లాడుచుఁ గోర్టెక్కి వ్యవహారములాడువారు, పరుల చేనిగట్టు నఱికి తన చేనిలోఁ గలిపికొని వ్యవసాయము చేయువారు' వడ్డీ వ్యాపారములు సేయువారు, బేరము లాడువారు, నేపాటుపడియైనఁగానీ సంపాదించినవాఁడే ఘనుఁ డనువారు, బోర్డు మెందరు పదవికై వేలువెచ్చించి యోట్లుగొనువారు. నొకటేమిటి యిట్టి దుర్వ్యాపారములు చేయుచుఁ బ్రకృతివశులై చరించువారు కోటానుకోట్లుగాఁ గానవత్తురుగాని"సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునం దుల్లము చేర్చి"సర్వసంగపరిత్యాగము చేసి తిరుగు బైరాగులు గానరారుగదా! ఒకవేళఁ గానవచ్చిన ప్రొద్దుట భిక్షాటన మాచరించి మధ్యాహ్నమునుండియు వలలు, నూఁతలుగొని మిఱికిగుంటల వెంటఁదిరుగు సంక్రాంతిలోని బైరాగులేగాని యసలు బైరాగులుగారు. ప్రకృతినిఁ జయించి దైవపరులగుట సామాన్యమా ? నూఱుదున్నపోతుల నైనను గడిగెదగాని యొక సాలగ్రామమూర్తినిఁ గడుగలేనని యెవరో యన్నట్లు మనుష్యుఁ డెన్నేని దుర్ఘటములైన కార్యము లాచరించును గాని పట్టుమని యొకగంటసేపు భగవన్నామ ముచ్చరింపలేఁడు. ఇది యింద్రియముల దౌరాత్మ్యము. భగవద్భక్తి కలుగదు. కలిగినను నిలుచుట మిక్కిలి కష్టము. అందువలననే "అనేక జన్మసాహస్రతపోధ్యాన సమాధిభిః నరాణాం క్షీణపాపానాం కృష్ణేభక్తిః ప్రజాయతే" అనేక వేల జన్మలయందుఁ దపోధ్యానసమాధులచేతఁ బాపము నశింపఁగా నప్పుడు విష్ణుభక్తి యుదయించు" నని చెప్పఁబడినది.

కేవల భగవత్పరులైన యట్టి పరమహంస లెచట లభింతురు ? అసలే యది కుగ్రామము సముద్రపువంచ, యెంతవెదకినను నెవ్వరును మహాత్ములు తగులరు. స్వామికి నానాఁటికి భగవత్ప్రీతి మెండు గాఁజొచ్చెను. వీరి పెదతండ్రిభార్య యొకముదుసల యవ్వ



శ్రీ వేంకటదాసస్వామి, రాధమ్మ గారు, రామబాణమ్మ, (స్వామి పెద్ద కుమార్తె) కమలాదేవి, (చిన్న కుమార్తె) నిలుచున్నవారు
స్వామి పెద్దకుమారుని కుమారుడు

గలదు. ఆమెకు లంకాయాగము పాటవచ్చును. ఆ పాటపాడుమని స్వామి యామెను మాటిమాటికి కదుగును. "తాళరా నాయనా! యలసటగా నున్న"దని యామె విలంబము చేయుచుండును. ఎట్లైనను మారాము వేసి స్వామి రోజునకు రెండుసారులైన నామెదగ్గఱ నాపాట వినును. ఎవ్వరైన నూర్ధ్వపుండ్రధారులుగాని, కావిగుడ్డలు గట్టినవారుగాని గనఁబడిరేని మహాత్ములని యెంచి వారి వెంటఁబడి తిరుగును. రాత్రుల యందుఁ దోడిబాలురను బ్రోవుజేసి రామదాసు కీర్తనలు మహోర్తితో మైమఱచి పాడును స్వామి కంఠస్వరము మేఘగంభీరము. మహా మధురము. వాక్కు అమృతవాక్కు. రూపము దివ్యమంగళ విగ్రహము, స్వామి యొక బ్రోవువడిన పుణ్యరాశి. భగవానుఁ డావిగ్రహముననేకొలంతయు నిడక సర్వసంపూర్ణత నిమిడ్చెను. ఆ రూపమును, నా యమృతవాక్కును, జూచినకొలఁది వినినకొలఁది జనుల నాకర్షించి వైచును. స్వామి తన మధురగంభీరకంఠ మెత్తిపాడఁ జొచ్చిన నొక మైలుదూరము స్పష్టముగా వినఁబడెడిది. ఇంటనున్నప్పుడు బయటికి వెళ్ళినప్పు డాటలాడుకొను నప్పు డా భగవత్సంబంధములైన కీర్తనలు పాడుకొనుచు మైమఱచు చుండును. ఇట్లు స్వామి హృదయమున భక్తివాహిని యంకురించి ప్రబలము కాఁజొచ్చెను.

భక్తితెగలు

భక్తులయందు 1. సిద్ధులు 2. సాధకులు 3. సామాన్యులు నని మూడుతెగలు గలరు. సిద్ధులనఁగాఁ గ్రిందటిజన్మములయందుఁ దీవ్రముగా భక్తియొనరించి యేదేని నొక కారణమున భ్రష్టతనొంది మరల జన్మకు వచ్చినవారు. ఇట్టివారి ప్రభ పుట్టుకతోడనే సహస్ర ముఖములుగా వెలుఁగఁజొచ్చును. ప్రపంచాభిలాషము వీరి కేమాత్రము నుండదు. పరబ్రహ్మమునందుఁదప్ప వీరి మానసము మఱియొకచో రమింపదు. ఇట్టివారి చర్యలు చిత్రవిచిత్రములు. లోకముననుకరించుట. లోకమునందు గొప్పగొప్ప మర్యాదలొంద వలయునని కుయుక్తులతో సంచరించుట, దంభము మొదలైనవి వీరి కేమాత్రమును గిట్టవు. భజన చేయుచు నిట్లు గంతులువైచిన లోకులు పరహసింతురేమో యనునిట్టి లోకాభిమాన దేహాభిమానము లుండవు. వీరి కొకరోజున ననారోగ్యము కలిగి యాహారముఁ దిన వీలుగాకపోయిన యెడల దానిని భగవల్లీలగానే యెంతురు. ఏదైన లాభమువచ్చిన భగవల్లీల. నష్టమువచ్చిన భగవల్లీల. వ్రేలియుంగరముజారిపోయిన భగవల్లీల. పొడుముడబ్బీ కానరాకపోయిన నదియు భగవల్లీలయే. దైవమే విలాసమునకు దానినట్లు కొంతసేపు కానరాకుండఁ జేసెనందురు. వీరికి భగవన్నామమే యౌషధము. వేఱౌషధములతో వీరికిఁ బనిలేదు. ఎవరైనఁ దమకు రోగము కలిగెనన్న "భగవన్నామము సేయుము తప్పకకుదురు"

ననియే బోధింతురు. భగవంతుఁడే యాహారమునుగూడఁ దమనోటియొద్దనుంచుననియే తలంతురు. భిక్షకు నిరువురు స్త్రీ పురుషులు కలిసివచ్చి మరలఁ గానఁబడక పోయిన వారిని సీతారాములనియే సమ్ముదురు. ఈ విషయమున నాథమునుల గాథ యొకటి స్మృతికి వచ్చుచున్నది. పూర్వము నాథ మునులు తమయింటఁ గూర్చుండి తపస్సు చేసికొనుచుండఁగా నెవరో యిద్దఱు పురుషులు నొక స్త్రీయుఁ గలిసి యొక క్రోఁతి నాడించుచు భిక్షకు వచ్చి నాథమునుల కుమార్తెను జూచి మీ నాన్నగారింటి యొద్ద నున్నారా యని యడిగి పోయిరఁట. తపస్సు ముగించి లేచిన వెనుక నీ విషయమును గుమార్తె నాథమునులకుఁ జెప్పెను. అంతట నా మౌని యయ్యో! పిచ్చిదానా! నాకప్పుడేల చెప్పవైతివి ? ఆ వచ్చినవారు సీతారామ లక్ష్మణులు. క్రోఁతి యాంజనేయులు, లేకున్న నన్నేల యడిగెదరు. వెఱ్ఱిపనిచేసితివి. వారెటు వోయి"రని యా దిక్కువట్టిపోయి సాయంత్రము వరకును వెదకి కానక యింటికి వచ్చి విచారపడెనఁట. చూచితిరా! యట్టివారి తన్మయత. వీరిచర్యలు సామాన్యులకు నవ్వుఁగూడఁ బుట్టించు చుండును. వీ రెంతసేపు చెప్పినను భగవద్విషయమే. ఎంతవఱకు వినినను భగవద్గాథలే. అన్యము వీరికి రుచింపదు. ఇతర ప్రసంగమును బరులు వారి సన్నిధినిఁ జేసిన సహింపరు. అట్లే భగవంతుఁడును వీరికి వశుఁడై వర్తించుచుండును. సాంసారిక కృత్యము లెట్లు జరుగునా యను చింత వీరి కుండనేయుండును. పాలపర్తి నృసింహదాసుగారు కుమార్తెకు గర్భాధానలగ్నము నొక వారము రోజుల వ్యవధిలో నిశ్చయించుకొనెనఁట. చేత నొక కాసైనను లేదు. ఇంటిలోఁజూచిన నిత్యశ్రీ ర్నిత్యమంగళమ్. ఇఁక గర్భాధాన మెట్లు చేయవలయును. అట్టితఱి భార్యయొద్ద నొకచిన్న నగ యుండఁగా దాని నమ్మి పదునైదు రూపాయలు గర్భాధాన వ్యయమునకుగాఁ బెట్టెలోఁ బెట్టి యుంచె. నట్టితఱి సాతాని యొకఁడు భిక్షకు వచ్చి నృసింహదాసుగారి యింటిముందు "కృష్ణానంత ముకుంద మురారే, వామన మాధవ గోవింద, శ్రీధర కేశవ రాఘవ విష్ణో, లక్ష్మీనాయక నరసింహా" యని పాడెను. ఆపాట వినఁగానే విస్తరిఁ గుట్టుకొనుచున్న నృసింహదాసుగారు లేచి "ఆహాహా నాయనా! మేలిమి వరహాలొలుకునట్టివి యేలినవారి నామములుచ్చరింతివే. మరల నొకసారిపాడు" మని పాడించుకొని గబగబ యింటిలోనికేగి, పెట్టెతీసి భార్య కుయ్యో మొఱ్ఱో యని యడ్డు వచ్చినఁ ద్రోసివైచి, యా పదునైదురూప్యములు తెచ్చి సాతాని చేతఁబెట్టి "మాతండ్రీ నీకెంత యిచ్చినను ఋణముతీఱదు. తీసికొను మింతవఱకేయున్నది. ఆలసించినమరల నాభార్య నీయొద్దనుండి గుంజుకొనును బొమ్మని యాతని నావలికిఁ బంపివచ్చెనఁట. మఱి కుమార్తె గర్భాధాన మెట్లు కావలయునో ? అది యసలెవరికిఁ బట్టినది. భగవంతునికిఁ బట్టవలసినదే. వీరి చర్య లిట్లుండును.

ఇట్టి సిద్ధుల జ్ఞానజ్యోతి వారితోనే తృప్తినొందదు. సమకాలికులైనవారినిఁ

బెక్కుమందినిఁ జక్కదిద్ది పవిత్రులనుజేసి ముక్తి కర్హులను జేయును. దొలుత నాంధ్రదేశమను శీర్షికయందుఁ బేర్కొనఁబడినట్టి భక్తులందఱు నీతెగకుఁజేరినవారే. వీరెల్ల రిటీవలివారు. పూర్వుల యందు భరతయోగి మున్నగువారు, నాథమునులు మొదలైన పూర్వాచార్యులు నిట్టిసిద్ధులే.

ఇఁక రెండవతెగవారైన సాధకులు పెక్కుజన్మములయందుఁ జేసిన పుణ్య సంచయమువలనఁ బాపరాశి నశించిపోగా, భగవద్భక్తిగలిగి పైఁజెప్పఁబడినట్టి సిద్ధమూర్తియైన యాచార్యు నాశ్రయించి, వారి యద్భుతదివ్యచర్యలు తిలకించి తదాకర్షణ బలమున మనస్సు దృఢముగాగా, నితర ప్రపంచమును దిరస్కరించి తదేకనిష్ఠతో గురువు చెప్పినట్లు భగవత్సేవఁజేసి, యాజన్మాంతముననే ముక్తినొందుదురు. వీరికి సిద్ధులకు వలె సర్వతోముఖప్రభ యుండదు. వారివఱకు వారు కడతేరుదురు. వీరి జ్ఞానజ్యోతికిఁ బరుల నాకర్షించునట్టి శక్తియుండదు. ఒకవేళ నుండినను సామాన్యముగా నుండును.

మూడవతెగవారైన సామాన్యులనఁగా సదాచార్యు నాశ్రయించియుఁ గర్మబంధము తెగకతీఱినప్పుడు భగవత్సేవసేయుచుఁ దీఱనియెడ మానుచు, భగవంతునియందు మాత్రము విశ్వాసము గలిగి వర్తించుచుందురు. వీరికి భగవంతునియందుకంటె సాంసారికకృత్యముల యందే పట్టుదల యెక్కువగా నుండును. అందుచే వీరికిఁగొన్ని జన్మలు గడచును. సద్యోముక్తి మాత్రమే లేదు. ఇట్టి భక్తివిషయమును శ్రీస్వామి తమ వరవరముని హృదయమునఁ జక్కగా నిరూపించిరి. వానినే యిచట నుదహరించుచున్నాను.

తీరినప్పుడుచేసి తీరకుండిన మాను
కొనునట్టివానిది కుంటిభక్తి
పామరజనబోధ పాటించి హరిని వీ
డొక్కన్నవానిది నెటాగ్రుడ్డిభక్తి
కష్టముల్దీనిచేఁ గల్గె నా కనియెంచి
నిరసించువానిది నీచభక్తి
యెన్నాళ్ళకును వాంఛ లీలేదు నాకని
మానినవాని దున్మాదభక్తి
లోకవాంఛలెల్లఁ బోకార్చి సరసీజ
నయను గొల్చునది యనన్యభక్తి
యట్టి భక్తి చేత నపవర్గ ధామంబు
నందవచ్చు సంశయంబు లేదు.

మొనసి లౌకిక భోగములకు నై కేశవుఁ
గొనియాడునది లంచగొండి భక్తి
బహుకాల మిలమీఁద బ్రతికింపుమనుచు దా
మోదరుఁ గొల్చుట మూఢభక్తి
చెలఁగి లాఁతులు సంతసించుటకై పరం
ధాము నర్చించుటల్ దంభభక్తి
తన చిత్తమును వేఱు తావున నుంచి శ్రీ
కాంతుని వేడుట కలుషభక్తి.
యేల తెచ్చికొంటి నీ మిడిమేలంబు
నెంతకాలమని భరింతు దీని
ననుచుఁ బంకజాక్షునందుఁ జేసెడి భక్తి
ఫలములేనిదండ్రు బ్రహ్మమునులు.

హరి విడనాడి చిల్లవేలుపుల ప్రాపుఁ
గోరి చేయునది నిస్సారభక్తి
సరసిజాక్షునితో నితరదేవతలఁ బోల్చి
రాణగొల్చుట లపరాధభక్తి
శ్రీకాంతు నవతారచేష్టలు ప్రాకృత
రీతి నెన్నుట విపరీతభక్తి
తన దురాచారవర్తనము వీడక మురా
రాతినర్చించుట రోఁతభక్తి
శిష్యవర్య! యిట్టి చెడుత్రోవలన్నియు
విడిచి ప్రాణనాథు విడువకుండఁ
గొల్చు సాధ్విబోలె గోవిందు నర్చించు
వానిరక్తి శ్రేష్ఠమైన భక్తి.

ఈ భక్తుల తెగలలో ముందుఁజెప్పఁబడిన సిద్ధులయం దగ్రగణ్యులు శ్రీ వేంకటదాస స్వామి. వీరి యద్భుత దివ్య తన్మయచర్యలు లెక్కకు మించియున్నవి. ఒకటిరెండు మాత్ర ముదాహరించి వదలెదను. ఒక సంవత్సరమున శ్రీరామనవమికి సంతర్పణ యొనరించుటకుఁ బందిరి వేయుటకు గడలెచ్చటను జిక్క లేదఁట. అంత స్వామి బండ్రెందు దూలములు గల తన పశుశాల నూడదీయించి యా సామానులతోఁ బందిరివేసి సంతర్పణ ముగించి మరలఁ జావడి వేయించుకొనెనఁట. ఇటీవలనే పరమపదించుటకు ముందు స్వామి చేతియుంగర


మొకటి యొక నవరసు బంగారముగలది, పోయినది. అది యెట్లు పోయినది ? యెవరు తీసిరి ? యను విచారణమేమియు స్వామి చేయలేదు. దానిని భగవంతుఁడే పోగొట్టెను. భగవదిచ్ఛ యట్లున్నదని యూరకుండెను. పుస్తకముల బీరువాలోనున్న యొక సంచియం దొక రూపాయి కానిపించెను. అదిచూచి స్వామి యానందపడి దీనిలోని కీ రూపాయి యెట్లు వచ్చినది ? భగవత్సృష్టి. కేవలము భగవంతుఁడే దీని నిచ్చటఁ బెట్టెనని శిష్యులకు వచ్చినవారికిఁ జూపి చెప్పసాగెను. ఎప్పుడైన మీరే పెట్టి మఱచిపోయితిరేమో యని యన్న నిఁక వారికి బ్రతుకు లుండవు. భగవంతుఁడే పెట్టెనని యందఱు ననితీఱవలసినదే. స్వామి పెరుమాళ్ళకై యొక చిన్న మామిడితోఁట వేసెను. అది యూరిసమీపములో నున్నది. తపస్సు ముగించిన పిమ్మట సూర్యాస్తమయకాలమున నప్పుడప్పుడు స్వామి యచటికి వాహ్యాళిగాఁ బోయి వచ్చుచుండును. ఒకరోజున నట్లుపోయివచ్చి వెంటనే పెద్దకుమార్తెను బిలిచి యమ్మా! యీరోజున జరిగిన చిద్విలాసమును జూచితివా యనెను. ఏమిటండీ యది యని కూఁతురు ప్రశ్నింపఁగా "నేను బోవుచుండగనే వెనుకగా వచ్చి నన్ను రుద్దుకొనుచుఁ బోయె"నని స్వామి చెప్పెను. అంత నామె "యెవఁడువాఁడు మిమ్ములను రుద్దుకొని పోయెడివాఁడ"నెను. "ఎవఁడేమున్నది యేలిన వారే, వెనుకకుఁ దిరిగి చూచునప్పటి కెవరునులేరు" అని పలికెను. ఇది పరమపదించుటకు రెండునెలలముందు జరిగినది. క్రిందఁ జెప్పఁబడిన నాథమునుల చర్యకును దీనికిని నేమియుభేదము లేదుగదా! అట్టి మహాపూరుషుల చర్యలన్నియు నొకేమాదిరిగా నుండును. ఎవరో వెనుక వచ్చినట్లుండుట, యెవరో యాకస్మికముగాఁ గనిపించినట్లుండుట, యేదో యలికిడియైనట్లు శబ్దము వినిపించుట. యిట్టి భ్రమరూపములైన సంఘటనలు ప్రతిమనుష్యునకు నప్పుడప్పు దనుభూతి యగుచుండును. ఇట్టివన్నియు భగవదానందతన్మయులైన యిట్టివారు దైవవిలసనములుగాఁ దలంతురు. అట్లని యేల యనుకొనవలయును. మన యనుభూతులనుబట్టి వారిని విమర్శింపవచ్చునా ? ఒక గంటసేపింద్రియములను నియమించి భగవద్ధ్యానము సేయలేని సోమరిపోతులము మనము. వారో యింద్రియజయము నొంది శరీరమును నియమించి బ్రహ్మానందసుఖమున నోలలాడు చుందురు. మనబోటి తుచ్ఛులను భగవంతుఁ డేలసమీపించును ? మనకుఁ గలుగుటలేదుగదా యని, యట్టి మహాత్ములకుఁ గలిగిన దైవికవిలాసములను గూడ భ్రమయని యనుట మూర్ఖతగదా! దైవము వారిని సత్యముగా రుద్దుకొనియే పోవును. భ్రమయైనది ప్రమయైనదియుఁ గూడ నెఱుఁగని మూఢులా వారు ? స్వామి యొకొకవేళ నెవరినైనను లౌకికములోఁగాని పారమార్థికములోఁగాని కేకలు వేయునప్పుడు చూచుచుండెడివారము. ఆహా! యేమి యాహేతుకార్యనిరూపణక్రమము. బ్రహ్మాంతవాఁడై నను సత్యమును గప్పిపుచ్చి కుంటిసాకులుచెప్పి తప్పించుకొనవలయునన్న

వీలుపడెడిదిగాదు. ఒక్కొక్క విషయముమీఁద నిలిపి యెన్ని విధములుగాఁ జాలినీచేసి యడిగెడివారు! యెదుటివాఁడు నిరుత్తరుఁడై సత్యము నొప్పుకొని నమస్కరింపవలసినదే గాని కుయుక్తులు పన్ని సమాధానింపలేకపోయెడివాఁడు. ఒక యుక్తినిఁ గల్పించుకొని వాఁడు జవాబుచెప్పిన దానికిఁ బైయుక్తులతో స్వామి ప్రశ్నించు చుండుసు. అట్టివారికా భ్రమ ప్రమాదములు ? సర్వజనుల భ్రమలను బోగొట్టి సత్యము నెఱుకసేయు మహాపురుషులు వారు. మనవంటి యల్పబుద్ధుల కెన్నేని భ్రమ ప్రమాదములు గలుగుచుండును.

పితృబాధ

స్వామి భక్తివాహిని దినమునకొకరీతిగాఁ బెరిగిపోవుచుండెను. ఎచటఁ గూర్చుండిన నచట జపమో, రామపాదధ్యానమో చేయుచుండును. రాత్రులయందుఁ దోడివారి ననేకుల రావించి జగన్మోహనముగా భజనసేయును. కృష్ణయ్యగా రిది యంతయుఁజూచెను. పాపమాయన యొక సామాన్యగృహస్థు. భక్తియననేమో, భగవంతుఁడన నెట్టివాఁడో యాయన యెఱుఁగడుఁ. అసలీ దేశముననే యా విషయము లెఱఁగరు. కావున నాతఁడు కుమారున కేదియో యున్మాదము ప్రారంభించినదని భావించెను. జపము, భజనయు నిట్టి భగవత్సేవా కార్యములు మానుమని తీవ్రముగాఁ గొట్టియు, భయపెట్టియు, దిట్టియుఁ జూచెను. తండ్రిగారి యీ ప్రయత్నమంతయు స్వామిభక్తికి నభివృద్ధి దోహదమేయగుచుండెనుగాని, నిర్బంధకము కాఁజాలకపోయెను. కృష్ణయ్యగారే విధముగా శిక్షించుచున్నను భార్య మున్నగువారు కనులు పెట్టుకొని చూడవలసినదే గాని మఱిమాట్లాడుటకుఁ బ్రాప్తిలేదు. అట్టి చండశాసనుఁడాయన. ఒక్కొక్కరోజునఁ జెలరేఁగి కృష్ణార్యుఁడు, "ఒరీ! నీ జపము చేసినచోట నీ భజన వినపడినచోట నేడు నిలువులలోఁతున దారిద్ర్యముండును. నేను పోయినపిదప నీ వదుగుకొని తినవలసినదే" యని పలువిధములుగా నోటికివచ్చినయట్లు తిట్టును. స్వామి తలవంచుకొని వెడలిపోవును. ఈ భక్తి వెట్టిపోవునేమో యని కృష్ణయ్య కుమారునిఁ గొడ్లఁగాయ నియమించెను. ఆయనయే కాక యూరివారందఱును నదియొక పిచ్చియని యెంచి "పాపము కృష్ణయ్య కొక్క కుమారుఁ డైనందులకుఁబిచ్చివాఁడై పోవుచుండె నేమిరా" యని విచారపడసాగిరి. కొంతమంది హితైషులు స్వామి కనఁబడినపుడు "నీ దుంపదెగిపోను, ఆ తండ్రిచేనట్లు చీవాట్లు చెప్పుదెబ్బలు పడకపోతే భక్తి మానుకొనరాదా" యని బుద్ధులు సెప్పిరి. ఎవరేమి చేసిన నేమి భగవదవ్యాజ కృపాకటాక్షమున జన్మతో మిళితమై వచ్చిన యా భక్తి మాత యేల వదలును ? నానాఁటికిఁ బ్రబలిపోవుచుండెను. స్వామి గొడ్లను దోలుకొని పోవునపుడును, వచ్చునపుడును భక్తి రసావేశమునఁబాడు కీర్తనలకును భజనకును నల్లరాలు గరఁగుచుండెను. ఎవరో పుణ్యభాగులైనవారు కొందఱాధ్వని యాలించి పనులు విడిచి స్వామి చాలదవ్వేగువఱకు

నట్లే నిలిచివినుచుండెడివారు. ఒకనాఁడు స్వామి పొలమునఁ బసులఁగాయుచుండఁగా నెవరో దగ్గఱి యూరివారు కృష్ణయ్యగారి నెఱిఁగినవారా త్రోవను బోవుచు, భగవద్భజన మొనర్చు స్వామినిఁ దిలకించి, యెవరి కుమారుఁడని యడిగి, కృష్ణయ్యగారు కలవాఁడుగదా, కుమారునిఁ బసుల దగ్గఱఁ బెట్టినేమని ప్రశ్నించిరి. అప్పు డచటనున్న యొక రెడ్డి "యీయనా! యోగీశ్వరుఁడు గాఁబోవుచున్నాఁడు. అందువలన నాపిచ్చి యడఁగుటకై మామయ్య గారు గొడ్లదగ్గఱ బెట్టి"నని బదులు చెప్పెనఁట. స్వామికి వయస్సుతోఁబాటు భక్తియు, భక్తితోఁబాటు భక్తుల సంఘమును, దానితోఁబాటు విద్యాభిలాషమును గ్రమక్రమముగాఁ బెరుగఁజొచ్చెను. కాని కృష్ణయ్యగారు చూచుచుండఁగా జపముచేయుటకుఁగాని, భజన చేయుటకుఁగాని, పుస్తకముఁ జదువుటకుఁగాని వీలులేదు. ఇవి యన్నియు స్వామి దొంగతనముగా, నే పొలముననో లేక తండ్రి యింటలేనియప్పుడో చేయవలయును. ఏదో కొలఁదిగా ధాన్యమును దొంగతనముగా నమ్మి యాసొమ్ముతో, అమరము, ఆంధ్రనామ సంగ్రహము, మొదలగు గ్రంధములు కొని చదువనారంభించెను. విద్యయం దభిరుచి మెండగుట చేతను, భగవానుఁడు నాలుకపై బీజాక్షరములు వేయుటచేతను, స్వామికి నాచార్యుఁ డవసరములేకయే తీసికొనిన గ్రంధమెల్ల నవగతము కాఁజొచ్చెను. అర్ధజ్ఞాన మిట్లు కొంత గలుగుటచేఁ జిన్నచిన్న గ్రంథములు మనోహరముగాఁ జదివి తన యమృతవాక్కుతో స్వామి పదిమందినిఁ గూర్చుండఁబెట్టి యప్పుడప్పుడు చెప్పుట కారంభించెను. అప్పుడేకీర్తనలు రగడలు మున్నగువాని రూపముతోఁ గవిత్వమునుగూడఁ జెప్పుట కారంభించెను. కాని యభిరుచికిఁ దగినట్లుగా విద్యాభ్యాసముఁ జేయుటకుఁదగిన యవకాశము స్వామికి లేదు. ఆయూరఁ గాంతయ్య యను నొక బ్రాహ్మణుఁడెచటినుండియో వచ్చి కాఁపురముండెను. ఆయనకుఁ గొంచెముగా శ్రుతపాండిత్యము గలదు. ఊరిలో నా బ్రాహ్మణుఁడే గొప్పపండితుఁడని జనులు భావించెడివారు. స్వామి విద్యాశక్తి పెరుగుచున్న కొలఁది "మొవ్వవారి వేంకయ్యకుఁ గాంతయ్యగారికంటె నెక్కువ చదువు వచ్చినదఁట" యని పామరజనము చెప్పుకొనసాగిరి. ఒక దినమునఁ గృష్ణయ్యగారు నీలివిత్తనములు దీసికొనవచ్చుటకుఁ గుమారునిఁ దీసికొని రెండుక్రోసుల దూరములోనున్న చెఱకుపల్లికి వెళ్ళెను. అచట విత్తనములు కొని నలుబది వత్సరముల వయస్సులోనున్న తా నాఱుమానికలు మూటఁగట్టుకొని పదుమూడు వర్షముల వయస్సులోనున్న స్వామికిఁ బండ్రెండుమానికలను గట్టి యెత్తెను. ఎత్తుటతోడనే స్వామికి మెడలువిఱిగి నట్లాయెను. కాని యీ మూట మోయలేనని యనుటకు వీలులేదు. అట్లే మిక్కిలి ప్రయాసతోఁ దెచ్చుచుఁ ద్రోవలో నొకచోఁ గాలుజాఱి చిలుపచిలుపగానున్న నీటిలో మూటఁబడవైచెనఁట. ఇఁకనేమి కృష్ణయ్య యాగ్రహాదగ్రుఁడై మండిపడెను. "విధవా! నీ మొగము జూడుమెట్లున్నదో, పదిమందినిఁ బ్రోగుచేసికొని భజనలైనఁ జేయుదువా



పండిత శ్రీ మొవ్వ శ్రీనివాస పెరుమాళ్ల గారు, స్వామి పెద్ద కుమారులు.

రేఁబవళ్లు ? ముండమోపి! పుస్తకములైనఁ జదువుదువే, యీమూట మోయలేక పోయితివా" యని కఠోరముగాఁ దిట్టుచుండెను. అంతలో మఱియొక కాఁపాత్రోవనుబోవుచు "మన కులమంటే బొటనవ్రేలికి సున్నమైన బోరగిలఁబడునదిగాదంటే" యని కృష్ణయ్యగారి కిచ్చకముగా మాట్లాడెను. ఇట్లిద్దఱును దిట్టి యామూట మరల స్వామికిఁ గలిసియెత్తి నెత్తిపైఁ బెట్టిరి. ఈ మాటు నీటఁ దడియుటచే మూట మఱింతబరువాయెను. స్వామి యెట్లెట్లో యామూట నింటికిఁ జేర్చెను. నాలుగు రోజులవఱకు మెడ లిటునటు త్రిప్ప వీలుగాకపోయెను. ఆహా చూచితిరా! ప్రపంచమున నింతటి కఠోరులైన తండ్రులుగూడ నుందురుకాఁబోలు.

కృష్ణయ్య కుమారుని గొడ్లగాయించుట మానిపి వ్యవసాయములో దింపెను. మఱింత అంపకోఁతగా బాధలుపెట్టెను. నాగలి దున్నించెను. పాఱపని చేయించెను. కోఁతలు గోయించెను. ఒకటేమిటి వ్యవసాయపుఁ బనులన్నియుఁ గఠోరముగాఁ దాను దగ్గఱనుండి చేయించెను. ఒకసారి స్వామికి రెండుకాళ్ళమీదఁద నిరువదేసి సెగ గడ్డలు లేచెనఁట. అట్టి కురుపులతో బాధపడుచున్నను బదిగంటల నుండి సాయంకాలము వఱకు వరికోఁత గోయించుచుండెను. సాయంకాలమగుసరికి స్వామికి జ్వరము తగిలినట్లగుచుండెను. కాని కోఁత మాత్రము కోయవలసినదే. అసలు కృష్ణయ్యగారొక రకము మనుష్యుఁడు. పరధనాసక్తి, పరవనితారక్తియు, అబద్ధము నివిలేని పవిత్రుఁడేగాని మిగిలినవన్నియు దుర్గుణములే. ఆ దుర్గుణములు కుటుంబమును మాత్రమేడిపించుచుండెడివి. పరులకు బాధాకరములు మాత్రము గావు.

ఇంటిలోనికిఁ గావలసిన వస్తుసంభారములు సక్రమముగాఁ దెచ్చెడివాఁడుకాఁడు. భోజనము మాత్రమాయనకు షడ్రసోపేతముగా నుండవలసినదే. లేకపోయిన భార్యకును నింటిలోనివారికిని బ్రతుకులు లేవు. నీవు తేకపోయిన మేమెట్లు చేయుదుమని ప్రశ్నించుటకు వీలులేదు. వర్షము లెక్కువగాఁ గురియుచుండిన నింటిలోనివారినిఁ దిట్టెడివాఁడు. వర్షమసలు కురియకపోయిన"నీ సంవత్సరము పంటలు పండవడుగుకొని తినుచుఁబోవుదురుగాని" లెమ్మని కుటుంబమును దిట్టును. ఇట్టి పరమమూర్ఖు లిపుడును జాలమంది గలరు.

స్వామి కీ భక్తియంతరించుటకై తండ్రి యెంతయో, ఘోరముగా శిక్షించెను. కాని లాభము లేకపోయెను. "కాఁకలకువన్నె కెక్కిన కనకమనఁగ వాలుసమ్మెట్లకోర్చిన వజ్రమనఁగ" నా భక్తి దినదినాభివృద్ధి నొందెను. క్రమక్రమముగా నిది పిచ్చిగాదనియు, భక్తిమహాదశయనియు లోకము తెలిసికొనసాగెను. ఈ తండ్రికుమారుల పద్ధతినిఁ జూచినవారు, ప్రహ్లాద హిరణ్యకశిపులను బ్రత్యక్షముగాఁ జూచితిమని నుడివిరి.

విడిగా నిర్మలముగాఁ గూర్చుండి యనుష్ఠానము దీర్చుకొను నవకాశము స్వామికి

లేకపోయెను. వ్యవసాయపుఁ బనులొనర్చుచునే భగవన్నామజపము చేయుచుండెను. రెండుపూటలు నాగలి దున్నుచు నక్షరమాలిక లెక్కవేసికొనుచు "శ్రీరామరామరామేతి రమేరామే మనోరమే సహస్రనామతత్తుల్యం రామనామ వరాననే" యను రామ తారకమంత్రమును దినమునకు నిరుదివయైదువేలు చొప్పున జపించెను. తండ్రిగారు రానియెడలఁ గొంతసేపు పనిచేసి యెండలోనే గూర్చుండి స్వామి రామపాదధ్యానముసేయును. కుంభధారగాఁ గురియుచున్న వర్షములో శైలమువలె నచంచలుఁడై మంత్రజపము చేయుచునే యుండును. పగలెల్ల నిట్లు నడ్డివిఱుగఁ బనియు జపమును జేసి రాత్రి మరల నెల్లరఁ బ్రోవుచేసికొని యూరఁ దెల్లవారుజామువఱకు భజనఁ జేయును.

అగ్నిహోత్రజ్వాలలందుఁ గాచుచునున్నఁ
    గళలందు మేల్మిబంగారుపోల్కి
జాడించి చెక్కడు సానదెబ్బలకోర్చి
    మఱిమఱి దీపించు మణి విధాన
మర్దించిన కొలంది మార్దవంబును బొంది
    గుణమెచ్చు నౌషధగుళికరీతి
విసరి నేలకుఁజూపి కసరికొట్టిన యంత
    గగనమంటెడు కందుకంబువోలె
శౌరి కరుణాప్రదీప్తమై స్వామి మాన
సాంబురుహమందు బుట్టినయట్టి భక్తి
జనకుఁ డొనరించుచున్న శిక్షలకు నింత
లెక్కసేయకయే మెఱుఁగెక్కి పొదలె.

వేణుగోపాలప్రాప్తి

పూడివాడకుఁ దూర్పున నొక పంటకాలువ పెద్దది యున్నది. ఇది షుమారొక నూఱుసంవత్సరములక్రిందఁ ద్రవ్వబడినది. ఆ కాలువ త్రవ్వునపుడు భూమియం దొక శిలావిగ్రహము వెలువడెను. అది యచ్చోట భూగర్భమున నేలవిలీనమై యుండెనో తెలియదు. ఒక గజము నిడివిగల వేణుగోపాలస్వామి విగ్రహ మది నల్లరాతితో మనోహరముగాఁ జెక్కఁబడియున్నది. చేతులయందు మురళియు, మకరతోరణముమీఁద రెండువైపుల శంఖ చక్రములును, గ్రింద నిరుప్రక్కల రెండు గోవులును గలిగి మంచి పనితనముతోఁ జూడ ముచ్చటగానుండెను. ఏ దేవాలయము జీర్ణమై యచటి కా మూర్తి చేరెనో యెవరికినిఁ దెలియదు. కాలువ త్రవ్వునపుడు గడ్డపలుగు పోటు దగిలి స్వామి ముక్కుమాత్రము

భగ్నమాయెను. మిగిలిన యంగములేవియుఁ జెడలేదు. పనివాంండ్రావిగ్రహమును బెకలించి సమీపములోనున్న యొక తాళ్ళతోఁటలో నొక తాడిచెట్టున కానించి నిల్పిపోయిరి. అప్పటినుండియు నా స్వామి పూజా పురశ్చరణములు లేక వానకుఁ దడియుచు నెండకెందుచు నచట నుండిపోయెను.

స్వామి యా భగవద్విగ్రహము నెటుల గనుగొనెనో గనుగొనెను. ప్రతిదినమును నూరిబయట దవ్వుననున్న యా వేణుగోపాల స్వామికడకేగి కొంతవడి భగవానుని చుట్టుదిరుగుచు భజన మొనర్చును. కొంతసేపాదేవదేవునిముందు నిశ్చలుఁడై ధ్యాన మొనరించును. తీరిక చిక్కినపుడెల్ల స్వామి యావేణుగోపదేవుని సమీపమునకేగి నిర్జనమైన యాస్థలమున భగవదానందతన్మయత ననుభవించుచుండెను. ఒక్కదినమున స్వామి యట్లు జగన్నాథుని సేవించి నాలుగుగడియల ప్రొద్దువేళఁ ద్రోవనుబడి యింటికి వచ్చుచుండెను. త్రోవలో శేషయ్యగారను నొక ధనవంతుఁ డెదురుపడెను. అప్పటిలో నాయన యొక నూఱెకరములు భూమిగల యాసామి. ఊరిలో నెదురు లేకుండ నాయనపెత్తనము సాగుచుండెను. చాల రాజసుఁడు. ఏడెనిమిది యరకలయెడ్లు, పదిపండ్రెండుగురు జీతగాంండ్రు గలిగి మూడు పువ్వు లాఱుకాయలుగానున్న దాయనపని. శేషయ్యగారు, స్వామి తల్లియైన కృష్ణవేణమ్మకు మేనమామ. ఆయనగారి కిరువురు భార్యలు. శేషయ్యగారు భక్తివిషయముఁ బట్టించుకొనని రాజసుఁడుకాని యా సాధ్వులిరువురును బవిత్రమానసలు. స్వామియం దత్యంత ప్రేమగలిగి వర్తించెడివారు. వారి యిరువురి ప్రాణము లొకయెత్తు. స్వామి యొక యెత్తు. ఎవరైననేమి పూర్వజన్మసంస్కారము "గిరౌమయూరః గగనే పయోదః" ఆకసమున మేఘముపట్టఁగాఁ బర్వతముమీఁదనున్న నెమలి యానందించునట్లు ప్రేమ గలిగించుచుండును. ఈతరుణులిరువురును మొదటినుండియు స్వామికి, నూరఁ బెద్దయందుగా నుండి తరువాత వారుచేసిన భగవత్కార్యములయందును జేయూఁత నిచ్చి సహాయపడిరి. ఇంటిదగ్గఱకంటె స్వామి వీరియింటిదగ్గఱనే యెక్కువ యుండెడివారు. ఇంట నేపదార్థము చేసికొన్నను స్వామికీయనిది వీరికిఁ దృప్తిలేదు.స్వామిచేయు భజన కానందించుచు, వారు చెప్పు భగవద్గాథ లతిప్రీతితో వీరు వినుచుండెడివారు. శేషయ్యగారికి భక్తి విషయముగా స్వామిమీఁద బ్రేమలేదుగాని మేనఁగోడలి కుమారుఁడనియేమి, భార్యలిరువురు మిక్కిలిగా లాలించుచుండుటచేతనేమి, మొత్తముమీఁదఁ బ్రేమగలిగియే యుండెడివాఁడు. ఆయనకు నేభక్తియు లేకపోయినను విష్ణుప్రీతికంటె శివప్రీతి, మాటలయందైనను, ఎక్కువగా నుండెడిది. ప్రసంగవశమున శేషయ్యగారి సంగతి కొంత నుడివితిని. అట్లు చలువ పంచలుగట్టి తెల్లనికోటు వేసికొని, జరీయంచు పాగా జుట్టి చేత నొక ప్రేంపబెత్తము పూని శేషయ్యగారు స్వామికిఁ ద్రోవలో నెదుర్పడి "ఏమి యా శిలదగ్గఱ నుండియేనా ?" యని ప్రశ్నించెను.

స్వామి కతికాలిమంట నెత్తికెక్కెను. తాను సృష్టిస్థితిలయములకుఁ గర్తయైన యాదినారాయణ పరబ్రహ్మముగా నెంచి సేవించుచున్న యా భగవన్మూర్తి నతఁ డొకరాయిగా భావించి శిల యని పల్కుచుండెను. ఏమిరా! వీని యహంకారమని హృదయమున కోపాగ్ని రగిలెను. కాని యాయనను దిరస్కరించునంతటి సామర్థ్య మప్పటికి స్వామికి లేదు. బాల్యముగదా. సమాధానము చెప్పుటకు మనస్కరింపక స్వామి యూరక తలయూఁచి తప్పుకొని పోవుచుండెను. వెనుక వచ్చుచున్న మఱియొకఁడు "ఎవరండీ యా పిల్లవాఁ"డని శేషయ్యగారినిఁ బ్రశ్నించెను. "వీఁడా మా మేనఁగోడలికొడుకు. వట్టి పిచ్చిసన్యాసి. యిహమును లేదు బరమునులే'దని యాయనగారు బదులు చెప్పెనఁట! ఇదియంతయు స్వామికి వినఁబడుచునే యుండెను. ఆహా! చూచితిరా. యైశ్వర్యవిలసితము. తనకప్పుడున్నకలిమి యుబలాటము పట్టరానిదై యతఁడుండెను. అందుచే దన యఖండతపోబలమున లోకములు వెలిగించి బ్రహ్మర్షియై శాశ్వతవిష్ణులోక సామ్రాజ్య పట్టాభిషిక్తుఁడుగా నున్న మహామహుని వట్టి పిచ్చిసన్యాసి యని చెప్పెను. ఇఁక దానో నశ్వరమైన యైశ్వర్యమును నమ్మి, మఱింతదబ్బు సంపాదింపవలెనని యేవేవో వ్యాపారములుచేసి తనకున్న యాస్తినంతయుఁ బోగొట్టుకొని చివరకు మనోభ్రష్టత నొందెను. ఇహమును బరమును లేని పిచ్చిసన్యాసులెవరో పాప మా పెద్దమనుష్యుఁ డప్పుడు తెలిసికొనలేకపోయెను.

విగ్రహానయనము

ఊరబయట దూరముననున్న వేణుగోపాలస్వామిని నూరి లోనికిఁ గొనిపోవలయు నని స్వామి తలంచెను. అట్లు తనయింటికే గొనిపోయి నిరంతరము సేవించుకొనవచ్చు ననుకొనెను గాని యా పని తనకొక్కని కసాధ్యము. "భవితవ్యతా ఖలు బలవతీ" వేంకట సుబ్బయ్య యను మఱియొక బాలుఁడు స్వామికిఁ జదువుకొనునప్పుడే పాఠశాలలో స్నేహితుఁడుగాఁ జేరెను. ఈయన స్వామివెంటఁబడి సర్వకాల సర్వదేశ సర్వావస్థలయందును విడువ కుండెడివాఁడు. స్వామి యేపనికి నియమించినను సిద్ధమే. ఏట దూఁకుమనిన దూఁకును. స్వామికిని నీయనకునుగల స్నేహము విడఁదీయరానిది. ఈ వేంకటసుబ్బయ్య గారు స్వామికంటెను రెండుమూడు సంవత్సరములుపెద్ద. స్వామి బాల్యమునుండియుఁ బరమపదించువఱకుఁ జేసిన యద్భుతకృత్యములును, మహిమలును, సంపూర్ణముగా ననుభవించిన ధన్యుఁడీయన. ఎన్నియవాంతరములు వచ్చినను దట్టుకొని స్వామియే పరదైవమని యెంచి విడువక సేవించిన పెద్ద శిష్యుఁడు కూడ వేంకటసుబ్బార్యుఁడే. విగ్రహముఁ దీసికొని వచ్చుటకై స్వామి వేంకటసుబ్బయ్యగారితో నాలోచించి మఱియొక యిద్దఱి ననుకూలురైన తోడివారినిఁ గలుపుకొనిరి. నలుగురునుగూడి యొక నాఁటి రేయి

మాటుమడఁగిన పిదప వేణుగోపాలుని సన్నిధికేగి యా భగవన్మూర్తి నెత్తుకొని తెచ్చి స్వామి యింటిసమీపముననున్న బయలులో ఒక చెట్టుమొదట నిలిపిరి. తెల్లవాఱిన పిదప జనులందఱుచూచి గ్రామము వెలుపల దూరముగానుండు వేణుగోపాలస్వామి యచటి కెట్లువచ్చెనా యని విభ్రాంతిపడిరి. స్వామి యా గోపాలదేవున కచట వేంకటసుబ్బార్యుఁడు మున్నగు స్నేహితులఁ గూర్చుకొని తాటియాకులతో నొకకుటీరమును వేసెను. రాత్రులందు భోజనము చేయఁగనే స్వామి స్నేహితుల నొక యిరువదిమందినిఁ గూడఁగట్టుకొని యా భగవత్సన్నిధిని ఫెళ్ళుమని యర్ధరాత్రము వఱకు భజనసేయును. భజన ముగిసినపిదపఁ గొంద ఱిండ్ల కేగెడివారు. కొందఱచటనే పరుండెడివారు. ఇట్లు కొంతకాలము గడచినది. ఒకనాఁటిరేయి భగవత్సన్నిధిని వెలిఁగించిన దీపమెట్లో తాటియాకుల దగుటచే దడికంటుకొని యాకుటీరము తగులఁబడిపోయెను. కాని లోనిదైవమూర్తి కేమియుఁ బ్రమాదము జరుగలేదు. స్వామి మరల వేణుగోపాలునకు మందిరము నిర్మించెను. ఈమాటు తాటాకుల దడిలేదు. మట్టితో గోడఁబెట్టి మఱికొంత విశాలముగా నిర్మించెను. స్వామిమహిమను నానాఁటికి దేశము తెలిసికొనసాగెను. వారిబ్రహ్మతేజము జనుల మిక్కుటముగా నాకర్షించుచుండెను. స్వామికి సంఘబలము పెరుగుచుండెను. అట్టితఱి భజనసంఘముమీఁద చందావేసి యొక హార్మోనియమునుగూడ భజనకు నంగముగాఁ గొనితెచ్చిరి. స్వామికిఁ గృష్ణయ్యగారి బాధహెచ్చెను. అంతట స్వామి తల్లి మున్నగువారితో నాలోచించి నాలుగురోజులు కృష్ణయ్యకుఁ గానరాకుండ దేశాంతరగమనమొనర్చినట్లు సేయనిశ్చయించుకొనెను. మఱియొకనిని దోడుతీసికొని సంఘముమీఁదఁ బ్రోవు చేసిన కొంతడబ్బు దీసికొని యొక తెల్లవారుజామున లేచి వెడలిపోయెను. వారట్లువోయి మూడామడదూరములోనున్న చేబ్రోలను వీట నొకపెద్ద తంబురాఁ గొనిరి. మరల నూరికి రాత్రివేళ వచ్చి యింటికిపోక స్వామి తన యింటికిఁ జేరువలోనున్న మఱియొకరియింటఁ గానరాకుండ నాలుగురోజు లుండెను. స్వామి వెళ్ళిన తరువాత నా రోజుననే కృష్ణయ్యగారు కుమారుఁడు గానరానందున నేమాయెనని విచారించెను. ఎఱిఁగియుండియు నింటిలోనివారు నీ బాధపడలేక యెటో దేశాంతరము లేచిపోయెనని విచారపడఁజొచ్చిరి. కృష్ణయ్య గుండె గుభాలుమనెను. "దేశాంతరము వెళ్ళిపోవుటయే!" కుమారుఁ డెంతపని జేసెనని, తనచేఁతకుఁ బశ్చాత్తాపపడియెను. ఇంటిలోనివారు నిజమెఱిఁగి యుండుటచేఁ గృష్ణయ్య చూచునప్పుడే విచారపడుదురు. కృష్ణయ్యగారికి నిప్పులమీఁదఁ బొరలినట్లుండెను. కుమారున కదియేదో పిచ్చి యనియు, నదిపోయి బాగుపడవలెననియు, భావించి దండించుచుండెనుగాని, పుత్రప్రేమలేకయా ? పాపమాయనకుఁ బిచ్చియెత్తి నట్లాయెను. ఎవరినెవరినో నలుదెసలకుఁ గుమారు నన్వేషింప "వలుచని బద్దగజ్జువంటి యొజ్జని పిల్లవాఁడు. పెంపుడు జుట్టున్నది. పదియాఱు

సంవత్సరముల వయస్సులో నుండు" నని యిట్లు జనుల నడుగుచు జాడలుబట్టి పొ"మ్మని పంపించెను. వారికిని నిజము తెలిసియే యున్నది. గావున నట్లేపోయెదమని పోయినట్లు పోయి యింటిదగ్గఱనే కానరాకుండి రెండురోజులు గడచిన తరువాతవచ్చి, యెచ్చటను స్వామి కనఁబడలేదనియుఁ బలుచోటుల వెదకితిమనియుఁ జెప్పిరి. కృష్ణయ్య గారిఁక దిగులుపడి నిద్రాహారములులేక మంచము బట్టెను. అయ్యో! యొక్క కుమారుఁడై యట్లు సేసెనా యని విలాపింపఁదొడఁగెను. అప్పు డింటిలోనివారు మరలనెవరినో వెదుకఁబంపినట్లు పంపి వారు పట్టి తీసికొనివచ్చినట్లుగా స్వామిని బయలుపరచిరి. కుమారునిఁ జూచిన పిదపఁ గృష్ణయ్య మనస్సు కుదుటఁబడెను.

అదిమొద లాయన కొంతకాలమువఱకుఁ గుమారునిఁ దిట్టుట తగ్గించెను. కృష్ణయ్యగారికి స్వామి పిదప మఱిముగ్గురు కుమార్తెలు గూడఁ గలిగిరి.

భజనలు

భజనయొనర్చుటకు హార్మోనియము తంబురా, మృదంగము మొదలైన పరికరములుకూడ సమకూరెను. స్వామి పలువురను జేర్చుకొని భజనమనోహరముగాఁ జేయుచుండెను. పూడివాడయందు నాగజెముడుమట్టలుగూడ రామరామ యనుచున్నవని దేశమునఁ బ్రజలు చెప్పుకొనిరి. స్వామి యేకాదశీవ్రతముచేయ నారంభించెను. వారితోపాటు పురుషులు స్త్రీలు కూడ బలువు రా వ్రత మాచరింపసాగిరి. ఏకాదశినాఁ డుపవసించు టయు,రేయెల్ల భజనలతో జాగరణమొనర్చుటయు, ద్వాదశిపారణ యొనర్చి వ్రతము ముగించుటయు జరుగు చుండెను. ఉపవసించి వ్రతమాచరించిన స్త్రీలు భక్తిశ్రద్ధలతోఁ బండ్లు, పెసరపప్పు, మున్నగు పదార్థములను దీసికొనివచ్చి వేణుగోపాలస్వామి కర్పించి భజన ముగించిన పిమ్మట నెల్లరకు నా భగవన్నివేదిత ప్రసాదములుపంచిపెట్టెడివారు. కేవలము భగవన్మందిరమందేకాక యూరిలోఁగూడ నొకొకరోజున నొక్కొక్కరి యింటిదగ్గఱ భజనలు చేయుచుండిరి. ఒకొక్క దినమున స్వామి పదిపండ్రెండుగురను వెంటఁదీసికొని సమీపముననున్న ముక్తిపల్లి యనునొక వైష్ణవాగ్రహారమునకుఁ బోవును. అచట శ్రీకోదండరామ స్వామివారి యాలయము కలదు. ఆ యాలయము, ముందుఁ దంబురాఁ దీసికొని స్వామి తెల్లవాఱువఱకుఁ దన్మయుఁడై గంతులువైచుచు భజనసేయుచుండఁగా వృద్ధవైష్ణవులెల్లరును నచట మూగి స్వామి విషయ మదివఱకే వినియున్నవారు గావున నానందముగా నా భజన వినుచు నాహా ప్రహ్లాదులవారే యని స్వామి నభినందించుచుండెడివారు. స్వామి తులసీదాస చరిత్రము, తుకారామస్వామి చరిత్రము, మున్నగు వానినిఁ దమ వ్రాసినకీర్తనలతోఁ బొదివి సమీపములనున్న గ్రామములకు నొకొక్క

రోజున రాత్రివేళ మృదంగము, తంబురా, మొదలైనవి పట్టించుకొని పోయి హరికథగాఁజెప్పి యచటివారినెల్ల నానంద తన్మయులను జేసివచ్చుచుండెడివారు. ఒక్కొక్క దినమున నూరిలోని యితరజాతులున్న పల్లెలకుఁబోయి యచటివారినెల్ల భగవత్కథా ప్రపంచమున నోలలాడించును. స్వామికీర్తివల్లిక దిగంతముల కెక్కిపోవుచుండెను. అందఱికిని వారియం దొకవిధమైన భక్తియు, నభిమానమును గుదురసాగెను. తరువాతఁ దరువాత స్వామి హరికథలకై సంగీతమునందును గొంతపరిశ్రమ యొనర్చెను. ఒక దినమున స్వామి స్నేహితు నొకనిఁదీసికొని పొలమునకు గడ్డవనిఁ జేయుటకు వెళ్ళెను. అచట స్నేహతుఁడు పలుగుపొడుచుచుండ స్వామి గడ్డఁదీయుచుండెను. అట్టి సమయమున నతఁడు పలుగునెత్తి వేయఁబోవుసరికి స్వామి యిచట వేయుమని కాలతోఁ జూపుచుండెను. అంత నాతఁడు స్వామి కాలు మరల తీసికొను వ్యవధిలో ఎత్తినపలుగు నాపలేక కాలిమీఁదనే వేసివైచెను. ఇరువురు చూచుచుండగనే బలముకొలఁది నెత్తి విసరివైచిన పలుగు స్వామికాలిమీఁదనే పడెను. ఠామ్మని పెద్ద మ్రోఁతమ్రోగెను. తన ప్రమాదమున కామిత్రుఁడు నివ్వెఱపోయెను. స్వామియు నా పలుగుపోటుచే శరీరము బండపాటిపోగాఁ గూర్చుండఁబడెను. కొంతవడి కిరువురును దేఱిచూడఁగా స్వామికాలిలో పలుగు దిగిపోలేదు. పడినచోటమాత్రము కొంచెము చర్మమురేఁగి చిమచిమ రక్తము కొలఁదిఁగా గ్రమ్మియుండెను. ఆ పలుగు వైచిన యతఁడు పలుగుకాలిలో దిగి, కొంతభూమిలోనికిఁ గూడ దిగియుండునని తలంచెను. కాని యేమాత్రమును దిగక స్వామికాలికి సోకి ఠామ్మని మ్రోఁతమ్రోగెను. దైవమహిమ మిది కేవలమని, యాతఁడు విభ్రాంతిఁజెందెను. అప్పటికే స్వామికి మాంసశరీరము మాఱి భగవన్నామ మహిమచే మంత్రశరీరమైయుండెను. "పరభీషణాయుధ పంక్తిలోపలనున్న నీ యనుగ్రహమున్న నిర్భయంబు" భగవదనుగ్రహము కలవారినిఁ గత్తులు గొడ్డళులు మొదలైన యాయుధము లేమిచేయఁగలవు ?

ఆచార్యాశ్రయణము

స్వామి యప్పుడప్పుడు ముక్తివల్లి యగ్రహారమునకుఁ జని భజన చేయుచుండఁగా నచ్చటి వృద్ధవైష్ణవులెల్లరు స్వామినిఁ బలువిధములఁ బ్రశంసించి "నాయనా నీ భక్తికిఁదగినట్లుగా సదాచార్యు నొకరి నాశ్రయింపుము., "గురువులేనివిద్య కూడదెందులకైన"నని పెద్దలు నుడివి" రని పరమనైష్ఠికులును, దేజస్వంతులును, దపోబలముగల వారును నైన శ్రీ వేదాల సీతారామాచార్యులవారినిఁ దగిన యాచార్యులని హితైషులైన యా వైష్ణవులు చూపిరి. మహాతేజస్వి యైన స్వామినిఁజూచి సీతారామాచార్యులు





పండిత, శ్రీ మొవ్వ వేంకటాచలపతిగారు,
(స్వామి రెండవ కుమారులు)

రామప్రసాదయ్యా గారు
(స్వామి నాలుగవ కుమారులు)

గారును నాచార్యకము వహించుటకు నభిలాషపడిరి. ఒక శుభదినమున స్వామి యట్లే శ్రీ సీతారామాచార్యులవారిని యథావిధిగా నాశ్రయించిరి. సీతారామాచార్యులుగారు మహాలౌకికుఁడు. ఎదుటివానిని నిమేషములోఁ దన వలలో వేసికొనుశక్తి వారికున్నట్లు మఱియొకరికి లేదు. ఆచార్యులుగా రప్పుడప్పుడు స్వామియింటికివచ్చి మాట్లాడిపోవు చుండెడివారు. వారి లౌకిక చాకచక్యము కృష్ణయ్యగారినిఁగూడ వశపరచుకొనెను. ఇట్లు వశపడిన కృష్ణయ్యగారితో నెట్లేనిఁ బోరాడి స్వామి సీతారామాచార్యులవారికి శాశ్వతముగా నొకయెకరము మాగాణిభూమిని గురుదక్షిణగా నిప్పించెను. స్వామిది మహా యుదారస్వభావము. భగవద్విషయములో సరేసరి భక్తుల విషయములోను, యాచకుల విషయములోను, గూడఁ దన కుందునా? పోవునా? యను విచక్షణ లేకుండ నిచ్చివైచెడివారు. పూడివాడకు మూడుక్రోసుల దూరమునఁ బెద్దవరమను నగ్రహారము మఱియొకటి కలదు. ఇందును గొంతమంది వైష్ణవులు గలరు. స్వామి కచట బందుగులు కలరు. వారినిఁజూచుటకు నప్పుడప్పుడు నచటికి వెళ్ళిన స్వామినిఁజూచి యచటి వైష్ణవులావిలక్షణత కెంతేనియు నానందపడెడివారు. వారిలో శ్రీ సముద్రాల లక్ష్మణాచార్యులుగా రొకరు. వీరు మహాపండితులు. సహజముగా భగవదిచ్ఛానువర్తియై వచ్చిన స్వామి వైష్ణవమునకు మెఱుఁగుపెట్టి శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంత మర్మములన్నియుఁ గనఁబడినప్పుడెల్ల వీరే తెల్పిరి. ఇటీవల నాచేసిన తర్క వేదాంత శాస్త్రాధ్యయనమును వీరి సన్నిధినే.

శ్రీరామజయంతి

స్వామియందు నూరివారెల్లరకు గౌరవప్రతిపత్తులు ముదిరెను. వారివాక్యమును బ్రతిదానిఁ బ్రజలు మహాదరముతో శిరసావహింపసాగిరి. అట్టిసమయమున గ్రామములో వేంకటసుబ్బయ్యగారు మొదలైన భక్తుల వెంటవేసికొని చందావసూలుచేసి శ్రీరామనవమీ మహోత్సవ మత్యంతవైభవముగా జరుపసాగెను. ఆకాలమున నీప్రాంతమున శ్రీరామనవమి చేయువాడుక యెచటను లేదు. రెందురోజు లఖండమైన యన్నదానముఁ గావించెడివారు. ప్రాంతములందున్న పరగ్రామీణులగు బీద లీ శ్రీరామనవమి యెప్పుడువచ్చునా యని కనిపెట్టుకొనియుండెడివారు. స్వామిగావించిన యా సంతర్పణలందుఁ దృప్తిపడిన పేదలిప్పటికిని జెప్పి యానందపడుచుందురు. శ్రీరామనవమి నీ విధముగా స్వామి షుమా రొక యిరువదిసంవత్సరములు నిర్వహించెను. గ్రామములో నందఱుఁ బారమార్థికపరులే యుండరుగదా! కొంద ఱల్పబుద్ధులు మా జీతగాండ్రకు సరిగా నన్నము పెట్టలేదనియు, మా పిల్లలకుఁ బ్రసాదము నందఁజేయలేదనియుఁ, దేలికగా మాటలాడఁ జొచ్చిరి. అందులకు రోఁతవేసి దేవాలయప్రతిష్ఠతో నాయుత్సవమును స్వామి విరమించెను.

భీతులకభయము

పూడివాడలోఁ బడమటి భాగమున రెడ్డిపల్లె యొకటున్నది. ఒక సంవత్సరమునఁ గలరావ్యాధి యాపల్లెయందు వ్యాపించెను. పెక్కుమంది మడిసిరి. పల్లెయంతయు మహాభయోత్పాతముతో గడగడ వడఁకి పోవుచుండెను. ఇండ్ల తలుపులు బిగించుకొని జనము లోపలినుండి బయటికి రాఁజాలకపోయిరి. ఇతర ప్రాంతీయు లిఁకఁ గన్నెత్తియైనఁ జూడకుండిరి. దినమునకు నలుగురైదుగు రా దుష్టవ్యాధితో సమసిపోవుచుండిరి. అచటివారి భయమునకు మేరలేకుడెను. అట్టితటి నొకనాఁటి యర్ధరాత్రమున నలువురు స్నేహితులను దీసికొని స్వామి రెడ్డిపల్లె మధ్యకేగి, శ్రీమద్రమారమణగోవిందాహరీ! యని పెద్దగా భగవన్నామ ముచ్చరించి భజనచేయ మొదలిడెను. అంత నచటివారెల్ల నప్పుడు ప్రాణములు చేరుకొనఁగాఁ దలుపులు దీసికొని వచ్చి స్వామి చుట్టునుమూగి తమబాధలు చెప్పుకొని పలువిధముల నేడ్చి రక్షింపుమని నమస్కారములు చేసిరి. అంత వారి కభయమిచ్చి స్వామి "మీ కిఁక వేఱుపాయములేదు. ప్రతిదినమును రామభజన మొనర్పుడు వెంటనే యీ దుర్వ్యాధి నశించు"నని ధైర్యముచెప్పి; పంద్రెండుగురికిఁ దీర్థమిచ్చి తెల్లవాఱువఱకు మహత్తరముగా భజన చేసి యింటికివచ్చెను. ఆ పంద్రెండుగిరికినిఁ గలరా తగ్గిపోయి బ్రతికిరి. అట్లేవారును రామభజన మొదలిడిరి. స్వామి యట్లే రెండుమూడు రోజులువోయి భజన గావించెను. వారి భయమును శాంతించెను. నాఁటి నుండియు నా దుష్టరోగము కొలఁదిదినములలో నశించిపోయెను. ఇప్పటికినిఁ గలరా వ్యాధిప్రబలినచోట రామభజనమే శరణ్యము. ఇతర సమయములందు దైవములేఁడని వాదించి, కలరా యూరఁబ్రబలగా నన్యోపాయముల దాని నడంపలేక మరల రామభజనలుచేసి దాని బాఱినుండి తప్పించుకొనిన గ్రామము లనేకములు మాయనుభవములో నున్నవి. పవిత్రులైనట్టివారి నట్టి పాడువ్యాధులు సమీపింప లేవు. భగవద్భక్తులైనవారి నిఁకఁ జెప్పవలసిన పని యేమున్నది ? వారికటువంటి వ్యాధులు, భూతప్రేతపిశాచాదులు సోకుననెడి భయముండనే యుండదు. నిజముగా నవి వారి నాసింపఁజాలవు.

పరభీషణాయుధ పంక్తిలోపలనున్న
నీ యనుగ్రహమున్న నిర్భయంబు
దావపావక శిఖాంతరమున దూరిన
నీ యనుగ్రహమున్న నిర్భయంబు.
మత్తేభ శార్దూల మధ్యంబులోనున్న
నీ యనుగ్రహమున్న నిర్భయంబు

ఘోరనక్రగ్రాహ వారిలోపల నున్న
నీ యనుగ్రహమున్న నిర్భయంబు
క్షితిని నీవారి నెవ్వరు చెనకఁగలరు ?
భావజవిలాస! హంసలదీవివాస!
లలితకృష్ణాబ్ధి సంగమస్థలవిహార!
పరమకరుణాస్వభావ గోపాలదేవ!
(కాసుల పురుషోత్తమదాసుగారి వేణుగోపాల శతకము)

పండరియాత్ర

కోయిల్‌ధనాల దేవరాజదాసుగారి భక్తవిజయ మొకటి స్వామికిఁ జిక్కెను. దాని నామూలాగ్రముగాఁజదివిస్వామి, యాశ్రితులైనవారికెల్లరకుఁ బెక్కుసారులు వినిపించిరి. దానిలోని భక్తిరస ప్రభావమున వినినవారికెల్లరకును నందలి భక్తులవలె భగవంతుని సాక్షాత్కరింపఁ జేయవలయు ననెడి పట్టుదలగలిగి భక్తి యభివృద్ధి నొందెను. స్వామికిని భక్తిక్రీతుఁడైన పాండురంగని దర్శింపవలెనన్న యభిలాషముగట్టిగా నుదయించెను. భక్తులును దానికంగీకరించి తాము కూడ దర్శింపనెంచిరి. స్వామి యట్లు పండరియాత్ర భక్తులతోఁగూడఁ జేయవలయునని తగుయత్నము చేయుచుండెను. ఈ సంగతి కృష్ణయ్య గారికిఁ దెలిసెను. ఆయనగుండె ఝల్లుమనెను. విచారించి నిజము తెలిసికొనెను. "అబ్బో యెక్కడిపండరి. మనదేశముగాదు. మనభాషగాదు. మనవారెవరును నచటలేరు. పైగా నెంతడబ్బు కావలయును ? ఇది చాలదుర్ఘటము. అసలు కుమారుఁ డచటికేగిన నేయడవుల లోనికో తపసియై వెళ్ళిపోయి, మరల గృహమునకుఁ దిరిగిరాఁడని యాయన భయము. యాత్రమానుటకు స్వామియంగీకరించక ప్రయాణ సన్నాహములు చేయుచుండెను. కృష్ణయ్యగారును నూరిలోని పెద్ద మనుష్యులను, సీతారామాచార్యులుగారినిఁ గూడఁ దీనికొనివచ్చి, కుమారు నాప్రయాణోద్యమమును మానుకొనవలసినదిగాఁ జెప్పుటకుఁ గోరెను. వారెల్లరును గ్రోగై స్వామినిఁ బిలిచి "మీ తండ్రి చాలఁ జింతపడుచున్నాఁడు. పండరి చాలదూరదేశము. మఱియొకసారి పోవచ్చును. ఇప్పటికి మాత్రమే మీప్రయాణమాపుడ"ని యేవేవో చెప్పఁజొచ్చిరి. స్వామికి మొదటినుండియు నొక స్వభావమున్నది. అక్రమమైన చేఁతకెప్పుడు నుపక్రమించెడివారు కారు. సత్కార్యమును జేయునప్పు డడ్డు చెప్పెడివారిపై వారికి మహాకోపము వచ్చెడిది. కోపమువచ్చి వాదమున కారంభించిన నిఁక బ్రహ్మంతవాఁడైనను స్వామికి సమాధానము చెప్పలేఁడు. ఆ యుక్తులు, నావాగ్ధోరణిక్రమము వేఱుగా నుండెడిది. అందువలన స్వామి పండిరియాత్ర మానుమని

చెప్పవచ్చిన పెద్దమనుష్యులతో "నేనేమి చెడుపని చేయఁబోవుచున్నానని మీరందఱు కలిసి నాకుఁ జెప్పవచ్చితిరి? చెడు పనులు చేయువారినెల్ల నూరిలో, నేల నియమింపరైతిరి? పండరీ క్షేత్రమున కేగి రంగనిసేవించుట దుష్కార్యమని, వలదని, చెప్పవచ్చితిరా? 'యుక్తి యుక్త వచో(గ్రాహ్యం బాలాదపి శుకాదపి' క్రమమైన వాక్యమును బాలుఁడు చెప్పినను జిలుక చెప్పినను గ్రహింపవలసినదేగాని యక్రమము నెవరు చెప్పినను వినరాదు. మీరు పెద్దమనుష్యులేయైనను నన్యాయము చెప్పవచ్చితిరిగాన మీ మాటలు నేను విననని. పండరికి మాత్రము వెళ్ళకమానను" అని తిరస్కరించి ఖండితముగాఁ జెప్పి వైచెను. వచ్చినవారెల్లరు స్వామికి సమాధానము చెప్పలేక తిరిగి వెళ్ళిరి.

కృష్ణయ్యగారును జేయునదిలేక కుమారుఁడు వెళ్ళి తిరిగి యింటికిరాఁడేమో యన్న భయమునఁ దానుగూడ పండరికి వెంట వెళ్ళుటకు నిశ్చయించెను. వేంకటసుబ్బయ్యగారు మున్నగు భక్తులు పదునైదుగురు స్వామివెంట నరుగుటకు సిద్ధపడిరి. దివి తాలూకాలో మోదుమూడి యను మంచి కాఁపుటూరుగలదు. అందు సోమమ్మ గారను నొక మహాసాధ్వి గలదు. ఈమె కిద్దఱు కుమార్తెలు గలుగగానే భర్త మరణించెను. ఈమె కలవారి యింటి యాడుఁబడుచు. భర్తవైపునను నిరువది యెకరముల భూమి యున్నది. ఈమె తన మొదటి కుమార్తెయైన రేణుకమ్మగారినిఁ దమ్మునికీయ నిశ్చయించుకొని, రెండవ కూఁతురైన రాధమ్మగారికిఁ దగిన సంబంధమరయుచు, స్వామి విషయమును విని, ఆస్వామినిఁ జూచుటకై యప్పటికిఁ బూడివాడకు వచ్చియుండెను. సోమమ్మగారు తెలివితేటలుగలది. కాక పుణ్యభాగ. అందువలనను నామె స్వామినిఁ జూడఁగనే యానందపడి కూఁతునీయ నిశ్చయించుకొనెను. సమయమున కచ్చటనుండుటచే నిరుగుపొరుగువారు సోమమ్మగారినిఁ గూడ "మరల నీవెప్పుడు చూడఁబోయెదవు ? పాదురంగని దర్శింపవచ్చును. మంచి సహవాస" మని పండిరికిఁబోవఁ బ్రోత్సహించిరి. ఆమెకు దబ్బు కొఱఁతలేదు నిర్బంధించు వారెవరును లేరు. కనుక నామెయు స్వామితోఁగూడఁ బందరి పోవ సమకట్టెను. ఇట్లు తల్లిదండ్రులతోడను, సోమమ్మగారితోను, భక్తబృందముతోను, స్వామి యొకశుభముహూర్తమునఁ బ్రయాణము సాగించెను. బెజవాడనుండి హైదరాబాదు మీదుగా బొంబాయిపోవు మార్గమున నేగి పారసీరోడ్డుదగ్గఱ బండిమారుటకై ధూమశకటము దిగిరి. దిగి, యచట విచారింపఁగాఁ బందరిలో ప్లేగుజాడ్యమున్నదనియు నందువలనఁ బందరికి యాత్రికులను బోనిచ్చుటలేదనియుఁ జెప్పిరి. ఈ మాట వినుటతోడనే స్వామికి యావజ్జీవము క్రుంగెను. భక్తులెల్లరు విచారపడిరి. అచటనే, యేచెట్టుక్రిందనో బసచేసి భోజనములైన పిదప నిజముఁ గనుకొనుటకై స్వామి వేంకటసుబ్బయ్యగారినిఁ దీసికొని తదధికారుల నడుగఁజనెను. వెళ్ళి యొక యధికారి నడుగఁగా, నతఁడు పండరికిఁ బోవ వీలులేదని

చెప్పెను. ఆమాట వినగానే స్వామి మూర్ఛపడెను. ముఖము నల్లనైపోయెను. స్మృతిచెడి, యవశుండై నేలంబడబోవుచుండెను. వెంటనే వేంకటసుబ్బయ్యగారిదిచూచి విభ్రాంతుండైస్వామినిం గ్రిందంబడకుండం జేతులతోం బట్టుకొని చూడంగా స్వామి శరీరములో జీవమున్నట్లు తోంపలేదు. పాప మాయన నిర్విణ్ణుండై స్వామినెట్టెట్లో మోసికొని యావలికిం దీసికొనివచ్చి యొక చెట్టుక్రింద బరుండంబెట్టి తమవారికింజేయివీచెను. వారెల్లరును రైలునకుం గాబోలునని మూటలు ముల్లెలు నెత్తుకొని వచ్చుచుండిరి. ఆమూట లచట విడిచి రండని మరల వేంకటసుబ్బయ్యగారు కేక వైచెను. అంత వారువచ్చి విషయమెఱింగిరి. పిలిచినను స్వామి పలుకుటలేదు. చుట్టునుమూగి తల్లియైన కృష్ణవేణమ్మ, భక్తులును మెల్లమెల్లగా నేడ్చుచుండిరి. బిగ్గరగా నేడ్చినం గృష్ణయ్యగారికిం దెలిసిపోవును. ఆయనకుం దెలిసిన నింక బ్రతుకులుండవు. ఆయనవెంట వచ్చుటయు వారికి బాధాకరమేయై యుండెను. ముఖమున మంచినీళ్లు మొదలైనవి చల్లగా గొంతవడికి స్వామి కనులు విప్పెను. అప్పటికి వారికెల్లరకు మనసులు కుదుటంబడెను. స్వామి లేచి మెల్లగాం దనవారితో మునుపున్న చోటికి వెళ్ళెను. పందరి యాత్రికులు వేలకొలదింగా జెండాలతో, జయజయ ధ్వనులతో మూంగుచుండిరి. పందరికిం బోనిచ్చుటలేదన్న మాట విని యొకరికొకకు చెప్పుకొని విషాదపడుచుండిరి. స్వామి విచారమును జూచి వృద్ధుండైన యొక పాండురంగభక్తుడు "ఎందుకురా నాన్నా చింత ? పాండురంగండు భక్తులెవరు లేక యుత్సవ మెట్లుచేసి కొనునురా! వాండే సెలవిచ్చును. ద్వరపడవల"దని ధైర్యముచెప్పి యోదార్చెను. మహారాష్ట్రభాషయుం దెలుంగును, వచ్చిన యొక పందరీయాత్రికుండు స్వామికి బెజవాడలోనే కలిసి స్నేహమై వెంట వచ్చుచుండెను. అతని సహాయమువలన స్వామి యచటివారనెడి మాటలు తెలిసికొనంగలిగెను. ఆనాంటి తెల్లవారుజాముననే ప్రభుత్వము యాత్రికులను బందరికి బోవవిడిచెను. అట్లు భక్తకోటియంతయు బందరికిం జేరిరిగాని చంద్రభాగానది యావలియొద్దుననే ప్రభుత్వము వలన నచట కాంపురముండువారెల్లరు చంద్రభాగ యావలికి వలసవచ్చి గుడారములందు నివసించుచుండిరి. నదిలోని త్రోవలయందుం ప్రభుత్వోద్యోగులు కావలియుండుటచే దొంగతనముగానైనను నావలికిం బోయి పాండురంగని దర్శింప నెవరికిని యాత్రికులకు, వీలుగాకపోయెను. కాషాయధారులు, జెండాలు పట్టినవారు తులసీ నళినాక్షమాలలు ధరించినవారు, బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు, సన్యాసులు, గుంపులుగుంపులై కరతాళములు వాయించుచు, పాండురంగనామ ముచ్చరించుచు, వేలు లక్షలుగా భక్తులు చంద్రభాగా తీరమున మూగిపోయిరి. ఒక వారమురోజులు గడచెను. అప్పుడుద్యోగులు యాత్రికులను పాండురంగని సేవింప వదలెను. నేలయీనినట్లుగా యాత్రికులెల్లరు మహానందముతో నది నుత్తరించి, పాండురంగాలయమునం బ్రవేశింపందొడంగిరి. ఇట్లు

తన పరివారముతో స్వామి విరోధికృతు సంవత్సరమునఁ గార్తీకశుద్ధైకాదశీ దినము నాలయమునఁ జొచ్చి యచ్చట.

కటితలంబున హస్తకమలయుగ్మము మోపి
యిటుకరా తిన్నెపై నెసఁగువాని
నిద్దంపుతళుకారు నీలదేహముమీఁద
ధవళోపవీతంబు దనరువాని
బ్రహ్మాదిదేవతల్ ప్రస్తుతింపఁగలేని
మహనీయ పాదపద్మములవానిఁ
బరికించు వారికి భాగ్యంబు లిగురింప
నెడమ నిందిరఁగూడి యదరువాని
దర్శన స్పర్శనంబుల ధరణినెల్ల
దురితసంసార తాపముల్ దొలచువాని
వినుత హరిచందనోద్దీప్త తనువువానిఁ
బాండురంగనిఁ దిలకించి ప్రస్తుతించె.

ఇట్లు స్వామి పాండురంగదేవుని దర్శించి బహుజన్మానుగత తాపంబులు సదలిపోవ నద్దేవాదిదేవునిఁ గౌఁగిలించుకొని, యానంద బాష్పంబులు స్రవింప దేహంబు మఱచి తన్మయత్వంబున, నృత్యంబు గావించుచు, భజనచేయుచుండె. అట్టితఱి నెవ్వరో తపస్వినియైన యొక యోగిని మహాజనమధ్యంబులోనుండి సరాసరి స్వామి యెదుటికి వచ్చెను. ఆమె బంగారుచాయగలిగిన పలుచని శరీరముతోఁ బ్రకాశించుచుండెను. ప్రాయము పశ్చిమమునకుఁగ్రైవ్రాలెను. తలవెంద్రుకలు కలమెల నరసిపోయెను. గావిగుడ్డ ధరించియుండెను. అట్లు వచ్చి యామె స్వామినిఁ గౌఁగిలించుకొని చెక్కులు ముద్దాడి మహారాష్ట్ర భాషతో "ఇతఁడు ఖరనామసంవత్సరాశ్వయుజ శుద్ధ దశమీ మంగళవారము నాఁటిరాత్రి నెదురుకాళ్ళతో జన్మించెను. అఖండ దైవభక్తుఁడు గావలసిన యోగమున్నది. ఇతని పాదస్పర్శనము చేసిన వారి పాపములెల్ల నశించును. ఇట్టి మహాపూరుషులు దైవసంకల్పమున లోకోద్ధరణమునకై యవతరింతు"రని పలుసారులు స్వామిని ముద్దాడెను. వెంటనున్న స్నేహితునివలన నామె మాటలు నెఱింగి స్వామి యామె పాదముల కెరగెను. పిదప నా యోగిని యెటువోయెనో, యెవరికినిఁ గానరాకపోయెను. పందరినాధుని నాఁటి యుత్సవ వైభవంబు గొనియాడుటకు సహస్రముఖములు గల యాదిశేషునకును శక్యంబుగాదు. భక్తు లొకరికొకరు సాష్టాంగములు సల్పుచుఁ బరస్పరము హస్తములు బట్టుకొనినృత్యము గావించుచు, భగవన్నివేదిత ప్రసాదితము లొకరినోట మఱియొకరు


వెట్టుచు, నానందతన్మయులై యుండిరి. భగవదుత్సవము నీవిధి సేవించి స్వామి తనపరివారముతో వెనుకకుఁ దిరిగెను. హైదరాబాదులో దిగి యచట భద్రాచల రామదాసుగారు బందీయైయున్న స్థలమును, జూడవలయునని తలంచెను, గాని పండరి యాత్రికులని తెలిసికొని యచట జాడ్యమున్నదని యెఱిఁగి యుండుటచే వీరినిఁ ప్రభుత్వము గంగాపూరులోనే దింపి నిలుపుదల చేసెను. చేయునదిలేక స్వామి యచట నధికారులు చూపిన యొక డేరాలో నాఁడు నివసించెను. స్వామి వెంటఁ బండరికి సీతమ్మ యను నొక వృద్ధురాలు వచ్చెను. ఆమెకు సంతానము లేదు. ఇంటినుండి బయలుదేఱునపుడే యామె తనవారికందఱికి మరల వత్తునో రానో యని, యప్పగింతలిడెను. పండరియందును నామె చంద్రభాగలో స్నానముచేసి పాండురంగని పాదలములంటి "ప్రభూ!నాకిఁకఁ బ్రపంచము వలదు. నీ సన్నిధియందే నాకు దేహత్యాగముఁ బ్రసాదింపుము. నీయొద్దకు నన్ను జేర్చుకొను" మని మహార్తితో బ్రార్థించెను. గంగాపూరులో వీరెల్లరు దిగియుండఁగా, రెండవరోజున నామెకు విరోచనములు, వాంతులు గలరామాదిరిగాఁ బ్రారంభించెను. అదిచూచి యధికారులతోఁ జెప్పకున్న నేమిమోసమో యని, పోయి స్వామి యనుజ్ఞ చొప్పునఁ గొందఱు చెప్పిరి. ఉద్యోగులును వచ్చిచూచి, యుపవాసముండి జామపండ్లు తినుటవలనఁ గలిగిన యజీర్ణమని నిశ్చయించి పోయిరి. ఆ రాత్రి యామె యాఁకలి యగుచున్నదని యన్నము వండించుకొని గంజిలోఁగలిపించి యా యన్నరసమును గడుపారఁద్రావెను. విరోచనములు వాంతులు నాగిపోయెను. కాని యా ముదుసలి యవ్వ మూడవనాఁ డుదయమున పాండురంగ సాన్నిధ్యము నొందెను. ఆమె మృతివార్త నచటి యుద్యోగులకుఁ జెప్పి, స్వామి పరివారములోని కొందఱాశవమును దీసికొనిపోయి ఖననము గావించి వచ్చిరి. ఈ విషయము జరుగుటవలన వీరున్న గుడారమును బీఁకి మరలఁ గొంతదూరములో వైచిరి. కృష్ణయ్యగారీ కలిగిన విషమస్థితికిఁ బలువిధముల వగచుచుఁ గుమారుని, భార్యను నదేపనిగాఁ దిట్టుచుండెను. స్వామియు వేంకటసుబ్బయ్యగారును మరల నెవరికేని గలరా దగిలిచో వీరిని విడిచి, యిటే యరణ్యములలోనికిఁ బోయి తపస్సు చేసికొందమని నిశ్చయించుకొని యుండిరి. ఇంతలో నొక రైల్వేయుద్యోగి వచ్చి వీరికి నింటికిఁబోవ సెలవిచ్చెను. కలిగిన సంఘటనమువలనఁ జింతాకులుఁడై యున్న స్వామి, యా యాకస్మిక భగవత్కరుణ కెంతయు సంతసించి, యనుచర వర్గముతో మరల బయలుదేఱెను. కాని సెలవిచ్చిన యుద్యోగి హైదరాబాదు మీఁదుగాఁగాక, వాడి మీఁదుగా మార్గము నొసఁగెను. ఎట్లైన నిల్లుచేరుట ప్రధానమని యట్లే రెండు మూడు రోజులు ప్రయాణముచేసి గుంటూరు చేరిరి. అప్పటికిఁ దమ దేశము జేరినట్లుండెను. అచటినుండి బెజవాడపోయి కృష్ణాస్నానము గావించి, తెనాలిమీఁదుగా వచ్చి పొన్నూరిలో బండిదిగి, వారిండ్లు చేరిరి. తన యిరువదియొకటవ యేట నిట్లు పండరియాత్రఁ గావించి

స్వామి యచటి వైభవమంతయు నప్పుడొక రగడగా వ్రాసెను. అది యీ పుస్తకము చివర ననుబంధముగా వేయఁబడియున్నది.

వివాహము

పండరియాత్రకు వెళ్ళినవారిలో నొక ముసలమ్మ యచటనే మరణించినదన్నవార్త గ్రామములయందుఁ బ్రాకెను. మోదుమూడిలో నీ కబురు విని సోమమ్మగారి కుమార్తెలును బంధువులును, నా చనిపోయినది, సోమమ్మగారేమో యని మిక్కిలి దుఃఖించుచుండిరి. ఇంతలో స్వామికిఁ దన కుమార్తెనిచ్చుట దృఢము చేసికొని క్షేమముగా నామె యిల్లుచేరెను. అందుల కామెవారెల్లరు, సంతసించిరి. కాని స్వామికి మొదట నది భక్తిదశ యని యెఱుంగక పిచ్చి యని దేశము భ్రమించెనుగదా. యీ యపవాదమే దూరమునందు నప్పటికిఁ బ్రసరించి యుండెను. తరువాతఁ దరువాత నది భక్తిమహాదశ యని, జనులు గుర్తించిరి. కాని యీ విషయ మప్పటికిఁ బరిసరములు దాఁటి దూరముపోలేదు. మొదటి యపవాదమే దూరదేశములందు నిలిచి యుండెను. అందువలన సోమమ్మగారి బంధువులందఱును "నయ్యో నతఁడు పిచ్చివాఁడని లోకము చెప్పుకొనుచున్నది. అట్టివానికిఁ బిల్ల నెట్లిచ్చెదనని యొప్పుకొనివచ్చితి"వని తలయొక వైపున నామెను దూయఁబట్టిరి. స్వయముగా స్వామినిఁ జూచివచ్చిన సోమమ్మగారు, వారి మాటల లక్ష్యముసేయక, వారికిని సత్యము తెలియుట కైస్వామి నొకసారివచ్చి యచటివారికిఁ గనఁబడిపొమ్మని, యెవరితోనో కబురు చేసెను. అంతట స్వామి వేంకటసుబ్బయ్యగారిని వెంటఁదీసికొని మోదుమూడికిఁ బైనున్న యొక యూరికిఁబోయి, తిరిగివచ్చునప్పుడు మోదుమూడి కేగెను. ఆ గ్రామవాసులందఱును విభ్రాంతిగా స్వామినిఁ జూచిరి. ఆహా పిచ్చియెక్కడ ? జగన్మోహనమైన రూపము! తేరి చూడరాని బ్రహ్మవర్చసము ముఖమున నిండారివెలుఁగొందుచుండెను! స్వామికి నదురు, బెదురు క్రొత్తప్రాఁతయు లేదు. తన దివ్యకంఠమెత్తి పాడుచుఁ బద్యములు చదువుచు నుపన్యసింపసాగెను. "పిచ్చివాఁడాయనకుఁ బిల్లనీయ వల"దన్న వారందఱు సోమమ్మగారి కీయల్లుఁడు ప్రాప్తించుట మహాభాగ్యమని వేనోళ్ళఁ బ్రశంసించిరి. సోమమ్మగారి తండ్రి తాతయ్య. వీరికాఁపురమొక చిన్న రాజసంస్థానమువలె నుండెను. స్వామికి వారియింట విందుచేసిరి. అప్పటికింకను స్వామికిఁ బెంపుడు జుట్టున్నది. స్వామికి భోజనము వడ్డించుటకు వారి స్త్రీలెల్లరు భయపడిరి. ఎవరో యొకామె ధైర్యము చేసికొనివచ్చి స్వామి దివ్యతేజమునకుఁ దత్తరపోయి మూడుసోలలనేయి నీటఁగలిపి పాడుచేసివైచెను. ఒకటి రెండు రోజులుండి స్వామి యింటికి వచ్చెను.

తరువాతఁ గొన్నిదినములకు శుభలగ్నము నిశ్చయించిరి. కృష్ణయ్యగారు తగిన



పరిధవములతో నేగి కుమారుని వివాహ మహోత్సవమును మహా వైభవముగా నెఱపెను. పిమ్మటఁ గోడలైన రాధమ్మగారితోఁ గుమారునితోఁ గృష్ణయ్య బంధుయుతముగాఁ దిరిగివచ్చి గృహప్రవేశముఁ గావించెను. కాని భగవత్సంకల్పమేమో యింతలోఁ గొలఁదికాముసకే శ్రీస్వామి వారి చెల్లెలు, మహా సుందరరూపయు సద్వృతమేధావంతురాలును, సుగుణ సంపన్నురయు నైన బాపమ్మ యనునామె సర్పదష్టయై కాలగతినొందెను. అందువలన వారికా వివాహ మహోత్సవానందమును సంపూర్ణముగా ననుభవింప వీల్గాకపోయెను.

నటకత్వము

స్వామి యుత్సాహసంపత్తి గణింపరానిది. ఆ కాలము వీధినాటకము లెక్కువగా నాడుచుండెడివారు. గొల్లభాగవతులు నీతముక్క లజంగములు, మాదిగలలో భోగజాతి యను నొక తెగయుఁ, గూచిపూడివారును, నప్పటి నటకవర్గములలోఁ జేరుగన్నవారు. గొల్లభాగవతులలో గురవప్ప యనునాతఁ డొకడప్పుడు గుంపుగట్టుకొని, గ్రామములలోనికి వచ్చి, పెద్దవారి నాశ్రయించి, నాటకమాడుచుండెడి వాఁడఁట. అతని వేషమును, గాత్రమును, నింతింత మనోహరములని చెప్పవలనుపడదు. రుక్మాంగద, చెంచులక్ష్మి, ప్రహ్లాద మున్నగు నాటకములలో నతఁడు స్త్రీ వేషమును ధరించి యొయ్యార మొలికిపడఁ గులుకుచుఁ బాడుచుండగా, జనులు పరవశులైపోయెడి వారు. అప్పటి నటకు లభ్యాసవశమున నేమి శిక్షణము వలననేమి క్షుణ్ణముగాఁ గథాభాగము నప్పగించుచుఁ బాత్రను బోషించుకొనుచు రసమొప్పించెడివారు. ఇప్పుడును నటనేచ్ఛ జనులలోఁ బ్రబలముగానే యున్నది గాని, చదువుటకు మాత్ర మొడలువంగదు. వేషము వేసికొని బయటికి వచ్చి జనులఁ గలయఁజూచి కథాభాగమును మఱచి గ్రుడ్లు మిటకరించుచు వెనుకఁ దెరలో మెల్లగానందిచ్చునదైనను (Prompting) నందుకొనలేక "ఏమో బాగా వినఁబడుట లేదు బిగ్గఱగాఁజెప్పు" మని నాటక భాగమునకు బదు లీ వాక్యమునే పలుమాఱు లుచ్చరించుచు జనులెల్ల నొక్కసారిగా నవ్వి చప్పటులుగొట్ట సిగ్గుపడి లోనికేగు నూత్న నటకులు కుక్క గొడుగులవలెఁ బెక్కు రూరనూర వెలువడుచున్నారు. ఇట్టివారి నాటకాభినయమున రసమేమి యుద్భవించును?

స్వామి మహోత్సాహి యగుటచే నితరులాడు నాటకము లెల్లఁజూచుచుఁ దానుగూడ నభినయింప వాంఛపడెను. తగినపరి జనమునెల్ల రావించి, వారికిఁ దానే నేర్పమొదలిడెను. స్వామి యేపనిచేసినను నది యతుకుమెతకగా నుండఁగూడదు. తీర్చిదిద్దినట్లున్ననే వారి మనస్సొప్పును. సహచరుల కొక సంవత్సరము మేర గట్టిగా నాటకములందు శిక్షణమిచ్చెను. అప్పటికందఱికి మూడు నాలుగు నాటకములయందు మంచినేర్పుగలిగెను. కావలసిన దుస్తులు, కిరీటములు, భూషణములు, వారే

తయారుచేసికొనిరి. అప్పుడు బాహిరముగా స్వామి తమ యనుచరులతో ముందు హరిశ్చంద్ర నాటక మభినయించెను. వేంకటదాసస్వామి నాటక పాత్రధారణము చేయుచుండిరనఁగనే, వేలకొలఁదిగా జనము మూఁగిరి. ఆ నాటకమున వారు హరిశ్చంద్రపాత్ర ధరించిరి. స్వామి వేషము, పాట, యభినయము జనుల ముగ్ధులఁగావించెను. స్వామిచేసిన కఠినశిక్ష నొఱపిడి గన్నవారగుటచే నితరపాత్ర ధారులును సొంపుగా నభినయించిరి. ఇట్టి నాటక మింతవఱకుఁ బుట్టినతరువాతఁ జూడలేదని పెక్కురు నాటకము నానందించిరి. పిమ్మట రామనాటక మభినయించి స్వామి యందు లక్ష్మణపాత్ర నభినయించెను. ఇట్లయిదాఱు నాటకములాడి యొక రోజునఁ బ్రొద్దుననే స్వామి భావియొద్ద ముఖము రంగుఁగడుగుకొను చుండెను. అట్టి సమయమున దగ్గరియూరి పెద్దమనుష్యునిఁజూచి రాత్రి నాటకమెట్లున్నదని ప్రశ్నించెను. అందుల కాతఁడు "స్వామీ! మీరాడిన నాటకమునఁ గొఱంతయేముండును. సర్వతస్సుందరముగా నున్నది. గాని, మీబోటి మహాత్ములకు మాత్రమీ నాటకమాడుట తగినపనిగాదని లోకమనుకొను చున్న"దని మెల్లగా నుడివెను. స్వామి మానసము చివుక్కుమనెను. తానే పొరపడితినని గ్రహించెను. అది జనమోహనకరమగుకళయే యగుఁగాక. స్వామి నటవిటగాయకాదుల యందుఁ జేరఁదగినవాఁడా? లోకమును బునీతముఁగావించు పరమ హంస యెక్కడ? నాటకాభినయనమెక్కడ? ఇట్లు తన ప్రమాదమును గుర్తించి నాఁటితో స్వామి నాటకాభినయనమునకు స్వస్తివాచనము పలికెను.

వరదలు

కృష్ణానదికి బారునఁ బ్రభుత్వమువోయించిన కఱకట్ట లప్పటి కింతదృఢముగా లేవు. స్వామి వివాహమైన రెండవసంవత్సరము మున్నంగియొద్ద కట్టతెగి కృష్ణ యూళు లమీఁదఁబడెను. నాటిన చేలన్నియు మునిగిపోయెను. మొదటివఱదవచ్చి తగ్గిన యొక వారమురోజులకే మరల వరదవచ్చి సర్వదుంబాళా చేయుచు గ్రామములమీఁదుగా బోయి సముద్రమునఁబడెను. మొట్టమొదట వఱద యూళ్ళలోనికి రానీక, బంధింపవలయునని, గ్రామములచుట్టును, జనులు గట్టలువేయఁ బ్రయత్నించిరి. కాని శక్యముగాకపోయెను. ఊళ్ళలో వీధులందుండును బడవలాడి జనుల యవసరములు తీర్పవలసి వచ్చెను. వరదలు మునిగిసపిదప నెవరికివారు తిండికి సరిపోవునట్లైన భూమి నాటుకొందముగదా యని తిరుగ, నా రెచ్చటను దొరకకపోయెను. వఱదలు ప్రవహింపని మెరకగ్రామములకేగి, యెట్లెట్లో జనులు కొలఁదికొలఁదిగా సంపాదించువఱకు గగనమాయెను. స్వామియు దీవిసీమకేగి యచ్చో వెదకివెదకి సాధించి, నారుఁదెచ్చి పలుబాములతోఁ గొంతభూమి నాఁటెను. కాని యాసంవత్సరము భూములు చాలసల్పముగాఁ బండెను. వఱదలవలనఁ

గలిగిన నష్టమంతయు, దాని ప్రవహించిన తెఱంగును, స్వామి యొకసీసమాలికలోఁ జాల మనోహరముగా నపుడు వ్రాసెను.

పుత్రోదయము

కాలక్రమమున స్వామి కొక కుమారుఁ డుదయించెను. రాధమ్మగారికి మేధాశక్తి గొప్పదేగాని దేహమంత యారోగ్యము గలదిగాదు. అందువలన నామెకుఁ బుత్రప్రసవమైన పిమ్మటఁ బెద్ద జబ్బు చేసెను. ఇట్లు రాధమ్మగారికి జబ్బు ప్రమాదముగానున్నదని దివినుండి పూడివాడకుఁ గబురువచ్చెను. కృష్ణయ్యగారు, కృష్ణవేణమ్మ మున్నగు వారెల్ల విచారపడిరి. స్వామి బయలుదేఱి మోదుమూడికి వెళ్ళెను. అచట రాధమ్మగారి మంచము దగ్గఱనుండి స్వామి రాత్రి పండ్రెండుగంటలవఱకు రామదాసుకీర్తనలు మొదలైనవి పాడుచు, సతికి నారోగ్యమిమ్మని జగన్నాథునిఁగూర్చి ప్రపత్తి చేయుచుండెను. పూడివాడలో వ్యవసాయ మంతయుఁ జేయించువారు లేకపోవుటచే వెనుకఁబడిపోయెను. రెండునెలలు గడచి మూడవ నెల కొంతజరిగెను. రాధమ్మగారి కారోగ్యము కుదురలేదు. స్వామికామెను విడిచి, యట్టిస్థితిలో నింటికివచ్చుటకు మనస్కరింపపోయెను. స్వామి తపోబలమువలనను వారియందున్న యద్భుతశక్తులచేతను, నాకర్షణబలమువలనను, మోదుమూడి యంతయు వారిస్వాధీనమై పోయెను. అచటివారెల్ల రా మహిమమునకు లొంగి స్వామిని భగవన్మూర్తిగా నర్చించుచుండిరి. ఎపుడు చూచినను వారి చుట్టును నిరువదిమందికిఁ దక్కువయుండరు. అట్టి భగవదభిమానులైన యా పవిత్రులతో నిరంతర భగవత్కథాలాపము చేయుచు, రాధమ్మగారి యారోగ్యమున కెదురు చూచుచు స్వామి యచటనుండెను.

మోదుమూడికి దగ్గఱలోనున్న యవనిగడ్డలోఁగల సాతానులప్పుడు చుట్టుప్రక్కలకెల్ల వైద్యులు. అందులో వైద్యమునందు నేర్పు గల యొక సాతాని రాధమ్మగారికి మందిచ్చుచుండెను. ఒకరోజున నామె కవసరముగా మందు గావలసివచ్చెను. స్వామియే యౌషధము తెచ్చుటకై యవనిగడ్డ వెళ్ళెను. వెళ్ళునప్పటికచట బ్రహ్మాండముగా సప్తాహము జరుగుచుండెను. స్వామినిఁజూడగనే యచటివారంతకుముందే వారివిషయ మెఱుంగుదురు గాన, నచట హరికథఁ జెప్పుమని ప్రార్థించిరి. స్వామి, యితరులు వారంతవారు రాకపోయినను బలవంతముగాఁ బిలుచుకొనివచ్చియైన భగవత్కథలు చెప్పి వినుపించును. వారికదియొక కండూతి. ఊరనున్నప్పుడును, బ్రతిదినము దాసరిపల్లెకో, రెడ్డిపల్లెకో పోయి, యటవారినెల్ల నొకచోటికి రావించి కొంతవడి భగవద్గుణానుభవము చేసివచ్చును. ఎవరును దొరకకపోయిన, నేమట్టి మోయుకూలీలదగ్గఱకో వెళ్ళెడివారు. వెళ్ళి 'యీపని యెప్పటికినున్నదే రండిరా" యని వాండ్రనందఱఁ గూర్చుండఁబెట్టి భారతగాథయో రామాయణగాథయో,

కొంతసేపు చెప్పి శ్రోతల నానందవార్ధిముంచి భగవత్కథ జరిగినందుల కానందపడి వచ్చుచుండెడివారు భగవద్విషయము నెత్తుకొనిన వారికి దేహము తెలియదు... అట్టి స్వభావము గలస్వామి హరికథఁ జెప్పుమని వారు ప్రార్థింపగా నూరకొనునా ? వచ్చినపని యే మాయెనో ? మందుసంగతి యసలు జ్ఞాపకమే లేదు. స్వామి హరికథఁ జెప్పఁబ్రారంభించెను. ఎంతవడికిని స్వామి మందుఁ దీసికొనిరానందున నచట సోమమ్మగా రెవరినో పంపగా నతఁడువచ్చి చూచి మందు తీసికొనిపోయి, స్వామి యచట హరికథఁ జెప్పుచున్నారని. యెఱింగించి యౌషధమును వారికిచ్చెను. తరువాత నెప్పటికో స్వామి హరికథ ముగించి. సాతాని కడకేగి విషయముఁ దెలిసికొని యింటికిఁ జేరెను. అట్టి మహాత్ముల కేది యేమైపోయినను సరే గణింపరు. భగవద్భజనము జరిగినఁ జాలును.

దామోదరం కృష్ణదాసుగారి యింటి కెవరో బందుగులు వచ్చిరఁట. వారికి వంటఁ ద్వరగా గావించి భార్య కృష్ణదాసుగారితోఁ జుట్టాలువెళ్లుటకుఁ ద్వరపడుచున్నారు. స్వామికి నివేదనఁ జేయవలయును, ద్వరగా స్నానముచేసిరండని కడవయుఁ జేదఁద్రాఁడును నిచ్చి పంపెను. ఆయన త్వరగా స్నానముచేసి కడవతో నీళ్లు తీసికొని వచ్చుచుండఁగా నొక తులసిమొక్క త్రోవలోఁ గానవచ్చెను. అది వేసఁగి యగుటచే నీరు లేక వాడిపోయి యుండెను. అంత కృష్ణదాసు గారు "తల్లీ యీ వడగాడ్పులలో నీ కెంత దాహమాయెనో, యని యాకడవ నీరు దాని మొదటఁబోసెను. నేల యెండియుండుటచే నా నీరంతయు నప్పుడే యింకిపోయెను. ఓహో! తల్లికెంతదాహమాయె" నని యాయన మరల నొక కడవతెచ్చి, యా మొక్కకుఁ బోసెను. అవియు నట్లేయింకెను. మరలఁ దెచ్చిపోసెను. ఆయన బావికడకేగి నీరుతోడుకొనివచ్చువఱకు నీరంతయు నింకిపోవుచుండెను. రెండుజాములాయెను. కృష్ణదాసుగా రట్లే యా తులసిమొక్కకు నీరుపోయుచుండెను. ఎంతవడికి నింటికి రానందున భార్య బయలుదేఱివచ్చి చూచెను. కృష్ణదాసుగారు తులసిమొక్కతో హతమైపోవుచుండెను. "అయ్యో! స్వామీ! యిదేమి ? యచటఁ జుట్టాలేమయిపోవలె" ననెను. "నీ చుట్టాలు సుడిమంగలమైపోను, తాళవే, తల్లి యెంతదప్పిగొన్నదని, నీరుపోయుచుండెను. అప్పుడామె దగ్గఱి యింటిలో నొక గడ్డపాఱఁ దెచ్చి తులసిమొక్క చుట్టును బాదుఁ గావించి తానుగూడ మఱియొక కడవతో నీరుదెచ్చి పోయఁగా నీరుకుదురుకొనెను. అప్పుడు కృష్ణదాసుగారు భార్యతో నింటికివెళ్లెను. భగవదేకాంతుల లక్షణము లిట్లుండును.

రామపాదధ్యాన రసికమానసులకు
భార్యయు నొక గడ్డిపరక గాదె
హరిచింతనామృత భరితమానవులకుఁ
దనయు లాలేఖ్యచిత్రములుగాదె

రాఘవేశ్వరనామరతులైన వారికి
కాయమే యొక గ్రుడ్డిగవ్వగాదె
విష్ణుసేవానిత్యవిమతుల కైశ్వర్య
భాసంబు లోక రాగిపైసగాదె
నిరతవైకుంఠగాథావినీతులైన
సుందరాత్ములు భగవదానందజనిత
విభవసౌభాగ్యమెట్టిట్టివేళనైన
విడువగానేర రన్యంబుఁ దడవఁబోరు.

మూడవమాసము చివరికి వచ్చినను రాధమ్మగారికి నారోగ్యము కుదురలేదు. ఒకనాఁటిరేయి స్వామి మహార్తితో రామదాసు చరిత్ర మును శిలలుద్రవించునట్లు పాడుచుండెను. అట్టితఱిఁ బ్రక్కయింట నున్న యొక పెద్దమనుష్యుఁడా యర్ధరాత్రమునఁ దనభార్యను లేపి "విన్నావఁటే భజన, దాసుగారి కీరాత్రి భగవంతఁడు ప్రత్యక్షమగుచున్నాఁడ"ని చెప్పెను. నాఁటినుండియు రాధమ్మగారికిఁ గ్రమక్రమముగా రోగము శాంతించెను. స్వామి ప్రథమపవిత్రసంతానమ్మైన యాబాలుఁడు మాత్ర మ్మైదుసంవత్సరములు పెరిగి కర్మానుసారముగాఁ గాలగతి నొందెను.

కాంచీగమనము

కృష్ణయ్యగారివలనఁ గలిగిన గృహకల్లోలమువలన స్వామి చిరాకుపడి యొకనాఁటిరేయి యెవరికీఁ జెప్పకుండ లేచిపోయెను. తెల్లవాఱిన తరువాత నెల్లవారును స్వామి లేనందులకు వగచి యే పుణ్యక్షేత్రమునకో బోయెనని యెంచి, వారి తిరిగిరాక కై ప్రతీక్షించుచుండిరి. స్వామి చేతుల కప్పుడు బంగారుమురుగులుండెను. రాధమ్మ గారి జబ్బులో వానిని గాంచీవరదున కిచ్చుకొనుటకు స్వామి సంకల్పించెను. అందులన నా మ్రొక్కు తీర్పవచ్చునని స్వామి కాంచీనగరికిఁ బోవఁదలంచెను. ఆ సమయమున స్వామి మిత్రులైన శ్రీ సముద్రాల లక్ష్మణాచార్యులవారు శ్రీ పెరుంబూదూరిలో నాసూరి రామానుజాచార్యులవారి యొద్ద శాస్త్రాభ్యాసము చేయుచుండిరి. అందువలన స్వామి మొదట శ్రీ పెరుంబూదూరికి వెళ్ళి లక్ష్మణాచార్యులవారిని గలిసికొనెను. అంత నాచార్యులవారు స్వామి రాకకెంతయు నానందించి, స్వామి నాసూరి రామానుజాచార్యులవారి కడకుఁ దీసికొని పోయెను. స్వామినిఁ జూచి యాసూరివారు లక్ష్మణాచార్యులవారితో "నాహా! మీదేశమున నిట్టివిలక్షణాధికారులు కూడ నుందురా?" యని విభ్రాంతిపడి, యానందించి, కొంతవడి యేవేవో భగవద్విషయములు, ప్రసంగించి స్వామితో "మిమ్ములను జూచుటవలనఁ

బరిమితిలేని యాహ్లాదము కలిగినది. కాని నేఁడొక చింత నన్ను బాధించుచున్నది. నేఁడు మా గురువులైన కుండలిస్వామి వారు లేరైరి. వారు పరమపదించిరిగాని, వారేయున్న మీబోటి విలక్షణాధికారులను జూచి నందుల కీ దినమున నానందనృత్య మొనరించెడివా"రని పల్కెను. పిమ్మట స్వామి యచ్చోట విశిష్టాద్వైతమతకర్తలైన భగవద్రామానుజుల యాలయంబునకేగి దర్శించి నాఁటి తెల్లవారుజామున లేచి కంచికిఁ బ్రయాణమొనరించిరి. లక్ష్మణాచార్యులవారు చెప్పిన మార్గమువెంటఁ బడిపోవుచుండిరి. అట్టితఱి మార్గమున స్వామి కొక దుండగీఁడు కలిసెను. స్వామి హస్తములయందు బంగారు మురుగులుండుటఁజూచి దుర్బుద్ధితో గంచికిఁ బోవు మార్గమదిగా దిటురమ్మని మాఱుమార్గమునకు లాగఁబ్రయత్నించుచుండెను. ఆచార్యులవారు మార్గమును జెప్పియుండుటచే, వానిమాటలు లక్ష్యముసేయక స్వామి తనత్రోవను బోవుచుండె. అంత వాఁడు స్వామి కడ్డముగా వచ్చి నిలుచుండి త్రోవ యదిగాదిటురమ్మనఁగా రావేమి యనిపలుకుచుండెను. అప్పటికింకను దెల్లవాఱలేదు. వాఁడు మంచి బలిష్ఠుఁడు కూడ. దగ్గఱలో నూరువల్లె లేని యరణ్యమది. స్వామికేమి చేయుటకును దోఁచక 'సర్వేశ్వరా! ఏమిచేయనెంచితి' వని భగవద్ధ్యాన మొనర్చుచుండెను. ఇంతలో నెవరో నలుగురైదుగురు పాంథులాత్రోవను వచ్చుచుండిరి. వారిఁజూచి దొంగ మెల్లగా నాచెట్లలోనికిఁ బోయెను. అంత స్వామి వారితో నీవిషయమంతయుఁ జెప్పఁగా నచ్చోటంతయు దొంగ నన్వేషించిరి. వాఁడు గానరాలేదు. పోయెను లెమ్మని వారు వెడలిపోయిరి. అప్పటికి బాగుగాఁ దెల్లవాఱుటచే స్వామియు భయమువీడి కంచికేగెను. అచటఁ దేవప్పెరుమాళ్ళను దర్శించి నిజసువర్ణకంకణము లాదేవదేవున కర్పించి మరల శ్రీ పెరుంబూదూరికివచ్చి యచటినుండి తిరిగి యొకవారమురోజులకు స్వామి గృహముఁజేరెను.


తండ్రియనారోగ్యము

ఇంతలోఁ గృష్ణయ్యగారికిఁబక్షవాతవ్యాధి సంభవించెను. ఆయనకుఁ గాలు, చేయి, నోరు పడిపోయెను. స్వామి కిఁక భగవత్సేవ యందాతంకము లేకపోయెను. వివిధ గ్రంథములను దెప్పించి చదువుట కారంభించెను. వారమున కొకటిచొప్పునఁ బుస్తకముల బంగీలు గ్రంథవిక్రేతల దగ్గఱనుండి, వచ్చుచుండెను. రెండుమూడువేల రూపాయల ఖరీదు గలిగిన గ్రంథములను స్వామి తెప్పించెను. క్రమముగా వసుచరిత్రము, మనుచరిత్రము, విష్ణుచిత్తీయము, రాఘవపాండవీయము, హరిశ్చంద్రనలోపాఖ్యానము, పాండురంగ మాహాత్మ్యము, శృంగారనైషధము, కాశీఖండము, భీమఖండము, విజయవిలాసము, మున్నగు ప్రబంధములను; నచ్చ తెలుఁగు రామాయణము, నీలాసుందరీపరిణయము,

ఆంధ్రభాషార్ణవము, మొదలైన యచ్చ తెలుఁగు కావ్యములను, బాలవ్యాకరణము, ప్రౌఢవ్యాకరణము, అహోబలపండితీయము, ఆంధ్రశబ్దచింతామణి, ఆంధ్రభాషాభూషణము, సులక్షణసారము, అనంతుని ఛందము, రంగరాట్ఛందము, సర్వలక్షణసారసంగ్రహము, చంద్రాలోకము, ప్రతాపరుద్రీయము, నాదిగాగల ఛందోవ్యాకరణగ్రంథములను జదివెను. ఒకనాలుగైదు సంవత్సరములవఱకు స్వామి యాంధ్రమున నిరుపమానమైన యఖండపాండిత్యమును గడించెను. పిమ్మట సంస్కృతమునను నఖండవైదుష్యము నార్జించెను. వ్యవసాయమును జూచుకొనుచు దపస్సును విద్యను బ్రధానములుగా సాధించెను. ఇప్పుడు స్వామికిఁ దండ్రిగారి బాధలేదు. ఆయనయుగము క్రుంగిపోయెను స్వామి హరికథలు పురాణములు చెప్పుచుండగాఁ గృష్ణయ్యగారును నొకకుర్చీలోఁ గూర్చుండి విని చివరకుఁ గుమారుని మహాదశకు సంతసించెన. ఎవరైన వచ్చి "మీ కుమారుఁ డిట్టి మహానుభావుఁడు సుమ్మ"ని ప్రశంసించుచుండ, నాయన "నా పరవనితాసక్తిలేని పరిశుద్ధి వలన నట్టివాఁడు జన్మించె"నని బదులుచెప్పి తానును సంతసించును. అట్టి యనారోగ్యముతోఁ గృష్ణయ్యగారింకఁ దొమ్మిదివత్సరములుండి యంత్యమున నేకాదశీ సోమవారంబున నిత్యపదవి కేగెను.

దేవాలయ నిర్మాణము

నిరంతర భగవదనుష్ఠానముతో, విద్యాప్రసంగములతో, హరికథా పురాణములతో, స్వామి కాలము గడపుచుండెను. మట్టితోఁ గట్టిన భగవదాలయము మఱియొకసారి, యెలుకలు దీపపువత్తిని లాగుకొనిపోవుటవలనఁ దగులఁబడిపోయెను. తంబురా మొదలైన వస్తువులు కాలిపోయెను. కాని స్వామి యందులోఁబెట్టిన భగవత్సంబంధములైన పుస్తకములు మాత్రమే దగ్ధములు కాకపోయెను. భగవన్మూర్తికిని బ్రమాదము జరుగలేదు. స్వామి పెద్దరాతితో దేవాలయము నాచంద్రార్కముండునట్లు గట్టి వేణుగోపాలస్వామిని బ్రతిష్ఠింప సంకల్పించెను. పెద్దరాతితో దేవళముగట్టి, పెరుమాళ్ళను బ్రతిష్ఠించుట యన్న సామాన్యమా? యెంత డబ్బు కావలయును ? ఎంత శ్రమపడవలయును ? పిమ్మట దేవునికి శాశ్వతముగా నిత్యనైవేద్యోత్సవముల కెంత మడిమాన్యము లుండవలయును ? ఇది తనకు సాధ్యపడునా యని మొదట స్వామి భయపడెను. కానిమ్ము పైని దైవమే యున్నాఁడని మరల దేవాలయ నిర్మాణమునకు నిశ్చయపడెను. స్వామికిఁ దలంచిన పని నెఱవేరు వఱకును నిద్రపట్టదు. వారి కార్యతీవ్రత యట్టిది. ఆలయనిర్మాణము చేయవలయునని యూరఁ బలువురితోఁ జెప్పి, తగు సన్నాహములు చేయుచుండెను. ఈ మాట విని స్వామి గురువులైన సీతారామా చార్యులువారు వచ్చి "నాయనా! దేవాలయముఁ గట్టుటకు లక్షాధికారియైనను గావలె



లేకపోయిన భిక్షాధికారివైనను గావలె. నీవు లక్షాధికారివిగావు. భిక్షాటనము చేయుటకును నీవంటి గౌరవార్హులకు న్యూనతగా నుండును. కావున నీవీయుద్యమము మొదలుపెట్టితివేని మితిలేని బాధ లొందఁగలవు. కావున విరమించుట మంచిద"ని బోధించెను. ఇంకను బలువురు వదలని వారించిరి. కాని జాతకప్రభావము వలనను, భక్తిరసావేశము వలనను, నేమియైనఁ గానిమ్ము సర్వము నీశ్వరాధీనమని దేవాలయ నిర్మితికి స్వామి పూనుకొనెను. తగిన పనివాండ్రతో నాలోచించి, వేజండ్ల యను గ్రామము సమీపమున నొక కోరీలోఁ బెద్దరాయి తీయుటకుఁ బనివాండ్రకుఁ గొంతడబ్బు చెల్లించి యనుజ్ఞ యిచ్చెను. కొంతకాలమున కచ్చటివా రా రాతినంతయుఁ దీసి గుట్టలుపేర్చి బండ్లు తోలుకొనివచ్చి, రాయి నెత్తించుకొని పొమ్మని, స్వామికిఁ గబురుచేసిరి. స్వామియు నదివఱకే యా ప్రయత్నమున నుండెనుగానఁ, బూడివాడ, తాడివాకవారిపాలెము, బదేవారిపాలెము, బలుసులపాలెము, నగరము మొదలైన పరిసర గ్రామములలోని రైతులతో, దైవకార్యమొనరించి కృతార్థులుకండని ప్రేరించెను. స్వామి యుద్బోధవలన నీ యూళ్ళ రైతు లెల్లరు నెవరిబండ్లు వారు కట్టుకొని వేజెండ్లకోరీకిఁ బయలుదేరిరి. ఆహా! యావైభవ మేమని చెప్పవచ్చును. బండ్లొకే వరుసగా రెండుమైళ్ళదూరము వఱకు వ్యాపించియుండెను. బండ్లలోని వారు చేయు గోవింద నామ ధ్వనులతో మిన్ను పిక్కటిలిపోవుచుండెను. ఈ జనమును బండ్లను జూచి త్రోవయందలి గ్రామములలోనివారు విభ్రాంతిపడి "యేమిటి?" యని యడుగఁ "బూడివాడలో శ్రీ వేంకటదాసస్వామి దేవాలయమును గట్టింపఁబోవుచున్నారు. దానికై కోరీలోఁ బెద్దరాయి గొనివచ్చుటకుఁ బోవుచున్నామ"ని బండ్లవారు బదులు చెప్పుచుండిరి. ఆ యుత్సాహము, నా జయజయధ్వనులు, నా శోభ, మితిలేకయుండెను. ఇట్లు స్వామి బండ్లను దోలించుకొనిపోయి రెండవనాఁటి మధ్యాహ్నమునకు బండ్ల యన్నిటిమీఁదను బెద్దరాతి బండల నెత్తించెను. రాయివేసికొని బండ్లు వెనుకకుఁ దిరిగిరాసాగెను. రెండు మైళ్లు వచ్చుసరికి, నడివేసఁగి యగుటచేతను, నచ్చోటు రాతిప్రదేశ మగుటచేతను, బండ్లచక్రముల పట్టాలు సాగి వదులు కాఁజొచ్చెను. స్వామి దీర్ఘదర్శియగుటచేత, వంటవారినేగాక, ముగ్గురు కమసాలిబత్తులను, నొక బండిపేళ్ళను, వెంటఁ గొనిపోయెను. విశ్వకర్మలు పేళ్లుచెక్కి వదులైన పట్టాసందున దిగవేయుచుండిరి. పది గజముల దూరము వోవుసరికిఁ "బోయెఁబోయె నాబండి" యని యెవరో యొకరు కేకవైచుచుండిరి. అంత బండ్లన్నియు నాపి దానికిఁ బేళ్లుగొట్టి మరల పోనిచ్చువఱకు మఱియొకరి బండి చెడుచుండెను. రెండుమూడు బండ్లు బొత్తుగాఁ దుంపులై విఱిగియేపోయెను. ఇట్లు కడుప్రయాసపడి, నాఁడు తెల్లవాఱుసరికి వెల్లలూరను గ్రామము చేరిరి. ఆయూర నందరు స్వామిప్రభావ మెఱిఁగిన వారగుటచేఁ దమ బండ్లు కట్టుకొని విఱిగి వెనుకదిగఁబడియున్న బండ్లను, రాతిని,

నెత్తుకొనివచ్చిరి. తెల్లవాఱులును నిదురయు, దిండియు లేకపోవుటచే బండ్లలోని జనమును, బరువు నీడ్చుటచే నెడ్లును, బడలిపోయి తూఁగాడుచుండెను. వెల్లలూరివారెడ్లకు గడ్డినిచ్చి బండ్లవారినెల్ల నూరిలోనికిఁ గొనిపోయి షడ్రసోపేతముగా విందులుచేసి గౌరవించిరి. ఆ మధ్యాహ్నామునుండి మరల బండ్లుగట్టిరి. రెండవనాఁ డుదయ మెనిమిదిగంట లగుసరికిఁ బూడివాడకు సమీపముననున్న యారేపల్లె యను నగ్రహారమునకు బండ్లు చేరెను. అప్పటికే పూడివాడలోని జనమంతయు వచ్చు బండ్లనుజూచుటకుఁ దండోప తండములుగా భజనసేయుచు నెదుర్కొనిరి. కనుచూపానినవఱకు, బండ్లవరుస గనుపట్టుచుండెను. ఎదురువచ్చు వేలకొలఁది జనమును, బండ్లలోని జనమును, జేయుభజనకును, గోవిందలకును, దిశలు ప్రతిధ్వనించుచుండెను. ఆ వైభవమును జూచినవానిదే జన్మ దానికంతయు మూలభూతుఁడై, యిన్నిబండ్లలో, నింతమంది జనమునందును, నే యలజడి జరగకుండఁ గాపాడుచుఁ జండశాసనుఁడై వెంటవచ్చుచున్న స్వామి తపస్తేజః ప్రభావమే ప్రభావము. దేవాలయముఁ గట్టుటకుఁ గావలసిన పెద్దరాతిలో సగము భాగ మిట్లు పూడివాడకుఁ జేరెను.

రాయి చదరముగాఁ జెక్కుటకుఁ బదిమంది పనివాండ్ర నేర్పరచెను. దేవాలయము నకుఁ గావలసిన రాయి యంతయుఁ జెక్కుటకు నీ పదిమందికి మూడుసంవత్సరములు పట్టెను. ఈ మూడుసంవత్సరములు బదిమంది పనివాండ్రకును భోజనవ్యయమును స్వామి తానే భరించెను. ఇట్టిదేమిలెక్క యప్పటికిఁ దండ్రిసంపాదించినది ముప్పది నాలుగెకరముల మాగాణీ యుండెను. సంసారపుఖర్చును నప్పటికేమియు బహుళముగా లేదు. తన కడ్డుసెప్పువా రెవరును లేరు. కృష్ణయ్యగా రప్పటికున్నను రోగగ్రస్తుఁడై యశక్తుఁడైయుండెను. దేవాలయము పూర్తియైనఁ జాలును. తరువాతఁ జేతికిఁ బిచ్చపుఁ జిప్పవచ్చినను నిష్టమే యనునధ్యవసాయముతో స్వామి యుండెను.

రెండవసారి మరల రాతినంతయుఁ దీసి పేర్చి యచటిమేస్త్రీ కోరీనుండి యీ సంగతిఁ దెలియఁజేయుచు నుత్తరమువ్రాసి యొక మహమ్మదీయునితో స్వామికిఁ బంపెను. అతఁడు పూడివాడకు వచ్చుచుండగాఁ ద్రోవలో నది వర్షకాలమగుటచేఁ బెద్దగా వర్షము కురిసెను. ఆ వర్షమువలన నతని కాలస్యమాయెను. త్రోవలోనే చీఁకటి పడెను. అతఁడు పూడివాడ మార్గమునకుఁ గ్రొత్తవాఁ డగుటచే నెట్లెట్లో త్రోవవెంట జనుల నడుగుచు నారేపల్లెఁ జేరెను. అచటికి వచ్చువఱకుఁ బ్రొద్దుపోవుటచే జనము మాటుమణఁగెను. ఇంకను వర్షము కొలఁది కొలఁదిగా బడుచునే యుండెను. అతఁ డేమిచేయుటకుఁ దోఁపక భగవంతుఁడా! యీ రాత్రి నన్నేమి చేయఁదలఁచితివిరా! యని యనుకొనుచు నూరుదాఁటి ప్రక్కనున్న యొక పెద్దకాలువ కట్టమీఁద నిలఁబడెను. ఇంతలో నెవరో యొకాయన యచటికి

వచ్చి "నీవెవర?" వని ప్రశ్నించెను. నేను పూడివాడ వేంకటదాసస్వామి వారి యొద్దకుఁ బోవలయును మాది వేజెండ్ల కోరీ. అర్ధరాత్రమగుచున్నది. త్రోవతెలియుటలే"దని యా మహమ్మదీయుఁడు సమాధానము చెప్పెను. అత నా వ్యక్తి "యోహహా! రమ్మట్లయిన నేను దీసికొని పోయెదను, మాది బదేవారిపాలెము" లెమ్మని యా మనుష్యునిఁ బూడివాడకుఁ దీసికొనివచ్చి స్వామి యింటి ప్రహరీయొద్ద నిలువఁబడి "యిదే వారియిల్లు. లోనికి పొమ్మ"ని చెప్పెను. అతఁడు లోనికిఁ బోవుసరికి స్వామి యేటో వ్రాసికొనుచుండెను. పోయి స్వామికి నమస్కరించి యా రాత్రి తనకుఁ గలిగిన బాధయంతయుఁ జెప్పి బదేవారిపాలెము మనుష్యుఁడఁట. పాపము తమపేరు చెప్పఁగనే వెంటఁబెట్టి తీసికొని యదే మనప్రహరీవఱకును వచ్చి తిరిగి పోవుచున్నాఁడని వచించెను. స్వామి యాశ్చర్యపడి యా యర్ధరాత్రమున నీ వానలో బదేవారిపాలెము పోవువాఁ డీతని కొఱకై యిచటికి వచ్చునా ? వచ్చినట్లయిన నింత సహాయమొనరించినవాఁడు దాపునకు వచ్చి తనకుఁ గాని పింపకుండఁ దిరిగిపోవునా ? యని యతని కొఱకు బయటికి వచ్చి చూచెను ఎవరును లేరు. తిరిగి పోచువున్నాఁడేమో యని కొంతదూరము వఱకుఁ గేఁకలు వైచిరి. ఎవరును గానరాకపోయెను. ఆహా! దయాసముద్రుఁడైన భగవానుఁడే యట్లు తన పనినెఱవేర్చుకొనుటకై చేసెనని నిశ్చయించెను. నిశ్చయముగా నా యద్దమరేయి వానలోఁదనయింటి కెట్లు చేరవలయునా యను సందర్భములో నెవఁడో మొగమెఱుఁగని మనుష్యుని కొఱకంత ప్రయాసపడివచ్చునే ? వచ్చుఁబో, యింతపని చేసి స్వామియింటివద్దకు వచ్చి వారికిఁ గానరాకుండ. వారి ప్రశంసను బొందక యేలతిరిగిపోవును ? పిమ్మట స్వామి మహమ్మదీయు నాదరించి భోజనాదులు వెట్టించి పరుండఁబెట్టిరి.

స్వామి యీసారి రాతికి బండ్లుదోలుకొనిపోవుట సాధ్యము గాదు. పడవలమీఁద రప్పింపవలయునని యచటఁ బడవల కెత్తవలసినదిగా ననుజ్ఞయిచ్చెను. అట్లే వారచటఁ గాలువమీఁదఁ బడవలకెత్తగా నా రాయి, పూడివాడకు మూడుక్రోసుల దూరమునఁ బశ్చిమములోనున్న పిట్టలవానిపాలె మను గ్రామమువద్దకుఁ జేరెను. స్వామి మనుష్యులను వెంటఁబెట్టుకొని పోయి యా రాయి యంతయుఁ బడవలలో నుండి దింపించెను. పిమ్మట రెండుమూడు సారులుగా నూరి బండ్లన్నియుఁ దోలుకొనిపోయి రాయి యింటికిఁ జేర్పించెను. ఇట్లు మంచి పనివాండ్రతో వేణుగోపాలదేవునికి గర్భాలయాంతరాలయ ములను, రాజ్యలక్ష్మి యమ్మవారి కొక యాలయమును, బెరుమాళ్ళ కెదురుగా నాంజనేయస్వామి యాలయమును స్వామి నిర్మింపఁజేసెను స్వామి పెదతండ్రి కుమార్తె రామముత్యమ్మ యను నామె కలదు. ఆమె యమ్మవారి యాలయమునకును, స్వామి యత్తగారైన సోమమ్మగారు శ్రీయాంజనేయాలయమునకును ధనసహాయ మొనరించిరి.

రామాయణ కాలక్షేపము

దేవాలయమును నిర్మించి ధనాభావమువలనఁ బ్రతిష్ఠను వెంటనే స్వామి చేయలేకపోయెను. అందులకై ప్రయత్నించుచు స్వామి రాత్రులయందు భాస్కర ప్రణీతమైన రామాయణమును బురాణము చెప్పుచుండెను. ఊరిలో సమస్తజాతులవారును భగవత్కథాసక్తి గలవారెల్ల వచ్చి విని యానందపడుచుండిరి. వేంకటసుబ్బయ్యగారి తండ్రి శ్రీరాములు గారును, నాయనతమ్ముఁడు కృష్ణయ్యగారును నని యన్నదమ్ము లుండెడివారు. వారిద్దఱును భగద్గాథాశ్రవణమునం దనుపమానమైన యాసక్తిగలవారు. ప్రతిదినమును రాత్రి పెందలకడనే భుజించి వచ్చి దేవాలయమున స్వామి పురాణ మెప్పుడు మొదలుపెట్టునా యని కనిపెట్టుకొని యుండెడివారు. కాపట్య కాలుష్యాదులు లేని పవిత్రులు వీరు. ఆ కాలము వేఱు. ఆ మనుష్యులు వేఱు. అట్టి కథాసక్తి, యా సరళహృదయములుగల మనుజులిప్పు డెచటను గానరారు. ఈ యన్నదమ్ము లిరువురును దమకంటె వయసునఁ జిన్నయైనను స్వామి యందత్యంతభక్తిశ్రద్ధలతో నుండెడివారు. రామాయణమును బట్టాభిషేకమువఱకుఁ జెప్పి ముగింపవలసియుండఁగా, స్వామి కంకంటిపాపరాజకృతమైన యుత్తర రామాయణమునుగూడ వరుసగాఁ బురాణము చెప్పివైచెను. ఉత్తరకాండమును వరుసగాఁ జెప్పఁగూడదని స్వామి కప్పటికిఁ దెలియలేదు.

పుత్రికా ద్వయ వియోగము

స్వామికి మొదట నొక కుమారుఁడు వోయినతరువాత నొక కుమార్తెయుఁ బిమ్మట నొక కుమారుఁడును, దరువాత మరలఁ గుమార్తెయు నటువెనుక నొక తనయుఁడును నప్పటికిట్లు సంతానము నలువురు గలగియుండిరి. పెద్దకుమార్తె పేరు రామప్రసాదమ్మ. యామె తరువాత గగిలిన పెద్దకుమారుని పేరు శ్రీనివాసపెరుమాళ్ళు, చిన్న కుమార్తె రామబాణమ్మ, రెండవకుమారుఁడు వేంకటాచలపతి. స్వామి రామాయణముఁ బురాణము చెప్పి ముగించిన వెంటనే యొక పదునైదు దినములలోఁ సురూపసుగుణసంపన్నలైన కుమార్తె లిరువురును నొక వారము రోజులు వ్యవధిగా మడిసిరి. పెద్దకుమార్తెకు వరనిశ్చయమై పసుపుఁగుంకుముఁగూడఁ బెట్టియుండిరి. ఇట్లు స్వామికేకకాలమునఁ దగిలిన యీ ఘోరవిపత్తునకు దేశమంతయు క్షోభించెను. ఇట్టి మహానుభావుని కిట్టి యాపద యొకేసారి ప్రాప్తింపఁజేసినందులకుఁ బ్రజ దైవము నెంతయు దూషించెను. భక్తులైన వారిని దైవము సేయు పరీక్షలిట్లుండునని కొందఱభిజ్ఞులు సమాధానముఁ చెప్పుకొనిరి. స్వామి మాత్ర మే

మాత్రమును జరింపలేదు. దైవలీల యిటులెసఁగె. ననుభవనీయమైన ప్రారబ్ధ మిది యనుకొనెను.

ప్రళయోద్దండ సమీరముల్ జగతి కంపంబొందఁగా వీఁచినన్
గులశైలంబులు సంచలింపక వెలుంగున్ జూవె యారీతిగా
బలువైరంబున నెన్ని యొక్కపరి సంప్రాప్తించినన్ విష్ణుభ
క్తుల చిత్తంబులు ప్రాకృతాపదలకున్ ఘూర్ణిల్ల వేమాత్రమున్.

స్వామి యీ కలిగిన విపత్తునకుఁ గలఁగలేదుగాని. యిట్టి యాపత్తు ప్రాప్తించుటకు భగవద్విషయమునఁ దనవలనఁ గలిగిన యపచార మేమైయుండునా యని చింతించెను. మిత్రులైన పండితులు కొందఱు "రామాయణోత్తర కాండమును వరుసగాఁ బురాణము చెప్పరాదు. దానివలనఁ గలిగిన దిది" యని స్వామి కెఱుగఁజేసిరి. స్వామి చెల్లెండ్రలో నొక్కరైన రత్తమ్మగారి భర్త యొల్లు వేంకటరామయ్య గారు. ఈయన నివాసము కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళము. ఈయన గొప్ప పట్టుదలగల వ్యక్తి. వివాహమైన తరువాతనే స్వామినిఁ జూచి తానుగూడ శ్రీకాకుళమునఁ గల పండితులయొద్దఁ జదివి యాంధ్రమున నిర్దుష్టమైన పాండిత్యమును గడించెను.

వేంకటరామయ్యగారు స్వామికిఁ గలిగిన యీ విపత్తును బ్రసంగవశమున నచ్చటి యొక పండితునితో వచించెను. అంత నా విబుధుఁడు "దేవాలయమును గట్టించి ప్రతిష్ఠ చేయక యట్లే యుంచుట చాలఁ ప్రమాదకరము. కావున వెంటనే యాలయప్రతిష్ఠ గావించునట్లు చెప్పుము. లేకున్న నింకను నాపత్తులు గలుగుచుండు"నని వేంకట రామయ్య గారితో స్వామికిఁ గబురుచేసెను. స్వామియు నాలయప్రతిష్ఠఁ గావింప వేగిరపడుచుండెను. గాని ధనము పుష్కలముగాఁ జేతికిఁ జిక్కలేదు.

శ్రీనివాస సహస్రము

స్వామి కప్పటికి నఖండమైన పాండిత్యము చేకూరియున్నది. కవితావాహిని గంగా ప్రవాహమువలెఁ బరిశుద్ధమై గంభీరగమనవిలాసములతోఁ బరుగులు ద్రోలుచుండెను. భక్తిరసాప్లావితమయిన తన కవితావధూటిని "గలౌ వేంకటనాయకః" యని ప్రసిద్ధినొందిన తిరుమల వేంకటేశ్వరస్వామికి సమర్పించి స్వామి తన యాలయప్రతిష్ఠా కార్యమును నెరవేర్చుకొనఁదలంచెను. ఒక శుభముహూర్తమున స్వామి, గ్రంథమునకు శ్రీకారమిడెను. స్వామి శరీరమే భక్తి. అందుచే నా భక్తిరసమును ఛందశ్శమత్కృతులచే నలంకరించి భగవద్వైభవమును బ్రబంధమున నఖండముగా నిక్షేపించెను. రాత్రివేళ వారు భోజనముచేసి గ్రంథమును వ్రాయ నారంభింపఁగా నారసతన్మయతలో వారికిఁ గాలమే కనుపట్టెడిది

గాదు. తెల్లవారుజామున సోమమ్మగారు వాకిలి యూడ్చుటకు లేచుటయు, స్వామి వ్రాయుటమాని పరుండుటయు, నొక్కసమయమున జరుగుచుండెడివి. అట్లు వేయి పద్యములతోఁ దన యాలయకార్యమును ద్వరలోఁ గొనసాగింపఁగలందులకా వేంకటాద్రిస్వామినిఁ బ్రస్తుతించి శ్రీనివాస సహస్రమను గ్రంథమును ముగించెను.

రంగయాత్ర

శ్రీనివాససహస్రమును వ్రాయుకాలమున స్వామి, యప్పటికే వారి నాశ్రయించి శిష్యులైయున్న, మోదుమూడి గ్రామవాసులు, రామదాసుగారు, కృష్ణదాసుగారు నను వారినిఁ బాడివాడయందున్న మఱియొక శిష్యుని వెంటఁదీసికొని రంగనాథుని సేవింప శ్రీరంగ ప్రయాణ మొనరించిరి. మొదటఁ దిరుమల కేగి వేంకటనాథుని దర్శించి పిమ్మట శ్రీరంగమునకుఁ జని, సప్తప్రాకారవేష్టితరంగవిమానారూఢుఁడైన యయ్యాదిదేవుని దర్శించి యానందించిరి.

స్వామి కారాత్రి నచట పిప్పిపన్ను పోటువచ్చి యన్నముఁదిన వీలుగాకపోయెను. అందువలనఁ బాలకై, కొనితీసికొనిరమ్మని శిష్యునిఁ బంపిరి. అది ద్రవిడదేశమగుటచే భాష తెలియని కతమున నతనికిఁ దనకుఁ గావలసినది పాలని క్షీరవిక్రేతలకుఁ దెలియఁజేయుటయే దుర్ఘటమాయెను. పైగాఁ జిల్లర లేకపోవుటచే నెంతటి పాలు కావలయునో వారికిఁ దెలుపలేకపోయెను. అట్లు పోయిన పని సమకూడక యచట పీకులాడుచుండెను. చీఁకటి పడిపోయెను. పాలకు వెళ్ళిన యచ్చయ్య యను శిష్యుఁ డెంతవఱకు రాకుండుటచే స్వామి మరలఁ గృష్ణదాసుగారినిఁ బంపిరి. ఆయన వోయి, విషయమును దెలిసికొని యొక కోమటింటికిఁబోయి చిల్లరఁ గొనివచ్చి యన్నిడబ్బులకుఁ బోయుమని డబ్బునిచ్చి పాలు పోయించుకొనెను. ఇంతలో స్వామి, యిద్దఱును బోయి యెంతవఱకును రారైరేమైరో యని రామదాసు గారినిఁగూడఁ బంపి తాము తలుపువైచుకొని బసలో నుండిరి. కొంతసేపుండి, యప్పటికిని వారు రాకపోవుటచే స్వామి తానుగూడ వెళ్ళవలయునని తలుపునకు బీగమును వైచుచుండెను. ఈ లోపలఁ బాలు దీసికొని శిష్యులు ముచ్చురును జేరిరి. అప్పటికి స్వామి హృదయము కుదుటఁబడెను. పిదప స్వామి కాంచీపురికిఁ బయనించెను. కాంచీవరదుని సేవించి యారాత్రి సత్రములోఁ బరుండిరి. కాని యెవరో దుండగీడులు వచ్చి, యచటనుండి లేచిపొండని స్వామిని శిష్యులను నిబ్బంది పెట్టిరి. అంత నచటనుండి లేచి స్వామి శిష్యులతో నెచటనో యారాత్రి తలదాఁచుకొనెను ఇట్లు శ్రీపెరుంబూదూరు వోయి భగవద్రామానుజులను, దిరువళ్ళూరిలో శ్రీ వీరరాఘవస్వామిని సేవించి, యాసారి స్వామి వెనుకకుఁ దిరిగెను. తిరిగివచ్చి వారు బాపట్లలో బండిదిగిరి,

అప్పటికింక రాత్రిఁజాలఁబ్రొద్దుండెను. అయినను నచ్చటఁ బరుండుటకు వసతిలేక యప్పుడే స్వామి ప్రయాణము సాగించెను. బాపట్ల దాఁటినదగ్గఱనుండి మార్గమంతయుఁ దోఁటలతో నిండి గ్రామములు దగ్గఱలో లేక యెడారిగా నుండెను. అటఁ దొంగల భయమును గూడఁగలదు. స్వామికి జాగరూకత కడునెక్కువ. అందువలన శిష్యులతో నెవరును మాట్లాడక నిశ్శబ్దముగా రండని వెళ్లుచుండెను కొంతసేపటి కీ విషయమును మఱచి యచ్చయ్య యను శిష్యుఁడు బిగ్గఱగాఁ గంఠమెత్తి స్వామితో "నయ్యా! యిచ్చటనే నండి మా వాండ్రను దొంగలుకొట్టిన"దని యెప్పుడో యిచటఁ దమవారిసొమ్ములు దొంగలు హరించిన విషయమును జెప్పుచుండెను. స్వామియుఁ దక్కిన శిష్యులును నతనిపై కోపించి మట్లాడకుండఁజేసిరి. తెల్లవాఱిపోయెను. అప్పటికి స్వామియు శిష్యులును మంచి యౌవనపాటవమున నుండిరి. ఆ యిసుక మార్గమువెంటఁ గొంత దవ్వు పరుగులుపెట్టుచుఁ గొంతవడి నడచుచు నానందముగా నిండ్లుసేరిరి.

గాలివాన

క్రోధననామసంవత్సరమునఁ పెద్దగాలివాన యొకటి విసరెను. వైశాఖమాసమున ముందొకరేయి వానతోఁగూడిన గాలి మెల్లమెల్లగా సాగెను. అట్లు సాగిసాగి తెల్లవాఱినకొలఁది హెచ్చిపోయెను. రెండవనాఁడు పదిగంటలగుసరికి వాయువు మహాప్రచండమై పోయెను. ప్రపంచమంతయు మిగుల గగ్గోలుపడిపోయెను. చెట్లు, చేమలు, గృహములు, మిక్కుటముగాఁ బడిపోయెను. జగత్తునకేదో ప్రళయము పుట్టఁబోవుచున్నదని ప్రజలు భయపడిరి. వీధులవెంట నా వేసవికాలమునఁ బడవ లాడునట్లు జలము ప్రవహించెను. జనులందఱును భయోద్విగ్నులై గృహములు వీడి మేడలు మిద్దెలు మున్నగు గట్టి యిండ్లలోనికిఁ జేరుచుండిరి. కొన్ని మేడలును గూలి జననష్టమాయెను. పశుశాలలుపడి వానినిఁ గనుగొనువారు లేక పశువులు విపరీతముగాఁజచ్చెను. స్వామియు నా చుట్టుపట్టులవారును బెద్దరాతితోఁ గట్టఁబడియున్న దేవాలయమున నా పగలును, రాత్రియుఁ దలఁదాచుకొనిరి. ఆ రాత్రి తెల్లవారుజామునకు గాలివాన యడఁగెను. ఆ గాలివాన వీచిన ప్రకారమును బ్రజయొందిన బాధలును స్వామి యొక సీసమాలికలో నపుడు వ్రాసిరి. అదియు నీ గ్రంథాంతమున నున్నది.

యాచన

ప్రతిష్ఠ గావించుటకు స్వామికి ధనము సమకూడకపోయెను. కర్తవ్యమేమి యని నిరంతరము విచారించుచుండెను. అట్టితఱి నొక్క దినమున స్వామి దేవాలయమునఁ

గూర్చుండి యుదయమున ననుష్ఠానమును నెఱవేర్చుకొనుచుండును. అచటి కొక బ్రాహ్మణుఁడు భిక్షాటనమునకు వచ్చి, దాహమగుచున్నది పాలిప్పింపుమని స్వామినిఁ గోరెను. స్వామి పాలు తెప్పించి యిచ్చి దబ్బులీయఁబోయెను. ఆ దబ్బులు చాలవని యా విప్రుఁడు పీఁకులాడుచుండఁగా స్వామి "నా విచారములో నేనుండఁగా నీగొడవయేమిటయ్యా యని విసుగుకొనెను. అంతనతఁడు "నా విషయమ మటుంచి మీవిచారమేమి"టని యడిగి తెలిసికొనెను. పిమ్మట స్వామినిఁజూచి, యాబాపఁడు "మీ రా చదువునది భగవద్గీత గదా, మీరు దైవకార్యమును మొదలుపెట్టి యది పూర్తిగాక విషాదపడవలసివచ్చినప్పు డిఁక నా గ్రంథమేల ? యావలఁ బదవైపుఁడు. దానిలో "నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్" యని భగవానుఁడు చెప్పుచున్నాఁడు గదా ? అశక్తులమైన మనము నిమిత్తమాత్రముగా నుండవలసినవారమే. కార్యమును సాధింపవలసినవాఁడు వాఁడే. దిగులొందవలసిన పని యేమున్నద"ని యావేశమువచ్చినట్లు చెప్పి వైచెను. స్వామి యా బ్రాహ్మణుని తీరుగని, భగవదావేశమువలన వచ్చిన వాక్కులవి యని గ్రహించి, ధైర్యము నొందెను.

పిమ్మట నాలయప్రతిష్ఠకు నూళులవెంట యాచించి యైన ధనము నార్జింప వలయునని స్వామి తగినవారితో నొక శుభసమయమున బయలుదేఱెను. ఒక్కొక్క యూరికిఁ బోవుచు నచట హరికథలు చెప్పి గ్రామీణుల భగవద్గాథామృతమున ముంచుచు, నూరిపెద్దల వెంటనిడుకొని యిండ్లవెంబడి.


అజభవాదులగన్న యాదివిష్ణుని దివ్య
కైంకర్యమునఁ బాలుఁగాంచుఁడయ్య
యిందిరాధీశుని మందిరకార్యంబుఁ
గావింపఁగా సమకట్టుఁడయ్య
హరి సేవకంటెను నధికమౌ పురుషార్థ
మెద్దియు లేదంచు నెఱుఁగరయ్య
యసురవంశారాతి నర్చింపఁ గల్గుట
బహుజన్మకృతి పుణ్యభాగ్యమయ్య
పాడు సంసారమున కెంతపాటుపడిన
ఫలము రవ్వంతయైనను గలుగదయ్య
సుదతులార! మహాత్ములౌ సుజనులార!
వేణుగోపాలదేవు సేవింప రారె.

అని యాచించుచు మామిళ్లపల్లె, మంచాళ, వెల్లలూరు, చుండూరు, నల్లూరు, పంగిపురము, మున్నగు పెక్కు గ్రామములు పర్యటించెను. ప్రతిష్ఠఁకు గావలసిన ద్రవ్యము

కొంతవఱకు లభించెను. పిమ్మట స్వామి తిరిగి వచ్చి పూడివాడలోఁ దగువారికిఁ దగునట్లు చందా వైచి డబ్బు నార్జించెను. పరిసర గ్రామములందును గొంత ధనమును బ్రోవుచేసిరి.

ఆలయప్రతిష్ఠ

స్వామి మహోత్సాహముతోఁ బ్రతిష్ఠాసంభారము లన్నియు సమకూర్చెను. భగవదుత్సవ విగ్రహములను, మూలబేరములను నేర్పరులైన విశ్వకర్మలు సిద్ధము గావించిరి. ప్రతిష్ఠాగమవేత్తలైన యధ్వర్యులు, ఋత్విజులును వచ్చిరి పాంచరాత్రాగమోక్త విధానంబున వేణుగోపాలదేవుని ప్రతిష్ఠామహోత్సవ మారంభింపఁబడెను. అత్యంత విపులముగా స్వామి యింటియొద్దనుండి భగవదాలయము వఱకును, గోవెలచుట్టును వేయఁబడిన పందిళ్ళయందుఁ గదళికాస్తంభములు, కొబ్బరిమట్టలు, మామిడిమండలు పలురకములైనతోరణములు నలంకరించిరి. ఉత్సవమారంభించువఱకు పెక్కు గ్రామముల నుండి మహాజన మావైభవమును జూడవచ్చెను. వేశ్యలు, సన్నాయిమేళము, భేరీమృదంగములు, మున్నగు పెక్కు మేళములు జనుల నాహ్లాదపరచుచుండెను. స్వామి యానందమునకు మేరలేదు. హోమాది యజ్ఞకార్యముల నొకప్రక్కను, వివిధములైన పనులకుఁ బనివాండ్ర నియోగించుటొకవంకను, వచ్చెడి బంధుమిత్రాది సమూహమును సత్కరించుట యొకదెస, నిట్లు క్షణమైన తీరికలేక యన్నివిషయములను సహస్ర ముఖములతోఁ జక్కదిద్దుచు స్వామి శతావధానముఁ జలిపినట్లు కార్యముల నిర్వహించుచుండెను. పాచకులు పెక్కురు వండిపోసిన యన్నము పెద్దపెద్దరాసులై కనిపించుచుండెను. సర్వదిశలనుండి వచ్చు జనమును, బోవుజనమును, భుజించు జనమును, మహాసమ్మర్దమాయెను. వివిధములై రుచ్యములైన కూరలతోఁ బచ్చళ్లతో, విస్తారమైన ఘృతముతో నెప్పుడుచూచినను, బందిళ్ళలో వేలకొలందిగాఁ బ్రజ సంతృప్తియగునట్లు భోజనములు గావించుచునే యుండిరి, ఇట్లు మహా వైభవముగా, నవాహ్నిక దీక్షతోఁ బ్రతిష్ఠామహోత్సవము సాగిపోవుచుండెను. ఒక్కనాఁటిరేయి, స్వామి, పనులుచక్కదిద్ది దిద్ది రెండుజాములు గడచినవెనుకఁ బందిరిలో నొక బల్లమీఁద బరుండి కొంచెము విశ్రమించెను. విరామము లేని కార్యనిర్వహణమువలని బడలికచేతను, పలుదినములనుండి సరియైన నిద్రలేమివలనను, వెంటనే కన్నులు మూఁతవడి కొంచెము నిద్రపట్టెను, గాని మనసు నందుఁ, దాండవించుచున్న కార్యజాగరూకతవలన వెంటనే మెలకువ వచ్చి స్వామి కనులువిప్పెను. పందిరియంతటను బెక్కుగ్యాసు లైటులు వెలుఁగుచుండెను. పట్ట పగలుగానున్న యా దీపకాంతి, నిద్రావశత్వమువలన నప్పుడే కనులుతెఱచి స్వామికి, వేఱుగా గానఁబడెను. పందిరి తగులఁబడి పోవుచున్నదని మిక్కిలి తత్తరపాటుతో కేకలు వైచెను.



జనమంతయు మూగిరి. కొంతపడికిc దేటి స్వామి తమప్రమాదమును గుర్తించి నెమ్మదిపడిరి. భగవన్మూర్తులకు విధ్యుక్తముగా జలాధివాస, ధాన్యాధివాస క్షీరాదివాసాదులు జరిగెను. ఇట్లక్షయనామసంవత్సర వైశాఖమాసమును సప్తమీ బుధవారమందు శుభముహూర్తమున నెడమ పార్శ్వమున రాజ్యలక్ష్మి యమ్మవారును, ముందుభాగమునc బ్రసన్నాంజనేయులును నుండునట్లు రుక్మిణీ సత్యభామాసమేతుcడైన శ్రీ వేణుగోపాలదేవునిస్వామి తమ ముప్పదియైదవ యేటc బ్రతిష్ఠించిరి. పుష్పమాలలతోc కుంకుమరేఖలతో నలంకరించి, మేళతాళములతో మహాప్రజ వెంటనడువ, బండ్లమీcద నెత్తి ధ్వజమూర్తి నూరియందెల్ల నూరేగించి తెచ్చి కప్పీలమీcద లేవcదీపి ప్రతిష్ఠించిరి. మహాజనము గావించు జయజయధ్వనులతోc జప్పటులతోc గూడిన నాcటిశిఖర ప్రతిష్ఠా వైభవమును గాంచుటకుc గనులు చాలకపోయెను. జగదానందకరమై ప్రతిష్ఠ నిర్విఘ్నముగా నవబృధముతో ముగిసెను. వేణుగోపాలదేవుని దమ చేతులతోc బ్రతిష్ఠించి యద్దేవాదిదేవుని నయనసాఫల్యముగాc గాంచి కృతకృత్యుcడ నైతిcగదా యని స్వామి యెనలేని యానందమొందిరి. ఇట్టి మహాకార్యమును, జేసిచూపి సంతోషపరచినందులకై స్వామిని సమీపించి చేయు నభిజ్ఞుల పొగడితకును మేరలేకుండెను. బ్రతిష్ఠాసమయమున, ధూపదీపనిత్యోత్సవములా చంద్రతారకముగాc బెరుమాళ్ళకు సాగుటకై స్వామి యనుమతిని, భార్యల ప్రోత్సాహమునc బద్యాల శేషయ్యగారు రెండెకరములభూమిని భగవత్పాదములయందు నుదకధారాపూర్వకముగా నర్పించెను. వేంకటసుబ్బయ్యగారి తండ్రి యైన శ్రీరాములుగారును, రామముత్యమ్మగారి భర్త శ్రీరాములుగారును, గూడ వేణుగోపాలదేవునకు శాశ్వతనిధినొసcగిరి. అందరొక యెత్తు తానొకయెత్తుగా స్వామియుc గొంతశాశ్వతనిధిని భగవన్నివేదితము గావించిరి. జగదానందశుభసంధాయకుcడై వేణుగోపాలస్వామి పూడివాడయం దిట్లు సర్వసులభుcడై దర్శనీయుcడై వెలసె.

ఋణబాధ

దేవాలయప్రతిష్ఠ ముగించి కృతకృత్యుcడనైతిcగదా యని స్వామి యానందపడెను. ఈ మహాకార్యమునకుcగాను స్వామి యూళులవెంట చందారూపముగా నార్జించిన ద్రవ్యము చాలలేదు. ముప్పదినాలుగెకరములమీcద వచ్చిన రుసుమును జాలలేదు. అత్యధికమైన ఋణము తేలినది. స్వామి వెనుకకుcదిరిగి చూచుకొనెను. "వడ్డీతో వడిగల గుఱ్ఱములు పరుగెత్తలేవ''న్నట్టు లా ఋణమును గొంతకాలమట్లేయుంచినc బ్రమాదము తటస్థించునట్లుండెను. స్వామి కేమి చేయవలయునో, కర్తవ్యము తోcచక పోయెను.

"అర్కకులుండగు రఘుపతి మాకొక యల్పము రానీcదన్న" యని భద్రాచల రామదాసుగారన్నట్టు, కానిమ్ము దైవమేమిసేయునో యని ధైర్య మవలంబించి ఋణబాధ

తీరు నుపాయమన్వేషించుచుండెను. స్వామి విచారమును రాధమ్మగారును. నామె తల్లియైన సోమమ్మగారును, జూచిరి. సోమమ్మగారును మంచి యాస్తిగలయామె. కుమార్తె లిరువురే. ముచ్చటకై యామె రాధమ్మగారికి బంగారు కంటె, కాసులపేరు, రాగిడీచంద్ర వంక, చంద్రహారము. మున్నగు పెక్కుభూషణములు చేయించెను. స్వామి విచారమును జూచి రాధమ్మగారు తన భూషణముల నమ్మివైచి యా ఋణబాధఁ దీర్పఁ దలంచెను. ఆమె యద్భుతమైన మేధాశక్తిగలఁది. పతివ్రతాగ్రగణ్య-సుగుణసుశీలసంపన్న. వేయేల స్వామికిఁ దగినసతి యామె. ఇట్లు నిశ్చయించి రాధమ్మగారి తల్లియైన సోమమ్మగారికిఁ గూడఁ జెప్పెను. ఆమెయు నంగీకరించెను. ఒక్కనాఁటి మధ్యాహ్నము సీతారామాచార్యులువారు స్వామినిఁజూచుటకై ముక్తిపల్లెనుండి పూడివాడకు వచ్చెను. స్వామి యింటిదగ్గఱ లేరు. పొలము వద్ద నొక చిన్నకుటీరము వైచుకొని పగలంతయు నచటఁ దపస్సు చేసికొనుచుండిరి. ఆచార్యులవారింటిదగ్గఱ విచారించి తెలిసికొని పొలము వెళ్ళిరి. పొలముదగ్గఱ స్వామి బయట నెచటను గన్పింపలేదు. కుటీరము వాకిలి మూసి యుండెను. అంత నాచార్యులవారొక చిన్నరంధ్రంతనుండి లోనికిఁజూచిరి. లోననొక కాపీనము పెట్టుకొని, కన్నులుమూసి స్వామి పరబ్రహ్మమున మానసమును లయింపఁజేసి, గాఢసమాధిలో నుండెను. సీతారామాచార్యులవారి కొడలు జలదరించెను. ఆహా! యేమి యా భాగ్యము, నిర్జనస్థలము నాశ్రమములో గోచిధరించి, తపోనిష్ఠయందు మునిఁగి యుండుటయన్న నెంతటిపని ? ఎన్నిజన్మల సుకృత మేకీభవించిన నట్టిస్థితి లభించును ? ఆచార్యులవారికి విశ్వామిత్ర పరాశరాది, మహర్షులు స్మృతికి వచ్చిరి. ఆ బ్రహ్మర్షుల తెగకుఁజెందిన యప్రాకృతమహావ్యక్తి యీయన యని యాచార్యులు గారు గ్రహించిరి. అట్టి శిష్యుఁడు లభించినందులకుఁ దనభాగ్యమును దానే కొనియాడుకొనెను. అట్లు కొంతసేపు స్వామి సమాధినిశ్చలతఁ గన్నులారఁ జూచి యాచార్యుల వారు మెల్లగా "నాయనా" యని పిలిచెను. స్వామిపలుకలేదు, రెండుమూడుసారులు బిగ్గఱగాఁ బిలిచెను. అప్పటికి స్వామి మానసమునకునాచార్యులవారి పిలుపు వినఁబడెను. కంఠధ్వని గుర్తించి వెంటనే లేచిపంచకట్టుకొని స్వామి బయటికి వచ్చి గురువుగారికి వినతిఁ గావించెను. ఆచార్యులవారును నానంద బాష్పములతోఁ గౌఁగిలించుకొని "తండ్రీ! నీకాచార్యకము వహింపఁ దగినవాఁడనుగాను నేను. గానియెప్పటి పుణ్యమువలననో నీవు నాకు శిష్యుఁడవుగా లభించితివి. నీసంబంధమువలన నేనును దరింపఁగలనని పలురీతులఁ గొనియాడెను పిదప వా రిరువురును గలిసి యింటికి వచ్చిరి. స్వామి తల్లిగారైన కృష్ణవేణమ్మ గారును, రాధమ్మగారును, సోమమ్మగారును గూడ నా గురుశిష్యుల సన్నిధియందుఁజేరి యోగక్షేమవార్త లేవియో మాట్లాడుచుండరి. అట్టితఱిఁ దన భూషణముల నన్నిటి నమ్మి తీరినంత వఱకు ఋణముఁ దీర్పవలసినదిగా స్వామికి రాధమ్మగారు తల్లి యనుమతితోఁ గూడఁ దెలిపెను.

సీతారామాచార్యులవారును నా పరమసాధ్వి యొసర్చుచున్న తెగువకువిభ్రాంతిపడి "ఆహా! భర్తయేయనుకొన్న సంతతి వానికిఁ దగినట్లుగా నున్న. దీయమ్మ! ఈదంపతులు సామాన్యులుగారు. ఎవరో యప్రాకృతులు కొన్ని కార్యములు సాధింప నిట్లు దంపతులుగా జనించిర"ని నిశ్చయించెను. "తగినట్లు పలికితివి. ఋణవిముక్తి కిది మంచి యుపాయ మమ్మా" యని ప్రశంసించెను. కాని స్వామి యిట్లనెను. "మీరిప్పుడేదో యొక భావముతో నగలమ్మి ఋణముఁ దీర్పుమని యనుచున్నారుగాని ముందుముందు మాటవచ్చినపుడెల్ల మా నగలమ్మి నీ యాస్తి నిలువఁబెట్టితిమని దెప్పవత్తురు. అట్టిమాటలకు సహించి ప్రాఁజీరగుడ్డవలెఁ బడియుండు వాఁడను గాదని మీరును నెఱఁగియే యుంటిరిగదా. ముందుఁ గలహమునకుఁ గారణముగానున్న యీ పని నాకంత యంగీకారముగాలేదు. మఱి ఋణముదీరుట యెట్లంటిరా ? పైని భగవానుఁడున్నాఁడు. వాని బంగారుపాదములకు నా తల నొగ్గితిని. ఎట్లుచేసిన నట్లగును. నన్నుఁ గూర్చి మీరు విచారపడ నవసరములే"దని స్వామి వచించెను. అందులకు రాధమ్మగారును, నామెతల్లియు మిగుల నొచ్చుకొని "యయ్యో మేము మిమ్ముదెప్పుటకూడనా ? మీరొనర్చినది మహాకార్యమని మాకుఁదెలియుటలేదా ? మీరేమి దండుగలు, దౌర్భాగ్యపుఁ బనులు, చేసితిరని, మేము మిమ్ము దూషింపఁగలము. బిడ్డలు గలిగిన కాఁపురము చెడకుండుటకై, నగలమ్ముచున్నాము గాని మీ కిచ్చుచున్నామా? కావున నంగీకరింపవలయు"నని ప్రాధేయపడి బలవంతముఁ గావించిరి. ఆచార్యులు గారును నిదికర్తవ్యమే యని స్వామి నంగీకరింపఁజేసి వెడలిపోయెను. పిదప నగలన్నిటి నమ్మివైచిరి. అప్పటికిఁ గొన్ని భూషణములు గ్రొత్త మెఱుఁగుకూడ మాయక యుండెను. స్వామి తన హస్తములనున్న సువర్ణ కంకణములను నమ్మెను. కాని ఋణవిముక్తి సంపూర్ణము గాలేదు. తరువాత కొంతభూమినిఁ గూడ విక్రయించి స్వామి, ఋణబాధ చాలవఱకుఁ దీర్చుకొని కొంతవఱకు నెమ్మదిపడెను. అప్పటికెట్లు ఋణవిముక్తికై యమ్మినదియు, దేవాలయమునకు శాశ్వతధనమునకై యొసంగినదియు మొత్తము గలిసి భగవద్విషయముగా, నేడెకరముల భూమి యాస్తిలోనుండి వ్యయపడెను.

స్వప్నము

ఋణబాధ యెట్టెట్లో చాలవఱకుఁ దగ్గినది. కాని మిగిలిన దేవాలయ ప్రాకారమంటపాది కార్యము లెట్లు నెరవర్చవలయునా యని స్వామికి రేయిపగ లొకటేవిచార మాయెను. తన యాస్తిని వ్యయించి భగవదర్పణమింకను జేయుటకు వీలుపడునట్లులేదు. కుటుంబము పెరుగుచుండెను. అప్పటికే కొంతభూమియు నగలును నమ్మినఁగాని కడతేరలేదు. కావున నిఁకఁ జేయవలసినదిఏమి ? దైవమిచ్చినది విద్యాబలము పుష్కలముగా

నున్నది. దాని సహాయముతో దేశమున సంచారము గావించి, యా ధనముతో భగవత్కార్యములు, నెఱవేర్పవలయునని స్వామి నిశ్చయపడెను. మంచిలగ్నమునఁ దగిన పరికరలములతో బయలుదేఱి పడమటికిఁ బయినించి యటఁబరిచయముండుటచే బొబ్బేపల్లె యను వీఁటికిఁ జేరెను. స్వామివెంటఁ దల్లియైన కృష్ణవేణమ్మగారును నుండెను. అటనొక్కటియే హరికథఁ జెప్పిరి. వందలకొలఁదిగాఁ బ్రజ వచ్చిరి. స్వామి మంచి వయఃపాటవములో నున్నారు. ఆ గాత్రశోభకు, నా పాండితికి నా వక్తృత్వమునకు జనులు ముగ్ధులైపోయి, తమ దేశమున కిట్టి మహావక్త యింతవఱకు రాలేదని గగ్గోలుగాఁ జెప్పికొనిరి. తెల్లవాఱు సరికి స్వామికి నూటమూడు డిగ్రీల జ్వరము వచ్చెను. స్వామివెంటఁ గోదండదీక్షాగురుఁడై రామచంద్ర మూర్తి తాండవించుచుండును. ఎచటికేగిన నచ్చటనే జనులు సేవకులై తండోపతండములుగా వెంటఁబడి తిరుగుచుందురు. ఆ కారణమున నెందఱో పెక్కౌషధములు తెచ్చి వాడిరి. కాని జ్వరమేమాత్రమును దగ్గలేదు. ఇరువది నాలుగురోజులు గడచెను. స్వామి విసుఁగుజెంది యిఁక భగవదాజ్ఞ లేదు. వెనుకకుఁ దిరిగిపోవుద మని నిశ్చయించి యచటివారితోఁ జెప్పిరి. వారెల్లరు స్వామిని విడువలేక చేయునదిలేక నిరుత్సాహతఁజెందిరి. పిదప స్వామి బయలుదేఱి వెనుకకు మరలెను. ఆయూరి పొలిమేరదాఁటి మరలఁగనే యిరువదినాలుగు దినములనుండి విడువకయున్న జ్వరమంతులేకుండఁబోయెను. భగవదంగీకారము లేని కతమునఁ గలిగిన విఘ్నముగదా యిదియని యెఱిఁగి స్వామి యిలు సేరెను. అదియేమో దైవసంకల్పము దేవాలయప్రతిష్ఠ కాకపూర్వమమోఘముగా సంచారము వెళ్ళిన యూరనెల్ల సాగినది కాని ప్రతిష్ఠయైన వెనుక స్వామి యెన్నిపర్యాయములు ప్రయత్నించినను దైవికముగా నేదో యొక విఘ్నము కలుగుచునేయుండెను. ఆస్తిని వినియోగింప వీలుపడుటలేదుగదా యని భిక్షాటమున కేగిన నదియు నిల్లెదురాయెను. స్వామికి విచారము హెచ్చెను. అట్టితఱి నొక్కనాఁటి మధ్యందినమున నిదురించుచుండఁగా స్వప్నమున వేదమూర్తులో యన నొప్పు నాలుగు మోములతోఁ జతుర్ముఖుఁడును, వాల్మీకియు సాక్షాత్కరించిరి. అట్లు గనఁబడి తాను విధాతననియు, నతఁడు వాల్మీకి మహర్షి యనియు నెఱింగించి, వాల్మీకిప్రోక్తమైన రామాయణమును ముప్పది రెండుసారులు పఠింపుము. నీవాంఛితములెల్లఁ దీరునని బ్రహ్మదేవుఁడుపదేశించెను. అంత వల్మీకభవుడు "వత్సా! బ్రహ్మలోక మిచ్చటి కెంతదూరమున్నదియు శాస్త్రదృష్ట్యా నీకుఁ దెలియునుగదా. అంతదవ్వునుండి నీకొఱకై యాయన శ్రమపడివచ్చినాఁడు. తదుక్తమును జక్కగా ననుష్ఠించి, ధన్యుఁడవుగమ్ము"ని వచించెను.

స్వామి సరే యని వంగి నమస్కరించుచుండఁగనే వారిరువురదృశ్యులైపోయిరి. స్వామి పులకాంకితుఁడై, మేలుకొని, తల్లికి నింటిలోనివారికి శిష్యులకు నెఱింగించెను.

స్వప్నము సంస్కారజనితము, కార్మణము, శాకునికము నని మూడువిధములు; ప్రపంచమున మానవుఁడు చేయుచున్న పనులవలన నొక సంస్కారము మనస్సున నిలిచియుండి దానిచేఁ బగలు తానొనరించిన కార్యములే కలయుండుఁ గానవచ్చు నదిసంస్కారజనితము; ప్రపంచమునఁగానీ స్వర్గనరకాదులలోఁగానీ ప్రత్యక్షముగా ననుభవించుటకుఁ జాలని యల్పపాప పుణ్యములను నీకార్మణ స్వప్నముల ద్వారా దైవము మనుష్యులచే ననుభవింపఁజేయును శ్రుతి "నతత్రరథానరథయోగా నపన్థానోభవంతి. అథరథాన్ రథయోగాన్ పథస్సృజతే." నిజముగా స్వప్నమున రథములులేవు, గుఱ్ఱములులేవు, రథము పోవుమార్గములు లేవు. కాని వీనినన్నటినిఁ తాత్కాలికానుభావ్యములుగా భగవంతుఁడు సృజించును. పుణ్యమునకు నానందమయమైన వస్త్వనుభవమును, పాపమునకు దుఃఖకరమైన యనుభవమును, మనుష్యుఁడెన్నడు కని విని యెఱుఁగని విషయము లీ స్వప్నములయం దనుభవించుచుండును. శాకునికము లనఁగా ముందురాఁబోవు శుభాశుభములను దెల్పునవి. వీనివలన భవిష్యత్ఫలములు సూచింపఁబడుచుండును. ఇవియే సత్యములైన స్వప్నములు. ఈ మూడింటిలో నీవచ్చిన స్వప్న మేదియో యని స్వామి విమర్శించెను. ఒకవేళ సత్యమేయైనచో రామాయణపారాయణ మెక్కడికేగి చేయవలయును ? ఇంటియొద్దనుడి నిర్విఘ్నముగా నంత పనిచేయుటకు వీలుపడదు. ఎవరో యొకరువచ్చి విఘ్నమాచరించు చుందురు. కాక యేదైన పుణ్యక్షేత్రమునకేగి యచటఁజేయుట మఱింత బాగుండును. క్షేత్రమహిమనుబట్టికూడ ఫలము లభించును గదా యని మొదట మంగళగిరి, యంతర్వేది క్షేత్రములను దడవి, రామాయణపారాయణము గనుక భద్రాచల రామచంద్రస్వామివారి సన్నిధియందు జేయుట ముఖ్యమని నిశ్చయము జేసికొనెను. కాని భద్రాచలప్రాంతమున మన్నెపుజ్వరము లుండుననియు నచట దీర్ఘకాలము నివసించినవారికి నవి వ్యాపించుననియు నెవరో చెప్పిరి. అంతట స్వామి కొంచెము సందేహపడెను.

రామాయణమును ముప్పదిరెండుసారులు పారాయణము చేయుట యన్న సామాన్యమా ? యెంతవేగముగాఁ జేయఁగలవానికి నైనను నాలుగు మాసములకు పైనిఁబట్టునుగాని తక్కువగాదు. మఱియంతకాల మచట క్షేమముగా నున్నఁగదా పారాయణము చేయుట. అట్టి జ్వరములు వ్యాపించిన నేమికావలయునని విచారించి, చింతాకులితుఁడై యొకనాఁటి మధ్యాహ్నమున నిదురవోయెను. అంత స్వప్నమున,

తొలుకారు మొయిలుతోఁ దళుకుఁగ్రొంబసిఁడితో
సమములౌ దివ్యదేహములతోడ
నాజానులంబి హస్తాంభోజముల వెల్గు
వైరివిద్రోహి ధన్వములతోడ



సతిమాంసలములైన యంసభాగములందుఁ
దులకించు బెడిదంపు దొనలతోడ
మందస్మితానంద సౌందర్యనిధులైన
కమనీయ చంద్రాననములతోడ
నన్నదమ్ములు నిఖిలలోకైక దక్షు
లరిభయంకరు లాశ్రితభరణదీక్షు
లగు మహాపూరుషులు చూడనరిదియైన
క్రమముతోడుత నిద్దఱు గానఁబడిరి.

అట్లు గనుపట్టిన యద్దివ్యపూరుషులకు స్వామి నమస్కరించి "యయ్యా! మీది యేదేశ"మని ప్రశ్నంచె. వారును మాది హిందూరు జల్లా యని ప్రత్యుత్తరమిడిరి. అట్లైన మీకు భద్రాచలము సమీపము కావున మీకానంగతులు తెలియును. నేను రామాయణపారాయణమునకు భద్రాచలము పోవలయునన్న, నచ్చట జ్వరము లుండునని కొందఱు చెప్పుచున్నారు. మీకు నిజము తెలియునుగదా, నేను పోవచ్చునా?" యని స్వామి యడిగెను. అంతట నమ్మహాత్ము"లయ్యా! భద్రాచలమున జ్వరములుదేవు, మఱేమియు లేవు. ఒకవేళ నున్నను రామాయణపారాయణ మొనర్ప వచ్చిన మిమ్ము జ్వరము లేమిసేయును? దప్పక భద్రాచలమునకు రండు. నిర్విఘ్నముగా మీ పారాయణము నెఱవేరు" నని యంతర్హితులైరి. స్వామి మేల్కని యా వచ్చినవారు రామలక్ష్మణులనియు, రామాయణ పారాయణమునకై భద్రాచలము రమ్మని తనకుఁ బ్రయాణముఁ జెప్ప నరుదెంచిరనియు నెఱింగి యానంద తన్మయుఁడై యెల్లరకు నెఱింగించెను. భద్రాచలయాత్ర నిశ్చయముఁ గావించెను.

భద్రశైలగమనము

రాధమ్మగా రపుడు నిండుచూలాలై యుండెను. అట్టిస్థితిలో నిల్లువదలి దూర దేశమేగు టెట్లనిస్వామి వెనుకంజవేయలేదు. చేయఁబోవునది భగవత్సేవ, సర్వరక్షకుఁడైవాఁడే యున్నాఁడను నధ్యవసాయముతో నున్న స్వామి కది యేమిలెక్క? త్వరత్వరగా వ్యవసాయపుఁ బనులు ముగించెను. నాటులైపోయినవి. ఊరికిఁ బడమట నున్న పాలెములో స్వామికి మొగలిపువ్వు రత్తమ్మ యను నొక శిష్యురాలు కలదు. ఆమె పాపము బాల్యముననే వైధవ్యమును బొందెను. ఐనను నామె నిప్పువంటిదై, సదాచారముతో జీవయాత్ర గడపుచు, దానికిఁదోదు భగవద్భక్తిలో దిగి, స్వామి పాదము లాశ్రయించెను. అవసరములైన సమయములయందు స్వామి యింటిలోని వంటపనులకామె యుపయోగపడుచుండెడిది. కావున నామెను, దల్లి

యైన కృష్ణవేణమ్మగారిని వెంటఁదీసికొని స్వామి భద్రాద్రికి గమనింప నెంచెను. ఇంటికడ జాగ్రత్తగాఁ గనిపెట్టుకొని యుండుటకై, రేలందుఁ బరుండఁదగు జీతగాండ్ర నియమించెను. పనివాండ్ర లెక్కలు మొదలైనవి చూడ వేంకటసుబ్బయ్యగారిని నియోగించెను. సోమమ్మగారును బూడివాడయందే యుండెను. పిదప నొక శభముహూర్తమునఁ దగిన సన్నాహములతో నొక జీతగాని వెంటఁగైకొని రత్తమ్మ గారితోను, గృష్ణవేణమ్మగారితోడను, స్వామి ప్రయాణించెను. బెజవాడమీదుఁగా బోయి క్రొత్తగూడెమున రైలుబండి దిగిరి. ఆపూట నచట బసఁజేసి వంటఁగావించుకొనుటకై నూరిలోని కేగిచూడఁగా నచటఁ గొంతమంది బ్రాహ్మణులు కూర్చుండి చీట్లపేక యాడుచుండిరి. వారికడకేగి స్వామి వంటచేసికొనుటకు ఒక యింటి నిమ్మని యడుగ వారు, మీరెవరని ప్రశ్నించిరి. మేము కాఁపులమని స్వామి చెప్పఁగనే యబ్బో యిది బ్రాహ్మణాగ్రహారము. శూద్రుల కిట బసయీయ వీలుగాదనిరి. అంత స్వామి "ఇది బ్రాహ్మణాగ్రహారమని మీ చీట్లాటవలననే బోధపడుచున్నది కానిండు, మఱి కొందరు బ్రాహ్మణులే లేచిపోయి, యితరజాతులనుగూడఁ గొందఱ నిచట నుంచకపోయితిరి ? బ్రాహ్మణేతరులు వచ్చినపుడుండుటకు వీలుపడెడిది. చాలులెండయ్యా! యకాలమైపోయినది. వంటఁజేసికొన నిల్లు చూపుమన నిట్టిప్రసంగములు చేయుట యర్థముగా"దని నుడివెను. పిదప స్వామి గంభ్రతనమును, బ్రహ్మతేజమును జూచి యొక బ్రాహ్మణుఁడు లేచివచ్చి యొక యిల్లు ఖాళీచేసి యిచ్చెను. అచ్చోట దిగిన వెంటనే కృష్ణవేణమ్మగారును, రత్తమ్మగారును స్నానము గావించి మడిపంచలారవైచుచుండిరి. అది చూచి "యోహో, కాఁపులమంటిరే, మఱి బ్రాహ్మణాచారముగా స్నానము, మడులు దడులు ప్రారంభించుచున్నారేమి" యని విప్రులాశ్చర్యపడుచు స్వామి సన్నిధికిఁజేరిరి. అంత స్వామి తన విషయమును సర్వమును దెలిపి భగవదాజ్ఞచొప్పున భద్రాచలమున రామాయణ పారాయణముఁ గావింపఁబోవుచున్నానని మొదలువెట్టి, యొక గంటసేపు భగవద్విషయము నుపన్యసించెను. బ్రాహ్మణు లెల్ల రా యుపన్యాసమున నివ్వెఱపోయి, మొదట బసయిచ్చుటకే వీలులేదన్న వారెల్లఁ గూరగాయలు, నేయి, పప్పు, మొదలైన సర్వపదార్థములు తెచ్చి స్వామి కర్పించి యత్యంతముగా గౌరవించిరి. భగవద్దాసుల కెచటి కేగినను గొఱంత యేముండును? అటుపిమ్మట స్వామి మధ్యాహ్నము నుండి బయలుదేరెను. అదియంతయు మహారణ్య మార్గము, గగనము నంటి పెరిగియున్న పెద్దపెద్ద మ్రాఁకులతోడను, జెట్లకొమ్మలయందు బండిచక్రములవలె వ్రేలాడు తేనెపెరలతోను, వివిధములైన లతా గుల్మాదులతోడను, జిన్నచిన్న యారణ్యక జంతువులతోడను నాత్రోవ వింతను, భయమును గూర్చెను. మార్గమెఱిఁగిన యొక వనిత త్రోవలో వీరికి జతపడెను. వెంటనున్న జీతగాఁడు మంచిబలిష్ఠుఁడు,

ధైర్యపరుఁడు. అందువలన స్వామి కొంతస్థాయిగా నా తెరవునఁ బ్రయాణముఁ గావించెను. రెండు మూడు మజిలీలతో స్వామి గోదావరి యావలితీరమునకుఁ జేరెను.

అఖండగోదావరి సంపూర్ణముగా వచ్చియుండెను. స్వామి పరిజనముతోఁ బడవ నెక్కెను. గోదావరి మధ్యలోని కేగుసరికి భద్రశైలవాసుఁడైన రాఘవేశ్వరు నాలయముమీఁది చక్రమూర్తి గోచరించెను. ఎల్లరును నా సుదర్శనస్వామికి మ్రొక్కులిడిరి. గౌతమి యావలియొడ్డునఁ బడవదిగి,

గౌతమీప్రాంతీయ ఘనసైకతక్షోణు
        లసివాఋపట్టులై పొసఁగుచుండఁ
బ్రాబోధికోత్సవ పటహమంగళగీతి
        మెల్లన విశ్వంబు మేలుకొలుప
సీతా సుమిత్ర జోపేతంబుగా నొప్పు
        తనయున్కి లోకభద్రంబుగాగఁ
బ్రాకారమంటపబహుళ గోపురవీధు
        లక్షి సాఫల్యబు నావహింప
రాఘవేశ్వరుఁ దాశ్రితారాధనములఁ
గడఁగి కైకొన నెచ్చోటఁ గాఁపురంబు
సేయు నేవేళ నట్టి సుశ్రీపదంబు
భద్రశైలంబుఁ గాంచె సద్భక్తి వెలయ.

అవ్వీటఁ జొచ్చి యొకచో బసఁ గుదుర్చుకొని యారాత్రి వేకువనే లేచి, గోదావరియందు స్నానంబుఁగావించి, తనవారితోఁగూడ నరిగి యాలయంబుఁజొచ్చి స్వామి, యఘనాశనుండై సకలలోకాహ్లాదంబుఁ గావించుచు, "అగ్రతః ప్రమయౌ రామ" యన్నట్లు రామాయణోక్తప్రకారంబునఁ దనకుఁ గుడివైపున సీతాలక్ష్మణులు వెలయ వేంచేసియున్న రఘురూద్వహుని సేవించినసమీపంబుననున్న యొక మంటపమున రామాయణ పారాయణంబును బ్రారంబించె. ఆ రెండవనాఁడు వెంటవచ్చిన జీతగాఁడు వెనుకకు మరలి యంతదూరమున స్వామి నొంటరిగా విడిచి పోవుటకుఁ జింతించి, యెట్టకేలకు వెదలి పూడివాడకుఁ జేరఁ వెళ్ళిపోయెను.

రామాయణ తపస్సు

వేకువనే గాల్యములు దీర్చి గోదావరికి వెళ్ళి, స్నానముఁ గావించి, యూర్ధ్వపుండ్ర ధారణమును వేగముగా ముగించి, సూర్యోదయమగుసరికెల్ల స్వామి రామయాణమును

దీసికొని మంటపమునఁ బారాయణమునకుఁ దయారగును. తరువాతఁ బదునొకండు గంటలకు ముగించి లేచి యింటికివెళ్ళి భగవదారాధనముఁ గావించి భుజించును. మధ్యాహ్నము కొంచెము విశ్రమించి మరల రెండుగంటలగువఱకు నారంభించును. సూర్యాస్తమయము వఱకును బారాయణముచేసి ముగించును. ఒక్కొక్కదినమున రేలందు లెక్కప్రకారము చదువు వఱకుఁ గొంత ప్రొద్దుకూడఁబోయెడిది. మొత్తమునకుఁ బూర్ణ రామాయణమంతయు నాలుగురోజుల కొకసారి పారాయణమై పోవలయును. రాత్రులందు స్నాన మొనర్చి భోజనమాచరించి వెంటనే పరుండు నవకాశము మొదట రెండు మూడు దినములవఱకే చిక్కినది. రెండు రోజులగుసరికెల్ల స్వామి బ్రహ్మతేజము నాకర్షణబలము వలనఁ దద్గ్రామ వాసులు, స్త్రీ పురుషులు పెక్కురు పరిచితులై పగట స్వామికి మాట్లాడఁ దీరనికతమున, రాత్రులందు భోజనమగుసరికి వచ్చి బస నిండునట్లు పరివేష్టించుచుండిరి. కొలఁది రోజు లేవేవో భగవద్విషయములు చెప్పి పిదప రాత్రులందు రామాయణమును స్వామి పురాణమే చెప్ప మొదలిడెను. క్రమక్రమముగా రెండుమూడు వందల జనము ప్రతిదినము వచ్చి పురాణము నానందకోలాహలముగా వినుచుండిరి. స్వామి పురాణవాచనశైలి యదివఱకు జగత్తున నెచ్చటను లేని క్రొత్తరకము, యుద్ధఘట్టములు మొదలైన చోట్ల నొక్కొక్క కేక వెట్టుచుండ సభాంతరాళము దద్దలిరిపోవుచుండెడిది. సందర్భానుసారముగా వారు పొదివి పెట్టెడి యనంతములైన హాస్యరసాపాదక గాథలకు శ్రోతలు నవ్వినవ్వి పడిపోవలసినదే. ఆ యమృతవాక్కు ప్రపంచమున నన్యత్ర చూడఁబోము. స్వామి మహిమను భద్రశిఖరివాసులెల్ల రచిరకాలముననే గుర్తించి వారికి వశులైరి. పగలు సూర్యోదయము మొదలు సూర్యాస్తమయము వఱకును బారాయణముఁజేసి మరల రాత్రుల నెనిమిది గంటలనుండి పండ్రెండు గంటల వఱకును సింహగర్జనము చేయుచుఁ బురాణముఁ జెప్పవలయునన్న నెవరితరము ? మఱియొక్కఁడైన గుండెపగిలి చావఁడే! స్వామిది వజ్రశరీరము. ఆజ్యాహుతులు వేసినకొలఁది స్వామి విజృంభించిపోవునుగాని యలసటఁ జెంది విరమించుట యన్నది వారి జీవితముననే లేదు. కోదండదీక్షా గురుఁడై భగవంతుఁడు వారిభుజముల నర్తనము గావించుచుండును. వాఁడే వచ్చి వలచి యుండుటచే వానిని సర్వకాల సర్వదేశ సర్వావస్థలయందు రక్షించుకొనుచుండును. కావున స్వామి కింతపని చేయుచుండినను లెక్కలేక యుండెను. అచట నిరువురు శ్రీ వైష్ణవపండితులు స్వామికి స్నేహితులైరి. వారిలో నొకరు స్వామి నాలుగుదినముల కొకసారి రామాయణ పారాయణము చేయుచున్నాననఁగా నమ్మక యొకరోజునవచ్చి పారాయణ క్రమమును బరీక్షించి చూచెను. పారాయణము స్పష్టస్వరమై యొడిదుడుకులులేని గంగాప్రవాహమువలె, శరవేగమునఁ బోవుచుండెను. అంత నా వైష్ణవుఁడు స్వామిశక్తికి నివ్వెఱపాటొంది వారి పాండితీశక్తినిఁ గూర్చియు

వాచాశోభను గూర్చియుఁ దపోమహత్త్వమును గూర్చియు నూర వేనోళ్ళఁబొగడెను. ఇట్లు పారాయణము నిరాఘాటముగా స్వామికి సాగిపోవుచుండెను.

సీతమ్మ గారు

భగవల్లీల కడువిచిత్రము. మహాత్ములున్న కాలముననే మహాత్ముల సృజించి సంఘటించుచుండును. స్వామి రామాయణ పారాయణము చేయుకాలముననే యచట సీతమ్మగారను నొక మహాభక్తురాలుండెను. ఆమె కొండమీఁద రామచంద్రస్వామివారికై యొక మహత్తరమైన తులసితోఁటవేసి నిత్యమును దానినుండి వలసినంత తులసీ దళమును బూవులును దెచ్చి, పెరుమాళ్ళ కర్పించును. ఆమెయే క్రిందనుండి మోసికొనిపోయి కడవలతోఁ దోటకు నీరువోయును. తులసీ కైంకర్యము రామున కొనర్చుటతప్ప నన్యలోకమెఱుంగని తపస్విని యామె. బంగారువంటి శరీరచ్ఛాయ గలిగియుండెడిదఁట. ఈమె యేలూరు ప్రాంతవాసిని, వెలమజాతికిఁజెందినది. భర్త చిన్నతనమునందే పోయెను. ఇరువదిరైదు సంవత్సరముల వయస్సులో నీమె కొంతమది బంధువులతోఁ గలసి యుండఱవలెనే రాముని దర్శించి పోవులయునని భద్రాచలమునకు వచ్చెను. తిరిగి పోవలయునని ప్రయత్నించుచుండఁగాఁ గనులు గానరాక యొడలు చెమటపట్టి కాళ్లు అంటుకొనిపోయెనఁట. ఇది యేమని యామె విచారపడుచుండఁగా నప్పుడావేశముఖమున రామచంద్రస్వామివారు "నీ కైహికభోగము లనుభవించుమార్గము తప్పిపోయినది. కావున యావజ్జీవ మిచటనే యుండి నాకు నిరంతరము తులసీ కైంకర్యము చేయవలయును. అటులుంటివా సరే; లేకున్న నీ గతి యట్లుండవలసినదే" యని చెప్పెను. అంత నామె భగవంతునకు నంగీకారమైనవస్తువునైతినిగా గదా యని యెనలేని సంతోషమంది "స్వామీ, నాకింతకంటెఁ గావలసినదేమున్నది ? నీ సేవకు మించిన పూరుషార్థమేమిగలదు ? నీకు నీవై గ్రహించ నిట్టి మహాభాగ్యము లభింపఁగాఁ బోగొట్టుకొని తుచ్ఛసంసారము నెవరికో దాసీత్వము నొనరింపవలసిన గతి నాకేల పట్టవలయును ? అట్లే యుందు"నని నమస్కరించెను. వెంటనే యదివఱకుఁ గలిగిన దేహ వికారములన్నియు నామెకు సమసిపోయెను. అంత నామె భద్రాచలములోనే నిలిచిపోయెను. బంధువులు చేయునదిలేక యిండ్లకేగిరి. పిమ్మట నామె కొండమీఁద నొక మహత్తరమైన తులసీవనమును వైచి పెంచి ప్రతిదినము నా దళములు, పుష్పములు, స్వామి కర్పించుచుండెను. నిత్యమును భగవన్నివేదిత ప్రసాదమామెకు సరిపడునట్లు రాఘవేశ్వరు నాజ్ఞ చొప్పునఁ దెచ్చియిచ్చెడివారు. ఆ ప్రసాదమును భుజించుటయుఁ దోఁటపని చేయుటయే యామెకుఁ గర్తవ్యములు. వయస్సులో నుండుట వలన నామె నెలనెలకు రజస్వలయై కొండదిగి నాలుగురోజుల వఱకుఁ గ్రిందనే యుండవలసి వచ్చెను. మరల నైదవరోజునఁ బోయి చూడఁగా మేకలు గొడ్లు తోఁటనంతయుఁ


బాడుచేసియుండెడివి. అది చూచి సహింపలేక యామహాభాగ, రఘూద్వహుని సన్నిధానమ్మున కేగి "ప్రభూ! నన్నింటికిబోనీవైతివి; ఇటచనుండి నీ యాజ్ఞప్రకార మొనరింప సాగనీవైతివి, నేనిప్పుడేమి చేయవలయును ? బ్రతినెల నేను వాకిటనుండి కొండ దిగిపోవుటయు, మరల వచ్చునప్పటికిఁ దోఁట నాశనమై యుండుటయు జరుగుచున్నది. ఈ బయటనుండే మిడిమే మేమిటి నాకు. నీ వేమి యశక్తుఁడవా ? ఈ దినముతో నాకీ ప్రతిబంధకముఁ దీసివేయుము. లేకున్న నా బాధకు మితిలే"దని ప్రపత్తి చేసెను. అదియే తుద, మరల నామె బయటికిఁ బోవలసిన పని లేకపోయెను. కైంకర్యము నిర్విఘ్నముగా సాగెను. చూచితిరా ? భగవదవ్యాజ కరుణ యొక్కొక్క యాత్మఁమీద నెట్లు ప్రసరించునో; అందఱి వలెనే చూచిపోవ వచ్చుటేమో. యామెను బలవంతపరచి దైవము తనసేవకు నియోగించుటేమో ? ఎంతటి భాగ్యము ? స్వయముగా రామునిచేఁ గోరఁబడి, యా రఘుప్రదీపకునకు నిత్యదాస్యమొనరింప నా సాధ్వి పురాకృతసుకృతపరిపాక మెంతని వచింపవచ్చును. బ్రహ్మాది దేవతలు నిరంతర మొనరించు మ్రొక్కులు గైకొనక పలుకక యుండు దైవ మొక్కొక్కపనికిరాని వ్యక్తినిఁ దనకుఁ దానై వలచి వచ్చి వానిఁబట్టుకొని వ్రేలాడుచుండును. అట్టివారి భాగ్యమే భాగ్యముగదా! సీతమ్మగారు మహాకోపము గలది. ఒక్కొక్కరోజున నేదియైనఁ దప్పుఁ జూచి యర్చకులమీఁదఁ జెలరేగి తిట్ట నారంభించినదంటే యందఱు నట్లే తలలువంచుకొని పోవలసినదేగాని మాఱుమాటాడ వీలులేదు. గడగడలాడవలసినదే. ఆడక యేమిచేయుదురు ? ఆమె రామచంద్ర స్వామివారి సొంతమానిసి. యామెను జెనక నెవరికి సాధ్యము ? నిజముగాఁ గోపమువచ్చి తిట్టిన నా పని జరిగియే తీరును. "శమప్రధానేషు తపోధనేషు గూఢం హి దాహాత్మకమస్తి తేజః" శాంతి ప్రధానులైన తాపసులయందు, లోకదాహకమైన తపస్తేజశ్శక్తి నిగూఢముగా నడఁగియుండును." అన్నాఁడుగదా కాళిదాసు. కావున నెల్లరు నామెనుజూచిన భయపడెడివారు. రామకైంకర్యము తక్క నామెకు రుచించునది ప్రపంచమున వేఱొండులేదు. ఆమె దేహసంబంధు లెప్పుడైన భద్రాచలము వచ్చెడివారఁట. ఒకటి రెండు రోజులున్న తరువాత సీతమ్మగారు చీఁకాకుపడి "మీ మూలాన నా తోఁటంతయుఁ బాడైపోయెను. దిగండి, దిగండి" యని వారిని కొండ దిగఁగొట్టివచ్చెడిదఁట. వారును మా సీతమ్మకు మాపై ననురాగముపోయెనను కొనుచు వగచి, వెళ్ళిపోయెడివారఁట. అట్టి పరమవిరక్త యా మహాభాగ.

గడ్డపుదాసుఁడు

స్వామి రామాయణ పారాయణమునకు వెళ్ళునప్పటికే సీతమ్మగారు భద్రాచలముఁజేరి రామకైంకర్యమున కారంభించి ముప్పది సంవత్సరములు గడచినది.

నెల్లూరుప్రాంతవాసియైన యొకరెడ్డి మహావిరాగి, భగవద్భక్తుండు, సీతమ్మగారివలెనే భద్రాచలమువచ్చి యట నిలిచిపోయెను. ఆయన పేరేమోగాని పెద్దగడ్డముండుటచే నాయనను జనులు గడ్డపుదాసుండని వ్యవహరించెడివారు. నిజమైన రామభక్తుండగుటచే భద్రాచలమున సీతమ్మగారికి నా విరాగికిం జక్కగాం గలిసెను. ఇద్దఱును గలిసి తోంటపని చేయుచుండెడివారు. తులసి, పువ్వులు కోసి రామున కర్పించుటకు గడ్డపుదాసుండు, సీతమ్మగారికి మంచి తోడాయెను. సీతమ్మగారిని వదలి గడ్డపుదాసుండును, నాయనను వదలి యామెయు, నొక్కక్షణమైన నుండలేరు. ఇరువురును దోంటలోని కుటీరమునం బడియుండెడివారు. సీతమ్మకంటెం గడ్డపుదాసుండు చాలంబెద్ద. స్వామికంటె సీతమ్మగారు చాలంబెద్ద. స్వామి వెళ్ళునప్పటికి గడ్డపుదాసుండు లేడు. పరమపదించెను. ఎక్కడి యేలూరు ప్రాంతవాసిని వెలమసీతమ్మగారో, యెక్కడి నెల్లూరురెడ్డి గడ్డపుదాసుండో యొకరి నొకరు విడిచి బ్రతుకలేకుండుటేమో! ఎక్కడి సంబంధమిది ? భగవద్దాస్య సంబంధమేగదా! అంతకంటె మిగిలిన సంబంధమేమున్నదసలు ? గడ్డపుదాసుండు గోచిమాత్రము ధరించియుండెడి వాండట. పైని నొకకంబళి, ఇది యాయన వస్త్రసంభారము. కౌపీన మెప్పుడు జీర్ణమైన నప్పుడు వోయి యారవైచియున్న సీతమ్మగారి చీరలోం గొంత చింపుకొని గోచిపెట్టుకొనివచ్చి "ఒరే సీతయ్యా, నీ చీరచింపి గోచిపెట్టుకొన్నానురా" యని సీతమ్మగారితోం జెప్పెడివాండంట. అంత నామె "యయ్యో యన్నయ్యా! యంతకంటెం గావలసిన దేమున్నది. నీవుండంబట్టిగదా చీరచింపి గోచిపెట్టుకొంటివి ? లేకున్న పెట్టుకొనువారెవరు ? మంచిపనిచేసితి" వని యానందించెడిదంట. వయస్సునం బెద్దయగుటచే సీతమ్మగా రాయనను గడ్డపుదాసుండన్నయ్యా యని పిలిచెడిది. ఎక్కడి యన్నయ్యయో! యెక్కడి చెల్లెలో! భగవద్దాస్యరసవైభవము. సీతమ్మగా రొక్కొక్కరోజున నేదేని నొక చిన్నవిషయమునొద్ద కోపపడి గడ్డపుదాసునిం దిట్ట చెలరేగెడిది. కోపము వచ్చిన నింక నామెకు ముందువెనుక యుండెడిదికాదు. పాప మింక నాగడ్డపుదాసుం "డోహో! యీవేళ మావిశ్వామిత్రుండు సెలరేగినాండే, యింక బ్రతుకంబారములే"దని మెల్లగాం గొండదిగి, యెచటికోపోయి యే గోదావరీతీరముననో భగవద్ధ్యానము సేయుచుండెడివాండంట. సీతమ్మగారి కోప మొకగంట మాత్రమే యుండును. తరువాత హృదయము హిమశీతలము. "ఉత్తమస్య క్షణంకోప"మ్మని మహాత్ములకెవరికైన నంతే. ఎంతత్వరగా నదివచ్చునో, యంతత్వరలోం బోవును. వచ్చినప్పుడు మాత్రము తాటియాకుమంటయే. పిమ్మట సీతమ్మగారు, తనకోపమునకుం దానే పశ్చాత్తాపపడి కొండదిగి యూరివెంటం గనంబడిన వారినెల్ల "నీవేళ మాగడ్డపుదాసుండన్నయ్య యెచటనైనం గనిపించెనా?" యని యడుగుచు, వెదకివెదకి చివరి కెచటనో పట్టుకొనెడిది. పట్టుకొని యాయనను గౌంగిలించుకొని "యన్నయ్యా! నా కోపము నీవెఱుంగవా ? యేదో

నోటియుదగ్రతవలన నాలుగుకేకలు వైచినంత మాత్రమున నిట్లలిగి వత్తువా ? నన్నేపై పొమ్మని యిట్లువచ్చితివి ? ఎంత ప్రొద్దెక్కిపోయినది. యింతవఱకును భోజనము లేకపోయె రా వెళ్లుద మనఁగా నిఁకనాయన "చాలులేవమ్మా! తల్లీ! యిక నీ కోపము భరించలేను. భరింపలేక యిచట నెక్కడో తలదాఁచుకొందమని వచ్చిన నిచటను బ్రతుకనీయకుండవచ్చితివా ? భోజనమా నా బూడిదయా ? భోజనము చేసినట్లే యున్నది. ఇఁకను మాత్రము నేను రాను. ఋణ మీనాఁటితో నీకును నాకును దీఱిపోయె" నని విసుగుకొనుచు వెళ్ళిపోవుచుండఁగా నామె యడ్డమువోయి కౌఁగిలించుకొని, కదుపునఁ దలఁబెట్టి భోరున నేడ్చుచు, నిఁకను మాత్రము తిట్టను. నీవు వెళ్ళిపోయిన నేను క్షణమైన బ్రతుకఁగలనా ? యని యెన్నియోవిధముల బ్రతిమాలగా "నన్ను జావనీయవు బ్రతుకనీయవేమి చేయుదును. సరే పద" యని యాయన తిరిగిరాగా వెంటఁబెట్టుకొని సీతమ్మగారానందపడుచు వెళ్ళి యప్పుడు గడ్డపుదాసునకు భోజనము పెట్టెడిదఁట. మరల మామూలుగాఁ దులసీకైంకర్య మిరువురుగలిసి చేయుచుండెడివారు. కాని నాలుగైదునెలలు గడచుసరికి సీతమ్మగారు కోపపడుట, గడ్డపుదాసుఁ దలిగివెళ్ళుట, యాయనను వెదకి బ్రతిమాలి యామె మరలఁదీసికొనివచ్చుట మామూలే. సారెసారెకు నిఁకఁదిట్టనని చెప్పి మరల యథాపూర్వముగానే కోపించు చున్నదిగదా యని, యాయనయు వెళ్ళిపోఁడు. ఆమెయు నయ్యో తిట్టితినిగదా మరల నెట్లుతీసికొనివత్తునా యని యూరకుండదు. ఒకరిని విడిచి మఱియొక రుండలేరు. "క్షణేపితే యద్విరహోతి దుస్సహః" అన్నట్టి మహాత్ములు వారు. అట్టివా రొకరిని విడిచి యొకరు బ్రతుకఁగలరా ? విడిచి పోయిన మరల నట్టివారెచట లభింతురు. "స్వభావోదురతిక్రమ" యన్నట్లు పాపమామె యేమిచేయును! కోపమువచ్చినపు దాపుకొనలేదు. అట్టి వారి కట్టికోపముండుటయు నొక శోభగానే యుండును. ఒకసారి భద్రాచాలరామచంద్రస్వామివారిమీఁదనే, దేనికో ప్రసన్నుఁడై పలుకలేదని యలిగి సీతమ్మగారు, 'నీకుఁజేసెడి యీచాకిరి యేదివ్యక్షేత్రమున, నేమూర్తికిఁ జేసిన నేను గడతేరలేను? పోనీ నీవేనా. నాకు శిష్టాదిగురుఁడవు ? వెళ్ళిపోవుచున్నా"నని బయలుదేఱి, చెర్ల యను నొక యూరికేగి యచట నృసింహస్వామి యాలయమునందుఁ గల్యాణ మంటపము మీఁద బరున్నదఁట. నిద్రపట్టగానే రామచంద్రస్వామివారు కలలోఁ గనఁబడి, నే నుండుమని చెప్పినదెక్కడ ? నీవిచటికేలవచ్చితివని జుట్టుపట్టుకొని లాగి మంటపముమీఁదనుండి క్రిందఁబడవైచెనఁట. అంత నామె మేల్కొని చూచుసరికి నెత్తైన యా మంటపము మీఁద నుండి తాను గ్రిందఁబడి యుండెను, గాని శరీరమునకు దెబ్బ తగులలేదు. అప్పుడామె మరల భద్రాచలముఁ జేరెను. ఆహా! భగవదంగీకార మామె యం దెంతపట్టుదలతో నున్నదో చూచితిరిగదా ?



పద్యాల వేంకట సుబ్బయ్యగారు, దుర్గమ్మ గారు (సతీపతులు) పూడివాడ.

గడ్డపుదాసుఁ డొకదినమున నుదయమందే లేచి యలవాటు చొప్పునఁ గంబళి భుజమున వైచుకొని గోదావరికి స్నానమునకుఁ బోవుచుండెనఁట. అప్పుడు క్రొత్తగా నొక బెంగాలుదేశపు బ్రాహ్మణుఁడు భద్రాచలమునకువచ్చి మిఠాయి దుకాణము పెట్టియుండెను. అతఁడు గ్రొత్తగా నిల్లుకట్టుకొనుచుఁ బ్రక్కనే గోదావరికిఁ బోవుచున్న గడ్డపు దాసునిఁజూచి "గడ్డపుదాసుఁడూ, గడ్డపుదాసుఁడూ! నీవును నా సీతమ్మయుఁ గొండమీఁద నా నల్లరాతికి నేలసేవజేసెదరు ? నా యింటిపనికి మీయిద్దఱును రండు. చెరియొక యాఱణాలు డబ్బు లిచ్చెద నని పరిహాసమాడెను. ఎప్పుడును గోపమెఱుంగని యమ్మహానుభావునకుఁ గొండమీఁది నల్లరాతి కేలచాకిరి చేసెదరన్నమాట వినఁగానే యొడలు తెలియనంత కోపము వచ్చెను. వచ్చి వెనుకకుఁ తిరిగి "ఏమిదీరా నీవిప్పుడు కూసినకూఁత కొండమీదఁ నల్లరాతికి సేవచేయుచున్నామా ? సరే నీ విల్లుగట్టి గృహప్రవేశమైన పదునేనవరోజున నీయిల్లు తగులఁబడకపోయినఁ గొండమీఁదిది నల్లరాయియే. మేము చేయుపని వృథయే. పదునాఱవదినమున నేనును సీతమ్మయు నీకుఁ గూలికేవచ్చెదము. అప్పు డాఱణాలు డబ్బులిత్తువు గాని. తగులఁబడిపోయిన, నదినల్లరాయికాదనియు, వాఁడు దైవమనియు, నెఱుఁగు"మని పలికి కోపాతిశయముచేఁ గన్ను లెఱ్ఱనైపోవఁ ద్వరత్వరగాఁ బోయి స్నానముచేసి యింటికివచ్చి సీతమ్మగారితోఁ జెప్పెను. ఔరాఁ బ్రాహ్మణున కెంతమదమెక్కినది! యెంత మాటన్నాఁడు! అని యామెయు మండిపడెను.

బ్రాహ్మణుఁడు గృహముఁగట్టుకొని యందుఁ బ్రవేశించెను. పదునైదవరోజున మిఠాయి వండుచుండఁగా మధ్యాహ్న సమయమున నాయింటి కంటుకొని తగులఁబడిపోయెను. చేసిన శ్రమయంతయు వ్యర్థమాయెను. డబ్బును నష్టపడెను. నష్టపడదామఱి. అంత మదమేల వచ్చెను ? సర్వసంగపరిత్యాగముఁజేసి, లోకాతీతులై, లోకముతోఁ బ్రసక్తిలేక నర్తించు తాపసులతోఁ దనకేమిపని ? ఆ మాత్రము భగవద్బలము వారియందు లేనియెడల నిఁక రేఁబవళ్ళు వారుచేయుపని కర్థమేమున్నది ? వారికీ లోకమున ఎవరు సహాయపడువారు లేరు గదా యని నోటికివచ్చిన మాట లనవలసినదేనా? వారికి లోకమున నశక్తులైన మనుజుల సహాయమేల ? "బ్రహ్మతేజో బలంబల"మ్మని, తపోబలమునకు మించిన బలమేమిగలదు ? "సాదురేగిన నిఁక నిల్వరాదురన్న" యని, వారికి నిగ్రహము కలుగకుండ నుండవలయును గాని, కలిగినపిదప నూరకపోవునా ? ఇట్లే మూఢులు పెక్కురు మహాత్ముల జోలికిఁబోయి యనవసరముగాఁ దత్కోపాగ్ని కింధనము లగుచుందురు. పాపము బ్రాహ్మణున కాదెబ్బతోఁ గనుల కావరము దిగిపోయి, మంచిజ్ఞానము కలిగెను. జీవితములో మరల నట్టిదైవ దూషణ మతఁడు చేయలేదు. భగవద్భక్తులన్నను, బెద్దలన్నను దగు జాగరూకతతోఁ బ్రవర్తించెను. స్వామి పారాయణసమయమున బ్రాహ్మణుఁ

డచ్చుటనే యుండెను. గడ్డపుదాసుని దెబ్బ యతనిని క్షణే క్షణే మేలుకొల్పుచునే యున్నదికాఁబోలు స్వామి విషయమున నత్యంత భక్తిశ్రద్ధలు చూపి వర్తించెను.

సీతమ్మగారి బృందము

స్వామిని సీతమ్మగారును, సీతమ్మగారిని స్వామియు భగవదంత రంగులని పరస్పరము ప్రథమదర్శనముననే గుర్తించిరి. ఉన్నంతకాలమును వారి స్నేహమత్యంతముగాఁ బెరిగిపోయెను. తీరిక చిక్కినపుడెల్ల వచ్చి, పారాయణ మంటప మటకు దగ్గఱగుటచే, సీతమ్మగారు స్వామిని సందర్శించుచుండెడిది. ఒక్కొక్కరోజున నామెకు హితులైన వారినెల్లఁ బోగుచేసికొనివచ్చి రాత్రిపూట స్వామిచెప్పు రామాయణమును విని యానందించి "ఈ సమయమున గడ్డపుదాసుఁ డన్నయ్య కూడ లేకపోయెనుగదా" యని యాయన సంగతులు వచించి దుఃఖపడుచుండెడిది. స్వామియు నామె యాశ్రమమునకుఁ దఱచుగా వెళ్ళుచుండెడి వారు. స్వామి యం దామెకు గురుభావము కుదిరెను. స్వామి నామె 'యయ్యగారూ!' యని పిలిచెడిది.

దురాచారులైన యర్చకుల సాంగత్యమువలన నా కాలమున నచట నొక గొల్లది. నివసించుచుండెడిదఁట. అది మంచి వయస్సులో నున్నది. కొంత రూపముగలది కూడ. దుర్వర్తనము గలదియగుటచే దానిఁజూచినపుడెల్ల సీతమ్మగారికి మంట. అందువలన నదియు సీతమ్మగారినిన స్పర్థతో నుండెడిది. కాని చాటున ననవలసినదేగాని యది సీతమ్మగారి యెదుటఁబడలేదు. పరమనీచయైన దానికిని సీతమ్మగారికిని నెక్కడిపోలిక! గొల్లదియు. భగవద్భక్తులు, మహాత్ములనిన కొంత విశ్వాసముతో భక్తిశ్రద్ధలతో నున్నట్లు నటించుచుండెడిది. సీతమ్మగారు తన సంబంధులైన వారెవరైన, దానితో మాట్లాడిన, నూరుకొనదు. స్వామి కీ సంగతి తెలియును. సీతమ్మగారెక్కడఁజూచునో యని వారు భయపడుచుండగా నది భక్తురాలువలె స్వామికి నమస్కరించి పారాయణసమయమున నపుడపు దేదో ప్రసంగము చేయవచ్చెడిది. సీతమ్మగారి భయమువలన నది యడిగిన ప్రశ్నకుఁ గ్లుప్తముగా సమాధానముఁజెప్పి వెంటనే వారి పని వారు చూచుకొనుచుండెడివారు. ఇది చూచి సీతమ్మగా రప్పుడప్పుడు స్వామితోఁ బురాణ కాలక్షేపమందు మాట్లాడుచు, "నయ్యగారూ! మీరును రంగనాయకమ్మక్కయ్య, వేంకటమ్మక్కయ్య, భద్రదాసు, నేను, మనమంతయు నొకపార్టీ గొల్లదాని దొకపార్టీ. మీరు గొల్లదాని పార్టీలోనికి వెళ్ళితిరా నేను సహించునదిలేదే" యనుచుండెడిదఁట. స్వామియు "నయ్యో! యాదరిద్రపు ముండతో నాకేమిపనిగలదమ్మా? వచ్చియేదో యడిగిన సమాధాన మీకున్న గర్వమని లోకమాక్షేపించునని భయముతో మాట్లాడుటేగాని, లేకున్న దానితో మాకేమిపని ? దాని బూడిదపార్టీ, యా పార్టీలోనికి నేనెట్లుపోవుదు"నని సమాధానము చెప్పుచుండెడివారఁట.

ఇట్లుండగా నొకదినమున స్వామి పారాయణ మాచరించుచుండఁగా నా గొల్లది, "యయ్యగారూ! భగవత్ప్రసాదముఁదీసికొండ"ని రామ నివేదితమైన కొబ్బరిముక్కల ప్రసాద మాలయము నుండి తెచ్చి యీవచ్చెను. స్వామి యప్పు డేమిచేయవలయునా యని విచారించెను. భగవత్ప్రసాద మీరాఁగాఁ దిరస్కరించుట యపరాధము. అట్లని తీసికొనునా సీతమ్మగారు చూచునేమో, చూచిన ఆమె యూరుకొనదు. కర్తవ్యమేమి యని యాలోచించి, కానిమ్ము భగవత్ప్రసాదము నేలయనాదరింపవలయునని భయము భయముగాఁ దీసికొనెను. సీతమ్మగారితోఁటయు నాశ్రమమును బ్రక్కనే యున్నవి. ఏదో పనిమీఁద బయటికివచ్చిన సీతమ్మ గొల్లదియిచ్చిన ప్రసాదమును స్వామి గ్రహించుట చూడనేచూచెను. ఆమె చూచుట స్వామియు గ్రహించెను. గొల్లది వెళ్ళిపోయెను. సీతమ్మగారికిఁ గోపావేశమున నొడలు దెలియుట లేదు. అందువలన నామె స్వామి పారాయణమంటపము కడకును దోఁటకడకును వల్లెవాటుగా రెండుమూడు పర్యాయములు తిరిగెను. సీతమ్మగారి కోపమును దిలకించి స్వామి యాహా యీవేళ నేదో మూడునని యనుకొనుచుఁ గానిమ్మని మరల మంటపము వైపునకు వచ్చిన యామెతో "నేమిటి సీతమ్మగారూ! వల్లెవాట్లు వల్లెవాట్లుగాఁ దిరుగుచున్నా" వనెను. అదివఱకేకోపము నెటులు వెడలఁగ్రక్క వలయునా యని యున్న సీతమ్మగారామాటతో మండిపడి "ఏమిటా ? యెత్తుభారము. నేనొకదానిని బ్రతికియున్నాను, బనికిమాలినదానను. నా కసలు కోపమువచ్చిన మంచిదాననుగాను. గొల్లదాని ప్రసాదముఁ జూచునప్పటికి నొడలుప్పొంగిపోవుచున్నదేమండీ ?" యని విసురుకొనెను. "భగవత్ప్రసాదమని యీరాఁగాఁ దిరస్కరించుట మంచిదిగాదని గ్రహించితినమ్మా' యని పలికి యిఁక నది సమయముగాదని స్వామి యూరకుండెను. సీతమ్మగారాశ్రమమునఁ బ్రవేశించెను. గొంతసేపటి కామె కాకోపమంతయుఁ జల్లారిపోయెను. మరల "నయ్యగారూ! యీవేళఁ జాలఁబ్రొద్దెక్కినది. పారాయణ మింకఁ గానేలేదే" యనుచు నామె వచ్చెను. ఈమాటు కోపవైఖరి లేదు. అప్పుడు స్వామి యాహా! యిప్పటికిఁ దగ్గిపోయినది కోప మని ప్రసాదమును దీసికొనుటకుఁ గారణమును జెప్పి కొంతవడి ప్రసంగించెను. సరే యట్లాగటండీ యని యామె యానందపడుచు వెళ్ళిపోయెను. స్వామికిని సీతమ్మగారికిని నొకరినిఁ జూచిన నొకరి కెంత భక్తియో, యెంత యానందమో, యెంత ప్రేమయో యంతభయముండెడిది. సీతమ్మగారి కోపము నూటమూడు డిగ్రీలవేడిలోనున్న స్వామికోపము, నూటనాలుగుడిగ్రీల వేఁడిగలది. రామకైంకర్య నిరతురాలామె. రాఘవేశ్వర సేవా కైంకర్యనిరంతరుఁడు స్వామి. లోకముతోఁ బనిలేని పరమవిరక్త యామె. జగత్తును దృణీకరించిన బ్రహ్మర్షి యీయన. తనకుఁదానై రామునిచేఁ దులసీకైంకర్యమునకు గ్రహింపఁబడిన యోగిని సీతమ్మ. భక్తిసిద్ధాంత సామ్రాజ్యములఁ బ్రపంచమున విరఁజిమ్ముటకు స్వయముగా రఘూత్తమునిచేఁ గైకొనఁబడిన

పరమహంస వేంకటదాసస్వామి. స్వామియందు మఱియెక్కుడు తేజస్సు, తపము, విద్యాశక్తి. ఆహా! యిట్టి మహాత్ము లకల్మషరామభక్తులు జగమున నెచటనైనఁ జూతమన్న దొరకరు. దొరకరు.

ధర్మపురనివాసియు, నాభీరవంశజాతుఁడు ఐన యొక బైరాగి భద్రదాసను నతఁడపుడచట నివసించుచుండెను, నతఁడు రామభక్తుఁడే కాని జ్ఞానవికాసము లేకయుండెను. అతఁడును స్వామి నాశ్రయించి వారిబోధవలనఁ జైతన్యము నొంది, స్వామివెంటఁ దిరిగి వచ్చునప్పుడు పూడివాడకు వచ్చెను. అతనికిఁ బెండ్లిగిండ్లి లేదు. స్వామి పాదాశ్రయణమున నతఁడు నిరంతరరామపదధ్యానమాచరించి పవిత్రుఁడాయెను. స్వామిచేసిన పరిచయమువలన నీదేశమునందుఁగూడ నాయనను బ్రజ మిక్కుటముగాఁ బూజించిరి. కాని ప్రకృతి బలీయసి గదా! ఈమధ్యకాలములోఁ గొంత జ్ఞానభ్రష్టతనొంది చెడెను. మరల నిప్పుడిప్పుడు బాగుపడినట్లు తెలియచున్నది.

ఇట్లు సీతమ్మగారు, వారిబృందము, భద్రదాసు మొదలైన భగవద్భక్తులతో రేలందు భగవత్కథా కాలక్షేపముతో నానంద కోలాహలముగా స్వామి రామాయణ పారాయణముఁ గావించుచుండెను. రెండుమాసములు గడచెను.

విషాదలేఖ

స్వామి భద్రశిఖరికి వెళ్లునపుడు రాధమ్మగారు గర్భవతిగా నుండెనుగదా. ఆమెకుఁ బ్రసవదినములు సమీపించెను. సమీపించిన కొలఁది నీరుచూపి, యత్యధికముగా నామె యొడలు వాచిపోయెను. అనారోగ్యము ప్రబలి లేచికూర్చుండు స్థితికూడఁ దప్పిపోయెను. క్రమక్రమముగాఁ బ్రమాదస్థితి యేర్పడుచుండెను. ఇంటిదగ్గఱ నున్న వారును వేంకటసుబ్బయ్యగారును గర్తవ్యమేమి యని విచారించిరి. వైదులెందఱెన్ని యౌషధము లిచ్చుచున్నను, రాధమ్మగారి స్థితి దినమున కొకరీతిగాఁ జెడుచుండెను, గాని ఫలము కనఁబడుటలేదు. స్వామి కీ విషయము దెలియఁబఱచుటయా, తెలుపకుండుటయా, యని యాలోచించిరి. తెలుపకుండిన నామె యెట్లుండునో, తెలిసిన గొందంత పని పెట్టుకొనివెళ్ళిన స్వామి యా పని నేమిచేసిరావలయునని కొలఁది దినములు భగవదనుగ్రహమునకై నిరీక్షించుచు నాగిరి. కాని రాధమ్మగారికి స్వాస్థ్యము వచ్చునట్లు కనఁబడలేదు. జూచినవారికెల్లరికి నామె జీవించునను నాస కలుగుటలేదు. స్వామి కీ విషయము నింతకాలము వఱకు నేల తెలయఁజేయరైతిరని యిరుగుపొరుగులవారెల్లరునుఁ గేకలువైచిరి. అంతఁ జేయునది లేక వేంకటసుబ్బయ్యగారు రాధమ్మగారి ప్రమాదస్థితియంతయు వ్రాసి

స్వామికి భద్రాచలముఁ జేరునట్లుగా నొకలేఖ వ్రైచెను. నాలుగైదు రోజుల కది భద్రశైలమున కేగెను. సరిగా రామాయణపారాయణమున కుపక్రమింపఁబోవుచుండఁగా నా లేఖను దెచ్చి యొకఁడు స్వామిచేతి కిచ్చెను. ఉత్తరమును జూచుటతోడనేస్వామి నివ్వెఱపోయెను. లేఖ చాల నశుభముగా నున్నది. దానివైఖరి యంతయు నందినవెంటనే క్షణమైన నాలసింపక రావలయునని ఘోషించుచున్నది. స్వామి విషాదమునుజూచియు, నీ వార్తను వినియు నొక వందమది జనము పరివేష్టించిరి. ఎవరికిఁ దోఁచినట్లుగా వారు మాట్లాడుచుండిరి. అట్టి పరిస్థితిలోనున్న యామె నసలెట్లు వదలివచ్చితిరని యొకరు, మీ భగవద్భక్తులైనవారి కెల్లరికి నుండు పిచ్చి యిట్లేయని యొకరు, లేవండి లేవండి మూటముల్లెఁగట్టరేమి ? యని యొకరు, నిచ్చవచ్చినట్లెల్ల భాషించుచుండిరి. తిరిగి యింటికివెళ్ళుటకు వీలుగాక, స్థాయిగాఁ బారాయణము చేయుచు నుండ మనస్కరింపక నడిసముద్రమునఁ బడినట్లుండుటచే స్వామి యేమియుఁ బలకక నిర్విణ్ణుఁడై కూర్చుండియుండెను. ఇంతలో నమరవాది సీతారామా చార్యులవారను నొక వైష్ణవపండితుఁడు, స్వామిస్నేహితుఁ డచటికి వచ్చెను. ఆయనకు దినముక కొకసారియైన స్వామినిఁ జూడనిదే తృప్తిలేదు. అట్లు వచ్చుసరికి నచట గందరగోళముగా నుండెను. ఏమిటీకల్లోలమునకు హేతువని యడిగి తెలిసికొని, యా యుత్తరమును దీసికొని చదివెను. పిమ్మట నాయన తలయొక విధముగా మాట్లాడుచున్న యా పామరజనము నంతయును, "లేవండి, లేవండి, మీకేమి తెలియునని మాట్లాడుచుంటి"రని గద్దలువైచి విసరి యా ప్రాంతమునుండి వెడలఁగొట్టెను. పిదప నా వైష్ణవుఁడు స్వామిని సమీపించి, "మీ యభిప్రాయమేమి ? యింటికి వెళ్ళవలయునని తలచుచుంటిరా ?" యని ప్రశ్నించెను. అంత స్వామి "ఏమి చేయుటకుఁ దోఁచుటలేదండి!" యని సమాధానమిచ్చెను. పిదప నా పండితుఁడు "మీ రింటికి వెళ్ళవద్దు. స్థాయిగాఁ బారాయణముఁ జేయుఁడు. గృహమునకు వెళ్ళి మీరు చేయునదిలేదు. రాధమ్మగారి వ్యాధిని తీసివేయలేరు. ఏకైక భగవత్సేవ యందున్న మీ కీ సమయమున నాపత్తురాదు. అట్లు వచ్చినఁ గులశైలములు క్రుంగిపోవును. దివాకరుఁడు పశ్చిమమున నుదయించును. సర్వరక్షకుఁడు, సర్వనియంత, సర్వభారవహుఁడైన, రాముని పనిమీఁద నుండఁగా మీ కాపదవచ్చిందంటే యీ శాస్త్రములన్నియు నేల కాల్పనా ? ఆ రామాయణము నెత్తుకొనిపోయి గోదావరి బురదలోఁ ద్రొక్కి రావలసినదే. ఈ యజ్ఞోపవీతమును నాకేల ? త్రెంచి ప్రొయ్యిలోఁ బాఱవైచెదను. ఇట్లే మహాత్ములు కొందఱు తొంబదితొమ్మిది మెట్లెక్కి యొక్క మెట్టు నెక్క లేక భంగపడుచుందురు. ఏ యధ్యవసాయముతో మీరు బయలుదేఱివచ్చితిరో యా నిశ్చయమునుండి తప్పవద్దు. భద్రాచల రాఘవేశ్వరుఁడు రాధమ్మగారికడ మంత్రసానియై బిడ్డను గనిపించి "ఫలానా" బిడ్డ యని మీకువచ్చి చెప్పకపోయిన నేను గులములోనుండి

వెలివడెదను. మీరేమియుఁ దత్తరపాటొందవలదు సర్వజ్ఞుఁడు, సర్వశక్తుఁడు, దయాసముద్రుఁడు నైన భగవానునికి దాస్యరతులై మీరిటనుండఁగా రక్షింపలేకున్న నా సేవవలన ఫలమేమి ? "తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహ" మ్మని వాఁడు చెప్పుచుండఁగా భయపడవలసిన పనియేమున్నద" ని యిట్లు శ్రీవైష్ణవుఁడు భగవదావేశమున మహాప్రవాహముగాఁ జెప్పివైచెను. నిజముగా నా పలికినవాఁడు రామచంద్రస్వామియే. లేకున్న నట్టిస్థితిలో నంతగట్టిగాఁ బలుక మనుజులకు శక్యమగునా? పిడుగువంటి వార్తచేఁ గాలుష్యము నొందియున్న స్వామి జ్ఞానజ్యోతి, సీతారామాచార్యుల వారి వాక్యములచేఁ జక్కగా భాసించెను. ఇంటికివెళ్ళక పారాయణముఁ జేయుచుఁ దమకార్యమును నిర్వహించుకొనుటకే స్వామి నిశ్చయపడెను. "నేను వచ్చుటలేదు. జగదీశ్వరుఁడే సర్వభారవహుఁడు. జాగరూకతతో మాత్రముండు" దని స్వామి యింటికి నుత్తరము వ్రాసెను.

కొన్ని దినములు గడచెను. మరల నింటియొద్దనుండి లేఖస్వామికి రాలేదు. ప్రతిదినమును సీతారామాచార్యులవారు స్వామికడకు వచ్చి "యింటికడనుండి యేదైన వార్త వచ్చెనా ?" యని యడుగును. రాలేదని తెలియఁగనే, "ఈమాటు రాధమ్మగారికి నేమిబిడ్డ కలుగునబ్బా! యని వికల్పించి, భద్రాచల రాములువారు (అనఁగా మగపిల్లవాఁడే) పుట్టు"నని యనును సీతమ్మగారును "రాధమ్మగారు హాయిగాఁ బ్రసవించి సుఖముగా నుండెనాసరే. లేకున్న నిఁక నేనును రామునకుఁ దులసీ కైంకర్యముచేయను సుమా" యని పలుకును. భక్తవాక్యంబుల బాలవాక్యంబుల భగవంతుఁడుండునని పెద్దలు చెప్పుదురు. మహాత్ముల వాక్యములువ్యర్థమగునా ? వారి హృదయములకుఁ దగిలిన మంచిగానీ, చెడుగానీ యూరకపోదు. మఱికొన్ని రోజులు గడచినవెనుక నింటిదగ్గఱనుండి, రాధమ్మగారు ప్రసవించిన దనియుఁ, మగపిల్లవాఁడనియు, నుత్తరము వచ్చెను. ఇంటిదగ్గఱనుండి వచ్చిన యుత్తరమనఁగనే, కృష్ణవేణమ్మగారేమిసంగతివచ్చినదో యని ముందెవరితోనో జదివించుకొని విని, శుభవార్తయే గనుక నప్పుడు దానిని దీసికొని దేవాలయమునఁ బారాయణము చేయున్న స్వామి కడకుఁ బోయెను. స్వామియు నాలేఖనుచూచి, భగవానుఁ దనుగ్రహించినందుల కెంతయు సంతసించెను.


వర్షము

ఒకనాఁడు స్వామి మధ్యాహ్నము రెండుగంటలకు మంటపమునకేగి పారాయణము మొదలిడెను. వెంటనే కారుచీఁకటులు గ్రమ్ముచు మింట దట్టముగా మేఘములు పట్టెను. ఉరుములు పిడుగులతో వాన ప్రారంభమాయెను. రెండుగంటల కారంభించిన వర్షము సూర్యాస్తమయమైనను నాగలేదు. మిన్ను చిల్లువడినట్లు, కడవలతోఁ గ్రుమ్మరించిన పగిది,

మహత్తరమైన ధ్వనితో జడివాన పడుచుండెను. జగత్తున కేదో ప్రళయము సంభవించుచున్నదని జనులు భయపడిరి. వీధులవెంట బొడ్డులోతున మహాప్రవాహముగా నీరు పాఱందొడఁగెను. చీఁకటిపడిపోయెను. స్వామి పారాయణము ముగిసెనుగాని యింటికి వెళ్లుటకుఁ దెఱపిలేక మంటపముననే నిలిచిపోయెను. నాఁ డిరువదిరెండు దుక్కుల వాన కురిసినదని ప్రభుత్వము లెక్కవేసినది రాత్రి యెనిమిదిగంటలగుసరికి నొక మాదిరిగా వర్షము తగ్గెను. ఇఁక లాభములేదని స్వామి రామాయణగ్రంథములను నంగవస్త్రములో ముడిచి యాపైని నుత్తరీయముఁజుట్టి తీసికొని బయలుదేఱి యింటికి వచ్చెను. స్వామి గృహమునకు వచ్చుసరికి కృష్ణవేణమ్మగారును, రత్తమ్మయు దీపమునకు నిరువైపులఁ గూర్చుండి, యంతప్రొద్దు పోయిన దనుక స్వామి రానందులకు నచట నేమాయెనో యనియు, నీ వర్షమునకుఁ బూడివాడలో నిండ్లదగ్గఱ బంధువులేమైరో యనియు వాపోవుచుండిరి. స్వామినిఁ జూచినపిదప "నయ్యో, యింటికడఁ బిల్లలేమైపోయిరో, ఈ వర్షము మనల నేమిసేయునో, మరల నిండ్లకుఁబోయి మనుమలను గోడలినిఁ జూడఁగలనో లేనో" యని కృష్ణవేణమ్మయు, "నయ్యో, చెల్లెలికూఁతు నొకదానిని బెంచుకొనుచున్నానమ్మ! యిఁక దానిఁజూచే పంతులేదు గాఁబోలునమ్మా! యిల్లు వాకిలి యేమయిపోయెనో" యని రత్తమ్మయుఁ జెఱియొక వైపున మొదలిడిరి. స్వామికి వారి యజ్ఞానమును, మాటలనుజూడఁగనే యపరిమితముగాఁ గోపము వచ్చెను. వర్షమునందు వచ్చుటచే వస్త్రములు తడిసిపోయెను. అందువలన స్నానమునకు నీరుదోడండి, యా తరువాత మాట్లాడెదనని స్నానమాడి, పొడిబట్టలు ధరిచి, యిఁక మునుమిడెను. "ఏమిటీ మీరిందాకనన్నది ? అధికముగా వర్షము కురిసినంత మాత్రమున నే యింటికిఁకఁ జేరరా? యింటిదగ్గఱవారినిఁ జూడముగాఁబోలునని విచారమా ? ఏమీ! యంతగఁగాఁ జచ్చిన లోకమునకు గొఱంత యేమిటి ? భద్రాచలరామసాన్నిధ్యమునఁ జచ్చుటకన్నఁ గావలసిన దేమున్నది ? మీ రిరువురును జచ్చినఁ బారవైచుటకు, దహనాది క్రియలు చేయుటకు, నే నిచటనే యుంటిని. ఒకవేళ నేనును బోయినఁ జిక్కేలేదుగదా. రత్తమ్మా! యెక్కడి చెల్లెలి కూఁతురు ? ఎక్కడి నీవు ? నే నింతకాలమునుండియుఁ జేసిన జ్ఞానబోధ యంతయు నేమైపోయెను ? తిని పడియుండలేక యంత పిచ్చివట్టి కొట్టుకొనుచున్నారా?" యని మండిపడెను. అంతటిలో గృష్ణవేణమ్మగారును రత్తమమ్మగారును గిక్కురుమనక యిల్లు దూరిరి.

గృహాగమనము

శ్రావణ మాసాంతమున స్వామి భద్రశిఖరికి బయలుదేఱి వెళ్ళెను. అప్పటికి మార్గశీర్షము సగము గడచిపోయెను. ఇంకను రామాయణము రెండుమూడు పర్యాయములు



పద్యాల విశ్వేశ్వరరావు గారు, కాంతమ్మ గారు (దంపతులు) పూడివాడ.

చదువవలసియుండెను. ఇంటియొద్ద వ్యవసాయతరుణము పైకొనుటచేఁ, గోఁతలు వెనుకఁ బడిపోయెనని లేఖవచ్చెను. ఇఁక ముప్పదిరెండు పర్యాయములకుఁ గొఱవడిన రెండుమూడుసారులు రామాయణ పారాయణము నింటిదగ్గఱఁ బూర్తి చేసికొనవచ్చు, నికఁ గృహమున కేగవలయునని స్వామి సంకల్పించెను. ముహూర్తమును నిర్ణయించెను. రేఁపు ప్రయాణమనఁగా నూరిలోఁ బరిచితులై యత్యంతప్రేమతో, విడిచి బ్రతుకలేమని వందురుచున్న స్నేహితుల కెల్లరకుఁ జెప్పెను. మిత్రులైన వైష్ణవపండితులకుఁ దమ ప్రయాణమునుగూర్చి చెప్పఁగా వారు స్వామి వియోగమున కెంతయుఁ జింతించి, మీవంటి పరమభక్తుల, మహాత్ముల నీ భద్రాచలమున నింతవఱకుఁ గానమైతిమి. ఏ జాతియందును నింతటి యచంచలవైదికనిష్ఠులఁ జూడలేదు. మీ సాంగత్యమున నీ నాలుగుమాసములకాలము మహానందముగా వెళ్ళిపోయినది. రామదాసుగారి చరిత్రమును విని తెలిసికొంటిమి. మీ చరిత్రమును గన్నులారఁ జూడ నోచితిమి. మీ యిరువురకును భేదము లేదు. సుఖముగాఁ బోయిరండు. మీ రిలుసేరగనే క్షేమముగాఁ జేరినట్లు లేఖ వ్రాయుఁ" డని రానున్న స్వామి యెడఁబాటున కెంతయుఁ బరితపించిరి.

స్వామి ప్రతిదినమును రేలందుఁజెప్పు రామాయణకాలక్షేపమును విని యానందించువారు వందలకొలఁది గలరు. భద్రాచలము పోలీసు కేంద్రమగుటచే నిత్యమును ముప్పదిమంది పోలీసులుకూడ వచ్చి యా పురాణమును వినిరి. వారికి స్వామియం దత్యంత భక్తి కుదిరెను. స్వామి యాప్రయాణమును వినఁగనే వారెల్లరు నిరుత్సాహులై వచ్చి "యయ్యా! మీ ప్రయాణమును, మా యందు దయయుంచి, రెండురోజు లాపుఁడు. మే మొకకోర్కి పెట్టుకొని యుంటిమి. మీరు గృహమునకేగు సమయమున మేమందరము నాయుధములతోఁ గూడ నొక రాష్ట్రాధిపతిని (గవర్నరు) సాగనంపునట్లు మిమ్ము క్రొత్తగూడెము వఱకును బంపిరావలయునని గంపెడాసతో నున్నారము. మీరు రేఁపే ప్రయాణమొనరించిన మాకోర్కి విఫలమైనట్లే. ఎందువలననఁగా మండలాధికారి (కలెక్టరు) నిన్ననే భద్రాచలము వచ్చి బసచేసి యున్నాఁడు. అతఁడు రేఁపును నిచటనే యుండును. ఉండఁగా మేమేపని చేయుటకును, నెటవోవుటకును వీలులేదు. మా యందుఁ బూర్ణానుగ్రహముంచి మా యీ చిన్నవాంఛఁ దీర్పుఁడ"ని వేడికొనిరి. స్వామి కెప్పుడును దంభమనిన బొత్తుగా గిట్టదు. కావున వారొనర్చెదమన్న యీదాంభికకృత్యము మనస్సునకు రుచింపక, నాయనలారా! మీ యీ భక్తి విశ్వాసములే చాలును. నన్ను మీరదేవిధమునఁ బంపినట్లే తలంచుకొనెదను. ఇప్పటికే కాలాతీతమైపోయినది. నేను వెళ్ళక తప్పదు. బనను విరాగులమై సత్త్వప్రధానులమైన మాకేల యా రాజసము. మీరిప్పుడు పల్కినమాటలే మాకుఁ జాలునని వారినోదార్చి నమాధానముచెప్పి వంపెను. భద్రాచలరఘునాత్తమునికడ ననుజ్ఞఁగైకొని

రెండవనాఁడుదయముననే బయలుదేఱిరి. పందలకొలఁది జనము గోదావరి వఱకును స్వామిని సాగనంపిరి. స్వామి గోదావరియందుఁ బడవనెక్కిరి. భక్తిగరిష్ఠలైన స్త్రీలు కొందఱు స్వామిని విడువనోపక వలదన్న నూరుకొనక గోదావరియందు అవికలుతడియువఱకును దిగి,

రామ వియోగదుర్భర పయోరాశిలోఁ
బడినట్టి కోసల ప్రజల భంగి
మధురాపురికిఁ బోవు మధుసూదనునిఁ జూచి
యల్లాడు గోపచంద్రాస్య లట్లు
కల పెన్నిధానంబు కానరాకేగిన
బలుదుఃఖమొందు పేదల విధాన
నారణ్యవాసార్థ మరుగుచున్నట్టి ధ
ర్మజు వీడలేని బ్రాహ్మణుల పగిది
స్వామి యింటికిఁ జనుచుండ సాగనంపి
వారి విడువంగలేక నెవ్వగలు మిగుల
నమల గోదావరీ పూరమందు నిలిచి
భోరుమని యేడ్చి రప్పు డప్పుణ్యవతులు.

నట్టిభక్తుల వియోగంబునకుఁ గొంత దుఃఖించి వారి ననునయించి యెట్టకేలకుఁ బ్రయాణంబు సాగించె. వారును, స్వామి యధిరోహించిన యక్కలము గానవచ్చువఱకు నట్లే నిలువఁబడి పిదప వెనుకకుఁ దిరిగి మరలిమరలి చూచుచుఁ జేయునదిలేక శోకవివశలై యిండ్లకేగిరి. స్వామియుఁ గతిపయప్రయాణంబుల నూరుచేరెను. స్వామి వచ్చుచుండెననఁగనే పూడివాడయందున్న భగవత్సంబంధులెల్లరు నెదుర్కొని

పలుమారు శ్రీరామ భవ్యచారిత్రంబుఁ
జదివిన పావనాస్యంబుతోడఁ
సత్త్వదీక్షావాప్తి జటిలమై యెదిగిన
యింబైన బవిరిగడ్డంబుతోడ
రాఘవేశ్వర పాదరాజీవ సేవచే
మునరాడు బ్రహ్మవర్చసముతోడఁ
గడు నున్ననై యొప్పు నిడుద ఫాలమునందుఁ
గొమరారు నూర్ధ్వపుండ్రములతోడ

వచ్చు బ్రహ్మర్షివర్యు నిర్వహితఘోర
నిష్ఠురోదగ్రతరతపోనిర్మలాత్ము
శాంతికళికావికాస ప్రసన్నచిత్తు
స్వామిఁ గాంచిరి కనుల పాపములు వోవ.

ఇట్లు దర్శించి నమస్కరించిన యబ్భక్తబృందమును గుశలమడగి వారితో గృహమునకు వచ్చి స్వామి భద్రశిఖరిని రామసాన్నిధ్యమునఁ దా నాచరించిన తపో విధానంబును, జరిగిన విశేషంబులును నచటి భక్తుల చరిత్రంబును నంతయుఁజెప్పి యానందపరచిరి. రామసన్నిధినిఁ దపోనియమంబునఁ దాముండగా జన్మించినందున నపుదుద్భవించిన యబ్బాలకునకు దాశరథి యని నామకరణం బొనర్చిరి. ఇట్లు ప్రభవనామ సంవత్సరమునందు స్వామి తమ ముప్పదియైదవ యేఁట భద్రాచలంబున రాఘవేశ్వరుని సమీపంబున రామాయణ తపంబుఁ గావించి యిలుసేరిరి. భద్రశైలంబునఁ బారాయణము సేయునపుడేమియుఁ గన్పట్టలేదు, గాని యింటికివచ్చిన పిదప స్వామి రెండుమాసముల వఱకుఁ గూర్చుండలేకపోయెను. కూర్చుండినఁ బ్రేవులును గడువును నధికముగా నొప్పి పుట్టసాగెను. పారాయణసమయముననే నట్టి స్థితిగల్గినఁ గార్యభంగమగును. కాని భగవంతుఁడు వారి విషయమున నట్లేలచేయును ? కురుపాండవయుద్ధమంతయు ముగిసిపోయిన వెనుక భీష్మద్రోణాదుల యస్త్రములచే నప్పుడే కాలిపోవలసిన యర్జునుని రథమును శ్రీకృష్ణస్వామి యంతదనుక నాపి యప్పుడు కాలవిడిచెను గదా. వాని కసాధ్యమేమున్నది. అట్లే స్వామికింటికిఁ జేరినపిదప నీ యనారోగ్యము సంభవించెను. సీతారామాచార్యులువారును స్వామినిఁ జూడవచ్చి యీవిషయమును దెలిసికొని, "నాయనా! రామాయణమున సూక్ష్మలములైన బీజాక్షరము లనేకములున్నవి. అందువలనఁ బ్రేవులన్నియు నుడికిపోయినవి. కొంత విశ్రాంతిమీఁదఁగాని మరలఁ బాటునకు రావ"ని చెప్పిరి. అట్లే రెండుమూడుమాసములు గడచునప్పటికా బాధ పోయి స్వామికారోగ్యము చేకూరెను. ఎప్పుడైననేమి స్వామి తమ జీవితకాలమున శ్రీమద్రామాయణమును నూటయిరువదిసారులు పారాయణ మొనరించిరి.

స్వామి నొక భగవన్మూర్తిగా నూరివారు దలంచుచుండిరి. ఊరివారేగాదు దేశమే యట్లుభావింపసాగెను. వారి నిస్సంగత, తేజము, ప్రభావము, పాండితి, యకలుషభగవత్ప రత్వము, తపోగరిష్ఠత, దేశమునకుఁ దెలిసినకొలంది వారియందు భక్తివిశ్వాసములు హెచ్చిపోయెను. వారివాక్యము వేదాక్షరముగా జనులు తలఁదాల్పసాగిరి. వీధివెంట స్వామి వెళ్ళుచుండఁగా నెట్టి, మూర్ఖులును గూర్చుండలేకపోయెడివారు. వారు దూరమేగువఱకును లేచి యట్లే నిలువఁవలసినదే. ఆ తేజోబల మట్లు ప్రేరించుచుండెను.

ఆచార్య పీఠాధిష్ఠానము

ఒకపరి తమ బోధవలన భగవద్భక్తి కభిముఖులైన కొందఱిని జూపి వీరిక్సిఁ బంచసంస్కారము సేయుమని గురువులైన సీతారామాచార్యులవారినిఁ గోరగా వారు, నాయనా, నీవే చేయుము. నీచేతితోఁ బంచసంస్కారము నొందుటకన్న నధికముగలదా యని స్వామికి సుదర్శనపాంచజన్యము లిచ్చెను. అదివఱకే స్వామివలన మంత్రదీక్ష నొందవలయునని యాశించి తిరుగుచున్నవారికెల్ల దీక్ష నొసంగుట కిట్లాచార్యానుమతి వచ్చెను. పిదప సమీపగ్రామవాసియగు నొక పవిత్రుని కలలోఁగనఁబడి భగవంతుఁడు "నీవు రేఁపు పంచమి గనుకఁ బూడివాడకేగి, వేంకటదాసస్వామి పాదము లాశ్రయించి మంత్రోపదేశమును బొంది తరింపు"మని వాక్రుచ్చెను. అట్లే, యారేయియే స్వామి స్వప్నమునఁదోఁచి రేఁపు నా ప్రేరణవలన శిష్యుఁడు వచ్చుచున్నాఁడు వానికి మంత్రోపదేశముఁ గావింపు"మని చెప్పెను. ఈ స్వప్నమేమెూ యని స్వామి విచారించుచుండఁగఁ బ్రభాతముననే స్నానముఁ గావించి యతఁడు స్వామికడకువచ్చి స్వప్నవృత్తాంతమును దెలిపి యుపదేశ మర్థించెను. ఒకేరేయి గలిగిన యీస్వప్నములకు స్వామి విభ్రాంతినొంది "భగవదాజ్ఞ మీఱరాదు. సర్వశేషి యనుగ్రహ సంకల్ప మిట్లున్నదికాఁబోలు నని యతనికి మంత్రోపదేశముఁ గావించి యాచార్యపీఠంబునఁ దొలుతొల్తగా నడుగిడెను. ఇట్లు స్వామి యాచర్యకముఁ బూనుటకు నాచార్యానుమతియు, భగవదాజ్ఞయుఁ గూడివచ్చెను.

వేంకటదాసస్వామి బ్రాహ్మణేతరులైన కాఁపులుగదా, విప్రులకు మాత్రమే యోగ్యమైన గురుత్వము నెట్లు వహించిరి ? ఇతరులు వారి నెట్లాశ్రయించిరి. "స్త్రియశ్శూద్రాదయశ్చాపి బోధయేయుర్హితా హితమ్. యథార్హే మాననీయాశ్చ నార్హం త్యాచార్య తాం క్వచిత్" స్త్రీలు, శూద్రులు, జ్ఞానశక్తి యున్నంతవఱకు నితరులకు బోధింపవచ్చును. తగిన సమయములందు వారినిఁ బూజింపను వచ్చునుగాని, యాచార్యత్వమును మాత్రము వారెప్పుడును వహింపరాదు. మంత్రోపదేశాదులు చేయరాదు" శాస్త్రనియమాదు లిట్లుండ నట్టిపని వారెట్లు చేసిరని యభిజ్ఞులు సందేహపడవచ్చును. పంచసంస్కారాదులు చేయవలదని స్వామిని వారింపవచ్చి, వాదమున భంగపడి పరాభవమును బొందినవారును బెక్కురు గలరు. ఈ విషయము కొంత విమర్శింపఁదగినదియే.

వర్ణవిచారము

అసలు వర్ణమనఁగా నేమి ? ఇది యెప్పటినుండి ప్రారంభమైనది. దీనివలనఁ గల ఫలమేమి ? యను నివి మున్నుగాఁగల విషయము లాలోచింపఁదగియున్నవి. వర్ణము,

జాతి, కులము, సామాన్యము మొదలగు పదములు సమానమైన యర్థమును బోధించుచున్నవి. "వర్ణ-నుతౌ" యను ధాత్వర్థమునుబట్టి, 'కొనియాడఁబడునది' యను నర్థమిచ్చుచున్నది. వర్ణమనఁగా రంగునకును నర్థముగదా. కావున నీయా రంగుచే నిరూపింపఁబడి కొనియాడఁబడునది యని తెలుచున్నది. "కపిలాశ్చారుణాపీతాః కృష్ణాశ్చేతి పృథక్ పృథక్, బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూద్రాశ్చేతి వివక్షితాః (విష్ణుపురాణము). కపిలవర్ణము గలవారు బ్రాహ్మణులు, ఎఱుపురంగు గలవారు, క్షత్రియులు. పచ్చనివారు వైశ్యులు, నలుపుగలిగినవారు శూద్రులు; మహాభారతము నందును, దెల్లనివర్ణముగలవారు బ్రాహ్మణులని, కొంచెము భేదముగా మిగిలిన మూడువర్ణములును బైఁజెప్పఁబడినట్లుగానే చెప్పఁబడి యున్నది. తెల్లనిరంగుగలవారు బ్రాహ్మణులును, నల్లనిరంగు గలవారు శూద్రులుననియుఁ జెప్పిన, మఱి నల్లనిబ్రాహ్మణులందఱు నేగంగలోఁ గలియ వలయును? నూటికఱువండ్రు నల్లగానే యుందురుగదా. ఎఱ్ఱగా నున్న శూద్రులెల్లరు క్షత్రియులు కావలసివచ్చును. వాస్తవమునకు దెల్లని బ్రాహ్మణులు లేనేలేరు. అట్లు చూచిన నాంగ్లేయాది పాశ్చాత్యులందఱును బ్రాహ్మణులై పోవుదురు! ఇఁక దీనినెట్లు సమన్వయము చేయవలయును ? భారతవ్యాఖ్యానమున నీలకంఠావధానులు వర్ణమను శబ్దమునకు గుణము నర్థముగాఁ జెప్పుకొనవలయునన్నాఁడు. అనఁగా దెల్లనిగుణము సత్త్వము. అట్టి సత్త్వగుణప్రధాను లెవరో వారు బ్రాహ్మణులనియు, రజోగుణప్రధానులు క్షత్రియులనియు, మిశ్రగుణులు వైశ్యులనియుఁ దమోమయులు శూద్రులనియు నర్థముచేసినాఁడు. ఇప్పుడు సరిపోవుచున్నది. గుణములనుబట్టియీ వర్ణకూటము లేర్పడినవని తేలుచున్నది. జాతి, జాతము, సామాన్యము, కులము నని యింకను దీనికిఁ బేరులున్నవిగదా. "జాయత ఇతి జాతిః" పుట్టునది యనియర్థము. జాతమను దానికిని నిదియేయర్థము. దీనికి సమూహమనియు నర్థము గలదు. "సమానానాం భావః సామాన్యమ్" సమానుల భావము సామాన్యము. సమాను లనఁగా దేనికి సమానులు ? పుట్టుటయందును, గరచరణాద్యంగములయందును నందఱు సమానులుగానే యున్నారుగదా. ఇఁక మానవజాతిలో మరల నిన్నిసామాన్యము (జాతులు) లేలగలిగెను ? గుణవృత్తులచేతనేగదా! సమానములైన కొన్ని గుణవృత్తులు కొందఱికిఁ దద్భిన్నములైన సమానగుణవృత్తులు మఱికొందఱికి, నిట్లు పెక్కురకములుగా నుండుటచేఁ బెక్కు సామాన్యము లేర్పడినవి. కులము, "కుల – సంస్త్యానే" యను ధాతువువలనఁ 'గూర్పఁబడునది' యను పర్యవసన్నార్థము. కావున నర్థాభిధాయకములైన పైపదముల విచారణమువలనఁ దేలియనదేమనఁగా, జాతి యను నది సృష్ట్యాదియందు సహజముగా లేదనియుఁ దరువాత సమాన గుణవృత్తులు గలవారు కొందఱు కొందఱు గలిసి యొక్కొక్క సంఘముగాఁ జేరుటవలన వచ్చిదనియ, స్పష్టమగుచున్నది. ఈ యర్థమునే "జాతిర్వ్యవహారకల్పితా" జాతి

యనునది లోకవ్యవహారము నడచుటకై యేర్పడినది, యన్న తేజోబిందూపనిషత్తును సూచించినది. లోకవ్యవహారమనఁగా, జను లుచ్చరించు శబ్దము విస్తృతమైన యర్థమును గ్రహించుచుండఁగా, నావెక్కర్థముల నుండి వేఱుచేసి, శబ్దశక్తిని సంకుచితపరచి, యొకే యర్థమును సూటిగా బోధించునట్లు చేయుట. మనుష్యులకు రామయ్య సుబ్బయ్య మొదలగు పేరులు పెట్టుటయు లోకవ్యవహారము నడచుటకేగదా ఒక యూరిలో పలువురు వేంకయ్యలున్నారనుకొనుఁడు. వేంకయ్య యను శబ్ద మా పలువురను బోధించును. వేంకయ్యను బిలుచుకొనిరమ్మని నన్న, దేవేంకయ్యను అని, పిలుచువాఁడు సందేహపడి యడుగును. కావున నప్పుడు వేంకయ్య యనెడి శబ్దము శక్తిని పలువురియందును బ్రసరింపక సూటిగాఁ దామెవరినిఁ బిలిపింపనిశ్చయించిరో వానినే బోధించునట్లు లా శక్తిని సంకోచపరచి చెప్పవలయును. అందులకై జనులు నల్ల వేంకయ్య యని యొకనిని నెల్లివేంకయ్య యని మఱియొకనిరిఁ బొట్టి వేంకయ్య యని, యింకొకనిఁ, దండ్రిపేరుతోఁ జేర్చి సుబ్బయ్యగారి వేంకయ్య యని మిగిలినవానిని నిట్లు వారికనుగుణములైన గుణములనో, వృత్తులనో జతచేసి వ్యవహరించుచుందురు. ఇట్లే యచిత్తులైన పొలములకుఁగూడ నేదియో యొక శబ్దము నతికించి పేరువెట్టి, గుర్తుగా నూరూర దక్షిణముననున్న పొలమునకు 'వాద' యనియు, నుత్తరమున నున్నదానికిఁ 'బట్టి' యనియు, నిట్లనేకములైన పేరులతో వ్యవహరించుచుందురు. అట్లే మానవజాతియందును, విడివడి భిన్న భిన్నములు గానున్న సంఘములకు, వ్యవహారమునకై కొన్ని పేరులు, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులని పెట్టిరి. అందఱియందును బ్రసరించియున్న వ్యాపక జాతి మానవజాతియే. మిగిలినవి వ్యాప్యజాతులు అంతేగాని యీ జాతు లాదినుండియు నున్నవనియు నిందులోఁ గొన్ని యెక్కువనియుఁ, గొన్ని తక్కువనియు, ననుట యజ్ఞానప్రలాపము. బ్రహ్మాండ పురాణమునఁ గృతయుగధర్మములను జెప్పునపు డా యుగమున మనుష్య లందఱు నొక్కటియే జాతిగలిగియుండి రనియు, వర్ణాశ్రమ ధర్మము లప్పుడు లేకుండెననియ స్పష్టముగాఁ జెప్పఁబడియున్నది. తరువాతఁ ద్రేతాయుగమున గ్రమముగా జాతు లేర్పడెననియు నచటనే కలదు.

వర్ణోత్పత్తి విధానము

మొదటనొకే జాతిగా నున్న మనుష్యులలోఁ గర్మానుగుణముగా నుదయించి భిన్నరుచుల వలన నాచార వ్యవహారములువేఱాయెను. కొందఱు మంచిమేధాశక్తి గలవారై వేదశాస్త్రాదులధ్యయనము చేసి వానియందుఁ జెప్పఁబడినట్లుగా యజ్ఞయాగాది ధర్మకర్మముల నాచరించుచు, శాస్త్రములఁ జదువు శక్తి లేక యున్నవారికిఁ దదర్థముల బోధింపసాగిరి; కొందఱు పుష్కలమైన దేహబలముగలగి పరాక్రమ వంతులై పైనిఁ జెప్ప బడిన పండితులు

వచించుదానిని, దానునుష్ఠించుచు, మిగిలినవారినిఁ గూడ నట్లాచరించునట్లను శాసింపఁ దొడఁగిరి; మఱికొందరు శాస్త్రములఁ జదువుటకును బ్రజలను నియమించుటకును సమర్థ లేనివారై, ప్రజానీకమునకుఁ గావలసిన వస్తుసంతతుల నొక చోటివానిని మఱియొక చోటికిఁ జేర్చుచు నట్లు వివిధములైన వ్యాపారాదులు గావించి జీవయాత్రం గడుపఁజొచ్చిరి; మిగిలినవారు పైమూడుపనులు చేయుటకు సమర్థులు కాక, యించుకైన మేధాశక్తి లేనివారై, కేవల దేహశ్రమము మీద నాధారపడి వ్యవసాయాదు లొనర్చిరి. అదియుఁ జేయలేనివారు మిగిలినవారికడఁజేరి వారు చెప్పినపనులెల్లఁ జేయుచు వారి ననువర్తించి జీవితములఁగడుపఁ జొచ్చిరి. సమానగుణధర్మములు గలుగువారికి స్నేహముగలుగుట ప్రకృతిధర్మము. ధనవంతుఁడు ధనముగలవానినిఁ జూచినఁ బ్రేమించును. పండితునకుఁ బండితునిఁ గనిన నానందము. కల్లుద్రాగువాఁడు, కలుఁద్రావువానితో మైత్రిచేయును. జారునకు జారునకుఁ జక్కగాఁ బొం దతుకును. ఎవనియందెట్టి గుణములు ధర్మములుగలవో, వానితో నట్టిగుణ ధర్మములు గలవానికి. నతని ప్రయత్నములేకయే, రుచిని గలిగించి గుణమయి యైనప్రకృతి, ప్రేమ గలిగించును. ఒక్కొక్కనిఁ జూచిన నొక్కొక్కనికి నతనివృత్తమేమియు నెఱుఁగక పోయినను దన్నవలయు ననునంతటి ద్వేషము గలుగును. అతనికే మఱియొకనిఁ జూచుచుండఁగనే కొఱుకుకొని తినవలయుననునంతటి యనురాగ ముదయించును. కారణమేమి యనఁగా, మొదటివారిరువురియందునున్న ప్రకృతిసమముగాదు. భిన్న ప్రకృతినిఁ జూడఁగానే, తద్భిన్న ప్రకృతి కోపించినది. రెండవవాని ప్రకృతి సమానభావముగలది. అందువలన నతనిఁ జూడఁగానే ప్రేమ యుదయించినది. కావుననే నిష్కారణముగా మహాత్ములైన తాపసులఁ గాంచినఁ దద్విరుద్ధప్రకృతిగలిగి నీచులైయున్నవారికి ద్వేషముదయించి వారి నేదోయొక విధముగా నెగ్గులాడుచుందురు. పుణ్యవంతులైనవారికి నత్యంత భక్తిగలగి వారి నాశ్రయించి తరించుచుందురు. అట్లు తన ప్రకృతి, దానికంటె వేఱైన ప్రకృతి గలవారినిఁజూచినపుడు ద్వేషింపకుండునట్లు చేయవలయునన్న మనుష్యుఁడు చాల శ్రమమొనర్పవలయును. ఆత్మశక్తిచేఁ బ్రకృతినిఁ జయింపవలయును. తమను ద్వేషించువారినిగూడ సాధువులు ద్వేషింపక యుండగల్గుట యీ ప్రకృతి జయమునొందుటవలననే. "విద్యావినయసంపన్నే బ్రాహ్మణేగవిహస్తిని శునిచైవశ్వపాకే చ పండితా స్సమదర్శినః" విద్యా వినయాదిగుణములుగల బ్రాహ్మణునియందును, బవిత్రములైనవానియందు శ్రేష్ఠమగు గోవునందును, జంతువులందుఁ బెద్దయగు ఏనుగునందును నెట్టి గౌరవభావముండునో యట్లే నీచుఁడై కుక్కమాంసముఁ దిను జండాలునియందును నికృష్టమైన కుక్కయందును, బండితు లనఁగా సాధువులు (కాలేజీలలో హైస్కూళ్లలో నుండువారు కాదనుట) సమభావముగలగి వర్తిౌతు"రని గీతాచార్యస్వామి చెప్పిన



వద్లాని సుబ్బారావు గారు, నాగమునేశ్వరమ్మగారు (దంపతులు) పోటీనాడ

దీ ప్రకృతిని జయించినవారినిఁగూర్చియే. తన ప్రకృతికంటె వేఱైన ప్రకృతిగల వానిఁ జూడఁగనే ద్వేషముదయింపదుగాని ప్రేమమాత్రముగలుగదు. విరుద్ధప్రకృతి గలవానిఁ జూచినమాత్రము తప్పక ద్వేష ముదయించియే తీరును. అందుచేతనే మనుజులు మిత్రులు, శత్రువులు, నుదాసీనులుగా నేర్పడుచున్నారు. అందఱును బ్రకృతినిఁ జయించి, సమభావము నొందలేరుగదా. కావున నిట్లు సమానగుణాచారములు గలవారు పరస్పరముగా ననురాగపడి సంఘములుగాఁ గూడిరి.

మేధావులై శాస్త్రాధ్యయనాదులు చేసి పండితులైనవా రెల్లరును దమతో సమానులై యున్నవారికే తమ కన్యల నీయఁజొచ్చిరి. అట్టి వారి కన్యలనే తామును వివాహమాడిరి. ఇప్పుడును దమకుఁ దుల్యముగా నాస్తులును, నాచారవ్యవహారములును గలవారితోనే కదా సంబంధ మొనర్తురు. ఇతరు లడిగినను బిల్లలనీయక చేసికొనక యా పండితులెల్లరును నిట్లొక సంఘముగా నేర్పడిరి. వారే బ్రాహ్మణులు. బాహుబలముగలిగి పరాక్రమవంతులైన వారెల్లరును, నట్లే యొక కూటమిగా నైరి. వారు క్షత్రియులు; వ్యాపారాదులయందుఁ దెలివి గలిగి పరస్పరము మైత్రిగలిసినవారెల్లరును వైశ్యులుగాను, నేశక్తియు లేక మోరకులై యున్నవారెల్లరును శూద్రులుగా నేర్పడిరి. బ్రాహ్మణులు తమ చదివిన శాస్త్రధర్మముల నన్యులకు బోధించుచు వైదికములైన కర్మలనెల్లఁ జేయించుచు దాని మూలమున నార్జించిన ధనముచే జీవితముల గడుపుచు లోకమునఁ బూజనీయులైరి. క్షత్రియులు బాహుబలమున నన్యుల నిర్జించి తమ శాసనముల నిలిపి బ్రాహ్మణోక్త ధర్మములఁ బ్రజలచే ననుష్ఠింపఁజేయుచుఁ, బరిపాలకులై గౌరవార్హులైరి. ఇట్లు శాస్త్రమును, శస్త్రమును, వీ రిరువురు గైకొని హెచ్చు మర్యాద నొందఁగలిగిరి. పశుపాలన వ్యాపారాది వృత్తులు గావించి బ్రాహ్మణక్షత్రియులకు సహాయపడుచు వైశ్యులుండిరి. స్వయముగా వృత్తి నార్జించి జీవయాత్ర గడుపలేక కడుపు నింపుకొనుటవఱకు మాత్రమే యెఱిఁగిన శూద్రులు పై మూడు సంఘములవారినాశ్రయించి వారు శాసించు పనులు గావించుచు వారు పెట్టినది భిక్షగాఁ గైకొని యేవిధమైన గౌరవము నెఱుఁగక బ్రతుకుసాగించిరి. మందమతులైన యీ శూద్రులకంటె భిన్నముగాఁ దమ యాచారమును బురస్కరించుకొని మిగిలిన మూడుసంఘములవారును మొదట జన్మము కాక, కల్పితమైన రెండవజన్మమునుగూడ నొకదానిని సంపాదించిరి. అదియే యుపనయనము. దానివలననే ద్విజులు. ఇట్లు చతుర్వర్ణము లేర్పడెను. 'చాతుర్వర్ణ్యంమయాసృష్టం గుణకర్మవిభాగశః. గుణములు కర్మలు వేఱుగానుండుటచే నాలుగువర్ణములు నాచే సృజింపఁబడిన'వని గీతోపనిషత్తున భగవానుఁడు చెప్పెను. 'అంతః ప్రవిష్ట శ్శాస్తాజనానా' మ్మనునట్లు సర్వభూతములయందు నంతరాత్మగా నుండి శాసించువాఁడు పరబ్రహ్మమేగద! మంచిగాని చెడుగానీ దైవసంకల్పానుకూల్యము లేనిదేదియును జరుగదు.

ఇట్లేర్పడిన సంఘములు నాలుగును గొన్ని కొన్ని కట్టుబాటులు గావించుకొన్నవి. ఆకట్టుబాటులకు లోనుగాక యవినీతిపరులై నీచ కర్మము లాచరించుచుఁ దిరుగువారినెల్లఁ దమసంఘములలోనుండి వెలివైచిరి. అట్లు వెలివేయఁబడిన వారందఱు వారువార వెలుపల నొకచో నొకపల్లెగా గట్టుకొని వసించిరి. ఇట్లు నాలుగువర్ణములేగాక ఐదవజాతికూడ బయలుదేఱెను.

జాతులన్నియు సమానములు

ఇట్లేర్పడిన కులములు సమానమైన హక్కుగలవి. సమస్తాధికారములు నందఱికిని గలవు. బరబ్రహ్మమునకు ముఖమున బ్రాహ్మణులు. బాహువులయందు క్షత్రియులు. తొడలయందు వైశ్యులు, పాదముల యందు శూద్రులు గలిగిరని "బ్రాహ్మణోస్య ముఖమాసీత్" మొదలైన శ్రుతులును, నితరశాస్త్రములును జెప్పుచున్నవిగదా. ఒక్కపరబ్రహ్మమునందే యుదయించిన నాలుగుజాతులలో నొకటి తక్కువయు నొకటియెక్కువయు, నెట్లగును ? ఒకే తండ్రి కుమారులలో నొకఁడెక్కువ కులమువాఁడై యొకఁడు తక్కువకులము వాఁడగుచున్నాఁడా ? ధనవంతుఁ డొకఁడు గలఁడను కొనుఁడు. వానికి నలుగురు కుమారులు. ఆ కుమారులు, నలువురకును తండ్రి యాస్తినిఁ బంచుకొను విషయమునందును, మిగిలిన విషయములందును సమానమైన యధికారమే యుండునుగాని మఱియొకరీతిగా నుండదు. ఒకవేళ నలువురిలో నొకఁడు కొంచెము తెలివితక్కువవాఁడైనచో నతనికి నధికారము లేకపోవునా ? తక్కిన మువ్వురును వానినిఁ దెలివితక్కువ జేసి యన్యాయ మాచరించిన దానికి హేతువు వాని సహజమైన యర్హత లేమియా ? కాదుగదా. వానికి వాఁడే తన మాంద్యముచే నా యోగ్యతను వదలెను. మనుమలు తెలివిగలవారైనచో నా యర్హతను బురస్కరించుకొని భాగస్వాములగుదురు. కులము లేర్పడిన విధానము వివరింపఁబడెనుగదా, ఆ కాలమున నజ్ఞానముచేఁ దమ యర్హతను గోలుపోయి శూద్రులుఁగా బరగణింపఁబడిన సంఘమున జన్మించి యర్హులైనవారు తమ యధికారమును దాము గైకొనఁగాఁ గాదనుట కెవరికి యోగ్యతయుండును ?

బ్రాహ్మణుడు ముఖముననను, శూద్రుఁడు పాదములయందును బుట్టెననిగదా శాస్త్రములు చెప్పుట, స్థానవిశేషమువలన ననఁగాఁ బాదములకంటె నుత్తమాంగమైన శిరస్సునందు, ముఖము గొప్పది యగుటచే ముఖమునఁ బుట్టినవారు సహజముగా నధికులనియు నధరాంగములగుటచేఁ బాదములందు జనించిన వారు నైజముగాఁ దక్కువయనియు నందురేవెూ, యదియును నమంజనముగాదు. నకల హేయప్రత్యనీకకల్యాణైక తానుఁడైన సర్వేశ్వరుని దివ్యమంగళ విగ్రహమునందుఁ గొంత

నీచమును గొంత యుత్తమమును గలదా ? ప్రకృతికేగాని యట్టి నైచ్యోన్నతులు భగవానున కెక్కడివి ? మనకు వలెనే వానికిని హేయములుండిన నతఁడు పరమేశ్వరుఁ డెట్లగును ? ఒకవేళ మనవలె సర్వేశ్వరుని పాదములు హీనములే గనుక నందుదయించిన శూద్రు లపావనులు. వారికి బ్రహ్మవిద్యా ద్యధికారములులేవు పొమ్మందురా ? సర్వేశ్వరపాదముల జనించిన గంగానది లోకపావని యెట్లగును ? విష్ణుపాదముల నుద్భవించిన మందాకిని సర్వపాపహారిణి యగుచుండఁగా నా పాదములయందే జన్మించిన శూద్రులు పావనులు కాకపోవుట యెట్లు ? శూద్రులు జన్మింపఁబోవు నప్పటి కా పాదములేద్దైనఁ బేడఁద్రొక్కెనా యేమి ? నిధిలోనున్న మణి కాంతిని విరజిమ్మలేదు. సానదెబ్బలు తిని సంస్కారమునొందినది చక్కగా భాసించును. అంతమాత్రముచే సానబెట్టని రత్నమును గాదనవచ్చునా ? అది విలువచేయకపోవునా ? అట్లే కొందఱు శుభకర్మాచరణముచే హెచ్చుమన్ననఁ బొందిరి. దానిని వదలి కొందఱట్లే యుండిరి. అంతమాత్రమున వారి ననర్హులని శాసింపరాదు. కావున భగవత్ప్రాప్తి మూలములగు వివిధోపాయములైన సర్వకర్మల యందును సమస్తజాతులవారికి నధికారము గలదు. తండ్రి యే బిడ్డను బక్షపాతమున వదలును ? వారికై వారు శక్తిలేక యా యధికారమును వదలిన సరేకాని, యర్హులైనవారు దానిని గ్రహింపఁగాఁ గాదనుటకు నెవ్వరికిని నధికారములేదు.

అట్లైయైనచోఁ "చత్వారోవర్ణాః బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాః, తేషాం పూర్వతః పూర్వః శ్రేయాన్" వర్ణములు నాలుగు, వారు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు. వారిలోఁ బూర్వులకంటెఁ బూర్వులు గొప్పవారు. అనఁగా శూద్రులకంటె వైశ్యులు, వారికంటె క్షత్రియులు, వారికంటె బ్రాహ్మణులును ఘనులు. అని చెప్పిన శ్రుతి యెట్లుపొసఁగుననవచ్చును. ఇచటఁ జెప్పఁబడిన గొప్పతనము, కర్మకృతమైన కల్పితమేగాని సహజముగాదు. బ్రాహ్మణత్వ శూద్రత్వాదులు కర్మచేతవచ్చుచున్న వేగాని నియతములుగావు. జ్ఞానస్వరూపులైన జీవులందఱును సమానులే. ఇఁక నీ గొప్పతనములు కర్మాచరణమువలన వచ్చుచున్నవి. ఏ యున్నతకర్మ నాచరింపక శూద్రుఁడై యున్నవానికంటె శుభకర్మాచరణముచే బ్రాహ్మణుఁ డైనవాఁడు గొప్పవాఁడుకాదా ? మఱి లోకపూజ్యుఁడును నగును. మూఢుఁడై యేమియుఁ దెలయక సంచరించువానికంటెఁ బండితుఁడై బోధించు వానిని జగత్తు గౌరవింపదా ? వాఁడెక్కువయే కదా. మూఢుఁడుగా నున్నవాఁడును జదివి పండితుఁడైనచో వాఁడును మాననీయుఁడే యగును. ఒకఁడు చదవి యుత్తీర్ణుఁడై కలెక్టరుగాగా వానినిఁ బూజించి, మఱియొకఁ డర్హతనొంది కలెక్టరైరాగాఁ బూజింపక యుందురా ? ఉద్యోగహీనుఁడైన వానికంటెను నున్నతోద్యోగము నొందఁగల్గినవాఁడు, గొప్పవాఁడే కదా. కావున నట్లే బ్రాహ్మణత్వము నొందఁగల్గినవాఁడు మిగిలిన ముగ్గురికంటె నధికుఁడేకాని

యీ బ్రాహ్మణత్వ క్షత్రియత్వ వైశ్యత్వ శూద్రత్వములు కర్మజనితములే, సహజములు గావు. నైష్ఠికుఁడై బ్రాహ్మణత్వము నొందినవాని గర్భమునఁ బుట్టినంతమాత్రమున బ్రాహ్మణత్వము రాదు. శూద్రత్వమును బొందియున్నవాని కుమారుఁడైనవానికి బ్రహ్మకర్మాచరణమున బ్రాహ్మణత్వము రాకపోదు.

వర్ణధర్మములు

అట్లయినచో బ్రాహ్మణు లీధర్మము లాచరింప వలయుననియు. క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు నీ యీ ధర్మము లనుష్ఠింపవలయుననియు, నట్టి నియమిత ధర్మముల నాచరింపక పరధర్మముల నాచరించిన భ్రష్టులగుదురనియు, జెప్పిన శాస్త్రములకర్థమేమి యందురా ? ఈ వర్ణధర్మములను గూర్చి మన్వాది ధర్మశాస్త్రములు, మహాభారతాదులును విపులముగాఁ జెప్పియున్నవి. గీతాశాస్త్రమున భగవానుఁడును విశదముగాఁ జెప్పియున్నాఁడు. భగవంతుఁడు వచించిన దానికంటెను నధికమైనది లేదుగదా. దానినే జూడుఁడు "బ్రాహ్మణ క్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవైర్గుణైః" స్వభావము వలనఁ గలిగిన గుణములచే విభజింపఁబడి యున్న బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల కర్మల నర్జునాఁ వినుము "శమో దమ స్తపః శౌచం క్షాంతి రార్జవ మేవచ జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్" శమము, దమము, అనఁగా నంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహములు, శౌచము క్షమ, మనోవాక్కాయకర్మలతో నొకే విధముగా నడచుట, జ్ఞానము విజ్ఞానము, ఆస్తిక్యము ఇవిస్వభావ సిద్ధములైన బ్రాహ్మణ కర్మలు "శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధేచా ప్యపలాయనమ్, దానమీశ్వర భావశ్చ క్షాత్రం కర్మస్వభావజమ్" శూరత, తేజస్సు, ధైర్యము, నేర్పు, యుద్ధము నందుఁ బాఱిపోకుండుట దానగుణము, ప్రభుభావము, క్షత్రియుని స్వభావకర్మములు. "కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యకర్మస్వభావజమ్" వ్యవసాయము, పశుపాలనము, వర్తక వ్యాపారము స్వభావ జనితములైన వైశ్యుని కర్మములు. "పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్" శుశ్రూషాత్మకమైన కర్మ శూద్రునికి స్వభావజము."

ఇచట మొదటనే భగవానుఁడు "స్వభావ ప్రభవైర్గుణైః" వారి వారి స్వభావము వలనఁ గలిగిన గుణములచే విభజింపఁబడినవని చెప్పెను గాని, వీరికి విధింపఁబడిన కర్మలనిగానీ, నియతములైన కర్మలనిగానీ చెప్పలేదు. పైగాఁ బ్రతికర్మను జెప్పునపుడును స్వభావజమ్ స్వభావజమ్ అనియును వచించెను. ఇట్లేల చెప్పవలసివచ్చెను ? స్వభావజమ్మనఁగా స్వభావముచే వచ్చినది, యనిగదా యర్థము. కావున నిచటను నెవరి కేయే గుణములు స్వభావసిద్ధములో యట్టిగుణముల కనురూపమైన కర్మాచరణము చేసిన సులభముగాఁ దరింపవచ్చునని, గుణములనే నిరూపించెను. ఆగుణములచేతనే జాతులును

నిరూపింపఁ బడుచున్నవి. దమము శమము, మొదలైనవి బ్రహ్మ కర్మములు. అట్టివెవనికి స్వభావ సిద్ధములై యాచరించుటకు సులభముగానుండునో, యట్టి యర్హతగలవాఁడు అట్టికర్మలనే యాచరింపవలయును. శౌర్యము తేజము ధైర్యము మున్నగునవి యెవనికి సహజములై, వాని నాచరించుట సులభముగా నుండునో, యట్టివాఁడు వానినే చేయవలయును. పరిచర్య చేయుటయే స్వభావసిద్ధమై యన్యమున కనర్హుఁడైన వాఁడు దానినే యాచరింపవలయును. లోకముననను నెవనికేది స్వభావసిద్ధమై యుండునో, వానికి దానియం దభిరుచి యెక్కువగా నుండును. ఆపనినిఁ జేయుటయు నతనికి సులభముగా నుండును. ఒకనికి విద్యయన్నఁ జాల నభిమతముగా నుండును. విసుగులేక రేఁబవలును దానియందుఁ బనిచేయును. అట్టివాఁడు విద్యనే చదువ వలయును. అందువాఁడు సంసిద్ధినిఁ ద్వరలోఁ బడయును. అది వానికి స్వభావసిద్ధ మైనది. ఒకనికి వ్యవసాయమన్నఁ బ్రీతిగా నుండును. అందులోఁ బలువిధములైన పోకడలు పోవును. అట్టి వాఁడు వ్యవసాయమే చేయవలయును. ఒకనికిఁ జిత్రకళ యందు మక్కువ యెక్కువగా నుండును అదియతని స్వభావసిద్ధ గుణము. దానినభ్యసింప మొదలిడిన నతడు కడుస్వల్పకాలమునఁ జిత్రకళా నైపుణము నొందఁగలఁడు. ఎవని కెయ్యది స్వభావసిద్ధమై రుచించునో యాకర్మయం దతఁడు సులువుగా స్వల్పకాలమున నాతితేరును. అట్లుగాక వ్యవసాయము స్వభావసిద్ధగుణముగాఁ గలవానికి, విద్యాభ్యాసముఁ జేయింప మొదలిడినను, జిత్రకళస్వభావముగాఁ గలవానిని సంగీత మభ్యసింపఁ జేసినను, వారు దానియందు రుచిలేక, యాగారణమున నాకర్మను జక్కగా నాచరింపక సిద్ధినిఁ బొందలేనివారై వ్యర్థులగుదురు ఈయర్థమునే "స్వేస్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః" తమతమ స్వభావ సిద్ధములైన కర్మలయం దభిరుచిగలవారై మనుష్యులు త్వరలో సిద్ధినిఁ బొందఁగల"రని గీతాచార్యులు నుడివిరి. మఱియు "స్వభావజేన కౌంతేయే నిబద్ధః స్వేన కర్మణా కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్య వశోపితత్" అర్జునా! నీకు స్వభావసిద్ధమై యున్న కర్మయేదిగలదో యట్టిదానిచే బంధింపఁబడినవాఁడవై, యిప్పుడజ్ఞానమున దేనినిఁ జేయననుచుంటివో, దానినే యవశుఁడవై చేయుదువు. ఆస్వభావ గుణమే నీప్రయత్నము లేకయు నీచేనాపనినిఁ జేయించును. "అర్జునునకు స్వభావసిద్ధ గుణమేది ? "యుద్ధం మే బ్రూహి కేశవ" స్వామీ! నాకు యుద్ధము వచ్చున ట్లనుగ్రహింపుము "ఆమంత్రణోత్సవా విప్రా, గావో నవతృణోత్సవాః భర్త్రాగమోత్సవానార్యః సోऽహం కృష్ణ రణో త్సవః" బ్రాహ్మణులు భోజనప్రియులు, గోవులు మంచికసవునకు సంతోషించును. పరదేశమునుండి భర్తవచ్చిన స్త్రీలకు నానందము, నేనో యదూత్తంసా! రణమే పండుగగాఁగలవాఁడను' అని పల్కువాఁడును, త్రిలోక విజయ ధురంధరుఁడు నైన యర్జునకు స్వభావసిద్ధమైన గుణము శౌర్యముఁగాక యేది యగును?"

అట్టివాఁడజ్ఞానమున యుద్ధముఁజేయ ననఁగా "స్వభావో దురతిక్రమః" అన్నట్లునీస్వభావము పరాక్రమము. అందుచే నాపరాక్రమానుకూలమైన యుద్ధమును నీవిప్పుడు మౌఢ్యముచే మానినను, నాస్వభావము మఱియొకప్పుడైనను నిన్నవశునిగాఁజేసి యుద్ధమును జేయనే చేయించునని గీతాచార్యులు విశదీకరించిరి. అందువలననే "పరధర్మో భయావహః" అస్వభావజమైన పరధర్మము భయావహమనియుఁ దెలిపిరి.

ఈవర్ణధర్మవిచారమువలనఁదేలిన పిండితార్ధ మేమనగా నీనిరూపింప బడిన ధర్మములు మనుష్యుల స్వభావము ననుసరించినవి. యేయనియు, నట్టి బ్రహ్మ క్షాత్ర కర్మాదుల నాచరించు వారేబ్రాహ్మణ క్షత్రియాదులనియుఁ బరిచర్యకు మాత్రమే యోగ్యుఁడైన వాఁడు శూద్రుఁడనియు, నట్టివాఁడా కర్మనే చేయవలయుననియు, నింతేగాని యిప్పుడెవరు బ్రాహ్మణులనియు, శూద్రులనియు లోకమున వ్యవహరింపఁ బడుచున్నారో వారికే యట్టి బ్రహ్మపరిచర్యాది కర్మలు నియతముగా ననుశాసింపఁబడలేదనియు, బ్రాహ్మణులు శూద్రులు ననెడివారు లోకము నొకసాంకేతికముగా నేర్పడిన యీ బ్రాహ్మణులును శూద్రులును గారనియు, బ్రహ్మకర్మమును బరిచర్యాకర్మము నెవరు, చేయుచున్నారో వారేయనియుఁ దేలినది. ఈయర్థమునే "యస్స్యాద్దాంత స్సోమపశ్చార్యశీలః సానుక్రోశ స్సర్వసహో నిరాశీః, ఋజు ర్మృదు రనృశంసః, క్షమావాన్ సవై విప్రో నేతరః పాపకర్మా!" దమమును, సోమపానమును, బవిత్రవర్తనమును దయయు, సహనము, నాశారహితత్వమును, నవక్రతయు, మార్దవమును, బాపకర్మాసక్తిలేమియు, నోర్పును నెవనియం దుండునో వాఁడే విప్రుఁడు. పాపకర్ముఁడై దీనికి భిన్నముగా నున్న యితరుఁడు బ్రాహ్మణుఁడు కాఁడు. అని మహాభారతమున శాంతిపర్వమునందు భీష్ముఁడు వర్ణాశ్రమధర్మములను ధర్మజున కుపదేశించు సమయమునఁ జెప్పఁబడియున్నది. మఱియు మహాభారతమున, నరణ్యపర్వమునందు నజగరోపాఖ్యానంబులో నీవిషయము స్పష్టముగాఁ దెగఁగొట్టి చెప్పఁబడియున్నది. భీమునిఁ బట్టిమ్రింగిన యజగరము (కొండచిలువ) ధర్మరాజు "బ్రాహ్మణః కో భవే ద్రాజన్ ?" బ్రాహ్మణు డెవఁడు ? అని ప్రశ్నింపగా "సత్యం దానం క్షమా శీల మానృశంస్యం తపోఘృణా దృశ్యంతే యత్ర నాగేంద్ర స బ్రాహ్మణ ఇతి స్మృతః" సత్యము, దానము, ఓర్పు, సత్ప్రవర్తనము, క్రూరత్వము లేకుండుట, తపస్సు, దయ యివి యెవనియందుండునో వాఁడే బ్రాహ్మణుఁడని ధర్మరాజు బదులుచెప్పెను. అంత నజగరము "శూద్రేష్వపిచ సత్యం, దాన, మక్రోధ, ఏవచ, ఆనృశంస్య మహింసా చ ఘృణా చైవ యుధిష్ఠిర!" ధర్మరాజా! సత్యము, దానము, క్షాంతి, యక్రూరత, యహింస, దయ యివి శూద్రులయందును నుండును గదా యీగుణములు గలిగియున్నయెడల శూద్రుఁడు బ్రాహ్మణుఁడగునా ? యని మరల విశదీకరించి ప్రశ్నించినది. దానికి ధర్మరాజు "శూద్రేతు

యచ్ఛూద్రే లక్ష్మ ద్విజేతచ్చ నవిద్యతే, నవై శూద్రో, భవేచ్ఛూద్రో బ్రాహ్మణో నచబ్రాహ్మణః ? శూద్రునియందు నీచెప్పఁబడిన గుణములున్న నతఁడు శూద్రుఁడు గాఁడు. ఈగుణములు బ్రాహ్మణుని యందు లేకున్న నతఁడు బ్రాహ్మణుఁడునుగాఁడు అనిసమాధానము చెప్పెను ఇంతటితో నిదితేలలేదు. ఈగుణములు గలిగియున్న శూద్రుఁడు కాఁడని చెప్పెనేగాని, బ్రాహ్మణుఁడగునని చెప్పలేదుగదా. బ్రాహ్మణుఁడును బ్రాహ్మణుఁడు కాదని యే చెప్పెను. గావున నీగుణములు గలిగిన శూద్రుఁ డేమగును ? ఈగుణములు లేని బ్రాహ్మణుఁ డేమగు" నని మరలఁ బ్రశ్న యుదయించు చున్నది. అందులకై మరల ధర్మరాజు, "యత్రై తల్లక్ష్యతే సర్ప వృత్తం సబ్రాహ్మణస్మృతః యత్రై తన్నభవత్సర్ప తం శూద్రమితి నిర్దిశేత్" ఎవనియం దీ చెప్పఁబడిన గుణములుండునో వాఁడే బ్రాహ్మణుఁడని చెప్పఁబడును. ఎవనియందీ గుణములు లేవో వాఁడే శూద్రుఁడని యెఱుంగుము. అని స్పష్టముగాఁ జెప్పెను. అంత మరల నాసర్పము "యది తే వృత్తతో రాజన్ బ్రాహ్మణః ప్రసమీక్షితః వృథాజాతి స్తదాయుష్మన్ కృతిర్యావ న్నవిద్యతే" రాజా వర్తనము వలననే యిట్లుబ్రాహ్మణత్వాదులు గల్గుచున్న నిఁకజాతియనునది లేనేలేదు. నియతమైన వర్ణధర్మములు లేకపోగా నిఁకజాతి యెక్కడి నుండివచ్చునని ప్రశ్నించెను. అంత "జాతిరత్ర మహాసర్ప మనుష్యత్వే మహామతే సంకరాత్సర్వ వర్ణానాం దుష్పరీక్ష్యేతి మేమతిః సర్వేసర్వాస్వపత్యాని జనయంతి సదానరాః వాఙ్మైథునమథో జన్మమరణంచ సమంన్నృణామ్." "ఓ సర్పరాజా! మనుష్యులలో నిది యీ వర్ణమని దేనిని నిరూపింప వీలుగాదు. ఎందువలననఁగా నన్నివర్ణములలోను నన్నివర్ణముల సాంకర్య మున్నది. కావున జాతి యనునది నిరూపింప వీలుగానిదని నా యభిప్రాయము సర్వవర్ణములవారు సర్వకులస్త్రీలయందును సంతానము గలిగించుచుందురు. మఱియు, జాతినిరూపకములైన వాక్కు, మైధునము, జన్మించుట, చచ్చుటయు యని నివియందఱికిని, సమానములుగా నున్నవి. ఇఁక వర్ణవిభాగము చేయనెట్లు వీలుపడునని ధర్మరాజు సమాధానమిచ్చెను. మఱియుఁ "తస్మాచ్ఛీలం ప్రధానేష్టం విదుర్యే తత్త్వ దర్శినః" కావున శీలమే వర్ణనిరూపణమున ముఖ్యమని తత్త్వవేత్తలు తెలియుదురు. "ప్రాఙ్నాభివర్ధనాత్ పుంసో జాతకర్మ విధీయతే. తథోపనయనం ప్రోక్తం ద్విజాతీనాం యథాక్రమమ్. తదాస్య మాతా సావిత్రీపితాత్వాచార్య ఉచ్యతే. తావచ్ఛూద్రసమోహ్యేష యావద్వేదేనజాయతే, తస్మిన్నేవం మతిద్వైధేమనుః స్వాయంభువో Zబ్రవీత్." బొడ్డుకోయక ముందుఁ బురుషులకు జాతకర్మము చేయఁబడుచున్నది. అట్లే ద్విజాతు లనెడివారికి నుపనయనమను మఱియొక జాతకర్మము చెప్పఁబడినది. మొదటి జాతకర్మమునఁ దల్లిదండ్రులే తల్లిదండ్రులు. ఇఁక నుపనయన కర్మమున సావిత్రి తల్లియు, నాచార్యుఁడు తండ్రియు నగుచున్నాఁడు. అనఁగా జన్మము మారిపోయినదన్నమాట. అట్టి యుపనయనము నొంది వేదాభ్యాస మొనర్చు వఱకును



సిర్విసెట్టి సోమమ్మగారు, (మోదుమూడి) స్వామి యత్తగారు.

వాఁడు శూద్రసముఁడనఁగా శూద్రుఁడే. పిదపం జేయఁబడు నీకర్మమువలన బ్రాహ్మణుఁ డగును. ఇట్లొకఁడే రెండువిధములుగా శూద్రుఁడనియు, బ్రాహ్మణుఁడనియుఁ దలంపఁబడు చున్నాఁడని స్వాయంభువ మనువు చెప్పెననియు ధర్మరాజు వచించెను. అయిన నిఁక వర్ణాశ్రమధర్మములని శాస్త్రములేల వృథగా నిరూపించినవను శంకాప్రసక్తి కలుగగాఁ "కృతకృత్యాః పునర్వర్ణా యదివృత్తం నవిద్యతే సంకరస్తత్ర నాగేంద్రబలవాన్ ప్రసమీక్షితః. యత్రేదానీం మహాసర్ప సంస్కృతం వృత్తమిష్యతే తం బ్రాహ్మణమహం పూర్వ ముక్తవాన్ భుజగోత్తమ." కృతకృత్యములై యేదోనొక రూపములోనున్న యీ కులములకు నియతమైన యేదేనొక ధర్మమును నిరూపింపకయున్న వానియందు సంకరము మఱింతగాఁ బ్రబలును గావునఁ గొన్నిధర్మములు నిరూపిపఁబడినవి. ఎవనియందు సంస్కరింపఁబడిన శీలముండునో వాఁడే బ్రాహ్మణుఁడని పూర్వమే చెప్పి యుంటినని, యిట్లు మరల సారాంశమును బునరావృత్తముచేసి ధర్మజుఁ డీ ప్రసంగమును ముగించెను. క్రింద వ్రాయంబడినట్టియు ముందువ్రాయఁబోవునట్టియు నా యీ వ్యాసము యధార్థమైనదనియు న్యాయ్యమైనదనియు నెఱుంగుటకుఁ బ్రామాణికులైనవారికి మహాభారతాంతర్గతమైన యీ యజగరోపాఖ్యానమే చాలియున్నది. మహాభారతమును యథామూలముగాఁ దెనిఁగించుచున్నానని చెప్పి వచనాంధ్ర మహాభారతమును వ్రాసిన యొక శాస్త్రిగా రీ యజగరోపాఖ్యానమును దెనిఁగించుచుఁ జాలబాధపడిరి. వారి యనువాదశైలి యట్లు సూచించుచున్నది. అందులో "యత్రైతల్లక్ష్యతే సర్ప వృత్తం సబ్రాహ్మణ స్మృతః.... శూద్రమితి నిర్దిశేత్ =" ఎవనియం దీ వృత్తముండునో వాఁడే బ్రాహ్మణుఁడని స్పష్టముగాఁ జెప్పబడిన యీ శ్లోకమును దెనిఁగింపక వదలెను. మఱియు "జాతిరత్రమహాసర్ప...... దుష్పరీక్ష్యేతి మే మతిః, తస్మాచ్ఛీలం ప్రధానేష్టం విదుర్యే తత్త్వదర్శినః.... కృతకృత్యాః పునర్వర్ణా.... యత్రేదానీం మహాసర్ప సంస్కృతం వృత్తమిష్యతే......." అని స్పష్టముగా జాతి యనునది యొకటి లేదనియు వృత్తముచేతనే బ్రాహ్మణుఁ డగుననియుఁ జెప్పంబడిన శ్లోకముల నన్నిటినిఁ బాప మాయన కవి యెంతకంటకముగాఁ దోఁచెనో తెనిఁగింపక వదలివైచెను. పైగాఁ "ప్రాఙ్నాభివర్ధనాత్ పుంసోజాతకర్మ విధీయతే...... మనుస్స్వాయంభువో ऽబ్రవీత్' అనుచోట దానిలోనున్నది, వ్రాయక "బ్రాహ్మణస్త్రీగర్భమునందుఁ బుట్టినవాఁడు బోడ్డుఁగోయఁబడుటకు మున్ను సావిత్రి తల్లిగను, ఆచార్యుడు తండ్రిగను ఉండు" నని యిట్లు మిక్కిలి యసంగతముగా నర్థము వ్రాసిరి. దానిలోఁ బురుషునకు నాభిచ్ఛేదము కాకమునుపే జాతకర్మ జరుగవలయు ననియు, జాతకర్మవలెనే ద్విజాతులగువారికి నుపనయనమని మఱియొకటి గలదనియు, నట్టి యుపనయన జాతకర్మమునందు సావిత్రి తల్లిగను నాచార్యుఁడు తండ్రిగను, నేర్పడునని యిట్లు మహాభారతము చెప్పుచుండగా, నట్లు వ్రాయుటకుఁ గారణమేమో తెలియదు. వారు

వ్రాసినట్లు బొడ్డుఁగోయుటకు ముందు సావిత్రి తల్లి యెట్లగునో తండ్రి యగుటకు నాచార్యుఁడపుడెక్కడ నుండెనో తెలియదు. "తస్మిన్నేవం మతిద్వైధే మను స్స్వాయంభువో౽బ్రవీత్" అనుచోట నొకని యందే శూద్రుఁడు, బ్రాహ్మణుఁడు నని, యిట్టి రెండు తలంపులు గలుగుచున్నవని స్వాయంభువమనువు చెప్పెను దానికి బదులు "సత్త్వాది గుణంబులు గల శూద్రుండే సచ్ఛూద్రుండనఁబడు నని మనువగుస్వాయంభువు తొల్లి వచించె"నని యిట్లుపైని నజగరమునకు సమాధానము లొసంగిన ధర్మరాజు నాశయంబునకుఁ బూర్తిగా విరుద్ధమైనట్టిదియు, నందులో నెచ్చటను లేనిదియునై, యసంగతము నన్యాయ్యమైన తమ స్వకపోల కల్పితమైన యొక యర్థమును జోడించిరి. తాము తెనిగింపక విడిచి నంత మాత్రమున మూలమున నున్న యావిషయము లెచటికిఁ బోవును ? పైగా మూలమునకు విరుద్ధమై యన్యాయ్యమైన తమసొంత యభిప్రాయము దానిలో నిఱికించుట యేమిటి ? దీని వలన ఫలమేమి ? పాపము వారిసంతృప్తి యట్టిది. ఇట్లే శాంతి పర్వమున వర్ణాశ్రమధర్మ విషయమునను, బెక్కుశ్లోకములు వీరనువదింపక విడిచిరి. ఇచట వ్రాయఁబడిన శ్లోకముల కర్థములు వ్రాయఁబడి యుంటచే మరల వ్రాయలేదచటఁ జూడుఁడు. కావున జాతిని నిరూపించుటకు ముఖ్యము వృత్తమేగాని మఱియొకటిగాదు. బ్రాహ్మణులని యిప్పుడు వ్యవహరింపఁబడెడి వారిలోను బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు గలరు. శూద్రులని వ్యవహరింపఁబడు వారిలోను శూద్రులు, వైశ్యులు, క్షత్రియులు, బ్రాహ్మణులు గలరు. "నశూద్రా భగవద్భక్తా, విప్రా భావతాస్స్మృతాః సర్వవర్ణేషుతే శూద్రాయేహ్య భక్తా జనార్దనే" భగవద్భక్తు లేజాతివారైనను బ్రాహ్మణులే. అన్ని జాతులయందును విష్ణుభక్తులు కానివారు శూద్రులు అను నీప్రమాణమును, బైవిషయమును స్పష్టీకరించుచున్నది. చతుర్వర్ణములని శాస్త్రములు నిరూపించినదియు భగవదుద్దిష్టములైనయసలు జాతులివియే గాని మనమిప్పుడు లోకవ్యవహారమునకు వాడుకొనునట్టి జాతులు గావు. ఇట్లుగాక మనము లోకమున వ్యవహరించుచున్న వారే బ్రాహ్మణులు. వారికే బ్రాహ్మణధర్మములు నిరూపింపఁ బడినవి. శూద్రులని వ్యవహరింపఁబడువారుశూద్రులే. వారెట్టి శక్తి సామర్థ్యములు గలవారైనను బరిచర్యారూపమైన శూద్రధర్మమునే యనుష్ఠింపవలయును, దద్భిన్నముగా నడచుట దోషమందుమేనిఁ, గ్రిందవ్రాయఁబడియున్న శాస్త్రప్రమాణముల కన్నిటికిని, విరుద్ధము పొసఁగుటయేగాక పెద్దయనర్థము సంభవించును. ఎట్లనఁగా నంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహములును, శౌచమును, క్షాంతియు, నార్జవమును, జ్ఞానవిజ్ఞానములును గదా బ్రాహ్మణధర్మములని భగవానుఁడానతిచ్చెను. ఈకర్మల నాచరింప శక్తులైనవారు బ్రాహ్మణులలో నెందఱుందురు? శక్తి లేనివా రెందఱుందురు? నూటికిఁ దొంబదిమంది శక్తిలేనివారే. వీరందఱును

షట్కర్మనిరతులై పైనిఁజెప్పఁబడిన వృత్తములు గలిగి యుండుటెట్లు ? "క్షాత్రాణి వైశ్యాని చ సేవమానః శౌద్రాణి కర్మాణి చ బ్రాహ్మణస్సన్ అస్మిన్ లోకే నిందితో మందచేతాః పరేచ లోకే నిరయం ప్రయాతి" = బ్రాహ్మణుఁడయ్యును నెవఁడు క్షాత్ర వైశ్య శూద్ర కర్మముల నాచరించునో వాఁడీలోకమున నిందింపఁబడి పరలోకమున నరకగామి యగుచున్నాఁడు" (మహాభారతము) ఇట్లు వ్యవసాయము చేసెడివారు, వ్యాపార మొనర్చెడివారు, వడ్డీలకు ధనమిచ్చి జీవించువారు, ఉద్యోగము లొనర్చువారునై పెక్కువిధములుగానున్న బ్రాహ్మణు లందఱు, నిందితులై, నరకగాములు కావలసివచ్చును. మఱియు నీకాలమునఁ గోర్టులలో, గాపీ హెూటళ్లలో దుకాణములలోనాఫీసులలో నితరజాతులవారు యజమానులైయుండఁగా బ్రాహ్మణులు గుమాస్తాలై శూద్రకర్మమైన పరిచర్య గావించుచున్నారు.

శూద్రులకును యజ్ఞాధికారము గలదు

పైవాదమువలన బ్రాహ్మణులనఁబడువారే బ్రాహ్మణులుగాదనియు, శూద్రులనఁ బడువారు శూద్రులుగాదనియు, నన్నివర్ణములలో నన్నివర్ణములవారు గలరనియుఁ దేలినది. కావున నర్హులైన శూద్రులకును యజ్ఞాదిసర్వాధికారములు గలవు. నిషేధించిన శాస్త్రములు సర్వవర్ణములలో నుండు నశక్తులైన శూద్రులకేయన్వయించును. "సంసృష్టా బ్రాహ్మణైరేవ త్రిషువర్ణేషు సృష్టయః, దేవానా మపి యేదేవా యద్బ్రూయుస్తేపరంహితం, తస్మాద్వర్ణైస్సర్వ యజ్ఞాస్సంసృజ్యంతేనకామ్యయా' బ్రాహ్మణుల వలనే మిగిలిన మూడు వర్ణము లేర్పడినవి. (అనఁగా మనుష్యులు మొదటనొకే జాతిగా నుండి క్రమక్రమముగా నాలుగు జాతులుగా నేర్పడుటచే నందఱును బ్రాహ్మణుల వలననే గలిగిరని చెప్పుట తటస్థించినది. దీనివలన నందఱును బ్రాహ్మణులే యనియుఁ దేలినది. ఎల్లరును బరబ్రహ్మము వలననే పుట్టిరికదా) దేవతలును దేవతలకు దేనినిఁ బ్రియముగాఁ జెప్పుచున్నారో యట్టిపరమహితమైన దానిని జెప్పుచున్నాను. అట్లేర్పడిన వగుటచే సర్వవర్ణముల వారును శ్రౌతస్మార్తరూపములైన సమస్త యజ్ఞములను జేయవచ్చును (మహాభారతము, శాంతిపర్వము) "బ్రాహ్మణ స్త్రీషు వర్ణేషు యజ్ఞస్రష్టః తస్మాద్వర్ణా ఋజవో జ్ఞాతివర్ణాః సంసృజ్యంతే తస్య వికార ఏవ" – నాలుగు జాతులును బరబ్రహ్మము నుండి పుట్టినవే. అకారరూపమైన యక్షరము స్వరోష్మములచేఁ బ్రకటింపఁ బడుచు బహురూపమును బొంది సామవేదముగాను, యజుర్వేదముగాను, ఋగ్వేదముగాను బరిణమించినట్లు పరబ్రహ్మ యొక్కఁడే నాలుగువర్ణములకు హేతువై కర్తయగుచున్నాఁడు (మహాభారతము, శాంతిపర్వము). ఇట్లు యజ్ఞార్హత వెలయుచుండఁగాఁ దత్పూర్వభావియైన యుపనయనమునకును, యజ్ఞోపవీతమునకును శూద్రులకర్హతయున్నదని వేఱుగాఁ జెప్పనేల ? యర్థాపతితమగుచున్నది గదా! మఱియుఁ బితృకార్యాదుల యందు

శూద్రులకును, నంతసేపు పైపంచనో, లేక మఱియొకదానినో యుపవీతముగాఁ దగిలించు చునేయున్నారు. పిదపనాకార్యము ముగిసిన తరువాత దానినిఁ దీసివేయు చున్నారు. ఈవిషయమును గూర్చి “యవసరమైనంతవఱకు ధార్యముంచుకొనుటయు, నవసరములేని యపుడు వెడలఁగొట్టుటయు వలెనున్న దీజన్నిదమును, గార్యసమయములందు వేసికొని పిదపఁ దీసివేయుట” యని యొకఁ డాక్షేపించెను. ఈయాక్షేపణము సమంజసముగానే యున్నది. ఉపనయనరూపమైన కర్మను జరుపుటవలనఁ గదా ద్విజులగుచున్నది ? ఆకర్మను జరిపిసంస్కరింపఁగా శూద్రుఁడును నేలద్విజుఁడు కాఁడు ? “జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః” పుట్టుకతోడనే యెవఁడును బ్రాహ్మణుఁడు గాఁడు. పుట్టినప్పుడు ప్రతివాఁడును శూద్రుఁడే. శుభకర్మనాచరించుటవలన ద్విజుఁ డగుచున్నాఁడని శాస్త్రోక్తి గలదు. ఉపనయనమును బొంది కొందఱు ద్విజులగు చుండఁగాఁ గొందఱు మాత్ర మాకర్మ నాచరించిన నేలకారు ? బ్రాహ్మణులను వారికిని నీయజ్ఞోపవీతము పుట్టుకతోడనే శరీరము నంటుకొని వచ్చుట లేదు. మఱియు నిషిద్ధకర్మముల నాచరించినవారు తమవర్ణములనుండి భ్రష్టులై క్రిందికిఁబోయి యైదవవర్ణమున ననఁగాఁ జండాలురలోఁ జేరుచున్నారు. నిషిద్ధకర్మమువలనఁ గ్రిందివర్ణమున కెట్లుపోవుచునాఁడో యట్లుత్తమకర్మాచరణమునఁ బైవర్ణమునకు మనుష్యుఁ డెట్లు రాకుండును ? “శూద్రో రాజన్ భవతి, బ్రహ్మాబంధు ర్దుశ్చారిత్రో యశ్చ ధర్మాదపేతః, వృషలీపతిః పిశునో నర్తనశ్చ గ్రామ ప్రేష్యో యశ్చభవేద్వికర్మా” దుశ్చరిత్రముతో నుండినను నధర్మపరుఁడైనను, శూద్రస్త్రీనిఁ గైకొన్నను, గొండెములు చెప్పుచున్నను, నాటకము లాడినను, గ్రామము మీఁద వచ్చు నాదాయముతో జీవించినను, దనకుఁవిహితముగాని విరుద్ధకర్మనాచరించినను, బ్రాహ్మణుఁడు, నీచుఁడై శూద్రుఁడగును. అట్టివాఁడు పంక్తిభోజనమున కర్హుఁడుగాఁడు. (మహాభారతము, శాంతిపర్వము) ఇట్లు నింద్యకర్మ నాచరించి బ్రాహ్మణుఁడు శూద్రుఁడగుచుండఁగా, శూద్రుఁ డుత్తమ కర్మ నాచరించి బ్రాహ్మణుఁ డేలకాఁడు ? మఱియు నొక విషయమున్నది. బ్రాహ్మణుఁ డితరుల కర్మల నాచరింపఁగూడదుగాని, శూద్రాదు లితరుల కర్మ లాచరించి పైకిఁబోవచ్చును. పైనున్నవాఁడు క్రిందఁబడఁగూడదుగాని క్రిందనున్నవాఁడు పైకిఁబోవుట దోషమెట్లగును? “నహి కల్యాణ కృత్కశ్చిత్ దుర్గతిం తాతగచ్ఛతి” అర్జునా! శుభము నాచరించినవాఁ డెప్పుడును దుర్గతినిఁ బొందఁడు (గీతోపనిషత్తు) ఇట్లే పూర్వులు నింద్యకర్మ నాచరించుటచేఁ బతితులై (పంచములు) యున్నవారును నుత్తమకర్మాచరణమనఁ మరల బైకి రాఁగలరు.

శూద్రులకును వేదాధికారము గలదు

శూద్రులకును వేదాధికారము లేకపోలేదు. మనుష్యునకుఁ జిన్న తనముననే నక్షరాభ్యాస మొనర్చునపుడు ప్రతివానికిని సర్వవేదసారమైన యోంకార ముపదేశింపఁ

బడుచున్నది. అనఁగా నోనమాలు దిద్దించునపుడు మొదటి యోంకారమేగదా. అక్షరాభ్యాసముననే ప్రతివానికిని, వేదాధికారము గలుగుచున్నదన్నమాట. "తాని శ్ర క్రాణ్యాభ్యతపత్ తేభ్యోzభితప్తేభ్యస్త్రయో వర్ణా అజాయంత, అకార, ఉకార, మకార ఇతి తాన్యేకధా సమభరత్ తదేతదోమితి" మూడు వేదములను గాచెను. అట్లుగాచి వడియఁగొట్టగా మూడు వేదములనుండి మూడువర్ణములు తత్సారములై పుట్టెను. అవియే అకార ఉకార మకారములు. వానిని మరల నొకటిగాఁ జేర్చెను. అదియే యీ యోంకారము. (శ్రుతి.) ఇట్లు సర్వవేదసారమైన యోంకారమే సర్వులకు నుపదేశింపఁబడుచుండఁగా, వేదములేల యుపదేశింపరాదు ? సాక్షాదనంతుఁడును, విశిష్టాద్వైతకర్తయు నైన భగవద్రామనుజులు కంచి గోపురముమీఁదికి, నెక్కి తమయాచార్యుల యాజ్ఞమీఱి, సర్వవేదసారమైన యష్టాక్షరీ మంత్రము నెల్లజాతులవారికి నుపదేశించెను. ఉపదేశించుటయుఁగాదు. గ్రామమున దేనినైనఁ బదిమందికి నెఱుకచేయవలసినప్పుడు తమతమావేసినట్లు చాటెను. శూద్రులును బంచములును నిచట లేకుండఁబోండు, మీరు వినకూడదు, బ్రాహ్మణులు మాత్రమే యుండుడని చెప్పక వారు తిరుమంత్రము నెల్లరికిఁ జాటిరి. అది శూద్రులనఁగూడనిదియు, వినఁగూడనిదియు నైన, సాక్షాత్ శేషావతారమూర్తులును, భగవదేకాంతులునైన యతిశేఖరు లట్లేల చేయుదురు? వేదమునకు సర్వాధికారులైన భగవానుఁడును, దదీయులును నిట్లు సర్వులకు నధికార మున్నదని యుపదేశించుచుండఁగా నసూయాళువులై యధికారము లేదని శాసించుట కెవరికధికారమున్నది ? విఠోబా కుమారులైన జ్ఞానదేవాదులు, తమను వెలివైచిన బ్రాహ్మణుల కడకేగి, విధ్యుక్తముగా దమకుఁ బ్రాయశ్చిత్తముచేసి కులమునఁ గలుపుకొమ్మని వేఁడిరి. అందుల కా బ్రాహ్మణులు "మీరు గోదావరీ తీరమునన్నున్న పైఠినీ పురమునకుఁ బోయి యచ్చటి పండితులచేఁ బ్రాయశ్చిత్త విధానము వ్రాయించుకొనిరండు, ఆ ప్రకారము నడచుకొంద" మని యొక యుత్తరము వ్రాసియిచ్చిరి. దానిని దీసికొని జ్ఞానదేవుఁడును దత్సోదరులును బైఠినీపురమునకుఁ బోయి, యచటి విప్రపండితులకుఁ జూపఁగా "నాహో మీరు సన్యాసికొడుకులా" యని పరిహసించి జ్ఞానదేవులను, నీ పేరేమని యడిగిరి. నాపేరు జ్ఞానదేవుఁడని చెప్పఁగా నీవు సాంగముగా వేదాధ్యయనము చేసితివా? శాస్త్రములన్నియుఁ జదివితివా ? యని ప్రశ్నించి లేదనఁగా, మఱి యట్టి నీకు జ్ఞానదేవుఁడని పేరెట్లు పెట్టిరని బ్రాహ్మణులు నవ్విరి. నవ్వుటయేకాక యింతలో నచటికొక దున్నపోతు రాగా దానినిజూపి వేదాధ్యయనాదులేమియులేని నీకు జ్ఞానదేవులనెడి పేరు చెల్లుచుండఁగా, దీనికి మాత్రమేల చెల్లదు ? ఈ మహిషమునకు మేము జ్ఞానేశ్వరుఁడని పేరు పెట్టుచున్నామనిరి. అంత జ్ఞానదేవులు విప్రులను జూచి "యయ్యా! జ్ఞానేశ్వరుఁ డను నామము దానికిఁజెల్లును, నాకును నా మహిషమునకును భేదము లేదు. మీకును మహిషమునకును

గూడ భేదము లేదు. అందఱియందును నున్న జీవులు సమానులేగదా" యని సమాధానము చెప్పెను. అపుడు మహిషముతోఁ దమను సమానులన్పందులకుఁ గోపించి మాతోనీదున్నపోతు సమమైన మేము చేయునట్లు వేదాధ్యయనము నదికూడఁ జేయవలయునుగదా యనిరి. అంతజ్ఞానదేవులు "అట్లే చేయును జూడుఁ"డని యామహిషముకడకేగి తన చేతితో దాని చెంపనుగొట్టెను. అప్పుడా దున్నపోతు స్పష్టముగా నుదాత్తానుదాత్తస్వరితములతోఁజక్కగా వేదాధ్యయనము గావించెను. ఇట్లు పశువులలో నీచమైన దున్నపోతునకే వేదాధ్యయనాధికారమున్నట్లు భగవానుని సంకల్పమై యుండ మనుష్యులలోఁ గొందఱికి లేదని చెప్పవత్తురు. అహెూ యన్యాయము! "మాంహి పార్థ వ్యపాశ్రిత్య యేపిస్యుః పాపయోనయః స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేపియాంతి పరాంగతిమ్. 'అర్జునా! నన్నాశ్రయించి, పాపయోనులైన స్త్రీలు, వైశ్యులు, శూద్రులు కూడ నుత్తమగతినిఁ బొందుచున్నారు (గీతోపనిషత్తు), పాప మిచట "మనతోఁగూడంగఁ గంసమర్దనుఁ డోడెన్" అన్నట్లు త్రైవర్ణికులలోఁ జేరిన వైశ్యులును శూద్రులతోఁబాటు పాపయోనులక్రింద గణింపఁబడిరి. ఇట్లు వేదప్రతిపాద్యమైన పరబ్రహ్మము నుపాసించుటకే యందఱికి నధికారముండఁగాఁ దత్ప్రతిపాదకమైన వేదమున కేలలేదు ?, వేదములకు వేదాంతములకు ఫలము, బ్రహ్మోపాస్తియేగదా! వేదవేదాంతార్థ మెట్లైన తెలిసికొనిగదా బ్రహ్మోపాసనము చేయును. అర్థమును దెలిసికొనుటకు నధికారము గలిగియుండఁగా వాచకమున కేలలేదు ? అర్థమేగదా ప్రధానము ? వేదముల కర్థము ప్రధానముగాదు, వాక్యానుపూర్వియే యందురా, "వేదభారభరాక్రాంత స్సవై బ్రాహ్మణగర్దభః' అర్థమును దెలిసికొనక నట్టి వేదాధ్యయనము చేయు విప్రుఁడు బరువుమోయు గాడిదవంటివాడు' అనుటచే నర్థమే ముఖ్యమని తెలియుచున్నది.

శూద్రులకును సన్యాసము కలదు

శూద్రులకును సన్యాసాశ్రమముఁ గైకొనుటకు నధికారమున్నది. "శుశ్రూషోః కృతకార్యస్య కృతంసంతానకర్మణః, అభ్యనుజ్ఞాతరాజస్య శూద్రస్య జగతీతలే, అల్పాంతర గతస్యాపి దశధర్మగతస్యవా ఆశ్రమావిహితాస్సర్వే వర్జయిత్వా నిరాశిషమ్," – వేదముల ద్వారా యాత్మచింతన చేయఁగోరినవాఁడైన శూద్రుఁడు సంతానము కలిగిన పిమ్మట రాజాజ్ఞఁగైకొని సన్యాసముఁ దీసికొనవలెను. తన శుభకర్మా చరణమునఁ ద్రైవర్ణికులతో సముఁడైయున్న శూద్రుఁడు, సన్యాసాది సర్వాశ్రమములను దీసికొనవచ్చును (మహాభారతము శాంతిపర్వము) విదురుని యవసానకాలమున నతని దేహమున కగ్నిసంస్కారము గావింప వలయునని ప్రయత్నించు ధర్మరాజుతో భగవంతుఁ డశరీర వాణియై "భో, భో రాజ న్నదగ్ధవ్యం ఏ తద్విదురసంజ్ఞకం కళేబర మిహైతత్తే నైషధర్మ స్సనాతనః లోక వైలక్షణో నామ భవిష్యత్యస్య

పార్థివ. యతి ధర్మ మవాప్తోzసా నశోచ భరతర్షభ! "రాజా! యీ విదురుని దేహమును దహింపకుము. యతిధర్మ మనుష్ఠించిన యితని యెడ లోక విలక్షణముగాఁ జరుపవలయును. ఇట్టి మహాత్ముని శరీరము దహించుట సనాతన ధర్మముగాదు." అని చెప్పెను. కావున నిచట శూద్రుఁడైన విదురుఁడు యతిశ్రేష్ఠుఁడనియు నతనికి యతియోగ్యకార్యము లాచరింపవలయుననియు దైవమే వచించెను. సిద్ధౌషధముచే లోహము బంగారమైన పిదప నసలుబంగారమునకును దానికిని భేదముండదుగదా. యట్లే శుభకర్మసంసర్గమునఁ బవిత్రుఁడైనవాని కన్ని యధికారములును గల్గును. అట్టి శుభకర్మాచరణము లేనివాని కెవనికైన నా యధికారము లన్నియును బోవును.

శూద్రులును నాచార్యకము వహింపవచ్చును


అసలు బ్రాహ్మణేతరులును గురుత్వమును బూనవచ్చునని చెప్పవచ్చిగదా యీ వ్యాసము ప్రారంభమాయెను. అట్టి విషయమును దడవుట కిప్పటి కవకాశము కలిగెను. గురుఁ దనఁగా జ్ఞానబోధమూలమున, నజ్ఞానమును నివర్తింపఁజేసి యుత్తమగతినిఁ బొందునట్లు చేయువాఁడనిగదా యర్థము. అట్టి జ్ఞానశక్తులే యాచార్యత్వమున కర్హత నిరూపించునుగాని జాతియేల ? కన్య నిచ్చుటకుఁగానీ కన్యను గ్రహించుటకుఁగానీ, లోకవ్యవహారమున నున్న కట్టడి చెడకుండునట్లు జాతి కావలయును గాని జ్ఞానోపదేశమున కదియేమి యుపకరించును. జ్ఞానానుష్ఠానశూన్యుఁడైన వాని నొకని నుత్తమజాతివాఁడని గురువుగా నంగీకరించిన వచ్చు ఫలమేమి యుండును ? తపస్తేజోజ్ఞానసంపన్నుఁడైన యధమజాతివాని నాశ్రయించినఁ దనకుఁ గలుగవలసిన జ్ఞానసంపత్తికిఁ గొఱఁత యేముండును ? ఉత్తమజాతియు, సామర్థ్యమును రెండును గావలయునందురా ? సామర్థ్యము వలనఁ బ్రయోజనము గనుపట్టుచున్నది కాని, రెండవది యైన జాతివలన నట్టి ఫలమేమి యున్నది ? వ్యర్థమేగదా. ఒక వందరూపాయలు మనియార్డరు నొక నీచజాతివాఁడు దెచ్చె ననుకొనుఁడు. అట్టి సమయమున నీచజాతివాఁడు తెచ్చెనేయని తీసికొనక మానుదుమా ? తేఁబడినది డబ్బుగదా యని, యానందముతోఁ గైకొందుమా? వానిజాతితో మనకేల ? డబ్బేగదా మనకుఁ గావలయును ? అట్లే గురుని జాతితోడఁ బనియేమి ? వాని తపస్తేజశ్శక్తులే యపేక్షణీయములు. విచారించి చూచినఁ బూర్వమునను శాస్త్రవిషయకముగా లోకమునకు జ్ఞానబోధఁ గావించి యాచార్యత వహించిన వారిలో శూద్రులే యధికముగాఁ గనుపట్టుచున్నారు. శాస్త్రము లన్నిటిలో సాక్షాత్ భగవన్ముఖేరితమై హెచ్చుగౌరవము నొందిన భగవద్గీతను మునుముందుగా లోకమునకుపదేశించిన దెవరు? శూద్రుఁడైన సంజయుడుఁగదా! అర్జునునకు శ్రీకృష్ణపరమాత్మ యుపదేశించెనని సంజయుఁడు తొలుదొల్త

ధృతరాష్ట్రునకుఁ జెప్పెను. ధృతరాష్ట్రునకు సంజయుడుఁ జెప్పెనని వ్యాసులు భారతస్థమొనరించెను. కావున గీతాగురుపరంపరలో మొదటి యాచార్యుఁడు భగవానుఁడు, రెండవవాఁడు సంజయుఁడు. శూద్రుండైన సంజయుఁడు క్షత్రియుండైన ధృతరాష్ట్రుని కుపదేశించుటచే మహిమాన్వితుఁడైన దక్కుపజాతి వాఁడైనను నుత్తమజాతులకుఁగూడ నుపదేశించవచ్చునని తేలుచున్నది. మఱియు భగవద్గీత ప్రతియధ్యాయము చివరను "ఇతి శ్రీమద్భవద్గీతాసు, ఉపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే" అనికదా యున్నది. అనఁగా భగవద్గీత, యుపనిషత్తు, ఒక యుపనిషత్తు మాత్రమేగాదు, బహువచనముండుటచే నన్నియుపనిషత్తులు భగవద్గీతయే; బ్రహ్మవిద్యయు, భగవద్గీతయే; భగవద్గీత యోగ శాస్త్రముకూడ. అట్టి భగవద్గీతను శూద్రుఁడైన సంజయుఁడు క్షత్రియుఁడైన ధృతరాష్ట్రుని కుపదేశించుచుండఁగా, నిఁక శూద్రులు వేదము వినఁగూడదనియు, బ్రహ్మవిద్య కధికారులు గారనియు నాచార్యత్వముఁ బూనరాదనియు శాసింపచ్చువారి యజ్ఞాన మెంతని వచింపవచ్చును ?

ఆదికావ్యమై యఖండ భగవచ్చరిత్రమైన శ్రీమద్రామాయణమును వ్రాసి కవికులగురువైన వాల్మీకి, బోయవాఁడుగదా! అరణ్యమునఁ ద్రోవలు గొట్టి ఘోరపాపము లాచరించుచున్న వ్యాధుఁడు, మహర్షులనుగూడఁ గొట్టవచ్చి వారిబోధవలన విరక్తుఁడై 'మరా' యను శబ్దమును యుగములకొలది జపించెను. మీఁదఁ బుట్టలు పట్టిపోయెను. అప్పు డా తపఃపరిపక్వస్థితి నెఱిఁగి బ్రహ్మ ప్రచేతసుఁడను మునిని వెంటఁగొనివచ్చి యమ్మహాత్ముని వెలికిఁదీసి ప్రచేతసునిచే సంస్కరింపఁజేసి "అథా బ్రవీన్మహాతేజా బ్రహ్మాలోక పితామహః, వల్మీక ప్రభవో యస్మాత్తస్మాద్వాల్మీకిరిత్యసౌ" ఇతఁడు వల్మీకమే (పుట్ట) కారణముగాఁ గలవాఁడగుటచే వాల్మీకి యని, లోకపితామహుఁడైన బ్రహ్మవచించెను. (బ్రహ్మవైవర్తము) ఇట్లతనికి వాల్మీకి యని పేరిడెను. ప్రచేతసునిచే సంస్కారము నొందఁబడుట వలన వాల్మీకి ప్రాచేతసుఁడనియు వ్యవహరింపఁబడెను. ప్రచేతసుఁడు భృగువంశస్థుఁడు. భృగువంశస్థుఁడైన ప్రచేతసునిచేసంస్కరింపఁబడుట వలన వాల్మీకికి భార్గవుఁడనియు నామము కలిగెను. మఱియు లోకమంతయు వాల్మీకి బోయవాఁడని యప్పటినుండి యిప్పటివరకు జనశ్రుతి ప్రబలముగా నున్నది. "మును మరా యంచుఁ బలికిన చెనటిబోయ. నెఱనిరాబారి యగుటయె గుఱుతుగాదె" (కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహము) ఇట్లు పురాణములును, జనుల నానుడియు వాల్మీక బోయవాఁడని చెప్పుచుండఁగా నిటీవలివారు కొందఱు "ఋక్షోభూద్భార్గవస్తస్మాత్ వాల్మీకిర్యోభిధీయతే" యని విష్ణుపురాణమున నిరువది యెనమండ్రు వ్యాసులను జెప్పునపుడు వాల్మీకిని భార్గవుఁడని యనుటచే దాని నాధారముగాఁగొని వాల్మీకి మొదట బోయవాఁడై మరా యను మంత్రజపముఁజేయుచుఁ

జచ్చి భృగువంశమున బ్రాహ్మణుఁడై జన్మించి మరలఁ బుట్టలుపట్టునట్లు రామమంత్రము జపించెననియు. నప్పుడు ప్రచేతసుఁడనఁగా వరుణుఁడుగాననట్టి వర్షాధిపతియైన వరుణుఁడు నిరంతర వర్షము వాల్మీకిపై కురియఁగా నాపుట్ట కరిగి యతఁడు బైటికివచ్చెననియు, నందువలన వాల్మీకి యనుపేరు వచ్చెననియు, నేవేవియో వ్రాసిరి. ఇంతకును వీరి కాధారము వాల్మీకికి భార్గవుఁడని పేరుండుట. భృగువంశస్థుఁడైన ప్రచేతుఁడు సంస్కరించుటవలన వాల్మీకికిఁ బ్రాచేతసుఁడనిఁ భార్గవుండని పేరులు గల్గెనని యింతమాత్రముతో సరిపోవుచుండఁగాఁ గొండను ద్రవ్వి యెలుకనుబట్టినట్లు వీరికీ ప్రయాసయంతయునేల ? వాల్మీకిని బ్రాహ్మణునిఁ జేయుటకా ? వాల్మీకికి బ్రాహ్మణత్వ వ్యాధత్వములతో నేమిప్రయోజనము ? ఆయన మహత్త్వమున కవిరెండును గారణములు కావుగదా. రామమంత్రజపమే కారణమని యందఱు నొప్పుకొనవలసినదే. మఱి వీరికి వాల్మీకి యసలు బోయవాఁడు కానేకాఁడని చెప్పుటకు వశపడదు. ఇఁక వీరుచెప్పున దేమనఁగా, బోయవాఁడు చచ్చి రామమంత్ర జపముచే బ్రాహ్మణుఁడై పుట్టి వాల్మీకి యాయెనని. రామమంత్రజపము బ్రాహ్మణజన్మ మిచ్చెనని చెప్పెడి వీరి యభిప్రాయమున నా జన్మముననే రామమంత్ర మహిమ బ్రాహ్మణత్వ మీయలేదని యన్నమాట! ఆ మంత్రమహిమమున వ్యాధుఁడు వెంటనే బ్రాహ్మణుఁడై భృగువంశస్థుఁడై పుట్టుచుండఁగా, నా మంత్రమాజన్మముననే బ్రాహ్మణత్వ మేల యీయలేదో వీరు వెనుకకుఁదిరిగి చూచుకొనుటలేదు. రాజైన విశ్వామిత్రుఁడు తపస్సుచే బ్రహ్మర్షియై బ్రాహ్మణ గోత్రప్రవర్తకుఁడు కాలేదా ? ఇట్టి వ్యర్థవాదములచే, భగవన్నామ మహిమనుగూడఁ దాము గొంచెపరచుచున్నామనియు వీరు తెలిసికొనుటలేదు. ఇంతేగాక ప్రచేతుఁడనఁగా నిచట వరుణుఁడే యర్థమై యతఁడు, వర్షము కురియుటవలననే ప్రాచేతసుఁడని పేరు, వాల్మీకికి వచ్చినయెడల, నట్లే, వరుణుఁడు, పాశి, యప్పతి మున్నగు వరుణపర్యాయపదములవలన, వారుణి మున్నగు నామములు వాల్మీకి కేలరాకుండెను? కావున నాదికావ్యమై, సర్వలోక వందితమైన రామాయణము వ్రాసినవాఁడు బోయయైన వాల్మీకి, యతఁడు కవికులగురువు.

నైమిశారణ్యమున దీర్ఘసత్రయాగమును జేయుచున్న శౌనకాది మహామునులకు నెల్ల బురాణములను, మహాభారతమును జెప్పినవాఁడు సూతమహర్షి. సూతుఁడు ప్రతిలోమజాతుఁడు అనఁగా "బ్రాహ్మణ్యాం క్షత్రియాజ్జాతస్సూతః" = బ్రాహ్మణస్త్రీ యందు క్షత్రియునివలనఁ బుట్టిన వాఁడు" అను యాజ్ఞవల్క్య వచనప్రకారము, అనులోమ జాతుఁడైనఁగాక, సంకరుఁడైన ప్రతిలోమజాతుఁ డగుచున్నాఁడు. అట్టి సూతునికి బ్రహ్మవేత్తలైన శౌనకాదు లెల్లరు బ్రహ్మాసనమిచ్చి వాని వలనఁ బురాణముల నెల్ల వినిరి. ఇఁక శూద్రులు చెప్పు పురాణాదులు వినఁగూడదని పలుకువారి తెలివి కేమని



పన్యాల కుటుంబయ్యగారు, వారి ధర్మపత్ని బసవపున్నమ్మ గారు, మోదుమూడి

సంతసింపవచ్చును! సూతుని తండ్రియు రోమహర్షణుఁ డనెడిసూతుఁడు. ఇతఁడును వేదవ్యాసులకడ సమస్త శాస్త్రములను బురాణములను జదివి శౌనకాదులకుఁ బురాణవక్త యాయెను. ఇట్లు సూతజాతులైన యీ తండ్రికుమారులిరువురును బ్రహ్మాసనము నలంకరించి శౌనకాదులకుఁ బురాణములు చెప్పిరి. ఒకవేళ సూతుఁ డనెడి పేరుగలిగిన బ్రాహ్మణుఁడేగాని యతఁడు, శూద్రుఁడు గాఁడనవత్తురేమో, యట్లు వీలుగాదు. భాగవతమున దశమస్కంధముఁ జూడుఁడు. బలరామస్వామి తీర్థయాత్రఁ జేయుచు నైమిశారణ్యమునకుఁ బోయెను. అంత నచటి ఋషులెల్లరు నా బలదేవునకుఁ బ్రత్యుత్థానాదులు గావించి పూజించిరి. శౌనకాదులకుఁ బురాణములు చెప్పుచున్న రోమహర్షణుఁడు బ్రహ్మాసనము నుండి లేవలేదు. అపుడు బలరామస్వామి విప్రులైన మహర్షులందఱు లేచి నన్నుఁ బూజింపఁగా, నితఁడు ప్రతిలోమజాతుఁడయ్యు. వేదవ్యాసుల వలన నఖిలశాస్త్రపురాణాదులు వినియు, ఋషులు బ్రహ్మాసనమిచ్చినంత మాత్రమున, నహంకరించి నాకు నమస్కరింపక, గౌరవింపక యుండెఁ గావున, వధ్యుఁడని కోపించి, కుశాగ్రమున నతనిఁ జంపెను. "హాహేతివాదినస్సర్వేమునయః ఖిన్నమానసాః ఊచుస్సంకర్షణం దేవమధర్మస్తేకృతః ప్రభో! అస్యబ్రహ్మాసనం దత్తమస్మాభిర్యదునందన ఆయుశ్చాత్మాక్లమంతావద్యావత్సత్రం సమాప్యతే." అంతట మునులెల్లరు హాహాకారములు చేయుచు విచారముతో దేవదేవుఁడైన యా సంకర్షణునితో నిట్లనిరి. "ప్రభూ నీవలన నిపుడధర్మమాచరింపఁబడినది. ఈ సూతునకు మేము బ్రహ్మాసన మిచ్చితిమి. మఱియు మాయీ దీర్ఘసత్రము ముగియునంతవఱకు నాత్మకు నలసట గలుగనియట్టు లాయువు నొసంగియుంటిమి" "యద్యేత ద్బ్రహ్మహత్యాయాః పావనం లోకపావన! చరిష్యతి భవాన్ లోకసంగ్రహే. నాన్యచోదితః" కావున నిపుడు బ్రహ్మహత్య గలిగినది. జగత్కర్తవైన నీకు బ్రహ్మహత్యాదోషము లేకపోయినను లోకసంగ్రహార్థమైనను గావింపవలయు"ననిరి. అపుడు బలరామస్వామి, కోపవశమునఁ బొరపడి యకార్యము నొనరించితిని. మీరితనికి నాయువిచ్చినమాట వ్యర్థముగాకుండ, నది యతని పుత్రునికిఁ గలుగుఁగాక! "ఆత్మావై పుత్రనామాసి" యను వేదవచనము వలనఁ గుమారునికిఁ గలుగుట తండ్రికిఁగలుగుటయే యని వచించి సూతవధ జనిత బ్రహ్మహత్యాదోష నివృత్తికై సంవత్సరము తీర్థాటనము గావించెను. కావున సూతుఁడు ప్రతిలోమజాతుఁడైన శూద్రుఁడు. అయ్యును శౌనకాది మహర్షులకుఁ బురాణవక్తయై, మహాభారతమును, భాగవతాది సర్వపురాణములను జెప్పెను. పైగా నతని జంపుటవలన బ్రహ్మహత్య వచ్చినదనియు, గావునఁ దద్దోషశాంతికై తీర్థయాత్రఁ గావింపుమనియు, సాక్షాద్భగవదవతారమైన బలరామస్వామికి మునులే చెప్పిరిగదా. సూతునకు బ్రాహ్మణత్వము రాకపోయిన బ్రహ్మహత్య యెట్లగును ? ఇట్లుపనిషత్సారమైన భగవద్గీతను లోకము కుపదేశించిన వాఁడు శూద్రుఁడు.

రామాయణమును వ్రాసినది శూద్రుఁడు. మహాభారతమును, భాగవతాదులగు పదునెనిమిది పురాణములను శౌనకాది మహామునులకుఁ జెప్పినవాఁడు శూద్రుఁడు. ఒకవేళఁ బురాణాదులుపదేశించుటకు మాత్రమే శూద్రుల కధికారమున్నది. బ్రహ్మవిద్య నుపదేశించుటకు లేదందురేమో. భగవద్గీతా రామాయణ మహాభారత భాగవత ప్రతిపాదితమైన బ్రహ్మవిద్యకంటె నింక బ్రహ్మవిద్య యేమిటి ? ఒకవేళఁ దత్ప్రతిపాదితమైన బ్రహ్మవిద్యకంటె భిన్నమైన బ్రహ్మవిద్య యొకటి యున్న, దాని నుపదేశించు నధికారము శూద్రులకు లేకపోయినఁ బోవుగాక! దానిని బ్రాహ్మణులకు మాత్రమే యుండనిండు.

క్షత్రియుఁడైనయుపరిచరవసువు వీర్యమును జేఁప మ్రింగగా దానివలనఁ బుట్టి, దాశరాజు (పల్లెరాజు)చేఁ బెంపఁబడినది మత్స్య గంధి. ఆమెయందుఁ బరాశరమహర్షి వలనఁ బుట్టినవాఁడు వేదవ్యాసులు. ఆయన దేకులమని చెప్పవలయును ? కుండయందుఁ బుట్టినవాఁ డగస్త్యుఁడు. దేవదాసియైన యూర్వసికి వశిష్ఠుఁడు జన్మించెను. మాండవ్యుఁడు మండూకమునకు (కప్ప) జనించెననియు, శౌనకమహర్షి శునకమునకు నుద్భవించెననియు, శుక బ్రహ్మచిలుక గర్భమునఁ బొడమెననియుఁ, బురాణములు చెప్పుచున్నవి. వీరి కులము లేవియని నిర్ణయింపవీలగును ? తపస్సువలననే బ్రహ్మత్వము నొందిరిగాని జన్మచేతఁ గాదుగదా.

శబరి గురువులకు గురువైన మతంగమహర్షి, మాదిగవాఁడని పేరువలననే తెలియుచున్నది. శబరి గురువులైన మతంగశిష్యుల ప్రభావము రామాయణమున విపులముగాఁ జెప్పఁబడియున్నది. మతంగుని మహత్త్వమును వర్ణింపఁబడినది. దండకారణ్యమున రాముని కాతిథ్యమిచ్చుటకై మా యింటికంటే మాయింటికని తగవులాడుకొని జింక చర్మములతోఁ బరస్పరము బాదుకొనినను మహర్షుల యందఱి యిండ్లకు రామచంద్రస్వామి వెళ్ళుట తటస్థపడనేలేదు. అట్టి పరబ్రహ్మ లక్ష్మణసహితుఁడై మతంగ శిష్యకోటిఁ జేరిన శబరి యాశ్రమమును దమకుఁ దామై వెదకుకొనుచు వచ్చిరి. వచ్చుటేకాదు. ఆమె నోటితోఁ గొఱికిచూచి యిచ్చిన యెంగిలిపండ్లు మహాసక్తితో మెసవె. గురువు మాదిగవాఁడు. శిష్యురాలు బోయెత. తప్పైయున్న నట్టి దోషయుక్తుల దండింపవలసి యుండఁగా, బరబ్రహ్మ యా శబరిని వెదకుకొనుచు మతంగాశ్రమమున కేల వచ్చి యామెను దర్శించెను ? పరమమూఢుఁడైన దురహంకారి యొకఁ డిటీవల మాసామాజికులతో "మతంగుని శిష్యురాలగుటచే శబరికి మోక్షములేదని, అందువలననే యామె స్వర్గమున కేగినట్లచటఁ జెప్పఁబడె"నని పలికినటులు తెలిపినది. ఎంతఘోరమది! "ఎంతటి భాగ్యమో శబరి యెంగిలిపండ్లు భుజించినా" వన్నట్లు మహాత్ములు, తపోధనులు, భగవదంతరంగులు నైనవారిచే నమస్కరింపఁబడుచున్న శబరికే మోక్షము లేదఁట! విదురుని యింటి యన్నము,

కుచేలుని యదుకులు, ద్రౌపది శాకలవము, శబరి యెంగిలిపండ్లు, నీ నాలుగే పరమాత్మకుఁ దృప్తిఁగూర్చినవని తత్త్వవేత్తలు నిర్ధారించి యున్నారు. అట్టి శబరికే మోక్షములేకపోయిన నిఁక ఎవరి కుందును ? స్వర్గము, దివము, అపవర్గము, మోక్షము మొదలైనవన్నియు రామాయణమున సమానార్థములుగానే వాడఁబడినవని, యెఱుఁగడా మూఢుఁడు. ఇట్టివారి నోటి కడ్డేముందును. ఇట్టివారు మహాభారతమున "మద్భక్తం శూద్రసామాన్యాదవ మన్యంతి యే నరాః, నరకేష్వవతిష్ఠంతి, వర్షకోటీ ర్న రాథమాః. చండాలమపి మద్భక్తం నావమన్యేత బుద్ధిమాన్, అవమానాత్పతత్యేవ రౌరవే నరకేచసః." అనఁగా నా భక్తుని శూద్రజాతివాఁడని. యవమానించు నీచనరులు కోటిసంవత్సరములు నరక మునఁబడియుందురు. నాభక్తుఁడు చండాలుఁడైనను, బుద్ధిమంతుఁడైనవాఁడు వాని నవమానింపఁడు. అట్లవమానించినవాఁడు రౌరవనరక మునఁబడును" అని భగవానుఁడు స్వయముగాఁ జెప్పినట్లు, సంపూర్ణమైన భగవన్నిగ్రహమునకుఁ బాత్రులై నరకగాములై పోవుదురు.

కశ్చిద్విజాతిప్రవరో వేదాధ్యాయీ తపోధనః తపస్వీ ధర్మ శీలశ్చ కౌశికో నామ భారత! సాంగోపనిషదాన్ వేదానధీతే ద్విజసత్తమః" అన్నట్లు బ్రాహ్మణోత్తముఁడై వేదాధ్యయన పరుఁడై తపోధనుఁడై ధర్మశీలుఁడైయున్న కౌశికుఁ డనునొక ముని ధర్మవ్యాధుడనునొక కిరాతు నాశ్రయించి యతని బోధవలనఁ దన ధర్మసందేహముల నన్నిటిని నివర్తింపఁ జేసికొనెనని మహాభారతారణ్యపర్వమునఁ జెప్పఁబడియున్నది.

విశిష్టాద్వైత మతమునకు మొదటిగురువు నమ్మాళ్వారు. వీరు శూద్రుఁడైన, కారి యనువానికి జన్మించిరి. వీరికి శఠగోపులనియు, వకుళాభరణులనియును, నిట్లు పెక్కు పేరులుగలవు. వైష్ణవమునకుఁ బ్రాణమే వీరు. వీరినిఁ దీసి యావలనుంచిన, నిఁక వైష్ణవమే లేదు. అట్టి ప్రథమాచార్యులు, శూద్రుఁడై యుండఁగా, శూద్రు లాచార్యత వహింపరాదనుట యెట్లు పొసఁగును ? ఒకవేళ వారప్రాకృతపురుషులు, వారితో సామ్యమెట్లుకుదురు నందురా? శూద్రులందఱును వారితో సములని మేమును జెప్పుటలేదు. కాని యట్టి యప్రాకృతులు శూద్రగర్భమున నేలపుట్టవలసి వచ్చెను ? బ్రాహ్మణగర్భ మేదియును దొరక లేదా ? శూద్రగర్భమునఁ బుట్టినను, విప్రగర్భమునఁ బుట్టినను నొకటే, మహత్త్వమే ప్రధానమని లోకమునకుఁ దెల్పుట కేభగవంతుఁడు వారినట్లు శూద్రకులమున, జన్మింపఁ జేసెను.

పన్నిద్దఱాళ్వారులలో నొక్కరైన శ్రీ పాణియాళ్వారు పంచమజాతి సంభూతుఁడు. వారి భక్తికి మెచ్చి రంగనాథస్వామి, లోకసారంగముని, యను బ్రాహ్మణోత్తమునిచే మోయించి తెప్పించి పరమభోగ్యంబని యా తిరుప్పాణియోగీంద్రుని శరీరంబును దానే మ్రింగి వైచెను. మఱియు నాళ్వారుల ప్రతిష్ఠలేనిదే భగవదాలయము మహాస్థలము గాదనిన శ్రీవైష్ణవ నియమములో, నెవరుండి యెవరు లేకపోయినను ముఖ్యముగా నుండవలసినవారిలోఁ దిరుప్పాణి యాళ్వారొకరు.

శ్రీరంగమున సప్తప్రాకారములును, సహస్రస్తంభమంటపములును, రంగవిమానము మొదలైన రంగనాధస్వామి యాలయముఁ గట్టించి పన్నిద్దఱాళ్వారులలో నొకరైన పరకాలుఁ డనఁబడు తిరుమంగైయాళ్వారు మ్లేచ్ఛుఁడు.

యామునమునీంద్రులు మారనేరి యనునొక పంచముని శ్రీవైష్ణవులైన శిష్యులందఱికంటె మిన్నగా లాలించి, తమ యంత్యకాలమునఁ బెద్దశిష్యుఁడైన పెరియనంబిగారినిఁ బిల్చి మారనేరినంబికిఁ జరమసంస్కారము నీవే చేయుమని యానతిచ్చి తిరునాడలంకరించిరి. పిదప పెరియనంబిగారును, మారనేరినంబికి గుర్వాజ్ఞానుసారముగా శ్రాద్ధాదులు గావించెను. మాలవానికి మీరు సంస్కారము నెట్లుచేసితిరని యడిగినవారికిఁ దిర్యక్కైన జటాయువునకు నగ్నిసంస్కారాదులు చేసిన శ్రీరామచంద్రస్వామివారి కంటె నేనెక్కువవాఁడను గాదుగదా యని యాయన సమాధానముఁ జెప్పెను.

కావున మహత్త్వమునకును, నాచార్యత వహించుటకును జాతికిని సంబంధము లేదు. మహత్త్వసంపన్నుల, నేజాతివారినైన నాచార్యులుగా స్వీకరింపవచ్చును. ఈ విషయమునే భగవంతుఁడు స్వయముగా "భక్తిరష్ట విధాహ్యేషా యస్మిన్ మ్లేచ్ఛేపివర్తతే, స విప్రేంద్రో, మునిశ్శ్రీమాన్, స యతి స్సచపండితః. తస్మై దేయం తతోగ్రాహ్యం స చ పూజ్యో యథాహ్యాహమ్" = ఈ యష్టవిధభక్తి లక్షణములు మ్లేచ్ఛుని యందుండినను, వాఁడే బ్రాహ్మణశ్రేష్ఠుఁడు. వాఁడే ముని. వాఁడే శ్రీమంతుఁడు, వాఁడే యతి. వాఁడే పండితుఁడు. వాని కేదైన నుపదేశింపవచ్చును. వానిచే దేనినైన నుపదేశముఁ బొందవచ్చును. మఱియు వాఁడు నావలెనే పూజ్యుఁడగుచున్నాఁడ"ని పెక్కు తావులఁ జెప్పియుండెను. పరుసవేది తాకిన నినుము బంగారమైనయట్లు భగవత్సంబంధముచేఁ బ్రతివాఁడును, బవిత్రమగును.

నిషేధశాస్త్రములు

శూద్రులకు యజ్ఞార్హత లేదనియు, వేదాధికారము, నాచార్యత్వాధికారమును లేవనియు నిట్లు నిషేధించిన శాస్త్రములును గొన్ని గలవు. అట్టి నిషేధశాస్త్రములు క్రిందఁజెప్పఁబడిన యన్నివర్ణములలో నశక్తులైయున్న శూద్రులకే యన్వయించును, గాని సమర్థులై యున్న వ్యవహారములోని శూద్రులకుఁగాదు. అట్లైన నమగ్రాహక శాస్త్రము లనఁగా నాయా యధికారము లుత్తములైన యన్నిజాతుల వారికిని గలవని చెప్పిన శాస్త్రములకు విరోధము పొసఁగును. జ్ఞానము, శ్రద్ధ, భక్తి, మొదలైనవి లేని మోరకులైన యట్టి శూద్రుల కుపదేశించిన నా శాస్త్రములు మూఢనిక్షిప్తములై స్వరూపమును గోల్పోయి చెడిపోవుననెడి యభిప్రాయమున బయలుదేఱిన యీ నిషేధశాస్త్రములను దరువాత దరువాత నసూయాళు

వులును, దీర్ఘదర్శిత్వము లేనివారునునైన కొందఱు శాస్త్రములను దమ సొంత హక్కుగా భావించి, యితరులకు నేమాత్రము, నధికారమే లేదని విరుద్ధముగా నన్వయించుకొని వ్యవహరింపఁజొచ్చిరి. ఇట్టివారిలోఁ బ్రథమ గణ్యుఁడు. కాకనూరి యప్పకవి. ఇతరులు గుడిలోని లింగమును మింగిన నితఁడు గుడినే మ్రింగెను. బ్రహ్మవిద్యా, వేదయజ్ఞ సంస్కృతభాషా ద్యత్తమాధికారములులేవని యితరులు శాసింపఁగా నితండు భాషాకావ్యములు వ్రాయుటకుఁ గూడ శూద్రుల కధికారములేదని "యుపమగల్గిన శయ్యలనొప్పియున్న నంఫ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబుగాదు" అని శాసించి వైచినాఁడు. ఉపమాద్యర్థాలంకార శబ్దాలంకారాది సమస్తగుణ సముపేతమై, రసవంతమై, యున్నను శూద్రుఁడు వ్రాసిన కావ్యము గ్రాహ్యముకానేకాదఁట. ఎందువలననో ? పురుటాలుదగ్గఅవలె నా కావ్యముకడ శూద్ర వాసనగొట్టును గాబోలు! బోయయైన వాల్మీకిచే వ్రాయఁబడి యాదికావ్యమై జగద్వందితమైయున్న రామాయణము నీతఁడు వీలుపడినచో ముక్కలుముక్కలు చేసి కక్ష తీర్చుకొనెడివాఁడు పాపము. తన యప్పకవీయమునఁ గవుల నుతించునుపుడు మహాకవియైన రామరాజభూషణుని, భట్టుమూర్తి యనెడి ద్వేషముచే స్తోత్రము చేయక పైగా రామరాజభూషణునిఁ బరాభవించిన యయ్యలరాజు రామభద్రునిఁ గొనియాడెద నని భట్టుమూర్తి పరాభవముతోఁ గలిసి రామభద్రుని నుతించెను. రామభద్రుఁడు, రామరాజభూషణునిఁ బరాభవించెనని యిట్టి యసూయాళువులు చెప్పిన యాకథలు మాత్రమెంతవఱకు సత్యమైయుండును. రామరాజభూషణుని కవిత్వములో నీ రామభద్రుని కవిత్వమును నప్పకవి కవిత్వమును నెన్నవవంతు ? భట్టుమూర్తి సింహము. ఇవిరెండును నక్కలు. భట్టుమూర్తికృతములైన వసుచరిత్రము, నరసభూపాలీయము, హరిశ్చంద్రనలోపాఖ్యాన మీ మూడుగ్రంథములును దెలుఁగునకు జీవములు. అప్పకవి కవిత్వమంతయు మూటగట్టినను భట్టుమూర్తి కావ్యము లందలి యొక పద్యముతో సమానముగాదు. పోనీ శూద్రునికావ్యము గ్రాహ్యముగాదని రామరాజభూషణుని దూషించివాఁ డంతటితో నూరకుండెనా ? తన కావ్యమునందలి లక్షణములకు భట్టుమూర్తి కావ్యములైన వసుచరిత్రాదులలోని పద్యములనెన్నిటినో లక్ష్యములుగా నుదాహరణములిచ్చెను. మరల నవియే యతనికిగతియాయెను. శూద్రుని కావ్యము గ్రాహ్యము కాదని తానే చెప్పి, తానే మరలగ్రహించిన, యిట్టి యల్పుల మాటలును బాటియగునా ?

సంస్కృతరామాయణముఁ జదువుటకు స్త్రీ శూద్రులకు నధికారములేదఁట. అందువలన రామాయణమును దెనుఁగునవ్రాయుచున్నాను. దీనిని స్త్రీ శూద్రులు పారాయణము చేసికొనవచ్చునని మఱియొకరు, వ్రాయుచున్నారు. శూద్రుఁడే వ్రాసిన యామహాకావ్యమును నితరులైన తామెల్లరు ననుభవించుచు శూద్రున కధికారము లేదని



బచ్చు రామదాసుగారు, బచ్చు అమ్మయ్యగారు (అన్నదమ్ములు) మోదుమూడి.

చెప్పవత్తు రిదియేమియన్యాయము ? రామాయణ బాలకాండమునc బ్రథమసర్గాంతమందు వాల్మీకి "పఠన్ ద్విజో వాగృషభత్వమీయాత్, స్యాత్ క్షత్రియో భూమిపతిత్వ మీయాత్, వణిగ్జనః పణ్యఫలత్వ మీయాత్, జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్." ఈ రామాయణమును జదివిన బ్రాహ్మణుcడు మంచి వక్తయగును, క్షత్రియుcడు చదివిన భూపతి యగును, గోమటి చదివిన వ్యాపార లాభము లొందును, శూద్రుcడు చదివిన మహత్త్వము నొందును" అని యిట్లు పైమువ్వురికంటె నధికఫలమైన మహత్త్వము నొందును" అని యిట్లు పైమువ్వురికంటె నధికఫలమైన మహత్త్వమును శూద్రుc డీ రామాయణమును జదివి పొందుననియు, శూద్రుcడు చదువవచ్చుననియుc జెప్పెను. "పట్టుకొన్నవాcడు పక్కెరయనcగా, నొద్దుననున్న వాcడు వాలుగ" యన్నట్లు, రామాయణకర్తయైన వాల్మీకి శూద్రులు చదువవచ్చునని సాక్షాత్తు చెప్పుచుండcగాc జదువcగూడదని నియమించుటకు వీరికెక్కడిది యధికారము ? రామాయణమునకు వ్యాఖ్యలు వ్రాసిన గోవిందరాజులును, మహేశ్వరతీర్థులును నీ శ్లోకమును వ్యాఖ్యానించుచు, శూద్రులకు వినుటకు మాత్రమే యధికారమున్నదని చెప్పవలసియుండcగా, "ఐఠన్" యని, చదువవచ్చునని ఋషియధికారమిచ్చెనే, యని, వగచి, యేమైనcగానిందు, 'శూద్రులకు మాత్రము వినుటకేగాని చదువుటకు మాత్ర మధికారము లేదు. ఎందువలనననcగా నితర శాస్త్రములయందు నిషేధింపcబడుటవలన' నని తేల్చివైచిరి. ఎక్కడిది వీరికింతయధికారము ? మూలకర్త యధికారమిచ్చుచుండcగా గాదనుటకు వీరెవరు ? ఇతరశాస్త్రములు నిషేధించినవని దీని కీ యర్థము చెప్పుచున్నారా ? రామాయణమున నిట్లధికారము నిరూపింపcబడెనని, దీనినిగొని, నిషేధశాస్త్రముల కేల యంగీకారార్థము చెప్పరాదో ? పోనీ వాల్మీకికిc గూడ శూద్రులకుc బఠనాధికారము లేకపోవుటయే యిష్టమైనచో 'శృణ్వంశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్" అని యనిన సరిపోయెడిదికదా. అట్లేల యనక పోయెను. ఈ మాత్రము వాల్మీకికిc దోcపలేదుకాcబోలు. బోయయైన తాను రామశబ్ద మహిమచే నంతవాcడనై యాదికావ్య కర్తనగుచుంటిని గదా యని శూద్రులను జెప్పcబోవుసరికిc దనవిషయము గుర్తునకు రాగా వాల్మీకి "జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయా"త్తను వాక్యము వైచెను.

స్వామి భద్రాచలమున రామాయణ పారాయణముc గావించుచు నొకనాcడు విలాసముగా మిత్రులైన యొక వైష్ణవ పండితునితో "నేమండీ మేము సంస్కృతరామాయణముc జదువcగూడదా ?" యని యడిగెనcట. అంత నాయన యాలోచించుకొనక గభాలునc "జదువcగూడనిమాట నిజమేనండీ" యనెను. అప్పుడు స్వామి, యీ రామాయణ శ్లోకమును ముందుcబెట్టి యేమిటీ యన్యాయమనcగా నా పండితుcడు వెలవెలవోయి పొరపడితిని క్షమించుడని స్వామి నర్థించెనcట. ఇట్లుందు నీ నిషేధములు.

అల్పులైన యసూయాళువులు తమ గ్రంథములయందు నిట్లు నిషేధించినది కాక యది ప్రమాణముగాఁ గైకొనరనుభయమున నార్షప్రణీతములైన కావ్యములందును దామే వ్రాసి జొనిపిరి. ఇట్లు చేయుటచే, స్వచ్ఛములైన ఋషిప్రోక్తములందును, బూర్వాపర విరోధము పొసఁగి కాలుష్యమేర్పడెను. చూచితిరా ! వీరి యసూయ యెంతపనిఁజేసెనో వీరివలన, మహర్షుల గ్రంథముల, ప్రామాణ్యమునకుఁ గూడ విచ్ఛిత్తి కలిగెను.

రామాయణోత్తరకాండమున శంబుక వధ యనునొక కథ గలదు. శూద్రుఁడైన శంబుకుఁడు తపస్సు చేయుటచేఁ గోసలదేశమున నొక బ్రాహ్మణబాలుఁడు మడిసెనఁట. ఆ బ్రాహ్మణుఁడు రామసన్నిధానమున కా బాలునిఁదెచ్చి యేడ్చుచుండఁగా నారదమహర్షి రామునితో నీ రాజ్యమునఁ దపస్సు చేయఁగూడని శూద్రు లెవరైనఁ దపముఁ గావించు చుండిరేమో, అందులన నిట్టి యకాలమరణము సంభవించెనని చెప్పెను. రామచంద్రస్వామి వా రప్పుడు పుష్పక విమానమెక్కి నిఖిలదిశలు తిరిగి దక్షిణదిశయందుఁ దలక్రిందుగాఁ దపమాచరించుచున్న యొక శూద్రుని గని యతనిఁజంపెను. అపుడు బ్రాహ్మణబాలకుఁడు బ్రతికెనఁట. ఈ కథ యెంత యసంగతముగా నున్నదో చూడుఁడు. శూద్రుఁడు తపస్సు చేయఁగా నొక బ్రాహ్మణబాలుఁడు చచ్చెనఁట. రాజ్యమున నధర్మపరిపాలనము వలనఁ గఱవు, యుద్ధములు, దేశక్షోభములు వచ్చునుగాని, యొక బ్రాహ్మణబాలుఁడు చచ్చుటేమిటి ? ఈ యకాలమరణమునకుఁ గారణమేమనఁగా, వర్ణాశ్రమవిరుద్ధ ధర్మాచరణములు పెక్కుండగా శూద్రుఁ డెచటనైనఁ దపస్సు చేయుచుండెనేమో యని, యీ హేతువునే చెప్పుటకు నారదమహర్షి కెట్లు తెలియును ? ఒకవేళ దివ్య జ్ఞానమునఁ దెలిసికొనెనందురా ? అట్లయిన శూద్రుఁడు తపస్సుచేయుచున్నాఁడేమో యని సందేహముగాఁ జెప్పవలసిన పనియేమున్నది ? పైగా రామచంద్రస్వామివారు వెదకవలసినంత యవసరమేముండును ? నారదులు దివ్యజ్ఞానమున "ఫలానా" చోట "ఫలానా" శూద్రుఁడు తపస్సుచేయుచున్నాఁడనియే చెప్పవచ్చును గదా. బోయయైన వాల్మీకి తపస్సు నాచరింపఁగా, మాదిగవాఁడైన మతంగుఁడు తపస్సు చేయఁగా నానందించిన రామచంద్రస్వామి శంబుకునిఁ దపస్సు చేయుచున్నాఁడని, నటికెనా ? మతంగాశ్రమమున రఘూద్వహుఁడు శబరినిఁ గుశలమడుగుచోట రామాయణమును జూడుఁడు. "తామువాచతతోరామః శ్రమణీం సంశ్రితవ్రతాం, కచ్చిత్తే నిర్జితా విఘ్నాః కచ్చిత్తే వర్ధతే తపః, కచ్చిత్తే నియతః క్రోధ ఆహారశ్చ తపోధనే." పిదప నిశితవ్రతములు గలిగి యోగినియైన శబరిని రాముఁడిట్లు ప్రశ్నించెను. తపోవిఘ్నకారులైన కామాదుల నిర్జించితివా ? నీ తపస్సు వృద్ధినొందుచున్నదా ? తపోధనురాలా ! ఆహారమును గ్రోధమును నియమనము చేసితివా ? యని యడిగెను. బోయెతయైన శబరినిఁ దపోధనురాలా నీ తపస్సు వృద్ధిఁబొందుచున్నదా యన యడిగెనుగదా రాఘవుఁడు. ఆమె తపస్సు

చేయుచున్నదనియా లేదనియా. తపస్సు చేయుట తప్పైనచో రామచంద్రస్వామి యీ కథానుసారముగా శబరినిఁగూడ నఱికివేయవలయును. ఏల నఱుకలేదు ? శబరిని నఱుకని రాఘవేశ్వరుఁడు శంబుకు నేల చంపెను. ఇది యెంతవిరుద్ధముగా నున్నది ? కేవల మీగాథ యసూయాళువులచే రామాయణమునఁ బ్రక్షిప్తము చేయఁబడినదని దాని, యనౌచిత్యా సంగతత్వములచేతనే స్పష్టమగుచున్నది. ఇట్టివాఁడే యొక శూద్రముని భారతానుశాసనిక పర్వములో నున్నాఁడు. అతఁడు తపస్సుచేయఁగా నెవరును నఱుకలేదు గాని, పితృకార్యమునఁ బశ్చిమశీర్షముగా దర్భాసనమును నతఁడు వేయఁగా నొక విప్రముని యిట్లుగాదు, తూర్పుతలగా దానిని వేయుమని చెప్పెనఁట. అంత నా శూద్రుఁ డొకచక్రవర్తియై పుట్టెను. తూర్పుతలగా దర్భాసనమును వేయుమని యుపదేశించిన విప్రముని యాయుపదేశ దోషమునఁ రాజపురోహితుఁడై పుట్టెనని యందుఁగలదు. ఇది యెంత యసంగతమైయున్నదో చూడుఁడు. దర్భాసనముఁ తూర్పుతలగా వైవుమని చెప్పుటయే యింతదోషమైనచో నిఁక శూద్రులు పరిచర్యచేయువారనిగదా వీరు చెప్పుచున్నారు. అట్టి పరిచర్యాసమయములలోఁ దెలియక యిట్టిపనులు శూద్రులెన్ని చేయరు. చేయునపు డింతమాత్రము చెప్పక యే బ్రాహ్మణుఁ డుండును.

బ్రహ్మసూత్రములయందు, నపశూద్రాధికరణమని యొక భాగమున్నది. ఛాందోగ్యోపనిషత్తులో రైక్వుఁడనెడి బ్రహ్మవేత్త జానశ్రుతి యనువానికి సంవర్గవిద్య నుపదేశించెను. ఆ యుపదేశ సమయమున, నా జానశ్రుతిని రైక్వుఁడు “అహ హారేత్వా శూద్ర తవైవ సహగోభిరస్తు = శూద్రుఁడా యీ కొనివచ్చిన గోవులను, రథములను నీవే యుంచుకొనుము. “అజహారే మాశూద్రానే నైవ ముఖే నాలాప యిష్యథాః.” శూద్రుఁడా యీ ధనమును నీ శక్త్యనుసారముగాఁ దెచ్చితివి. ఈ ద్రవ్యమువలన నీకుఁ బ్రహ్మవిద్య లభించునని యిట్లు రెండుచోటుల నతనిని శూద్రుఁడా యని సంబోధించెను. దీనిచే బ్రహ్మవిద్యాధికారము శూద్రులకును గలదని శంకగలుగగా, నట్లుగాదనియు, నచటిశూద్ర శబ్దమునకు దుఃఖవంతుడని యర్థమనియు, నీభాగము చెప్పుచున్నదని భాష్యకర్తలు వ్రాసిరి. శూద్రుఁడాయనుదానికి దుఃఖము గలవాఁడా, యను నర్థమునకుఁ గారణములుగాఁ బైసూత్రములైన క్షత్రియత్వగతేశ్చ = అనఁగా గుఱ్ఱములు రథములును గొనిపోవుటవలనను, దాత యగుటవలనను, సారథి యుండుటవలనను జానశ్రుతి క్షత్రియుఁడని యనుమానింపఁ బడుచున్నదఁట. ఉత్తరత్ర చైత్రరథేన లింగాత్ చైత్రరథుఁ డనెడి క్షత్రియునితోఁ గలిసి విద్యాభ్యాసము చేయుట వలనను, నను వీనిచే జానశ్రుతిక్షత్రియుఁడని నుడివిరి. “చత్వారో వర్ణాః బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రా” అని వైదికవాఙ్మయము నందును శూద్రశబ్దము నాలవజాతివానియందు రూఢమైయున్నది. దుఃఖమునకుఁ బెక్కు పర్యాయ శబ్దములుండఁగా

నిట శూద్రజాతి యందు రూఢమైన నీ శబ్దము నేల యాయర్థమున రైక్వుఁడు ప్రయోగించెను? రూఢార్థమును బాదించి, దుఃఖవంతుఁ డనెడి యౌగికార్థమిచట నిలుపఁబడుటకుఁ బైనిఁ జెప్పబడిన కారణములు చాలవు. దానములిచ్చినంత మాత్రమున, సారథియున్నంత మాత్రమున క్షత్రియుఁడగునా ? గుణసంపన్నుఁడై రాజైయున్న శూద్రుఁడు మాత్రము దానము లీయఁడా ? రథముండిన సారథియుండఁడా ? రెండవ కారణము క్షత్రియుఁడైన చైత్రరథునితో చదువుట. కలిసి చదివినంతమాత్రమున నిద్ద ఱొకే జాతివారగుదురా ? కలిసి సాందీపనికడఁ జదివిన కుచేల బలరామకృష్ణు లొకే జాతివారా ? స్నేహమే జాతివారికైనఁ గలియును. క్షత్రియుఁడైన రామునకు, వానరుఁడైన సుగ్రీవునకు, రాక్షసుఁడైన విభీషణునకు స్నేహము కలియలేదా ? ఈ యల్పకారణములా బలిష్ఠమైన శూద్రశబ్ద రూఢార్థమును బాధింపలేవు. మఱియు శూద్రున కధికారము "సామర్థ్యాభావాత్ = సామర్థ్యము లేకపోవుట వలన లేదని యతీశ్వరులు శ్రీభాష్యమున సాయించిరి. సమర్థత యుండిన నధికారమున్నదని వారి యభిప్రాయమన్నమాట. "విదురాదయస్తు భవాన్త రాధిగతజ్ఞానా ప్రమోషాత్ జ్ఞానవంతః ప్రారబ్ధకర్మవశాచ్చేదృశ జన్మయోగిన ఇతి తేషాం బ్రహ్మనిష్ఠత్వమ్ = విదురాదులు మాత్రము జన్మాంతరమునఁ బొందఁబడిన జ్ఞానము పోకుండుటవలన బ్రహ్మవిద్య కర్హులైరి. ప్రారబ్ధ కర్మవశమున వారిట్లు శూద్రులైపుట్టిరి. (శ్రీభాష్యము) ఈ వాక్యములవలనఁ దేలినదేమిటి? యోగ్యులగు వారు ప్రారబ్ధమున శూద్రులైనను బ్రహ్మవిద్యాధికారముండునని గదా. ప్రారబ్ధముచేఁగాక యెవఁడైనను నిఁక నెట్లు జన్మించును ? యోగ్యుఁడు కాకపోయిన బ్రాహ్మణునకును నర్హతలేదు. యోగ్యుఁడుకానిచో శూద్రునకును లేదు. యోగ్యుడైనచో బ్రాహ్మణునకును గలదు, శూద్రునకును గలదు. కావున గుణమే ప్రధానమని తేలినది.

"స్త్రియ శ్శూద్రాదయశ్చైవ బోధయే యుర్హితాహితమ్. యథార్హే మాననీయాశ్చ నార్హం త్యాచార్యతాం క్వచిత్" స్త్రీ శూద్రాదులు తెలిసినంతవట్టు బోధింపవచ్చును, వారినా సమయములందుఁ బూజింపనువచ్చును. గాని యాచార్యతకు మాత్ర మర్హులెప్పుడును గారు" అని యాశ్లోకము ఖండితముగా శూద్రులకును, స్త్రీలకును నాచార్యతను నిషేధించినది గదా, యందురేమో. ఈ శ్లోక మెచటిది ? భరద్వాజ సంహిత లోనిది. దీనితరువాత శ్లోకమును జూడుఁడు 'కిమప్యత్రాభిజాయంతే యోగిన స్సర్వయోనిషు, ప్రత్యక్షి తాత్మనాథానాం నైషాం చింత్యం కులాదికమ్' పరమ యోగులగువా రే కారణముననో నన్నిజాతులలోను జన్మించుచుందురు. అట్టి భగవత్సాక్షాత్కారముగల మహాత్ముల కులగోత్రాదికములు విచారింపఁ గూడదు. అని వెంటనే ప్రభావసంపన్నులైన మహాత్ముల కనుజ్ఞ యిచ్చెను. మొత్తముమీఁద నీవ్యాసమునఁ దేలిన సారాంశమేమనఁగా యోగ్యులైన శూద్రులకును సర్వాధికారములున్నవి. యోగ్యులైన బ్రాహ్మణులకును సర్వాధికారము లున్నవి. యోగ్యులు కాని శూద్రులకు నేయధికారము లేదు. యోగ్యులుకాని బ్రాహ్మణులకు నే యధికారము

లేదు. అని, శాస్త్రములు విధినిషేధములు ప్రవర్తించినవి. మహిమయు శక్తియుఁ బ్రధానములుగాని జాతిగాదు. మఱి శూద్రుల విషయమున నెంతమంచిగుణవృత్తములుండినను నర్హతలేదను నిషేధ మొక్కటి యెక్కువ. ఇది సత్యముగాదు. సత్యమైనచో గుణమే ప్రధానమని శూద్రులకును నధికారమిచ్చి యున్న శాస్త్రముల కర్థము లేకపోవును. ఈ నిషేధములు కేవల మసూయాగ్రస్తులైన యప్పకవి వంటివారిచే వ్రాయఁబడిన వగుటచేఁ బాటింపఁబనిలేదు. శూద్రుఁడు వేదము వినిన సీసముగానీ లక్కగానీ కరగించి చెవులయందుఁ బోయవలయునఁట. వేదము చదివిన నాలుకఁ గోయవలయునఁట" ఏమిటీ వ్రాతలు. యసూయగాక యిదియేమిటీ ? ఇంతటితో నూరకొనక యీ మహాత్ములు "దీర్ఘశృంగ మనడ్వాహ మున్మత్త గజయూధపమ్ శూద్రమక్షర సంయుక్తం దూరతః పరివర్జయేత్" = కొమ్ములుగల వృషభమును, మదించిన గజరాజును, బండితుఁడైన శూద్రుని దూరముగా వదలవలయు"నని, యెవరైన నిదియేమి యని యెదురుదిరుగుదురేమో, యని యిట్లు సరిపెట్టుకొనిరి.

మఱియ భగవద్భక్తులైనవారి జాతిని, నిరూపించుట 'భాగవతాపచారన్నా ననేకవిధమ్. = భాగవతాపచార మనేకవిధములుగానున్నది." 'అతిలే యొన్ఱు అవర్కళ్ పక్కల్ జన్మనిరూపణమ్ = అందులో వారిజన్మను నిరూపించుట యొకటి" యనియిట్లు ఘోరపాపముగాఁ బిళ్ళ లోకాచార్యులువారు తమ శ్రీవచనభూషణమున విపులముగాఁ దెలిపి యున్నారు. కావున గుణవృత్తములే ప్రధానములుగాని, జాతి ప్రధానమెన్నఁడునుగాదు. ఆచార్యత్వమునకు భక్తిజ్ఞానవైరాగ్య సామర్థ్యములే యర్హతను నిరూపించునుగాని, కులముగాదు. "మద్భక్తం శ్వపచంవాపి. నిందాం కుర్వంతి యే నరాః పద్మకోటిశతేనాపి నక్షమామి వసుంధరే = భూదేవీ! నా భక్తుఁడు చండాలుఁడైనను వానిని నిందించునరులను బద్మకోటి శతవర్షములైనను క్షమింపను" అని భగవంతుఁడు భూదేవితో వరాహపురాణమున వచించెను. "శ్వపచోపి మహీపాల విష్ణుభక్తో ద్విజాధికః విష్ణుభక్తి విహీనస్తు యతిశ్చ శ్వపచాధమః. = రాజా విష్ణుభక్తుఁడు శ్వపచుఁడైనను బ్రాహ్మణుని కంటెను నధికుఁడగును. విష్ణుభక్తి లేని వాఁడు యతియైనను శ్వపచునికంటెను, నధముఁ"డని శ్రీ భాగవతమునఁ గలదు. 'యఃపశ్యతి శుభాచారం వైష్ణవం వీతకల్మషమ్, యస్మిన్ కస్మిన్ కులే జాతం దండవత్ ప్రణమేద్భువి = శుభాచారుఁడై కల్మష రహితుఁడైన విష్ణుభక్తుఁ డేకులమునందు జన్మించిన వాఁడైనను వానిని జూడఁగనే దండవత్ప్రణామముఁ జేయవలయును. (లింగపురాణము). కావున నట్లు గుణవృత్తములను గైకొనక జాతిని నిరూపించువారు పై శాస్త్ర నియమముల ప్రకారము భగవన్నిగ్రహమునకుఁ బూర్తిగాఁ బాత్రులగుదురు. గ్రంధవిస్తరభీతిచే నిఁక నీవ్యాసమును ముగించి ప్రకృతమనుసరించెదను.

నమో ధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే.

భాగవతుల రాక

భగవంతుఁడు తానే స్వప్నమున నుపదేశింపుమని స్వామికిని, స్వామివలన మంత్రోపదేశమును గొనుమని తచ్ఛిష్యులకును జెప్పెను గదా! ఇట్లు భగవద్దత్తమై వచ్చినవారి యాచార్యత్వమును దూలనాడుట కెవరికధికారమున్నది ? వివిధ ప్రాంతములనుండి తండోపతండములుగా జనులువచ్చి వేంకటదాసస్వామివలన మంత్రోపదేశము నొంది వారి నాశ్రయింపఁజొచ్చిరి. ప్రతిదినమును స్వామియింట భాగవతుల సంతర్పణము పుష్కలముగా జరుగుచుండెను. దైవమిచ్చిన యాస్తి కలదు. స్వామికెంతధనవ్యయమైనను లెక్కలేదు. భగవత్సేవచేయువారు దొరకినఁజాలును చావలి, మోదుమూడి, యశ్వరావుపాళెము, బందలాచెఱువు, వేకనూరు, నాగాయలంక, పక్కపట్లవారిపాళెము, షోడవరము, కమ్మనప్రోలు, కోడూరు, లింగారెడ్డిపాళెము, నక్కవానిత్రోవ, బడేవారిపాలెము, దుగ్గిరాల, ఆవలవారిపాలెము, మీసాలవారి పాలెము, నగరము, బలుసులపాలెము, వరికూటివారి పాలెము, చుండూరు, వెల్లలూరు, మొదలగు పలుగ్రామములలో స్వామి ప్రజ్వలింపఁజేసిన జ్ఞానజ్యోతి వెలుఁగఁజొచ్చెను. నిరంతరమును శిష్యులున్న గ్రామములకేగియో, లేక వారు పూడివాడకు వచ్చునట్లు చేసియో, స్వామి భగవన్మహిమామృతమును దన దివ్యవాక్కున వెదఁజల్లుట భక్తిప్రచారమును రేఁబవ లత్యంతవిపులముగాఁ గావించెను. దేవాలయ మండపుదున్న యర్చకుఁ డొకరోజున స్వామి కడకువచ్చి, "బాబూ! నేనీయూరువచ్చి సంవత్సర మగుచున్నది. ఈ సంవత్సరమునకుఁగాను భాగవతులు మీ యింటికడలేని దిన మీవేళఁదప్ప నెన్నడును జూడలేదుగదా" యనుచుండెను. ఇంతలో నలుగురు భక్తు లేయూరినుండియో రానేవచ్చిరి. "ఓహో యీవేళనుగూడఁ బూర్తియైరి పొ"మ్మని యా యర్చకుఁడు నవ్వుచు వెడలిపోయెను. భగవద్భాగవతాచార కైంకర్యములు సంపూర్ణముగా నిర్వహించిన దివ్యయోగి వేంకటదాసస్వామి. యా జాతక మన్యులకు రాదు. ఇట్లు భక్తసంఘము మిక్కుటముగాఁ బెరిగిపోయెను. ఆ భక్త సంఘమునకు స్వామి భాష్యకారసమాజమని నామధేయ మిడిరి.


భద్రశైలగమనము

రామాయణ పారాయణ మొనరించు సమయమున జన్మించిన బాలకునకు దాశరథి యని నామకరణము గావించిరిగదా. యబ్బాలకుని పుట్టువెండ్రుకలు మూడవసంవత్సరమున భద్రాచల రామసాన్నిధ్యముననే తీయుటకు స్వామి తలంచిరి. అందుచే మరల భద్రాచలమునకుఁ బ్రయాణలగ్నము నిశ్చయము చేసెను. ఈమాఱు శిష్యులు పెక్కుమంది స్వామివెంట నరిగి భద్రశైలవాసుని దర్శింప నభిలషించిరి. ఒక వందమంది శిష్యులతోడను,

కుటుంబముతోఁడను. నిట్లొక శుభముహూర్తమున స్వామి బయలుదేఱెను. బెజవాడ రైలుస్టేషనులో భద్రాచలమునకుఁ బోయెడి బండిలోనికి, జనసమ్మర్దము వలన రాధమ్మ గారు చంకనున్న పిల్లవానితోఁ ద్వరగా నెక్కలేక బాధపడుచుండెను. అట్టి సమ్మర్దములో నా బాలకుని కంఠముననున్న బంగారుకంటె నొక చెడిపెయైన వనిత మెల్లగా నోటితోఁబట్టి లాగుకొనుచుండెను. ఈ సంగతి రాధమ్మగారు తెలిసికొననేలేదు. బండిలోనివారెవరో చూచి కేకలు వైచిరి. వెంటనే యాస్త్రీనిఁ బట్టు కొనిరి. "పదండి, లాగండి బడవాముండను స్టేషనులో నప్పగించుడ"మని తలయొక విధముగా మాటలాడుచుండిరి. అట్టితఱి నీ గందరగోళమేమి యని స్వామివచ్చి, విషయమును దెలిసికొని "ఏమియుఁ జేయవలదు. విడిచిపెట్టుఁడు ప్రభుత్వమున కప్పఁజెప్పినయెడల నీ దరిద్రపుముండ మూలమున రామదర్శన ప్రాప్తియు, భంగమై మనముకూడ నిచటనే పడియుండవలసివచ్చు"ననిరి. అంత నా వనితను గక్షపట్టలేక దలయొక గ్రుద్దువైచి విడిచిరి. అదియు దానిత్రోవనదివోయెను. కతిపయప్రయాణంబుల మహోత్సవముతో భగవద్గుణానుభవగోష్ఠులతో స్వామి భద్రాచలముఁ జేరెను. అచటఁ దన పరివారముతో భద్రశైలవాసుని దర్శించి బాలకుని మ్రొక్కుదీర్చి, తాము తొల్లి పురాణ కాలక్షేపము చేసినచోటును, బారాయణము గావించినచోటును నెల్లరకుఁ జూపిరి. స్వామి శిష్యులైన భద్రాచలవాసులును, సీతమ్మగారును స్వామి రాక కెంతయు నానందించిరి. పిదప సీతాపహరణస్థానంబైన పర్ణశాలకుఁ జని యచట భగవద్దర్శనంబుఁ గావించి తిరిగి భద్రశిఖరికి వచ్చి గొన్నదినంబులుండి మరలి శిష్యసమేతంబుగా స్వామి యిలుచేరెను.

యతీశ్వర జయంతి

సామాజికుల భక్తి యభివృద్ధి నొందవలయునన్న నెల్లరు సంవత్సరమున కొక్కపరియైన నొక సమ్మేళనమై భగవద్గుణానుభవము చేయవలయును. అట్లు చేయుటవలన నా భక్తి బీజము చక్కగా వికసించి యభివృద్ధినిఁ బడయును. లేనియెడల నిరంతరసంసార మగ్నులై యుండు మనుజుల మనంబులకు మాలిన్యమే చుట్టుకొని భక్త్యంకురము గ్రమక్రమముగా నీరసించి, నశించి పోవును. కావున నిదియంతయు నాలోచించి స్వామి ప్రతిసంవత్సరము చిత్రినెలలో వచ్చు భగవద్రామానుజుల జన్మనక్షత్రమగు నార్ద్ర మొదలుకొని యైదుదినంబులు "యతీశ్వర జయంతి" యనుపేర సమాజసమ్మేళనము గావింపఁదలంచెను. ప్రజోత్పత్తినామ సంవత్సరమున మునుముందుగా నీ యుత్సవమును బూడివాడలోనే ప్రారంభించిరి. ఈ యైదురోజులు భోజనవ్యయమునకు గాను సమాజసభ్యులనుండి తగినట్లుగా ముందుఁ జందాలు వసూలు చేయించిరి. ఉత్సవసంభారములన్నియుఁ బూడివాడలో సమకూర్పఁబడెను. అంతఁ బెక్కు గ్రామములనుండి సమాజసభ్యు లా యతీశ్వర



బచ్చు కృష్ణదాసుగారు, రత్నమ్మ గారు (సతీపతులు) మోదుమూడి.

జయంతియందుఁ బాల్గొనిరి. ఉత్సవము మహావైభవముగాఁ బ్రారంభింపబడెను. ప్రభాతమున లేచి కాల్యములైన క్రియలు ముగించి స్నానమైన పిదప నిత్యానుష్ఠానములు ముగించి యెనిమిది గంటలగుసరికి గోష్ఠీమంటపమునకు సభ్యులెల్లరు రావలయును. అచట శ్రీస్వామి తమ యమృత దివ్యవాక్కుతోఁ బదునొకండుగంటలవఱకును, భగవద్గుణవైభవము నుపన్యసింతురు. పిదప నందఱును గలిసి యొక్కచోటనే యేర్పఱుపఁ బడియున్న పాకశాలలో భోజనములాచరించుట, మరల సాయంత్రము మూడుగంటలనుండి యాఱుగంటలవఱకు స్వామి యుపన్యాసము జరుగును. పిదప రాత్రి భోజనానంతరము, భాగవతులందఱును గలసి పండ్రెండు గంటలదనుక భగవన్నామ భజనము గావించి పరుండుదురు. మరలఁ దెల్లవాఱుజామున నాలుగుగంటలకులేచి యెల్లరును భగవద్విషయికమైన ప్రభాతసేవఁ (మేలుకొలుపులుపాడుట) దెల్లవాఱువఱకును గావింతురు. ఐదవరోజున వసంతోత్సవమైన పిదప మధ్యాహ్నము నుండి స్వామి భాగవతులు సంవత్సరము పొడవునను దమయిండ్ల దగ్గఱ భగవన్మంత్రజపముచేసి వ్రాసికొనివచ్చిన లెక్కను బరీక్షింతురు. ఆ జపము సరిగాఁజేయని వారినిఁ గోపించి, యిఁక సరిగాఁజేసెదమని ప్రమాణముఁజేయించుటయు, బాగుగాఁ జేసినవారి నానందించుటకు జరుగుచుండెడిది. స్వామి కోపమెంతవారికిని మహా భయోత్పాతము గలిగించెడిది. అందువలన నైదవరోజు వచ్చుసరికి సామాజికుల హృదయము లెల్ల వడఁకిపోవుచుండును. యతీశ్వర జయంతి యందలి వారి కార్యక్రమమిది. పూడివాడలో నా యుత్సవము మహావైభవముగా జరిగిపోయెను. పరిసర గ్రామములనుండి జనమత్యంత ముగా వచ్చి యుత్సవ శోభను దర్శించిపోవుచుండిరి. ఐదవదినమునఁ బ్రభాతముననే వసంతోత్సవ మారంభింపఁబడెను. స్వామియు, సామాజికులును, గలిసి "మ్రానుదిగరా, మాచీర లియరా" మొదలగు కీర్తనలతోఁ గృష్ణలీలలు భక్తిరసాప్లావమగునట్లు కొంతవడి యుత్సవమంటపముననే పాడి, పిదప నూరివెంట భగవన్నామముఁ, గావించుచుఁ జిన్న చిన్న పాత్రల గైకొని వసంతములాడుచు బయలుదేఱిరి. ఊరియందుఁ బ్రతియింటను వసంతోదకము సిద్ధముఁగావించిరి. ఇట్లు పండ్రెండుగంటలవఱకు నూరివెంట మహత్తర వైభవముగా వసంతోత్సవము జరిపి ముగించిరి. నాఁటి తెల్లవాఱుజామున.

ఐదురోజులు విన్న యమృతవాక్యంబులఁ
　　　బ్రబలిన వైర్యాగభరముతోడ
హరి పాదసేవా నిరంతరప్రాప్తి చేఁ
　　　దఱిగిన మోహబంధములతోడ
మాటిమాటికిఁ దమ మానసంబులయందు
　　　స్ఫురితమౌ నుత్సవశోభతోడ

స్వామిని విడనాడి చనుటచే నధికమై
కలుగు వియోగదుఃఖంబుతోడఁ
గడఁగి పుణ్యాంతమందు స్వర్గంబునుండి
పుడమిఁజేరెడి జీవులపోల్కి బొదలు
నెవ్వగలతోడఁ దమతమ నెలవులకును
భాగవతబృందమంతయు బయలవెడలె.

పురాణ కాలక్షేపము

ఆ సంవత్సరంబున యతీశ్వరజయంతి జరిగినపిదప భక్తులెల్లరును నీ యైదురోజులు భగవదానంద మనుభవించుటకుఁ జాలలేదు. ఇంకను దీర్ఘకాలమట్టి వైభవమును ననుభవించినఁగాని తృప్తిగా నుండదని తమ యభిప్రాయమును దెల్పిరి. అంత స్వామి వరినాటులు ముగిసినపిదప భాద్రపదంబునుండి కార్తీకపూర్ణిమవఱకును భాగవతులతోఁ బురాణకాలక్షేపముఁ గావించుటకు నిశ్చయించి, వివిధగ్రామములయందున్న భక్తులకుఁ దెలియఁజేసెను. సామాజికులకుఁ గావలసిన వంటచెఱకు మున్నగునవి సిద్ధము చేయించెను. పురాణప్రారంభమునకు భక్తులెల్లరుఁ దమకీరెండు మాసములకుఁ గావలసిన వస్తు సంభారముతోఁ దండోపతండములుగా దిగిరి. ఉదయమున సహస్రనామపూజఁ గావించి పురాణము ప్రారంభింపఁబడెను. ప్రతిదినమును, నుదయము నిత్యానుష్ఠానములైన పిదపఁ దిరుమంత్రార్థము, తత్త్వత్రయము, భగవద్గీత, గురుపరంపరాప్రభావము మొదలైన సాంప్రదాయక గ్రంథములతో స్వామి కాలక్షేపముఁ గావింతురు. మధ్యాహ్నమునుండి శ్రీమద్రామాయణమును, సమర్థులైన శిష్యు లెవ్వరైన నొకరు చదువుచుండఁగాఁ బురాణముఁ జెప్పుదురు. అప్పటికిఁ గుమారు లెవరును, విద్యావిషయముగా నెక్కి రాలేదు. పిదపఁబిదపఁ గుమారులు పండితులై యెక్కివచ్చిన తరువాతఁ, గుమారులే చదువవలయును. వారే చెప్పవలయును. ఇతరులు చదివిన, ముందు వినువారొప్పుకొనెడివారుకారు. పండితులై యర్థయుక్తముగా మనోహరముగాఁ గుమారులు చదువుచుండఁగాఁ జెప్పుట కలవాటు పడిన స్వామియుఁ దరువాత నితరులు చదివినఁ జిరాకుపడి సహింపలేక పోయెడివారు. చదువునప్పుడెచ్చుటను, నపస్వరముగానీ, యపశబ్దముగానీ రాఁగూడదు. అట్లువచ్చిన వారికి మహాకోపము. కుమారుల నైననుసహించెడివారుకారు. సభలోనే యప్పుడే కోపగించెడివారు. స్వామి పురాణశైలి యత్యద్భుతమైన క్రొత్తరకము. ఏ రసమువచ్చినపుడది మహాప్రవాహమై ప్రవహించెడిది. వారి పురాణమున కెప్పుడును రెండుమూడువందలజనమునకుఁ దక్కువయుండువారు కారు. ఆ గోష్ఠీ శోభయు నా విలాసమును. భక్తిపాటవమును మఱియొకచోఁ జూడఁబోము.

పూడివాడయందు రామాయణపురాణ మతిమనోహరముగా సాగిపోయెను. పరగ్రామములనుండి వచ్చిన హరిదాసులూరియందు బసలేర్పాటుచేసికొని కాలక్షేపముల యందుఁ బాల్గొనుచుండిరి. ఊరిలోని స్త్రీపురుషాదులును బ్రతిరోజు రామాయణకాలక్షేపమును మహానందముతో వినుచుండిరి. ఇట్లు పూర్వరామాయణమంతయుఁ గార్తికపూర్ణిమవఱకును జెప్పి రామచంద్రస్వామి పట్టాభిషేకముతో రామాయణమును ముగించెను. రెండుమాసములు రామాయణ కాలక్షేపముతో వేదాంతగోష్ఠులతో భజనలతోఁ, బ్రాతఃప్రబోధ సేవలతో భక్తకోటి సంతృప్తిగా భగవదానంద మితరప్రపంచము నెఱుంగక యనుభవించిరి. స్వామి తమ ముప్పది యెనిమిదవయేఁట నిట్లు యతీశ్వరజయంతియుఁ బురాణకాలక్షేపములును బ్రతిసంవత్సరమును సామాజికులున్న యూళ్ళలో నొక్కొక్కయూరఁ గావించుటకుఁ బ్రారంభించిరి.

భగవద్గీత

పూడివాడకు సమీపములోనున్న యారేపల్లియను నగ్రహారమునఁ జినరామయ్య గారను నొక యకల్మషరామభక్తుఁడు, బ్రాహ్మణుఁడుండెడివాఁడు. మూడుకోట్ల రామనామము వ్రాసిన మహానుభావుఁ డాయన, స్వామి యనిననా చినరామయ్యగారికిని జినరామయ్య గారనిన స్వామికిని మహాప్రేమ. అకలుషమహాభక్తులగుటచే వారిద్దఱికి నట్లతికినది. స్వామియందుఁ బాండితి, ప్రతిభ సమర్థత మున్నగునవి యెక్కువ. చినరామయ్యగారు వారికివారు కడతేరిన ధన్యమూర్తి. ఆయన జీవించియుండఁగా స్వామి తఱచుగా వారియింటికి వెళ్లుచుండెడివారు. వెళ్ళి యేవేవో మూలవిషయములైన భగవద్గాథల చెప్పఁగా నాయన మహార్తితో విని యానందపడుచుండెడివారు. వెళ్ళినపుడెల్ల ముఖ్యముగా విభీషణ శరణాగతినిఁ జెప్పుమని స్వామిని గోరెడివాఁడాయన. ఇద్దఱుగలిసి భగవత్కథాగోష్ఠికారంభించిన నిఁక వారికి లోకము, కాలము, దేహము, తెలిసెడిదికాదు. ఎప్పటికో లేచిపోయెడివారు. ఒకదినమున నిద్దఱుశిష్యులను వెంటఁబెట్టుకొని స్వామి చెఱకుపల్లెకుఁ బోయివచ్చుచుఁ ద్రోవలోనున్న చినరామయ్యగారియింటికిఁ జనిరి. స్వామినిఁ జూడఁగనే యాయనయు నానందపడి వ్రాయుచున్న రామకోటినాపెను. ఎవరెవరో పదిపదునైదుగు రచటఁజేరిరి. స్వామి యేదో భగవద్విషయమెత్తుకొని చెప్పుచుండెను. ఆనందముతో వారును వినుచుండిరి. ఇట్టిసమయములో అసూయాళువులయం దగ్రేసరుఁడగు ఒకబ్రాహ్మణుఁ డచటికి వచ్చి కూర్చుండి, భగవత్కథఁ జెప్పు స్వామి కడ్డువచ్చి "యేమండీ! మీరు భగవద్గీత చదువు చున్నారా ?" యని యడిగెను. స్వామియు బ్రాహ్మణుఁడు సదుద్దేశముతో నడుగుచున్నాఁడని యభిప్రాయపడి "అవునండీ! చదువుచున్నాను. భగవద్గీత పదునెనిమిది యధ్యాయములు

నోటికిఁ గూడ వచ్చు"ననెను. అంత నా విప్రుఁడు "శూద్రుఁడు భగవద్గీతను జదువ వచ్చునా ? శూద్రుఁడు చదువవచ్చునా ?" యనెను. "ఓరి గాడిదకొడకా! యెంతమా టంటివిరా ?" యని స్వామి శిష్యులిద్దఱును లేచిరి. చినరామయ్యగారును స్వామి నీ మాట నతఁడడిగి నందులకుఁ జిన్నపోయి యేదో సరిచేసి చెప్పవచ్చుచుండెను. అంత స్వామి వారి నందఱినాపి. యెాహెూ నీ యుద్దేశము వేఱుగా నున్నదా యనుకొని తగుసమాధానమిచ్చెను. ఈ క్రిందిరీతిగా వారికి సంభాషణము జరిగెను.

స్వామి : ఏమండీ! మేము భగవద్గీతను జదువఁగూడదా ?

బ్రాహ్మణుఁడు : చదువఁగూడదు.

స్వామి : ఎందువలన ?

బ్రాహ్మణుఁడు : శూద్రులకు భగవద్గీతను జదువు నధికారము లేదుగనుక.

స్వామి : భగవద్గీత నసలులోకమునఁ బ్రకటించిన దెవరో మీకుఁ దెలియునా ?

బ్రాహ్మణుఁడు : నాకుఁ దెలియదు, మీరే చెప్పుడు.

స్వామి : శ్రీకృష్ణస్వామి, యర్జునునకుఁ జెప్పెనని ధృతరాష్ట్రునకు సంజయుఁడు చెప్పెను.

బ్రాహ్మణుఁడు : సంజయుఁడు శూద్రుఁడా ?

స్వామి : సంజయుఁడు శూద్రుఁడైనది, మఱియెవరైనదియు మీకుఁ దెలియదు. భారతమెట్టిదో మీరెఱుఁగరు. భగవద్గీత యన నేదియో మీరెప్పుడును జూడలేదు. అట్టిమీరు నన్ను భగవద్గీతఁ జదువఁగూడదని శాసింప వచ్చుచుంటిరి. మీ తెలివికి నేనేమని సంతసింతును!

అంతటితో బ్రాహ్మణుని పనియైపోయెను. పై నడుగుట కేమియుఁ దోఁచలేదు. అంతట మరల నిట్లు ప్రశ్నించెను.

బ్రాహ్మణుఁడు : మఱి యీ బడేవారిపాలెము వారందఱును మీ శిష్యులు గాఁబోలు.

స్వామి : అవును. నిజమే. దానివలన మీకేమిటి ?

బ్రాహ్మణుఁడు : వారందఱు మా భూముల మగతాధాన్యము లీయక యెగవేయవచ్చునా? ఈ ప్రశ్నలకు స్వామికి నవ్వువచ్చెను. వచ్చి యిట్లనెను.

స్వామి : ఓహెూ! యిదియా మీకదుపుబ్బు. నిజమే యెగవేసిన దోషమేమిటి ?

బ్రాహ్మణుఁడు : పాపము లేదా ?

స్వామి : మీ మగతాధాన్యము నెగవేసినఁ బాపమనియుఁ బరద్రవ్యము నపహరింపఁ గూడదనియు, నెట్లు మనుజునికిఁ దెలియును ? చదివినఁగదా పాపపుణ్యములు తెలియును ? "చదువనివాఁడజ్ఞుండగు"

నని శాస్త్రములు చెప్పుచున్నవికదా! నన్ను మీరిప్పుడు భగవద్గీతను జదువఁగూడదని శాసించుచుంటిరి. అట్లే మీ పెద్దవారెల్ల మా పెద్దలను జదువఁ గూడదనియుఁ జదివిన మీరు చచ్చిపోవుదురనియు శాసించిరి. అందువలనవారు భయపడి చదువనులేదు. సంతానమును జదివింపనులేదు. చదువక మూఢులైన కారణమునఁ బాపపుణ్యములు తెలియక యందినవఱకుఁ దినుటయే ప్రధానమనుకొని మీ సొమ్ము నెగవేయుచుండిరి. వాండ్రును జదువుకొని యున్న మీసొమ్ము నపహరించుట దోషమని యెఱిఁగి యాపనిచేయక యిచ్చెడివారు. కాని వాండ్రు చదువకయుండుటకు మీ శాసనమేగదా కారణము ? మీరు చేసికొన్నది మీకంఠమునకే యురిత్రాఁడాయెను. దానికిఁ గారణభూతులు.

పాపము బ్రాహ్మణున కన్నిత్రోవలు పూడిపోయెను. సమాధానముఁ జెప్పుట కేమియుఁదోఁచవలేదు. నలుగురిలో నవ్వుబాటాయెను. ఇఁక నచట నిలువలేకపోయెను. అపు డింకను వానకురియుచునే యుండెను. ఆ వానలోనే పైపంచ తలమీఁదవేసికొని లేచిపోవు చుండెను. స్వామి వెంటనున్న శిష్యులు “పోయెదవేమయ్యా ? యడిగితివి గదా. సమాధానము చెప్పకయే పోవుచుంటివే.” మని కేకలువైచిరి. అదేపనిగాఁ దలవంచుకొని బ్రాహ్మణుఁడు వెనుకకుఁగూడ దిరిగి చూడక లేచిపోయెను.

చావలి పురాణకాలక్షేపము

శ్రీముఖనామ వత్సరంబున వేసఁగిలో యతీశ్వరజయంతియు, వర్షాకాలమునఁ బురాణకాలక్షేపమును, దెనాలి తాలూకాలోని చావలిగ్రామమున జరిగెను. భాద్రపద మాసమున మామూలుగా స్వామి పురాణము చెప్పుటకు శ్రీమద్రామాయణమునే యారంభించెను. వాల్మీకి ప్రోక్తమైన సంస్కృతరామాయణమైనను లేక యాంధ్ర, రామాయణములైనను, నుభయభాషలయందు నద్వితీయ పాండిత్యముగల స్వామికిఁ జెప్పుట కొక్కటియే. కానిశ్రోతలు సంస్కృత రామాయణముఁ జెప్పుట కొప్పుకొనెడివారుకారు. తెలుఁగు వారికిఁ దెలుఁగు రామాయణములైనచోఁ జదువునప్పుడే కొంతతెలిసి నట్లుండి యానంద మిచ్చును. అందువలన స్వామి శ్రోతల యభిలాష చొప్పునఁ దఱచుగా నాంధ్రానువాద రామాయణములలో సుందరమైన గోపీనాధమువారి రామాయణమునే పురాణము చెప్పెడివారు. భారతమైనచోఁ గవిత్రయకృతభారతమే వారు గ్రహించెడివారు. పురాణ ప్రారంభదినమునకే వివిధగ్రామీణులగు సామాజికులు కావలసి వస్తు సామగ్రితోఁ జావలికి వచ్చి బసల నేర్పాటు చేసికొని కాలక్షేపానందము ననుభవించుచుండిరి. చావలి పెద్దగ్రామము.

కాకపుణ్యకార్యములన్ను సత్యంతోత్సాహముగల యూరది. సాయంత్రము కాలక్షేపమునకు షుమారేడినిమిదివందల జనముతోఁ బురాణమందిరము క్రిక్కిరిసి పోవుచుండెను. స్వామి పురాణశైలియుఁ బాండితియు బ్రహ్మతేజమును జాపల నుబ్బిటలాచివైచెను. ఎక్కడ నే వీధిలోఁ జూచినను బదిమంది కూడి, యానాడు పురాణమునవచ్చిన చిత్రగాధలనే తలపోసికొను చుండిరి. రాత్రిపూట స్వామి బజారువెంట వెళ్లుచుండఁగా, వారుచెప్పుకొనెడి మాటలు చక్కగా వినిపించుచుండెడివఁట. ఉదయమమున నూరి బయటనున్న బావికడకుఁ బోయి స్నానముచేసి శిష్యులతో వచ్చుచున్న స్వామిని జనులు విభ్రాంతిగాఁ జూచెడివారు. నాయకమణివలె ముందుస్వామియు, వెనుక రెండు పర్లాంగుల మేరవఱకు హరిదాసుల వరుసయు, గనులపాపములుహోవుచుండెను. "తేహినో దివసా గతాః" ఆ రోజుల గడచిపోయినవి గదా! మరలనట్టి ఘట్టములనిఁకఁజూడలేము. ఉదయము వేదాంత కాలక్షేపములతో; సాయంత్రము పురాణములతో; రాత్రి, సందెవేళను, దెల్లవాఱుజామునను, భజనలతో, మేలుకొలపులతోఁ; బురాణకాలక్షేపమసంఖ్యాకులైన భాగవతులతో మహావైభవముగా సాగిపోవుచుండెను.

అట్టితతి నొక్కదినమున నెక్కడినుండియో యొక క్రొత్త మానిసి పురాణ కాలక్షేపమునకు వచ్చి యది ముగిసినపిదప స్వామి సన్నిధానమునకుఁ జేరెను. ధరించిన వస్త్రములు మలినములుగా నుండెను. బక్కపలుచని శరీరము చామనచాయలో నుండెను. చూచుటకొక యల్లరి వానివలెఁ గన్పట్టెను. అట్లతఁడు వచ్చి స్వామికి నమస్కరించి "యయ్యా మాది కృష్ణాజిల్లా. నేనెప్పుడు నిట్టి భక్తసమాజము లెచట జరుగుచుండిన నచటికేఁబోయి చూచుచుందును. నా కిదియే పని. జగత్తున నెన్నిటినో భక్తసంఘములను జూతినిగాని యిట్టి మీభక్త సంఘమువంటి యకల్మషమైనదాని నెందును జూడలేదు. ఇంత కట్టుబాటే సంఘమునకును లేదు. ఈ పద్ధతి చాలబాగుగానున్నది. నేనును మీ సంఘములోనే చేరవలెనని యున్నది. మీ మహిమను జూచిన దగ్గఱనుండి మీకు గజాధిరోహణము గావించి పెద్దయుత్సవము చేయవలయునని నాకు సంకల్పము గలిగినదని యిట్లు వారి భక్తి ప్రచారమును గూర్చియు, వారి శక్తిని గూర్చియుఁ, దపోమహిమను గూర్చియుఁ జాలసేపు ప్రశంసించెను. స్వామియు, నతనిప్రశంసకు, 'మంచిదేగదా, యని పలికెను. ఆ రాత్రి స్వామి సన్నిధానముననే యాయన భోజనమాచరించెను. భజనయైన తరువాత నొక చాప తీసికొని యచటనే పరుండెను. తెల్లవాఱిన తరువాతఁజూడఁగా నతఁడు లేఁడు. ఏమైపోయెనో యప్పటినుండి దెలియలేదు. ఆ పిదప నితర గ్రామములలోఁ బురాణమునకు రాక యాలసించియున్నవారు తరువాత వచ్చి స్వామితో నెవరో బక్కపలుచని, చామనచాయ శరీరముగల వాఁడు మా యూరికివచ్చి, 'మీరందఱు నిటనేమిచేయుచున్నారు ? వేంకటదాస

స్వామి చావలిలోఁ బురాణకాలక్షేపము మహావైభవముఁగా జేయుచుండఁగా నింద్లకడనే యేల మీరు పడిపోయితిరి ? త్వరపడి యింకనైనఁబొందు జన్మలు తరించును. నేను చూచివచ్చుచున్నా"నని యుద్బోధించెనని చెప్పిరి. వచ్చినవారెల్ల నిట్లే వచించిరి. విమర్శించి చూడఁగా స్వామి శిష్యు లెన్ని యూళ్ళలోనుండిరో, యన్నియూళ్ళలోను, బూడివాడలోను నా యొక్కదినముననే యా మనుష్యుఁడు కనఁబడి యందరి కిట్లు చెప్పినట్లు ఋజువుపడెను. అంతంత దూరములోనున్న యా యూళ్ళన్నిటికిని మనుష్యుఁ డొక్కదినముననే యెట్లు పోవఁగలుగును ? ఒకయూరు కృష్ణాజిల్లాలో నుండఁగా, నొక యూరు గుంటూరుజిల్లాలో నున్నది. ఇది మనుష్యులకు సాధ్యమగు పనిగాదనియు, నొకానొక మనుజునకవసరమైన పనియుఁ గాదనియు వచ్చిన వాఁడు భగవానుఁడే యనియు స్వామియు శిష్యులును నిశ్చయించిరి.

ప్రతిదినమును నూరివారు, భగవన్ని వేదనకై గొనివచ్చుచున్న పండ్లు, వడపప్పు, కొబ్బరికాయలు, తిరుగబోసిన సెనగలు పురాణము కద రాసులు పడసాగెను. అవి సాయంకాలమునఁ బంచిపెట్టుటకు బదిమంది సమర్థులు రెండుగంటలు పనిచేయవలసి వచ్చుచుండెను. జనసమ్మర్ద మత్యంతమాయెను. చావలి కలియుగ వైకుంఠముగాఁ గనిపించెను. ఇట్టిపురాణమును, జీవితకాలములో నెప్పుడును వినలేదు. స్వామివంటి పరమహంస నెచ్చటను జూడలేదని చావలి జనులు విభ్రాంతిగాఁ జెప్పుకొనిరి. కార్తికపూర్ణిమ వచ్చెను. పురాణమును ముగిసిపోయెను. రామపట్టాభిషేకదినమునూ నిర్ణీతమాయెను.

పట్టాభిషేక ముదయముననే జరుగును గావున నాఁటి యుదయ మేడుగంటలగుసరికిఁ బ్రజ పురాణకాలక్షేపకూట పరిసరమంతయు మూగిపోయెను. పురాణము చెప్పు వేదికమీఁద వేంచేపుచేయఁబడియున్న పెరుమాళ్లకు వారి యలవాటు చొప్పున స్వామి సహస్రనామ పూజ చేయువలసినదిగాఁ బెద్ద శిష్యుఁడైన వేంకటసుబ్బయ్యగారిని నియమించెను. భక్తులలో నెవరో నామావళి చదువుచుండఁగా వేంకటసుబ్బయ్యగారును స్వామి యానతిచొప్పునఁ బూజగావించెను. ఎనిమిది గంటలగుసరికి స్వామి పురాణ వేదిక మీఁదికి వచ్చెను. ఎఱ్ఱని పట్టు వస్త్రములుగట్టి, తులసీనళినాక్షమాలలు వేసికొని, శిష్యులలందిన వక్షస్థలీ హరిచందనముతో, ద్వాదశోర్ధ్వపుండ్రములతో, విశ్వామిత్ర మహర్షినిఁ దలపించుచు, జనుల కనులకు మిఱుమిట్లుగొలుపుచు స్వామి, పట్టాభిషేకము వఱకును, నొక్కసారిగాఁ బూర్వరామాయణమంతయు నుపన్యసింపఁబోవుచుండెను. అట్టి సమయమునఁ గొందఱు దుర్బుద్ధులు తామందఱు నుండఁగా దమయూరిలో వేంకటసుబ్బయ్య గారిచే సహస్రనామ పూజను స్వామి యేలచేయించెనో తెల్పుకొనవలయునని యాలోచనపడి, పురాణము



జగమెఱుంగక గురువుల చరణ యుగముఁ గెరలిసేవింపఁగన్న యోగినులు వీరు తుంగల వేంకటరత్నమ్మగారు (వేకనూరు), మల్లి శాంతమ్మ గారు (మోదుమూడి)

జరుగుటకు యజమానియై కార్యభారము వహించి చేసిన నాగయ్యగా రను వానినిస్వామి నడుగుమని పురికొల్పిరి. అంతట నాయనయు 'నిజమే యడుగవలసినదే' యని లేచి సమీపమునకు వచ్చి, స్వామితో "నయ్యా పురాణము చెప్పినది, మా యూరిలో కార్యమంతయు నిర్వహించినది మేము. కావున మేమిపుడు కర్తలమైయున్నాము. అట్టి విషయమున నిచట సహస్ర నామపూజ మాచేఁ జేయింపవలసియున్నది. కాని మమ్ము విడిచి పర గ్రామస్థుఁడగు, వేంకటసుబ్బయ్యగారితో మీరీపని యేలచేయించితిరో, మాకుఁ దెలియలేదు. మీ యట్టివా రీ యకార్యము చేయుదురని మేమనుకొనలే" దని యా సభలోనే స్వామినిఁ గొంచెము తిరస్కార భావముతో నడిగెను. చివరిలో నతఁడన్నమాట స్వామి చెవులకు ములికివలెఁ దగిలెను. తమ యలవాటుచొప్పున స్వామి చేయించిరి. అట్లుకాక మేమే యీపని చేయుదుమని మొదటనే యడిగిన వారి చేతనే చేయించియుందురు. పోనీ యీసమయముననా, స్వామి నడుగవలసినది ? పైగా మహాత్ములకడ నడుగవలసిన క్రమమదియేనా ? ఇట్టి యకార్యము మీరు చేయుదురని యనుకొనలేదన్నమాటతో స్వామి శరీరమునుండి పొగలు వెడలిపోయెను. కన్నులెఱ్ఱనాయెను. చెక్కులు తటతట నదరెను. కోపవేగమున దేహము కంపించిపోవుచుండెను. అట్టి మహాకోపముతో స్వామి "నాగయ్యా! మా యలవాటు కొలంది మేము చేసితిమి. మేము చేసెదమని మీరడిగిన నప్పు డొప్పుకొనక పోయినఁ దప్పు నాయది యగును. అట్లడుగక చేసిన వెనుక నీ సభలో నీ సమయమున నిట్లు తిరస్కారదృష్టితో లెక్కలేక యట్లడుగుట కసలు నే నెవఁడనని భావించితివి ? నీ యింట జరుగు శుభాశుభకర్మల యందుఁ గొలఁదియో గొప్పయో గైకొని, నీ యిచ్చవచ్చునట్లు నడచు నీ పురోహితుఁడ ననుకొంటివా ? నీ విచ్చు నెలజీతములు దిని నీ పిల్లలకుఁ జదువుచెప్పు పంతుల ననుకొంటివా ? నీ జమాఖర్చుల లెక్కవ్రాసి పొట్టఁబోసికొను నీ గుమాస్తా ననుకొంటివా ? నీకడ బాకీలు నాకీ లెత్తుకొని వెళ్లి నీయనుగ్రహమునకై వేచియుండు నీక్రింది రైతుననుకొంటివా? లేక నీ చేనికడ నీళ్లు నిప్పులు చూచుట కేర్పడిన జీతగాఁడ ననుకొంటివా? నన్నెవనిఁగాఁదలఁచి యిట్లహంకారమునఁ దిరస్కరించి కన్ను మిన్ను దెలియక పలుకుచుంటివి ? భగవద్భక్తులమై లోకుల యనుగ్రహనిగ్రహములు లక్ష్యముసేయని మాయెడనా నీ తామసము జూపవచ్చితివి ? ఇఁక నీ పట్టాభిషేకము చేయవలసిన పని మాకు లేదు. పట్టాభిషేకాంతమున మా యాశీర్వాదము నొంది పురాణశ్రవణఫలము నొందుప్రాప్తి నీకులేదు" అని యిట్లు స్వామి మహా భయంకరముగాఁ జెలరేగెను. ఆ కేకలకు సభాభవనము దద్దరిల్లిపోవుచుండెను. స్వామి యెడ నుగ్రనారసింహస్వరూపము గోచరించు చుండెను. జనులు తలయెత్తి యుగ్రస్వరూపియైయున్న స్వామినిఁ దిలకింపలేక తలలువంచి భయకంపితులై, "ప్రభూ! కోపము నుపసంహరింపుడు. శాంతింపవలెను. శాంతింపవలె"నని

వందలకొలందిగా సంజలిబంధములు పైకిజోడించిరి. పాపము నాగయ్యగారు మొదట నుఱలాటముతోనే యడిగెను గాని, స్వామి యుగ్రకోపానలజ్వాలల నేఁడిమికిఁ దాళలేక గడగడనడఁకుచు నివ్వెఱఁగొని యట్లే నిలిచిపోయెను. స్వామి కేకలు వైచివైచి యింకఁ బురాణముఁ జెప్పవీలులేదు. మూటలు ముల్లెలును గట్టండిరా వెళ్ళిపోవుదమని శిష్యుల కాజ్ఞాపించి వేదిక దిగి యావలికేగెను. చేయునదిలేక స్వామిని సమీపింపలేక నాగయ్యగారు మొదలైనవారు స్వామి యంతరంగులై, పెద్దశిష్యులై యున్న వేంకటసుబ్బయ్యగారు మున్నగు వారిని, మీరైన స్వామినిఁ బ్రార్థించి పట్టాభిషేకము నెట్లైనఁ జేయింపుడని బ్రతిమాలఁజొచ్చిరి. కాని యట్టి సమయమున స్వామిని సమీపించిన, వారికి మాత్రమెక్కడివి బ్రతుకులు ? "ఇప్పుడు లాభములేదు. యీ సమయమున మేముగాదు మఱియెవ్వరును స్వామిని సమీపింపలేరు. ఒకగంటసేపాగుఁడు. త్వరపడవలదు. అప్పటికి స్వామి కీ కోపమంతయుఁ బోవు"నని వారు సమాధానము చెప్పిరి. పిదప నొకగంట యైనతరు తరువాఁత బెద్దపెద్దవారెల్లఁ బోయి స్వామి పాదములపైఁబడి, యంత నిగ్రహమువలదు. అనుగ్రహించి, పట్టాభిషేకము పూర్తిఁగావింపుఁడు, వెళ్ళుద"మని ప్రార్థించిరి. నాగయ్యగారును గడగడ వణకుచు నేనేవియో క్రొత్తపంచలు, తాంబూలము మొదలైనవి యొక పళ్ళెరములోఁ బెట్టుకొనివచ్చి యవి స్వామి సన్నిధానమునఁ బెట్టి తప్పు క్షమిచి మమ్మనుగ్రహింపుదని, వేడికొనెను. అప్పటికిఁ గోపమంతయుఁ జల్లారిపోవుటచే, నెట్టకేలకు సమ్మతించి స్వామి యా పట్టాభిషేకమును ముగించెను.

వైష్ణవుల దాడి

స్వామిశిష్యులు చావలిలో నేఁబది యఱువది మందివఱకుఁ గలరు. వైష్ణవులు కొందఱు, కులాచారముగాఁ దమకు శిష్యులై యున్నవారు కొంతమంది స్వామి నాశ్రయించిరన్న వార్తఁ దెలిసికొని బయలుదేఱి చావలికివచ్చి స్వామిశిష్యులతో, మీరు వేంకటదాసు గారికడ, నుపదేశము నొందుట తప్పు. బ్రాహ్మణులమైన మాకుఁ దప్ప నితరుల కా యధికారములేదు. అట్లు వారినే యాశ్రయించిన యెడ మీకు దుర్గతి కలుగునని యేవేవో నోటికివచ్చినట్లు మాట్లాడిరి. అంత నా శిష్యులు, వారికధికారమున్నదో లేదో మాకుఁ దెలియదు. వారి నిచ్చటికిఁ బిలుచుకొనివచ్చెదము. వారి సమక్షమున మీరామాట చెల్లించుకొనిన మీరు చెప్పినట్లు చేసెదమనిరి. వైష్ణవులు, సరే యట్లే పిలుచుకొనిరమ్మనిరి. అంత చావలివారు నలుగురు బయటదేఱి పూడవాడకు వచ్చి యీ విషయమును స్వామితో విన్నవించిరి. స్వామియుఁ దగిన శాస్త్రగ్రంథములను గట్టించుకొని చావలికిఁ బోయెను. ఈలోగా స్వామి శిష్యుఁడొకఁడు "వేంకటదాసస్వామికడ మంత్రోపదేశమగుట దోషమంటిరి.

మఱి, మాదోషమెట్లుపోవునో చెప్పుడు. అంతవఱకును లేవన"ని యా వైష్ణవులు బసచేసిన యింటిగుమ్మమున కడ్డముగాఁ బరుండెను. లోనివారు బయటికి, బయటివారు లోనికేగుటకు వీలుగాక యా వైష్ణవులు, వేంకటదాసస్వామి నాశ్రయించుట దోషముగాదు. బుద్ధిలేక యీమాట యన్నాము. లేవవయ్యా యని బ్రతిమాలగా బ్రతిమాలగా, నెప్పటికో లేచిపోయెను. రెండవనాఁటికే, స్వామి పరివారముతోఁ జావలిలో వైష్ణవులు బసచేసియున్న సత్రముకడకు వెళ్ళెను. స్వామినిఁ జూచుటతోడనే వారి జీవము క్రుంగెను. స్వామి యడిగినప్రశ్నలకు వైష్ణవులు జవాబు చెప్పలేక తెల్లమొగములు వెట్టిరి. జనమత్యంతముగా నచ్చట మూగెను. ఆ కోలాహలమును జూచి యావైష్ణవులు, భయకంపితులై సత్రములోని కేగి తలుపులు వైచుకొనిరి.

అప్పుడు మీయిష్టమువచ్చినట్లు మాట్లాడి యిపుడు తలుపులు వేసికొంటిరేమయ్యా బయటికి రండు సమాధానము చెప్పుడని స్వామి శిష్యులు పిలుచుచుండిరి.

ఇట్టి సమయమున నీ వైష్ణవులబంధు వొక పండితుఁడు వేమూరిలో బండిదిగి యెచ్చటికో పోవుచుండెను. ఆయనతో నెవరో "పూడివాడ వేంకటదాసస్వామికిని, మీవారికిని చావలిలో వివాదము జరుగుచున్నది. మీవారి నీవేళ నలియఁగొట్టునట్లున్నా"రని చెప్పిరి. పాపమా వైష్ణవుఁడు నురువులు గ్రక్కుచుఁ జావలికిఁ బరువెత్తుకొని వచ్చెను. వచ్చునప్పటి కిట్లుండెను. అంత నా వైష్ణవపండితుఁడు విషయముఁ దెలిసికొని, స్వామి సమీపమునకు వచ్చి, "యయ్యా యీ తప్పును క్షమింపుఁడు. ఆగ్రహింపవలదు. పొట్టకూటికై యేడ్చు మా యాచార్యతకంటె, భగవద్దత్తమైవచ్చిన మీ యాచార్యత్వమే గొప్పది. మీకధికారము లేదనుట కెవరికధికారమున్నది ? తెలియక పల్కిన మా వాండ్ర మాటలను లక్ష్యము సేయక యనుగ్రహించి తమరు దయ చేయుఁ"డని పలువిధములఁ బ్రార్థించెను. ఇందులకు బయలుదేఱితిరా ? మనము చేయునది లేకపోగా జగదుద్ధరణముఁ గావించు మహాత్ములను వలదని వారించుటకటరా మనమున్నది ? మీకేమి తెలియునని వారితో వివాదముఁ బెట్టుకొంటిరని తమవారిని జీవాట్లు పెట్టెను. స్వామియు శిష్యులతో బసకు నేగెను.

ఇంతలో సమీపగ్రామస్థుఁడగు నొక యార్యసామాజికుఁ డీ విషయముఁ దెలిసికొని పదిమంది యనుచరులతోఁ జావలికి వచ్చి స్వామిని సందర్శించి వివాదము నామూలాగ్రముగాఁ దెలిసికొనెను. వైష్ణవుల నచటికిఁ బిలచుకొనిరమ్మని యెవరినో పంపెను. తరువాత వచ్చిన పండితుఁడును, మఱియొక వైష్ణవుఁడును గలిసివచ్చిరి. ఇఁకఁజూడుఁడా యార్య సామాజికుఁ డడిగిన మాటలకుఁ బిండము లూడిపడెను. "మీ రెంతకాలమునుండి యీ చావలికిఁ *గులగురువులుగా* నుంటిరి ? ఇంతదనుక నొక్కనినైన నేలబాగుచేయలేకపోయితిరి? అసలు మా కాఁపుసంఘముమీఁదికి వచ్చి గురుత్వమును మీరేల చేయవలయు?

బాగుచేయుటకందురా. మీ సంఘములోనే మీరు, గురుత్వమును వహించి బాగుపరచుకొనుఁడు. ఒక సంఘముమీఁది కితరసంఘమువాఁడు వచ్చిన, సందినంతవఱ కెత్తుకొని పోవఁజూచును గాని యీసంఘమును జక్కసేయుట కేలయత్నించును ? మీరు సంధ్యోపాస్తి చేయరు. పంచయజ్ఞము లాచరింపరు. వేదాధ్యయన మెఱుఁగరు. ముందలి జుట్లు పెట్టుకొని కాళ్లు కూడఁ గడగకయే యెచటఁబడిన నచటఁ దిందురు. మీ వర్తనమంతయు దుష్టమే. కాలమంతయు మీకుఁ జీట్లాటతోడనే వెళ్ళిపోవుచుండును. అట్టివారా జగదాచార్యత కర్హులు ? పరమహంసలైన వేంకటదాసస్వామికి నర్హతలేదు, మీ దృష్టిలో! మీరు పాఠశాలలోఁ బంతులుగా నుంటిమని చెప్పితిరికదా. పొట్టకూటికై నెలజీతములకుఁ బంతులు పని చేసికొని బ్రతుకు మీకు గురుత్వాధికారమెక్కడిది ? ఒకానొకఁడు బ్రాహ్మణేతరుఁడు తలయెత్తుసరికి వాని నెట్లడఁగద్రొక్కుదుమా యని బయలుదేఱితిరా ? మీ యసూయ దగులఁబడిపోను.” అని యిట్లు పలికి, స్వామి శిష్యులను జూచి “యేమిరా, యీబొట్లు, ఈ స్నానములు, ఈ జపములు, ఈ తేజస్సు, యివి యన్నియు మీకెట్లు వచ్చెను? వేంకటదాసస్వామివలనఁగదా! ఇన్ని తరములనుండి యున్నను, నొక్క పతియైన నీ వైష్ణవుల వలన మీకిట్టి స్థితిగలిగెనా ? అట్టిమహోపకారియైన స్వామి గురుత్వము నందు మీ కసలు శంక యేలగలిగెను ? ఈ వైష్ణవుల కసలు సమాధానము చెప్పవలసిన పనియేమున్నది? మీరు స్వచ్ఛమైన కాఁపు జన్మమునెత్తిన, స్వామిని సందేహింపరు. వేరొక గురువున్నాఁడని, భావించితిరేని మీరు నరకములో ముఱికిగుంటలపాలగుదురు. వంచకులై మీ సొమ్ము నపహరించుటకు వచ్చిన యీ వైష్ణవుల నమ్మవల”దని తిట్టెను. పాపము వైష్ణవులకుఁ గనులనీళ్ళపర్యంత మాయెను. పండితుఁడైన వైష్ణవుఁడు స్వామినిఁ జూచి “యయ్యాఁ! మమ్మిట్లు తిట్టించుటకా పిలిచిన దనెను. అంత స్వామి “నేను పిలిపింపను లేదు. మిమ్ము తిట్టింపను లేదు. వారే పిలిచిరి, వారే మాట్లాడుచుండిరి. యన్యాయముగా నన్ను దూషించి మీవారు నాపై దాడిచేసిరి. దానికి సమాధానమిచ్చుటకు నేను వచ్చితిని. దైవము వారినిఁ బ్రేరించి మిమ్మడిగించుచుండెను. ఇందులో నా ప్రయత్న మేమియు లేదు. దానికి నన్నేమి సేయమందు ?” రనెను. వైష్ణవులు వెడలిపోయిరి. ఆ యార్యసామాజికుఁడును స్వామికడ ననుజ్ఞఁగొని పరివారముతో వెడలి పోయెను. స్వామియుఁ గొన్నిదినము లటనుండి మరలఁ బూడివాడకుఁ జేరెను.

దుష్టనిగ్రహము

ఒకదినమున స్వామి చేనికడఁ గూలీలతో నారుఁ దీయించుచూ గట్టుమీఁదఁ గూర్చుండి యొక బ్రాహ్మణునితో మాట్లాడుచుండెను. అట్టియెడ స్వామియందత్యంతప్రేమతో

నుండువాఁడుఁ నొక మాదిరి పండితుఁడును నైన మఱియొక విప్రుఁడు సమీపగ్రామవాసి యచటకి వచ్చెను. వచ్చిన యా బ్రాహ్మణుని గౌరవించి స్వామి కూర్చుండఁ బెట్టెను. ముగ్గురు నేదో మాట్లాడుచుండగా నేదియో యద్వైత మత ప్రసంగము వచ్చెను. అద్వైతమును వేంకటదాసుగా రొప్పుకొనరండీ యని యా బ్రాహ్మణుఁడు, వచ్చిన బ్రాహ్మణునితో ననెను. ఏమండీ! మీరేల యొప్పుకొనరని యతఁడు స్వామి నడిగెను. అదియన్యాయ్యము గనుక నేనంగీకరింపనని వారనిరి. అట్లట్లు వాదము పెరిగిపోయెను. వాదములో నేదియో విషయముకడ, "గీతాశాస్త్రమున శ్రీకృష్ణస్వామి చెప్పినదాని కిది విరుద్ధమగు" నని స్వామి యనెను. పాప మా బ్రాహ్మణుఁడు కొలఁదిదినములక్రిందటనే యాసురప్రకృతులగువారు వ్రాసిన నాస్తిక గ్రంథములను జదివియుండెను. ఆ కారణమున నతఁడు తన బ్రాహ్మణత్వమును మఱచిగభాలున శ్రీకృష్ణునివంటి పరమ నీచుఁడును, బాండవులవంటి దుర్మార్గులును లేరనెను. అతఁ డీ చేసిన దైవదూషణము వినఁగనే స్వామి కొడలుతెలియనంత కోపము వచ్చెను. "నీవు బ్రాహ్మణుఁడవై పుట్టియు, నాదగ్గఱ నెంతమాటంటివి! నన్ను దిట్టినను నొప్పుకొనెడి వాఁడను. పరబ్రహ్మను దూషించితివే నీచుఁడా! నిన్నిదివఱకు నుత్తముఁడవని బ్రాహ్మణుఁడవని సత్కరించితిని, ఇఁక నిన్ను జండాలునికంటె నధమునిగా భావింతును. నిష్కారణముగాఁ గృష్ణదూషణము చేసినందువలన శిశుపాలునివలె శీఘ్రకాలమున నశింతువు. నీరోజులు మంచివి కాకపోవుటచే నీ మాటలు నీనోట వెడలినవి. నేనీవేళ లేచిన సమయమును మంచిదిగాదు. ఇట్టి కఠోరవాక్యములు వినవలసి వచ్చిన'వని ఘోరముగాఁ బలికి, యచటినుండి లేచెను. ఆ బ్రాహ్మణుఁడు, నటనుండి యూరిలోనికి వచ్చెను. అచ్చటనుండి లేచునప్పటికే విప్రుని మొగమున జీవకళలు గ్రుంగెను. చూచినవారెల్ల రాయన ముఖమట్లున్నదే మని యడిగిరి. ఊరిలోఁ బనియైన తరువాత నతఁ డింటికి వెళ్ళెను. ఆదినముననే యతనికి జ్వర మారంభించెను. ఎన్నిచికిత్సలు చేసినను వెనుకకుఁ దిరుగలేదు. నాలుగైదురోజులలో నతఁడు కాలధర్మమునొందెను. వేంకటదాసస్వామి శాపాగ్నిచే బ్రాహ్మణుఁడు మడిసెనని, జనులు విభ్రాంతిగాఁ జెప్పుకొనిరి. అదిమొదలు స్వామి సన్నిధానమున వాదము చేయుట కెవరును సాహసింపలేదు. వారిమాటయం దామాత్రము చుఱుకు లేకపోయిన లోకము భగవత్సేవ చేయనిచ్చునా ?

సీతారామ ప్రభావము

రావణ వధానంతరము, వానర రాక్షసు లయోధ్యలో రామసన్నిధానమున ననుభవించిన యానందమంతయునొక పద్య ప్రబంధముగా 'సీతారామ ప్రభావ' మనుపేర నొక గ్రంథమును; ఆచార్యాళ్వారుల విషయమును, నర్థపంచకము, మొదలైన వానిం గూర్చి,

మొట్టమొదట వైష్ణవమునఁ బ్రవేశించువారికిఁ జక్కగాఁ దెలియున ట్లొక వచనవేదాంత గ్రంథమును వ్రాసి స్వామి, తన్ముద్రణమునకై చావలిలోఁ జందాలు వేసెను. అప్పుడప్పు డటనుండి తెనాలికిఁ బోయి సరిచూచుచు ముద్రణమునఁ దప్పులొదవకుండ గ్రంథముల నచ్చొత్తించుచుండెను. స్వామి వెంట నలుగురుశిష్యులు నుండిరి. చావలిలో వారికి దినమున కొకయింట విందుఁగావించుచుండిరి. స్వామి తాము, రామనిలయమున వానరుల భోజన విధానము నెట్లువర్ణించిరో యా విధియంతయుఁ జావలిలోఁ వారికిఁ బ్రత్యక్షమాయెను. ప్రతిదినమును బది బంద్రెండు పిండివంటలు చేయఁబడుచుండెను. వలదన్నను గృహస్థు లూరుకొనకపోయిరి. స్వామి తమకు హితమైనంతవఱకే గ్రహింతురు. వారి నెవరును గదపలేరు గాని వెంటనున్న శిష్యులను జావలిగృహమేధులు భోజనసమయమునఁ బిండివంటలు దినుటకై బలాత్కరించుచుండిరి. వారి కదియొక పెద్దబాధయైపోయెను. అజీర్ణముచేసి రోగములు కూడ రాసాగెను. అట్టి సమయమునఁ బూడివాడలోఁ జూలాలుగా నున్న రాధమ్మగారి కాకస్మికముగా గర్భములో శూల కలిగెను. ఆబాధతో నామె పరుండనులేక కూర్చుండను లేకపోయెను. ఆవ్యధను బరులు చూడలేకపోయిరి. చికిత్సలేవియుఁ బనిచేయలేదు. వెంటనే చావలికిఁ గబురువెళ్ళెను. స్వామియు దైవసంకల్ప మిదేమిరా యని, బయలుదేరి సాయంకాలమున కింటికి వచ్చెను. వచ్చునప్పటికి జనులు రాధమ్మగారి మంచము చుట్టును మూగియుండిరి. పట్టండి. పట్టండి, యాసుపత్రికిఁ దీసికొనిపోవలయును. ఇచట నుంచిన నిఁక లాభములేదని, తలయొకవిధముగా మాట్లాడుచుండిరి. మీనాతోఁ దీసికొని పోవుటకై చాకలివాండ్రును సిద్ధముగా నుండిరి. అట్టితఱి స్వామి వచ్చి చూచెను. రాధమ్మగారి బాధ యపరిమేయముగానే యుండెను. ఎట్లున్నను స్వామికి నాసుపత్రులన్న నిష్టములేదు. సకలరోగవైద్యుఁడు సర్వేశ్వరుఁడే! యేమిచేసినను వాఁడే చేయవలయును. మనుష్యమాత్రుల వలన నేమియగును ? ఆసుపత్రిలోనున్న దైవ మిచటలేఁడా ? యచటికిఁ బోవుటయేల ? శ్రమపడుటకే యని వారి భావము, దృఢాధ్యవసాయము. స్వామి యాసుపత్రికి వలదనిన యప్పుడే యన్న నచటనున్నవారు పైకిఁగూడ వచ్చునట్లుండిరి. అందువలన స్వామి "కొంచె మాగుఁడు. భోజనము లాచరించి చంద్రోదయమైన పిదప వెళ్ళుదము"నిరి. ఇష్టదైవమగు వేణుగోపాలునిపై "నీ సంకల్పములేక, యొకటి వచ్చునా ? నన్నే పనికిని బోనీయవు సాగనీయవ"ని విసుగుకొని స్నానముచేసి, రామము సహస్రము జపించి రాధమ్మగారికిఁ దీర్థమిచ్చెను. ఇచ్చినయొక పావుగంటకెల్ల నామెబాధ యంతయుఁ బోయి హాయిగాఁ బరుండెను. ఇఁక నాసుపత్రికి వెళ్ళవలసి పనిలేక పోయెను. స్వామి తపోమహిమకు నూరంతయు నచ్చెరువు పడెను.

ప్రబల రోగంబులన్ బర్వతంబుల నుఱు
మాడంగ నిశిత వజ్రాయుధంబు
బ్రహ్మహత్యాది దుర్భరకిల్బిషశ్రేణి
యను దూదిఁ గాల్పంగ నగ్నికీల
యాపత్తులను దుర్గమాటవీతరుపంక్తిఁ
బడవైచి నఱుకఁగాఁ బరశు ధార
యరి సంఘమనెడి ఘోరాంధకారంబును
మాయించి తూలింప వేయివెలుఁగు
రామపదసేవ. దాని, నిరంతరంబు
నాచరించెడి సుకృతుల కలవిగాని
కార్య మిలమీఁద నొకటేనిఁ గలుగునొక్కొ
వర తపోమహిమకు సరిబలము గలదె!

ఆసారి రాధమ్మగారి కొక యాడుపిల్ల జనించెను. ఆమెయే కడపటి సంతానము. స్వామి సంతతి మొత్తము నలుగురు కుమారులును దరువాత నిద్దఱు కొమారితలు. నాలుగవ కుమారుని పేరు రామప్రసాదయ్య. పెద్దకూఁతురు రామబాణమ్మ. రెండవతనూజ కమలాదేవి.

తపోమహిమ ప్రదర్శనము

మొదలుపెట్టినప్పటినుండి ప్రతివత్సరమును నేదోయొక యూరఁ బురాణ కాలక్షేపము జరుగుచునే యుండెను. బహుధాన్య నామ వర్షంబునఁ బూడివాడలో మహాభారత కాలక్షేపము ప్రారంభింపఁబడెను. భక్తు లెల్లరును వచ్చిరి. పురాణము మహా వైభవముగా సాగిపోవుచుండెను. పూడివాడయందలి జనమును బడేవారిపాలెము మున్నగు పరిసరగ్రామ వాసులును, ప్రతిదినమును వచ్చి మహానందముతో భారతమును వినిపోవుచుండిరి. అప్పటికిఁ బురాణముఁ జదువుటకు స్వామికిఁ బెద్దకుమారుఁడు కొంతవఱకెక్కి వచ్చెను. వారు పురాణము చెప్పుచుండఁగాఁ జదువుట కొక్కఁడు జాలెడివాఁడుకాఁడు. ఆ ధాటికిని, వేగమునకును, నొక్కఁడు తట్టుకొనలేఁడు. కొంతసేపటికి మారవలసినదే. స్వామికిఁ బూడివాడలో విశ్వేశ్వరరావు గారను శిష్యుఁడొకాయన, యుండెను. ఆయన యాంగ్లమునందును గొంత పరిశ్రమ చేసిన మంచిమేధావి. కాక స్వామియందు గొప్ప భక్తిప్రతిపత్తులు గల వ్యక్తి. ఆయన గారనిన, స్వామికిని, మిక్కుటమై వాత్సల్యముండెడిది. ఒక దినమున విశ్వేశ్వరరావుగారు, పురాణము చదువుచుండెను. ఏదో యపశబ్దము రాగానే స్వామి 'ఆ' యని కేకవేసెను. ఆ గర్జనతోఁ బాపమాయన బల్లపైఁ బెద్దయెత్తున నదరిపడెను. వారి

పురాణసమయమునఁ జదువు వారి పని యట్లుండెడిది. ఇంక వినువారెవరును గదలఁగూడదు. నిద్రపోఁగూడదు. దిక్కులుచూడ వీలులేదు. భయభక్తులతో నుండవలసినదే. స్వామికిఁ జావలిలో భూషమ్మ యనునొక, శిష్యురాలు గలదు. ఆమెకు రెండుకక్షలయందును రెండువ్రణములు లేచెను. అవి యెన్ని చికిత్సలు చేసినను నయమునపోలేదు. ఆమె యాబాధకుఁ దాళలేక పూడివాడకు వచ్చి స్వామిని దర్శించి, యా కాలక్షేపానందమునఁ బాల్గొనిన, నేమైన వ్యథ శమించునేమో యని పూడివాడకు వచ్చెను. కాని యా మంటలకోర్వఁజాలక యటఁగూడ నుండలేక పోయెను. ఒకటి రెండురోజులుండి, యొకనాఁటి మాపటిసందెవేళ. శిష్యులతోఁ బరివేష్టింపఁబడియున్న స్వామిని సమీపించి "యయ్యా యిచటికి వచ్చిన నేమైన యాబాధ తగ్గునేమో యను నాసతో వచ్చితిని. గాని తగ్గుట లేదు. ఇచట నుండుట కూడ దుర్భరముగా నున్నది. తెల్లవారుజామున మరల మాయూరికేగెదను. సెలవిం"దని యడిగెను. అంత స్వామి శిష్యులనుజూచి యావ్రణము లెన్నిరోజులలోఁ బగులునట్లున్నవో చూడుఁడనెను. వారును బరీక్షించి "స్వామీ! యివి చంక తాళీలు, షుమారొక వారమురోజులైనను జరిగినఁగాని పగుల"వని తెలిపిరి. స్వామి యంతట వారితోఁ, "జూడుఁడు, నా తపశ్శక్తి, యా వ్రణములను దెల్లవారుసరికిఁ బగిలిపోవునట్లు చేసెదను. అట్లు కానియెడల, నేనుజెప్పు బోధయంతయు నబద్ధమనియే యెంచుకొనుఁడు. మీరు నమ్మి యీ భక్తి నవలంబించి ప్రయాసపడవలసిన పనిలేదు. నన్నును సామాన్యమనుజులలోనే లెక్క వేసికొనుఁడు. వ్రణములు పగిలిన నిది యనుపమాన మార్గమనియు, మాయందు దైవమున్నాఁడనియు నెంచుకొనుఁ"డని యొక వేపమండ తెప్పించి యొకగంటసేపామె వ్రణములకు సోకునట్లు భగవన్మంత్ర ముచ్చరించెను. "ఇది యేమి ? స్వామి యిట్లు పల్కుచున్నారు. ఇంత గట్టిగానున్న యా వ్రణము లింతలో నెట్లు పగులు ?" నని శిష్యు లచ్చెరువు పడుచుండిరి. భజనయైనపిదప నెవరిత్రోవను వారు పరుండిరి. తెల్లవారుజామున మేలుకొల్పులు పాడుటకు లేచునప్పటికే యామె వ్రణములు రెండును, బగిలిపోయెను. బాధయంతయు నుపశమించెను. ఆమె యానందముతో వచ్చి స్వామికిని సామాజికులకునుజూపి చెప్పెను. ఎల్లరును స్వామి యప్రతిమాన తపఃప్రభావమునకు విస్మయంపడిరి. ఇట్టి నిదర్శనములను స్వామి తమజీవితకాలమున నెన్నియో చూపిరి.

భాగవతులకు భగవద్దర్శనము

పూడివాడకు మూడుమైళ్ళ దూరములో దక్షిణమున మీసాలవారిపాలెమను నొక చిన్న గ్రామము గలదు. అందును గొందఱుస్వామికి శిష్యులు గలరు. వారును నప్పుడప్పుడు భోజనమైనపిదప మధ్యాహ్నము నుండి పూడివాడకు వచ్చి స్వామిని దర్శించి తదుక్త

భగవద్విషయముల విని సాయంకాలమునకు మరల నింటికిఁ బోవుచుండెడివారు. ఒక సంవత్సరమున వేసఁగిఁలో జింతపండులోని విత్తనములను దీయుటకై మీసాలవారిపాలెపు శిష్యులయందుఁ గొంతమంది స్త్రీలను బూడివాడకు రమ్మని స్వామి చెప్పెను. అట్లే వచ్చెదమని వారు గృహములకేగి రెండవనాఁడు భోజనములైన పిదప నొకరినొకరు పిలుచుకొని బయలు దేఱిరి. అందులో రామమ్మయను నొకామె "వచ్చుచున్నాను మీరు పోవుచుండు'డని యేదో పనివలనఁ గొంత యాలసించెను. అట్లే వారును బయలుదేఱి వచ్చిరి. ఆమెయుఁ ద్వరత్వరగాఁ బనిని ముగించి తమ వారందఱును ముందు వెళ్ళిపోయిరే యనుసంభ్రమముతో బయలు దేఱెను. ఒక మైలుదూరము వచ్చెను. ముందువచ్చినవా రెచటను గనిపింపలేదు. అప్పటికే వారు దాఁటివచ్చిరి. మండు వేసఁగి. మధ్యాహ్న కాలము. మహాతీక్ష్ణముగా వడగాడ్పు విసరుచుండెను. ఆ పట్టుమీఁద నెచ్చటను మనుష్యసంచారము గానవచ్చుటలేదు. ఎండ వేఁడిమికి భూమి పొగలు గ్రక్కుచుండెను. రామమ్మ యిటునటు పారఁజూచెను. ఎవరును గానరాలేదు. ఆమె గుండె గుభాలుమనెను. తానొక్కర్తుక. సహాయమెవరును లేరు. స్త్రీ. వయస్సులో నున్నది. తప్పఁద్రావి దుండగీంద్రు తిరుగుచుందురు. అట్టివా రెవ్వరైన నెదురుపడిన నేమికావలయును ? ఏమిచేసినను వారించు వారెవరునులేరుగదా యచట. అంత నామె తిరిగిపోవుదునా ? యని విచారించెను. తిరిగి పోవుటకునుజాలదూరము వచ్చెను. పైగా గురువుగారితోఁ దప్పక రేఁపు నేను వత్తునని చెప్పి యుండెనుగదా. తమవారందఱును బోయి గురుకైంకర్యమేదియో చేయుచుండఁగా దనకందు భాగ ప్రాప్తిలేకపోవునుగదా. యని తలపోసి, యామె "సర్వేశ్వరా! నన్నేమిచేయఁదలంచితివని యొక గట్టెక్కి యిటునటుచూచుచు వెనుకకుఁ దిరిగెను. ఎవరో యొకస్త్రీ పుల్లలతట్ట చంకను బెట్టుకొని సమీపమునకు వచ్చెను. ఆమె యిఱువది సంవత్సరముల వయస్సులో నుండెను. రెండు రంగులు కలిపి కుట్టిన చీరకట్టుకొనెను. అట్లువచ్చి "యేమిటమ్మా! భయపడినట్టు లిటునటు చూచుచున్నా"వని యడిగెను రామమ్మ తన యప్పటిస్థితి నంతయుఁ దెలిపెను. అంత నా వనిత భయపడకుము. మాదియుఁ బూడివాడయే. నేనును నచటికే వచ్చుచున్నాను. నేను దాసురాలను. నాపేరు కట్టుపల్లి రంగమ్మ, స్వాములవారికి నేనును శిష్యురాలనే. వెళ్లుదము పద మని వెంట వచ్చుచుండెను. రామమ్మకు నప్పటికి మనసు కుదుటఁబడెను. "ఆహా! దైవ మనుగ్రహించె"నని యామె యానందముతో నడువసాగెను. ఆ దాసురాలును "నీ సంవత్సరము కోడూరులో సమాజము జరుగునఁట. నిన్ననే యయ్యగారికడకు నచ్చటినుండి మనుష్యులు వచ్చి"రని గురువుగారి సంగతులు చెప్పుచు స్వామి గృహ సమీపముననొక కాలువకడకు వచ్చి యదిగో దేవాలయము. కనఁబడుచున్నది. ఇఁక నేను దిరిగి వెళ్ళెదను. నీవు పొమ్మని వెళ్ళిపోయెను. రామమ్మయు స్వామి సన్నిధికివచ్చి, యచ్చటనున్న తమవారితోను, వారితోను నీ మార్గమున



సిర్విసెట్టి సీతారామమ్మ గారు, మోదుమూడి

జరిగిన విషయమంతయుఁ దెలిపెను. స్వామికట్టుపల్లి రంగమ్మ నెఱిఁగియే యుండిరిగదా. ఆ ముదుసలిది, మధ్యాహ్నమందు వడలో, నంతదూరమెట్లేగును ? ఏలపోవు ? నని సందేహపడిరి. ఆ సాయంత్రము పనియైన తరువాత వారినందఱి నిండ్లకుఁ బంపి స్వామి కట్టుపల్లి రంగమ్మను నీవు మీసాలవారిపాలె మెందులకేగితివే యని యడిగెను. అంత నా ముసలిది. "యయ్యో నాయనగారూ! నేను మీసాలవారిపాలెము వోవుటకూడనా ? నాకుఁ గన్నులువోయి సంవత్సరమైనది. అప్పటినుండియు, నేనెచటికి వెళ్లుటలేదు." అని బదులు చెప్పెను. ఆ చుట్టుపట్టుల వారెల్ల "నిదియెక్కడికిఁ బోవునండీ! ప్రొద్దునఁ బది గంటలకుఁ దిండిఁదిని యింటిలో నిప్పటివఱకును బడియుండి యిప్పుడే బయటికి వచ్చుచున్నది. దీనికిఁ గన్నులు గానరావు. ఈ వడలో మధ్యాహ్నవేళఁ బొరుగూరికిఁ బోవుట కూడనా ?" యనిరి. మఱియెవరైనఁ బంచమరామానుజీయస్త్రీలలో మీసాలవారి పాలె మీనాఁడు వెళ్లిరా యని యాపల్లెయంతయుఁ దిరిగి విచారించిరి. ఎవరును బోలేదనిరి. మఱి రామమ్మను బాడివాడవఱకు, నాపేరు కట్టుపల్లి రంగమ్మయనిచెప్పి మన కాలువదాఁకఁ బంపిపోయెనఁట....!. ఎవరైయుందు ? రని స్వామి విమర్శించెను. అందుల కా శిష్యులు "రేఁపామెను బిలిపించుఁడు. మాస్త్రీలలో నెవరైన నగుదురేమో గుర్తుపట్టు" ననిరి. సరే యట్లు చేయుదమని, స్వామి రెండవనాఁడు రామమ్మను మరలఁ బిలిపించెను. నీవు, నిన్న నిన్ను బంపిన స్త్రీనిఁ గుర్తుపట్టఁగలవా ? యని ప్రశ్నించెను. ఆహా! రెండుగంటలసేపు నాతో మాట్లాడుచు, వచ్చిన యాస్త్రీని, నేను గుర్తుపట్టలేకపోవుటేమిటి ? గుర్తింపఁగలనని యామె వచించెను. ఆమెను, మఱి కొందఱు శిష్యులను, వెంటఁగొని, నాటి సాయంకాలము స్వామి మాలపల్లెకుఁ బోయెను. ఒక యిరువదిమందిని వాంద్రస్త్రీలను బిలిపించి,రామమ్మను, గుర్తుపట్టుమనెను. ఆమె సరాసరివోయి కట్టుపల్లి రంగమ్మ యనుదానిఁ జూపి, "నీవు కావా? నన్ను నిన్నఁబంపినదినీవేగదాయనెను. అంత నమాయకురాలైన, యాముసలిది "చాలుఁజాలు లేవమ్మా! నీ ముక్కు మొగము నేనెఱుఁగను. నేనేమిటి నిన్నుఁబంపుట యేమిటి ? యీ యబద్ధాలేల యాడెద"వని వాగుచుండెను. రామమ్మ స్వామితో "నయ్యా యీముదుసలిదే నన్ను బంపినది. ఇదియే చీర, యేమియు సందేహము లేదనెను. అప్పుడు స్వామి "యీ కట్టుపల్లి రంగమ్మ రూపముతో వచ్చినవాఁడు భగవానుఁడు. కట్టుపల్లి రంగమ్మ యని పేరుచెప్పినదానికిని, నీవు గుర్తుపట్టిన దానికి సరిపోయెనుకదా!. ఇదియూ, కదలునదిగాదు. నీవు భయపడుచున్నావని, పురుషరూపమునఁ గానవచ్చిన వెంటవచ్చుటకు జంకుపడి యెదవనియు, నీ రూపమునఁ గానఁబడెను. భగవానుఁడు కాకపోయిన నా క్రిందట దినమునసే, కోడూరునుండి సమాజము జరుపుటకు, మనుష్యులు వచ్చిన దీ ముసలిదాని కెట్లు తెలియును ? కావున వచ్చినవాఁడు దయాసముద్రుఁడైన మాధవుఁడే" యని పలికెను.

అచట నున్నవారెల్లరును నీవిషయము చూచి యాశ్చర్యపడిరి. రామమ్మయు నిశ్చలభక్తురాలు. ఆమె మనస్సు కల్మషములేనిది. ఆమెకట్లు భగవంతుఁడు దర్శనమిచ్చెను. ఇది జరిగిన సంవత్సరమునకు సరిగా నా రామమ్మ పరమపదించెను.

కోడూరు సమాజము

కోడూరులో సమాజము జరుపుటకు నిశ్చయింపఁబడెను. స్వామి శిష్యపరివార సహితుఁడై బయలుదేఱి మొదటిదినమున మోదుమూడికిఁ జేరెను. రెండవనాఁటి మధ్యాహ్నమచటినుండి పదిపదునైదు బండ్లు గట్టించుకొని ప్రయాణము సాగించెను. స్వామిమహాదీర్ఘదర్శి. ఇఁకఁ బదిసంవత్సరములకుఁ గావలసివచ్చు సామగ్రినిఁగూడ వారిప్పుడే తమయొద్ద జాగ్రత్తపరచుకొనెడివారు. కాని యానాఁడేదో త్వరలోఁ ద్రోవలో ఎవరికైన మంచినీరు కావలసివచ్చునేమో యని యుదకమును వెంటగొనిపోవుట మఱచిరి. వారే మఱచిపోవగా నితరుల కెవరికి నా జాగరూకత యుండును ? కోడూరు, మోదుమూడి మధ్యలో మూడుక్రోసుల యెడారి యున్నది. అచట మంచినీరు దొరకదు. ఏ నీరును లభింపదు. బండ్లు సాగి యా యెడారిలోనికిఁ బోయెను. అది మంచి మండువేసఁగి. అచటికిఁ బోవుసరికి స్వామి మూడవకుమారుఁడు, దాహమగుచున్నది. మంచినీళ్ళిమ్మని యేడువసాగెను. స్వామి గుండె గుభాలుమెను. "అరరే! యెంత పొరపాటు జరిగినది యిప్పు డేమి కావలయును ? ఎటుబోయినను రెండుక్రోసులదూరమేగినఁగాని మంచినీళ్లు దొరకవు. అచటికేగి, నీళ్ళు తెచ్చువఱకును బిల్లవాని దాహమాగునా ? మన ప్రమాదమువలనఁ బిల్లవానిఁ జేతులారఁ జంపవలసివచ్చెనే! సర్వేశ్వరా! ఎన్నియాపత్తులో కొండంత వానిని గోరంతగాఁ దీర్చినావు. ప్రభూ! యీ సమయమున నన్నుమి చేయఁదలఁచితి"వని శ్రియఃపతిని ధ్యానించుచుండెను. శిష్యులెల్లరు విభ్రాంతులై చేయునదిలేక చూచుచుండిరి. పిల్లవాఁడు గగ్గోలుపడి రోదనమున కారంభించెను. ఇట్టిసమయమున భతవత్సంకల్పమున, నాపట్టిలో నెచ్చటిదో యొక పెంటప్రోవుబండి దూరములోఁ గానిపించెను. శిష్యులా బండికడకుఁ బరువెత్తి, బండివానిని, మంచినీళ్లున్నవా ? యని యడిగిరి. అతఁడును వెంట మంచినీళ్లతోఁ దెచ్చుకొనినిన తాఁబేటికాయ నిచ్చెను. దానినిఁ దీసికొనివచ్చి, యా యర్భకునకు నీరు ద్రావించిరి. భగవానుఁ డనుగ్రహించినందులకు స్వామి యెంతయు సంతసించెను. ఆహా! దైవమొనరించు నుపకారము లిట్లుండును ? ఆ సమయమునకు సరిగా నా పెంటబండి యచటి కేలవచ్చెను ? ఆ బండిరాక, మంచినీళ్ళు గొనిరాక, యుండిన, వారిపని యేమికావలయును ? కరుణాసముద్రుఁడైన భగవానుఁ డొనర్చు నుపకృతులు విలువగట్టరానివి.!

మందునేసంగిలోన నురుదేశమందున్న
నీ పదాశ్రితులకు లోపమున్నె ?
ఘోరామయంబున బారిలోపలబడ్డ
నీ పదాశ్రితులకు లోపమున్నె ?
పటుసింహశార్దూల చటులాటవుల నున్న
నీ పదాశ్రితులకు లోపమున్నె ?
అర్ధరాత్రమునఁ జోరాళిమధ్యకుఁ జన్న
నీ పదాశ్రితులకు లోపమున్నె ?
నీదు భక్తులకెట్లు ప్రమాదముండు
నఘవినాశన మఖిలలోకైకసుఖము
బహుళకల్యాణపదము నీ పాదసేవ
శ్రీశ! కేశవ! హరి! హృషీకేశ! దేవ!

కోదూరునుందు సమాజము మహామనోహరముగా ముగిసెను.

వేదవ్యాసుఁడు

మోదుమూడి యందును రామాయణభారతభాగవతములు పెక్కుసారులు స్వామిచేఁ బురాణముగాఁ జెప్పఁబడినవి. ఒకపరి మహాభారతకాలక్షేపమచట జగదానందముగా జరిగెను. ధర్మజ పట్టాభిషేకము రేఁపటిదినమున జరుగునని నిశ్చయమాయెను. అట్టితఱి కోదూరునందు బాపయ్య యనునొక చౌదరిగారి మనుమనికిఁ బెద్ద జబ్బు చేసెను. చికిత్సలేమియు నుపయోగింపక వ్యాధి ప్రబలి సంధించిపోయెను. బందుగులందఱు నతఁడు బ్రతుకుననెడి యాస వదలిరి. ఆ రాత్రి బాపయ్యగారును, వారికుటుంబమును నాబాలునిఁ జుట్టుకొని విచారగ్రస్తులై కూర్చుండిరి. అర్ధరాత్రమాయెను. అందఱును నిద్రావశులై యచటనే పరుండిరి. బాపయ్యగారు మాత్రము కూర్చుండి, యేదో భగవన్నామముఁ జేయుచుండెను. ఇతర సమయములలో లేకపోయినను నాపత్తులయందైన స్మృతికివచ్చునుగదా. ఆ యుద్ధమరేయి నట్లు కూర్చుండియుండగనే, "నాభక్తుఁడు, వేదవ్యాసుఁడు, మోదుమూడిలో భారతముఁ జెప్పుచున్నాఁడు. అచటికిఁ బోయిన, నీ మనుమనివ్యాధి తగ్గును. ప్రొద్దుననే లేచిపొమ్మ"ని స్పష్టముగా నొకశబ్దము వినఁబడెను. బాపయ్యగారు లేచి యీమాట లెవరుపల్కిరా యని యింటిచుట్టును దిరిగివచ్చెను. ఎచ్చటను నెవ్వరు లేరు. ఏమిటిది యని యాశ్చర్యపడుచు వచ్చి తనచోటునఁ గూర్చుండెను. "వేదవ్యాసుఁ డనఁగా నెవరో యనుకొనుచుంటివేమో పూడివాడ వేంకటదాసుగారురా"యని మరలఁ బెద్దగావినవచ్చె.

బాపయ్య గారు మరల నా పరిసరమంతయు, వెదకెను. ఎవరును గానరాలేదు. ఆహా! దైవమే యశరీరియై పల్కెనని నిశ్చయించి, "ప్రభూ! బాలకునికి వెంటనే తగ్గిన నట్లే తెల్లవాఱఁగనే బయలుదేఱి, మోదుమూడికి వెళ్ళెద"నని భగవంతుని ధ్యానించెను. తెల్లవాఱునప్పటికి సంధిపోయి పిల్లవాఁడు తేటకు వచ్చెను. బాపయ్యగారును దదీయులును మిగుల సంతోషించిరి. అంతట నాచౌదరిగారు తోడుగా మోదుమూడికి వెళ్ళుదము రమ్మని యాయూరి పోష్టుమాష్టరుగారినిఁ బిలిచెను. ఆయన తనకేవేవో గృహచ్ఛిద్రములున్నవనెను. అంత బాపయ్యగారు రాత్రిసంగతినంతయుఁ దెలిపి నీకష్టములన్నియుఁ గూడఁ దీఱును. వేంకటదాసుగారు వేదవ్యాసుఁడఁట. వారిని దర్శింపవచ్చు" నని చెప్పి యాతని వెంటఁగొని యెనిమిదితొమ్మిది గంటలగుసరికి మోదుమూడికి వచ్చెను. ఆనాఁడే పట్టాభిషేకమగుటచే ఎక్కడి నుండి వచ్చెనో, మహాప్రజ మోదుమూడి యంతయు మూగియుండెను. స్వామి భారతోపన్యాసమును గంగాప్రవాహమువంటి మహాధోరణిలోఁ గావించుచుండిరి. జనమా వాక్యము లాలించుచు నిస్తరంగ సముద్రమువలె నుండెను. అట్టితఱి బాపయ్యగారెట్లెట్లో స్వామి వేదిక సన్నిధికిఁ జేరెను. ఆయన మహారాజసుఁడు, ధైర్యపరుఁడు. ఎవరిని లక్ష్యము చేయని స్వభావము గలవాఁడు. అట్లు సమీపించి స్వామికి నమస్కరించి "యయ్యా మీకుఁ బదిపదునైదు సంవత్సరములనుడి కనఁబడినపుడెల్ల నమస్కరించుచునేయున్నాను గాని యా నమస్కారములు నిష్కల్మషములైనవికావు. ఈనాఁడు మాత్రమే నేను బారిశుద్ధ్య సహితముగా దండముఁబెట్టుచున్నాను" అనెను. మరల "నెందువలననని యడుగరేమి ?" యని స్వామినిఁ బ్రశ్నించెను. నేనడుగనేల మీరే చెప్పుదురుగదా యని స్వామి వచించెను అప్పుడు బాపయ్యగారా ప్రజయెల్ల వినుచుండఁగాఁ దన మనుమని వ్యాధియు, రాత్రి జరిగిన యుదంతమును, వినఁబడిన మాటలను విశదముగాఁ దెలియఁజెప్పెను. విని యెల్లవారును సంతసమును నాశ్చర్యమును బొందిరి.

గోపికావిలాసరచన

1941వ సంవత్సరమున స్వామికి నుదరమునందొక శూల కలిగెను. ఏవేవియో చికిత్సలు చేసిరి. వారెప్పుడును చికిత్సలు చేసెడివారేకారు. ఇతరుల నిర్బంధమువలన నేమైనఁజేసిన వానివలన వారికి, మేలుకలుగకపోగా విపరీతఫలముగూడ వచ్చెడిది. అన్నిటికినీ వారికి భగవానుఁడే, "మంత్రోऽహ మహమౌషధమ్మ"న్నట్లు, మంత్రము నౌషధమును, సర్వము వేణుగోపాలుఁడే యని వారి దృఢాధ్యవసాయము. స్వామి యుదరశూలతో బాధపడుచు, సర్వేశ్వరా! నీ సేవకుఁగూడ నీవ్యాధి యంతరాయము కలిగించుచున్నది. ఒకవేళ ననుభవనీయమైన ప్రారబ్ధమైనచో, భవత్పాదభజనమునకు నడ్డురానియట్లు

సహనీయముగానైన శాంతింపఁ జేయుమని, రామునికిఁ బ్రపత్తిచేసెను. అంత నొకనాఁటి మధ్యాహ్నమున మానసమున సాక్షాత్కరించి భగవానుఁడు, గోపస్త్రీల భక్తిప్రభావము నొక ప్రబంధముగా రచియింపుడు. మీ బాధ శాంతించునని, యానతిచ్చెను. స్వామియు గ్రంథము నారంభించెను. ఉదరశూల కానరాకుండఁబోయెను. గోపమహిళలు, కృష్ణానుభవము చేసిన విషయము నంతయును, ఐదునొకండు వందల పద్యములతో 'గోపికావిలాస'మనుపేరఁ బ్రబంధమును వ్రాసిరి. గ్రంథము ముగిసినపిదప నా సంవత్సరము వైశాఖమాసమున నశ్వరావుపాలెములో జరిగిన యతీశ్వరజయంతి సమయమున నామూలాగ్రముగా శిష్యులకు వినిపించిరి. అందు స్వామి నిక్షేపించిన యా భక్తివైభవమునకు, ముగ్ధులై వివిధగ్రామవాసులైన భాగవతు లెల్లరు నా గ్రంథము ముద్రితమైన నెందఱో తరించుటకు వీలుగానుండునని తలంచి ముద్రణవ్యయమునకు సరిపడునట్లుగాఁ జందాలు వేసికొనిరి. ఆ డబ్బుతో యా గ్రంథరాజమును ముద్రింపించి లోకమున కందఁజేసెను. భక్తి జ్ఞాన వైరాగ్య నిధానములై, మహనీయ కవితామహితములై, వెలయు స్వామి పవిత్ర గ్రంథముల మహిమ వానిఁ జదివినవారికే దెలియును. హృదయగతములైన భక్తి వైరాగ్యములను వాఙ్మయ రూపముగా శాశ్వతమగునట్లు నిక్షేపించిన స్వామి యమూల్యగ్రంథములను జదివి యాంధ్రులు తరింతురుగాక!

పర్యటనము

స్వామి కుటుంబము దైవానుగ్రహమునఁ బెరిగెను. ఏడెనిమిది తరములనుండి వారి వంశములో నెంతమంది జనించినను నొక్కఁడు మాత్రమే నిలుచుచుండెను. వేణుగోపాల ప్రతిష్ఠతో నా వంశమునకుఁ జుట్టుకొనియున్న పాపము నశించినదనియుఁ గుటుంబము వృద్ధినొందెననియు స్వామి సంతసించెను. కుమారులయుఁ, గూఁతులయుఁ, బెండ్లిండ్లు పేరంటములు వచ్చెను. ఆస్తిమీఁద వచ్చు నాదాయమంతయుఁ గుటుంబమునకే సరిపోవు చుండెను. దేవాలయమున మిగిలియున్న గోపుర ప్రాకార మంటపాదుల నెట్లు నిర్మింపవలయునా యని రేపగలు స్వామి కొకటే విచారమాయెను. వారికి సాంసారిక చింత లేమియును లేవు. దేవతాకార్యము పూర్తియగుటెట్లా యనునది యొకటి మాత్రమే మనసున నిలిచిపోయెను. విద్యాబలమున దేశముమీఁదఁబడి ప్రోవుచేయవలయునని యెన్నిసారులో ప్రయత్నించిరి. దైవసంకల్పమేమో ప్రతిపర్యాయమును నేదోయొక విఘ్నము కలుగుచునే యుండెను. ఇట్టి పరిస్థితిలో దేవతాకార్యమును గూర్చి చిత్తమున నాందోళన హెచ్చినపుడు, దేవాలయార్చకులు, శిష్యులు మొదలైనవారినిఁ జేర్చి "వీఁడు, నన్నూరకొననీఁడు. చేయఁ బ్రయత్నింపఁగా సాగనీయఁడు. పిల్లి యెలుకను హింసించినట్లు

చేయుచున్నాఁడు. సర్వశక్తుఁడైనవాఁడు పంతమున నడ్డుపెట్టుచుండఁగా, నశక్తుఁడనైన నేనేమి చేయఁగలను. పోనీ నీవంటి హీనునితో నే నీకార్యమును జేయించుకొనఁదలఁపలేదూరుకొమ్మనియైనఁ జెప్పఁడు. ప్రేరించి విఘ్నమాచరించుచున్నాఁడు. ఇది యేమివిలాసమో" యని సర్వేశ్వరుని మీఁదనే విసుఁగుకొనుచుండెడివారు దేవాలయసంబంధమైన వారి యాచింత చెప్పనలవి కానిది. సర్వసంపూర్ణమై నిఖిలభోగాస్పదమైన వారి జీవితమున నిదియే పెద్దబాధయాయెను. ఆ దేవాలయ సమస్య వారి నెంతగా బీడించెనో వారిగ్రంథములవలనఁ దెలియును. ఆ గ్రంథము లముద్రితములగుటవలన వానిలోని గొన్నిపద్యము లుదహరించుచున్నాను.

సంకోచింపక, యాచనాపరుఁడనై, స్వల్పాశయాన్వీతులై
పంకంబొందిన, మానవాధములచేఁ బ్రాపించు విత్తంబు, నీ
కైంకర్యార్థము చాలదయ్యె, నది దుఃఖంబిచ్చె, నీక్షించి, నా
శంకం బాప విదేమికారణమొకో, సర్వేశ, గోపాలకా.

ఆస్తిం బుత్రులకిచ్చి వృత్తులను సే, యన్ మానితిన్ శక్తి వి
ధ్వసంబయ్యెను, వార్ధకంబడరె, దేవా నీ పదాంభోరుహో
పాస్తిం జేసితి, సర్వశక్తుఁడవు. సౌభాగ్యప్రదుండున్ దయా
విస్తారుండవు, గానఁ బ్రోవ నిటురావే, వేణుగోపాలకా!

ధన సాధ్యక్రియ, నాపయిన్నిలిపి విత్తంబీక వేధించె, దీ
వనఘా! నీ కపకీర్తి నాకు విపులాయసంబు చేకూరె, ని
ప్పని చాలించి వరంబు లిమ్ము కరుణాపారీణచిత్తంబుతో
ఘనతం గూర్పుము, పూడివాడ, కిలపైఁ గల్యాణగోపాలకా!

(గోపాలకాష్టోత్తర శతకము)

సీ. ముప్ప దేడులనాడు మొనసి దేవళము ని
ర్మింపుమీ యని నియమించినావు
నే నాలయంబట్లు నిర్మింప వేణుగో
పాలాహ్వయంబుతో నాలయమున
నిలిచి యుంటివి విత్తనికరంబు లేకున్కిఁ
గడచుటె ట్లింకముందు కార్యములని
తలపోయ నొక రాత్రి ధాత వాల్మీకితో
స్వప్నంబునందు సాక్షాత్కరించి

పలికె రామాయణంబు ముప్పదియు రెండు
సారుల పఠింప నీ వాంఛ తీరుననుచు
జానకీరామ బ్రహ్మాండ సార్వభౌమ
భద్రగిరిరామ భద్రకృపాసముద్ర.

* * *

సీ. ధాతవల్కినమాట తథ్యంబుగా నీవు
సౌమిత్రితోఁగూడి స్వప్నమందుఁ
గనిపించి భద్రనగముఁ జేరి యిప్పనిఁ
గావింప మంటి వక్కరణి నేను
భద్రాద్రి కరుదెంచి భక్తితో రామాయ
ణము పఠించితిని గార్యము ముగించి
యిరువదియై దేడు లేగె నిప్పటికి సా
ఫల్యంబు గనదాయెఁ బని మదీయ
పాపమో నీ వసత్యంబు పల్కినావొ
పల్కువాఁడవు గా వీ వబద్ధవార్త
జానకీరామ బ్రహ్మాండసార్వభౌమ
భద్రగిరిరామ భద్రకృపాసముద్ర.

సీ. ఇక్కార్య మొనరింప నేగి ధనార్థినై
దేశదేశములందుఁ దిరిగినాఁడ
మానవాధముల సమక్షమందునఁ జేరి
దీనత్వమొప్ప నుతించినాఁడ
ఫలము కల్గినచోట లలి నుత్సహించి వి
ఫలమైన సావిలోఁ గలఁగినాఁడ
నెన్నాళ్ళకును ఫలంబీయఁడు దైవ మిం
కేమిచేయుదునంచునెంచినాఁడఁ
గోర్కెఁదీర్పు మశక్తిఁ గైకొంటివేనిఁ
జింతలడఁగించి యేకాంతసేవ నిమ్ము
జానకీరామ బ్రహ్మాండసార్వభౌమ
భద్రగిరిరామ భద్రకృపాసముద్ర.



మాదివాడ హనుమంతరావుగారు, (వారి ధర్మపత్ని) వేంకటసుబ్బమ్మ గారు.

సీ. ఏఁబదేఁడులనుండి యేప్రాయమందైన
నీపాదసేవలో నిలిచినాఁడ
నీవు ముందిత్తువనెడి ధైర్యమున సొంత
ధనము నీకర్పించుకొనినవాఁడ
ద్రవ్య వ్యయంబయ్యె దానిచేఁ బనియు స
ఫలము గాలేదని వగచినాఁడ
నే నశక్తుండనై గ్లానిఁజెందుట నిరీ
క్షించియు నేమి తలంచినావొ
ముసలి తనమునఁ బసలేక వ్యసనమొందు
నన్నిటులు బాధలొందింప, న్యాయమగునె
జానకీరామ బ్రహ్మాండసార్వభౌమ
భద్రగిరిరామ భద్రకృపాసముద్ర.

సీ. దినమున కొకరోగ మెనయించుచున్నాఁడ
వపవాదముల కాలయం బొనర్చి
కాఱించుచున్నావు కడువిపత్తులపాలు
సేయుచున్నావు, నా చిత్తమందుఁ
గడలేని విభ్రాంతిఁ గలిగించుచున్నావు
నే నోర్వఁజాల మన్నించి యింక
నైన ననిష్టంబులన్నియుఁ దొలఁగించి
యనువుగాఁ జేయు మిష్టార్థసిద్ధి
శీఘ్రమునఁ గార్యసంసిద్ధిఁ జేయుమయ్య
వంతలొందింపకుము బలవంతముగను
జానకీరామ బ్రహ్మాండసార్వభౌమ
భద్రగిరిరామ భద్రకృపాసముద్ర.

సీ. సన్నాయికట్ల వేసరకూది యొక్కండు
సమకూర్చినాఁడు లక్షలధనంబు
కొయ్యఫిడేలుకైకొని యొక్క మానవుం
డార్జించినాఁడు మహాధనంబు
సభలలోఁ జేరి హాస్యముసెప్పి యొకఁడు రా
క్కముఁగూర్చినాఁడు బొక్కసమునిండ

సట్టి ధన మఖిలేశుఁడవైన నిన్ను
నాశ్రయించియుఁ బొందలేనైతి సకట!
జానకీరామ బ్రహ్మాండసార్వభౌమ
భద్రగిరిరామ భద్రకృపాసముద్ర.

సీ. బహుధనచయము సంపాదించె నొకఁడు సం
తతమును ధూమపత్రంబులమ్మి
పరిమితిలేని బంగరుఁగూర్చె నొక్కండు
బొగ్గులబేర మింపుగనొనర్చి
మంచి మానికము లార్జించె నొకఁడు నిరం
తరమును గలపవర్తక మొనర్చి
మేడలు కొట్లు నిర్మించె నొక్కండు బీ
రముతోడఁ దోళ్ళబేర మొనరించి
కాని నిన్నాశ్రయించి కైంకర్యమునకు
దుడ్డుసమకూర్పలేక వ్యర్థుండ నైతి
జానకీరామ బ్రహ్మాండసార్వభౌమ
భద్రగిరిరామ భద్రకృపాసముద్ర.

సీ. కవి యను నామంబు కలిగించినావు స
త్కవితచే వచ్చు రొక్కంబులేదు
హరికథలందు నేర్పరిఁజేసినావు త
త్కథలచే వచ్చు రిక్థంబులేదు
సభలలో భూరి యశస్సుఁగూర్చితివి య
శస్సుచే వచ్చు విత్తంబులేదు
ద్రవ్యాతురులను బాంధవులఁ జేసితివి బాం
ధవులచేవచ్చు విత్తంబులేదు
కావలసినట్టి నీదు కైంకర్య మింక
నేవిధంబున నెఱవేర్తు నినకులేశ
జానకీరామ బ్రహ్మాండసార్వభౌమ
భద్రగిరిరామ భద్రకృపాసముద్ర.

(భద్రగిరి రామభద్ర శతకము)

సీ. శ్రీరంగ కైంకర్యసిద్ధికై పరకాల
 ముని కీయవే మహాధనచయంబుc
బాంధ్యభూపతి సభాభవనమందు జయంబు
 విత్తమీయవె విష్ణుచిత్తమునికి
యాదవాచల నిర్మితాలయార్థం బుడై
 వరులకీయవె లిబ్బి వలసినంత
గోపన్న కాపత్తు వాపి మ్లేచ్ఛుని యప్పు
 దీర్పవే మును స్వాపతేయ మిచ్చి
గొప్పవారని నాc డట్లు కూర్మి నెఱపి
నీచుcడని నన్ను నిరసింప నీకుcదగునె
వర్ధిత విలాస శ్రీపూడివాడవాస!
వేణుగోపాల!జగతీపవిత్రశీల!

సీ. దమనోత్సవంబు లుద్యానోత్సవములు ప
 క్షోత్సవమ్ములును మాసోత్సవమ్ము
లబ్దోత్సవంబు లధ్యయనకల్యాణబ్ర
 హ్మోత్సవంబులు పల్లవోత్సవములు
నీవు గైకొని సూరినికరముల్ సంస్కృత
 ద్రావిడామ్నాయము ల్తవిలి చదువ
నీస్థలంబున రథమెక్కి యూరేcగుచో
 జనులు నీచుట్టు లక్షలకొలంది
గమనమొనరింపc జూచు భాగ్యంబు మాకు
నేcటినుండి యొసంగుమో నీరజాక్ష
వర్ధిత విలాస శ్రీపూడివాడవాస!
వేణుగోపాల!జగతీపవిత్రశీల!

* * *

సీ. ధనముc గోరుటcజేసి ద్రవ్యార్థిcగాను జి
 జ్ఞాసువుగా నార్తజనుcడcగాను
ధనసాధ్యమైన నీ పని పూర్తిcగావించు
 భారంబు నామీcదcబడి కలంచు

హేతువుచేత నీరీతి నాసించితి
సదిగాక పూర్వమా యబ్జభవుని
చే వరంబిప్పించి నీ వీయకొనియుంటి
వక్కారణమున నిట్లడుగుచుంటిఁ
గోపపడకిమ్ము గుడికుండు కొఱఁతలెల్లఁ
దీర్చి రక్షింపుమయ్య దైతేయహరణ
వర్ణిత విలాస శ్రీపూడివాడవాస!
వేణుగోపాల!జగతీపవిత్రశీల!

※ ※ ※

సీ. సర్వశక్తుఁడవయ్యు శరణాగతుని వాంఛ
రద్దుచేయఁగ నేలరా ముకుంద!
కరుణాంబురాశివై కాఠిన్య మాశ్రితు
నందుఁ జూపఁగ నేల నందపుత్ర!
సరసీరుహాలయాజానివై దాసుని
దీనుఁజేయఁగనేల భానుతేజ!
వరవిభూతిద్వయస్వామివై సేవకు
నాదరింపవదేమయా మురారి!
తెలిసి చెప్పితి నిఁక నైనఁ గలఁచు టుడిగి
సుఖముఁ జెందింపుమయ్య యశోనిధాన
వర్ణిత విలాస శ్రీపూడివాడవాస!
వేణుగోపాల!జగతీపవిత్రశీల!

※ ※ ※

సీ. స్వాపతేయంబిచ్చి యీపని పూర్తిగా
వింపుమారీతి నుంకింపవేనిఁ
గార్యనిర్వాహకోత్కంఠఁ దొలంగించి
దిగులు పోఁగొట్టి త్వద్దివ్యపాద
పద్మంబులందు సద్భక్తి నిల్కడఁజేసి
కొనిపొమ్మునన్ను వైకుంఠమునకు
ముదుసలితనమబ్బె బ్రదుకుపై రుచి తగ్గ
'సర్వలాభాయకేశవ' యటందు

రదియు సత్యంబెగాని హాస్యంబుగాదు
దిక్కులేదయ్య నా కీవుదక్క వేఱు,
వర్ణిత విలాస శ్రీపూడివాడవాస!
వేణుగోపాల!జగతీపవిత్రశీల!

(పూడివాడ వేణుగోపాల శతకము)

1942వ సంవత్సరమున దేవాలయమునకుఁ బ్రాకారమును నిర్మించుటకై దేశాటనమొనర్ప స్వామి కొలఁదిమంది శిష్యులతో బయలుదేఱెను. అప్పటికి భగవానుఁడు ముగ్గురు కుమారులను బండితులను గావించి స్వామికి విద్యావిషయమున వాఁదోడుగాఁ జేసెను. వెంట స్వామి పురాణమును జదువుటకై మూడవకుమారునిఁ దీసికొనిరి. తొలుదొల్త రేపల్లెతాలూకాలోని కూచినపూడి యను గ్రామమునకు వెళ్ళిరి. తద్గ్రామవాసులు స్వామినిఁ బూజించి గౌరవించిరి. అచట నొక వారమురోజులు కుమారుఁడు చదువుచుండగా స్వామి పురాణము జెప్పిరి. గ్రామీణులును భగవత్కైంకర్యమునకుఁ దమ శక్తి కొలఁది ధనసహాయ మొనరించిరి. స్వామి యటనుండి బయలుదేఱి, దీవిలోని కమ్మనబ్రోలు, బట్టెంకల, రేమాలవారిపాలెము మున్నగు గ్రామములందుఁ బర్యటించి, భోగిరెడ్డిపల్లె మీఁదుగా, మల్లోలు వఱకు నేగి విఘ్నము కలుగుటవలన నచటనుండి తిరిగి వక్కపట్లవారిపాలెముఁ జేరిరి. అచటనున్న శిష్యులతో నిరంతర భగవద్గుణానుభవముఁ జేయుచు నా చుట్టుప్రక్కలనున్న, నాగాయలంక, నంగేగడ్డ, మున్నగు నూళ్లయందుఁ జందా వసూలు చేసిరి. ఆ సంవత్సరమునకు నంతటితోఁ బర్యటనము ముగిసిపోయెను. రెండవసంవత్సరమున మరల నూఱుపిడులైనపిదపఁ గుమారునిఁ బరివారమును వెంటఁదీసికొని, బయలుదేఱిరి. ఆసారి సరాసరి గుడివాడకు నేగిరి. గుడివాడకు సమీపములోనునున్న బేతవోలను నూరఁగల భక్తులు కొందఱు స్వామినిఁ బూజిచి సత్కరించిరి. అచటనుండి కైకలూరు తాలూకాలోని సింగనపూడికిఁ బోయిరి. స్వామి మహత్త్వ మెఱుఁగుదురుగానఁ దద్గ్రామీణులును, బూజించి, కైంకర్యమునకు సహాయమొనర్చిరి. చావలి వాస్తవ్యుఁడు వేంకటసుబ్బయ్య యను శిష్యుఁడు వెంటనుండెను. ఈయనకు స్వామి యందును, భగవంతునియందును సమాన ప్రతిపత్తి. అట్టి యంతరంగ శిష్యుఁడు. స్వామికిఁ బరిచర్యచేయువారిలో నగ్రేసరుఁడు. అట్టి వేంకటసుబ్బయ్యగారికి నచటికేగుసరికి విరేచనములు ప్రారంభించి యెన్ని చికిత్సలు చేసినను దగ్గక ప్రబలిపోయెను. ఇఁక నాయన యచట నుండలేక, స్వామికడ సెలవుఁదీసికొని స్వగ్రామమునకుఁ దిరిగిపోయెను. చేతిలోని యాయుధమువంటి శిష్యుఁడు వెనుకకుఁ దిరిగిపోవుటచే స్వామికి, నిఁకఁ బర్యటించుటకు వీలుగాకపోయెను. తిరిగి బందరు మీఁదుగా నవనిగడ్డకుఁ జేరెను. అవనిగడ్డలో బస్సుదిగునప్పటికి, రాత్రి షుమారు తొమ్మిదిగంటలాయెను.

అచటికి నొకమైలు పైచిలుకుగానున్నది మోదుమూడి. మూడవకుమారుడును, బాడివాడవాసి, రామదాసను నొక శిష్యుడును వెంటనుండిరి. గ్రంథములును బాత్రసామగ్రియుఁదోడ బోలెడుబరువుండెను. పాప మా సామాగ్రినంతయు రామదాసే, యాంజనేయస్వామివలె వీఁపున, మూపునఁ గట్టుకొనెను. కుమారునికిని నేదొ కొలదిబరువెత్తి స్వామి, యీ యర్ధరాత్రమున నెట్టియిక్కట్లపాలుజేసితివిరా యని వేణుగోపాలునిమీఁద విసుగుకొనుచుఁ జీఁకటిలో బాధపడుచు వెళ్ళుచుండిరి. త్రోవలో మోదుమూడివారు కొందఱు గలిసిరి. వేంకటదాసస్వామి యనఁగనే విభ్రాంతిపడి వారు నమస్కరించి యీ మూటలు, ముల్లెలు తలయొకటి యెత్తుకొని మోదుమూడి చేర్చిరి. స్వామి యాకస్మికాగమనమున, కచటి శిష్యులెల్లరు విస్మయపడి, పరివేష్టించిరి. బయలుదేరిన దగ్గఱనుండి యప్పటివఱకు జరిగినదంతయు శిష్యులకుఁ దెల్పిరి. రెండవదినము మొదలుకొని, యీ పరిసరగ్రామములఁ బర్యటింపవలెనని మొదట మోదుమూడియందే బ్రాకారనిర్మితికై చందా వసూలు చేయనారంభించిరి.

మాతృవియోగము

స్వామి యింటిదగ్గఱనుండి బయలుదేఱిన యెనిమిదవదినముననే కృష్ణవేణమ్మగారు పరమపదించెను. ఆమె కప్పటి కఱువదియెనిమిది వత్సరములు. ఇంకను బాగుగాఁ దిరుగుచునే యుండెను. దృష్టి మాత్రమప్పటికి నాలుగైదు సంవత్సరములనుండి తగ్గిపోయెను. పరమపదించునాఁటి రాత్రికూడఁ జాలఁబ్రొద్దుపోవువఱకు మనుమలతో నేవేవియో ముచ్చటలు చెప్పి యామె పరుండెను. ఆ నిద్రలోనే యామె విష్ణుసాన్నిధ్యమున కరిగెను.

స్వామి యింటలేని సమయమున జరిగిన యీ సంఘటనమున కింటిలోని వారెల్లరును గలఁగి కష్ణవేణమ్మగారి కామె పెద్దయల్లునిచే నగ్నిసంస్కారము చేయించిరి. స్వామి గుడివాడలో నుండిరేమో యని యచటికిఁ దంతినిచ్చిరి. వారప్పటికే తిరిగి మోదుమూడికిఁ జేరి యుండుటవలన నా తంతివలన నుపయోగము లేకపోయెను. ఎవరినో యొకరిని స్వయముగా గుడివాడ ప్రాంతమున నెందైన నుండిరేమో యని వెదుకఁబంపిరి. ఇంతలో స్వామి మోదుమూడికి వచ్చిరన్నవార్త తెలిసెను. వెంటనే స్వామి కీ వార్త వెళ్ళిపోయెను. వారును దల్లి మృతి వార్తకేమియు జింతపడలేదుగాని, భగవత్కైంకర్యమున కడ్డువచ్చెనే యని విషాదపడిరి. పడియుఁ "గావలసినదేమో యైపోయినది. ఇప్పుడు నేవచ్చి చేయునదిలేదు. నాలుగుదినములు గడచిన తరువాత దేవతా కైంకర్యము గొంతవఱకు నిర్వహించివచ్చి, యుత్తరక్రియలు చేసెదనులె"మ్మని యింటికిఁ గబురుచేసిరి. ఆ వార్తను విని "తల్లి చనిపోవఁగా నిట్లు రాకుండుట యేమి ? సమస్తశాస్త్రము లెఱిఁగిన

యట్టిపండితులిట్లు చేయవచ్చునా ?" యని సామాన్యధర్మమును మాత్రమే యెఱింగిన బంధుగ్గు లెల్లరును గుమారులతో గోలపెట్టసాగిరి. ఆ గోల పడలేక పెద్దకుమారుండైన శ్రీనివాసపెరుమాళ్ళుగారే మోదుమూడికి వెళ్ళి, యావిషయమును స్వామికిఁ దెల్పెను. అంతవారు సామాన్య విశేష ధర్మములన నేమియో యెఱుంగక యొనర్చిన యొత్తిడికి బంధుగులఁ గోపించి పర్యటనమును ముగించి, యింటికివచ్చి, కృష్ణవేణమ్మగారి కౌర్ధ్వదైహిక క్రియలను వైభవోపేతముగాఁ గావించిరి.

ప్రాకార నిర్మాణము

స్వామి యొకరేయి నిద్రవోవుచుండఁగా గలలో నొక పెద్ద యుద్యోగివలె భగవానుఁడు, మితిలేని పరివారముతోఁ గానిపించి "మీకు రేఁపటినుండియె జ్వరము వచ్చును. అది పదిరోజులుండును, మీరేమియు భయపడక స్థాయిగా నుండు"డని చెప్పెను. మెలకువ రాగానే స్వామి యపుడే రాధమ్మగారిని లేవఁగొట్టి స్వప్నమును జెప్పిరి. ఆమెయు "నయ్యో బాగుగానున్న మీకాపాడుకల యేలవచ్చె"నని విషాదపడెను. తెల్లవాఱినపిదప స్వామికి జ్వరమారంభమాయెను. స్వామి దేవాలయమందున్న యర్చకస్వామి వైద్యమునందు మంచి నిపుణుఁడు. ఆయన యేవేవియో యౌషధము లిచ్చిచూచెను గాని జ్వరము నూటమూడు డిగ్రీలకేమియుఁ దగ్గకయుండెను. జ్వరముచే నొడలంతయుఁ గుందుకొనిపోవుచున్నను, స్వామి ప్రతిదినమును స్నానము యథావిధి చేయుచునేయుండెను. స్వరూపధారణ మొనర్చును. పథ్యములేక నోటికి హితమైనదానిఁ గొలఁదిగా భుజించును. మధ్యాహ్నము మామూలుగా నిద్రవోవును. చూడవచ్చిన శిష్యులకు భగవద్గాథలు చెప్పును. ఇట్లు పదిదినములు గడచెను. పదునొకండవ దినమున జ్వర మెటువోయెనో యికఁలేదు!

పూడివాడలోని యొక పెద్దమనుష్యుఁడు చూడవచ్చి, స్వామి జ్వరములో మామూలుగా స్నాన భోజన శయనాదులట్లు చేయుట విని తనకును జ్వరమురాగా, నట్లే స్నానమొనర్చి భోజనముచేసి నిద్రవోవసాగెను. రెండుదినము లగునప్పటికి జ్వరము ప్రబలి సంధించి పోయెను. ఆయనను వైద్యాలయమునకుఁ గొనిపోవఁగా నొక నెలరోజులకు బ్రతికి యిలుసేరెను. పులినిఁజూచి నక్క వాఁతపెట్టుకొనినట్లు, భగవద్బలముగల యట్టి మహాత్ములు చేసిరని, సామాన్యులును నా పనులు చేసిన బ్రతుకఁగలరా ?

కొలఁది దినములకు స్వామికిఁ బూర్ణారోగ్యము కుదిరెను. అశ్వారావుపాలెము, రామచంద్రపాలెము, క్రొత్తపేఁట, మాచవరము మున్నగు గ్రామములలో స్వామి చందాలువేసి వసూలుచేయఁగా మిగిలిన చందాను మోదుమూడి శిష్యులు వసూలుచేసి పంపిరి. అప్పటివఱకు దేశాటనమున నార్జించిన యా విత్తముతోడను, నా వత్సరమునఁ జావలిలో

జరిగిన బురాణకాలక్షేపమునందు శిష్యులర్పించిన ద్రవ్యముతోడను స్వామి దేవాలయప్రాకారమును సుందరముగా నిర్మింపఁజేసెను.

రామమందిర స్థాపనము

దీవిలోని వక్కపట్లవారిపాలెము, మునసబు వేంకన్నగారు. ఈయన నూతెకరములు గల భూస్వామి. స్వామికి దగ్గఱిబంధువు. వీరి భార్య బందరునందుఁ బేరొందిన న్యాయవాది శ్రీ వేంకటరమణయ్య నాయఁడుగారి చెల్లెలు. ఆమెకొక పర్యాయ ముదరమునందు నొకశూల గలిగెను. దానితో నామెపరుండుటకు దిరుగుటకు నాహారముఁ గొనుటకుఁ గూడ వీలుగాక మహాబాధపడుచుండెను. ఎంతమందియో యాయుర్వేద వైద్యులును, నాంగ్లవైద్యులు నౌషధము లిచ్చిరి. కాని యా శూల యేమియుఁ దగ్గకపోయెను. భూతవైద్యములు చేయించిరి. పెదారకట్ల దగ్గఱనుండి యాంక్షలు దెప్పించిరి. ఎన్ని చేసినను నది యణుమాత్రమును దగ్గక యుండెను. మూడుమాసములు గడచెను. ఆమె చిక్కి, శల్యావశిష్టయై, మంచమునుండి లేవలేకపోయెను. అట్టి సమయమున స్వామి మోదుమూడికి వచ్చిరన్న వార్త విని వేంకన్నగారొక బండి కట్టించుకొని మోదుమూడికి వచ్చి స్వామిని దర్శించి, విషయము నంతయుఁ దెలిపి "యిఁకఁ జేయవలసిన మనుష్యప్రయత్నమేమియు లేదు. దైవబలమునకుఁ జాలినది లేదుగదా! దైవస్వరూపులైన మీరేమైనఁ జేసిన నామె బ్రదుకును. లేకున్న జీవించునట్లు లేదు. ఒక్కసారి వచ్చి చూచిపొం"డని స్వామి నర్థించెను. వేంకన్నగారి భార్యయు స్వామి యందత్యంత భక్తిగల సాధ్వి. అందువలన స్వామియు, నామెను జూచి వచ్చుట కంగీకరించెను. మోదుమూడిలోని పనులు ముగించుకొనివారు కొలఁది దినములకు వక్కపట్లవారిపాలెమునకుఁ గొంతమంది శిష్యులతో నేగిరి. వేంకన్నగారి భార్య పైకి లేచు స్థితిలోఁ గూడ లేనందున మంచమునఁ బరుండియే స్వామికి నమస్కరించెను. "అమ్మా నీ బాధ యెట్లున్న" దని, వారు ప్రశ్నింపఁగా నామె, "నేను బ్రతికి యీబాధ భరించునట్లు లేదు. ప్రాణములా పోవు. కాలము జరుగుటలేదు. చెప్పుట కనువుపడని వ్యధలో నున్నా"నని బదులుచెప్పెను. వెంటనే స్వామి యప్రత్నముగా, "నేను నీ బాధ నివారించిగాని, యేఱుదాఁటను లె"మ్మని పలికెన. అందఱును సంతసించిరి. కొంతవడి సంభాషించి స్వామి యీవలికి వచ్చెను. శిష్యులు "స్వామీ! యేమిటట్లంటిరి ? ఎన్ని చికిత్సలు చేసినను దగ్గక యట్టిస్థితిలో నున్న యామెను మీరెట్లు బాగుజేయుదు'రని ప్రశ్నించిరి. స్వామియు మాట తూలినందులకు విచారవడి, "యామాటలు నేను బ్రయత్నపూర్వకముగా ననలేదు. ఆకస్మికముగా వచ్చినవి. కానిందు సర్వేశ్వరుఁ డామాటలు నానోటినుండి యేల పలికించెనో తెలియదు. "రామో ద్వి ర్నాభిభాషతే" రాముఁడసత్య మాడువాఁడు గాదు తద్భక్తులమైన

మాకును నసత్యవాద దోషమెట్లు సంభవించు ?" నని యాసాయంకాలము రామము సహస్రము జపించి, వేంకన్నగారి భార్యకుఁ దీర్థమిచ్చిరి. మూడుమాముల నుండి యేకగ్రీవముగా వేధించుచున్న, శూలతగ్గి, యారేయి యామె నిద్రించెను. ప్రొద్దుననే స్వామి యెట్లున్నదని యడిగిరి. మూడునెలలకుఁగా, నీ రాత్రి మీయనుగ్రహమున నిద్రవోయితినని యామె చెప్పెను. స్వామియు, శ్రీశుఁడు కరుణించినందులకు సంతసించి యిక రెండుపూట లట్లే తీర్థ మిచ్చిరి. ఆమె శూలయు మరల నంతు లేకుఁడఁ బోయెను. చూచితిరా! తపోబలము? ఎన్ని యౌషధములకును లొంగని శూల మూడుద్ధరణల జలముతో సమసిపోయెను. భగవన్నామము చేయలేనిదియు, భగవద్దాసుల కసాధ్యమైనదియు, నేదిగలదు? భగవత్సేవా మహిమను గొనియాడ నేరి తరమగును ? "నరసింహ నీదివ్య నామమంత్రముచేత బలువైన రోగముల్ వాపవచ్చు" నన్నమాట యనుభవముతోఁ జెప్పినది గాని వట్టి మాటయా ?

వేంకన్నగారి భార్య కారోగ్యము వచ్చెను. ఆ గ్రామీణులు కొంతమంది "మీయూరిలో నొక దేవాలయమును బ్రతిష్ఠించితిరి. ఇది మీజన్మస్థానము గావున నిట నొక రామమందిరమును గట్టింపుఁడు. మీరులేనిదాపని మావలనగాదు. గ్రామమునఁ జందావేసి చేయుద"మని స్వామిని బ్రార్థించిరి. అంతకంటె గావలసినపని నాకేమున్నదని స్వామియు సంతసించెను. ఆయూర మొదటినుండియుఁ గాలువకట్టలు మొదలైనవాని పాటల మీఁద వచ్చు ద్రవ్యమును రామునికిగా వేఱుచేయుచుండిరి. కొంతద్రవ్యము పెక్కేళ్ళనుండి యెవరిది వారియొద్దనే నిలిచియుండెను. ఊరిలోని పెద్దలడుగఁగా సమాధానమే కొంత మంది చెప్పక యుండిరి. తొలుదొల్త స్వామి యాద్రవ్యమును వసూలు చేయ నారంభించెను. తర్జన భర్జనలు చేసి ప్రభుత్వపుఁ బన్నుకంటెఁ గచ్చితముగాఁ బ్రోగు చేయ నారంభించిరి. స్వామి వారిమీఁదఁ గేకలు వేయుటయు, వారే విధముననైనఁ దప్పుకొనఁ బ్రయత్నించుటయు జరుగుచుండెను. ఇది యంతయును జూచి శిష్యులు "స్వామీ! వీరి యందఱితో మీరెక్కడ బోరాడఁగలరు ? గ్రామస్థులైన పెత్తనదారులు మూఁగలువలె మీవెంట నుండుటయే కాని పోరాడునప్పుడు నోరెత్తుట లేదు. మీకేల వచ్చిన బాధ ? యని పల్కిరి. అందులకు స్వామి "ఈ గ్రామీణుల సహాయము నాకేలరా ? కోదండదీక్షాగురుఁడైన, రామచంద్రుఁడే, నాకు నండ. అశక్తులైన యీ మానవవాధముల సహాయము నాకేల ? రామునికొఱకుఁ బాటుపడుచున్నాను. ఇది నా కర్తవ్యము. నాకేమియు ఫరవాలేదు. మీరు చింతపడవలసిన పనిలేదు పొం"దని బదులు చెప్పెను. ఎట్లయిననేమి ప్రాతపద్దులన్నియు వసూలుచేసిరి. ఎవరికినిఁ దప్పుకొన వీలుగాక పోయెను. పిదప నెకరమున కింత యని యూరిమీఁదఁ జందావేసిరి. అందులోఁ గొంతమంది తమకున్న భూమినిఁ దక్కువచేసి చెప్పసాగిరి. అపుడు స్వామి "మీ రెవరును భూమిని



వక్కపట్ల చినవేంకయ్యదాసు గారు, మత్సా నరసయ్య గారు (వక్కపట్ల వారి పాళెము)

దాఁచుకొని చెప్పవద్దు. అట్లు చెప్పితిరేని యీ చందాకంటె మూడురెట్లు మీకడ రాఘవేశ్వరుఁడు వసూలుచేసి తీరు"నని చెప్పిరి. ఎవరో కొంతమంది యట్లే దాఁచి చెప్పిరి. స్వామి చెప్పినయట్లే తరువాతనొక దొంగతూము బయటపడి కేసుగాగా దండుగ చెల్లించిరి. చందా పోవుచేయునప్పుడొకొక రోజున నాలస్యమైనదని వేంకన్న గారు మొదలైన పెత్తనదారులమీఁదనే స్వామి కోపాగ్నివిఱుచుకొనిపడెడిది. ఆ కోపమునకుఁ దట్టుకొనలేక యిఁక నారోజునకు మెల్లగా నెచటవారచట దప్పుకొనెడివారు. ఊరిలో నొక పాడుపడిన దేవరగుడి యుండెను. దానిరాయి రామమందిరమునకు నుపయోగింపఁదలంచిరి. కాని, యా రాతిని మొట్టమొదట వంగి పెల్లగించుటకు నెల్లరును జంకిరి. నేనుండఁగా మీరేమియు భయపడనవసరము లేదని మొదట స్వామియే కొన్నిరాళ్లను బెల్లగించిరి. దేవళ్ళు దయ్యములు వారి నేమి చేయఁగలవు? కన్నెత్తియైనఁ జూడఁగలవా ? విశాలమైన మందిరమును గట్టుట కారంభించిరి. ఊరిలోని ద్రవ్యము చాలకపోయెను. స్వామి తామే పత్రముల్రాసి యప్పు దీసికొని పరిసర గ్రామముల యందు భిక్షాటన మాచరించి ధనముఁ గొనివచ్చి మందిరమును బూర్తి గావించిరి. పిదప నొక శుభదినమున సకలశిష్యసమేతులై యామందిరమున నయనాభిరామముగాఁ బట్టాభిరాముని స్వామి నెలకొల్పిరి. మహావైభవముగా నుత్సవము ముగిసెను. ఇట్లు వక్కపట్లవారిపాలెమున రామమందిరమును గట్టించి మూడునెలల పదునైదు రోజులకు స్వామి యింటికిఁ జేరిరి.

సతియనారోగ్యము

ఒక సంవత్సరమున వర్షాకాలములో వక్కపట్లవారిపాలెమున రామాయణ కాలక్షేపము జరిగెను. పురాణశ్రవణమునకుఁ బ్రతిదినమును మోదుమూడి, యశ్వారావుపాలెము, వేకనూరు మొదలైన గ్రామములనుండియు, మధ్యాహ్నము రెండు గంటలగుసరికి, జనము తండోపతండములుగా వచ్చి, కాలక్షేపకూటము నిండుచుండిరి. ఒక దినమున సాయంకాలము పురాణము ముగిసిన పిదప స్వామియు శిష్యులును గూర్చుండియుండఁగా నేదో ప్రసంగవశమున "నీవేళ మోదుమూడి సుబ్బయ్యగారు పురాణ శ్రవణమునకు వచ్చెనని యెవరో యనిరి. ఈ సుబ్బయ్యగారు మోదుమూడినివాసి. వాసుదాస స్వామివారి శిష్యుఁడు. ఈయన యప్పుడప్పుడు వచ్చి, పురాణము వినుచుండును. ఆ దినమున సుబ్బయ్యగారు వచ్చిరని కొందఱనఁగా రాలేదని గొంద ఱనిరి. వాస్తవమునకు సుబ్బయ్యగారు వచ్చినఁ బురాణాంతమున స్వామిని దర్శించి, వారికడ ననుమతిఁగొని యేగును. నాఁడట్లేమియు జరుగలేదు. ఫలాహారముఁ బంచిన నరసింహదాసుగారు, "నేను సుబ్బయ్య గారికి భగవత్ప్రసాదమును స్వయముగా, నీవేళఁ బెట్టితి"నని చెప్పెను. ఈ

నరసింహదాసు గారును, నీయనభార్య యశోదమ్మ గారును స్వామియందత్యంతభక్తిగల శిష్యులు. వక్కపట్లవారిపాలెమున వీరి యింటికిడనే స్వామి బస చేసెడివారు. ఈ దంపతు లిరువురును మహాపవిత్రులు. ఇట్లు నాఁడు సుబ్బయ్యగారు వచ్చెననియు, రాలేదనియు వాదోపవాదములు జరుగగా స్వామి, "రేఁపు వచ్చినపుడు గనుగొందములెమ్మ"నిరి. ఆ రెండవనాఁడు సుబ్బయ్యగారు రానే వచ్చెను. ఆయన నడుగఁగా నేను నిన్న రాలే"దని చెప్పెను. అప్పుడు స్వామియు, శిష్యులును, సుబ్బయ్య గారి రూపమునఁ బ్రసాదమును స్వీకరించినవాఁడు సర్వేశ్వరుఁడే, యని నిశ్చయించి ప్రమోదపడిరి. వంచించి యట్టి విలాసములను నెఱపి, మరలఁ దరువాత నదియొట్టులో యొకట్లు బయటఁడునట్లు చేయుట, భగవత్స్వభావము. వైభవముగాఁ బురాణకాలక్షేప మొకనెల గడచెను. ఆ సమయమున దీవిలోఁ జలిజ్వరముల బాధ యపరిమితముగా నుండెను. పురాణముఁ జదువుచున్న స్వామి రెండవకుమారుఁడు జ్వరపడెను. రెండుమూడు రోజులకు వెంటనున్న నాలుగవకుమారునికిని జ్వరము వచ్చెను. క్రమక్రమముగాఁ బరగ్రామముల నుండి, వచ్చియున్న భాగవతులందఱును జ్వరముతోఁ గుప్పతెప్పలుగాఁ బడిపోయిరి. కడకు స్వామికిని వచ్చెను. పురాణ మాగిపోయెను. ఇట్లు పురాణ మాగిపోయినదని యింటికిఁ దెలియఁజేసిరి. గృహమునొద్ద బెద్దకుమారుఁడును మూడవ కుమారుఁడును నుండిరి. మూడవకుమారుఁడపుడు తర్కశాస్త్రాభ్యసనము చేయుచుండెను. ఇంటిదగ్గఱి విషయములు సవరించుటకై పెద్దకుమారుఁడుండి తర్కపారమాపించి పురాణమునకుఁ దమ్మునిఁ బంపెను. ఆయన వెళ్ళువఱకు నచటివారి పరిస్థితి యట్లుండెను. చదువుట కెవరినెవరినో యద్దుపెట్టుకొని కొలఁది దినములట్లే పురాణమును సాగించెను. ఇంతలో స్వామియు రెండవకుమారుఁడును, మెల్లగాలేచిరి. ఎట్టకేలకు నా పురాణమును ముగించి రామపట్టాభిషేకము గావించిరి. ఇంటికి వచ్చినపిదపఁగూడ స్వామి రెండవకుమారుఁడును, చిన్న కుమారుఁడును నా జ్వరముతో నొకసంవత్సరము బాధపడిరి.

స్వామి వక్కపట్లవారిపాలెము పురాణమును ముగించివచ్చిన పిదప రాధమ్మగారికి రక్తవిరేచనము లారంభించెను. ఎన్ని చికిత్సలు చేసినను, నవి యాగక క్రమక్రమముగా వృద్ధినొందెను. అది యంటుజాడ్యమగుటచే వరుసగా నింటిలోనివారి కెల్లరకును వ్యాపించెను. రాత్రులు పరుండుటకు వచ్చు జీతగాండ్రకును నా వ్యాధి కలిగెను. ఇంటిలో స్వామియు, మూడవకుమారుఁడును, చిన్నకుమార్తెయుఁ దప్ప మిగిలినవారెల్లరును, దానికి లోనైరి. ఎవరిలోకము వారిదిగా నుండెను. ఇంట వంటఁజేయువారుకూడ లేరైరి. "ఏమిరా సర్వేశ్వరా! యిట్లు చేసితి"వని స్వామి విచారపడుచుండగాఁ జావలినుండి యొక శిష్యురాలు వచ్చి, యదియంతయుఁ జూచి వెంటనే యింటికేగి తన తల్లినిఁ బంపెను. ఆమెయు స్వామికి

శిష్యురాలే. అట్లువచ్చి యామె యెట్టెట్లో వంటపని చేయుచుండెను. రాధమ్మగారికి వ్యాధితీవ్రమై గంటకు నాలుగైదు చొప్పున విరేచనము లగుచుండెను. క్రమముగా నామె కృశించిపోయెను. ఆమెకుఁ బరిచర్యచేయుచు రామదాసను శిష్యుఁ డపుడు స్వామికిఁ జాలఁ దోడాయెను. ఆమె యౌషధములను మ్రింగిమ్రింగి, విసుఁగుజెంది యిఁక మ్రింగలేననెను. ఔషధములను నావలఁ బడవైచిరి. వ్యాధి ప్రబలి యొకదినమున నామె స్పృహదప్పి మాట్లాడలేకపోయెను. వైద్యుఁడైన యర్చకస్వామి చేయిఁ జూచి "బాబూ నాడియందుటలే"దనెను. స్వామియుఁ జూచెను. చేతియందు నాడి కనిపించుట లేదు. ఆమె యిఁక జీవించునను నాశ వదలిరి. స్వామి యీవలికివచ్చి యింటివసారా యరుగుమీఁదఁ గూర్చుండి సమీపమున నున్న, దేవాలయము వైపునకుఁ చేతులు జోడించి "ప్రభూ! పరమనీచుఁడనైన నన్ను, నీకు నీవైవచ్చి గైకొని, బ్రహ్మవేత్తలచే గౌరవింపఁజేసితివి. భోక్తవై, కర్తవై బ్రోచితివి. కాఁపురమిపుడు నడిసముద్రమున నున్నట్లున్నది. ఒక దరిఁ బట్టలే దీసమయమున నీయాపత్తు గలిగిన, నేమిగావలయును ? ఈ సంసారమును, నీపిల్లల, నీఁదువారెవరు ? పుట్టుకతోడనే ప్రసాదించిన నీ పదకమలసేవకిపు డిట్లు విఘ్నమును గలిగింతువా ? ఈ సంసారభారమును బైనివేసికొని నీ భజనమునకుఁ గూడ దూరస్థుఁడ నగుదునా ? సర్వేశ్వరా!" యని దుఃఖపడిరి. వేంకటదాస స్వామి శోకించిరఁగనే యూరియందలి వారాబాలగోపాలము వారివాకిట మూఁగిరి. "స్వామీ! మీరు దుఃఖించిన మేము భరింపలేము. మీకిట్టి యాపత్తురాదు. మీ తపస్సు గొప్పది. మీ రాశ్రయించిన దేవుఁడు గొప్పవాఁడు. మిమ్మోదార్పఁగల సమర్థులము కాము. మీరు శాంతింప, వలె"నని ప్రార్థించిరి. ఉదయమునఁ జీఁకటితోఁ బోయిన నాడి, రాధమ్మగారికి మరలఁ బదిగంటలగుసరికి యథావిధికి వచ్చెను. క్రమక్రమముగా నామె కారోగ్యము గుదిరెను. ఎవరికో యొకరికి వ్యాధివచ్చుటయు, నది ప్రబలుటయు, నట్టిసమయమున స్వామి భగవానునిమీఁద విసుఁగుకొనుటయు, నాఁటినుండి యా యాపత్తు తగ్గుటయు వారి కుటుంబమునఁ బరిపాటియాయెను.

ఒకపరి పెద్దకుమారుని తనయునకు జబ్బుచేసి సంధించెను. ఇద్దఱు త్రొక్కి పెట్టలేకపోవుచుండిరి. ఒక వైద్యుఁడు వచ్చిచూచి "యిఁక లాభములేదు, పిల్లవాఁడు బ్రతుకఁ"డని వెళ్ళెను. అందఱును దుఃఖించుచుండిరి. అంత స్వామి, కోపపడి "యాయువునకుఁ గర్తలు వైద్యులా ? వాండ్రకేమితెలియును ? భగవన్నామము చేయుఁ"డని, అందఱితోఁ జేయించుచు మధ్యాహ్నము రెండుగంటలు మొదలు రాత్రి పదిగంటలవఱకు మంత్రపురశ్చరణము గావించిరి. అర్ధరాత్రమగు సరికి సంధి తిరిగిపోయెను తెల్లవాఱువఱకు, బిల్లవాఁడు హాయిగాఁ దేటకువచ్చెను. బ్రతుకఁడని చెప్పిన వైద్యునిఁ బిలిపించి స్వామి చూడుమని చెప్పెను. అప్పు డాతఁ "డయ్యా, రోగము పెద్దదే. మీతపోమహిమ వలన

మరల్చితిరి. నే నసత్యముఁ జెప్పలే"దనెను. ఇట్లు వారి జీవితమునఁ జూపిన భగవన్మహిమలు లెక్కకు మిక్కుటముగా నున్నవి.

మంటప నిర్మాణము


భగవద్ధ్యానమును, భగవన్మహిమ ప్రకటనమును దప్ప స్వామికి జీవితకాలమున మఱియొక గొడవ లేదుగదా! పూడివాడలో వేణుగోపాలునకుఁ బ్రాకార మంటప గోపురాదు లెపుడు నిర్మితములై చూడఁగలుగునా; భగవానునకు నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవ, దమనోత్సవాదు లెట్లు చేయుగలుగుదునా; యని యువ్విళులూరును. మఱియు, పెరుమాళ్ళ సన్నిధిని మఠము నిర్మించి, సంసారజంజాటము వదలిన భాగవతుల నందఱ నచటఁ జేర్చి నిరంతర భగవత్సేవతో సంతత భగవద్గుణానుభవముతోఁ గాలముఁ గడపవలెనని, వారికొక వాంఛగలదు. ప్రాకారమునుఁ గట్టించిన పిదప మరలమంటప నిర్మాణమునకై వారు ప్రయత్న మారంభించిరి. దైవికముగా నెన్ని పర్యాయములు, విఘ్నము కలుగుచున్నను వారు దేశాటనమును గానీ భగవత్కైంకర్యములను గానీ మానలేదు. విఘ్నము కలిగినపుడు మాత్ర "మిక జీవితమున నీ యాచన యనుదానికి బయలుదేఱఁ గూడదు. దేవతాకార్యమను మాట తలపెట్టరాదు. వాఁడే యంతరాయ మాచరించు చుండ నేనేమి చేయుదును ? గలిగినంతవఱకుఁ దిని, యింటికడనే వానిసేవ చేయుచు బడియుందును. నాకీ మిడిమేలమేల ?" యని విసుఁగుకొనెడివారు. మరల రెండుమూడు మాసము లగుసరికి నొక మూటను గట్టుకొని కైంకర్యార్థులై సంచారము నకు బయలువెడలెడివారు. అట్లే విఘ్నములు గలుగుచున్నను దమయాత్మ బలమున దేవాలయకార్యములను సాధించుచునే యుండిరి. చూచినవారు, వీరి కీ బాధయేల ? యీ విసుఁగుకొనుటయేల ? యీ దేవకార్యములను మానుకొని హాయిగా నుండరాదా ? యనుకొనెడివారు. కాని వారెట్లు మానుకొనఁగలరు ? వారి జీవితమే యదియై యుండఁగా, నూరు కొనుట కెట్లువీలుపడును? దైవముతో వారును, వారితో దైవమును గ్రిందుమీఁదగుచు నూరేఁగుచుండ వలసినదే. ఇద్దఱును నూరుకొనలేరు.

వ్యయనామ వత్సరమున ననఁగాఁ గ్రీస్తుశకము 1947న స్వామి భగవదాలయ ముఖమంటపమునకై దేశాటనమొనర్ప బయలుదేఱిరి. దీవిలోని వేకనూరు, వక్కపట్లవారి పాలెము, నంగేగడ్డ, కోడూరు మొదలైన గ్రామములు పర్యటించిరి. 1948వ సంవత్సరమున మరల మూడవకుమారునిఁ దీసికొని పెద్దవరాగ్రహారము, వరికూటివారిపాలెము, చెఱుకుపల్లి మొదలైన గ్రామముల మీఁదుగాఁ బోయి తెనాలి తాలూకాలోని, చుండూరు, మామిళ్ళపల్లె, మంచాల మున్నగు నూళ్ళయందు సంచారము గావించిరి. మంటపమునకు సరిపడు ద్రవ్యము లభించెను. అంతటితో నాపర్యటనమును ముగించి యింటికిఁ జేరిరి.

స్వామి యింటికి వచ్చునప్పటికి దేవాలయమున నర్చకుఁడైన శేషాచార్యులుఁగా రూరివారినిఁ బ్రోత్సహించి వేణుగోపాలస్వామి కాయేఁట బ్రహ్మోత్సవముఁ జేయవలయునని, స్వామి యనుమతికై యుఱ్ఱటలూఁగుచుండెను. అందువలన వారింటికి రాగానే యూరివారెల్లరు నుత్సవముఁ గావింప నభిలషించుచున్నారనియుఁ బ్రతిష్ఠతరమును జందాలిచ్చెదమని చెప్పిరనియు వచించెను. కాని స్వామి సంతసింపలేదు. "ఈ యూరితో బాధపడలేము. ఒకటి రెండు సంవత్సరము లిచ్చినను దరువాత నీయరు. బ్రహ్మోత్సవమును మొదలుపెట్టితిమేని దాని మరల నాపరాదు. శాశ్వతముగా నెఱవేర్పవలయును. ఊరిమీఁద వచ్చు చందాలోని శోభనంతయు నిరువది సంవత్సరములు శ్రీరామనవమిచేసి యనుభవించియే యుంటిని. కొఱవడిన యాలయ కార్యములను సాధించునప్పటికే నాకుఁ దలమున్కలగుచున్నది. పైగా నీయుత్సవమును గూడఁ దగిలించుకొని యెట్లీద్వఁగల"నని స్వామి వచించెను. ఏమో, యూరివారందఱు నుత్సాహపడుచున్నారుగదా. సంసారమున కెన్ని వ్యయములు చేయుచున్నారు ? సంవత్సరమున కొకసారి యీమాత్రము చందా నీయలేకపోవుదురా ? భగవద్వైభవమును గనులారఁ జూడవచ్చును, బ్రారంభించుఁడని యింటిలోని వారనిరి. "ఏమైనను సరే యీసంవత్సర ముత్సవము చేయవలసినదే." యని యర్చకుఁడు లేచిపోవుచుండెను. ఊరిమీఁద జందావేసి ప్రతివత్సరమును బ్రహ్మోత్సవము చేయుట యన్న దుర్ఘటమే. దానిలోని కష్టనష్టములనుభవించియున్న, వారికా విధానము మనస్సునకు సమ్మతము కాకపోయినను "గానిమ్ము భగవత్సంకల్ప మెట్లున్నదో, దైవోత్సవమును నేను వలదని వారించుట యేల ?" యని స్వామి యంగీకరించిరి. ఆలయ ముఖమంటపమును దగిన బనివాండ్రతో, రెండువేల రూప్యములు వ్యయించి యొకనెల రోజులలోఁ గట్టించిరి.

బ్రహ్మోత్సవములు

పూడివాడయందుఁ జందా వసూలుచేసిరి. 1947 వ వర్షమున నారంభమైన యా యుత్సవమునకు నూరిలో రెండువేల రూపాయలు ప్రోవాయెను. వైశాఖశుద్ధదశమినాఁటి రాత్రి మొదలుకొని పాంచాహ్నిక దీక్షతో వేణుగోపాలస్వామికి బ్రహ్మోత్సవ మారంభమాయెను. అధ్వర్యులు, ఋత్విజులు వచ్చిరి. వివిధగ్రామములనుండి స్వామి శిష్యకోటి యరుదెంచెను. దినమున కొక యలంకారమును గైసేసి, వేణుగోపాలుఁడు జగదానందముఁ గావించుచుండెను. రెండవరాత్రి యెదురుకోలుత్సవము. పెరుమాళ్లును, నమ్మవారును వేఱువేఱుగా నూరిలోనికిఁ బోయి చెఱియొకచో వేంచేయుదురు. అచట స్వామి కుమారు లిరువురు, భగవానుని పక్షమున నొకరును, నమ్మవారి తరపున నొకరును,



వక్కపట్ల నరసింహదాసుగారు, యశోదమ్మ గారు (దంపతులు) వక్కపట్లవారి ఫోటోము.

నిలిచి, తద్గుణగణవైభవమును సుందరముగా వెల్లడించిరి మూడవరాత్రి కల్యాణోత్సవము. నాలుగైదు రాత్రులందుఁ బామరజనముఁ సంతసించుటకై నాటకములు, ఆఱవనాఁటిరేయి పవళింపుసేవ, యీ యైదు దినములు విధివిరామములు లేక స్వామియుఁ దత్కుమారులును, హరికథలు, పురాణములు, ఉపన్యాసములు వేదాంతగోష్ఠులు నెఱపిరి. భాగవతులందఱునుఁ బ్రహ్మానందసాయుజ్యమున నోలలాడిరి. ఇతర జనమును దండోపతండములుగా వచ్చి యుత్సవశోభ ననుభవించిరి. పలువిధములైన భోగములతో నలంకారములతో భగవదుత్సవము మహావైభవముగా ముగిసెను. ఉత్సవాంతమున భక్తు లెవరియిండ్లకు వారుపోయిరి.

రెండవ సంవత్సరము వచ్చెను. మొదటి సంవత్సరమున స్వామి శిష్యకోటి, యెవరి వంట వారు చేసికొని యుత్సవానందము ననుభవించిరి. ఆ విధానమంతగా బాగుగాలేని కతమున, ద్వితీయోత్సవమున వారిమీఁదనే కొంతధనమునుఁ బ్రోవుచేసి స్వామి, యొకచోటనే తదీయారాధమను గావించెను. రెండవసంవత్సరమునకే యూరిలోని చందా చాలవఱకుఁ దగ్గెను. ఎట్లయిననేమి ? బ్రహ్మోత్సవ మత్యంత వైభవముగా సాగిపోయెను. ఊరి చందాక్రమముగాఁ దగ్గిపోవునని స్వామికి మొదటనే తెలియును! తెలిసియు ప్రారంభించెను. ఇఁక నుత్సవము నెట్లు నెఱపవలయునా, యని వారు రేవగలు విచారపడసాగిరి.

స్వామి నాశ్రయించిన శిష్యకోటి యారేడువందలువఱకుఁ గలరు. వారి సంఘమంతయు, మధుమాంసవర్జనముఁజేసి కత్తిమీఁద సాముగా నియమములతో సంతతభగవత్సేవ చేయుచుండవలయును. అట్లయిననే వారు సంఘమున నుండనిత్తురు. ఏమాత్రము కాలుష్యము వచ్చినను సభ్యుఁడు నాఁటితో సంఘమునుండి వెలివడవలసినదే. దేవతా కైంకర్యములకుఁగానీ యితరవిషయాలలోఁగానీ యెంత డబ్బు నిచ్చినను నా యిచ్చినమాత్రమున వానిని స్వామి ప్రేమించెడివారుకారు. డబ్బీయకపోయిననునెవరు భగవత్సేవ నధికముగాఁ జేయుదురో యట్టి వారెంతనీచులైనను వారినేఁ బ్రేమించెడివారు. అట్టి పరమహంసల విధానమట్లేయుండునుగదా! స్వామి శిష్యులలో శాంతమ్మ వేంకటరత్నమ్మ యను నిరువురు భక్తరాండ్రుఁగలరు. వారిరువురకు బాల్యముననే భర్తలు వోయిరి. సంసారజంజాట మేమాత్రమును లేక నిరంతర భగవన్నామజపముతోఁ బునీతలైరి.

భక్తి వైర్యాగ సుజ్ఞాన భరితలగుచు
సర్వకాలంబులందు దేశంబులందు
జగమెఱుంగక గురువుల చరణయుగముఁ
గెరలి సేవింపఁగన్న యోగినులు వీరు.

వీరిరువురు నెక్కి వచ్చిన పిదప స్వామి యెచటికేగినను వంటకును బరిచర్యకును

వీరే యుండెడివారు. మూడవ సంవత్సరమందలి యుత్సవమునకై స్వామి వీరిరువురను మఱికొందఱు శిష్యులను వెంటఁగొని మరల దేశాటన మారంభించిరి. పూడివాడ సమీపమున నున్న తాడివాకవారిపాలెము, కమ్మవారిపాలెము, ఊచావారిపాలెము మొదలగు నూళ్ళయందుఁ గొంత ధనమార్జించిరి. యతీశ్వరజయంతికి బదులుగా వేసఁగిలో నీబ్రహ్మోత్సవము సాగుచుండెను. వర్షాకాలములందు మాత్రము వేకనూరు మొదలైన శిష్యగ్రామములందుఁ బ్రతివత్సరమును రెండునెలలపదునైదురోజులు పురాణకాలక్షేపము జరుగుచునేయున్నది. అట్లు పరిసరగ్రామములైన పిదప స్వామి తుమ్మల, గాదివారిపాలెము, పోటుమెరక మొదలగు గ్రామములమీఁదుగా, శ్రీకాకుళము, తెలుఁగురాయనిపాలెము మున్నగు నూళులయందుఁ గొంత ధన మార్జించి యిలుసేరిరి. ప్రతిసంవత్సరమును శాశ్వతముగా నుత్సవమునకై కొంత ధాన్యము నిచ్చునట్లుగాఁ గలిమిగలిగియున్న శిష్యులకును జందావేసిరి. ఇట్టు లూరిమీఁద వచ్చినదియు, నూరుల యందుఁ బ్రోవుచేసినదియు, శిష్యుల నుండి యార్జించినదియు నైన యా ద్రవ్యమునంతయుఁ గలిపి యా వత్సరము మఱింత వైభవముగాఁ గూచిపూడివారి నాటకములతో నుత్సవమును సాగించెను. ప్రారంభించిన పిదప నిట్లు వారిచేతిమీఁదుగా జగన్మోహనమగురీతి నెనిమిది బ్రహ్మోత్సవములను లోక మనుభవింపఁ గలిగెను.

జ్ఞానసూర్యోదయము

లోకానుగ్రహార్థమై వారు తేటతెల్లమైన తెనుఁగు వచనమున జ్ఞానసూర్యోదయ మనునొక వేదాంతగ్రంథమును వ్రాసిరి. ఇది యెనిమిది వంవల పత్రములుగల, డెమ్మీసైజులోని గ్రంథము. స్వామి దీనిని రెండువత్సరముల తీరికగల యప్పుడెల్ల వ్రాసి ముగించిరి. ప్రపన్నులెట్లుండవలసినది, భగవదారాధన చేయవలసినక్రమము, భగవద్వైభవము, జీవతత్త్వము, ప్రపంచనశ్వరత మున్నగు శీర్షికలతో భక్తి జ్ఞానవైరాగ్యములను బ్రతియక్షరమునఁ బ్రతిధ్వనించునట్లు చేసిరి. వేయేల! వేదాంతమున కిది యొక సమగ్రభాష్యగ్రంథ మనవచ్చును. కూరేశవిజయమును నాంధ్ర వ్యాఖ్యానముతో దానిలో నిమిడ్చిరి. వారి భక్తి యనుభవము నంతయు నందు నిక్షేపించిరి. ముముక్షువులగు వారికిది యవశ్యపఠనీయము. దీనిని ముద్రించుటకు నాలుగువేల రూప్యములు వ్యయమాయెను. ఆ ధనము నంతయు వారు శిష్యుల మీఁదనే ప్రోవుచేసిరి. చెఱుకుపల్లిలో దీనిని ముద్రింపనిచ్చి, ప్రతిదినమును నా ఫారములను దిద్దుటకై తెచ్చుటకు నొక ద్రావిడిని. నెలకు ముప్పది రూపాయలిచ్చి పెట్టిరి.

ఇంతలో స్వామి నాలవసంవత్సరమున జరుగు నుత్సవము చందాను వసూలు

చేయుటకు, శిష్యగ్రామములకు వెళ్ళవలసి వచ్చెను. ఒకనాఁటి మాపటిసందెవేళ నింటి యావరణమున మంచముమీఁద గూర్చుండి, యప్పుడే యత్తవారియింటినుండి వచ్చిన మూడవ కుమారునితో నేవేవియో మాట్లాడుచుండిరి. ఇంతలో వెనుకనుండి యొక యెద్దువచ్చి, చుట్టుప్రక్కలవారు గోలచేయుచుండఁగనే, మంచముమీఁది కెక్కెను. ఒక కాలు స్వామితొడమీఁద వేసెను. మంచము విరిగి రెండవప్రక్క లేవఁగా స్వామి, యెద్దు కాళ్ళమధ్య బోరగిలఁపడెను. చూచుచునే యున్న యందఱిప్రాణములు లేచిపోయెను. ఏమిచేయుదురు? ఎద్దావలికిఁ బోయెను. ఏడ్చుచు నందఱు, చుట్టును మూగిరి. స్వామి వారిని దుఃఖింపవలదని వారించిరి. వారికేమియు దెబ్బ తగులలేదు. వారి తొడ మీఁద మోపిన యెద్దుకాలి బరువుచే మంచమే విఱిగెనుగాని, వారి కాలున కేమియు దెబ్బతగులలేదు' ఎల్లరును నాశ్చర్యపడిరి. వారి శరీరమునఁ బ్రతియణువునందును, రాఘవేశ్వరుఁడు నిండి, నిబిడీకృతుఁడై యుండగా నిట్టి వానివలన వారికి మోసమెట్లు గలుగును ?

గ్రంథమును ముద్రించునపు డాధారములలోని దోషముల దిద్దుటకు, మూడవ కుమారుని నియమించి స్వామి చందా వసూలున కేగిరి. వారు తిరిగి వచ్చునప్పటికి గ్రంథము ముద్రితమాయెను. ఆ యుత్సవమున స్వామి, యాగ్రంథమును వేణగోపాలున కర్పించి లోకమునకు వెల్లడించిరి. స్వామి గ్రంథములలోఁ బెద్దదియు నమూల్యమైనదియు నదియ. ఇట్లుస్వామి దేవతాకైంకర్యమునకును గ్రంథములకును ధర్మకార్యములకును, దమ సొంతయాస్తినిఁగానీ, తమ విద్యాబలమున దేశాటనముఁ గావించి ప్రోవుచేసినదిగానీ, యఱువది డెబ్బది వేల రూప్యములు వ్యయించిరి.

ప్రబలవ్యాధి

విజయనామ సంవత్సరాశ్వయుజంబున ననఁగా స్వామి యఱువది రెండవ యేఁట వారికొక పెద్దజబ్బుచేసెను. తొలుత నాలుగైదు దినములు జ్వరము తగిలెను. అది క్రమక్రమముగా హెచ్చెను. ఆ సంవత్సరమున వారి మూడవకుమారుఁడు, కావూరునందలి యున్నత పాఠశాలలో నాంధ్రపండితుఁడుగా నుండి, చెఱుకుపల్లెయందు మిత్రులును, దత్త్వాయకళాకృతి భర్తలునైన, శ్రీ గన్నయ్య చౌదరిగా రుండుటచే నచట నివసించుచుండెను. కుమారుని కీవార్త తెలియఁగనే పూడివాడకు వచ్చెను. వచ్చుసరికే స్వామికి స్మృహలేకుండఁ బోయెను. స్మృహలో నున్నంతవఱకునాసుపత్రికిఁ దీసికొనిపోయెదమన్న వారినెల్లఁ గోపించిరఁట. సంధించిన తెఱఁగు కాన్పించుచుండెను. ఏవేవో మాటలు పల్కుచుండిరిగాని, యవి యర్థవంతములుగాలేవు. స్వామికి స్మృహచెడఁగానే, కుమారులు, బంధువులును, శిష్యులును గలిసి వారిని రేపల్లెయందలి యొక వైద్యాలయమునకుఁ దీసికొని పోయిరి.



మేకా గన్నయ్య చౌదరి గారు, కూచిపూడి

అట వైద్యుఁడేవేవియో చికిత్సలు చేసెను. రెండవనాఁటి మధ్యాహ్నము నుండి వ్యాధి భయంకరముగా హెచ్చిపోయెను. ఒకటే ధోరణి. చిన్నప్పటినుండి వారి యనుభవముననున్న విషయములనెల్ల నుగ్గడించుచుండిరి. కొంతవడి పద్యములు, కొంతవడి శ్లోకములు జదువుదురు. కొంతసేపు కమలా! యని కుమార్తెను బిలుతురు. మరలఁ గుమారులను శిష్యులను బేరులుపెట్టి యేదో చెప్పఁబోయినట్లు కేకవేయుదురు. పిలుచుచున్నారుగదాయని వారు దగ్గఱకుఁబోయి నిలిచిన మరల వారి ధోరణిలోనే వారుందురు. ఒక్కపరి బోధ చేసినట్లు చేతితో జ్ఞానముద్ర పట్టుదురు. మఱియొకసారి యేదో యభినయింతురు. ఏదో దగ్గఱలో నున్నట్లొకతేప పట్టుకొనఁ బోవుదురు. దగ్గఱనున్న కుమారులకును శిష్యులకును, నిదియంతయుఁ జూడఁగనే లోకము తెలియకుండఁ బోయెను. "ఆహా! యెట్టి దివ్యమంగళ విగ్రహమున కెట్టిగతి ప్రాప్తించెను ? వేలకొలంది జనుల మాంద్యమును దొలఁగించి, భక్తిజ్ఞానముల బోధించిన, యా యమృతహస్త మొకపిచ్చివాని చేయివలె నూరక దేనినో నెమకిపట్టుకొనఁబోవుచుండెనే! దైవమా! యిట్టి పరమహంసకా యిట్టి యాసుపత్రిప్రాప్తి. వారి యపార మేధాశక్తి నంతయు నేమిచేసి. యీస్థితికిఁ దెచ్చితి" వని, వారు విలాపించిరి. ఆదినమున దీనికిఁ దగినట్లా డాక్టరుగా రేదోయూరికిఁ బోయెను. వారికేమియును దోఁపక పోయెను. ఎంత ప్రొద్దుపోయినను, దేవాలయార్చకుఁడును, వైద్యుఁడునైన శేషాచార్యులుగారిని రమ్మని పూడివాడకుఁ గబురుచేసిరి.

రాత్రి పదిగంటలు దాఁటునప్పటికి స్వామి నాలుగవకుమారుఁడును, శేషాచార్యులు గారును సైకిళ్లు వేసికొని రేపల్లెకు వచ్చిరి. ఆచార్యులుగారు వచ్చి, నాడి చూచెను. అది వక్రగతిలో నుండెను. దానితో నాయనయుఁ గల్లోలపడిపోయెను. అట్టితఱి నూరినుండి డాక్టరుగారు వచ్చిచూచి యేవో యింజక్షనులనిచ్చి యవసరమైన నన్ను బిలువుఁడని, యింటికి వెళ్ళిపోయెను. క్రమక్రమముగా స్వామి ధోరణియుఁ దీరును మాఱుచుండెను. వెంటనే డాక్టరుగారినిఁ బిలుచుకొని వచ్చిరి. ఆయన యేవేవియో పరీక్షలుచేసి విలువగల మందులను వ్రాసి తెమ్మని పంపెను. స్వామి పెద్దకుమారుఁడును, శేషాచార్యులు గారును, నా యర్ధ రాత్రమున మందులకై "బజారు"న కేగుచుండగా నొంటి బ్రాహ్మణుఁ డెదురుపడెను. అసలే యధైర్యముతో నున్నవారికీ శకునము, మఱింత బాధాకర మాయెను. చేయునది లేక యట్లే పోయి మందులఁ గొనివచ్చిరి. గంటగంటకు నా యౌషధములను వాడిరి. అందరును బహుళదుఃఖభారముతో క్షణమొకయుగముగా స్వామినిఁ బరివేష్టించి యా రాత్రియంతయుఁ గూర్చుండియుండిరి. తెల్లవారు జామున మరల నాచార్యులుగారు చేయిచూచిరి. మఱింత దోషయుక్తమై మృతనాడి కనిపించుచుండెను. ఆయన గుండె గుభాలుమనెను. ఇఁక జీవించునను నాస యేమాత్రమును లేకపోయెను. కుమారునికంటె నతిప్రీతితో సర్వవిధ

రక్షకుఁడై బాల్యమునుండి తనను బోషించిన నెఱదాత, పరమహంస, దయానిధి, యా దినముతో సమసిపోవుచుండెనని యాయన తలంచెను. ఇఁక లాభములేదు. సూర్యుఁడస్తమించుచున్నాఁడు, సూర్యోదయముతో స్వామి పరమపదించునని యా యర్చకస్వామి తలమోదుకొని యేడ్చెను. కుమారులును, శిష్యులను, శిరస్సులు పగులఁగొట్టుకొనుచు దుఃఖించిరి. అట్టిస్థితిలో నచట నుంచిన నిబ్బంది కలుగునని వారు "స్వామి జీవించునట్లు లేదు. వెంటనే యింటికి వచ్చుటకై బండ్లు తోలుకొనిర"మ్మని యింటికిఁ గబురుచేసిరి. ఇంత ప్రమాదములోఁ, గబురు చేయకపోయిరే యని దుఃఖంతురని యచటనున్న యొక శిష్యుని వివిధగ్రామవాసులైన శిష్యుల కెఱుకఁ జేయుటకుఁ బంపిరి. తెల్లవాఱెను. స్వామి స్థితి యట్లేయుండెను. ఇంత ప్రమాదములోనున్నను స్వామి యందొక సుగుణము గనుపట్టుచుండెను. వారిని లేవఁదీసి కూర్చుండఁబెట్టిన జక్కగా సమాధానమిత్తురు. మనుష్యులను గుర్తింతురు. పరుండఁబెట్టినఁనిఁక మన లోకము లేదు. డాక్టరుగారికిని వారు జీవింతురను నాసలేదు. ఇంటికి వెళ్ళెదమని చెప్పఁగా నాయన, యింటికిబోయి చేయునదేమున్నది ? అయినను నిదానించి చూడుఁడు. తరువాత మీ యిష్టమనెను. మధ్యాహ్నమగుసరి కిఁకఁ జూడుఁడు. వివిధ దిక్కులనుండి వానర సైన్యమువలె స్వామి శిష్యకోటి దిగుచుండెను. ఈ వార్త వినఁగనే యెచ్చటివారచటనుండి బయలుదేఱిరి. పొలముననున్నవా రచట నుండియే వచ్చిరి. వాకిటనున్నస్త్రీలు, పసిపిల్ల తల్లులు, ముదుసళు లు, బాలురు నెచటివారచటనుండియే బయలుదేఱి "యిఁకనట్టి బ్రహ్మర్షినిఁ బరమహంసను, దేజస్వినిఁ గరుణామయుని మరల జీవితములోఁ జూడం బోవుదుమా" యని మితిలేని దుఃఖభారముతో వచ్చిరి. వచ్చి, వైద్యాలయమున, మంచము మీఁద, లోకస్పృహలేక పరుండియున్న స్వామికి నమస్కరించుచు, నశ్రవుల తుడుచుకొనుచు, నాసుపత్రి యగుటచే నెక్కువసేపు తనివిదీఱ సేవించుటకు వీలుగాక, యంతిమ దర్శనమని యేడ్చుచుఁ దిరిగిపోవుచుండిరి. ఎప్పటి జనమప్పుడు వెళ్ళిపోవుచున్నను వచ్చెడివారాసుపత్రి పట్టకుండ నుండిరి. ఆ సమ్మర్దమును జూచి డాక్టరును దదీయులును విభ్రాంతిపడి, స్వామి కుమారులను బిలిచి "యిచట నిట్టి సమ్మర్దముండిన వివిధరోగులకును బాధగా నుండును ఈ జనమును రాకుండునట్లు చేయుఁ" డని చెప్పిరి. అంతవారు "ఈ సమయమున నట్లెవరిని, రాకుండఁజేయవలయునన్న వీలు పడదు. మహోర్తితో నంతిమదర్శనమని వచ్చు వారెవరికి నాగర"ని బదులు చెప్పిరి. అట్లయిన నాసుపత్రియందుఁగాక మఱియొకచోటికి నైన స్వామినిఁ జేర్పుఁడని డాక్టరుగా రనెను. ఆ యాసుపత్రిలో నుండుట వారికిని జీఁకాకుగానే యుండెను గావున సరే యనిరి. పెదపులిపట్టునుండి వచ్చి యచటనున్న శ్రీ కొసరాజు సూరయ్య యను నొక చౌదరిగారు, స్వామి విషయ మదివఱకే వినియున్న భగవత్సంబంధులుగాన

సమీపములోనున్నc దమయింట బసనిచ్చెదముండుcదని చెప్పిరి. స్వామి నచటికిc జేర్చిరి. విశాలమైన యాగృహమును, నావరణమును నివాసమునకు హాయిగా నుండెను. ఎంతజనము వచ్చినను సమ్మర్దము లేకపోయెను. సూరయ్యగారప్పుడొనర్చిన యుపకృతి మఱువరానిది. పూడివాడయందును దత్పరిసరగ్రామములందును నున్న వివిధజాతుల జనమును "మహానుభావుcడుపోవుచున్నాcడట. మల నట్టి విగ్రహముc జూడcబోము. దేశమును వెలిగించుచున్న దివ్యజ్యోతి యాఱిపోవుచున్నది. ఇcక గాఢాంధకారమలముకొనును. జూచివత్తము రం"డని యొకరినొకరు బిలుచుకొని తండోపతండములుగా వచ్చి స్వామిని జూచిపోవుచుండిరి. క్రమక్రమముగ నాలుగైదు దినములకు జ్వరము తగ్గి, స్వామి స్మృహలోనికి వచ్చెను, గాని యదివఱకే యంకురించి యున్న కడుపునొప్పి బాధ యధికమాయెను. డాక్టరును దానికేమియుc జికిత్స చేయలేక పోయెను. స్మృహవచ్చిన దగ్గఱనుండి, "యసలు నన్నిటకేల గొనివచ్చితిరి ? ఈ వైద్యులవలన నేమగును ? భవరోగవైద్యుcడు సర్వేశ్వరుcడుండగా వేఱొకండు నాకేల." యని కుమారులపైc గోపించి యింటికిc గొనిపోవుcడని చెప్పిరి. స్మృహలో లేనందున జికిత్సాలయమున నపుడుంచుటకు వీలువడెcగాని యిcక నిప్పుడు వారి నుంచుట కెవరితరము! పరివారముతో స్వామిబూడివాడకుc జేరిరి. వారికిc బరిచర్య చేయవలసిన యావశ్యకత కుటుంబమునకు లేదు. దైవమిచ్చినc బరివార మనంతముగా నున్నది. శాంతమ్మ, వేంకటరత్నమ్మ మఱికొందఱు శిష్యులు స్వామికి వలసిన శుశ్రూష రేcబవలు చేయుచుండిరి. స్వామికిc బథ్యముచేయు నలవాటెప్పుడును లేదు. దానివలన వచ్చు చెఱుపును వారికిలేదు. నోటికి హితమైన పదార్థములc గైకొనుచు, భగవద్ధ్యాన మొనర్చుచుc, గాలముc గడపిరి. క్రమముగా రెండు మూడు మాసములకు స్వామికి నారోగ్యము వచ్చెను. స్వామికి వ్యాధి వచ్చిన సమయములోc బెక్కు గ్రామములందుc బలువురికిc గలలలో స్వామినిc దీపికొనిపోవుటకు వచ్చినట్లు పెక్కుదివ్యవిమానములు గనcబడెనని, వారెల్లరు తరువాత వచ్చి చెప్పిరి. ఆ స్వప్నములలో నిది యొకటి. "పూడివాడలో వేణుగోపాలస్వామిసన్నిధి, నొక దివ్య విమానము దిగినదcట. శ్రీ వేంకటదాసస్వామినిc గొనిపోవుటకు వచ్చితిమని యందులోనున్న మహాపూరుషులు పల్కగా, వారి పెద్దకుమారుcడైన శ్రీనివాసపెరుమాళ్ళుగారు వచ్చి యిప్పుడే వారినిc దీసికొని వెళ్ళిన మేము బ్రతుకలేమని, విడిచిపొండని ప్రార్థించెనcట. అంత వారు తీసికొనిపోక, యుండుటకు వీలులేదు. మీరంతగాc బ్రార్థించుచున్నారు గనుక నోషధీ ద్రవములో ముంచి యిచ్చెదము. ఎక్కువకాలము మాత్రముండుటకు వీలులేద"ని చెప్పి వెళ్ళిపోయిరcట. ఈ స్వప్నము వేకనూరిలోనున్న యొక భక్తురాలికి వచ్చెను. స్వామి కొంచెమారోగ్యము చేరిన పిదపc జూడవచ్చిన వారికెల్ల నెవరెవరెట్లు తనను గుఱించి దుఃఖించిరో దానినంతయుc

జెప్పుచుఁ బ్రశంసించుచుండఁగా నపుడు శోకించిన వారికి దానికిఁ బదిరెట్లానందము కలిగెను.

దక్షిణ దివ్యదేశయాత్ర

ఆ సంవత్సరము చైత్రమాసమున స్వామి దక్షిణదివ్యదేశ యాత్ర చేయ సంకల్పించిరి. వారొక శుభలగ్నమున రాధమ్మగారితోను, నలుబదిమంది వివిధగ్రామవాసులైన శిష్యుల తోడను, బయలుదేఱిరి. మొదటఁ దిరుమలకేగి, శ్రీనివాసస్వామిని దర్శించి, యటనుండి, మంగాపురము, తిరువళ్ళూరు, కాంచీనగరము, శ్రీపెరుంబూదూరు, శ్రీరంగము, శ్రీవిల్లుపుత్తూరు, శ్రీవైకుంఠము, కురుకాపురము, వానమామల మొదలగు ప్రసిద్ధ దివ్యక్షేత్రముల, సందర్శించుచు ననంతపద్మనాభమువఱకు నేగి, భగవద్వైభవమును దనివితీఱ ననుభవించి, యొక నెలరోజులకు, వెనుకకుఁదిరిగి మదరాసుమీఁదుగా నిండ్లకుఁ జేరిరి. స్వామి వెంట పటపటలాడుచున్న శతవృద్ధులైన ముదుసళులు బెక్కుమంది చనిరి. కాని యింతదవ్వేగివచ్చినను, వారిలో నెవరికి నేవిధమైన యపాయముగానీ, డబ్బు దొంగలు హరించుటగానీ, యిట్టివేవియు జరుగలేదు. దానికి స్వామి జాగరూకతయు, వారియందుఁ దాండవించుచున్న దైవానుగ్రహమును, గారణములు. ఆ వైశాఖమాసముననే చిన్నకుమార్తె వివాహమును గావించిరి. దానితో స్వామి తమ సంసారనాటకమున నిర్వహింపవలసిన యభినయమంతయు, ముగిసినట్లును, బరువంతయు దిగిపోయినట్లును భావించిరి. ఇఁక వారు సంతానమునకుఁ జేయవలసిన పెండ్లిండ్లు, పేరంటములు లేవు. ఆ సంవత్సర బ్రహ్మోత్సవమైపోయిన పిదప వేణుగోపాలస్వామి యాలయముప్రక్కన దపస్సునకై పదునైదు వందల రూప్యములు వ్యయించి "శ్రీ వేణుగోపాలసేవాశ్రమ"మనుపేర నొకమఠమును గట్టించిరి. ఉదయమును, సాయంత్రమును, నూరనున్న శిష్యులతో స్వామి నిరంతరము తమతపస్సు నందేచేయసాగిరి. వారిగ్రంథములు, పనిముట్లు నన్నియు నందే చేరిపోయెను. ఇంకను నామఠమును వృద్ధిపరచి, సంసారమువదలిన భాగవతుల, నెల్లర నందుఁజేర్చి రేయేరేయి పవలేపవలుగా భగవద్గుణానుభవ కాలక్షేపములు చేయవలయునని వారి సంకల్పము.

పుత్రవ్యాధి

ఒక సంవత్సరము మాత్రమే మూడవకుమారుఁడు హైస్కూలునం దాంధ్ర పండితుఁడుగా నుండెను. హృదయము దుర్బలమై యారోగ్యము చెడి యింటికిఁ జేరెను.

అసలు కుమారుఁ డుద్యోగమునకు వెళ్లుట మొదటనే స్వామి కిష్టముగాకపోయెను. "కులము గాని కులములో, దేశముగాని దేశములో గురువుల యవసరము లేకుండ వానికి వాఁడై వచ్చి, బోధించి, సమస్త శాస్త్రములను మనకు సర్వేశ్వరుఁ డిచ్చినది, యందఱివలెనే లౌకికోద్యోగములుచేసి, డబ్బు సంపాదించుకొనుటకుఁగాదు. వారి సేవచేయుచుఁ, దన్మహిమ నితరులకుఁ దెల్పుమనియే మనకిచ్చెను. సర్వపూరుషార్థసంధాయకమై యిహపర సాధకమైయున్న భగవత్పాదసేవోద్యోగము మనకుండఁ దుచ్ఛములై నశ్వరము లైన యీ యుద్యోగము లేల ? యవసరము లేదు. లక్ష్మీపతి నాశ్రయించిన మన కేలోపము నుండదు. "సర్వ లాభాయ కేశవః." ఇతరము లొక్కొక్కటి యొక్కొక్క ఫలమును మాత్రమే యిచ్చిన నిచ్చును. గేశవుఁడు సర్వలాభముల నిచ్చును. గావున నీ వుద్యోగమునకుఁ బోవలదు. నా యనంతరమున నీ భక్తి పీఠమును బరిపాలించుచు, భగవన్మహిమ ప్రకటనము లోకమున నీవు చేయవలయును. అందులకే నిశితమైన విద్యాబలమును నీకు శ్రీశుఁడొసంగినాఁడు. తొలుత వచ్చి నాయందుఁ బ్రవేశించినపుడు, వాఁడెవఁడో, యెట్టివాఁడో, నేనెఱుఁగను. అట్టి నన్ను దయాసముద్రుఁడైన యా లక్ష్మీపతి భోగ్యవస్తువునుగాఁ గైకొని సకలశాస్త్రజ్ఞాన మొసంగి, బ్రహ్మవేత్తలచేఁ గొనియాడజేసి, జగత్పూజ్యునిఁ గావించి, ధన్యునిఁ గావించెను. నా యొక్కనితో వాఁడు విడువఁడు. నా యనంతరమందు నా కుమారులైన మిమ్మును నిట్లే కరుణించుటకే, యాలయముతో సదనసన్నిధిని వెలసెను. పూర్వమొక మహాభక్తుఁడొక యూర నుండెనఁట. అతనికిఁ బెద్దయాస్తియుఁ గలదు. కుమారుఁ డొక్కఁడు. తండ్రి జీవితమంతయు మాధవార్పితముగా మనెను. మహాభక్తుఁడైన యా తండ్రి చనిపోయినపిదపఁ దనయుఁడేదో యుద్యోగమునకుఁ బోవలయునని ప్రయత్నించుచుండెను. అంతట నతని కాకస్మికముగాఁ గనులు రెండును బోయెను. అట్లు కన్నులు పోవఁగా, నేమికారణమా యిట్లు నేత్రములు వోవుట కని, విచారముతో నతఁడు నిద్రింపఁగా నా రాత్రి శ్రీహరి స్వప్నమున సాక్షాత్కరించి, "నీతండ్రి బ్రతికియున్నంతకాలమును నా పాదసేవ చేసెను. కావున నీవును నట్లే చేయుము. నీకుఁ గావలసినంత ధనమున్నది. దేహయాత్రకై సంపాదింపవలసిన యవసరములేదు. అట్లు నాసేవ యందుంటివా, కనులిచ్చెదను. కాదంటివా, నీగతి యింతే" యని చెప్పెనఁట. అంత నతఁడు చేయునదిలేక ప్రభూ! యట్లే నీ పాదార్చన చేయుచుండెదనని యా యుద్యోగ ప్రయత్నమును మానుకొనఁగా, నెప్పటియట్లు నేత్రములు వచ్చెనఁట. కావున నట్లే యుద్యోగమునకు వెళ్ళుటకు నిన్నును భగవానుఁ డొప్పుకొనఁడు. కాదని వెళ్ళిన నేదో యొక విధమునఁ ద్రిప్పుకొనియే వచ్చు" నని చెప్పి, కుమారుని వారించెను. అంత నతఁడు "స్వామీ! మీ యనంతరమునఁగద మేమీ పీఠమును సాగింపవలసినవారము, మీరుండఁగా మాబోంట్ల సహాయమవసరములేదు. కావున నీలోగా నేదో కొంత యుద్యోగముచేసి వచ్చెదను. ఊరక యింటికడనుండి చేయునదేమి ? యని



యేవేవో చెప్పి, స్వామిని సమ్మతిపరచి యుద్యోగమునకు వెళ్ళెను. చేసినది యొక్క వత్సరమే యైనను నచట నఖండమైన గౌరవమును, దన ప్రతిభాశక్తివలన నార్జించెను. కాని యేమిలాభము? స్వామి వాక్యమెట్లు తప్పును ? ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోనుధావతి = మహానుభావులైన మహర్షులవాక్కు ననుసరించియే యర్థము ప్రవర్తించును. అనఁగా వారిమాట యెట్లువచ్చునో యట్లే యగుచుండును. అట్లే కుమారుఁ డిఁక నుద్యోగముఁ జేయుటకు వీలువడక యారోగ్య భ్రష్టుఁడై స్వామి పలికిన యట్లే యింటికిఁజేరెను. ఇంటికి వచ్చియు నేవేవో మరలఁ బ్రయత్నములు చేయుచునే యుండెను. పోనిమ్ము, నేను మొదటనే చెప్పితినిగదా భగవానుఁ డొప్పుకొనఁడని. అట్లే జరిగెను. ఆరోగ్యము వచ్చుటకై మనకు నిలువేల్పైయున్న జగన్నాథుని నుతింపు మని "మౌని నుతలీల గాంగేయమయదుకూల! మదనగోపాల రాధికాహృదయలోల!" యనునొక మకుట మిచ్చి శతకమును జెప్పుమని వాక్రుచ్చిరి. కుమారుఁడును నా మకుటముతో నూఱు సీసపద్యములు చెప్పి శతకమును ముగించెను. ఉద్యోగప్రయత్నములును, జేయుచునే యుండెను. క్రమక్రమముగా వ్యాధి ప్రబలెను. హృదయ మత్యంతదుర్బలమై రక్తవేగ మధికమాయెను. నాలుగు నిమేషములు కూడ మాట్లాడలేక పోయెను. కూర్చుండినను, బరుండినను గూడ హాయి లేదాయెను. కాలము గడచుటయే దుర్ఘటమయ్యెను. అక్షరము కంటఁబడినఁజాలును. బ్రాణము వోయినంత పని యగుచుండెను. కుమారుని స్థితికి విచారపడి స్వామియు నతని మంచముకడనే శిష్యులతో భగవత్కథాకాలక్షేపములు చేయుచు, "నేనుండఁగా నీకేమియు భయములేదు. నీ కాపత్తుగల్గిన నేను బ్రతుకుదునా ? అట్టు లేఁబది సంవత్సరములనుండి యేకగ్రీముగాఁ దన పాదార్చనము చేసిన నన్నిట్టు లన్యాయముగాఁ జంపుటకు సర్వేశ్వరుఁ డుపక్రమించునా ? భయపడవల"దని కుమారునికి ధైర్యముఁ జెప్పుచు నతని కారోగ్యమిమ్మని వేణుగోపాలునిఁ బ్రార్థించుచుండెను. ఒకదినమున హృదయ చలన మత్యధికమై యప్పుడే ప్రాణమువోవునట్లుండెను. కుమారునకిఁక జీవింతునను నాస సడలెను. ఆసుపత్రికిఁ బోయిన నేమైన మేలు కలుగునేమో యని వాంఛించెను. స్వామ యాస్థితిలోఁ గుమారుని విడిచి యుండలేకయు, వైద్యమునందు నమ్మకము లేకయు "నాసుపత్రికి వెళ్ళిన నా వైద్యులవలన నేమియగును ? సర్వజగత్కర్తయు, శరీరయంత్రమును నిర్మించినవాఁడును, నగు జగన్నాథు నాశ్రయించిన మన కీ యజ్ఞులైన వైద్యులేల ? యొకవేళ వెళ్ళినను నావైద్యములవలన నేమియుఁ బ్రయోజనముండ"దని పల్కెను. వారి యధ్యవసాయమట్టిది. కుమారునకును స్వామి మహత్త్వము తెలియకపోలేదు. వారియెడనున్న భగవత్కరుణయు నతఁ డెఱుఁగనిది గాదు. అయినను నప్పటి బాధవలనను, గలిగినతందర వలనను, బ్రతి విషయమునకును, భగవానునిఁ గదలించి, తదనుగ్రహమును బడయుట సామాన్యమా ? వాఁడే జగత్తున నొక్కొక్క దానికి నొక్కొక్కదానిఁ బ్రతిహరముగా నిర్మించెను. "వ్యాధిర్భేషజ సంగ్రహైశ్చ"

యన్నట్లు, రోగములకు నౌషధములను శాంతికరములుగా వాఁడే సృజించెను. కావునఁ దగన యోషధులవలనఁ ద్వరలోఁ గుదురునేమో యను భావమువలనను, నాసుపత్రికే పోవ సిద్ధపడెను. తల్లి మొదలగువారితో రేపల్లెకు వెళ్ళియట నొక చికిత్సాలయమునఁ జేరెను. దీనివలన నాదినమున వారి యిల్లంతయు గగ్గోలుపడెను. స్వామి కుమారునికిఁ బైకి ధైర్యముఁ జెప్పుచున్నను, నా వ్యాధి వైఖరి చూడఁగా నధైర్యమును దోఁచుచుండెను. కానిమ్ము దైవమున్నాఁడు గదా యను దిటవును, వారికి లేకపోలేదు. అట్లుకుమారుఁ డుక్కిరిబిక్కిరియై యాసుపత్రికి వెళ్ళుటవలన స్వామి హృదయ మత్యంతఖేద పడెను. స్వామి మోహమును సడలించుకొన్న మహర్షియైనను, బుత్రులను మిక్కిలిగాఁ బ్రేమించెడివారు. ఎందువలననఁగా, వారును సదాచార విద్యావృత్తములుగల యసామాన్యులు. భగవద్భక్తికిని స్వామికిఁ దోడ్పైరి. గుణమహిమమునఁ జగత్తుచేఁ గొనియాఁడబడిరి. కావున దేహసంబంధమునకీ యాత్మసంబంధమును నిట్లు తోడగుటచే, స్వామి మానసము కుమారులయందు గాటముగా హత్తుకొనెను. సుశీల పాండిత్యాదులు గల కుమారు లందఱియందును వారి మానసము సమానమేయైనను, విద్యావిషయికముగా నొకవీస మా కుమారునియందు స్వామికిఁ బ్రేమ యధికమైనట్లు పరులకుఁ దోఁచెడిది. భగవత్కరుణచే నార్జించిన సహజపాండిత్యము వారిది. కావున నెటనైన యొక్కొక్క సందేహము వాఙ్మయమున వారికిఁ గలుగుచుండెను. అట్టి సందేహము లన్నియుఁ గుమారుఁ డెక్కివచ్చిన పిదప వారికిఁ దీఱిపోయెను. ఏ గ్రంథమును వ్రాసినను గుమారుఁడు దానినిఁ జూచిన నిఁక వారికి సంశయములేదు. అట్టి మహాపురుషులకు సందేహము లెక్కడివి ? సందేహమున్నట్లుడిగి కుమారునిచేఁ జెప్పింపఁజేయుట వారు ముద్దునకే సుమా!" భగవానుఁడు విద్యావిషయమున నిచ్చిన తోడువీఁడ''ని శిష్యులతోడను బరులతోడను జెప్పి స్వామి కుమారుని మురిసికొనుచుండెడివారు. అట్టి కుమారుని కీస్థితి పట్టెను. ఏమైన నాపవత్తుగలిగిన నిఁక నెట్లుబ్రతుకవలయునా యని స్వామి మిక్కిలి యాందోళనపడెను. స్వామిహృదయమున కానాఁడు తగిలినంత దెబ్బ జీవితమున నెప్పుడును దగులలేదు. శేషయ్యగారి భార్య లిరువురు నీవార్త విని, స్వామినిఁ జూచి పోవుట కింటికివచ్చిరి. వారు వచ్చునప్పటికి స్వామి దీనవదనముతోఁ జింతానముద్రమున మునిఁగి, వంటచావడిలో నేలమీఁదనే పరుండియుండిరి. వారును స్వామి ఖేదమునకుఁ గలంగి "నాన్నా! మీవంటివరికీ యాపత్తు రాదు. అట్లువచ్చిన నిఁక దైవసేవవలన ఫలమేమి ? క్రిందబరుండుటచే దుమ్మంతయు, బంగారువంటి మీ శరీరమున కలముకొనుచున్న" దని వారి శరీరమున కంటిన యిసుక నంతయుఁ దుడిచిరి.

కుమారుఁడొక నెల దినములు చికిత్సాలయమున నుండి ప్రయోజనముఁగానక యింటికిఁ దిరిగివచ్చెను. కొన్నిదినములైన పిదప బాపట్లనుండి యొక డాక్టరుగారు వచ్చి

తా నా వ్యాధినిఁ గుదిర్చెదనని తీసికొనివెళ్ళెను. రెండు మాసము లచటనున్నను ఫలమురవ్వంతయైనఁ గలుగక పైగా వ్యాధి హెచ్చెను. ఇఁక నావలనఁ గాదు గుంటూరు పొమ్మని డాక్టరు చెప్పెను. అచటనుండి గంటూరు వెళ్ళెను. ఆ వేసఁగిలో రైలుమీఁద నంతదవ్వు ప్రయాణ మాచరించుటవలన దేహము కదలి, యా వేళనే ప్రాణముపోవునేమో యన్నట్లుండెను. అచటి డాక్టరు పరీక్షించి, యొక పదునైదుదినములిచట నున్న నిది యేవ్యాధియో, కుదురునో, కుదరదో, చెప్పెదనని చెప్పెను. ఇఁక స్వామి కుమారుఁడచట క్షణమైన నుండలేకపోయెను. అపాయస్థితి తోఁచుచుండెను. ఇక వైద్యములవలన లాభములేదని విరక్తిఁజెందెను. ఇంటికిఁ బోవువఱకైనఁ బ్రాణము నిల్చునో నిలువదో యని సంశయపడి, వెంటనున్న తమ్మునితోడను, మామగారితోడను నిఁక క్షణమైన నిచటనుండును. ఇంటికి వెళ్ళిపోవలయును. మోటారు మాట్లాడుకొని రమ్మని, దానిమీఁద నెక్కి యెట్లెట్లో నాఁడు చీఁకటి పడుసరికి నింటికిఁ జేరెను. ఆకస్మికముగా బస్సు వచ్చుట వలన నింటి దగ్గఱివారు భయపడిరి. గబగబ సమీపించిరి. స్వామినిఁ జూడఁగనే కుమారున కెనలేని దుఃఖమువచ్చి యేడ్చెను. అంత స్వామి "నే నీ వైద్యులవలన నేమియు లాభములేదని చెప్పితినిగదా మొదటనే. కాని నీవు నిలవఁద్రొక్కుకొన లేకపోయితివి. ఇతరము మీఁద నాధారపడి యున్నంతవఱకు భగవన్మహిమ పనిచేయదు. నీ మానసము మందుల మీఁద నుంటచే నేనేదియుఁ జేయుటకు వీలుపడలేదు. ఇప్పుడు సర్వోపాయములును గట్టుబడిపోయినవి. ఇఁక నేచేయునది చక్కగాఁ బట్టును గావున నీవేమియు భయపడ నవసరములేదు. నేనుండఁగా నీకేమియు నాపత్తురాదు. ఈ వైద్యులకేమి తెలియును ? తగ్గిన మా శక్తి యందురు. లేకున్న నీకర్మ యందురు. ఔషధమును బట్టించువాఁడు, నారోగ్యమిచ్చువాఁడు సర్వేశ్వరుఁడుగాని యన్యులుగారు. నా తపోమహిమ వలన నచిరకాలములో నిన్నారోగ్యవంతునిఁ జేయుదును, నసాధ్యములైన పెక్కు కార్యము లా శ్రీహరితోఁ జెప్పుకొని నేను సాధించిన విషయము నీవును నెఱుఁగుదువు గదా" యని కేకలువేసెను. అప్పుడో యింకఁగొంత తడవునకో ప్రాణముపోవు ననుకొనుచున్న కుమారుని కా మాటలు సత్యములని యాశ కలుగనులేదు. బ్రహ్మర్షి కల్పుఁడైన తండ్రి యఘటనఘటనాసమర్థతయందలి విశ్వాసమొకమూల మినుకుమినుకు మనుచును నుండెను.

తపస్సు

రెండవనాఁడే స్వామి కుమారుని కారోగ్యము కలుగఁగలందులకుఁ దప మారంభించెను. ఊళులయందున్న శిష్యకోటికిని గొన్ని దినముల వఱకును "గురుపుత్రున కారోగ్యముగల్గుటకై" యని సంకల్పించి జపముఁ జేయవలసినదిగాఁ గబురులు పంపెను. ఊరియందున్న శిష్యులతోఁగూడ మఠమున నిట్లు జపమారంభించి స్వామిదినమునకుఁ

బదివేలు చొప్పున రామము జపించి కుమారునికిఁ దీర్థమిచ్చుచుండెను. ఊరిలోని శిష్యులు గావించిన జపమునంతయుఁ గుమారుని చేతిలో వదలించిననేమో యని స్వామి యుదకధారాపూర్వకముగాఁ దమచేతియందే వదలించుకొని యా జపఫలమును దీర్థమునఁ గలిపి కుమారుని కొసఁగిరి. జపమును శిష్యులతోఁ దమచేతియందు వదలించుకొను సమయమున సన్నని పూలవానవలెఁ జినుకులు పడెను. స్వామి తప్పక యిఁక వ్యాధికుదురును, శ్రీశుఁ డంగీకరించెనని సంతసించిరి. ఆహా! యేమి యావాత్సల్యము! ఏదైనఁ గుటుంబమున వ్యాధులు వచ్చినపుడు మంచముకడ వారుగూర్చుండి యుండగా శిష్యులుగానీ యితరులుగానీ యెవరో పదిమంది యెప్పుడును వారికడ నుండెడివారు. వారితో భగవద్గుణానుభవము చేయుచు స్వామి రోగికి ధైర్యము చెప్పుచుండగా నా మూర్తిని చూచుచు, నా మాటలు వినుచుండగా, వ్యాధియప్పుడే పోయినట్లుండెడిది. పోయెడిది కూడ. ఆ మాటలతీరువేఱు, అందలి సారము వేఱు. వ్యాధిగ్రస్తున కధైర్య మేమాత్రము నుండెడిదికాదు. అట్టి భాగ్య మిఁక నీమందభాగ్యులకు లేదుగదాఁ దినమునకుఁ బదివేలు చొప్పున ఘోరతపముఁ గావించి మూడునెలల పదిరోజులు విడువక తాము తీర్థమిచ్చిరి. శిష్యుల జపమునంతయుఁ దీర్థమునఁ గలిపి యిచ్చిరి. అప్పటికిని గుమారున కారోగ్యమేమియు రాలేదు. వచ్చునట్లును గన్పింపలేదు. స్వామి కధైర్యము తోఁచెను. తప్పక దీనితో వ్యాధినశించి కుమారుఁ డారోగ్యము నొందుననెడి విశ్వాసముతో స్వామి గావించిరి. భగవన్నామమునకే కాకపోయిన నిఁక నాపని దేనివలన నగును ? ఇంతపని చేసినను భగవానుఁ డంగీకరింపలేదేమిరా యని స్వామి మానసము చింతాసముద్రమున మునిఁగిపోయెను. పైకిఁ బుత్రునకు ధైర్యముచెప్పుచున్నను లోలోన వారి హృదయము ఘూర్ణిల్లి కృశించిపోయెను. అట్లు స్వామి మానసమును ఘోషింపఁజేసిన కుమారుఁ డెవరో యని పాఠకులు సందేహమపడుదురేమో! వారు భద్రాచలమునఁ దపస్సుఁ గావించుతఱి మాతృదేవికి గండము నాపాదించి, స్వామి మానసమునకు బాధకలుగఁజేసి నట్టియు, నీ యంతిమకాలమున వారిహృదయమును బుండుచేసి ఘోషింపఁ జేసినట్టియు నిర్భాగ్యుఁడ నీ గ్రంథకర్తనైన నేనే సుమీ!

ఇట్లుస్వామి యధైర్యపడి శిష్యులను నర్చకుని బిలిచి, యేఁబది సంవత్సరముల నుండి యడిగినపుడెల్ల ననిష్టములు నివారించి యిష్టములఁ బ్రాప్తింపఁజేయుచుఁ గర్తయై భోక్తయై తనను బ్రోచిన జగన్నాథుఁ డీసారి యెందువలననో యింతపనిచేసినను బలుకలేదు. పలుకక నన్నీవార్ధకమున నేమిచేయఁదలచె ? నని పరమేశ్వరునిపై నత్యంతముగా విసుగుకొనిరి. శిష్యులు మాత్ర మేమిచెప్పుదురు ?

ఇంతఁజేసినను బెరుమాళ్లు పలుకలేదుగదా యని వారెవరి మీఁద నలుగుదురు ? భగవానుఁడు తప్ప నిఁక నెవరుదిక్కు ? "కానిమ్మేమిచేసిను వాని పాదములే శరణ్యము.

ఇంకను జేసి చూతునుగాక, యాపన్నివారకుఁడని ప్రఖ్యాతినందిన వాఁడు, వేదాద్రి నారసింహుఁ"డని, యాభగవన్మూర్తిపై నొక శతకమును వ్రాయఁబూనెను. వారి హృదయమున నుదయించు నూహలు వేఱుగా నుండును. శతకము నారంభించి రెండుమూడు దినములు వ్రాసి "యెంతసేపు తలపగులఁగొట్టుకొనినను నేను గొట్టుకొనవలసినదే గాని "యీపని నిట్లు చేయుము, నీపని నెఱవేరు"నని చెప్పవైతివి. ఏరూపముననైన నీసారి శతకమును వ్రాయుమని నీవు చెప్పిననే మరల వ్రాయుదును. లేకున్న నిఁక వ్రాయను. ఏ పనిచేసినను, నీ వంగీకరించినదియు లేనిదియుఁగూడ నాకుఁ దెలియుటలే"దని భగవానునిపై నలిగి, వారు గ్రంథమును వ్రాయుట విరమించిరి. ఆహా! యనంతకోటిబ్రహ్మాండముల కధిపతియైన సర్వేశ్వరునిమీఁద నలుగుటకు వారికే తగును. ఏఁబది సంవత్సరములు సర్వకాల సర్వదేశ సర్వావస్థలయందును భగవత్సేవలో మునిఁగి యున్న, వారికిఁ గాక యన్యుల కా స్వాతంత్ర్య మెక్కడిది ?

స్వామి శతకమును మానిన రెండవదినముననే మిత్రులును, గవులును నైన శ్రీ గుదిమెళ్ళ రామానుజాచార్యులవారు ముక్తిపల్లి నుండి చూచిపోవుటకుఁ బూడివాడకు వచ్చిరి. స్వామి తామాశతకమును నారంభించి, మరల వాఁడేదైన నొకరూపమునఁ జెప్పినఁగాని వ్రాయనని శపథముఁజేసి మానితినని చెప్పిరి. ఆచార్యులు గారును వారువడెడి విషాదమునకుఁ జింతించి, "యయ్యో! మీరు శతకమును మానవలదు. వేదాద్రి నృసింహుఁ డిష్టార్థప్రదాత. తప్పక మీ పని నెఱవేర్చును. గొంత శతకమును వ్రాసి మీరు మానుట, పెద్దమనుష్య నొకని నన్నమునకుఁ బిలిచి, రాగా, వద్దు పొమ్మని నట్లుండును. శతకమును బూర్తిచేయుఁడు. వెంటనే ఫలమిచ్చు"నని నుడివి వెడలిపోయెను. మరల నీ వేరూపముననైనఁ జెప్పినఁగాని, వ్రాయనన్నందుల, కీరూపమునఁ బెరుమాళ్లు చెప్పెనుగదా యని సంతసించి స్వామి కుమారుని కారోగ్య మిమ్మని నూఱు సీసపద్యములతో వేదశైల నారసింహునిఁ బ్రస్తుతించి, శతకమును ముగించెను.

వేదాద్రి నరసింహశతకము

సీ. శ్రీకిశ్రీవై ప్రకాశించుటఁజేసి యా, శ్రీ నీ మహిషియై ప్రసిద్ధిఁగాంచె
రామచంద్రుండవై రాజిల్లఁగా లక్ష్మి, సీతావధూటియై చేరి కొలిచె
దేవకీసుతుఁడవై నీవు జన్మింపంగఁ, బద్మ రుక్మిణియై సపర్యఁజేసె
నరసురాద్యాకారధరుఁడవైనప్పుడు, సిరియు నా రూపము ల్పొందికొలిచె
సంపదలకుఁ బృథగ్విధసౌఖ్యములకు, హేతువైన కటాక్షంబుచేత మెలఁగు
భార్గవీదేవి నీ సొమ్ము పరమపురుష నరమృగాకార! వేదభూధరవిహార! 1

స్వామి యంతిమకవిత్వ మీశతకము. వారిచేవ్రాయఁబడిన ముద్రితాముద్రిత గ్రంథములివి.

ముద్రిత గ్రంథములు

(1) జ్ఞానసూర్యోదయము (2) గోపికావిలాసము (3) సీతారామప్రభావము (4) లక్ష్మీస్తవము (5) వరవరమునిహృదయము (6) భాగవతసురభూజము (7) క్రోధనాబ్దఝంఝా మారుతము (8) పండరిరగడ (9) వేదాద్రినరసింహశతకము.

అముద్రిత గ్రంథములు

(1) శ్రీనివాససహస్రము (వేయిపద్యములు) (2) శ్రీదేవీ సహస్రము (వేయి పద్యములు) (3) ఆంజనేయస్తవము (300 పద్యములు) (4) యతీంద్ర విజ్ఞాపనము (5) భద్రగిరిరామభద్రశతకము (6) పూడివాడ వేణుగోపాలశతకము (7) గోపాలకాష్టోత్తర శతకము (8) శ్రీ రామాష్టోత్తరశతకము (9) విషాదాగ్నిధారా సంపాతము (10) ఆశ్రిత కల్పశాఖి (సంస్కృత శ్లోకములు) (11) ముముక్షుజన ప్రభావము (12) విరోధి సంవత్సరదేశోపద్రవము, (13) శ్రీవిష్ణుసహస్రనామ పరాశర భట్టార్య భాష్యమునకుఁ దెలుఁగు. ఇంకను బెక్కు చాటువులు గలవు.

హరికథలు

(1) సీతాకల్యాణము (2) రుక్మిణీకల్యాణము (3) సత్యభామావిలాసము (4) శశిరేఖా పరిణయము (5) సైంధవనిబర్హణము (6) విరాటపర్వము (7) ఉత్తరగోగ్రహణము (8) చంద్రహాస చరిత్ర (9) నరసింహమేధచరిత్రము (10) జైమిని భారతము (మొత్తము కడుసొంపైనది) ఇంకను బెక్కుగలవు. నెఱదాతలైన యెవరి హృదయములందునో హృషీకేశు ఁడుచొచ్చి ముద్రింపగా స్వామియమూల్యములై భక్తి రసాప్లావితములైన గ్రంథముల ననుభవించు భాగ్య మాంధ్రుల కచిరకాలముననే గలుగుగాక.

కల

కోటయ్యగారు విష్ణుసహస్రమును, బారాయణము చేయుచుండఁగా మహాతేజస్వులును, జటాజినధారులునైన మహర్షులు ముగ్గురువచ్చిరి వచ్చి నీకీసహస్ర నామమును జదువుట కధికార మెవరిచ్చిరని ప్రశ్నించిరఁట. అంతటనాయన మాగురువుగారు శ్రీవేంకటదాస స్వామి వారి యానతిప్రకారము చదువుచున్నానని చెప్పఁగా, వారి నిటకుఁ

బిలుచుకొని రమ్మనిరి. కోటయ్యగారు స్వామినిఁ బిలుచుకొని వెళ్ళెను. స్వామి వారికి నమస్కరించి యేవేవియో సంగతులు కొంతవడి భాషించి, "పండితుఁడును, దేజస్వియైన నా మూడవకుమారుఁడనారోగ్యముచే బాధపడుచున్నాఁడు. ఓషధులేవియుఁ బనిచేయలేదుసరే మూడునెలల పదిరోజులు ఘోరతపస్సు చేసి తీర్థమిచ్చినను నతని కారోగ్యము రాలేదు. భగవన్నామమునకును నెదురుతిరిగిన దిదేమివింత ? యని నుడివెను. అంతనామౌనులు "కాదుకాదు, మీరు పొరబడుచున్నారు. మీతీర్థమహిమవలననే యింతకాలము నిలిచి యున్నాఁడు. లేకపోయిన దెబ్బతినెడివాఁడే, ఇటుపిలిపించుఁడని, కుమారునిఁ బిలిపించి, "యింక నీవ్యాధియేమియుఁ జేయదు. క్రమక్రమముగాఁ దగ్గిపోవును భయపడవల"దని చెప్పివెళ్లుచు సాగనంపుచున్న కోటయ్యగారిని విష్ణుసహస్రనామపారాయణ మొనర్చుచున్నావు. దురాచారములు లేక జాగ్రత్తగానుండుమని యందులోనున్న పెద్దఋషి, పెరిగిమెలికలు వారియున్నగోటితోఁ బొడిచెనఁట. పోటువెంటనే రక్తముబొలబొలస్రవించెను. ఆచుఱుకుతోఁ గోటయ్యగారికి మెలకువ వచ్చెను. ఆస్వప్నమున కాయన విభ్రాంతిపడి యుదయముననే వచ్చి స్వామికి విన్నవించెను. స్వామి యానందమునకు మేరలేకపోయెను. భగవానుఁడను గ్రహించె నిఁక నేమియు భయపడవలసిన పనిలేదని ధైర్యమునొందెను. ఆ సమయమున నేదియో యౌషధసేవ చేయుచుఁ గుమారుఁడు శ్వశురగృహమున దమ్మన్నగారి పాళెములో నుండెను. ఇట్లుస్వప్నమువచ్చినది గనుక నిఁకనేమియు భయములేదు క్రమముగా వ్యాధి తగ్గపోవునని రెండవకుమారునితోఁ జెప్పిపంపెను.

స్వప్నము వచ్చిన పిదప స్వామికిఁక నధైర్యము లేదు. కుమారుని కిట్లుకబురుచేసి. యాసంవత్సరము దీవిలోనికోడూరులో రామాయణ కాలక్షేపమునకు నరిగిరి. ఆయూరస్వామి పినతల్లికుమారులు గలరు. పెద్ద కుమారుఁడు గ్రామమునసబు వేంకటనరసయ్యగారు రెండవ కుమారుఁడు చిట్టియ్యగారు. వారును వారికుటుంబములును స్వామియం దత్యంత భక్తిశ్రద్ధలు గల శిష్యులు. వేంకటనరసయ్యగారి కుమార్తె హైమవతమ్మగారు. ఆమెకు స్వామియం దెంతభక్తియో యట్లే వారును నామెయందుఁ బుత్రికా వాత్సల్యముతో నుండెడివారు. వేంకట నరసయ్యగా రప్పటికి నాలుగైదేఁడుల క్రిందనే పరమపదించెను. చిట్టెయ్యగారు, హైమవతమ్మ గారు మొదలైనవారి ప్రార్థనవలన స్వామి తమయఱువదినాల్గవయేఁటఁ గోడూరులో మహా వైభవముగా రామాయణమును, రెండుమాసములు పురాణముఁ జెప్పిరి. పురాణమును ముగించి స్వామి యింటికివచ్చునప్పటికిఁ గుమారుఁడును నిల్లుసేరి కొంత యారోగ్యమును బొందియుండెను. పురాణముఁ జెప్పివచ్చుచు నదివఱకే ముప్పదిసంవత్సరములనుండి మిత్రులై యున్నవారును, భగవద్భక్తులు; బ్రాహ్మణులును, గోడూరుగ్రామవాసులు నైయున్న చామర్తి యక్కిరాజుగారి కుమారుని, సంస్కృతమునుఁ జెప్పుటకై వెంటఁదోడ్కొనివచ్చెను.

ఆయనయు నదివఱకే యాంగ్లమున స్కూలు ఫైనలు వఱకుఁ జదివియుండెను. స్వామినిఁ జూచినది మొదలు విడువలేక వారి వెంటఁబడి, చదువుకొనవలెనని యత్యంతభక్తితో వచ్చెను.

పరమపదగమనము

స్వామి పవిత్రచరిత్రము ముగిసిపోవుచున్నది. ఇఁక నం దొక్క ఘట్టము మాత్రమే మిగిలియున్నది. ఆ భాగమును వ్రాయుటకుఁ జేయి వడఁకుచున్నది. కనులనుండి బాష్పములు స్రవించుచున్నవి. మానస మూగిపోయి కాలుష్యము నొందుచున్నది. అయినను దప్పదు. ప్రత్యక్షముగాఁజూచి యా కార్యములన్నియుఁ జేతులారనొనర్చిన యీ కఠినుఁడాఘట్టమును మాత్రము వ్రాయలేఁడా ? వ్రాయ కేమిచేయును ?

స్వామి కఱువది రెండవయేఁటఁ బెద్దజబ్బు చేసెనుగదా. అప్పటినుండియు వారికిఁ గడుపునొప్పి యొకటి యారంభమాయెను. ఏదైన ననారోగ్యము కలిగినప్పుడు వైద్యులకడకేగి చికిత్సలు గికిత్సలు చేయుట వారికెప్పుడును లేదు. వారికన్నిటికిని పరమాత్మయే. రేఁబవళ్లు వారుచేయునది భగవత్సేవ. వారికి మందులతో నేమిపని ? ఇది యనుభవనీయమైన ప్రారబ్ధమని వారికిఁ దోఁచినవేవో యుపశాంతులు చేయుచుఁ గాలముఁ గడపుచుండిరి. మీబోటి మహాత్ములకుఁ గూడనిట్టి ప్రారబ్ధమేమిటియని యెవరైన నడిగిన మాబోటు లనుభవించిగాని, యట్టి వారికే తప్పలేదిఁక మనకఁ దప్పునా ? యని లోకమనుకొనదు. అందులకై మాబోంట్లకే యిట్టివి వచ్చుచుండును. ప్రారబ్ధమెవరికిని దప్పదని సమాధానముఁ జెప్పుచుండెడివారు. పుష్కలమై బంగారుచాయతో నుండు వారిశరీరము నానాఁటికిఁ గృశించిపోసాగెను. ఆ సంవత్సరము బ్రహ్మోత్సవమై భక్తులందఱును వెళ్ళిపోయినది మొదలు స్వామి మఠములో నఖండతప మారంభించెను. సూర్యోదయమగు సరికిఁ గాల్యములు దీర్చుకొనుట స్నానము, స్వరూపధారణము, నిత్యపారాయణము కూడనయిపోయెడివి. వెంటనే గడియారము మొదలైన పరికరములుగల చేతిసంచినిఁ గమండులువును దీసికొని మఠములోనికి వెళ్ళిపోయెడివారు. అచటఁ బదునొకండుగంటల వఱకు ఘోరతపస్సుచేసి యప్పుడు భోజనమునకు వత్తురు. వెంటనేభుజించి మరలనాసంచి తీసికొని మఠమునకు వెళ్ళిపోవుచుండిరి. అదివఱకు భోజన మాచరించి కొంతవడి యింటిదగ్గఱవారితో నేదో యిచ్ఛాగోష్ఠి సలిపి కొంతసేపు పరుండి సాయంత్రము మూడుగంటల నుండి వారిపని చూచుకొనెడివారు. అట్టిదిపోయి భోజనమైన వెనుక నొక క్షణముకూడ నింటికడ నుండుట లేదు. భోజనముఁ గూడ వేగిరముగా ముగించుకొని, వెళ్ళిపోవుచుండిరి. అట్లువెళ్ళి మరల సాయంత్ర మైదుగంటలవఱకుఁ దపస్సుచేసి యప్పు డింటికి వచ్చి తత్క్షణమే స్నానముఁ గావించి, మరల వెంటనున్న బ్రాహ్మణవిద్యార్థినిఁ

గూడc గలుపుకొని, రాత్రిభోజనసమయము వఱకును జపమే. దర్శింపవచ్చినవారెల్లరు స్వామినూరక చూచి నమస్కరించి పోవుటయేగాని, వారితో స్వామి విస్తారముగా మాట్లాడుట లేదు. అదివఱ కెవరైనవచ్చిన, వారు పోయెదమనినను, బోనీక భగవద్గాథలు చెప్పుస్వామి, యెవరితోడను నొక పదినిమేషములు కూడ మాట్లాడుటలేదు. ఒకటేజపము, పరుగుపరుగున స్నానముcగావింతురు. పరుగులు వెట్టుచు సంచిదీసికొని మఠమున కేగుదురు. పరుగుపరుగున వచ్చి, భుజింతురు. త్వరత్వరగా మరల మఠమునకుc బరువెత్తుదురు. ఏమిటో యా త్వర ? యెవరికిని దెలియలేదు! ఒక నిమేషము దేనివలననైన నాలస్యమైన నేదియో మునిcగిపోయినట్లు వ్యాకులపడసాగిరి. అట్టిలోక మెఱుంగని ఘోరతపంబున కారంభించిరి. రాత్రివేళ భోజనానంతరము కుమారులందఱును వారి సమీపమునకు వచ్చి యేవేవియో విద్యాప్రసంగములు, దైవప్రసంగములు గావించుచుందురు. మొదటి నుండియు వారి కుటుంబమున నదియొక యలవాటు. అట్లుకుమారులు వచ్చినను, స్వామి విప్రవటువుతో జపమునే చేయుచుండిరిగాని మాట్లాడుటలేదు. స్వామి మాట్లాడకపోయినను, గుమారులు వచ్చి, యట్లే కొంతవడికూర్చుండి వారినిదర్శించి యలవాటుచొప్పున వెళ్ళిపోవుచుండిరి. వైశాఖము, జ్యేష్ఠము, ఆషాఢము గడచెను. శ్రావణమున శ్రీకృష్ణజయంతి వచ్చెను. ఆ దినము మధ్యాహ్నము మాత్రము వారుతపస్సునాపి కోవెలలో వచ్చిన వారికి కొంతసేపు భగవద్విషయములు చెప్పిరి. మూడవకుమారునిc బిలిచి, శ్రీ భాగవతముc గొని కృష్ణావతారఘట్టమును బురాణము చెప్పుమరిని. అంతవఱకునుc గుమారునికి సరియైన యారోగ్యము రాలేదు. కొలదికాలము మాట్లాడుటే కష్టమగుచుండెను. సరిగా నొకగంట మాట్లాడుపాటి ధైర్యములేని స్థితిలో పురణాముచెప్పుటెట్లు ? చెప్పcగలనో లేనో యని కుమారుcడు పల్కెను. "పరవాలేదు. శ్రీశుcడున్నాడు. గ్రంథమును దీసికొను"మని స్వామి యానతిచ్చెను. ఆ సంస్కృతభాగవతమును నొక కుమారుcడు చదువుచుండcగా నీ కుమారుc డట్లే పురాణము జెప్పెను. ముగిసినపిదప వేంకటసుబ్బయ్యగారితో "వేంకటసుబ్బయ్యా! లక్ష్మీరమణుcడు మేలోర్చినవాcడును, గృపానిధియుc గనుక మరల నీనాcడు మనవానితోc బురాణమును జెప్పించి యీ యానందమును మనకిచ్చెను. ఇcకc గ్రమక్రమముగా సంపూర్ణారోగ్యమువచ్చును. భయపడవలసిన పనిలేదు. ఇంతకాలమునుండియుc బైకి ధైర్యముగానున్నను లోలోన ఘోషించితిని. ఈనాcడు మితిలేని యానందము నొందితిని. కృతార్థుడcనైతినిసుమా" యని పల్కెను. శిష్యులును జిత్తముచిత్తమని యానందించిరి.

మోదుమూడిలో నా సంవత్సరము భారతకాలక్షేపము జరుపవలయునని శిష్యులు వచ్చిరి. పదిదినములున్నతరువాత వచ్చెదనని లగ్నము నిర్ణయముcజేసి వారినిc బంపిరి. భాద్రపదశుద్ధమునc దపస్సు ముగించి యా దినమున దపశ్శాంతికై యేవేవియో

పిండివంటలు, ఫలాహారములు చేయించి శిష్యులను, బంధువుల నెల్లర రావించిరి. పెద్ద కుమారుని, మూడవకుమారుని జూచి రామాయణమును బట్టాభిషేకమువఱకు వరుసగా నుపన్యసింపుమనిరి. స్వామి సమీపమున నుండగా నెంత పండితునకును జెప్పుటకు స్వేచ్ఛయుండదు. వారి తేజోబలమట్టిది. ఇతరులు చెప్పుచుండcగా వారూరుకొనలేరు. ఆ ప్రవాహమాగదు. వారి వాక్కునకున్న మాధుర్య మితరులవాక్కులందు లేను లేదు. అందువలనc గుమారులు సందేహించుచుండcగా స్వామి, 'సరే నేనే జెప్పెద"నని ప్రారంభించిరి. దేహము కృశించిపోవుటచే వాక్కు వెనుకటివలె దృఢముగా వచ్చుటలేదు. అయిననేమి ? యాహా! యేమి యాయుపన్యాసము ? భగవద్గాథనెత్తుకొనినది మొదలు, మాటమాటకు వారిదేహము తన్మయమగుచుండెను. శ్రోతలానందవార్ధి మునిcగిపోయిరి. రామపట్టాభిషేకమువఱకు నట్లుపన్యసించి, యాఫలాహారములను భగవన్నివేదితములc గావించి పంచిపెట్టిరి. వారి జీవితమున నెప్పుడును నిట్లు తపశ్శాంతి యనియో, గ్రంథారంభమనియో, గ్రంథవిరమణ మనియో, యేదోయొక విశేషమును గల్పించి రెండునెలల కొకపరియైన నిట్లు గావించు చుండెడివారు.

ఇcకc బురాణమునకు వెళ్లుట యొకవారము దినము లున్నది. విశ్రాంతి యని గాcబోలు స్వామి తపస్సు విరమించిరి. తపశ్శాంతిc గావించిన రెండవనాc డుదయమున స్వామి నిత్యానుష్ఠానము ముగించుకొని చావడిపంచలోc గూర్చుండియుండిరి. ఇంటికడ నున్నప్పుడు వ్రాసికొనుట, యనుష్ఠానము మొదలైనవి యా పంచలో వారు చేయుచుండెడివారు. అందులకై యా పంచను గచ్చువేయించి సిమెంటుతో నచట నొకసొరుగును, బరికరములు దాcచుకొనుటకుc జేయించిరి. అట్టితఱి సుబ్బారాయcడను నొక సన్నాయివిద్వాంసుcడు స్వామిని దర్శింపవచ్చి నమస్కరించి కూర్చుండెను. ఇట్టి సంగీత విద్వాంసులు, పండితులు, కవులు, నటకులు స్వామి కెంతమంది శిష్యులు, స్నేహితులు, పరిచితులు ? వారి జీవితము నిత్యానందకోలాహలము.

ఆ సుబ్బారాయనితో మాట్లాడుచు స్వామి, "సుబ్బారాయcడూ! అయిపోయినది యీ జీవితనాటకము. నేను వచ్చినపని ముగిసిపోయినది. ఛీ! ఛీ! యీ తుచ్ఛలోకమును జూచిన రోcతవేయుచున్నది. స్వయంప్రకాశమానమైన శాశ్వత విష్ణులోక సామ్రాజ్యమున సహస్రస్తంభవిరాజితమగు తిరుమామణి మంటపములో నిత్యముక్తులతో భగవదానందమును, జూరcగొన మానసము త్వరపడుచున్నది. నే నావలికి దాcటిన నిcక నీ రాష్ట్రమున నీభగవద్భక్తి చేయుమనువాడు. భగవద్విషయమును జెప్పువాడు నుండడు త్వరలో నా పరమవైష్ణవసాయుజ్యమునకు వెళ్ళిపోయెద"నని యిట్లు చెప్పుచుండిరి. చిత్తము, చిత్తము నిశ్చయమని యతcడు వినుచుండెను అరుగుమీcదc గూర్చుండి యెదురుగా

బొట్టుపెట్టకొనుచున్న మూడవ కుమారున కీ మాటలు వినఁబడెను. నేను వెళ్ళిపయిన నిఁక భక్తిప్రచారముఁ జేయువారుండరని స్వామి యప్పుడప్పు డనుచుందురుగాని మిగిలినమాట లెప్పుడును వారినోట వెలువడలేదు. ఆ మాటలు వినఁగనే కుమారున కత్యంత దుఃఖము వచ్చెను.


అతఁడు నాఁడు భోజనము కాగానే స్వామియు రాధమ్మగారును నుండు చావడిలోనికి వచ్చెను. స్వామి భోజన మాచరించి యప్పుడే సంచిఁదీసికొని మఠములోనికి వెళ్లుచుండెను. వారి శరీరమును జూడఁగనే కుమారునకుఁ బ్రొద్దుటినుండియు నంతర్గతమైయున్న దుఃఖము పొరలివచ్చెను. పుష్కలమైయుండు నట్టిదివ్యశరీరమున కిట్టిమార్పు వచ్చినది! ముఖమునందు మాత్రము శాంతియుతమైన బ్రహ్మతేజము తొణికిసలాడుచుండెనుగాని మిగిలిన శరీరమంతయు చిక్కి ముడుతలువాఱి యుండెను. స్వామి వెళ్ళిపోయెను. కుమారుఁ డుదయమున స్వామి పల్కుచున్న మాటలు తల్లిగారితోఁ జెప్పి శోకించెను. ఆమెయు నత్యంతముగా దుఃఖించెను. స్వామిసరిగా భోజనముచేసి యప్పటికి షుమారు సంవత్సరమగు చున్నది. దేహము చిక్కిపోవకేమగును ? వారి హృదయములు స్వామిశరీర మిట్లున్న నిఁక నెక్కువ కాలము నిలువనేరదని యశుభమును శంకించినవి. అందుచే నవశమై, దుఃఖము పొరలిపోయెను.

స్వామి మరల సాయంత్రము మూడుగంటలకు నింటికి వచ్చెను. అట్టితఱి రాధమ్మగారు స్వామితో "నిందాక దాశరథవచ్చి, మీ శరీరమిట్లయినదనియు, మీరేదో ప్రొద్దున సుబ్బారాయనితో ననుచున్నారనియు మిగుల దుఃఖించి వెళ్లె"నని చెప్పెను. తానును దుఃఖించితినని చెప్పక కుమారుఁడు దుఃఖించెనని చెప్పెను. ఎందువలన ననఁగా నామె యదివఱకే యొకటిరెండు పర్యాయములు "మీ శరీరము మిక్కిలి కృశించిపోవుచున్న"దని దుఃఖపడఁగా స్వామి "మీబోంట్ల కెప్పుడు నిదియే యజ్ఞానము. ఒకవేళఁ గృశించిపోయినఁ బోవనిమ్ము. దేహములు శాశ్వతముగా నుండునా ? యెప్పటికైనఁ బోవలసినదేగదా!" యనుటయు "మీరు లేకున్న మేము బ్రతుకుటె"ట్లని యామె పలుక, స్వామి "బ్రతుక కేమి చేయుదురు ? నేను శాశ్వతముగా నుందునా ? నేనున్నంత వఱకు మీకు మేలగుమాట వాస్తవమే. అట్లని నేను సర్వకాలమునుండ వీలగునా ? సర్వశేషి సంకల్ప మెపుడు వచ్చిన నప్పుడు వెళ్లిపోవలసినదే. తప్పున దేమున్నది ? నా పెద్దలు, తండ్రి, తాత మొదలగువారున్న నాకును బాగుగనే యుండెడిది. మఱి వారు వెళ్లిపోయిరిగదా ?" యని యామెను నిరుత్తరను జేసి కోపించుటయు జరిగియుండెను. అందువలన నామె, కుమారుఁడు శోకించెనని ముందుఁ జెప్పి తరువాతఁ దానును దుఃఖించితినని చెప్పెను. స్వామికిఁ బ్రమాదస్థితి యేర్పడుచున్నదని, వారి శరీరమును జూచినవారికిఁ దెలియుచున్నదిగాని, వారికి నితరు లను నంతగా లేదని

తో(చుచుండెను. అందువలన నెవరైనఁ గృశించుచున్నారనిన, వారిపైఁ గోపపడెడివారు. కుమారుఁడు శోకించెననఁగనే, యందులోఁ గొంత సత్యమున్నదని స్వామి గ్రహించెను. అందఱివలె నతఁడు మూఢుఁడుగాడు. పండితుఁడు. హృదయవైశాల్యముగలవాఁడు. తనకుఁ దెలియకయే తనశరీరమునకుఁ బ్రమాదస్థితి యేర్పడుచున్నది గాఁబోలునని, మఱియేమి భావించిరో వెంటనున్న బ్రాహ్మణ వటునితో నావలివైపుననున్న యా కుమారునిఁ బిలుచుకొని రమ్మనెను.

స్వామి పిలుచుచున్నారనఁగనే కుమారుఁడు తాము దుఃఖించిన విషయమును దల్లిగారు చెప్పియుండునని తెలిసికొని వచ్చెను. స్వామి చావడిలో నొకచోఁ గూర్చుండి యుండిరి. తల్లి యొకచోఁ గూర్చుండి యుండెను. కుమారునిఁ జూడఁగనే స్వామి కనులు బాష్పపూరితములైనవి. అతఁడును నాఁడంతయు విషాదగ్రస్తుఁడైయే యుంటచే నవశమైన శోకభారమున మునిఁగెను. స్వామి యతనిని దగ్గఱగాఁ గూర్చుండుమని గద్గదస్వరముతో ననిరి. కుమారుఁడును నశ్రువులఁ దుడిచికొనుచు నటఁగొంతవడి గూర్చుండెను. స్వామియు నిఁక నేమియుఁ బలుకలేదు. పుత్రుఁడును నేమియు మాట్లాడలేకపోయెను. కొంతవఁడికి స్వామి లేచివెళ్ళిరి. అంతర్విషాదభార మంతపనిచేసినది. రెండవనాడు శిష్యులుకూడ నుండఁగా మరలఁ గుమారునిఁ బిలిచి దుఃఖింపవలదనియు, నప్పుడే తమకేమియుఁ బ్రమాదము లేదనియు నోదార్చిరి. ఇట్టిస్థితిలో మోదుమూడికిఁ బురాణము చెప్ప వెళ్ళెదమనుచున్నారు. చెప్పఁగలరా యని కుమారుఁ డడిగెను. అంతవారు "ఒకప్పుడు నేను చెప్పుచున్నానఁటరా. లోపలనున్న వాఁడే చెప్పును. ఇదివఱకు నా శక్తివలనఁ జెప్పియుంటిని గనుక, నిప్పుడది లే దెట్లు చెప్పవచ్చు ననుకొందునా ? ఎప్పుడును లోపలనుండి వాఁడే పల్కును. ఫరవాలే"దని సమాధాన మిచ్చిరి.

శిష్యుల కెల్లరకును "నిది నా యంతిమపురాణము. చూడఁదలఁచినవారును, వినఁదలఁచినవారును దప్పకరావలయునని లేఖలు వ్రాయించిరి. మోదుమూడినుండి శిష్యులు, స్వామినిఁదీసికొనివోపుటకు వచ్చిరి. భాద్రపద బహుళ విదియరోజు భోజనానంతరము, రెండవకుమారునితో, విప్రవటునితో, స్వామి ప్రయాణము సాగించిరి. మరల రెండుమాసములకుఁగాని గానిపింపరని, శిష్యులు, నభిమానులు కుమారులు, కూఁతులు, కోడండ్రు, నందఱు వారి ప్రయాణసమయమునకు నచటికిఁ జేరిరి. పాదములపైఁ బడి నమస్కరించు కూఁతులఁ గోడండ్ర, నితరుల నొక్కొక్కరినిఁ బదేసినిమేషముల వంతున గద్గద స్వరముతో నశ్రుపూరితములైన నేత్రములతో స్వామి "యారోగ్యమస్తు, ఐశ్వర్యమస్తు, ఆయుష్యమస్తు, ధనధాన్యసమృద్ధిరస్తు"ని యత్యంతముగా దీవించిరి. అది యంతిమాశీర్వాదము గాఁబోలు, నప్పుడెవ్వరెఱుఁగుదురు ? నమస్కరించు కుమారుల నట్లే యాశీర్వదించి శిరంబుల



కోట చిట్టియ్యగారు, కోడూరు

మూర్ఛాని కౌంగిలించుకొనిరి. మూడవకుమారునికి వ్యాధిలో వేంకటేశ్వరస్వామికి మ్రొక్కుబడిగాఁ దలపెంపుచేయించిరి. "నేను లేనని నీవాగవలదు. ఆశ్వయుజమునఁ దప్పక తిరుమలకేగి, స్వామిని దర్శించి, మ్రొక్కుబడి దీర్చిరమ్ము. అప్పుడుగాని నీకు సంపూర్ణారోగ్యము రాదు. పురాణము చివరిలో నీవును రమ్మ"ని యతనితోఁ జెప్పిరి. ఇతర కుమారులఁ గూఁతులఁ జూచి "యారోగ్యము సరిగానుండిన వానికై చింతింపవలసినపని యుండెడిదిగాదు. లోకాతీతములైన యట్టి విద్యాజ్ఞానశక్తులు భగవానుఁడు వాని కొసంగెను. ఎచటికివెళ్ళి కూర్చుండినను వానికిఁ గొఱఁతలేదు. ఆరోగ్యము చెడుటచే వ్యవసాయాదులు చక్కగాఁ జేయంచుకొనలేక తన విషమస్థితికై దిగులుపడును. అట్లు దిగులొందనీక మీరెల్లరు సహకరించుచుండుఁడు. ఉపకరింపఁదగిన గొప్ప యుపాధి. ఈ సమయమున వానిని నిలువఁబెట్టుకొనిన పిదప నెల్లర నుద్ధరించు"నని యిట్లప్పగించినట్లు చెప్పి బండి నెక్కిరి. ఆహా! యేమి యా వాత్సల్యము! ఆఘట్టము, నామాటలు దలంచిన హృదయ నిర్భేదమగుచున్నది. నీవు బ్రతుకకున్న నేను బ్రతుకనని భగవానునితో హెూరాహెూరిగాఁ బోరి ఘోరతపస్సు నాచరించి నన్ను భూమిపై నిలువఁబెట్టి యంతవఱదాఁక ఘోషించిన బ్రహ్మర్షి, ప్రేమమూర్తి, ఆనందములకు నెలవు, పరమయోగి, సర్వవిధరక్షకుఁడు సర్వభారవహుఁడునైయున్న యట్టి పరమహంస లోకమును విడనాడి పోవఁగా నిఁక నీ మందభాగ్యుఁ డెందులకు బ్రతికియుండెనో తెలియదు.

ఎన్నిసారులు వారు పురాణమునకు వెళ్ళుటలేదు ? వచ్చుట లేదు ? కూఁతుల, కుమారులు మొదలైన యెల్లరకును నా సమయమున నేమిటో యీశ్వరసంకల్పము దుఃఖము వాగలైపోయెను. స్వామియందును దుఃఖము గానవచ్చెను. శిష్యులు, కుమారుల కొంతదూరము బండివెంట ననుగమించి, స్వామి యాజ్ఞగొని దీనాననములతో మరలిరి.

స్వామి మోదుమూడికి నేగి పురాణమును బ్రారంభించిరి. వారినిఁజూచి యచటి వారెల్లరు పురాణమును జెప్పగలరా యని, సందేహపడిరి. మీరు సంకోచపడ నవసరము లేదు. నాలోపలనున్న సర్వేశ్వరుఁడుగాని చెప్పునది నేనుగాదు. ఫరవాలే"దని స్వామి వారితో వచించిరి. పురాణము జెప్పునపుడు స్వామికి వెనుకటివలె సింహగర్జనలు, కేకలులేవుగాని, శోభకేమియుఁ దఱుగులేదు. శ్రోత లానందపరవశు లగుచుండిరి. ఇరువదిరెండురోజులు గడచెను. పూడివాడలో దేవాలయ ధ్వజమూర్తికి నిత్తడితొడువు వేయుటకుఁ బ్రయత్నములు జరుగుచుండెను. స్వామి మూడవకుమారుఁడు తిరుమల కేగుటకులగ్నము నిశ్చయించి స్వామికిఁ దెలియఁజేసెను. పెద్దకుమారుఁడైన శ్రీనివాస పెరుమాళ్ళుగారినిఁ బురాణముకడకుఁ బంపుటకై రెండవకుమారుఁడగు వేంకటాచలపతిగారు గృహమునకు వచ్చిరి. ఆయన వచ్చునపుడు స్వామి "దాశరథి తిరుపతికిఁ బ్రయాణమగుచున్నాఁడు

గాంబోలు. రైళ్ళలోనది కడుజాగరూకతతోఁ బ్రయాణముచేయుమని చెప్పు"మని చెప్పి పంపెను. శ్రీనివాసపెరుమాళ్ళుగా రాశ్వయుజ శుద్ధదశమినాంటికి మోదుమూడికి వెళ్ళెను. దాశరథి పూడివాడలోఁ దిరుమల కేగుటకై నేకాదశీదినమునఁ గలశస్థాపనముఁ గావించి బంధుగులతో జోగి ప్రారంభించెను. ఊరిలోనున్న స్వామి పెద్దకుమార్తె రామబాణమ్మగారి కుటుంబమున్ను దిరుమలకేగుటకై యట్లే కలశస్థాపనముఁ జేసికొని జోగి ప్రారంభించిరి. ఆనాఁడు వారు నాలుగూళులు దిరిగిరి. భగవద్దర్శనమునకై యాత్రఁ గావింప మహోత్సాహముతో నా కుటుంబములు రెండును నుండెను. ఆదినముననే యట మోదుమూడిలో స్వామి ప్రభాతముననే లేచి శిష్యులతో బాహ్యమునకేగి స్నానమాచరించి వచ్చి పదిగంటలవఱకు నిత్యానుష్ఠానమును గావించి, బ్రాహ్మణ వటునితో "నీ దినమున ననుష్ఠానము లెస్సగాఁ గావించితి"నని నుడివిరి. పదిగంటలనుండి వారికత్యంతముగాఁ జైత్యము వికారించెను. హృదయకోశమున గఠినమైన నొప్పి యారంభించెను. శిష్యులేవేవియో తేనె మొదలగునవి తెచ్చియిచ్చిరి. కాని శాంతింపలేదు. స్వామి ముసుఁగుపెట్టుకొని యావేళ నేను భోజన మాచరింపనని గదిలోఁ బండుకొనిరి. వైద్యునిఁ బిలుచుకొనిరమ్మందురా యని శిష్యులడిగిరి. 'వలదు వలదు వైద్యుఁడు వచ్చి చేయునదేమిగల ?' దని స్వామి వారించిరి. ఇతర గ్రామములనుండి వచ్చియున్న శిష్యులు, నాయూరియందలి శిష్యులును స్వామి బసచేసిన యిల్లంతయు నిండునట్లు విచారపడుచు గూర్చుండి యుండిరి. స్వామి యెట్టిస్థితిలోనైన భోజన మాచరింపక యెప్పుడు నుండలేదు. పండ్రెండు గంటల ప్రాంతములో సమాజమునకు శిరస్సువంటి శిష్యుండును, గార్యనిర్వహణదక్షుఁడునైన కృష్ణదాసుగారిని స్వామి పిలిచిరి. ఆయన వెంటనే మంచము సమీపమునకు వెళ్ళెను. స్వామి యాయన చేతినిఁబట్టుకొని "కృష్ణదాసూ! ముప్పది సంవత్సరములనుండి నా తర్జనభర్జనలు సహించి మీబోట్లందఱును బడియుండిరి" అని యంతవఱకుఁ జెప్పిరి. పైని నిఁక మాట్లాడలేకపోయిరి. కనుల నశ్రువులు గ్రమ్మెను. స్వామి యామాట యనుటతోడనే శిష్యుఁడు కంపించి దుఃఖించెను. స్వామి కదిలోకమును విడుచుచున్నానే యను దుఃఖముగాదు. ఇంతకాలమునుండి రక్షించుకొనివచ్చిన యా యాత్మలన్నియ నేనువెళ్ళినతరువాత, నేమయిపోవుదురో యన్న దయ వారినట్లు బాధించెను. అటనున్నవారెల్లరు శోకించిరి. స్వామి యిఁక నేమియుఁ బైనిఁ జెప్పలేదు. పెద్దకుమారుఁడును దగ్గఱకు వచ్చెను. గొంతసేపటికి స్వామి యీ మాటు మాత్రము ప్రాణములు నిల్చునట్లుండలేదురా యని పల్కిరి. స్వామి దేనినిఁజెప్పిన దానిఁజేయుటయేగాని యదియేమి, యిదియేమి ? యని స్వతంత్రించి కుమారులుగాని, శిష్యులుగాని, యితరులు గాని, యెట్టి పరిస్థితిలో నడుగలేరు. అట్టి తేజోమూర్తి యది. స్వామి శిష్యులను భోజనము లాచరించి రండని పల్కెను. ఆ వేళ

నిఁకఁ బురాణములేదు. వచ్చిన వందల కొలఁది జనులు స్వామికి శరీరములో స్వస్థతగాలేదని తెలిసికొని వారినిఁ జూచి రేఁపువత్తముగదా పదండని వెళ్ళిపోయిరి. సాయంకాలమాయెను. స్వామికి బాధ తగ్గలేదు. అట్లే ముసుఁగు వెట్టుకొని పరుండిరి. శిష్యులు కాళ్లుపిసుకుదుమని వచ్చిరి. ఎవరును నా శరీరము నంటవలదని వారించిరి. సాయంకాలము డాక్టరు నెవరినైనఁ బిలుచుకొనివత్తుమని శిష్యులు వచ్చి, స్వామి నడిగిరి. "ఏమియు లాభము లేదు. అయినను పిలుచుకొనిరం"డని స్వామి యానతిచ్చిరి. వైద్యుఁడవనిగడ్డనుండి వచ్చిచూచి నిస్సారతగా నున్నదని గ్లూకోజింజక్షను నిచ్చెను. స్వామి బ్రాహ్మణ బాలునిఁబిల్చి "యీ వైద్యములవలన, నీ యింజక్షనలవలన నేమియు లాభములేదు. ఇంక మూడునాలుగు సంవత్సరములు నేనుండిన నిన్నొక మార్గముఁబట్టించి కడతేర్చెడివాఁడను గదా!" యనిరి. ఆ వటుఁడును విషాదగ్రస్తుఁడై కొంతవడి వారి సన్నిధిని గూర్చుండి యావలికి వెళ్ళెను. వచ్చినదాది యా బాలుఁడు స్వామికి దైవభావముతో రాత్రిందివములు మహాసపర్యఁ గావించెను. అట్లే వారును నబ్బాలకు నైదవకుమారునిఁగాఁ బ్రేమించిరి. శిష్యులందఱునట్లే కూర్చుండియుండిరి. రాత్రి తొమ్మిదిగంట లాయెను. స్వామి యల్పశంకకు లేచిరి. పట్టుకొనెదమని శిష్యులు వచ్చిరి. స్వామి పరుండు మంచము కొంచెము గుంటపడెను. ఆ నవ్వారునంతయు శిష్యులు గబగబ బిగించిరి. బిగించువఱకును స్వామి ముసుఁగువైచుకొని కూర్చుండి యుండిరి. బిగించిన పిదప లేచివెళ్ళి పరుండిరి. అందఱు భోజనములకు వెళ్ళిరి. కుమారుఁడు మున్నగువారిని స్వామి భోజనము చేయుఁడని నియమించిరి. పిదప నాగదిలో స్వామి మంచముక్రింద నొక చాఁప వేసికొని బ్రాహ్మణబాలుఁడు మాత్రము పరుండెను. మిగిలినవారందఱు గదికి బయటను, నరుగులమీఁద బరుండిరి. పదిగంటలు దాఁటినతరువాత నెవరిదో క్రొత్తధ్వని యొక చిన్న కేక స్వామి పరుండిన గదిలోనుండి వినవచ్చెను. ఏమిటది యని శిష్యులదరిపడిలేచి గదిలోనికిఁ బరువులెత్తి స్వామి "నయ్యా! యయ్యా" యని పిలిచిరి. స్వామి పలుకుట లేదు. తలలు గొట్టుకొని యేడవఁదొడంగిరి. పెద్దకుమారుఁడును, గృష్ణదాసుగారును వచ్చి ప్రక్కకుఁ బరుండియున్న స్వామిని సరిగాఁ ద్రిప్పిరి. ఒక్కసారిగా స్వామియంతిమ వాయువును వదలిరి. శిష్యులకును, గుమారునకును నాకస్మికముగాఁ గలిగిన యీవిపర్యయమునకు లోకము తెలియకుండఁబోయెను. ఒక చిఱుచాపవైచి స్వామి భౌతిక శరీరము నరుగుమీఁదఁ బరుండఁబెట్టిరి. వందలకొలఁదిగా నేడ్చుశిష్యుల యార్తధ్వని యత్యంతముగా రేగెను. స్వామి యత్తగారైన సోమమ్మగారును వచ్చి వారిపాదములపైఁ బడి విలాపించెను. మోదుమూడిలోని జన మాబాలగోపాలము కదలి యటకువచ్చి "యిఁక దర్శింప లభింప వీ దివ్యపాదములని మాటిమాటికి నాపాదముల సన్నిధి వ్రాలుచు రోదనము సేయ నారంభించిరి. శిష్యులు, శ్రీనివాసపెరుమాళ్లుగారితో స్వామి కిచటనే సంస్కారముఁ

జేయుదము. దీవిసీమయంతయు రేఁపీ వార్త విని కదలివచ్చును. స్వామికిఁ దగినట్లు దైవముగా సంస్కారము జరుగును. ఇంటికిఁ గబురుచేయుదమనిరి. ఆ మాటల కాయన "యీవార్త విన్నపిదప నింటిదగ్గఱనున్నవారిఁకఁ గదలిరాలేరు. సమంజసమైన పనిగాదు. మనమే వెళ్లిపోవలయు"నని వాక్రుచ్చెను. అర్ధరాత్రమది. క్రిందటిదినమువఱకు వర్షము కురిసెను. రేవడినేల యగుటచే నచట జబ్బులబంటిగా బురద దిగుచుండెను. అట్టిస్థితిలో స్వామి శరీరమును బూడివాడకుఁ గొనిపోవలయును. నిమేష ముండుటకు వీలులేదు. స్థాయిగాఁ బ్రయాణము చేయుటయు గాదు. లోకముఁ దెలియని దుఃఖభారము ప్రతివారి హృదయముల నలముకొనియుండెను. ఎట్టి విషమపరిస్థితిఘటించెను దైవము ? బలిష్ఠములైన యెడ్లను గట్టి రెండుబండ్లు సిద్ధముఁ జేసిరి. స్వామి భౌతికదేహమును బండిపై నెక్కించిరి. సామాను లొకబండిమీఁద వేసిరి. వందలగొలఁది జన మా చీఁకటి తొడుగులో బురదలో రోదనము గావించుచు బండ్లవెంట వెడలిరి. పెద్ద బురదవచ్చినచోట మహాజనము వెంటనుండుటచే వారుపట్టి పెకలించి బండ్లు దాఁటించుచుండిరి. ఏటికడకుఁ జేరిరి. ఆ యద్దమరేయి నా నది నెట్లుదాఁటవలెను ? స్వామి శిష్యుఁడును వారి వదినెగారి యల్లుఁడును, నైన కుటుంబయ్యగా రాయూరిలోఁ బెద్ద రైతు. ఆ ప్రాంతమున నాయనకు మంచి పలుకుబడి గలదు. అందుచే నప్పుడే యాయన మాటవలన నదిలో నొకలాంచియుఁ బడవయును వేసిరి. లాంచియును బడవయుఁ బట్టినంతవఱకు జనమెక్కిరి బండ్లును, మిగిలినవారును దిరిగిపోయిరి. పడవలోఁ బెట్టిన స్వామి దివ్యదేహమునొద్దఁ గృష్ణదాసుగా రుండెను. ఆయన కొంతవడి యా దేహమును గౌఁగిలించుకొనును. కొంతసేపు కండ్లకద్దుకొనును. కొంతకాల మాదివ్యాంగముల నదేపనిగా "నిఁకఁగానరావు గాఁబోలు"నని వీక్షించును. ఆ పాదములకడఁ గొంతసేపు పరుండును. కొంతవఱ కా పవిత్రపాదముల నౌదలఁ బెట్టుకొనును. ఎన్ని చేసినను స్వామి వారించుటలేదుగదా! తెల్లవాఱుసరికి నేఱుదాఁటిరి. స్వామి దివ్య దేహము నొక యశ్వశకటమున కెక్కించిరి. వెంటఁ గృష్ణదాసు గారును నెక్కెను. మిగిలిన శిష్యులును శ్రీనివాసపెరుమాళ్లుగారును, బస్సులమీఁద నగరమునకుఁ జేరిరి. దాము జేరువఱకు నచటివారు జోగిదిరుగ నూళుళవెంట వెళ్లుదురేమో యని, శ్రీనివాసపెరుమాళ్లు గారిద్దఱని సైకిళ్లువేసి పూడివాడకు ముందుఁ బంపెను.

వారువచ్చువఱకు స్వామి యింటను, గుమార్తెగారి యింటను జోగివెంటఁ దిరుగు బందుగులకుఁ బ్రొద్దెక్కునేమో యని యల్పాహారము లిచ్చుచుండిరి. ఈ వచ్చు బిడిగల్లు వారేమి యెఱుఁగుదురు ? మహానందముతో నుండిరి. వచ్చిన మనుష్యు లీ వార్తను జెప్పిరి. ఆహా! యెట్టి యానందసమయములో నెట్టివార్త ? పిడుగు! పిడుగు కూడఁగాదు! దానినిఁ జెప్పు వాచకశబ్దము వాఙ్మయములోనే లేదు. ఆమాటలో వారుస్తబ్ధులైపోయిరి. కొంతవఱదాక

వారికి జగమే తెలియలేదు సరియైన స్పృహవచ్చిన పిదప వృత్తాంతము నెఱిఁగి వాపోవుచుఁ గ్రిందఁబడిరి. గృహ మల్లకల్లోలమైపోయెను. ఆక్రందనధ్వనులతో నా యావరణమంతయు నిండెను. మఱియొకటి మఱియొకటి గాదు పరమపదించినది, మూలభూతుఁడు, సర్వరక్షకుఁడు, సర్వాపన్నివారకుఁడు, ఇష్టార్థప్రతిపాదకకల్పకము, తపోధనుఁడు, దివ్యమూర్తి, పరమహంసయైన స్వామి. వారికి స్వామికి మించిన పరదైవము మఱియొకరు లేరు. స్వామి తరువాతనే వేణుగోపాలుఁడు. అట్టి మహామహుఁడు, తమనెల్లరనంతవఱదాఁక రక్షించి, రక్షించి యాకస్మికముగా వదలివెళ్ళిపోయిరన్న సామాన్యమా ? ఒక్కసారిగా స్వర్గమునుండి, నరకమునఁ బడినట్లుండెను. శిష్యులును గుటుంబమువారును దలల పగులఁగొట్టుకొనువారు, క్రిందఁబడి పొరలువారు, ఉదరములు మోదుకొనువారు నైరి. వేంకట దాసస్వామి పరమపదించినరనఁగనే పూడివాడ యూరుంబాలెములగదలి మంచముఁబట్టిన వృద్ధులు, పసిపిల్లలుఁగూడ వచ్చిరి. యా పరిసరమున నంతయు నిండి, 'హా! యెట్టిపరమహంస, యెట్టి తేజోఘనుఁడు! యెట్టి దయానిధి, వెడలిపోయెను ? మరల నట్టి దివ్యవిగ్రహమును జూడము చూడ'మని విలపించుచుండిరి. చుట్టుపట్టుల గ్రామముల కీ వార్త తంతివలె వెళ్ళిపోయెను. పరగ్రామములకుఁ బ్రయాణమైయున్నవారుగూడ 'నిఁక నట్టి మహాత్మునిఁ జూడఁబోము, అంతిమదర్శనము చేసివత్త'మని గుంపులు గుంపులై పూడివాడకు రాఁదొడంగిరి. ఎనిమిది గంటలగుసరికి స్వామి భౌతికశరీరము గల బండితో వందలువందలై జనము వచ్చిరి. ఎవరియందుఁ జూచినను శోకము మూర్తీభవించి, తాండవించుచుండెను. ఆహా! యెంత విపర్యాసము వచ్చెను ? అదివఱకు నా దివ్యమూర్తినిఁ జూచినంతనే భయకంపితులై దూరదూరమున నొదుగువారెల్ల రా దివ్యశరీరము నంటుచుఁ, గౌఁగిలించుచు, బాదములపైఁ బడుచు నేడ్చుచుండిరి. ఎందఱెంతదుఃఖించిన నేమిలాభము ? ఓదార్చువారెవరు ? ఎట్టి కష్టములలోనైనఁ దమ యమృతవాక్కులచే శోకమును డిందుపఱచి యనునయించు మహామహుఁడే వెడలిపోయెను. మధ్యాహ్నమాయెను. ఎట్టి దివ్యశరీరమైననేమి ? యాత్మవస్తువు లేచిపోయిన పిదప నగ్నిసాత్కృతము చేయవలసినదేగదా! స్వామి శరీరమునకు స్నానముఁ జేయించి, పట్టుపంచలుగట్టి, యాకుపచ్చని శాటి వైచి, ద్వాదశోర్ధ్వపుండ్రములు వెట్టి తులసీనళినాక్షమాలలు గైసేసిరి. ఆహా! యేమి యాబ్రహ్మతేజము ? చూపరకు నేత్రములు చాలక పోయెను. అసలు భగవద్రామానుజులు తప్పిపపిదప, నట్టి వైష్ణవతేజముట్టిపడు దివ్యశరీరము స్వామియందు మాత్రమే గానవచ్చెనని పెద్దలు పెక్కురు వాకొనియున్నారు. అట్టి దివ్యశరీరమున నానాఁడు మఱింత భాసము హెచ్చెను. బ్రహ్మతేజములు గ్రక్కు ముఖమున కదియేమో చిఱునవ్వు వచ్చెను రాత్రి పదిగంటలకు నాత్మవెడలిన, స్వామి భౌతికశరీరము రెండవనాఁడు మధ్యాహ్నము రెండు

గంటలైనను, నేమాత్రము నల్లఁబడలేదు. బిగిసిపోలేదు. ప్రాణవంతమైన దేహమునకువలెనే యంగములు చక్కగా నెటుద్రిప్పిన నటు వంగుచుండెను. పైగా నేమికాంతులు విరఁజిమ్ముచుండెను ? జనమాస్థితికి విభ్రాంతిపడిపోయెను. అది మాంసశరీరమా ? యెన్నికోట్ల రామనామముతో నెంత భగవద్ధ్యానముతో నెన్నిధర్మకార్య పుణ్యములతో మాగిమాగియుండెనో! ఎవరికెఱుక ? స్వామి ముఖమునకుఁ జిఱున వ్వాసమయమున నేల వచ్చెనను దానికిఁ బండితులును, స్వామిమిత్రులునైన శ్రీ సముద్రాల లక్ష్మణాచార్యులువారు "అదివాహకులు స్వామినిఁ బరమపదమునకువేంచేయుఁడని పిలువవచ్చినప్పు డట్టిమహానందముతో వారు వెడలిపోయి"రని వాస్తవమైన సమాధానముఁ జెప్పిరి. అది యెంతయును సత్యము. ఆత్మోత్క్రమణ సమయముననున్న యా మందహాస మట్లే నిలిచిపోయెను. "కృతకృత్యాః ప్రతీక్షంతే మృత్యుంప్రియమివాతిథిమ్" కృతకృత్యులైన మహాత్ములు మృత్యువును బ్రేమగల చుట్టమునువలెఁ జూతురుగదా! ఆ దివ్య దేహమును శ్మశానమునకుఁ గొనిపోవఁబోవు సమయమునకు నూరిలోని పంచమరామానుజీయులెల్లరు వచ్చి పడిరి. స్వామిపాదముల సన్నిధినిఁబడి స్త్రీ పురుషులు ఘోరముగా విలపించిరి. జ్ఞానభక్తులు తెలుపుటయేగాక యూరియందు వాంద్రకు గౌరవమును గలుగునట్లు చేసి ప్రోచిన మహామహుఁడు స్వామి. శ్మశానమునకు వెళ్ళునపుడు భగవదాలయ ముందుఁ గొంతవడి నిల్పిరి. వారియంతిమ దర్శనమును భగవానుఁడు మాత్ర మపేక్షింపఁడా ? లోని వేణుగోపాలుఁడేమనుకొనియుండును ? వానికిని కన్నులవెట బాష్పములు స్రవించియే యుండును. పరమపదమునఁ బంచోపనిషణ్మయమైన శరీరముతోనున్న స్వామిని వాఁడును నిఁకఁ జూచునుగాని పూడివాడలోనుదయముననే స్నానమాచరించి, ధవళోర్ధ్వపుండ్రములతో వచ్చి తనకు నమస్కరించునాభౌతిక శరీరమును జూడలేఁడుగదా! తనను బ్రతిష్ఠించితనతో నోలలాడిన యాదివ్యశరీర మానాఁటితో నదృశ్యమై పోవుచుండెను. వానికి మాత్రమేల దుఃఖము రాదు ? స్వామి యింటికడనుండి శ్మశానము వరకు నొకటే మహాజనము. వీధులు పట్టక పోయెను. రామభజనముతో స్వామి శరీర మా రుద్రభూమికిఁ జేరెను. రామభజనము సేయుచున్న యా ధ్వనిలో దీనత్వము గోచరించుచుండెను. అచటఁ జితారోహణముఁ గావించు వఱకు బ్రాంతగ్రామవాసులెవరో యింకను బెక్కురు నురువులు గ్రక్కుచుఁ బరువెత్తుకొని వచ్చి యాపాదములంటి నమస్కరించి "ఇఁక నిట్టి పరమహంసను. మహానుభావునిఁ జూడము చూడ"మనుచు, జితికి వలగొనిరి. కాష్ఠము నంటించిరి. అట్టి దివ్యదేహమును గూడ నగ్నిహోత్రుఁడు దహించునా ? ఎన్ని శిరంబు లాపాదములకు నమస్కరించెనో ? యెంతమంది కా హస్తములు జ్ఞానబోధఁ గావించెనో ? ఎంత భగవన్నామ జపమును నెన్ని భగవత్కథాకాలక్షేపములను నావదనముజేసెనో ? అట్టి పవిత్రాంగములను

గూడ వీతిహోత్రుండు దహింపవలసినదేనా ? చితిమీఁదఁ బరుండియు నా దివ్య[illegible] తీవి వెలయించుచున్నది ? ఇప్పటికి నాదృశ్యమా కనులకు మిఱుమిట్లు[illegible] పాపులదేహముల దహించి దహించి. మాలిన్యముఁ గొనియున్న పావకుఁ డా దివ్య [illegible] శరీరమునంటి పవిత్రుఁడనగుదుననెడి యానందమునఁ గాఁబోలుఁ [illegible] జిమ్ముచు నాదివ్యశరీరమును వలగొని క్రమ్మెను తమకుఁ జిన్నప్పటి[illegible] కంటికి రెప్పవిధంబున మహాప్రేమతోఁ గని పెంచి విద్యాజ్ఞాన బుద్ధులిచ్చిన [illegible] తేజశ్శరీరమును జేతులార భస్మముఁ గావించి కుమారులు వెనుకకుఁ దిరిగిరా ? [illegible] విధి యెంతకఠినుఁడు! మరణ మనఁగా శరీరముతోఁగూడ సదృశ్యమగునట్లు చేయక [illegible] ప్రేమపాత్రమైన దేహమునగ్నితో దహించునట్లేల విధించెనోగదా! ఆనాఁడు [illegible] వఱకును బరగ్రామవాసులగు శిష్యులు వచ్చుచునే యుండిరి. ఆ రాత్రి యెవరికిని నిదుర పట్టలేదు. ఎచటఁజూచినను నేడ్చుచు స్వామి చేసిన యమానుషకృత్యముల విలాసముల దలపోసికొనుచు నుండిరి. ఆ దుఃఖమునకు మేరలేదు. ఒక్కొక్కరిని స్వామి ప్రేమించి లాలించిన విధానము. చేసిన విలాసకృత్యములు నెఱపిన యా చాకచక్యము. ఆ విగ్రహము. ఆ నవ్వు. ఆ మాటలు. జీవితాంతమువఱకుఁ దలంచుకొన్నను దఱుగవు. కనులకు మిఱుమిట్లు గొలుపుచు మఱపునకు రాని దివ్యచరిత్ర యది. ఇట్లు దుర్ముఖినామసంవత్స రాశ్వయుజ శుద్ధైకాదశీ సోమవారము నాఁటి రాత్రి పదిగంటలకుఁ గ్రీస్తుశకము 1956వ సంవత్సర మక్టోబరు పదునైదవ తేదీన శ్రీ వేంకటదాసస్వామి లోకమును శోకసాగరమున ముంచి, యశశ్శరీరము నాచంద్రతారకముగాఁ దాండవించునట్లు నిలిపి భౌతికదేహమును వీడి, పరమవైష్ణవసాయుజ్యముకు వేంచేసిరి. వారి దివ్యచరిత్ర కృష్ణా, గుంటూరు మండలములలో మఱచినను మఱపునకు రాక చిరస్థాయిగాఁ గనులముందుఁ బ్రభాతాండవమును గావించుచునే యుండును.

చూచుచుండఁగనే వాసుదాసస్వామి వెడలిపోయిరి. వేంకటదాసస్వామి కాలము కూడఁ గడచెను. ఇఁక నాంధ్రదేశమున గాఢాంధకార మలముకొనఁగలదు. అట్టి సిద్ధిపూరుషులు మరలఁ బుట్టిన నాఁటికిగదా వెలుఁగు!

పురాణనిగమనము

రెండవనాఁడు శిష్యులెల్లరు వెడలిపోవుచు "స్వామి వెళ్ళిపోయినంతటిలో మరల మీరువచ్చి యీ పురాణమును, బూర్తిచేసినఁగాని మేము బ్రతుకఁజాలము, లేకున్న [illegible]తో మేముకూడ లోకము వీడిపోవువారమే యగుదుము. మీ దుఃఖమును మీరడంచుకొని మమ్ముద్ధరింపవలయు"నని స్వామికుమారులఁ బ్రార్థించిరి. "ఈ శోకభారముతో లాభము

పేరును సుస్థిరక్రియాదినసమున మస్తురుగదా. రామస్వామి సూచించిన విధమున వారింగితి
జ్ఞులు. ఎత్తిన మతింతశోకమునకు హేతువగుచున్న"దని వారు సమాధానించి పంపిరి.
అత్యంత దుఃఖభారములతో వారు వెడలిపోయిరి. పదునొకండవ దినమున స్వామికి
యథాశాస్త్రముగా నౌర్ధ్వదేహిక క్రియలు జరుపఁబడెను. ఆ క్రియలతోఁగానీ యా యొక్క
దినములతోఁగానీ ముక్తులైన స్వామికేమియుఁ బ్రయోజనమూలేదుగాని వెనుకనున్నవారు
కృతఘ్నులు కాకుండునట్లు చేయుకతప్పదు గదా! శిష్యులును, బంధువులును, ఇతరజనమును
నత్యంతముగాఁ వచ్చెను. అత్యంత దుఃఖమిళితమైన వైభవముతోఁ గర్మ ముగిసెను.
ఆద్యంతమున నాఁటిరాత్రి స్వామి చిన్నకుమారుఁడైన రామప్రసాదయ్య కలలోఁ గానిపించి
"నిప్పు త్రయోదశీ బుధవారమునఁ బోయి పురాణమును బ్రారంభించి పూర్తిచేయుండు.
పురాణమతిహితముగా సాగును. సందేహింపవల"దని చెప్పెను. అతఁడు తెల్లవారినపిదప
నన్నలకును, భాగవతులకును నా స్వప్నమును జెప్పెను. భాగవతులందఱు సంతసించిరి.
పెద్దకుమారుఁడును, రెండవ కుమారుఁడును, పురాణముఁ జెప్పి, పూర్తి చేసివచ్చుటకు
నిశ్చయించిరి. మూడవకుమారున కారోగ్య మింకను సరిగా లేదుగదా. స్వామి గండమును
దప్పించి, తమతపః ప్రభావమున నెల్లెడ్లో నిలువఁబెట్టి వెళ్ళిపోయిరి. ఆ యనారోగ్యమునకుఁ
దగినట్లుగా, నీ ఘోరశోకమువచ్చి పైనిఁబడినది. అతనియుగమము క్రుంగినట్లైనది.
పర్వదినముల లాలించుచు, పైని స్వామి యుంటచేఁ గొంతధైర్యముగానుండెను. అదియు
నతని మందభాగ్యత వలనఁ జెడెను. భాగవతులందఱు "స్వామి వెళ్ళిపోయినంతటిలో
పేరుకూడ నుండినఁగాని నిందులేదు. తప్పక రావలయు"నని నిర్బంధించుటచేఁ జివరిలో
వచ్చెద నిప్పుడు మాత్రము రాలేనని యతఁడు వచించెను.

స్వామికుమారులు వెళ్ళి పురాణము మరల నారంభించిరి. రెండవకుమారుఁడు
చదువుచుండఁగాఁ బెద్దకుమారుఁడు చెప్పుచుండెను. పురాణశైలియందును, మూర్తుల
యందును స్వామి స్ఫురించుచుండెను. అందుచే "నాత్మావై పుత్రనామాసి" యను శ్రుతి
చొప్పున స్వామి వెళ్ళిపోలేదు, కుమారులరూపముతో నుండనే యున్నారని శిష్యులును
నితరులును గొంతసంతృప్తిపడి యానందించిరి. ఇతర గ్రామములనుండియు జనము
తండోపతండములుగా వచ్చి విని, సంతసించుచుండిరి. స్వామి పురాణమునకును, కుమారుల
పురాణమునకును భేదము లేదు. వారు కుమారులయెడఁ గావించిన శిక్షణ యట్టిది. స్వామి
యనఘతపఃప్రభావము తత్పుత్రుల యెడను నలముకొనియున్నది. వారొనర్చిన ఘోరతపస్సు
వారితో ముగియునదిగాదు. దాని ప్రభావమువలన నాభక్తిపీఠమెంతకాలము చిగిర్చి
వికసించుచుండునో యెవరును జెప్పలేదు. ఇప్పటితో మాత్రము భగవానుఁడు దానినిఁ
దెంపఁడు. స్వామి వెళ్ళిపోవుట తీఱనికొఱఁతయే. పురాణము మాత్రము యథాపూర్వముగా

నే ముగిసెను. పూడివాడలో నూరనున్న శిష్యులు ప్రతిదినమును యధాపూర్వముగాఁ దపమునకు మఠములోనికివత్తురు. స్వామి మూడవకుమారుఁడును వారును గలసి దుఃఖపడుచుఁ గొంతవడి స్వామి కథాలాపములను, వారి మహిమను జెప్పుకొనుచు ననివార్యమై తపస్సును ముగించుకొనుచునుండిరి. ఆ కుమారుఁడు స్వామివెళ్ళుటచేఁ గలిగన దుఃఖమును గొంత సూర్యాస్తమయ మనుపేరఁ గవితారూపముగా వెడలఁగ్రక్కెను. కొన్ని దినములు గడచినవెనుక భాగవతుల యభిలాషముచొప్పున నతఁడును మోదుమూడికి వెళ్ళెను. అచట నా భాగమును జదువుచుండఁగా, సభయంతయు శోకవివశులై తలలెత్తలేక యశ్రువర్షము గురిసిరి. పురాణముచేఁ గొంత మఱుగుపడియున్న యాశోకము మరల దానిచే విజృంభించినట్లాయెను. ఎక్కడెక్కడనో యున్న పండితులెల్లరుస్వామి నిర్యాణమునకు దుఃఖించుచు లేఖలు వ్రాసిరి. ఎన్నిజాతులలో, నెన్నిదేశములలో, నెన్నియూళలులోనున్నవారి హృదయముల నలంచిన దీస్వామి నిర్గమనము!

సూర్యాస్తమయము

కుసుమరథంబునెక్కి సురకోటులు మెచ్చుకొనంగ నీ మలీ
మసమగులోక మేది తిరుమామణి మంటపముక్తగోష్ఠికై
మసలక యేగినావె మురమర్దనుఁడున్ మఱి నిత్యు లెంత సం
తసమును బొందిరొక్కొ యట తావక దర్శన భాషణంబులన్. 1

ఎంతటి పాడువత్సరమొ యియ్యది దుర్ముఖి యందులోన నిం
కెంతటి క్రూరమాసమొకొ యేర్పడ నాశ్వయుజంబు దానిలో
నెంతకఠోరమో దశమియేగిన రెండవనాఁడు స్వామి! నీ
యంతటి పుణ్యమూర్తిని మహాత్ముని నీవిధిఁ గోలుపోతిమౌ. 2

అఱువదియైదు వత్సరము లాయెను నేఁటికి స్వామి! మీర లీ
ధరణికివచ్చి' యింతవఱదాఁక జగంబు వెలుంగఁజేసి భా
స్కరుఁడల పశ్చిమాచలము చాటునకేగినయట్లు మమ్ముదు
ర్భరమగు శోకసాగరము పాలొనరించి గమించితే ప్రభూ! 3

సురుచిర మందహాస శుభసుందరమై యలబ్రహ్మవర్చ సం
బురుకులువాఱు మీ మొగము నొయ్యనఁ జూచెడి భాగ్యమింక యీ
ధరణికి లేదులేదు భవతారకమై యలరారునట్టి మీ
తిరువడిదోయి సేవకును దీఱెనె మాకు ఋణంబు లక్కటా! 4



కుంచే వినవేంకటసుబ్బదాసు గారు, యశోదమ్మ గారు (సతీసమేతులు) దావలి.

భారత దివ్యగాథ జనపాళికిఁ జెప్పఁగ మోదుమూడికిన్
జేరగఁ బోవుచుంటినని చెప్పి మమున్ దగ నూరడించి యీ
తీరున విష్ణువాటికి నదేపయనంబున వెళ్ళిపోయితే
కారణమేమి తండ్రి! మముఁగాదని యీవిధి మోసగింపఁగన్. 5

ఎంతయు వెళ్లువేళ మము నెల్లరఁ జేరఁగదీసి మ్రొక్కుచు
న్నంతనె పేరుపేరఁ దగునాదృతిఁ గౌఁగిటఁజేర్చి నేత్రప
ద్మాంతములందు బాష్పజలమారగ దీవెనలిచ్చి తద్దియే
యంతిమ వందనం బనుచు నాత్మఁ దలఁపంగ నోపమో ప్రభూ! 6

అరయఁ బురాణగోష్ఠికని యాత్మల నూఱటగంటి మిద్దియే
పరమపద ప్రయాణమని బల్కిన, లేక మఱెవ్వరైన మా
కెఱుక యొనర్చినన్ గదలి యించుకయైనను బోవనిత్తుమే
శిరముల వ్రక్కలించుకొని చేద్పడి ప్రాణము లుజ్జగింపమా ? 7

కరుణఁ బురాణగోష్ఠి యల కార్తికపూర్ణిమతో ముగించి మ
మ్మరయఁగవచ్చు బ్రహ్మముని నారయఁగల్గునటంచు నెంతుమే
హరి హరి యింతలోనె జగమంతయుఁ బోవిడి మా మనంబులన్
జెఱువుల చేసి పోదురని చిత్తములందు నెఱుంగమో విభూ! 8

తిరుమలకేగి స్వామికిని దీరిచి మ్రొక్కుల నంతరంబు నా
సరసకు మోదుమూడికిని జయ్యన రమ్మని చెప్పినార ల
ట్లరుగగఁ బూనుకొంటి సగమాయెను జోగియు నింతలోననే
పరమపద ప్రయాణమది పైకొనివచ్చెనె మీకు నక్కటా. 9

మెలకువగల్గి యెట్టి మిడిమేలము లొందక రైళ్ళలోనఁ ది
ర్మలకును బొమ్మటంచు మధురంబుగ వార్తల నన్నగారితోఁ
దెలియఁగ మాకుఁ బంచితిరి దీనజనావన పంచి మూడు రో
జులు గడువంగలే దకట! చోద్యము మమ్మిటు వీడిపోవుటల్. 10

తనువు త్యజించునప్పుడును దాపసచంద్రమ మమ్ముఁగూర్చియే
మనసు విషాదమొందెనొకొ మా పయనంబున నేమిగల్గునో
యనునదె చింతయా తమకు ? హా భువి నీవిధి మేలుగోరు న
య్యనఘుఁడు మిమ్మువంటి కరుణాలయుఁ డెవ్వఁడు ? లేఁడు మాకిఁకన్. 11

ఉదయమె లేచి బంధువుల నొక్కెడcగూరిచి జోగికేగగా
ముదమున నుంటి మట్టితతి మోక్షముజేరిరి రాత్రి యయ్యెగా
రిదె గొనవచ్చుచుండి రిట కేర్పడ భౌతికదివ్య దేహమం
చదటున వచ్చి చెప్పి రకటా యెటువంటి కఠోరవార్తరా ? 13

ఆ మాట వినగానె యసువు లేమాయెనో
స్తంభమై దేహంబు జడతనొందె
పరమపదించిరి పరమపావనులైన
తండ్రిగారని యప్డు తలcపుగలిగె
కలయేమొ యని కొంతకాలంబువఱదాక
నిశ్చయింపcగలేక నెమకవలసె
కల యెట్టు లెదురుగాc గన్పించుచుండిరే
చెప్పవచ్చి నవారు చేరువందు

హరిహరీ యెంత యన్యాయ మకట ఘోర
మెంత దుర్వార్త వింటిమి యింత వినియు
పగిలి ముక్కలుగావు మా పాడుహృదయ
గోళములు కొండ గుదిరాళ్ళకుప్పలేమొ

క్రింది క్షణంబుదాcక నొక రేణువు దుఃఖమెఱుంగనట్టి మా
మందిర మొక్కసారిగ నమాంతము మున్గెను శోకరాశిలోc
గ్రందుగ రోదనధ్వనులు కట్టలు త్రెంచుకొనెన్ మహార్తితో
వందలు వందలై జనులు వచ్చుచునుండిరి బండితోడుతన్ 14

ఇదివఱ కెన్నడైనc జని యింటికివచ్చినవేళ బండిలో
ముదమునc గూరుచుండి తమ ముందల పీఠమువైవ నెల్లరన్
బదెపదె సేమముల్ తడవి పల్కుచు డిగ్గు మహానుభావుc డీ
యదునున నెందఱేడ్చి తనకై విలపించుచునున్నc జూడcడే. 15

స్వామీ! మేమొక యించుకైన మదికష్టంబొంది దుఃఖింపcగా
నేమాత్రంబు సహింపవే మునుపు నే డీరీతి ఘోషించినన్
మా మోముల్ తిలకింప నేదియును సంభాషించి యోదార్పనా
ప్రేమస్ఫూర్తి తొలంగి యెచ్చటికి జారెన్ వ్రీలెనా బంధముల్. 16

ఘనమగు సింహమున్ గనినకైవడి దవ్వుననే దొలంగిపో
వును జనమెల్లఁ దొల్లి యిటు ఘోరుననేడ్చుచు నిప్పుడెల్ల వా
రును భవదీయ దివ్యతరరూపముఁ దాఁకుచునుండి రయ్యయో
యనువుగ నింత లోకువెపుడైతివి వీరికి నో మహాప్రభూ. 17

ఇంత వయస్సు వచ్చినది యేర్పడ మాకును నిప్పుడైన నీ
వెంతటి ప్రేమమూర్తివొకొ యెచ్చటికైనను మేము వోయి యా
వంతటి జాగొనర్చినను నాత్మసహింపవు వచ్చుదాఁక వృ
త్తాంతము లట్టివెల్ల హృదయంబులఁ జీల్చు స్మరించినంతనే. 18

క్రూరవ్యాధికి నగ్గమై మునుపు నే ఘోషిల్లుచుండంగ వి
స్తారంబైన తపంబుఁ జేసితిరి శిష్య శ్రేణితోఁగూడ నా
యారోగ్యంబు గురించి యన్యులకుఁ జేయన్ సాధ్యమా శౌరితో
హొరాహొరిగఁబోరి నిల్పితిరి నన్నో తండ్రి! యీ ధాత్రిపై. 19

ఘోరతపంబుతో నిగమకుద్రనివాసుని నారసింహు నే
పారఁగరంచి నిష్ఠమెయి నాతని నుబ్బటలూపి యూపి దు
ర్వార మకాలమృత్యువును బాపి కుమారుని నిల్పుకొన్న వా
రేరి ? మహాత్మ నీవొకఁడవే భువి నన్యుల కెట్లు సాధ్యమౌ. 20

నీవు లేకున్న జగతిలో నేను నిల్వఁ
గలనె ముందుగా ననుజంపిగాని నీకు
హానిసేయఁడు హరి యని యంటివట్లె
నిలిపి నా విప్పు డేమి గావలయు నేను. 21

పాపభయంకరుండవగు బ్రహ్మమునీంద్రుఁడ వెల్లవేళలన్
బ్రాపయి యుంటచేఁ దొలఁగఁబాతె విపత్తులు మమ్ముఁజేరఁగా
నోపక తొల్లి, యిప్పు డిఁకనో యటువంటి సమర్థుఁడేడి మా
దాపున లోకమందుఁ, గడుదైన్యమునొందితి మీవు వోవుటన్. 22

కడవఁగరాని దీ ప్రకృతి కావున మీ రిట మాకు నుండగాఁ
నెడనెడ వచ్చుచుండెడివి యించుక యాపదలట్లువచ్చి సం
దడి యొనరింపఁగాఁ దమ కుదగ్రతఁ గోపమువచ్చు దానితో
గడగడలాడిపోయి యల కంజదళాక్షుఁడు దానిఁ దీర్చుఁబో. 23

మానుగ కల్పభూజము సమక్షమునందు వసించి నట్లు మీ
మానిత బాహుదండముల మాటుననొక్క కొఱంత యించుకం
తైనను లేక యుంటిమిcక నట్టి శరణ్యము మాకు నిప్పు డె
ద్దానిని జూపి పోయితిరి తాపసపుంగవ మోక్షవాటికిన్. 24

వరుసన్ గూcతులcc బుత్రులన్ మనుమలన్ వాల్లభ్య మొప్పార నిం
దర మమ్ముం దగజేర్చి యిత్తురు పదార్థాలేవియో మోదముల్
గెరయన్ మా కిcక నట్టిరోజు లవియేగెన్ జన్మజన్మాలలో
మఱపుల్ రానివి మీదు కృత్యములు బ్రహ్మర్షీ! నిజం బెంతయున్. 25

బంగరుకొండ క్రుంగినది భద్రగజం బది నేలవ్రాలె మా
ముంగిటి పెన్నిధానమును మూలముతోc జనెc జారిపోయె మా
కొంగు పసిండి కల్పకము కూలిపడెన్ మఱి చండభానుc డ
స్తంగతుcడయ్యెc జూడcగ విచారము మాత్రమె మాకు నిల్చెనా ? 26

ప్రకట సభాంతరాళమున బల్లపయిన్ దగు బ్రహ్మపీఠిపై
నకలుషదివ్యధోరణి మహాత్మక నీవు వచించుచుండ గో
ష్ఠికి నల గాధిపుత్రుcడొ, వశిష్ఠుcడొ, సూతమహర్షియొక్కొ, మ
చ్చికc జనుదెంచె నంచుc దమ చిత్తములందుc దలంతు రెల్లరున్. 27

అంచితరీతి నట్లు విపులాస్యమునందలి బ్రహ్మతేజముల్
మించి జనవ్రజంబుc గదలించుచుండcగ గాంగవాహినుల్
ముంచినయట్లు వాగ్విసరముల్ చెలరేగ నుపన్యసించు నిన్
గాంచెడి భాగ్యమున్ వినెడికాలము పోయెనె లేదెలేదెహా! 28

ఒక్కటి గానిపించెc దమ యుగ్రతపఃఫల మంత్యకాలమం
దక్కట ప్రాణహీనమగునట్టి శరీరమునందుcగూడ మీ
కెక్కడినుండి వచ్చినదొ యేర్పడ నా విధి బ్రహ్మతేజముల్
మిక్కిలి చిత్రమాయె నిది మిమ్మపు డారయcc గల్గువారికిన్. 29

చిఱునగ వంకురించి ముఖసీమకళల్ విరజిమ్ముచుండె మీ
చరమదశావసానమునc జారుతనేమిది స్వామి! మీ కహో
పరమపదంబుసేరుcడని ప్రార్థనcజేయుచు నాదివాహకుల్
దరిసిన వేళ నట్టి ప్రమదంబున నవ్వుచు వెళ్ళిపోయితే. 30

కంటిమి బ్రహ్మవేత్తల నకల్మషవృత్తుల నెంతమందినో
వింటిమి శాస్త్రపారగుల వేలకొలందిగఁ గాని యెందు మీ
వంటి గభీరరూపుల, నవార్య తపోమహిమానుభావ ని
ష్కంటకులన్ దయాళువులఁగానము కానము సత్య మెంతయున్ 31

ఇహమున భోగముల్ వడసి హెచ్చగు గౌరవమందు వారలున్
బహుళతరంబుగా గల, రపారముగా నిఁకఁ బారమార్థికో
ద్వహులగు వారునుంగలరు ధారుణిలోపల మిమ్ము బోల్కిఁ దా
మిహపరముల్ సమంబుగ వహించి కృతార్థతఁ జెందఁగల్గిరే. 32

అనఘ శ్మశానవాటికటులార్తిమెయిన్ దమ దివ్య దేహమున్
గొని చనువేళ నిల్పితిమి కోవెలముందల నించుకంత, యే
మని తలపోసినాఁడొ తన యాత్మగతంబున లోని దేవుఁడున్
గనులు చెమర్చి బాష్పములు గ్రమ్మియెయుండును జూడరెవ్వరున్ 33

పెదవులు నల్లనై చెడవు పెంపగు మార్దవ మించు కేనియున్
వదలవు దేహభాగములు ప్రాణములుండిన యట్లె యుండె నో
సదమలమూర్తి నీ నిరతసాధితదివ్యతపఃప్రశస్తి చేఁ
బొదలగ మంత్రపిండమయి పోయెను జుమ్మది మాంసపిండమా ? 34

అగ్నిసంస్కారమునకునై యరుగునపుడు
వందలాదిగ వచ్చెడివారు సేయు
రామభజనాత్మమైన యారావమందు
వెడలు దీనత్వమున కశ్మవితతి గరఁగె. 35

రామపాదధ్యానరక్తిచేలోకంబు
పాటెఱుంగకమన్న పరమహంస
తన పాదరజముచే ఘనపాపసంహతుల్
పాఱఁద్రోలిన యట్టి బ్రహ్మమౌని

మకరందములు చిందు మధురవాక్కుల రాలుఁ
గరగించి వైచిన కర్మయోగి
దివ్యబోధంబునదేశాంధకారంబుఁ
బాపివెల్గిన భక్తభాస్కరుండు



ఛోగటి నాగలక్ష్మమ్మ గారు, వరికూటి గరుడమ్మగారు, వరికూటివారిపాలెము

ప్రోవుపడినట్టి యొక మహాపుణ్యరాశి
యట్టి మహనీయు భవ్యదేహంబుగూడఁ
జటులకీలాపరంపర జంకులేక
యంటి భస్మీకరింతువా యగ్నిహోత్ర. 36

ఎందటి చేతిపూజలు వహింపఁగజాలెనొ యెన్ని శీర్షముల్.
వందన మాచరించినవొ వానికి నట్టి పదారవిందముల్
సుందరబాహుయుగ్మమును జూచుచునుండగ శంకలేకయే
మందుఁడ! నీ భయానకపు మంటలలోపలఁ బెట్టుకొంటివా! 37

పరికించినంతనే బ్రహ్మాంతవానిని
జడిపించు బ్రహ్మతేజంబు సూపి
పాపభూయిష్ఠమై పంకిలంబై యున్న
మహియంతయును రామమయముఁజేసి

స్నానంబుచేసెడి చందమే యెఱుఁగని
వెకలి మూఢుల బ్రహ్మవిదులఁ జేసి
ఘననైజకల్యాణకరుణాగుణంబుల
మందులనైన నానందపరచి

యొక్కసారిగ నందఱ నుదధిముంచి
యరిగె ముక్తికి వేంకటగురువరుండు
అమ్మహాత్ము సేవించు భాగ్యం బది పది
కాలములపాటు మాబోంట్ల కేలదక్కు ? 38

పావనమూర్తులై ప్రకృతిపంకమువాసి స్వయంప్రకాశ మో
దావహ విష్ణులోకనిలయంబున శాశ్వతసౌఖ్య మొందగా
దేవరవారు వెళ్ళితిరి దీనులమై యిఁక మిమ్ముఁ బాసి మే
మేవిధి జీవితంబు గమియింపవలెన్ గలకాల మిచ్చటన్. 39

అరరే మొన్నటిదాఁక మా కనులముందట్లుండి నేఁ డప్పుడే
విరజాస్నానముఁజేసి పావనములై వెల్గొందు తత్తీరసుం
దరమందారపరీతసైకత లసన్మాణిక్య సౌధంబులం
దురురక్తిన్ర్బింయమందుచుంటిరొకొనిత్యుల్ ముక్తులున్ గొల్వఁగన్. 40

కానఁగఁజాలమింక మిము గన్నులతో విమలాత్మ మీ రిఁటన్
స్నానముచేయుచోటు ననిశంబు స్వరూపముఁదాల్చుచో టను
ష్ఠానము దీర్చుచోటు మఱి సొపడుచోటును జిన్నవోయి మా
మానసముల్ గుభాలుమన మాటికిఁ జింత యొసంగఁజేసెడిన్. 41

తల్లడమొందుచున్ గనులధార యొకించుక తెంపులేక మీ
ర్వెళ్లినదాదిగాఁగ బలవించుచు నున్నది యొక్కరీతి మా
తల్లి మహార్తితోడ నిఁక ధైర్యముఁగూరిచి యామె నెట్లు మే
మల్లనఁ దేర్పఁగావలెనొ యయ్యది మృగ్యముగాఁ గనంబడెన్. 42

మీరిట నుండువేళఁ దలమే వచియింపఁగ నామె భోగముల్
ధారుణియేలు రాజు కులదారకు లే వటువంటి మన్ననల్
క్రూరుఁడు ధాత యిట్టి దశకున్ గొనివచ్చెన యింక నామె యే
కారుచు దీనురాలి విధమై గడుపన్ వలె నొక్కొ కాలమున్. 43

కళలుదొలంగి విన్ననయి గన్పడు నౌర మఠంబు దాని లో
పలికిఁ బ్రభాతమందె యలవాటున వత్తురు శిష్యకోటి ని
చ్చలు నటువచ్చి మిమ్మరయఁజాలక యచ్చటశోకతప్తులై
వలవల యేడ్చుచున్ దప మవార్యముగాన ముగింతు రెట్లెటో. 44

బాలయూఖమాలికిని బాసటయై వెలుగొందు మూర్తిలోఁ
కాల విపర్యయంబొదవె జాలిమొగంబును జెన్నువోయి బా
ష్పాలసమైన యట్లు గననౌ కనుదోయియుగల్గి వేణుగో
పాలుఁడు దేవళంబున నపారవిచారముతోఁడ గన్పడున్. 45

తననుప్రతిష్ఠజేసి నిరతంబు తదాలయ వైభవాప్తికై
ఘనముగ నెమ్మిలన్నియును గంధము దీసికొనెన్ మహాత్ముఁ డ
య్యనఘుఁ బ్రభాతవేళల, నిజావసథంబున కేగుదెంచి వం
దనమొనరించుచుండఁ, గనునా, యికఁ నెన్నటికేని నాతఁడున్. 46

కంటికి మంటి కేకమగు కాలువగట్టిన బాష్పపాళితో
నింట వసించునప్పు డెటకేఁ జనినప్పుడు మాతృహీనులౌ
చంటి నిసుంగులట్టులు విచార విఘూర్ణిత దీనరూపులై
తొంటి విశేషముల్ దొరగి తోఁపఁగ సాగిరి శిష్యకోటులున్. 47

కొందఱు సిద్ధరూపు లవికుంఠితభక్తి లతాపవిత్రు లా
నందులు కొందఱర్థ పరిణద్ధ వివేకులు, కొంద ఱిప్పుడే
మందతవీడి దైవత మమత్వముఁ గాంచినవారు శిష్యు లీ
యందఱ నేమికమ్మని మహామునిపుంగవ వెళ్ళిపోయితో ? 48

ప్రతి వర్షంబును వానకారున జగత్ప్రఖ్యాతమౌ నట్లు భా
రతమో భాగవతంబొ రామకథయో రమ్యంబుగా శిష్యసం
తతు లావాసముచేయు నూళులఁ బురాణంబున్ బ్రసంగింతు ర
ప్రతిహార్యంబుగ ముప్పదేండ్లు కడతేరంగల్గె నీ పద్ధతిన్. 49

మొనసి పురాణగోష్ఠియగు మూడునెలల్ వ్రతచర్యగాగ నా
జనపదసీమదాఁటనని సల్పితిరయ్య ప్రతిజ్ఞ యాదిలో
ననఘ యదేవిధంబున మహత్వ తపఃపరిపూర్ణశక్తిచేఁ
జనియెను దీర్ఘకాల మదిసాగునె యన్యుల కేరికేనియున్ ? 50

వరుసను ముప్పదేఁడు లనివార్యముగాగఁ బురాణగోష్ఠి సుం
దరమగురీతి సాగి యిఁకఁ దాపసపుంగవ యంత్యమందు మీ
పరమపదప్రయాణమునఁ భంగపడెన్ దమ జీవితంబునన్
జరుగగలేదు విఘ్న మొకసారియుఁ బూనినకార్యకోటిలో. 51

మీరు బ్రతికియుండ వేఱొక్కరీతిగాఁ
గార్యవిఘ్న మొకటి గలుగగలదె
కలిగెనేని హరికిఁగలదొక్కొ బ్రతుకు మీ
కోప భీకరాగ్ని తాఁపులకును. 52

ఇరువది రెండురోజులు మహీజనమున్ భగవత్కథాసుధాం
బురుహరసప్రవాహమున ముంచి పురాణము మధ్యమందునన్
బరమపదించు భాగ్య మది బ్రహ్మకునైనను గల్గనేర్చునే
స్థిరమతి మీ యొనర్చిన విశిష్టతపఃఫలమో జగద్గురూ. 53

పరమపదంబులో సహజభాస్వరలోకములోననున్న మీ
కరుణ యనారతంబు మము కాఁపయి బ్రోవవలెన్ మహాత్మ మీ
చరణయుగంబు దక్క యొక సద్గతిలేదని నమ్మి యాయువున్
జరిపెద మిట్లుచేయుటకుఁ జాలిన యావిధిఁ బ్రువ్వ దిట్టుచున్. 54

ధారక పోషక భోగ్యము
లారయ మా కేడుగడయునై వెలసిన మీ
చారుపదంబులకు నమ
స్కారంబులు వేనవేలు జగదాచార్యా! 55

కేవల దుఃఖభాజనము కిల్బిషపంకిలమైన మర్త్యలో
కావసథంబుఁ బాపి తమకాదృతిమేలొనరించెఁబో మహా
పావన విష్ణులోక పథపట్టము గట్టుటఁజేసి మమ్మిఁకన్
ద్రోవఁగరాని శోకమయ తోయధి ముంచె ముకుందుఁ డక్కటా. 56

ఎప్పటికైనఁ దప్పదది యీశ రమా హృదయేశమౌనితాఁ
దెప్పలుదేలె నీనిరతదివ్యపదాంబుజసేవయం దహో
యెప్పుడొ ముక్తికాంత వరియించెనుగాని జనంబు లార్వఁగా
నప్పుడె యా మహాత్ము నిటులావలికిన్ గొనిపోవ నర్హమే. 57

ఇందటి నిట్టులేకముగ నేడువుఁడంచు దయావిహీనతన్
మందుఁడవై మహామహుని మాన్యుని నప్పుడె లేవదీసి యా
నందము నేమిఁగంటివి, జనంబులచే బలురేవ నాడికోల్
పొందితి వేమి ముల్లె పడిపోయెను నీది పదేఁడులుంచినన్. 58

ఎందఱు మందబుద్ధులు విహీనచరిత్రులు నీచకర్ములే
పొంది చిరాయువుల్ గలిగి యుర్విఁ జరించుచునుండలేదు వా
రందఱు నట్టులుండ సుకృతాత్ముని దివ్యతపోధనున్ జనా
నంద పవిత్రవిగ్రహుని న్యాయమె యీ విధి మాపుఁ జేయఁగా. 59

ఆలును బిడ్డ లెల్లరును వారిచి తిట్టి పెఠార్చుచుండ నా
కేల చిరాయు విచ్చెనొకొ యీశ్వరుఁ డంచును నేడ్చువాని నె
న్నాళులకైనఁ జంపవు జనంబిఁకఁ జూడకయున్న నోపఁగాఁ
జాలమటన్నవాని, నిముసంబును నుంచ విదేమి చేఁతరా ? 60

అఱువదియైదు వత్సరములా యటువంటి మహాతపస్వికిన్
స్థిరమగు నాయు వన్యులవిశిష్టచరిత్రులు భ్రూణహత్యలున్
జరిపెడివారు బ్రహ్మవధసక్తులు పెద్దవయస్సుగల్గియున్
దిగురుచునున్న వారదె మదించి, యిదెట్టుల నీకుఁ దోఁచెరా ? 61

ఏమి యొనర్పఁగావలయు నే మిటువంటి మహానుభావు మా
స్వామి హఠాత్తుగా బెఱికి చయ్యనఁ గైకొనియేగినా వహో
భూమిని మేమిఁకన్ బ్రతికి పొందెడి భోగములేదు చచ్చియున్
గామితసిద్ధి నొందఁగల కైవడియున్ గనపట్ట దక్కటా! 62

బ్రతుకుదమన్న జీవితము భారముగాఁ గనుపట్టసాగె నా
సదమలమూర్తి విగ్రహము సల్పిన చేఁతలు దివ్యసూక్తులున్
బదెపదె వచ్చి మానసము బ్రద్దలువారిచి అంపకోఁతఁగా
విదళనమాచరించు నరవిందదళాక్ష మతేమిసేయనౌ. 63

అమ్మహితాత్మునందె హృదయంబులునిల్పినమమ్ముబోంట్ల నా
క్కుమ్మడి వారితోడనె వియోగములేని విధానఁబంప నే
యుమ్మలికంబులేక కడుయుక్తమయై చెలువొందు, గాని నీ
విమ్మెయి వేఱుఁజేసి కృశియింపఁగఁ జేయ దయాపరత్వమే ? 64

నీ కొక కొంటెవేషమిది నీరజనాభ యనాదినుండియున్
లోకము కోరుదానిని విలుప్తతఁజేసియు వద్దువద్దు పో
మాకిది యన్నదాని, నియమంబుననిచ్చియు నేడిపింతు వీ
పోకిరిభావ మెన్నటికిఁ బోవునయా తలపోయ నీకిఁకన్ ? 65

అస లేలా జగముల్ సృజించెదవు నీవారీతి సృష్టించియున్
మసిజేయన్ బనియేమి చెప్పు మరలన్ మాయింతవౌగాక యీ
రసయందుండిన నాల్గురోజులును మారాముళ్ళసుమ్మెన్ని పై
కెసఁగంజేయుదువేమి లీల లివి నీ కే చెల్లుబాటాయెరా! 66

కూరుతు వొక్క గేహమునఁ గొందఱ బంధులఁగాగ గూర్చి వి
స్తారపుఁ బ్రేమబెంతువు మిథఃపరిపూర్ణముగాఁగ దానితో
వారటులుండ నొక్కొకరిఁ వ్రాల్చి యదృశ్యులఁజేసి తక్కువా
రాఱడి నేడ్చుచుండఁగని యాత్మగతంబున సంతసింతువే. 67

ఎలుకకుఁ బ్రాణసంకట మదేనటచూడఁగఁ బిల్లియాట యా
చెలువున నున్న వీ వెకలిచేఁతలు స్వామి! యివెట్టి లీలలో
తలఁపఁగ నీకు, మాకు బెడిదంబగు దుఃఖము గల్గఁజేసిడిన్
దలఁగగ సర్వశక్తిగల దైవమ వేమని బల్కవచ్చురా. 68

పోరిపోరి కష్టముల్ రుజలు పొందcగcజేసి సుఖంబుcజూపకే
ధరణిగలట్టి భూతములc దప్పక యెప్పుడు నేడిపించుటే
వరబిరుదంబు నీకు నటువంటి కఠోరునిc గ్రూరకర్ము నిన్
బరగదయాసముద్రుcడని పల్కినయట్టి దరిద్రుc డెవ్వcడో. 69

జలజదళాక్ష దుఃఖమవశంబయి వెల్లువకట్టిరాగ నీ
పలుకులు పల్కినాcడ మదిcబట్టక సైcపవె యేది యెట్లు గా
వలయునొ సర్వమున్ దెలియువాcడవు నీవ యెఱుంగలేని మం
దులము, కృపామతీ తమకు దోషములున్న వె యెంచిచూచినన్. 70

సారతపఃప్రభావమున సర్వము తానయ బ్రోచి పెంచి మ
మ్మారసినట్టి తండ్రి పరమాలయసీమకు నేగె నింక మా
కూఱట నీవె యా తపసియున్నపు డే విధిcజూచినాcడవో
నీరజనాభ యట్లె కరుణింపవె వీడక మమ్ము నిత్యమున్. 71

శాంతివాచనము

స్వామీ! శ్రీ వైకుంఠలోకమున సహస్రస్తంభశోభితమైన తిరుమామణిమంటపము నందు నిత్యముక్తులతో నిరతిశయ భగవదానంద మనుభవించుచు మీరుంటిరి. మేమో, మీరేగుటచే యగతికులమై, ఱెక్కలులేని పక్షులవలె నిరంతర ఖేదభరముచే నడలుచుంటిమి. ప్రభూ! తొల్లి మాయందున్న వాత్సల్యమంతయు నెటు వోయినది ? ఇcక మాతో మీకుc బనిలేదా ? మహర్షీ! మీ యనంతరమందున్న మేము కృష్ణావతారగమన దుఃఖితులైన పాండవుల పగిది నైతిమి. యోగులరైన మీ గర్భమున జనింపc బ్రాక్తన జన్మములయందు నెంతటి పుణ్య మొనరించితిమో! ఆ సుకృత మంతయు ముగిసిపోయినది కాcబోలు నిcక మీదర్శనభాగ్య మీ యభాగ్యులకు లేదు. భక్తి జ్ఞాన వైరాగ్య విద్యాబుద్ధు లొసంగి, యతిప్రేమతోc బోషించిన మీఋణము మాకెన్నిజన్మలకైన దీఱదు. మీ లాలించిన తెఱంగులు, మాటిమాటికి స్మృతిరూపమున హృదయముల నగల్చుచున్నవి, ఏమి యా విలాసములు! ఏమి యాఠీవి! మీ దివ్య మంగళవిగ్రహము కనులముందుc దాండవ మొనరించుచునే యున్నది. ఇంతలో నింతదయాహీనతcగొని మమ్మశరణ్యుల జేసి పోవుదురని కలనైనc దలంపమైతిమిగదా! జగద్గురూ! మీ చేసిన దివ్యచర్యలు జన్మజన్మాలలో మఱవురానివి. రేలందు స్మృతికివచ్చిన నిcక నానాcటికి మాకు నిద్దురలేకుండc బోవుచున్నది. జగత్తున నెన్నిరకములవారో గానవత్తురు గాని మీ దివ్యశరీరరేఖ లొక్కదానియం దిసుమంతయైనc గానరావుగదా! ఇcక

నావిగ్రహమును జగమునఁ జూడఁబోము. అది భక్తివిగ్రహము. మీ చేసిన జ్ఞానబోధవలన హృదయమును మరల్చుచున్నను మీ యదృశ్యతనుగూర్చి యీ మానసములు. మా ప్రయత్నమును లెక్కసేయక ఘూర్ణిల్లుచునే యున్నవి. పుట్టినప్పటినుండియు మీ దివ్యరూపమును జూచుచు. నా యమృతవాక్యము లాలించుచు, మీచేయు దివ్యకర్మల ననుభవించుచు, మీరొనర్చు భగవదానందమునఁ బాల్గొనుచు, మీవలన ననిష్టనివారణము నిష్టప్రాప్తి నొందుచు సుఖించిన యీ యాత్మలు మీ యభావదశలో నిప్పుడొందు దుఃఖమునకు మితిలేదు. అది పరుల కూహించుటకునే నలవిగానిది. మౌనిచంద్రా! మీరేగినను నిఁక మీ కుమారులమనెడి విశిష్టత యొక్కటి మాయందు నిహపరతారకమై కనుపట్టుచున్నది. ప్రారబ్ధానంతరమున మరల నానిత్యపదవియందు మీ పాదదర్శన మొనర్చిననాఁడుగాని యీ యాత్మలకు శాంతిగలుగదు. విభూ! యిచటనున్నట్టులే యా మోక్షసామ్రాజ్యమందున్నను, నీ దీనులయెడఁ గరుణ యొలుకుము. అప్పుడును నిప్పుడును మీ పాదములే మాకు శరణ్యము. విభూ! రామగాథ వీక్షించుచున్న భరద్వాజ మహర్షివలె నటనుండియు మా చర్యలఁ దిలకించుచు మారాక నభిలషించుచునే మీరుందురు. విరజాస్నానమొనర్చి యా స్వయంప్రకాశమాన, దివ్యలోకమున నిత్యముక్తగోష్ఠిలో ననుపమానంద కోలాహలమున నున్నను, శాశ్వతమైన మా యాత్మసంబంధము మీ స్మృతిపథమునకు మమ్ముఁ గొనివచ్చుచునే యుండును. భూలోకమున నలువదియైదు సంవత్సరములు మీ దివ్యశకము విద్యుత్కాంతులు విరజిమ్మి, కడకు దేశము నంధకారమున ముంచి, యదృశ్యమైనది. యోగిచంద్రమా! భగవత్కథాప్రపంచమున జనుల నోలలాడించుచుఁ బురాణమధ్యమున ననాయాసముగాఁ దనువు విడిచి, భగవత్సన్నిధి కేగుట కెవరితరము ? అది మీ యనవధిక తపఃఫలము. అన్యుల కెట్లు ప్రాప్తించును. మునిసార్వభౌమా! మీ వియోగమునఁ దల్లినిఁ బాసిన లేఁగలవలె నొక్కరీతిగా ఘోషించుచున్న శిష్యులఁ, గుమారులఁ, గూఁతుల, ధర్మపత్నినిమలువక దయార్ద్రదృష్టితో వీక్షించుచుండుము. మీ దయావీక్షణమున నెల్లరు మీ సాన్నిధ్యము నొందఁగలరు. సత్యము తండ్రీ! యివె నా సహస్రవందనములు. ఈ కుమారుఁడు మీ కచ్చటను గుమారుఁడుగానే యుండుఁగాక!

మానసమా! యెవ్వని తపఃప్రభావమున నేనొకవస్తువునై పుడమియందు నిలిచియుంటినో యట్టి మహామహుని దివ్యపావన చరిత్రంబుఁ దడవి ధన్యమైతివి. ఏ మార్గంబున నా మహాత్ముఁడు తాను నడచి, నీకుఁ జూపించిపోయెనో దానిఁబట్టి చక్కగా గ్రహించి నడవుము. కడతేరుదువు. అప్పరమహంస యిటనుండఁగా నేవిచారము లేక యుంటివి. అట్టిరక్షకు లిఁక లేరు. జాగరూకత వహింపుము. వారి బంగారువాక్యంబులు నీలో లీనమైయేయున్నవి. వానినే పదేపదే యావృత్తిచేసికొనుము. ఇఁక నెంత

యారాధించినను నా బ్రహ్మర్షితో సాంగత్యసల్లాపానందము ననుభవించు భాగ్యము నీకులేదు. నైరాశ్యమొంది యొకరూపుఁ గైకొనుము.

నేత్రములారా! మీ యెదుటినుండి యొక దివ్యజ్యోతి యదృశ్యమై పోయినది. దానికై మీరెంత వెదకినను నెచ్చటను గన్పింపదు. బాష్పములూరక వెడలఁగ్రక్కఁ బ్రయోజనము లేదు. వానిని బలవంతముగా నంతర్నిగూఢములను గావింపుదు. లోకమున నెన్నిరమ్య వస్తువులఁ గాంచినను నా దివ్యజ్యోతిని దర్శించిన యానందము మీకుఁ గలుగని మాట వాస్తవమే. అయినను జేయునదేమి ? మీ భాగ్యము మాసినది. ఇఁక జన్మజన్మాలకును దానిని మీరు దర్శింపలేరు. మీయందు లీనమైయున్న తత్ప్రతిబింబభాగమును వీక్షించుచు నంజలింపుఁడు.

రామానుజపయోగిప్రభూ! యిరువదవశతాబ్దమున గుంటూరు మండలములోఁ గృష్ణాతీరమున వేంకటదాసస్వామి రూపమున నీ యంశమొకటి జగత్తును వెలిగించి భక్తిసిద్ధాంతమును నెలకొల్పి యమృతవాక్యంబుల నల్లరాలఁ గరగించివైచినది. ఆ తేజోంశమును వీక్షించి, యా వెలుంగులకుఁ జొక్కి దానిచుట్టును భక్తకోటి మూగి యాశ్రయించినది. ఇప్పుడా తేజము నిత్యపదవికి, లేచిపోయినది. భాష్యకార సమాజ మని నీపేర నా స్వామి స్థాపించిన యాభక్తిపీఠము నెట్లు కాపాడుదువో! యా నీపాదభక్తుల నెట్లు కడతేర్తువో ప్రభూ! నీయది యె భారము.

రమాపతీ! పుండరీకాక్షా! నీతో నోలలాడుచు లోకమున భక్తివాహినిఁ బ్రహింపఁ జేయుచున్న మహామహుని నీ సాన్నిధ్యమునకుఁ జేర్చుకొంటివి. వారితో సాంగత్యసల్లాపము లాడ మేలు పడితివి కాఁబోలు! ప్రభూ! యప్పరమహంస వహించి యీడ్చిన యాబరువు లన్నియు నిప్పు డెవరు భరింపవలెను ? ఒక వంక నీ బ్రహ్మోత్సవములు నెఱపవలె, నొకదెస నీ యాలయకార్యములు ముగింపవలయు, నొక ద్రేవ, నీ భాగవతకోటికి సమాధానము వచించుచు భక్తిప్రచార మొనర్చుచు బీఠమును రక్షింపవలయును. స్వామి బీజప్రాయముగా స్థాపించిపోయినవి యింకను బెక్కుగలవు. మఠమును వృద్ధిపఱచి భక్తకోటితో నిరంతరము నీపాదసేవాకార్యము నొనరింపవలయునని వారి సంకల్పము. స్వామి సంకల్పములు వృథయగునవి కావు. సర్వ సమర్థుఁడైన యమ్మౌనిచంద్రు లేవఁదీసి యా భారమంతయుఁ దత్కుమారులమైన మాపై వైచితివి. మేమో యలసమతులము. అనారోగ్యపీడితులము, అప్రతిభులము. కానిమ్ము నీకుఁదెలియని దేమున్నది ? నీటిపై రాలు దేలించి క్రోఁతులచే భయదరాక్షసుల సంహరింపఁజేసిన నీ కసాధ్యమెయ్యది ? నీవు పట్టిన తృణము బ్రహ్మాస్త్రము. నీవు వలచినది రంభ, మునిఁగినది గంగ. విభూ! సదనసన్నిధియందు నాలయముతోడ, నిన్ను బ్రతిష్ఠించి, స్వామి, తరతరంబులందు "మీకు

రక్షకంబు లివి" యని నీ బంగారు పాదంబులు మాకు చూపి వోయె. పైత్రుకమైన సాధనంబు, నీపవిత్రచరణయుగంబు. అట్టి నీ పదంబులకుఁ జుట్టుకొని నిమిత్త మాత్రులమైయున్న యి న్నీచులచేఁ బనిగొనుము జనార్దనా! మధుసూదనా! అచ్యుతా! వైకంఠా! త్రియుగనాథా! త్రివిక్రమా! దామోదరా! కేశవా! హృషీకేశా! పద్మనాభా! యివె నా సహస్ర వందనములు.

నమః పురస్తాదథపృష్ఠతస్తే నమోఽస్తుతే సర్వత ఏవసర్వ!

అనంతవీర్యామితవిక్రమస్త్వం సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః.

శ్రీ కృష్ణార్పణమస్తు.

పండరిరగడ

శ్రీ పండరిపురనాధుని మంజుల శ్రీపాదములర్చించి ముదంబున విరోధికృతు సంవత్సరమందున, వరంబయిన కార్తికమాసంబునఁ జంద్రభాగ, నిర్మలతీరంబున, జరిగిన శ్రీకృష్ణుని వైభవమును, బొగడుటకును బ్రహ్మకైన శక్యంబుగాదు మఱి, దివ్యములగు బహుదేవ స్థలములు, బహుళములగు హరిభజనమఠంబులు, విలువలేని బలు చలువచప్పరాల్, లలితములగు భక్తులమందిరములు, రాధాకృష్ణుల రామాలయములు, సాధుసమూహోహ్లాద పటంబులు, కడుసుందరముగఁ గట్టిన మేడలు, చెన్నుమీఱెడు నన్నసత్రములు, నందమొప్పఁ జెలువొందెడు వీధులు, పరిమళకుసుమ విపణిమార్గంబులు, రామరామ యను రామశు కంబులు, నీమము మదిలో నిల్పినసాధులు, బలువిద్యల నార్జించినధీరులు, వేదాధ్యయనాస్వీత భూసురులు, వాణిజ్యంబునవఱలు వైశ్యులు, పరశురామనిభబలులగు రాజులు, దనుజవిదారునిఁ దలఁచెడి శూద్రులు, పూలతోఁట లద్దాలమేడలు, శ్రీకరములు దులసీదళ వనములు. జపతపంబులను జరుపుమహాత్ములు. గలుగు చంద్రభాగా తీరంబునవచ్చెడి జనములఁ జెప్పశక్యమే, సప్తవారిధులు పొంగినట్లుగాఁ బలుభూములఁగల భక్తజనంబులు, పతాకలను వెసఁ జేతఁబట్టుకొని పాండురంగ నామమును స్మరిచుచు, నదులు సముద్రునిఁ జేరినట్లుగాఁ గార్తిక శుద్ధైకాదశి దినమునఁ గదురయమున వేంచేసివచ్చిరి. చంద్రభాగలో స్నానముఁజేసి, జయము జయంబని రంగనిఁ బొగడిరి. వచ్చెడి సాధులు, నిల్చినసాధులు, హెచ్చుగహోరతు లిచ్చెడిసాధులు, దండముఁ బెట్టెడి దాసవర్యులు, వారికి వీరు, వీరికి వారు సాష్టాంగంబులు సల్పెడివారు, గురువులఁ గొనియాడెడి సచ్ఛిష్యులు, శిష్యుల దీవించెడి సద్గురువులు. బ్రహ్మనిష్ఠగల బ్రహ్మచారులు, జనకుఁబోలు గృహచర్యాధికులు, వాల్మికిఁబోలిన వానప్రస్థులు, రామానుజుఁ బోలిన సన్యాసులు, జడభరతునిఁబోలిన సుజ్ఞానులు, వ్యాసునిఁబోలు పురాణవేత్తలు, శుకునిం బోలిన శుద్ధచరిత్రులు, బృహస్పతి ప్రతిమానసూరులు దివ్యదృష్టిగల దిగంబరులును, నెటుచూచిన నొక క్రోసెడిదూరం, బిసుకవేసినను

రాలకుండఁగా సాధుజనంబులు సభలు దీర్చిరి. పాండురంగ హృదుపాదాంబుజములు, మానసముల నిర్మలముగనిల్పి, చేసెడి భజనలు చెప్పశక్యమే. తాళంబులు వాయించుహస్తములు. శ్రీపతినే వీక్షించు కన్నులు, నారాయణ ధ్యానాధికమనసములు, ధణా ధణా యను మృదంగవాద్యములు, వీనులకింపగు వీణారవములు, ఖంగుఖంగు మను కంచుతాళములు, వెలుఁగునకై పట్టెడి దివిటీలును, నీ విధము నేకాగ్రమనంబుల సాధులొనర్చెడి భజనలు చూడఁగ సుజ్ఞానము వైరాగ్యము, మోక్షం బష్టాదశ సుపురాణసారము, సప్తకోటి మహామంత్రార్థము లొక్క విధంబున దేహంబులతో నిలిచినట్లుగాఁ దోఁచె నక్కడ, నమరావతియో, యలకాపురమో, శివుని పురమొ, వైశ్వానరునగరమొ, వాయులోకమో, వరుణుపట్టణమొ వేదమూలమో, శ్రీవైకుంఠమొ, యనఁ బొలుపెసఁగుచు నొప్పెనక్కడ. నిట్లు భజన మొనరించుకాలమున, నైదుస్టేషనుల పోలీసులతో దొరల్ దొరలు పండరిపురిఁ జేరిరి. పండరి కిప్పుడు పోవఁగ వలదని, యతికఠినముగా నాజ్ఞాపించిరి. చంద్రభాగకును దూర్పు దిక్కున, భళీభళీ యన భక్తులందఱును బాండురంగనిం బొగడఁ దొడంగిరి. పాండురంగ పండరిపురనాథా! జ్ఞాన భక్తివైరాగ్యప్రదాయక! నారద వీణానాదవినోదా! పుండరీక వాక్పుండరీక నుతగోకులేశ! సద్గుణగణ నిలయా! బృందారణ్యా నందవిహారా! కంసమర్దనాఘౌఘవిదూరా! మురసంహర శంకరనుత చరితా! కరుణాకర! భాస్కరనిభతేజా! శరణాగత రక్షణబిరుదాంకా! దేవకిసుత! వసుదేవ తనూజా! రావణాది దుర్జయ దనుజసంహరా! నరమృగరూప! వనాటచయావన! యశోదపట్టీ! నందనందనా! నృగభూపాలక శాపవిమోచన! ధేనుక బకచాణూరమర్దనా! సకలేశ్వర! గోపీ హృచ్చోరా! జరాసంధ సంహారకారణా, బాణాసురకర బలవిదారణా! సత్యాహృదయాబ్జాతదినేశా! రుక్మిణీ మనస్సిరజభృంగా! కాళిందీ హృదయేశ ముకుందా! దామోదర, సుందరఘనదేహా, పండరిపురిలోఁ గృపాభారమున నిటుకరాతిపై విఠలనామమునఁ జేతులు నడుమునఁ జేర్చియుంచుకొని, చేతన రక్షణఁజేయఁగఁబూని కలియుగమందున వేలసాధువుల, జ్ఞానదేవుని, నామదేవునిఁ, దుకారాముని, గణేశనాథుని, రోహిదాసునిఁ జోకామేళుని, రాకావరు గోరాకుంభారుని, నరహరి సక్కు జనాభాయిలను, సామంతుని, నిస్సంగుఁ గబీరుని, భానుదాసు నింభారాజాదుల, రక్షణచేసిన వాఁడవనుచు మేమీ క్షణమునఁ బ్రార్థించుచుంటిమని, యెనిమిది దినములు నేకరీతిగా భజనలు చేయఁగ భక్తవత్సలుఁడు కరుణించెను సర్కారు వోయెను, సెలవాయెను, దులసీవరదాముని ఘనమగుకోవెలదరవాజాల్ తెఱచిరి. అప్పుడు సాధులు కుప్పలుగూడియుఁ జంద్రునిఁ గనిన సముద్రముభంగిని వాడుపైరులకు వర్షమురీతిగ బహుళానందం బొందినవారై, దేవాలయమునఁ బ్రవేశించియు, నిటుకరాతిపై నిల్చిన రంగని, గాఢాలింగన మాచరించిరి. పరాత్పరుని రూపము గన్పించెను.

భాస్కరు నేలిన ప్రకాశంబుతోఁ జంద్రుని కెనయగు చల్లఁదనముతో, దర్పణములు బోలిన చెక్కులతో, నళిననిభములగు నయనంబులతోఁ దిలపుష్పమువలెఁ జెలఁగు నాసికతో, సత్యజ్ఞానానందయుతుండై, వర్ణనఁ జేయఁగ నాదిశేషునకు వశముగాని సుందరదేహముతో దర్శనమీయఁగఁ దప్పకచూచిరి. బద్ధులైన సంసారుల కప్పుడు బ్రహ్మానందం బుద్భవిల్లెను. మూడీషణములు గోడుగుడిచెను. దమోరజస్సులు దాఁగిపోయెను, నష్టకష్టములు నష్టమాయెను. బాపారణ్యము భస్మమాయెను రాగమడఁగి వైర్యాగమబ్బెను. భోగవాంఛ విడిపోవఁ దొడఁగెను. ప్రపంచచింతలు బాసిపోయెను. నిద్రాహారాల్ నిల్చిపోయెను నిట్టి వైభవముఁ బండరిపురి విరోధికృతు సంవత్సరమందున, వరంబైన కార్తికమాసంబునఁ జూచిమనంబునఁ జోద్యకరముగాఁ బూడివాడ యను పురిని వసించుచు సాధుజనుల శ్రీపాదరేణువై, ధర మొవ్వ వేంకట దాసాహ్వాయమున, వెలయువాఁడ శ్రీవిఠలుని కృపచే, రచియించితి నీ రగడను నతతము, వఠియించిన నిష్పాపులయ్యెదరు. పాండురంగపదభక్తిగల్గును. జన్మబంధములు సడలిపోవును, రామరామ శ్రీరామ నృపాలా! సీతామానస కుముదమృగాంకా! తాటకేయ ప్రాణాంతకరూపా! హరిహయముగ్ధసుతాంతక బాణా! వానరసహితా! వార్ధిబంధనా! రావణఘటకర్ణాదిసంహరా! సీతాన్వీతా! పూతచరిత్రా! యఘవినాశనా! యఖండవైభవా! మొవ్వ వేంకటాఖ్యదాస పోషకా! శ్రీవేణుగోపాల నమస్తే నమస్తే నమః.


ఇది శ్రీ స్వామి యిరువదియొకటవ సంవత్సరమునందలి కవిత్వము.

క్రోధన సంవత్సర ఝంఝామారుతము

సీసమాలిక : శ్రీవధూజాని కృష్ణావతారమునొంది కువలయంబేలి వైకుంఠమునకు, వేంచేయునాడు జన్మించిన కలియుగం బైదువేలిరువది యాఱువత్సరములేగినంత నారంభంబయిన క్రోధ, నాబ్దవైశాఖమాసాంత కృష్ణ పక్షాష్టమీ శుక్రవాసరంబున మూడు, భాగముల్కడచన్న పగటియందు నాస్తికాధములైన నరులకుఁ దనశక్తి, నెఱిఁగింపఁదలఁచి సర్వేశ్వరుండు పురికొల్పఁగా మహత్తర జవంబున లేచి, వాయుదేవుండు భూవలయమెల్ల నారాత్రిమెల్లగా నాడించి నవమీతిథిని శనివాసరంబునను రేఁగి ఉఱుము లాసారంబు మెఱపులు పిడుగులు, దనకు సాహాయ్యమై తనరుచుండ ఎచ్చోటఁగలిగెనో యెఱుఁగ నేరము గాని భద్రాచలము మూలబయలుదేతి సీతా సుమిత్ర జాన్వీతుఁడై భద్రాద్రి, పైనుండు శ్రీరాము భక్తిఁగొలిచి తెలుఁగుదేశములోని పలుగాకులను జాలగారింతునని చెప్పి గాలివాన బూరగమ్ములపాటి పొంకంబుఁదూలించి, మొలకల పల్లెపై మోదిమోది చాపరాపల్లెలో సామర్థ్యమునుజూపి తిరువూరి గిఱగిఱఁ ద్రిప్పివిడిచి గంపలగూడెంపుఁ గొంపలెల్లనుగూల్చి,

యలఘోష వీటినల్లాడఁజేసి లలినూజివీటి పొంతల విక్రమముసూపి, రాజమహేంద్రవరమ్ము నూచి, యేలూరి సీమలోఁ జాలనష్టముసేసి, బెజవాడ ప్రజల నేడ్పించి మించి గుంటూరు గింటూరు ఘూర్ణిల్లఁగాఁజేసి, దాని చెంగటి యూళ్లదాకి మోది మంగళగిరిఁజేరి మధువైరి సేవించి, దుగ్గిరాలకుఁ జొచ్చి తొంగిచూచి బలిమిమీఱఁ దెనాలిఁబట్టి యిట్టటులాచి, పొన్నూరి ప్రాంతంబుఁ బొలుపుమాన్పి బాపట్లవఱదాఁకఁ బర్వి కొంచెముతగ్గి, యటుపై ననవసరంబనుచు మాని తరువాతఁ బూర్వదిక్తటమందు వ్యాపించి, పల్నెటూళ్ళన్నియుఁ బాడుసేసి రేపల్లెతోఁ దత్సమీపగ్రామములెల్ల గ్రొచ్చి గోరాడి బల్గోలఁజేసి యలతెనాలికిఁ జేరువగు నూళ్లపెకలించి, యేటిలంకలు గోటమీటిదాటి చెలఁగి దేవరకోట సీమలోఁ బడదూకి, తద్గ్రామములమీద దాడిసూపి దీవిసీమకుఁ బ్రాకి దిందిమ్మనుచుమోది. మచిలీపురము తాఱుమాఱుసేసి జడివానయును గాలి సల్లాపమాడుచు విపులారవంబుచే విసరుచుండఁ బ్రాకారములువ్రాలెఁ బ్రాసాదములు గూలెఁ గ్రొత్తప్రాక్టారు లొక్కటనశించె నెత్తైన పెంకుటిండ్లిల మ్రొగ్గి చదునయ్యె, ధాన్యముంచిన కొట్లు తడిసిపోయెబెల్లునేసిన గీములెల్ల రూపఱెఁదాటి, యాకు గప్పిన కొంప లడఁగిపోయె సత్రంబులును బార శాలలుప్పరవీధి. కెగసె నాటకశాలలెల్లఁ గ్రుంగె వైద్యశాలలు వణిగ్వాసముల్ నుఱుమయ్యె, గచ్చుసేసిన యిండ్లు మచ్చుమాసెఁ బసుల చావళ్ళు తుంపెసలాడి భువిద్రెళ్ళె, గజవాజిశాల లగ్గలికడుల్లెఁ బాతళ్ళ లోనగంపలనున్న ధాన్యంబు వానచేఁదడిఁ జెంది నానిపోయెఁ బడవలలో వడ్లబస్తాలు సెడిపోయె, నల్లప్రాక్టర్లబియ్యంబు నానె వాణిజ్య మొనరించువారి నట్టులుగూలఁ. గాఁ బచార్దినుసు లొక్కట నశించె జిలకఱ్ఱ, మెంతులు సెనగలు గోధుమ, జొన్న లాముద ముప్పు సొంటి పెసలు మిరియాలు ధనియాలు మిరపగాయలు కందు లలసందలును బొబ్బరలు పొగాకు పటికబెల్లము చింతపండు కొబ్బరి, పంచదార, బెల్లము కాగితాలు పసుపు సగ్గుబియ్యము గవ్వసాంబ్రాణి కుంకుమ, జాపత్రియోమంబు జాజికాయ వాయువింగళము లవంగాలు యాలకుల్దాచినచెక్క చందనమునూనె మినుము ఉల్వలు నీలిజనపవిత్తులగోనె. లావాలు విస్తరియాకుకట్ట లింగువ వెల్లుల్లి యింపైన గంబూర పచ్చాకు మొదలైన బహువిధంబు లైనపదార్థంబు లడుసుపాలయ్యెన, ప్పెనుగాలివానచే గొనబుదగ్గి వంటగీములు నీటివఱదపాలై యుంట, చేఁ బ్రొయ్యి రాజేయఁ జెల్లదయ్యె వమ్మైయిన యిండ్లన్ని వదలి లోకులు ముందుపడఁబోవు నిండ్లలోపల వసించి రాలుబిడ్డలఁగూర్చి యారాటమొందిరి. పరగ్రామములనుండు పంచజనులు ముందు సొమ్ములమీఁద మోహంబు విడిపోయె, నటువెన్క భార్యాసుతాది సర్వ బాంధవప్రేమ లాపగలలోఁగలిసి స్వప్రాణరక్షణమందు బాళిగల్గె మంచినీళ్లును లేని మార్గమధ్యములలోఁ, బాథస్సునిండంగఁ బడవలాడె నెద్దుల బండ్లపై నెక్కి పోదగియుండు, త్రోవలందునఁ బెద్ద దోనె లాడె బండిమ్రోకులఁ గొల్తఁబట్టసాధ్యముగాని విరివిగల్గినచెట్లు విరిగిపోయె దబ్బలు మామిళ్ళు దానిమ్మ లడగారె నేరేండ్లు మారేండ్లు

నేలఁగూలెఁ గల జువ్విచెట్లు జమ్ములు నిమ్మలిలఁద్రెళ్ళె రావులు మఱ్ఱు లోరఁగిలఁబడియె వెలగలు గంగరావులు మోదుగలు వ్రాలెఁ, గుంకుళ్ళు నారింజకుటము లుర్లెఁ టొన్న లిప్పలు పచ్చగన్నేరుల నఁటులు వేఁపలురేలలు విఱిగిపోయె గంగరేఁగులు కొండ తంగేడులును మేండ్లు, కొండగోగులు డుల్లె నండలేక తాముండు తావు లుత్తలపాటు సెందంగ, బక్షి జాతముల కిబ్బందితోఁచె గూబలు రాపులుంగులు వేసడము లీల్గె. బక దారి తుటుము లోపికఁ దొలంగెఁ గౌజులు గోరువంకలు వికావికలయ్యెఁ బూరేండ్లు నట్టువపులుఁగు లడఁగె గ్రద్దలు గువ్వలు కాకిమూకలు సచ్చె, లావుకుల్లకుము కుల్లయముఁజెందెఁ గిజిగాండ్లు కీరముల్కేర్జంబులల్లాడెఁ దిక్కతీతువులు పత్తిరులు ద్రెళ్ళె గూడబాతులు చింతగొట్టెల సకినాలపులుఁగులు వక్కుకొంగలు నశించె నత్తగొట్టెలపిండు పత్తరాటంబులు గుండుపిట్టలు నీటికోళ్లు సచ్చె గరడులు నల్లచ్చికాంద్రు జీనుగులు వడ్రంగులు పిగిలిపిట్టలును బ్రుంగెఁ జావళ్లపైఁబడ్డఁ జచ్చిన పసిమూక, గణుతింప నేరికిఁగాదు వశము పొలములో రాత్రివేళలఁ గట్టివైచిన, పశుసంఘమును గతప్రాణమయ్యెఁ గొట్టముల్పడునంచుఁ గట్టుగొయ్యలవిప్పి, తఱిమిన గోవులంతట నడంగెఁ గురపగొఱ్ఱెలు గొండగొఱ్ఱె లొక్కొకయూరఁ జచ్చె గుంపులుగ లక్షలునువేలు త్రుంగుడుపడ్డ జంతుశరీరములువైవ, విరివిగల్గినచోటు దొరకదయ్యె దుర్గంధ వశమునఁ ద్రోవలంజనువారి, ముకుగ్రోళ్ళవెంద్రుకల్వికలమయ్యె నీరీతి నొక్కనా డిలయెల్ల వడికించి, చాలించె రాత్రికగ్గాలివాన మఱునాఁడు మొదలు భూమండలం బెచ్చోటఁ, బాఱఁజూచినను విభ్రాంతిగల్గె రసఁదొరంగినచెట్లు రస్తాలకడ్డమై, బాటసారులకు నిబ్బంది గూర్చె, గొప్ప లోగిండ్లలోఁ గొలువుండు సరదారు, లోరపాకల లోనఁ, జేరుటబ్బె ధనవంతులగువారు ద్రవ్యమిచ్చెదమంచుఁ గూలీలకై కొంపకొంపదిరిగి, రానాఁడు కూలీలకబ్బిన గర్వంబు ప్రభువులకైనఁ గన్పట్టదయ్యె నెలమి మీసలుదువ్వి రిండ్లు నేసెడువారు గోడలపనివారి గోటుమీఱెఁ డాపీపనులవారి టంకసాలలు మ్రోసె, మాంసంబుఁ దినువారి మమతదీఱెసర్కారువారిండ్ల సామానులీయంగ, మాలమాదిగల దీమసముహెచ్చె గాలికిఁ బడిపోవఁగానున్న వృక్షము, ల్పడఁగొట్టిరిండ్లకై పంచజనులు నేపనివానికై యెచ్చోటఁ బిలిచినఁ గాని మాట్లాడుటే గగనమయ్యె వడవేయుతఱి గాలివానగొట్టుటఁజేసి, యది మొదల్కొని వానలగుటఁజేసి దట్టమైకసవుక్షేత్రములలో మొలతెంచె, మాగానిగలవారి మచ్చమాసె బలిసినయెడ్లు అంపమువంటి నాగేళ్ళు, తగిలించిననుభూమిపిగులదయ్యె మున్నొక్కరూకతో ముగింయిపఁగలవారి, వ్యవసాయవ్యయము నూఱంతలయ్యెఁ బొల మెక్కువైనాటఁగలశక్తి లేకుంట, బహుజనంబులు వీసబడులకిచ్చి రను దినంబును వాన లధికమైయుంటచే, వ్యవసాయగాంద్రంత వ్యసపనడిరి రెండుపూటలు నానుచుండుటఁజేసి నాగలిదున్నుపసుల కుమ్మలికమీఱె వేయేసి రూప్యముల్సేయఁగల్గిన వృషభంబైన దున్నుచోఁబడకవెట్టె వేయేసి యెకరాలు సేయఁగల్గినవారి కొక్కొక్క యెకరమే యెక్కువయ్యెఁ బదిపదుల్ కూలీలు



 తుంగల బాపమ్మగారు (ధూళిపూడి), మొగలిపువ్వు రత్తమ్మ గారు (పూడివాడ), సిర్విసెట్టి వీరరాఘవమ్మ గారు (మోదుమూడి), అంబటి అచ్చమ్మగారు (పూడివాడ)

పరిచేయవలసినచేని కొక్కొక్కరే కానబడిరి. యాశ్లేషకార్తెలో నధికమైవర్షంబు, ముందునాటిన చేలు ముణిగెc గొన్నినారుకై కొందఱూరూరం దిరిగి ధరల్పరికింపc బోగురూపాయిగిట్టె విరిగిన నాగేళ్ల మఱియు సేయcగలేక, విశ్వకర్మలకు బల్విసుకుదోcచెc బిలిచినవారి మెప్పించి పంపగలేక, యూరికూలీలు విచారపడరి పొరుగూరికూలీల పోకిళ్లుపడలేక, కొందఱాసాము లిబ్బందిcజెంది, రౌరౌర యీరీతి నయ్యెc గ్రోధననామవత్సరంబున గాలివానచేత దైవంబుగలడన్న తాత్పర్యమిపుడైనc, దెలియవచ్చును నాస్తికులకునైన ధరణిలో మొవ్వ వేంకటదాస వరదుc డగుచు శ్రీ పూడివాడలో నమరియున్న వేణుగోపాలు నెపుడు సేవింపరయ్య సర్వసౌఖ్యంబు లొనcగూడు జనములార.

మదనగోపాల శతకము

క. శ్రీ రమణీ హృదయేశ్వర! సారసదళనయన! మౌనిసన్నుతచరణా!
కారుణ్యాలయ భక్తాధారా! నను!cబ్రోవరా మదనగోపాలా! 1

సీ. కడకంటిచూపునc గలుములు గలిగించు భార్గవిసతి నీకుc బరమ పురుష!
జగములసృష్టింపcజాలిన తొలివేల్పు ముద్దుబిడ్డడcడు నీకు మురవిభేది!
నెఱి స్వయంభువులైన నిగమవాదంబులు వందిమాగధులు నీ కందిరేశ!
శబ్దస్వరూపంబు శాసించు శేషుండు శయ్యాసనము నీకు సారసాక్ష!
అట్టి నీదు మహత్త్వంబు నభినుతింప నెవరికైన నశక్య మే నెంతవాcడ!
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 2

సీ. బ్రహ్మవేత్తలు సదా పాటంచి వాంఛించు రమ్యవైకుంఠంబు రాజధాని!
చలువకాంతుల జిమ్మిజగముల వెలయించు రేవెల్గు ముద్దుల బావమఱcది!
పూవుటమ్మున లోకములనెల్ల నిర్జింపcజాలు మన్మథుcడు గారాలకొడుకు!
సకలవిద్యాప్రాజ్య సామ్రాజ్యపీఠికి నధిపతి భారతి యనుcగుకోడ!
లిట్టి నీ కాcపురము ఠీవి యెందునైనగలదె గాలించి గాలించి కనినcగాని
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 3

సీ. సర్వేశ నీ దివ్యసంకల్పబలముననొకవేళ లోకంబు లుద్భవించు!
పరమపూరుష నీ ప్రభావంబుచే నొక్కవేళ సుస్థితములై వెలయుచుండు!
పాపసంహార నీ కోపాలనంబున నవియెల్ల నొకవేళ నడcగుచుండు!
నిందిరానంద! నీ యిచ్ఛానుసారంబు భూతకోటికి గతుల్ పొసcగుచుండు!
నఖిలమును నీవ నీకంటె నధికమైన వస్తువొక్కటి లేదిది వాస్తవంబు!
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 4

సీ. భోగంబులన్నియు రోగంబు లేగదా నీ పాదయుగళి ధ్యానింపఁడేని।
బహుశాస్త్రపఠనముల్ బరువుమోతలెగదా నీ పాదయుగళి ధ్యానింపఁడేని।
విత్తంబులన్నియు వేరువిత్తులెగదా నీపాదయుగళి ధ్యానింపఁడేని।
ఊహలన్నియు మారణోద్బంధములె గదా నీ పాదయుగళి ధ్యానింపఁడేని।
నరుస కెన్నెన్నియున్న నీకరుణలేక సౌఖ్యమింతైనఁ బొందగాఁ జాలఁడెపుడు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 5

సీ. బాలగోపాల నీభక్తిలేకుండిన నరుడు గాఁ డతఁడు వానరుఁడు గాని।
శ్రీకాంత నీ పాదసేవలేకున్న మానవుఁడు గాఁ డతఁడు దానవుఁడుగాని।
వనమాలి నీకథల్ వర్ణింపకున్నఁ బండితుఁడుగాఁ డతఁడు ఖండితుఁడుగాని।
శ్యామసుందర! నిన్ను స్మరియింకున్న కర్మంది గాఁడతఁ డూరపందిగాని।
శేషమందిర నీ నామచింతలేని మనుజుఁడేరీతి నౌన్నత్యమును వహించు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 6

సీ. నీపాదభక్తితో నెగడువారికి లేదు సంసారవిషవహ్ని సంగబాధ।
నిన్ను మానసమందు నిలుపువారికిలేదు నరకభీకర యాతనావిపత్తు।
నీ కథాపఠనంబు నెరపువారికి లేదు ఘోరభూతప్రేతకోటిచింత।
నీ నామపీయూష మానువారికి లేదు రాజచోరాగ్ని సమాజభీతి।
నీ గుణాకర్ణ నాలాపనిరతులైన జనులకును లేదు పో పునర్జన్మ భయము।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 7

సీ. సౌందర్యవతులైన మందయాన లొనర్చు హావభావంబుల కాసఁజేయు।
వేలకొలందిగా విత్తంబుహెచ్చించి గచ్చుమేడలు గట్టగాఁ దలంచుఁ।
జుట్టుప్రక్కలవారి నెట్టితద్భూములు తానె గైకొనుటకై బూనుకొనును।
జావ సిద్ధంబయ్యు సంపాదనమునకై రకరకాలైన బేరంబులాడు।
క్షణికమైనట్టి యిహలోక సౌఖ్యమునకుఁ దడవునే గాని నరుఁడు నిన్దలఁపబోడు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 8

సీ. ద్వీపాంతరములలో వ్యాపారములుచేసి యాగజాంత్రైశ్వర్య మందవచ్చు।
నశ్వమేధాదులౌ నధ్వరంబులుసేసి దేవేంద్రపదవి సాధింపవచ్చు।
బాహుబలంబుచేఁ బగతుర నిర్జించి యిలయెల్ల బహుకాలమేలవచ్చు।
నష్టాంగయోగంబు లభ్యాసమొనరించి కడలేని మహిమలు బడయవచ్చు।
గురులసన్నిధిశాస్త్రంబు లఱయవచ్చుగాని నీ పాదముల భక్తి గలుగుటరిది। 9
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల.

సీ. సకలలోకంబుల సార్వభౌమత్వము రామభక్తికి సాటి రాదు రాదు।
శాస్త్రాగమంబుల సాహతీసంపత్తి రామభక్తికి సాటి రాదు రాదు।
ఉత్తమోత్తమమైన యున్నతోద్యోగంబు రామభక్తికి సాటి రాదు రాదు।
పరిధవంబులతోడి బ్రహ్మత్వసంప్రాప్తి రామభక్తికి సాటిరాదు రాదు।
అని యనిత్యంబులైన యీ యఖిలములను విడిచి జ్ఞానులు నిన్నె సేవించుచుంద్రు
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 10

సీ. సుతకళత్రారామహితబంధుభటకదంబముల వీక్షించి సమ్మదము వొందు।
ప్రాకారమంటప ప్రాంగణాగారముల్ సరిచేసి మదిలోన సంతసించు।
కేదారగజతురంగోదార వృషభముల్ బడసితినంచు గర్వంబుగాంచు।
మణిభూషణాంబర మాణిక్యహారముల్ ధరియించి పెద్దలఁ బరిహసించు।
గాని యివియెల్ల నీ కృపాకారణమున గలిగెనని మానవుఁడు మదిఁప దలఁపలేఁడు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 11

సీ. ఆరోగ్యహీనుఁడైయల్లాడుచుండగా దారిద్ర్య దోషంబు దాపురించు।
దారిద్ర్య బాధచేఁ దటమటించుచునుండ సంతానబహుళత సంభవించు।
సంతతిఁ బోషింపఁ జింతలొందుచునుండ భార్యావియోగంబు ప్రాప్తమగును।
దానితోఁ గృశియించి తలక్రిందులైయుండఁ బక్షపాతంబు గన్పట్టు నపుడె।
యిన్నికష్టంబులొందుచుచునున్న నరుఁడు పాడుసంసారమున వాంఛ వీడలేఁడు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 12

సీ. పూర్వజన్మార్జిత పుణ్యలేశంబున గలిగన కలిమిచే గర్వమొంది।
సకలలోకానీక సంరక్షకుఁడ వైన జలజనాభుని నిన్ను గొలువమఱచి।
దినగండమైన యీ దేహమే శాశ్వతపరమార్థ మనుచు విశ్వాసమూని।
పుత్రకళత్రాది పోషణంబున కెంత నీచకృత్యములైన నాచరించి।
తుదకు నరకాగ్నిపాలయి దుఃఖమొంది యలమటింతురు మూఢులైనట్టివారు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 13

సీ. పిచ్చి యింగ్లీషింతవచ్చిన దేవుండె లేడటంచును వాదులాడు నొకఁడు।
రెండుపూటలు తిండి దండిగాదొరకినఁ బాపంబులేదంచుఁ బలుకు నొకఁడు।
అర్థణాయుద్యోగ మమరినఁ బరలోక మొక టున్నదా యంచు నొప్పుఁడొకఁడు।
మూడుడబ్బులు చేతఁ గూడ బెట్టినయంత శాస్త్రంబుపై తొమ్ముచఱచు నొకఁడు।
కాని వేదాంతవేద్యుఁడవైన నీదు మహిమ మెఱుగరు కర్మనిమగ్నులౌట।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 14

సీ. అహిరాజశయన నీ మహిమంబుఁ దెలియక వేదపూరుషుఁడు నిర్వేదమొందె।
పంకేజనేత్ర నీపరమత్వమెఱుఁగక బ్రహ్మరుద్రులు భంగపాటు గనిరి।
నిత్యస్వరూప నీ సత్యంబు నరయక వ్యాస వాల్మీకు లాభాసమైరి।
దైత్యసంహార నీ తత్త్వంబుగనలేక బృందారకులు తల్లక్రిందులైరి।
బద్ధసంసారులై పాపపంకమగ్నులైన మనుజులు నిన్నెట్టు లరయఁగలరు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 15

సీ. అల రాముఁడే దైవమైనచో వాలినిఁ జాటుగా నేటికి సంహరించె।
శ్రీకృష్ణుఁడే సర్వ లోకేశ్వరుండైన దధిఘృతంబుల నేల తస్కరించె।
వామనమూర్తియే వాసుదేవుండైన దీనత నేరీతిఁ దిరిపమెత్తె।
కామపాలుఁడెజగత్కారణుండైనచోఁదను వెఱుంగకకల్లు త్రావనేల।
అని భవత్తత్త్వ మెఱుఁగని యలసమతులు నిన్ను దూషించి చెడుదురెన్నెన్నొ గతుల।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 16

సీ. రఘువంశవర్యుఁడు రాముడెట్లుగును నాత్మారాముఁడే రాముఁడగునుగాని।
విష్ణు విష్ణునియేమొ విశదీకరింతురు బ్రహ్మనాయఁడు గాకపరుఁడెవాఁడు।
తీర్థయాత్రలకేగి తిరుగనేలా జనుల్ కాయంబు కంటెను గాశి గలదె।
కర్మభక్తిజ్ఞాన ఘనసాధనములేల వెలుఁగు నీలోఁ జూడవలయుగాని।
యనుచు నీ పాదభక్తులఁ జెనకి వాదమాడవత్తురు వెఱ్ఱివేదాంతు లకట।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 17

సీ. వాల్మీకి కపులకు వాలంబుగలదనె నది యెట్లు పంచలోనడగియుండె।
పరగరావణునకుఁ బదితలల్ వర్ణించెఁ బ్రక్కపై నతఁడెట్లు పవ్వళించె।
కొండంతవాఁడనెఁ గుంభకర్ణునిఁబట్టి యింటిలో నతఁ డెట్టులిమిడి యుండె।
గమనంబు లేదాయెఁగద కబంధుండెట్లు బయలుభూమికిఁ బోవుపని ముగించె।
నీకథాలాపములను వర్ణించునపుడు వెఱ్ఱి లీరీతి ప్రశ్నలు వేయుచుంద్రు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 18

సీ. సాగిన మూన్నాళ్లు జగతిలో నాకంటె ఘనుఁడెవ్వఁడని మహాగర్వమొంది।
తన నెత్తుకొనిపోవ నవయంబు నెత్తిపైవసియించు మృత్యువు వార్త మఱచి।
అది మంచి యిది చెడ్డయని తెల్పుశాస్త్రవాక్యంబుల నెల్ల ననాదరించి।
పాపపుణ్యంబుల పాటింపకెంతయు నిచ్చవచ్చిన పోకలెల్లఁ బోయి।
కడకు నాపత్తులొక్కట గప్పుకొనఁగ నేడ్చునే గాని నరుఁడు నిన్నెఱుఁగలేఁడు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 19

సీ. నియమవ్రతంబుల నిష్ఠచేఁ దనువున మాంసశోణితముల మఱగఁ జేసి।
నిరతంబు నీపాద సరసీజమకరంద మాధుర్యమందు నిర్మగ్నులగుచు।
తత్త్వవేత్తలు నిన్నుదహార కోశంబున నరసి యానందంబు నందుచుండ।
నిన్నొక్క నాఁడైన సన్నుతింపఁగ లేక యింద్రియదాసులై యెసఁగునట్టి॥
తిండిపోతులు తెగఁక్రొవ్వి దేవుఁడేడి ? యెచట నని పల్కవత్తు రిదేమి వింత ?
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 20

సీ. నీ భయంబునగదా నియమంబు దప్పక యుదయించు నిత్యంబు నుగ్రకరుఁడు।
నీయాజ్ఞచేగదా నిఖిలభూతంబులఁ బూని మోయుచునుండు భూతధాత్రి।
నీ శాసనమునగా, నీరంబు వర్షించు నర్హకాలములందు నంబుధరుఁడు।
నీ యాజ్ఞచేగదా, రోయక జగమెల్ల పారాడుచుండు సమీరమూర్తి।
హేతుభూతుండవైన నిన్నెఱుఁగలేక పల్కుచుందురు మూఢులు ప్రల్లదములు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 21

సీ. మధుసమాగమవేళ మంజుపల్లవపాళిఁ జెట్ల నెవ్వాఁడు పుష్పింపఁ జేయు।
చెలఁగి క్రమ్మిన కాఱుచిమ్మచీఁకటి వాప రాత్రులనెవఁడు చంద్రమునిఁబంపు।
నీలకంఠంబుల నిగ్గుపింఛములందు ముద్దురంగు లెవండు దిద్దిపెట్టు।
కోకిలంబుల సన్నగొంతు క్రోవులలోన ముగ్ధధ్వనులెవండు మొలువఁజేయు।
నీవొకండవు లేకున్న నెట్లు జగతి చిత్ర చిత్రస్వరూపంబుఁ జెందుచుండు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 22

సీ. పనిగొని యెవ్వాఁడు పర్వతశ్రేణుల గగనభాగం బంటఁగట్టుచుండు।
విత్తి యెవ్వఁడు నీరువెట్టి సాంద్రంబుగాఁ గాననంబులఁ బెంపకం బొనర్చు।
మొనసి లోకమునెల్ల ముంచకుండెడు నట్లు సింధువు నెవఁడు శాసించుచుండు।
సస్యానుకూల ప్రచారంబుతో నెవ్వఁడిల ద్వీపవతులను సృష్టిచేయు।
నీవుగావొక్క యిన్నిటి కీశ్వరుఁడవు తెలియ రసురాంశజులు నీదు దివ్యమహిమ।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 23

సీ. వేలసారులు వల్లెవేసియు నొక బండ పద్య మొక్కటియైనఁ బలుకలేఁడు।
అచిరకాలంబులో నఖిలశాస్త్రంబులు గురులసన్నిధి నేర్చుకొను నొకండు।
పట్టినయదియెల్ల బంగారమై యొక్కఁడనుపమానములైన ధనములొందు।
విశ్వప్రయత్నముల్ విసువక చేసియు నష్టదరిద్రుఁడై యడలు నొకఁడు।
కర్మఫలదుండవై నీవు కలుగఁగాదె హెచ్చు తగ్గులు జగతిలో నిట్లు కలుగు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 24

సీ. కనులకింపులుగూర్చు తనుశోభతో నొక్కఁ డెల్లర కెలమి సంధిల్లజేయు।
దర్శించినంతనే తన్నబుద్ధులుపుట్ట వికటరూపముతోడ వెలయునొకఁడు।
గాంధర్వమవనికిఁ గదలి వచ్చినయట్లు బలుసొంపుగాఁ బాటపాడు నొకఁడు।
పెలుచ గాడిద లోండ్రపెట్టినట్టు లొకండు కర్ణశూలంబుగాఁ గంఠమెత్తు।
కర్తవై నీవు గలుగుటఁ గాదె యిట్లు రకరకంబులు పుడమిలో బ్రకటమగును।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 25

సీ. గంగాతరంగిణి పొంగిపాఱినయట్లు విశదవాక్ప్రౌఢిమ వెలుఁగు నొకఁడు।
పెకలించినను గాని యొకమాట రాకుండు పుట్టెడునత్తితోఁ బొదలునొకఁడు।
పుట్టినప్పటినుండి గిట్టెడువఱదాఁక నారోగ్యవంతుఁడై యలరునొకఁడు।
భోగమింతయులేక రోగాలకుంటియై దేశ దేశంబులు దిరుగు నొకఁడు।
కర్మఫలదుండవై నీవు కలుగఁగాదె, వింతవింతలు కడునుద్భవించు నిట్లు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 26

సీ. బ్రహ్మపర్యంతంబు పరగు జీవులనెల్లఁ గర్మసూత్రంబునఁ గట్టిపెట్టి।
కీలుకాఁ డాఁటకై తోలుబొమ్మలఁబట్టి తెఱమీదఁ ద్రిప్పెడు తెఱఁగుతోఁప।
సంసారమనియెడి జవనిక కెక్కించి పలురకంబుల భూమికలు రచించి।
యాడింతు వెల్లప్పు డదియెఱుంగక నరుల్ తామె యన్నిటికిఁ గర్తలమటంచు।
నిక్కుదురుగాని బిసయూడ్చి యొక్కనాఁడు క్రిందఁబడవైతువని భావమందుఁగనరు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 27

సీ. రెండుపూటలు పొట్టతిండికై పెనుచింత తిండిగల్గిన బెండ్లి తెఱఁగు చింత।
పెండ్లాము వచ్చినఁ బిల్లలకై చింత పిల్లలేర్పడినంత పెంచుచింత।
పెంచిన భోగముల్ మించిలేవను చింత భోగంబు లొదవిన భూమిచింత।
భూమి లబ్బిన మీఁదఁ బొదలు సౌధముచింత సౌధంబుగట్టినఁ జావుచింత।
చింత లీరీతి నరులకు జిగురువెట్టుగాని నీపాదచింతన గలుగ దింత।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 28

సీ. ధనవంతునకు సౌఖ్యమన వీలుగాదాతఁ డనపత్యుఁడై వంత నడలు చుండు।
సంతాన లాభంబు సంభవించినఁగాని విద్యకై నిరతంబు వెతలుచెందు।
విద్యాపటుత్వంబు వెలసియుండినగాని సతి రోగబాధచే సమయముచుండు।
సతి కొంతయారోగ్యవతియైన గాని చోరాగ్ని భయంబుల నలమటించు।
పాడు సంసారమున సౌఖ్యపడిన దెవఁడు ? వాంఛ నినుగొల్చి కడతేరవలయుగాని।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 29

సీ. ఇంట బియ్యములేక వంటమానితినంచు నిల్లాలు వాపోవు నింత లోనఁ।
జెలికాండ్రతోఁ గూడఁ గలిసి బావమఱంది తిండికై వేళకే తెంచునపుడె।
తాసీలకొఱకు మోతాదువాకిట నిల్చి గద్దించుచుండు నాగడియలోనె।
రోగంబుతాలూకు రొక్కంబు తెమ్మని వైద్యుండు తగ వాడవచ్చు నిట్లు।
పాడుసంసారమున సౌఖ్యపడిన దెవఁడు వాంఛ నినుగొల్చి కడతేరవలయుగాని।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 30

సీ. వర్షంబుచే నిల్లు వఱదలాయెను జూడు కప్పవేమని భార్య కసరుచుండు।
గొనిపోయి తిని యిట్లు కూర్చుండ నేమగు ఋణమంచు నెగురు నప్పిచ్చినతఁడు।
నెలదాఁటె జీతంబు నేడె తెమ్మనెఁ బంతులీకున్నఁ బోనని యేడ్చు కొడుకు।
తండులంబులు లేవు తద్దినంబున కంచుఁ గబురుసేయును గ్రామకరణ మిట్లు।
పాండుసంసారమున సౌఖ్యపడున దెవఁడు వాంఛ నినుఁగొల్చి కడతేరవలయుగాని।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 31

సీ. బరువాయెఁ బసిబిడ్డ జ్వరమంచుఁ దలపోయఁ దరుణి బైటికినేగుఁ జెఱగుమాసి।
వంట కెవ్వరిఁ బిల్వవలెనంచుఁ జింతింపఁ జుట్టాలు వత్తురుచూచిపోవ।
బంధుసన్మానంబు బరపుటెట్లనుచుండఁ బాలీయ కెగదన్ను బాడిగేదె।
బత్తెతోనట్టిట్టు బడుచుండఁ జనుదెంచుఁ బశువులు బందిలోఁ బడినవార్త।
మనుజుఁడేనాఁడు సౌఖ్యంబుగను ధరిత్రి వాంఛ నినుగొల్చి కడతేరవలయుగాని।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 32

సీ. ఇంద్రియపాటవంబెల్ల వమ్మయిపోయి ముదిమిచే మంచాన మూల్గునప్పు।
డెన్నాళ్ళకును జావఁ డేమిసేసెదనంచు మొనసి పెండ్లము మూతిముడిచి తిట్టు।
నర్థంబు తగినంత యార్జింపలేదంచు కొడుకులు కినిసి చీకొట్టుచుండ్రు।
దండిగా నరణంబు తనకీయలేదని కూఁతురు విసుగుతోఁ గూసిపోవు।
వరుసదప్పిన వరుస కెవ్వారుగారు నిత్యబంధుండవగు నట్టి నీవుదక్క।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 33

సీ. పరదేశములనుండి పనివాండ్రఁ దెప్పించి పొందుగాఁ గట్టిన మందిరములు।
పొరుగువారలనెల్ల భోరున నేడ్పించి తతిమికొన్నట్టి కేదారములును।
నతిథుల కొకపూటయైనఁ బెట్టక నిల్వగావించి నట్టి రొక్కంపుగనులు।
కాసునకై సదా మోసంబు లొనరించి బరపినయట్టి వ్యాపారములును।
ముదిమి మదిఁదప్పి మంచానమూల్గు నపుడు బ్రోవఁగల్గునె యిసుమంత నీవుదక్క।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 34

సీ. ముసలివాఁడై మేని పసదూలిపోవఁగా గుక్కి మంచముఁబట్టి కూడ నరుఁడు।
వాకిటి ముందల వచ్చినిల్చిన బిచ్చగాండ్రఁ గొట్టగఁ జేతికట్ల విసరు।
సరిహద్దుదగ్గఱఁ బరులతోఁ బోరాడఁ బొమ్మంచు కొమరునిఁ బ్రోత్సహించు।
గేదెకు వరిగడ్డిలేదాయె నేమని కఠినంబుగా జీతగానిఁ దిట్టు।
నెత్తి మృత్యువుఁ దెలియఁగానేర కిట్లు తడవునేగాని నిన్నెప్డు తలఁపఁబోఁడు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 35

సీ. కనులు గానఁగరావు గాఢ్ఢద్యమేర్పడు పెరవారిమాట విన్పింపఁ బోదు।
నరయుఁ గేశములెల్ల నడుము వంగ దొకింత కాళులు వరుసఁగా గదలిరావు।
శీర్షంబు వడకాడు చేతులు పట్టీవు కఫ నిరోధ వ్యాధి గానిపించు।
బెరిమ సాయముచేయఁ బరులు రారెవరు తబ్బిబ్బుగన్పడు మొగం బుబ్బరించు।
వార్ధకపు బాధఁ జెప్ప నెవ్వారితరము నిను భజించిన లేకుండఁ జనునుగాని।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 36

సీ. సమవర్తి మహిషభూషాకంఠఘంటికల్ చెవులు బ్రద్దలువాఱఁ జేయునపుడు।
కారుమేనులతోడఁ గాలకింకరపాళి నిండుప్రాణముఁ దీయ నిలుచునపుడు।
గాఢమై తట్టిన కఫముచే నుచ్ఛ్వాసనిశ్వాసములు లేక నెగడునపుడు।
కరుణ యింతయులేక నరకంబులో నగ్గికంబంబులకు నంటఁగట్టునప్పు।
డెంత చింతించినను ఫలంబేమి ముందె నిను భజించిన ముక్తికిఁ జనునుగాదె।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 37

సీ. అన్యకార్యము లెన్నియైన నోపికతోడఁ గావించుచుందురుగాని మనుజు।
లానందమయుఁ డవై యలరారుచుండెడు నిన్ను బూజింపఁగా నేర రొక్క।
క్షణమైన నింద్రియసంఘ మీరీతిగాఁ బ్రకృతికి నలవాటుపడియెఁగాన।
నాభాససౌఖ్యంబు లాసించి యెన్నాళ్ళు సంసారసక్తులై సంచరింతు।
రంతవఱకును స్వాస్థ్య మావంతయైనఁ గలదె నినుగొల్చి కడతేరవలయుగాని।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 38

సీ. కడుపునఁ గన్నట్టి కొడుకులు తన్నినఁ దెచ్చిన కోడలు దెప్పుచున్నఁ।
దాళిగట్టిన భార్య తగవులాడుచునున్నఁ గూఁతులు కసరి చీకొట్టుచున్న।
బంధువుల్ తెగనాడి పరిభవించుచు నున్నఁ జుట్టుపట్టులవారు తిట్టుచున్న।
మనుమలు తనుజూచి తినికి నవ్వుచున్న సేవకుల్ ధిక్కృతిసేయుచున్న।
బాడుసంసారమునఁబడి ప్రాఁకులాడుగాని మనుజుందు నినుగొల్వ బూనుకొనఁడు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 39

సీ. నలువురు వీథిలోఁ గలహమాడుచునున్నఁ ద్వరపడి యచ్చోటికరుగఁజూచు।
నడిరేయిఁ జీఁకటి తొడుగులోఁ జెలరేగి బెరసొమ్ము హరియింపఁ బరువులెత్తు।
ప్రాణంబుఁదీసెడి పరసతీప్రాప్తికై ప్రాకారములనైనఁ దూఁకిపోవుఁ।
నంభోనిధులు దాఁటి యన్యఖండములకు విసువక లిబ్బికై వెడలిపోవు।
కాని యీ పాడుపాదముల్ నీ నివాసభూమి వలగొనుమన్న నసేమియనును।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 40

సీ. అల్ప ప్రయోజన మాసించి గతిముండ్లకంచెలందుననైన సంచరించు।
పుట్టకీటున కెంతమట్టినైనను దుమ్ముదుమ్ముగా ముదముతోఁ ద్రొక్కివైచు।
మాదు నొక్కుచునున్న గాడిదబరువుతో నెటువంటి దిబ్బలనేని నెక్కు।
పొరుగూర నాట్యంబు జరుగుచున్నదటన్న బుదరలోనైన నప్పుడె గమించు।
పాడు పాదంబు లదియేమి పాప ఫలమొ నీదు నిలయంబు దరియఁగా నేరవకట।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 41

సీ. కరుణ యింతయు లేక ఖడ్గంబు ధరియించి జంతుకోటులనెల్లఁ జావమోదు।
ఆఁకలిదప్పియు ననకుండఁ జేలలోఁ గలుపెంతయైనను దొలఁచివేయు।
నన్నదమ్ములతోడనైనఁ బోరాడంగ బండకఱ్ఱలు పట్టి బయలుదేరు।
చిన్నపిల్లల ముక్కు సింఘాణమెంతైన నీసడింపక లాగి తీసివేయు।
కాని యీ పాడుచేతుల కర్మమేమొ నీకు మ్రొక్కుమటన్న మాఱాకవేయు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 42

సీ. ఫలము కొంచెంబైనఁ గలుగకుండినగాని పూరిపుల్లల గిల్లి పుణికివైచు।
బొబ్బలెక్కినగాని పూని రోకలితోడ ధాన్యంబు నెంతైన దంచిపెట్టు।।
చిత్తయెండలలోనఁ జెమటలోడుచునున్న గడ్డపాఱలతోడఁ గదలఁద్రవ్వు।
రొచ్చుపైఁ జిమ్మిన రోయకుండగ నెన్నిదున్నపోతులనైనఁ దోమి కడుగు।
పాడుచేతులు నీ పాదపద్మపూజ సేయుమనియన్నఁ జాలు నోర్మూయు మనును।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 43

సీ. వీధి పోట్లాటలో విసువక యెటువంటి పచ్చిబూతులనైన నుచ్చరించు।
చీట్లాట సమయానఁ జెలరేగి మిన్నెల్ల బ్రదల్లయ్యెడునట్లు గద్దరించు।
కోర్టురంగములందుఁ గొదుకక యెన్నేని కూటసాక్ష్యంబులు కోరిచెప్పు।
తొమ్ములోబల ముదాత్తమ్ముగాఁ గన్పింపఁ గూలీల నూరక కొసరితిట్టు।
కాని యీ పాడునోరు సొంపైన నీదు నామమును బల్కుమన్న నాకేమి యనను।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 44

సీ. పరులప్రాణముహోవు పని గల్గుచున్నను గౌండెముల్ లక్షలు కోట్లు చెప్పు।
కారణం బిసుమంత గన్పింపకున్నను నోరులదోషములెల్ల నుగ్గడించు।
నర్థణాకొంకు ఘోరాబద్ధములు పాపభయములే కెప్పుడు బలుకుచుండు।
ప్రొద్దస్తమానంబు పొట్ట బ్రద్దలు వాఱ కాఫి టీ యిడ్డెనల్ గడఁగి మెసవు।
పాడునోరిది నీ కథల్ పాడుమంచుఁ జెప్పిననుజాలు నాకది యొప్పదనును।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 45

సీ. కొల్లగా విత్తంబు గొఱిగించుకొనియైన సినిమాలు చూడవాంఛించుచుండు।
తెల్లవాఱెడు దాక నుల్లాసమున బొమ్మలాట వీక్షింపఁగా నభిలషించు।
నిదురలేమిని రోగ ముదయించిననుగాని నాటకా లరసి యానందమొందు।
కడు నవశ్యంబైన కార్యంబు విడనాడి సర్కసు లరయఁగా సమ్మతించు।
కాని యీ పాడుకనులు నీదైన మూర్తిఁ జూడుమని యన్న మాకదె కూడదనును।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 46

సీ. మర్యాదగాదని మనసు చెప్పినగాని కోడిపందెంబులఁ జూడఁ దలచు।
పాపకార్యంబంచుఁ బదిమంది తిట్టిన నన్యభామినుల నిండారఁ జూచు।
నేటియావల భోగమాట యాడెదరన్న మొగమువాచిన యట్లు పోయి కాంచు।
నేటేటఁ దిరునాళ్ళకేగి యచ్చోనున్న యెల్ల వస్తువుల నిరీక్షసేయు।
పాడు నేత్రంబు లివి నిన్ను జూడుమనిన వేళగాదిది రేపు సేవింతమనును।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 47

సీ. బండ బూతులు వీధిఁ బరులాడుకొనుచుండ నానందమున వాని నాలకించు।
బిచ్చిపుల్లయ పాటక చ్చేరియనియన్న వేడ్కమైనటకేగి వినఁదలంచు।
రెండు జాములదాఁకఁ దిండిలేకుండిన నూరివార్తలకునై యూరిపోవు।
పనియున్న రీతిగా బాజారునకు నేగి రేడియో వినఁగ నల్లాడుచుండు।
కాని యీ పాడుచెవులు నీ గాథ లనిన, నేల మాకవి వద్దులే చాలుననును।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 48

సీ. సంతఁ జేసినయట్లు లెంతగాఁ బసిపిల్ల లేడ్చుచుండినఁగానియేవగొనవు।
గార్ధభేశ్వరుఁ దేచి కఠినంబుగాఁ జెంత నోండ్రపెట్టినగాని యొప్పమనవు।
కాక ఘూకంబులు కడురోత పుట్టగాఁ గూయుచుండినగాని కోపపడవు।
వాద్యధ్వనుల మిన్ను వ్రక్కలింపఁగఁజేయు కొలుపుల సందడి కులుకుగనవు।
పాడుచెవు లివి నీ కథాభాగమనినఁ దెగులు పుట్టినరీతి మార్మొగమువెట్టు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 49

సీ. మాఱులేకుండ నీ యీ రేడులోకంబు లింపుగా నెపుడు పాలింపఁగలుగు।
మేరుశైలము కంటె మించు బంగరురాసు లేనాఁడు నెలకొను నింటియందు।
నద్దాలమేడలో నిద్దంపుటూయెల గ్రాగన్నువెట్టి యుఱ్ఱూగుటెపుడు।
కుంభకర్ణునిఁ జావఁగొట్టఁజాలినయట్టి బలశౌర్యసంపత్తి గలుగుటెప్పు।
డనుచు గొంతెమ్మకోరిక లాశ నిట్లుకోరు నీ పాదుమనసు నిన్ జేరలేదు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 50

సీ. కలకాల మార్జించి నిలువఁజేసిన డబ్బు వ్యయపెట్టవలసిన భయము లేదు।
కండలు రక్తముల్ గరఁగించుకొని మేను బాధింపవలెనను పనియులేదు।
గుంటకు గ్రుక్కెడుగొని దేశదేశముల్ తిరుగాడవలసిన తెఱఁగులేదు।
ప్రేమపాత్రములైన భామాసుతాదుల విడనాడవలసిన వెతయులేదు।
హాయిగా నిన్ను సేవింపుమన్న నేమికర్మమో యింద్రియము లిట్లు కట్టుబడవు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 51

సీ. పరమనాస్తికుఁడైన ప్రభ సాగునన్నాళ్లు నాకేమి యని మహానందమునను।
సకలశాస్త్రంబులు వికటార్థబద్ధముల్ దైవంబు లేఁడని తగవులాడి।
నీ కృపారస మింతసోఁకక తప్పినవేళ నాపత్తులు వేనవేలు।
చుట్టుముట్టినయంత దిట్టతనంబెల్లఁ బోవఁగాఁ గర్తవ్య మూఢుఁ డగుచు।
దైన్యమున నేడ్చు మనుజుల దర్పమెల్ల వెలయు నీరీతి నీ దయ దొలఁగు వఱకు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 52

సీ. ఏది యెట్లున్నను నిందిరాహృదయేశ, యుదయంబుననె లేచి యుదకమాడి।
బాహ్యాంతరములెల్ల బంధించి కన్నుల నానంద బాష్పంబు లవతరింప।
నీ పాదపద్మముల్ నెమ్మనంబున నిల్పి కాలంబు నెవ్వాఁడు గడపిపుచ్చు।
నా మహాత్ముఁడు తప్ప నన్య మానవులెల్ల నిహలోకమునఁ గడునిడుములొంది।
దేహమును వీడి కాలుని గేహమునకు నతిథులై పోవవలసిన యట్టివారె।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 53

సీ. ఎమ్మేలు గిమ్మేలు దమ్మిడీ సేయవు నీ కటాక్ష మొకింత సోఁకదేని।
వడ్డీలు గిడ్డీలు గడ్డిపోచకుఁగావు నీ కటాక్ష మొకింత సోఁకదేని।
మిల్లులు గిల్లులు చిల్లిగవ్వకుఁగావు నీ కటాక్ష మొకింత సోఁకదేని।
కొట్టాలు గిట్టాలు గ్రుడ్డికాసుకుఁగావు నీకటాక్షమొకింత సోఁకదేని।
కాన కూరకపడుటయేగాని నరుని జీవితంబెల్ల నీ యరచేతఁగలదు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 54

సీ. మధుకైటభులు తొల్లి మంటిపాల్గాలేదె వైకుంఠ నీతోడ వైరమూని।
అల హేమకశ్యపుఁ డధ్వాన్నమైపోఁడె వైకుంఠ నీతోడవైరమూని।
లంకాధిపతికాఁడె కొంకినక్కలపాలు వైకుంఠ నీతోడ వైరమూని।
మగధనాధుఁడు సర్వమారణంబయిపోఁడె వైకుంఠ నీతోడ వైరమూని।
బలిమి నంతంతవారెల్లఁ బంతమూని గనిరి బలువంత యిఁక తుచ్ఛమనుజులెంత।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 55

సీ. కలధనంబులు చుట్టుగల శత్రువులపాలు ధాన్యంబులెల్లను ధరణిపాలు।
కొట్లును డాబాలు గుడ్లగూబలపాలుకొడుకులు కూఁతులు గుంటపాలు।
పంటభూములు దేశపరిపాలకునిపాలు బంగారునగలెల్ల దొంగపాలు।
మొండిదేహము బండెడెండు కట్టెలపాలు తాను జూడఁగ దండధరునిపాలు।
బద్ధకంబున నినుగొల్వఁ బ్రాలుమాలు నెవ్వఁడాతని జీవితమిట్లు కూలు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 56

సీ. కడగి లంఘించిన గనమవేగంబున విలయపాథోరాశి కలఁగిపాఱ।
శతసూర్యకాంతితో శంఖచక్రంబులు పార్శ్వభాగములందుఁ బ్రజ్వలింప।
లీల నల్లార్చిన వాలంపుఁదాపులఁ బ్రకృతిగోళము వికావికలుగాగ।
స్మయమాన మానస భయమున బెదరుతో నురమున వరలక్ష్మి తుఱగలింపఁ।
నాదిమత్స్యావతారుఁడవైన నీకు వాంఛఁ గావింతు నొక వేయి వందనములు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 57

సీ. ఓషధీకలితమై యొప్పారుచున్నట్టి కలశాంబునిధిఁ బాలకడవఁజేసి।
బహుయోజనాయత పాదమౌ మందరాచలము కవ్వంబుగా సంతరించి।
ఫణిలోకమునకెల్లఁ బ్రభువు వాసుకిఁదెచ్చి క్రమమైన తతి త్రాడుగా నమర్చి।
యమృతంబు మధియించు నాశ దేవాసురుల్ సాహాయ్యమునకు నిన్ శరణువొంద।
నాది కూర్మావతారుఁడవైన నీకు వాంఛఁగావింతు నొక వేయివందనములు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 58

సీ. ప్రలయ వారిఁగరంగి పాతాళమంటిన యుర్వీతలంబు సముద్ధరింప।
విమలంబులైనట్టి వేదభాగంబులు తనరారు నాల్గుపాదములగాగఁ।
జ్వాలాపరంపరల్ చదలఁజిమ్ముచునున్న చిత్రభానుఁడు దీప్తజిహ్వగాగ।
రాత్రిందివంబులు చిత్రింపఁజాలు సూర్యాచంద్రమసులు నేత్రములుగాగ।
యజ్ఞఘోణిస్వరూపుఁడవైన నీకు వాంఛఁగా వింతు నొక వేయి వందనములు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 59

సీ. ధిక్కరించుచుఁ దండ్రి పెక్కుబాములువెట్ట నడలు డింభకునిఁ గాఁపాడఁదలఁచి।
మాంజిష్ఠవర జటామండలప్రభలచే నీలాంబరం బెఱ్ఱడాలువేయఁ।
దిక్కరాక్షసు ఱొమ్ము వ్రక్కలించుచుఁ జేయు గర్జాధ్వనుల భూమిగ్రక్కదలఁగ।
బ్రహ్మాదిదేవతల్ భయ విమూఢాత్ములై తలలువ్రాలిచి త్రాహిత్రాహియనఁగ।
నవని నరసింహరూపుఁడవైన నీకు వాంఛఁగావింతు నొక వేయివందనములు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 60

సీ. జనుల పాపంబులు స్నానంబుననె వాపు గంగాభవానిఁ బొసంగఁ జేయ।
నక్రమంబున స్వర్గ మాక్రమించి చరించు బలి దానవేంద్రుని చలముడింప।
కొడుకుల దురవస్థఁగూర్చి యారాటించు నదితికశ్యపుల గర్భార్తి మాన్పఁ।
బ్రాభవశూన్యుఁడై పడిపంచఁబట్టిన నాకనాథుని ఘోరశోక ముడుపఁ॥
బిన్న బ్రాహ్మణరూపంబు గొన్న నీకు వరుసఁగావింతు నొక వేయివందనములు॥
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 61

సీ. నామంబుచేతనే నరనాథపత్నుల గర్భనిర్భేద మగ్గలముగాగ।
భూమిపాలక వంశధూమకేతువుగాగ గండ్రగొడ్డలిచేతఁ గాంతులీన।
బ్రాహ్మంబు గలదంచు బాహుమూలంబున ధవళోపవీతంబు తాండవింపఁ।
బ్రవహింపఁజేసిన బలునెత్తురులు ద్రావి భూతకోటులు మహాప్రీతి నొంద।
నవని భార్గవరాముఁడవైన నీకు వరుసఁగావింతు నొక వేయివందనములు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 62

సీ. కాఁపురంబులు వోయి కడు నార్తినల్లాడు నమరవర్యుల ఖేద మపనయింప।
దనుజబాధకు నోడు మునిపురంధ్రీపాళి పసుపుఁ గుంకుము గట్టిపఱచి పెట్ట।
బహుకాలములనుండి పరిపూర్తినొందని గాధి పుత్రకుని యజ్ఞంబుఁ బ్రోవ।
పాపాత్మకుండైన పంక్తికంఠాసురు ప్రాణానిలంబులు పట్టియీయ।
నవని రామావతారుఁడవైన నీకు వరుసఁ గావింతు నొక వేయివందనములు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 63

సీ. నరకరాక్షసునిచే నలుగుడువడు రాజకన్యల దీర్ఘశోకంబు వాప।
మదనబాణానల మగ్నమానసలైన గోపకాంతల సిగ్గు కొల్లలాడ।
కురుమహీవర మత్తకుంజరంబును గూల్పదగినట్టి మఱుగుటోదంబుఁ ద్రవ్వ।
నంధకారావృతమై దిక్కుదెలియని జగతికి జ్ఞానతేజంబుఁ జూప।
నవనిఁ కృష్ణావతారుఁడవైన నీకు వరుసఁగావింతు నొక వేయివందనములు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 64

సీ. తొలుదొల్తఁ దపముచే బలువరంబులనంది కూళలైపట్టఁబగ్గాలు లేక।
నెల్లలోకము లల్లకల్లోలమొనరించు త్రిపురదైత్యుల సంహరింపఁ గోరి।
బ్రహ్మాదిదేవతల్ ప్రార్థింపగా వారి యాలాపములఁ బ్రీతి నాలకించి॥
యసురకాంతాశీల మపహరింపఁగజాలు కూట వేదాంతముల్ చాటిచెప్ప।
నవని బౌద్ధావతారుఁడవైన నీకు వరుసఁగావింతు నొక వేయివందనములు॥
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 65

సీ. దైవంబు లేదని దర్పించి వాదముల్ గావించువారి లగ్గంబుఁ బట్టి।
హరిపాదభక్తుల నరసి కేకిసలాడి నవ్వు నీచాత్ముల నామమడఁప।
రామ భారత కథారాజికి దుర్వ్యాఖ్య లొనరించు జిహ్వల నుత్తరింప।
నజ్ఞానమోహితమైన విశ్వముఁజూచి చింతించుసుజనుల వంతఁ దీర్ప।
గల్కి రూపంబు ధరంయిపఁగలుగు నీకు వరుసఁ గావింతునొక వేయివందనములు॥
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 66

సీ. నిగనిగమను సోగ నిద్దంపు నెఱికురుల్ గాలికిఁ దలమీఁదఁ గదలి యాడ।
మీటినఁ బాల్గారు మిసిమిచెక్కులతోడి మొగమునఁ జిఱునవ్వు మొలకలెత్త।
సిరి కాటపట్టైన యురమున మాణిక్య శుభహారముల్ కదు సొంపుగులుక।
బాహుమూలంబునఁ బరిపంథి మారణోద్దండమౌ భయదకోదండ మమర।
కౌశికుని వెంట నిండారు కౌతుకమున నడచు నీ రూపమెపుడు గన్పట్టుగాక।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 67

సీ. అసురసంధ్యావేళ నాడు ని న్నిలిపించి చెలువుగా స్నానంబుసేయఁ బెట్టి।
తలలోనఁ బరిమళకలిత పుష్పము లుంచి చెక్కునఁ గస్తూరి చుక్క బెట్టి।
యన్నంబు మెల్లగా నారగింపఁగజేసి పూర్వగాథలు సెప్పి ప్రొద్దుపుచ్చి।
బంగారుచేరుల బఱపుటుయ్యేల యందుఁజొక్కి నిద్దురవోవ జోలపాడి।
రాణ నినుగొల్వఁ గోసల రాజపుత్రి పూని తపమెంతచేసెనో పూర్వమందు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 68

సీ. కరములు ముకుళించి కైవారములు సేయ వందిమాగధులు మున్ముందు నడువ।
నహమహమిక దర్ప మతిశయించెడునట్లు బంధు సంతతులు పార్శ్వములఁగదల।
సారెకు మొరయిచు భేరీమృదంగాది మంగళధ్వనులు తురంగలింప।
మైథిలీదేవితో నుత్తమాతంగంబు నెక్కి యయోధ్య నూరేఁగు నిన్ను।
గలయఁ దిలకింపఁగన్న కోసల నివాస జనుల జన్మంబె సఫల మీ జగతిలోన।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 69

సీ. బలుతపంబులుసేసి బ్రహ్మత్వ మొందిన పరమమౌనుల వేదపాఠమనఁగ।
ప్రఖ్యాతలౌ వారభామినుల్ గుమిగూడి జిలిబిలి పెండ్లి పాటలు వచింప।
మితిలేని ముదమున మిథిలాధినాథుఁడు బంధుసన్మానముల్ బరపుచుండ।
గోడలి గొడుకును వేడుక వీక్షించి దశరథేశ్వరుఁడు సంతసము వొంద।
నవనిజకు నీకుఁ బెండిలియైన నాఁటి వైభవంబెల్ల జెప్ప నెవ్వారితరము ?!
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 70

సీ. నిను వీడి యొకనాఁడు మనలేమటంచును దల్లులెల్లరు మహాతాపమొంద।
రామహీనంబైన భూమియందిఁక నెట్లుజీవింతుమని బ్రజల్ చీకుపడఁగ।
నీనాఁటి కిట్లాయెనే మన బ్రతుకని బంధుమిత్రగణంబు పలవరింప।
సకలసామ్రాజ్యంబు సవతితల్లికి నిచ్చి తండ్రియానతి నీవు తరుణితోడ।
వనికిఁ బైనంబుగట్టిన దినమునందు నెంత ఘోషించిరో జను లెవరి కెఱుక।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 71

సీ. మునికులంబులకెల్ల ముయ్యేలగుట్టయౌ దండకావనము పాదంబు లందు।
బహువర్ణ విహగ నిస్వనఘూర్ణితంబులౌ చిత్రకూటప్రాంతసీమ లందు।
సుందరోజ్వల లతామందిరంబుల నొప్పు నాకాపగాతీరసైకతముల।
లలితసారంగ సంకలితంబు లైనట్టి చారుగోదావరీశాద్వలముల।
నీవువిహరించుచుండఁగా నిఖిలజంతుపాళి సేవించి జన్మసాఫల్యమొందె।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 72

సీ. మందాకినీ తీరమందొక పక్షినై యున్నచో నిను జూచి యుందుఁదొల్లి।
పొసఁగ గౌతమిచెంత నిసుకరేణువునైనచో నీ పదంబుల సోఁకి యుందు।
దండకాటవి నొక్క తరువునైయున్నఁ బ్రేమించి నీమూర్తి సేవించియుందు।
పంచవటీ ప్రాంతభాగంబులో నొక దర్భనై యున్న నిన్ దాఁకియుందు।
వెదఁగు జన్మంబులెన్నొ లభించెగాని పొందలేనైతి నటువంటి పుట్టువకట।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 73

సీ. నిండారబూచిననెఱి మల్లియలఁ జూచి విస్మయంబున సీతవెంట గదల।
విడిచిన వస్త్రముల్ బిందెతీర్థముఁగొని వేడ్క సౌమిత్రి యావెనుక నడువ
నెదురైన, మునివరుల్ కదిసి ప్రేమంబున నందఱి కుశలంబు లడిగిపోవ।
భుజముల వెలుఁగొందు భూరికోదండముల్ వీక్షించి మృగములు భీతినొదుగ।
నాశ్రమంబున కనుదిన మరగుదెంచినట్టి నీరూపమెపుడు గన్పట్టుగాక।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 74

సీ. పితృభక్తి మిగులఁ జూపెట్టి రెందఱొ గాని వనితకు రాజ్యంబు వదలినారె।
అద్భుతకృత్యంబు లాచరిచిరిగాని కంధిపై సేతువుఁ గట్టినారె।
సమరంబు లెన్నెన్ని సలుపఁగల్గిరిగాని క్రోతులఁ బరపి డీకొల్పినారె।
ప్రభువులై యెందఱో పాలించిరేగాని కుక్కకు న్యాయంబు గూర్చినారె।
అఘవినాశన మఖిలలోకైకనుతము చిత్ర చిత్రంబు నీదుచరిత్రమెల్ల।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 75

సీ. నిడుద వాలములెత్తి నింగిఁదాటించుచుఁ హరియూథములు ముందు తరలిపోవ।
రోదసీకుహరంబు భేదిల్లునట్లుగా భల్లూకసేన గర్జిల్లుచుండ।
ధారిణీచక్రంబు దద్దరిల్లెడునట్లు కొండ్రముచ్చుల మేలిదండు వెడల।
ఫణిరాజు చెవు లూడిపడునట్లు భయదమై భోరునఁ బ్రస్థానభేరి మ్రోయఁ।
గడఁక లంకాపురికి నీవు గదలునాఁటి భండనాటోప మెంతని పలుకవచ్చు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 76

సీ. అరజాములోపల నధిక బలాఢ్యుల ఖరదూషణాదుల నఱకినావు।
మందరోపమమైన దుందుభికాయంబు మింటికిఁ గొనగోట మీటినావు।
సకల వానరరాజ్య సంరక్షకుండైన వాలి నొక్కమ్ముున వ్రాల్చినావు।
రాజవంశమునెల్ల నాజిఁ జెండాడిన పరశురాముని భంగపరచినావు।
ఎన్ని జేసిన బరతత్త్వ మెఱుఁగలేక చెనకి నినుఁబంక్తికంఠుఁడు చేటువొందె।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 77

సీ. ఇదె యయోధ్యారాముఁ డిచ్చోట వధియించెనని దైత్యులొక వంక నార్పులిడగ,
దశరథరముఁ డీ దాపున మూఁకలఁ జెండాడెనని యొక్క చెంత నుడువ।
కోసలరాముఁ డీకోన సైన్యమునెల్ల గూల్చెనం చొకవంక గోలపుట్ట।
రాఘవరాముఁ డీప్రాంతాన సేనల మసిఁ జేసెనని యొక దెస వచింప।
మూలబలమును హరియించువేళ నీవు గొన్న విశ్వాత్మతను మదిసన్నుతింతు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 78

సీ. ముసలి బోయెతమీఁదఁ బ్రసరింపఁజేసన కరుణ మాపై నింత బరపుమయ్య।
పగవాని తమ్ముని వగలడంచిన దయ మాపైని నించుక జూపుమయ్య।
కోఁతికి రాజ్యంబుగూర్చిన కారుణ్య మిసుమంత మా మీఁద విసరుమయ్య।
బోడి బాపనియందుఁ బొసఁగఁ జేసిన కృప కొంచెంబు మాయెడ గురియుమయ్య।
కావు మను వారి రక్షింపఁ గంకణంబు గట్టుకొన్నట్టివాఁడవు కావఁటయ్య
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 79

సీ. దశరథుం డనురాజు తనయేచ్ఛయాగంబుఁ బొనరింప సుతుఁడవై పుట్టినావు।
హర ధనుర్భంగంబు నెరపి మోదంబున నవనీజఁ బెండిలియాడినావు।
వనితకు వశుఁడైన జనకు నానతిబూని కానకుఁబైనంబు గట్టినావు।
దండకారణ్యంబు దరసి మౌనులనెల్ల వీక్షించి యభయంబు లిచ్చినావు।
అఘవినాశన మఖిలలోకైకపూజ్య మాదినిర్మితమిదియె రామాయణంబు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 80

సీ. కోరి దాసినయట్టి కుటిలరాక్షసి ముక్కుపట్టి ఖండింపించి పంపినావు।
ఖరదూషణాదుల నతికి బంగరులేఁడి ప్రాణంబు లొకకోలఁ బాపినావు।
అసురుడు మైథిలి హరియించుకొనిపోవ వివిధాటవుల వెంట వెదకినావు।
మార్తాండసుతునితో మైత్రి సంపాదించి కోతిరాజును బడగూల్చినావు।
అఘవినాశన మఖిలలోకైకపూజ్య మాదినిర్మిత మిదియె రామాయణంబు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 81

సీ. అప్రమేయములైన హరియూథములతోడఁ గదలి మహాంభోధిఁ గట్టినావు।
జంకొకింతయు లేక లంక ముట్టడివేసి ఘోరరాక్షసుఁజావఁగొట్టినావు।
సతితోడ వానరసైన్యాలతో నయోధ్యా రాజధానికి నరిగినావు।
సర్వభూతంబులు సంతోషమొందఁగాఁ బట్టాభిషేకంబుఁ బడసినావు।
అఘవినాశన మఖిలలోకైకపూజ్య మాది నిర్మితమిదియె రామాయణంబు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 82

సీ. ప్రావృషేణ్యంబైన పటుపయోధరమట్లు ధగధగమను మేనుసొగసులీన।
శిరముపై నిలిపిన వరబర్హిపింఛంబు రంగురంగుల కాంతి నింగి వెలుఁగ।
కర్ణావతంసంబుగాఁ గీలుకొల్పిన కలువపుష్పము పరీమళము జిమ్మ।
వెడఁద వక్షమునందు వ్రేలాఁడు గురివెందపూస పేరులు కడుఁబొలుపుచూప।
వేణువూదుచు గోవులవెంట నరుగు బాలకృష్ణ స్వరూపంబుఁ బ్రస్తుతింతు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 83

సీ. పొత్తిగుడ్డలలోనఁ బొరలాడు పసిపాపవై యెట్లు పూతన నణఁచినావు।
నిసుఁగువై కనుమూసి నిద్రవోయెడువేళ బండి రక్కసునెట్లు చెండినావు।
ఆవులించుచు నోట నఖిల లోకంబులు సుదతికి నేరీతిఁ జూపినావు।
గోకులంబును బ్రోవఁ బైకెత్తి కొనవ్రేల పర్వతం బేరీతిఁ బట్టినావు।
విశ్వమయునకు సర్వభూతేశ్వరునకు జగతి యందున నీకు నసాధ్యమెద్ది।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 84

సీ. బలులోకములు బొజ్జగలవాఁడ వెట్లొకయింతి గర్భమునందు నిమిడినావొ।
ఆదిమౌనులకైన నందని నీవెట్లు గొల్లపిల్లలతోడఁ గూడినావొ।
జగదంతరాత్మవై నెగడు దేవుఁడ వెట్లు చిన్న వ్రేఁపల్లె వసించినావొ।
అమృతంబుపంచిన యమరవంద్యుఁడ వెట్లు పొంచి వెన్నలు తస్కరించినావొ।
భక్త పరిపాలనైక తత్పరుఁడవైన నీ విలాసంబు లెవఁడు వర్ణింపఁగలుగు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 85

సీ. జలకంబులాడెడి జలజాయతాక్షుల యంటుకోకల బూని యపహరించి।
నవనీతమునకునై యవినీతి గనిపింప మందగొల్లల యిండ్లయందు దూరి।
గోపకాంతలు చూచి గోలవెట్టినగాని పెరుగుకుండల గ్రిందదొరలద్రోసి।
తోడి బాలురనెల్ల నాడుకోరమ్మని పిలిచివారల బట్టి నలియఁగొట్టి।
ధ్యానయోగాదులకు నందరాని నీవు కొంటె కొండికవైతి గోకులమునందు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 86

సీ. యదువంశనాథుఁ డియ్యెడె వచ్చి పెరటిలో నావుదూడల విప్పి యరిగినాఁడు।
వసుదేవ సూనుఁ డీవంక మాయింటిలోఁ బెరుగుపంటికిఁ జిల్లువెట్టి నాఁడు।
బాలగోపాలుఁ డీప్రక్కఁ బ్రక్కలమీఁద పల్లెరుల్ వెదఁజల్లి వెళ్ళినాఁడు।
దేవకీపుత్రుఁ డీ క్రేవ మా బిడ్డల పిల్ల జుట్టులు ముడివెట్టినాఁడు।
అనుచు నీయందె నిరతంబు మనసునిల్పినట్టి గోపాంగనల భాగ్య మెట్టిదకట।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 87

సీ. కటితలంబున గల్లుగల్లున మ్రోగెడి బంగారుగజ్జెల రంగునూలు।
కమనీయ కంకణ కలిత హస్తమునందు జార్చిపట్టిన చిన్న చద్దిమూట।
యుత్తరీయముతోడ నొప్పు నంసమునందు నూలుకుచ్చుల ముల్ల కోలత్రాడు।
వీనులకింపైన వేణునాదంబున కాసించి వెంటాడు నాలగుంపు।
వెలయగా గోకులము వీధివెంట నడచు దివ్య తేజస్స్వరూపంబు దెలతుమదిని।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 88

సీ. యమునాతరంగిణీ విమలసైకతకాంత మలయమారుతవీచికలకు సాగి।
బృందావ నాంతర సుందరతరుషండమండలంబులయందు మఱఁసి తిరిగి।
గోకులప్రాంతీయ కుంజకోటర రటత్కలకంఠరవముతోఁ గలిగి మెలిసి।
గోవర్ధనాచల గురుగుహాసందోహ మధ్యభాగంబుల మాఱుమ్రోగి।
కదలి వచ్చెడి నీ వేణుకలితగీతి విన్నవారిదె జన్మమీ పృథివియందు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 89

సీ. వల్మీకములలోన వసియించు నాగముల్ వెడదఫణంబులువిప్పి యాడ।
నూయేల నిద్రించుచున్న పాపలులేచి యానంద భరముతో నాలకింప।
పసులపాటలతోడఁ బతుల యానలుద్రోసి పల్లవాంగన లెల్లవచ్చి కదియ।
నవనీతమును బోలె నల్లరాబండలు గ్రక్కునఁ గాల్వలైకరగిపాఱ।
చెలఁగి వెన్నెలలో నీవుచేసినట్టి వేణునాదంబుమాకు విన్పించుగాక।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 90

సీ. ముచ్వంక మేనితో నవ్వుపాలైయున్న తరుణి కేరీతి సౌందర్యమబ్బె।
యుగయుగంబుల నుండి సొగసి నిద్దురవోవ ముచుకుందునకు నెట్లు ముక్తిగలిగె।
కురుసభాంతరమందుఁ బరులయొత్తిడి వద్ద యింతికి నభిమాన మెట్లు నిలిచె।
దారిద్ర్యబాధచేఁ దటమటించు కుచేలమౌని కైశ్వర్య మేమాడ్కి వచ్చె।
భవదనుగ్రహ మార్జింపవలయుఁగాని పొందనేరని సత్ఫలం బెందుఁగలదు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 91

సీ. కౌరవ్యసంగ్రామ ఘనతరాంభోరాశి నొంటి నర్జునుఁ డెట్టు లుత్తరించె।
నతిలోక బలసమన్వితుఁడైన మగధేంద్రుఁ బవమానపుత్రుఁ డేపగిది గెలిచె।
సంతానకాంక్షతో శరణన్న విప్రుఁడు మృతకుమారకుల నేగతిని బొందె।
ఘోరాస్త్రమహిమచే గూలిపోయిన యట్టి కౌంతేయ వంశ మేకరణినిలిచె।
భవదనుగ్రహ మిసుమంత బడయవలయుగాని మితిలేని ఫలములు గలుగు టరుదె।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 92

సీ. కర్ణాది యోధులఁ గడకుఁ ద్రోలినయట్టి యభిమన్యుఁ డేరీతి నవనిఁ గూలె।
రాజకార్ముకకోటి రక్షితుండైయున్న సైంధవుం డేగతి సమసిపోయె।
పరశురామునిఁ బట్టి పరిభవించిన మేటి కురుపితామహుఁడెట్లు ధరణిఁబడియె।
ధనువున కొజ్జయై మని కీర్తిఁగాంచిన యాచార్యుఁ డేవిధి నాజిమడిసె।
నీదు నిగ్రహ మెవనిపై నెగడు నతఁడు, బ్రహ్మసంకాశుఁడైనను బ్రతుకఁగలడె।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 93

సీ. పందికై పోరాడి బాహుబలంబున ఫాలనేత్రునిఁ గ్రిందుపరపఁగలఁడె।
దేవలోకము వోయిత్రిదివనాథుని యర్ధసింహాసనమునవసింపఁగలఁడె।
కానీన భీష్మాది ఘనయోధు లడరించు నస్త్రాగ్ని కీలల కాగఁగలఁడె।
మత్తవీరారాతి మధ్యభాగంబున గుఱ్ఱంబులకు నీరు గూర్పగలఁడె।
బలిమి నీ కృప తనమీఁద నిలువఁగాదె దేవ విభుపుత్రుఁ డిన్ని సాధింపగలిగె।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికా హృదయలోల. 94

సీ. తురగ రింఖోద్ధూత ధరణీపరాగంబు పరతెంచి సోగముంగురులఁ బొదువ।
బాణ వ్రణాంకిత ఫాలభాగమునందు స్వేదాంబు బిందువుల్ చెంగలింప।
నంజనాచలముపై నమరు భానునిమాడ్కి మూపున బంగారుపుట్ట మెసఁగ।
తేరిచూచినమాత్ర దిటవేది భయమున నరిసైన్యమెల్ల నంతంతనొదుగ।
విజయు నరదంబు నొగలపై వెలయుచున్న కాలమేఘంబు కృప మాకుగలుగుగాక।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 95

సీ. బ్రహ్మచారి నటంచు బ్రతిమాలవచ్చిన దేవవ్రతుని కూర్మి ధిక్కరించి।
నవఖండమండల నాథుఁడై తనరారు కురుమహీరమణు పల్కులు త్యజించి।
సకలరాజాన్వయాచార్యుఁడై యొప్పెడి ద్రోణులఁగాదంచుఁ దొలఁగ ద్రోసి।
బలసూదనోపమప్రాభవోపేతులౌ పార్థివేంద్రులనెల్ల పాఱఁద్రోలి।
విదురు నింట భుజింపఁగా వెడలు నీదు భక్తవాత్సల్య మెంతని ప్రస్తుతింతు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 96

సీ. పోరాని చుట్టంబవై రాజసూయంబు నెల్లరు మెచ్చఁ జేయించినావు।
కుటిలమానసుఁడైన కురురాజు కడకేగి సంధిదౌత్యముఁ గూర్మిఁ జలిపినావు।
ఫలము నాసింపని పనివాఁడవై యుండి దురమున నరదంబుఁ ద్రోలినావు।
కర్తవ్యమూఢులై కలఁకవొందెడివేళ గురుఁడవై బుద్ధులుగఱపినావు।
పాండుసుతులకు భక్తులపాలి కల్పకంబవైనట్టి యిది నూతనంబె నీకు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 97

సీ. ఏడురోజుల ముక్తిఁగూడఁడే నీకథల్ చెవులసోఁకినఁ బరిక్షిత్తు తొల్లి।
శ్రీరామ యని భామ చిలుక నాహ్వానించి పాపంబులను రూపుమాపుకొనదె।
కొడుకును నీపేరఁ గూర్మిఁబిల్చిన యజామిళునకు మోక్షంబు గలుగలేదె।
యుగములపర్యంత మోర్పుతో ఘనతపస్సంగంబుఁ గనెనె ఖట్వాంగరాజు।
నీకథాలాపనామముల్ నిమిషమైనఁ జాలు నరునకుఁ బాపవిస్తార ముడుప।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 98

సీ. ఎవ్వాఁడు నీ నామ మెపుడు బల్కుచునుండు వానిజన్మమె లోకమానితంబు।
హృదయ కోశంబున నెవఁడు నిన్వీక్షించువాఁడె మోక్షశ్రీకి వల్లభుండు।
నీ కథాకర్ణన నిరతినెవ్వాఁడుండు వాఁడెపోవిశ్వైక వందితుండు।
నీ పాదయుగళ సేవాపరుం డెవ్వాఁడు ధరణి నాతఁడె మహాధన్యజీవి।
నిన్ను సేవించువాఁడె సంపన్నుఁ డెవఁడు నిన్నెఱుంగడు వాఁడె యాపన్నుఁడకట।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 99

సీ. ప్రణుతులు బుధలోకపాపనిర్మూలన, దండముల్ భయదకోదండహస్త!
జోహారు లమర విద్రోహివంశవినాశ, వందనంబులు జగన్మందిరాత్మ!
సాష్టాంగములు విశ్వసంహారకారణ జేజేలు కుండలిరాజశయన!
గిడిగిండ్లు బ్రహ్మాదికీర్తితపాదాబ్జ చిన్నిపూవులు వేదసన్నుతాంగ!
కేలుమోడ్పులు వల్లవీకేళిలోల సారెసారెకు నా నమశ్శతము లివిగొ!
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 100

సీ. బహ్మర్షికల్పుఁడౌ పరమహంసపవిత్రగర్భవాసంబునఁ గలిగినాఁడ!
జగమెఱింగినదాది శాస్త్రసంగతి దక్క నితరంబుఁ దెలియక బ్రతికినాఁడ!
కొంచెమో గొప్పయో కోరి మానసమందు నీ పాదయుగమె ధ్యానించినాఁడ!
పరులపై నపకారభావ మెప్పుడు లేక మంచితోడనె ప్రవర్తించినాఁడ!
నట్టి నావంటివానిఁ జేపట్టకున్న ధర్మసూత్రంబునకుఁ గీడు తనరుగాదె!
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 101

సీ. శాస్త్రపరిశ్రమ సమయంబునందున వచ్చిన రోగంబు బాధవెట్ట!
పలునాళ్లు దుఃఖించి భయమంది చివరకు నేడు కొండలమీఁద నెసఁగు నిన్ను!
సేవించి నాఁటితోఁ జెందితి నారోగ్య మింతలో బుట్టె నీ హృదయశూల!
అదివోవ శతకంబు నిదె వ్రాసి నీ పాదపద్మ సన్నిధియందుఁ బరమభక్తి!
నర్పణ మొనర్చినాఁడ నిట్లధిక కరుణ దీనిఁగైకొని బ్రోవవే దీను నన్ను!
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 102

సీ. కడు నపాయంబిద్ది కావున వేగమే వైద్యులకడ కేగవలయు ననుచు వచియింతు!
రితరులు వాస్తవమెఱుఁగక నీకంటె వైద్యుండు లోకమందు!
ఘనుఁ డొక్కఁడున్నాడె కనుక నీ శ్రీపాదయుగము నందునెభారముంచినాఁడ!
నీ దివ్యమూర్తికి నిలయమౌ హృదయానఁ జోటీయ నర్హమే శూల కకట!
యెట్లుబ్రేతువొ యీ యార్తినెట్లు గడపి యూరడింతువొ సర్వబాధ్యుండ వీవె!
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 103

సీ. బహుళ విద్యాప్రౌఢ పరిషత్తు లెక్కించి ప్రీతి నచ్చోట మెప్పించినావు!
మర్మగర్భములైన మహితశాస్త్రములెల్ల దేశికత్వముఁ బూని దెలిపినావు!
కలిత గీర్వాణాంధ్రకవితా పటుత్వంబు నిచ్చి కావ్యములు వ్రాయించినావు!
చిన్నప్రాయమునందె చెలఁగి దిక్కుల యందు నసమానయశముల నొసఁగినావు!
నేలబొడమెనొ నా మీఁద నింత కరుణపొడమినది యేమొ పొడమెను విడువవలదు.
మౌనినుతలీల గాంగేయ మయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 104

సీ. పాహి యన్నంతనే పరువెత్తి బ్రోవంగ గజరాజు నీకేమి కాన్కలంపె।
పిలిచిన యంతనే పలికి బైటికిరాగఁ బ్రహ్లాదుఁ డేమంత భాగ్యమొసఁగె।
దలఁచిన మాత్రనే దరిసిమానము నిల్ప ద్రౌపది నీకేమి ధనములిచ్చె।
నల్పకాలములోనె యార్తి నిర్మూలింప ధ్రువుఁడు నీకేమంత దోఁచిపెట్టె।
భక్త పరిపాలనైకతత్పరుని నిన్ను నిలను సేవించి చెడిన వా రెందు లేరు।
మౌనినుతలీల గాంగేయమయదుకూల మదనగోపాల రాధికాహృదయలోల. 105

సమాప్తము.

నారాయణాం ఘ్రినవ నీరజమత్త భృంగం
భక్తిప్ర పత్తిసరసీచర రాజహంసమ్
పౌరాణిక ప్రథమ ముత్తమతత్త్వబోధం
శ్రీ శ్రీనివాస గురు శేఖర మాశ్రయేఽహమ్

శ్రీ రంగరాజ చరణాంబుజ మూలదాసం
శ్రీకాంచీ పూర్వరదరాజ పదాబ్జ భృంగమ్
శ్రీ వేంకటేశ పదకంజ మరాళ రాజం
శ్రీ విష్ణుదాస గురుశేఖర మాశ్రయేఽహమ్.

-: శ్రీ వేంకటేశ్వరార్పణమస్తు :-

శ్రీరామ జై సీతారామ్ జైజై సీతారామ్

శ్రీమతేరామానుజాయనమః శ్రీ వేంకటగురుభ్యోనమః

శ్రీ శ్రీనివాసగురుభ్యోనమః శ్రీ విష్ణుదాసగురుభ్యోనమః

చిన్న విన్నపము

ఆస్తికశిఖామణులారా! ప్రణామంబులు

మహర్షి శ్రీ వేంకట దాసస్వామి వారు ఉద్భవించి అనేక భగవత్, భాగవత, కైంకర్యములను నిర్వహించుటయే గాక, ఆ కార్యములు వారియనంతరము కూడా అవిచ్ఛిన్నముగా తరతరముల పర్యంతము అభివృద్ధి జెందుచూ కొనసాగునట్లు తపస్సు గావించిరి. వారిసత్ సంతానమును విద్యాధికులను గావించుటయే గాక, ఆధ్యాత్మిక విద్యాకోవిదులుగా తీర్చిదిద్దిరి. ఆ కోవలోని వారే స్వామి వారి తృతీయ కుమారులు "కవిభట్టారక" దాశరధిసూరి, విష్ణుదాసు గారు. పితృదేవుల జీవిత చరిత్రయగు ఈ "తపోమహిమ"ను రచించి, అచ్చువేయించి శ్రీ భాష్యకార సమాజ సభ్యులకు ఆంధ్రావని ఆస్తిక ప్రజానీక కరకమలముల కందజేసి చరితార్థులైరి. స్వామివారి యనంతరము వారి కుమారుల ఆధ్వర్యవమున శ్రీ భాష్యకార సమాజము, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానము బహుముఖముగా వృద్ధి గావింపబడెను. స్వామి సంకల్పించిన అనేక కార్యములు వారి కుమారుల, మనుమల ద్వారా కార్యరూపము దాల్చెను. అవి ముఖపంటపము, ఆళ్వారులను ప్రతిష్టించి మహోస్థలము గావించుట. నిత్య హోమము, అఖండదీపారాధనలు, రాజగోపుర నిర్మాణము, కోదండరాముల వాయు ప్రతిష్ట, విమాన వేణుగోపాలుని స్థాపన మున్నగు వాటితో, దేవాలయము సర్వతోముఖాభివృద్ధి జెందెను. గ్రంథకర్తగారి నాల్గవ కుమారుడు చి॥ రఘుశేఖర ప్రసాదు స్వామివారి జయంతి ఉత్సవములను, స్వామివారి శిష్యులున్న గ్రామముల యందు వరుసగా నిర్వర్తించి, గత మూడు సంవత్సరముల నుండి పూడివాడయందు శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధిలో త్రయాహ్నికముగా స్వామి జయంతిని నిర్వహించుచుండెను. ఈ సంవత్సరము స్వామివారి జయంతి ఉత్సవ సభలో వారిని గూర్చి కొంచెము తడవు నేను ముచ్చటించు అవకాశము దక్కినది. అట్టితరి భాగవతులు, భాష్యకార సమాజ సభ్యులు చి॥ రఘుశేఖర ప్రసాదు స్వామి వారి 'తపోమహిమ' కాపీలు అయిపోయినవి, ఆ గ్రంధము కావలసిన

ఆవశ్యకతను సభ్యులు ముక్త కంఠముతో వ్యక్తపరచిరి. కవిభట్టారకులు వ్రాసిన గ్రంధమును అచ్చుతప్పులు లేకుండా ముద్రించుట ఏతన్మాత్రపు కార్యముగాదు. ఆ కార్య నిర్వహణకు సమర్థులు, మా భాష్యకార సమాజ సభ్యులు, మా నాల్గవ పినతండ్రి గారి జామాత కర్మవిముక్త సౌగంధిక బంధువు శ్రీ భాష్యకార సమాజ సభ్య వృద్ధ శ్రీ రామయ్యదాసు గారి ప్రపౌత్రులు, మహాభక్తాగ్రేసర చినవేంకయ్య దాసు గారి పౌత్రులు, శ్రీమతి రాఘవమ్మ శేషయ్య పుణ్యదంపతుల పుత్రుడూ, ప్రస్తుతం విజయవాడ నివాసులగు శ్రీ వక్కపట్ల వృషాద్రిపతి "ఉభయవేదాంత విద్యావాచస్పతి" గారిని, తత్ క్షణమే ఫోనులో సంప్రదించి "తపోమహిమ"ను అచ్చు వేయవలెనని తెలిపి, గ్రంథము యొక్క ప్రూపులు దిద్దవలసిన భారమును వహించవలసినదిగా కోరితిని. అందులకు వారు అంగీకరించుట తోడనే గ్రంథమును అచ్చు వేయించెదనని స్వామివారి జయంతి ఉత్సవములో సభాముఖముగా వెల్లడించితిని. సభయందున్న మా మేనయత్తలు సభ్యులు కరతాళ ధ్వనులతో మోదమును వ్యక్తపరచిరి. ఈ విషయమును, బెంగుళూరు నందున్న నా పెద్ద కుమారుడు చి॥ మురళీగోపాల ప్రసాద్‌కు, చెన్నైలో వున్న ద్వితీయ సూనుడు చి॥ కళ్యాణ బాలాజీలకు తెలియపరచగా అమితానందముబొంది, వెంటనే గ్రంథ ముద్రణకు వలయు ద్రవ్యమును నాకందజేసిరి. ఇచ్చట ఒక విషయమును ఆస్తిక శిఖామణులకు నేనుగా తెలియజేయవలసి యున్నది. ఏమనగా, గ్రంథమునకు నా తనూజులు ద్రవ్య మొసగినారని తెలుపుట కాదు. మహర్షి శ్రీ వేంకటదాసస్వామి వారు జేసిన "తపోధనమే" వారు వేసిన బాటలను సువిశాలముగావించుచు వారి తరువాతి తరతరములను ఆ మార్గములయందు పయనింపజేయుచున్నదని విశదపరచుట నాయభిప్రాయము. గ్రంథమును అచ్చువేయుటకు ఉపక్రమించి పూర్తిగా ఉన్న గ్రంథమునకై అన్వేషించితిని. స్వామివారి దౌహిత్రుడు, నాకు బావమరిది యగు చి॥ గోపీచంద్ర స్వామి వద్ద లభ్యమైనది. దానిని గొని, విజయవాడ యందున్న శ్రీ వక్కపట్ల వృషాద్రిపతి గారిని కలసి ఇరువురము "శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు గారి వద్దకెళ్ళి గ్రంథమును ముద్రించవలసినదిగా కోరితిమి. శ్రీ విశ్వేశ్వరరావు గారు అక్షరాలా 'ఎల్లలు లేని సాహితీమిత్రులు', మితభాషులు, నిరాడంబరులు. వారు అంగీకరించి ఈ గ్రంథమును బహు సుందరముగా ముద్రించిరి. వారికి, వారి సిబ్బందికి నా ధన్యవాద సహిత నమోవాకములు. శ్రమయని తలంచక, ఈ కార్యమును గురుకైంకర్యముగా భావించి మూడు పర్యాయములు ప్రూఫులు దిద్ది ఎంతో శ్రమించిన మా బావగారు 'ఉభయవేదాంత విద్యావాచస్పతి' శ్రీ వక్కపట్ల వృషాద్రిపతి గార్కి, ఈ గ్రంథము ముద్రించుటకు ప్రథమ ప్రేరకురాలు నా ధర్మపత్ని చి॥ల॥సౌ॥ ఉదయలక్ష్మికి, ద్రవ్యమొసకిగిన నా పెద్ద తనూజుడు చి॥ మురళీగోపాలప్రసాదు, వీని ధర్మపత్ని చి॥ల॥సౌ॥ సుజాతకు, నా పౌత్రులు చి॥ రామతేజ,


చి॥ రఘునందన్‌లకు, ద్వితీయ తనూజుడు చి॥ కళ్యాణబాలాజీ, వీని ధర్మపత్ని చి॥ల॥సౌ॥ లక్ష్మీఆండాల్‌కు మనుమరాండ్రు చి॥ విష్ణుప్రియ, చి॥ శ్రీచందన లకు, కర్తాకారయితాచైవ ప్రేరకశ్చానుమోదకః సుకృతే దుష్కృతేవాపి చత్వార స్సమభాగినః" అను ధర్మమునననుసరించి ఈ తపోమహిమ మలిముద్రణకు సహకరించిన, ప్రేరేపించిన సర్వులకు మా పితామహులు మహర్షి శ్రీ వేంకటదాసస్వామి రాధామాంబలచే పూడివాడ యందు ప్రతిష్ఠింపబడిన శ్రీరుక్మిణీ సత్యభామా, రాజ్యలక్ష్మీ, హనుమ, ఆండాళ్, ఆళ్వారు, ఆచార్య సమేతుండగు శ్రీ వేణుగోపాల పరబ్రహ్మముల పరిపూర్ణ కటాక్షములతో ఆయురారోగ్య, ఐశ్వర్య భోగభాగ్యాలు ప్రసాదించి సర్వదా రక్షించవలెనని ప్రార్థించుచు శ్రీ వేణుగోపాలదేవుని పదపంకజములకు, పితామహుల పాద పద్మములకు సాష్టాంగ దండవత్ప్రణామంబులాచరించు చున్నాను.

పూడివాడ
14.3.2015


ఇట్లు
శ్రీ వేంకటదాసస్వామి వారి పౌత్రుడు
శ్రీ మొవ్వ వెంకటాచలపతి 'కృష్ణదాసు' అమ్మన్నమ్మ గార్ల కుమారుడు
'వైష్ణవ పాదరేణువు'
మొవ్వ సరోజనాభుడు




1965.4.11 తేదీ కృష్ణాజిల్ల మోదుమూడి గ్రామములో
గ్రంథకర్త వారి సోదరులకు జరిగిన గజోత్సవ సన్మానము



కృష్ణాజిల్లా కోదూరు గ్రామంలోని ఇస్మాయిల్ బేగ్‌పేట శ్రీరామ పట్టాభిషేకానంతరం శిష్య సమేతులై యున్న శ్రీ భాష్యకార పీఠాధిపతులు.




కూర్చున్నవారు : శ్రీ శ్రీనివాస పెరుమాళ్ళు గారు, శ్రీ వేంకటా చలపతిగారు, శ్రీ దాశరథి సూరిగారు, శ్రీ రామప్రసాద్ గారు,
శ్రీ వేంకటేశ్వర్లుగారు, జగన్నాథరాణి (కృష్ణదాసు గారి పౌత్రి) శ్రీమతి కమలాదేవి గారు.
నిలుచున్నవారు : శ్రీమతి బాలమ్మగారు, శ్రీమతి అమ్మన్నమ్మగారు, శ్రీమతి సరోజాదేవి గారు, శ్రీమతి వెంకాయమ్మ గారు, శ్రీమతి రామబాణమ్మ గారు.



పరమహంస శ్రీ వేంకటదాస స్వామి వారు



తర్కవేదాంత విశారద పండిత
శ్రీ మొవ్వ శ్రీనివాసపెరుమాళ్ళు గారు




కవి భట్టారక శ్రీ దాశరథి సూరిగారు (గ్రంథకర్త)



1. పరమ హంస శ్రీ వేంకటదాసస్వామి వారు, 2. న్యాయవిశారద శ్రీనివాస పెరుమాళ్ళు (శ్రీ రామదాసు) గారు 3. పండిత శ్రీ వేంకటాచలపతి (కృష్ణదాసు) గారు 4.కవిభట్టారక శ్రీ దాశరథి సూరి (విష్ణుదాసు) గారు.



శ్రీ రామాయణశతావృత్త పారాయణ నాటి ఛాయ శ్రీ వేంకటాచలపతి (కృష్ణదాసు) గారి ధర్మపత్ని
శ్రీమతి అమ్మన్నమ్మ గారు




1. పండిత శ్రీ వేంకటాచలపతిగారు, 2. న్యాయ విశారద శ్రీ శ్రీనివాస పెరుమాళ్ళు గారు,
3. కవిభట్టారక శ్రీ దాశరథి సూరి గారు.



శ్రీ రామాయణ శతావృత్త పారాయణ సందర్భం
శ్రీ కృష్ణదాసు గారి దంపతుల
పాదపూజ చేయుచున్న కుమారు
శ్రీ సరోజనాభుడు గారు, వారి కుటుంబ సభ్యు



శ్రీ రామాయణ శతావృత్త పారాయణ సందర్భంగా
శ్రీ కృష్ణదాసుగారి దంపతులకు
పాదపూజ చేయుచున్న వారి వియ్యంకుడు
శ్రీ పద్యాల వేంకటేశ్వర్లుగారు
వారి ధర్మపత్ని శ్రీమతి రామబాణమ్మగారు.



పూడివాడ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ ముఖమండప నిర్మాణానంతర ఛాయ



ఊరేగింపుగా తీసుకువస్తున్న రాజగోపుర శిఖరాలు.






పూడివాడ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ రాజగోపుర నిర్మాణ సందర్భంగా జరిగిన యజ్ఞవాటిక




పూడివాడ శ్రీ వేణుగోపాలస్వామి రాజగోపురం



శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవంలో సహస్రదీపాలంకరణ



శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధిలో అఖండదీపారాధన



తపస్సిద్ధి గ్రంథావిష్కరణ నాటి ఛాయ



ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శ్రీ పద్యాల వేంకటేశ్వర్లు గారు
ధర్మపత్ని రామబాణమ్మగారు వారి కుటుంబసభ్యులు



శ్రీ రామాయణ ద్విశతావృత్త పారాయణ సందర్భంగా జరిగిన హవనము




శ్రీ రామాయణ ద్విశతావృత్త పారాయణ గావించిన శ్రీకృష్ణదాసు గారు ధర్మపత్ని
శ్రీమతి అమ్మన్నమ్మగారు మరియు కుటుంబసభ్యులు భాష్యకార సమాజ సభ్యులు




శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధిలో పుష్పయాగము



పుష్పయాగానికి ముఖ్య అతిథిగా వచ్చిన రేపల్లె శాసనసభ్యులు
శ్రీ దేవినేని మల్లికార్జునరావు గారు, శ్రీమతి శ్రీదేవి దంపతులు.



శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధిలో జరిగిన పుష్పయాగంలో వేంచేసియున్న
రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి



పూడివాడ వేణుగోపాలస్వామి దేవాలయంలో వేంచేసియున్న శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారు.



కూర్చున్నవారు :


శ్రీ మత్తి వేంకటేశ్వరరావు గారు (కృష్ణదాసుగారి జామాత) మునిమనుమడు చి॥ రఘువీరరాయలు, 2. శ్రీమతి ఇందిరాదేవి (కృష్ణదాసుగారి చిన్న కుమార్తె) 3. కృష్ణదాసుగారు, 4. శ్రీమతి అమ్మన్నమ్మగారు (కృష్ణదాసు గారి ధర్మపత్ని), 5. శ్రీమతి హరిప్రసాదమ్మ గారు (కృష్ణదాసుగారి జ్యేష్ఠ కుమార్తె) మునిమనుమరాలు చి॥ శ్రీమిత్రవింద.

నిలుచున్నవారు :

1. సరోజనాభుడు గారు, (కృష్ణదాసుగారి కుమారుడు), 2.శ్రీమతి ఉదయలక్ష్మి గారు (కృష్ణదాసుగారి కోడలు), 3.శ్రీమతి అరవింద గారు (కృష్ణదాసు గారి పౌత్రి), 4. మునిమనుమడు చి॥ కృష్ణతేజ. 5.శ్రీ కల్యాణ బాలాజీ (కృష్ణదాసుగారి పౌత్రుడు), 6. శ్రీమతి లక్ష్మి ఆండాళ్ (కృష్ణదాసుగారి పౌత్రుని ధర్మపత్ని), 7. శ్రీమతి జగన్నాథరాణి (కృష్ణదాసుగారి జ్యేష్ఠ పౌత్రి), 8. మురళీ గోపాల ప్రసాదు గారు, ధర్మపత్ని సుజాత (కృష్ణదాసుగారి పౌత్రుడు దంపతులు) 9. శ్రీమతి మాధవప్రియ (కృష్ణదాసుగారి దౌహిత్రి)



శ్రీరంగం అడైయవళంజాన్ రాయగోపుర సన్నిధిలో భగవద్రామానుజ విరచిత గద్యత్రయ టీకా
గ్రంథ ఆవిష్కరణ గావించుచున్న పండిత శ్రీ వేంకటాచలపతి గురుదేవులు
టీకాకర్త ఉభయవేదాంత విద్యా వాచస్పతి శ్రీ వక్కపట్ల వృషాద్రిపతి గారు.



స్వామివారి ద్వితీయ కుమారుడు మొవ్వా వెంకటాచలపతి కృష్ణదాసు గారు 200 పర్యాయములు రామాయణపారాయణం చేసిన సందర్భంగా వాయు ప్రతిష్ఠ గావించిన కోదండరాములు విగ్రహాల సమర్పణ : స్వామివారి ప్రపౌత్రులు : చి॥మురళీగోపాలప్రసాదు, కళ్యాణ బాలాజీ.



వేణుగోపాల దేవస్థానములోని శేష వాహనము సమర్పణ, స్వామివారి పౌత్రుడు శ్రీ మొవ్వ వృషాద్రిపతి, హనుమద్వాహనము సమర్పణ భాష్యకార సమాజ సభ్యురాలు శ్రీమతి చంద్రమ్మగారు, గురుడవాహనము సమర్పణ స్వామివారి సోదరి పద్యాల రామమూర్తిమ్మ గారు






శ్రీ వేణుగోపాలస్వామి వారి రథము పునఃనిర్మాణము గావించి
సమర్పించినది స్వామివారి పౌత్రుడు
శ్రీ మొవ్వ యతిరాజ సంపత్కుమారుడు గారు




శ్రీ ఆంజనేయస్వామి వారి సన్నిధిలోని అఖండ దీపారాధన. నిలుచున్న వారు దేవాలయ అర్చకస్వామి
యన్. సత్యనారాయణాచార్యులు, అఖండ దీపారాధన ధర్మకర్త స్వామివారి మేనగోడలి పౌత్రుడు
శ్రీ పద్యాల వేణుగోపాల ప్రసాదు గారు, పూడివాడ.



దేవస్థానమందలి ఉంజలి బేరములు, ఉంజలి ఉత్సవ వ్యవస్థాపక ధర్మకర్త, స్వామివారి పౌత్రుడు శ్రీ మొవ్వ సరోజనాభుడు, అర్చకస్వామి యన్. సత్యనారాయణాచార్యులు గారు.



శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానమందు ప్రతిష్ఠించిన ఆళ్వారుల మూల విరాట్ మూర్తులు.
1. శ్రీ తిరుప్పాణి ఆళ్వారు, 2. నమ్మాళ్వారు, 3. శ్రీ రామానుజుల వారు, 4. పెరియాళ్వారు, 5. శ్రీ పేయాళ్వారు.
ఉత్సవమూర్తులు : శ్రీ రామానుజులవారు. నమ్మాళ్వారు, భక్తిసారులు తిరుమంగై ఆళ్వారు. కులశేఖర ఆళ్వారు.




తంగెల వేంకటేశ్వర్లు గారు, సంపూర్ణమ్మ గారు (దంపతులు) వేకనూరు.



బాడిగ భూపయ్యగారు, సరస్వతమ్మ గారు, పేకనూరు.



సింగం హైమవతమ్మగారు, (కోడూరు మునసబు వేంకటనరసయ్యగారి కుమార్తె) కోడూరు.








SHOT ON MI A1
MI DUAL CAMERA
2018/3/6 12:21




SHOT ON MI A1
MI DUAL CAMERA
2018/4/23 08:28




భాష్యకార సమాజస్థాపకులు